PLACED ON THE SHELF
Date 21.11.95

Printed by
V. VENKATESWARA SASTRULU
of V. RAMASWAMY SASTRULU & SONS,
at the 'VAVILLA' PRESS,
Madras.—1935.

LBx1,1
35G35

SRI VENKATESWARA
CENT... LIBRARY &
RE... CENTRE,
Acc. 22059
Date
TIRUPATI.

# ఉపోద్ఘాతము.

శ్రీపరాత్పరుఁడైన యాదిదేవుని వివిధసృష్టికి లోనగుమానవులలో బ్రహ్మ-క్షత్రియ-వైశ్య-శూద్రులు అనుచాతుర్వర్ణ్యవిభాగము ఏర్పడి యున్నది. ఈవిషయమునే గీతాచార్యులు "చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః" అని యుపదేశించిరి. అట్టి చాతుర్వర్ణ్యమునకు ధర్మ-అర్థ-కామ-మోక్షములను చతుర్విధపురుషార్థములు తత్తద్వర్ణానుసారముగ జెప్పఁబడినవి. అట్టిపురుషార్థములసాధించుటకు శరీరముముఖ్యసాధనమైయుండును. అయ్యది అనారోగ్యదూషితముగాక స్వస్థతనున్న గాని ఎట్టికార్యమును సాధింప సమర్థము కానోపదు. ఇట్లుండ మిథ్యాహారవిహారాదులంజేసి సంభవించుజ్వరాదిరోగసముదాయము స్వస్థతను పూర్తిగఁ జెరుప వేచియుండును.-ఈవిషయమునె ఈతంత్రకారుఁడు"ధర్మార్థకామమోక్షాణాం ఆరోగ్యం మూలముత్తమం, రోగాస్తస్య అపహర్తారః శ్రేయసో జీవితస్యచ" అని యుపదేశించెను. అట్టియెడ జ్వరాదిరోగములను రానీయక స్వస్థతనుకాపాడికొనుటయు, ఒకవేళ పొరబాటుచే ఆరోగ్యముచెడినను ప్రతీకారముచే జ్వరాదిరోగముల నివర్తింపఁజేసికొని మరల స్వస్థతను స్థాపించుకొనుటయు ముఖ్యకర్తవ్యము. అట్టి యుపాయముల బోధించుభాగములు స్వస్థవృత్తపరిపాలన మనియు, ఆతురసంరక్షణమనియు రెండుభాగములుగ నుండును. ఈరెండుభాగములే నిఖిలాయుర్వేదతంత్రములచే బోధింపఁబడుచుండును.

మునొక్కకాలమున అంగిరసుఁడు, జమదగ్ని, వసిష్ఠుఁడు, కశ్యపుఁడుమున్నగు దేవర్షి రాజర్షిబ్రహ్మర్షులు హిమవత్ప్రాంతమున నొక్కచో సభ జేరి మనుజులపురుషార్థములకు విఘ్నభూతములగు రోగములబాధ తొలఁగింపఁ దగునుపాయ మరయఁగోరి దాని నెఱుంగుటకై భరద్వాజుని ఇంద్రునికడకుఁ బంపుటయు, నామహర్షి సహస్రాక్షుకడ కేగి ప్రార్థింపఁగా, నాతండు తాను బ్రహ్మవలన నుపదేశము బొందినప్రకార

మాయుర్వేదమును భరద్వాజున కుపదేశించెను. అట్టి భరద్వాజుని వలన నాత్రేయాదిమహర్షులు గ్రహించిరి. వారిలో నాత్రేయుఁడు శిష్యులపై ప్రేమచే లోకహితార్థముగ నగ్నివేశుఁడు, భేలుఁడు, జతూకర్ణుఁడు, పరాశరుఁడు, హారీతుఁడు, క్షారపాణియు ననునార్గురుశిష్యులకు హేతు-లక్షణ-ఔషధరూపస్కంధ త్రయాత్మకమగు నాయుర్వేదము నుపదేశించెను. ఆయార్గురిలో నగ్నివేశునకు తక్కినవారికన్న విశేష ప్రతిభ యతిశీఘ్రముగ గల్గి తాను ఆత్రేయునివలన గ్రహించినదానికి న్యూనాతిరేకము లేకుండునట్లు ఆయుర్వేదతంత్రమును తొలుదొలు తనే యేర్పఱచెను.

పిదప తారచియించినతంత్రమును పతంజలిమహర్షిచే సంస్కరింపించి కృతార్థతవహించెను. వ్యాకరణమహాభాష్యకారులగు పతంజలికి చరకులని నామాంతర మున్నట్టు లూహింపఁదగియున్నది. భాష్యవ్యాఖ్యానమగు కైయటమున “యోగేన చిత్తస్య పదేన వాచాం మలం శరీరస్యచ వైద్యకేన, యోఽపాకరోత్తం ప్రవరం మునీనాం పతఙ్జలిం ప్రాఞ్జలిరానతోఽస్మి.” అను పతంజలిస్తుతిరూప మంగళశ్లోకము భగవంతుఁడగు పతంజలి యాయుర్వేదవేత్తలలో నగ్రగణ్యుఁడని స్ఫుటముగఁ దెల్పుచున్నది. అట్టిచరకునిచే సంస్కరింపఁబడుటంజేసి యీతంత్రము చరకసంహిత యనుపేరఁ బ్రశస్తిగాంచినది. మరియు నీతంత్రము “చరకస్తు చికిత్సితే” అని చికిత్సాభాగమున మిక్కిలి ప్రశస్తమని ప్రాజ్ఞులచేఁ గొనియాడఁబడినది. విదేశీయులగు కొందరాంగ్లపండితులును చరక చికిత్స ననుసరించి సర్వదేశములయందును చికిత్సచేయునెడ నితరతంత్రముల నపేక్షింపకయే స్వాస్థ్యసంరక్షణమును సులభముగఁ జేసికొనసగునని మిక్కిలి కొనియాడిరి.

ఈతంత్రము వ్యాకరణమహాభాష్యశైలి ననుకరింపుచు మిక్కిలి గంభీరార్థములైన వాక్యజాలములఁ గల్గియుండుటంజేసియు నీయది పతంజలి ప్రతిసంస్కృతమనుటకు తార్కాణముగ నున్నది. శల్యము, శాలాక్యము మున్నగు నాయుర్వేదాంగము లెనిమిదిటిలో కాయ

చికిత్సను బ్రధానముగఁజేసి యీతంత్ర మేర్పడినది. అయినను శాలాక్యము, రసాయనము, వాజీకరణము, అగదతంత్రము మున్నగునవియు నుపసర్జనములుగఁ జెప్పఁబడినవి.

అట్టి యీతంత్రము మిక్కిలి యర్థగంభీరమై యుండుటంజేసి కేవలము సంస్కృతభాషయం దుత్తీర్ణులైన యాయుర్వేదవిద్వాంసులకుమాత్రము సుబోధముగ నున్నదిగాని సామాన్యముగ నందఱకును గోచరమగునదికాదు. దేశసామాన్యముగ సర్వజనోపకారకమై స్వస్థపరిపాలనమున కభిలషణీయములైన పద్ధతుల ననేకములబోధించు నీతంత్రము నిఖిలజనసుబోధముగ నున్నచో మిక్కిలి యుపకారకమై యకుంఠితవ్యాప్తి నందఁగలదని తలంచి, అందు నాంధ్రలోకమున వ్యాప్తినందించుమనీషచే నాంధ్రవ్యాఖ్యను రచించినాఁడ. ఈవ్యాఖ్యారచనమున సుశ్రుత అష్టాంగహృదయాది తంత్రాంతరముల సాహ్యముగఁ గొని యచ్చటచ్చట సందర్భానుసారముగ నవసరమైనచోట్ల నందలి ప్రమాణవచనముల నుదాహరించుచు నాదోఁచినకొలఁది విమర్శించి విపులముగ వ్యాఖ్య రచించినాఁడ. ఇందనవధానతంజేసి యేవేని లోపములున్నచో వానినెల్ల సరకుసేయక, "గుణదోషౌ బుధో గృహ్ణన్ ఇందుక్ష్వేళావివేశ్వరః, శిరసా శ్లాఘతే పూర్వం పరం కణ్ఠే నియచ్ఛతి" అనునార్యపద్ధతి నవలంబించి గుణలేశమును మాత్రము గ్రహించి, "గచ్ఛతః స్ఖలనం న దోషాయ" యనున్యాయమును దలంచి,గుణైకపక్షపాతులగు పండితప్రకాండులు నాపరిశ్రమమును సఫలతనొందించెదరుగాత! మరియు నీతంత్రకర్తలకాలము మున్నగుచరిత్రాంశములను చరిత్రకారులు విమర్శించెదరని వాని నిట వివరింప మానినాఁడ. విజ్ఞులు గమనింతురుగాక!

ఇట్లు,
పణ్డిత ను. విశ్వనాథశాస్త్రి,
ఆంధ్రవ్యాఖ్యానకర్త.

# సూత్రస్థానమందలి అధ్యాయానుక్రమణిక.


| అధ్యాయ సంఖ్య. | అధ్యాయ సంజ్ఞ. | పుట సంఖ్య. |
|---|---|---|
| | **౧. భేషజచతుష్కము.** | |
| 1 | దీర్ఘంజీవితీయము | 1 |
| 2 | అపామార్గతండులీయము | 60 |
| 3 | ఆరగ్వధీయము | 72 |
| 4 | షడ్విరేచనశతాశ్రితీయము | 81 |
| | **౨. స్వస్థవృత్తచతుష్కము.** | |
| 5 | మాత్రాశితీయము | 109 |
| 6 | తస్యాశితీయము | 138 |
| 7 | నవేగాన్ధారణీయము | 155 |
| 8 | ఇంద్రియోపక్రమణీయము | 177 |
| | **3. నిర్దేశచతుష్కము.** | |
| 9 | ఖుడ్డాకచతుష్పాదము | 201 |
| 10 | మహాచతుష్పాదము | 213 |
| 11 | తిస్రైషణీయము | 225 |
| 12 | వాతకలాకలీయము | 271 |
| | **౪. కల్పనాచతుష్కము.** | |
| 13 | స్నేహాధ్యాయము | 285 |
| 14 | స్వేదాధ్యాయము | 316 |
| 15 | ఉపకల్పనీయాధ్యాయము | 340 |
| 16 | చికిత్సాప్రాభృతీయము | 360 |
| | **౫. రోగచతుష్కము.** | |
| 17 | కియంతశ్శిరసీయము | 372 |
| 18 | త్రిశోథీయము | 410 |
| 19 | అష్టోదరీయము | 431 |
| 20 | మహారోగాధ్యాయము | 445 |
| | **౬. యోజనాచతుష్కము.** | |
| 21 | అష్టౌనిందితీయము | 464 |
| 22 | లంఘనబృంహణీయము | 483 |
| 23 | సంతర్పణీయము | 495 |
| 24 | విధిశోణితీయము | 504 |
| | **౭. అన్నపానచతుష్కము.** | |
| 25 | యజ్జఃపురుషీయము | 521 |
| 26 | ఆత్రేయభద్రకాప్యీయము | 561 |
| 27 | అన్నపానవిధి | 648 |
| 28 | వివిధాశితపీతీయము | 771 |
| 29 | దశప్రాణాయతనీయము | 791 |
| 30 | అర్థేదశమహామూలీయము | 801 |


ఈవివరణము సూత్రస్థానమున ముప్పదియవ యధ్యాయము. ౩౯-౪౫ శ్లోకములఁ జెప్పఁబడినది.

| విషయము. | పుట |
|---|---|
| రసవిశేషములు | 42 |
| మధురాదిరసములకృత్యములు | ,, |
| ద్రవ్యత్రైవిధ్యము | 43 |
| జాంగమాది త్రివిధద్రవ్యములు, అందు జాంగమములు | 44 |
| ఔద్భిదములు | 45 |
| ఔద్భిదములవివరణము | ,, |
| త్రివిధద్రవ్యములలో ప్రశస్తములును, శోధనోపయుక్తములును | 46 |
| మూలినీవివరము, వానిప్రత్యేకప్రయోజనములు | 47 |
| ఫలినీవివరణము, వానియుపయోగము | ,, |
| చతుర్విధమహాస్నేహములు, వానికృత్యములు | 48 |
| పంచలవణములు, వానిగుణములు | 49 |
| మూత్రాహికములు | ,, |
| మూత్రసామాన్యగుణములు | 50 |
| మూత్రవిశేషగుణాదులు | 51 |
| క్షీరభేదములు | 52 |
| క్షీరసామాన్యగుణాదులు | ,, |
| శోధనార్థమైనమూడువృక్షములు, వానియుపయోగము | 54 |
| మూడుశోధనవృక్షములు; వానిగుణకర్మములు | ,, |
| ఫలమూలిన్యాదిప్రకరణోపసంహారము | 55 |
| ఓషధుల యోగజ్ఞానావశ్యకత | ,, |
| ఔషధజ్ఞానావశ్యకతకు దృష్టాంతనిరూపణము | 56 |
| యుక్తిదూరమైన యౌషధనిరసనము | 57 |
| జ్ఞానహీనవైద్యనిరసనము | 58 |
| ద్రవ్యోపార్జనపరవైద్యనింద | ,, |
| యుక్తియుక్తఔషధలక్షణము, సువైద్యలక్షణము | 59 |
| సమ్యక్ప్రయోగవైద్యోత్తమలక్షణములు | 59 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **ద్వితీయాధ్యాయము.** | |
| శిరోవిరేచనద్రవ్యములు | 61 |
| వమనద్రవ్యములు | 63 |
| విరేచనద్రవ్యములు | ,, |
| వస్తిద్రవ్యములు | 64 |
| పంచకర్మల జేయుపద్ధతి | ,, |
| మాత్రాకాలవిచారఫలము | 65 |
| పంచకర్మలయందు యవాగ్వాదిప్రయోగము | 66 |
| పంచమూలికయవాగువు | 67 |
| శాలిపర్ణ్యాదియవాగువు | 68 |
| హ్రీబేరాదియవాగువు | ,, |
| ఆమాతిసార - మూత్రకృచ్ఛ్రములకు యవాగువులు | ,, |
| విడంగాది యవాగువు | ,, |
| పిపాసా - విషహరయవాగువులు | 69 |
| బృంహణకర్షణయవాగువులు | ,, |
| స్నేహనయవాగువు | ,, |
| దశమూలాదియవాగువు | ,, |
| భేదనీ-వాతానులోమనీయవాగువులు | 70 |
| విషమజ్వరహరకంఠ్యయవాగువు | ,, |
| రేతోమార్గరోగహర, శుక్రవృద్ధికరయవాగువులు | 71 |
| మదహర-క్షుధాహరయవాగువులు | ,, |
| ప్రకరణోపసంహారము | ,, |
| **తృతీయాధ్యాయము.** | |
| కుష్ఠహరలేపములు | 72 |
| కుష్ఠహరోద్వర్తనములు, లేపములు | 74 |
| కుష్ఠములకు చతురంగులాదిలేపము | 77 |
| వాతములకు కోలాదిలేపము | |

| విషయము. | పుట. |
|---|---|
| వాతములకు మాంసాదిలేపములు | 77 |
| వాతరక్తమున శతాహ్వాదిలేపము | 78 |
| రక్తవాతాదులకు రాస్నాదిలేపములు | ,, |
| తలనొప్పికి ప్రపౌండరీకాదిలేపము | 79 |
| పార్శ్వశూలలకు రాస్నాదిలేపము | ,, |
| నిర్వాపణలేపములు | ,, |
| శైలేయాదిప్రలేపము | 80 |
| అధ్యాయసంగ్రహము | 81 |
| **చతుర్థాధ్యాయము.** | |
| విరేచనయోగ, తదాశ్రయాది విభాగ నిర్ణయము | 82 |
| షడ్విరేచనశత - తదాశ్రయవివరణము | 84 |
| కషాయయోనులు | 85 |
| కషాయభేదములు | 86 |
| స్వరసాదికల్పనాప్రకారము | 87 |
| పంచవిధకషాయముల బలతారతమ్యము | ,, |
| ఏబదియైదు మహాకషాయ విభాగము, అందు దీపనీయాషట్కవర్గము | 88 |
| బల్యాదివర్గచతుష్కవర్గము | 89 |
| తృష్ణాఘ్నాదికషాయషట్కవర్గము | ,, |
| స్తన్యజననాదికషాయవర్గచతుష్కవర్గము | ,, |
| స్నేహోపగాదికషాయసప్తకవర్గము | 90 |
| ఛర్దినిగ్రహణాదిత్రికకషాయవర్గము | ,, |
| పురీషసంగ్రహణీయాదిపంచక కషాయ వర్గము | ,, |
| శ్వాసహరాదిపంచకకషాయవర్గము | 91 |
| దాహప్రశమనాదిపంచకకషాయవర్గము | ,, |
| శోణితస్థాపనాదిపంచకకషాయవర్గము | ,, |
| మహాకషాయోపసంహారము | 92 |
| పంచాశన్మహాకషాయవివరణము; అందు కషాయవర్గషట్కములో జీవనీయ వర్గము | ,, |
| బృంహణీయవర్గము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| లేఖనీయవర్గము | 93 |
| భేదనీయవర్గము | ,, |
| సంధానీయవర్గము | ,, |
| దీపనీయవర్గము | ,, |
| మహాకషాయవర్గచతుష్కము, అందు బల్యవర్గము | 94 |
| వర్ణ్యవర్గము | ,, |
| కంఠ్యవర్గము | ,, |
| హృద్యవర్గము | ,, |
| కషాయవర్గషట్కము, అందు తృప్తిఘ్నములు | 95 |
| అర్శోఘ్నవర్గము | ,, |
| కుష్ఠఘ్నములు | ,, |
| కండూఘ్నములు | ,, |
| క్రిమిఘ్నముల వర్గము | ,, |
| విషఘ్నవర్గము | 96 |
| కషాయవర్గచతుష్కము; అందు స్తన్యజననవర్గము | ,, |
| స్తన్యశోధనవర్గము | ,, |
| శుక్రజననవర్గము | ,, |
| శుక్రశోధనాని | 97 |
| కషాయసప్తకము, అందు స్నేహోపగముల వర్గము | ,, |
| స్వేదోపగవర్గము | ,, |
| వమనోపగవర్గము | 98 |
| విరేచనోపగములు | ,, |
| ఆస్థాపనోపగములు | ,, |
| అనువాసనోపగవర్గము | ,, |
| శిరోవిరేచనీయవర్గము | 99 |
| కషాయవర్గత్రికము, అందు ఛర్దినిగ్రహణములు | ,, |
| తృష్ణానిగ్రహణములు | ,, |
| పురీషనిగ్రహణములవర్గము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| కషాయపంచకము, అందు పురీషసఙ్గ్రహణవర్గము | 100 |
| పురీషవిరజనీయములవర్గము | ,, |
| మూత్రసంగ్రహణీయవర్గము | ,, |
| మూత్రవిరజనీయగణము | ,, |
| మూత్రవిరేచనీయవర్గము | 101 |
| ద్రాక్షాదికషాయవర్గపంచకము, అందు కాసహరవర్గము | ,, |
| శ్వాసహరవర్గము | ,, |
| శ్వయథుహరములు | ,, |
| జ్వరహరములు | 102 |
| శ్రమహరవర్గము | ,, |
| లాజాదివర్గపంచకము; అందు దాహప్రశమనవర్గము | ,, |
| శీతప్రశమనవర్గము | ,, |
| ఉదర్దప్రశమనవర్గము | 103 |
| అంగమర్దప్రశమనములు | ,, |
| శూలప్రశమనవర్గము | ,, |
| మధ్వాదివర్గపంచకము; అందు శోణితస్థాపనవర్గము | ,, |
| వేదనాస్థాపనవర్గము | 104 |
| సంజ్ఞాస్థాపనములవర్గము | ,, |
| ప్రజాస్థాపనముల వర్గము | ,, |
| వయస్స్థాపనములు | ,, |
| ప్రకరణోపసంహారము | 105 |
| అధ్యాయవిషయసంగ్రహము | 107 |
| **స్వస్థవృత్తచతుష్కము** | |
| **పంచమాధ్యాయము.** | |
| మాత్రాసామాన్యలక్షణము | 110 |
| మాత్రకు అగ్నిబలాపేక్షిత్వనిర్ణయము | 111 |
| ద్రవ్యభేదముచే మాత్రాభేదనిర్ణయము | 112 |
| గురులఘుద్రవ్యముల ప్రత్యేకప్రయోజనము | ,, |
| ద్రవ్యాశ్రయమాత్రానిర్ణయము | 113 |
| ఉక్తార్థానువాదము | 115 |
| అలవాటుగ భుజింపదగని పదార్థములు | ,, |
| నియతమున నభ్యసింపదగినపదార్థములు | 116 |
| స్వాస్థ్యపరిపాలనక్రమము | ,, |
| స్వస్థపరిపాలనమునకైన యభ్యంజనాదులు | 117 |
| నేత్రాంజనవిధి | ,, |
| స్రావణాంజనోపయోగకాలము | 118 |
| అంజనోపయోగగుణము | ,, |
| ధూమపానవిధి | 119 |
| స్నైహికధూమపానము | 120 |
| శిరోవిరేచనధూమము | ,, |
| ధూమపానముచే గల్గుగుణములు | ,, |
| ధూమపానము చేయదగినకాలములు | 121 |
| ధూమపానపర్యాయనియమము | 122 |
| ధూమపానసమ్యగ్యోగలక్షణము | ,, |
| ధూమపానమిథ్యాయోగాతియోగమున గల్గునుపద్రవములు | 123 |
| ధూమపానవ్యాపత్తున కుపచారములు | ,, |
| ధూమపాననిషిద్ధులు | ,, |
| ధూమపానమునకు జేరిన కొన్నినియమములు | 124 |
| నాసారంధ్రముచే పొగపీల్చువిధము | 125 |
| ధూమనేత్రపరిమాణము | ,, |
| గొట్టమునుండిధూమపానము జేసినగుణము | ,, |
| మితధూమపానలక్షణము | 126 |
| హీనధూమపానలక్షణము | ,, |
| అతిధూమపానలక్షణము | ,, |
| నస్యకర్మవిధానము | ,, |
| అణుతైలపాకవిధానము | 128 |
| అణుతైలోపయోగక్రమము, దానగల్గుగుణములు | 129 |

| విషయము. | పుట. |
| --- | --- |
| దంతధావనవిధి, దానఁగల్గుగుణములు | 129 |
| దంతధావనకాష్ఠములు | 130 |
| నాలుకను గీచుట, దానిగుణము | ,, |
| తాంబూలధారణము, దానిగుణములు | ,, |
| స్నేహగండూషము, దానిగుణములు | 131 |
| తైలముచే శిరోఽభ్యంజనగుణములు | ,, |
| కర్ణపూరణమున గల్గుగుణములు | 132 |
| శరీరాభ్యంగనగుణములు | ,, |
| పాదాభ్యంగనగుణములు | 133 |
| నలుగు (ఉద్వర్తనము) స్నానము, ఈ రెంటిగుణములు | ,, |
| శుభ్రవస్త్రములు గంధమాల్యాదులు మున్నగువానిధరించుటచే గల్గు గుణములు | 134 |
| శరీరసంరక్షణావశ్యకత | 136 |
| ఉద్వర్తనము, దానిఫలము | ,, |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **షష్ఠాధ్యాయము.** | |
| ఋతుసాత్మ్యప్రయోజనము | 138 |
| అయనవిభాగములు, ఆదానవిసర్గకాలము | ,, |
| సౌమ్యాగ్నేయకాలభేదములు ; అట్టిభేదమునకు కారణములు | 139 |
| ఆదానకాలగుణము | 140 |
| విసర్గకాలగుణము | 141 |
| శిశిరాదిఋతువులందు కల్గు బలముయొక్క తారతమ్యము | ,, |
| హేమన్తఋతుచర్య | 142 |
| హేమంతమున నభ్యంగాదివిధులు | 144 |
| హేమంతమున శయనాసనాదులనియమము | ,, |
| హేమంతమన సేవింపకవిడువదగినవి | 145 |
| శిశిరఋతుచర్య | ,, |
| వసంతఋతుచర్య | 145 |

| విషయము. | పుట. |
| --- | --- |
| వసంతమున ఆహారాదినియమము | 146 |
| వసంతమున చేయదగిన అనులేపాదులు | ,, |
| గ్రీష్మఋతుచర్య | 147 |
| గ్రీష్మఋతువున మద్యపానాదినిషేధము | ,, |
| గ్రీష్మకాలమున నిద్రానియమము | 148 |
| గ్రీష్మమున శీతాద్యుపచారములు | ,, |
| వర్షఋతుచర్య | 149 |
| వర్షఋతువున త్రిదోషప్రకోపకారణము, దానియుపచర్య | ,, |
| వర్షఋతువునందు విడువవలసినది | ,, |
| వర్షఋతువునందు పానభోజనాదినియమము | 150 |
| వర్షఋతువున పానాదినియమము | ,, |
| శరదృతుచర్య, అందు పిత్తప్రకోపకారణము | 151 |
| శరదృతువున నన్నపాననియమము | ,, |
| శరదృతువున లావాదిమాంసాహారము | ,, |
| శరదృతువున పిత్తప్రతీకారము | 152 |
| శరత్కాలమున వర్జనీయములు | ,, |
| హంసోదకము, దానిగుణము | ,, |
| శరత్కాలమున మాల్యాదులయుపయోగము | 153 |
| ఉపసంహారము, అభ్యాససాత్మ్యము | 154 |
| దేశరోగసాత్మ్యములు | ,, |
| అధ్యాయవిషయసంగ్రహము | 155 |
| **సప్తమాధ్యాయము.** | |
| మలమూత్రాదివేగనిరోధనిషేధము | 156 |
| వేగనిరోధమున గల్గువ్యాధులు, అందు మూత్రనిరోధముచే గల్గు రోగములు | 157 |
| మూత్రనిరోధజనితవ్యాధిచికిత్స | ,, |
| మలనిరోధజనితరోగములు | ,, |
| పురీషనిగ్రహజనితరోగోపచారములు | 158 |

విషయము. పుట.

శుక్రనిరోధజనితరోగములు 158
శుక్రనిరోధజనితరోగోపచారములు ,,
వాతనిరోధమున కల్గురోగములు ,,
వాతనిగ్రహజనితరోగములకుపచారము 159
ఛర్దినిరోధమున గల్గురోగములు ,,
ఛర్దినిగ్రహమున గల్గురోగముల కుపచారములు ,,
తుమ్ముల నడ్డగించుటచే గల్గురోగములు ,,
తుమ్ము నిరోధించుటచే గల్గురోగముల కుపచారములు 160
ఉద్గారనిగ్రహజనితరోగములు, వానియందుపచారములు ,,
ఆవలింతల నిగ్రహించినచో గల్గురోగములు, వానిచికిత్స ,,
ఆకలి నణచుటచే గల్గురోగములు, వానియందుపచారములు ,,
తృష్ణానిగ్రహజనితరోగములు, వానికుపచారము 161
బాష్పనిగ్రహమున గల్గు రోగములు, వాని చికిత్స ,,
నిద్రానిరోధజనిత రోగములు, వానియందుపచారములు ,,
శ్రమనిశ్వాసనిరోధమున గల్గు రోగములు, వాని చికిత్స ,,
వేగధారణనిషేధఫలము 162
నిరోధింప దగినవేగములు ,,
లోభాదిమానసిక వ్యాపారవేగనిరోధము ,,
అప్రశస్తవాక్యవేగ నిరోధము 163
అప్రశస్త శరీరవ్యాపారవేగనిరోధము ,,
త్రివిధవేగధారణమువలన కల్గుఫలము 164
వ్యాయామలక్షణము, దానిమాత్ర ,,
వ్యాయామమున గల్గుగుణములు ,,
వ్యాయామాధిక్యమున గల్గురోగములు 165

విషయము. పుట.

వ్యాయామహాస్యాదులయతిమాత్రనిషేధము 165
అనుక్తవ్యాపారాతియోగనిషేధము 166
అహితత్యాగహితసేవనక్రమము ,,
అపథ్యత్యాగపథ్యసేవనక్రమాభ్యాస్యము 167
పైజెప్పిన క్రమాభ్యాసఫలము 168
వాతాదిప్రకృతివివరణము ,,
వాతాదిప్రకృత్యనుగుణాహారము 169
మలముల క్షయవృద్ధికారణములు, లక్షణములు ,,
మలాయనరోగోపచారములు 170
చైత్రాదిమాసములయందు దోషనిర్హరణము ,,
రసాయనాది ప్రయోగము, దానిప్రయోజనము 171
ఆగంతుమానసికరోగములు ,,
ఆగంతు మానసికరోగానుత్పత్త్యుపాయములు 172
రోగానుత్పత్త్యుపాయాంతరములు 173
సహవాసమున కనర్హులు ,,
సేవింపదగినవారు 174
ఆహారాదులయందు హితసేవనము ,,
పెరుగును సేవింపదగినపద్ధతి ,,
వ్యత్యస్తముగ దధిని సేవించుటచేగల్గు రోగములు 176
అధ్యాయవిషయసంగ్రహము ,,


## అష్టమాధ్యాయము.


ఇంద్రియాదిసంఖ్యావివరణము 177
మనస్సు, దానివ్యాపారము 178
మనస్సు నేకత్వసిద్ధాంతము ,,
మనస్సునకు సాత్వికాదిగుణసంబంధము 180
ఇంద్రియవ్యాపారములకు మనస్సు కారణము, ఇంద్రియపంచకము 181

విషయము. పుట.
ఐదుఇంద్రియద్రవ్యములు 182
పంచేంద్రియాధిష్ఠానములు ,,
పంచేంద్రియార్థములు 183
పంచేంద్రియబుద్ధులు ,,
అధ్యాత్మద్రవ్యగుణసంగ్రహము 184
చక్షురాదీంద్రియములకు తైజసత్వాది నిర్ణయము ,,
ఇంద్రియములకుతైజసత్వాదినిర్ణయము 185
ఇంద్రియముల అతియోగమిథ్యాయోగ సమయోగములు, వాని కారణములు ,,
మనోఽర్థము, దాని సమహీనమిథ్యా యోగములచే గల్గుఫలము 186
ఇంద్రియములకునుమనస్సునకును స్వస్థపరి పాలనోపాయము 187
సద్వృత్తానుష్ఠానక్రమము ,,
సాధువేళాధిసద్వృత్తము 188
మంగళాచారాదిసద్వృత్తములు 190
మనుజులు విసర్జింపవలసినవిషయములు ,,
భోజనకాలనియమములు 193
ఇంక కొన్నిసద్వృత్తములు 195
స్త్రీలవిషయమై తానుండవలసిన నడవడిక ,,
కొన్నినియమాంతరములు 196
వేదాధ్యయననియమములు 197
కొన్నిసదాచారములు ,,
మరికొన్నివిధులు 198
మఱికొన్నినియమవిధులు 199
అధ్యాయవిషయసంగ్రహము 200
అనుక్తసద్వృత్తాభ్యనుజ్ఞ 201

## నిర్దేశచతుష్కము.

### నవమాధ్యాయము.

పాదచతుష్టయము 202
వికారము, ప్రకృతి, వీనిస్వరూపములు 203
చికిత్సాలక్షణము 204
వైద్యుని కుండవలసిన గుణములు 204
ఔషధద్రవ్యగుణములు 205
పరిచారకగుణములు ,,
రోగి కుండవలసిన గుణములు ,,
పాదచతుష్టయములో వైద్యునకుప్రాధాన్యము 206
వైద్యప్రాధాన్యమునకు వ్యతిరేకదృష్టాంతము 207
అన్వయవ్యతిరేకదృష్టాంతములచే వైద్యునిగుణదోషనిరూపణము ,,
జ్ఞానహీనవైద్యునిచికిత్సానిషేధము 208
అజ్ఞవైద్యచికిత్సాఫలము ,,
ప్రాణాభిసరలక్షణము 209
రాజవైద్యలక్షణము ,,
మరికొన్ని వైద్యగుణవిశేషములు 210
శాస్త్రజ్ఞానము, సహజబుద్ధి, వానియావశ్యకత 211
చతుర్విధవైద్యవృత్తులు 212
అధ్యాయవిషయసంగ్రహము ,,

### దశమాధ్యాయము.

యుక్తియుక్తౌషధము ఆరోగ్యకారణమని యాత్రేయమతము 213
ఔషధముచే ప్రయోజనము లేదని పూర్వపక్షము 214
ఔషధప్రయోజనసిద్ధాంతము 215
ఔషధప్రయోజనవిషయమున ప్రత్యక్షానుభవము 219
చికిత్సానియమము 220
సాధ్యాఽసాధ్యరోగభేదములు ,,
సుఖసాధ్యరోగలక్షణములు 221
కృచ్ఛ్రసాధ్యరోగలక్షణములు 222
యాప్యరోగలక్షణములు 223
ప్రత్యాఖ్యేయరోగలక్షణము 224

| విషయము. | పుట. |
|---|---|
| సాధ్యాసాధ్యవిభాగజ్ఞానప్రయోజనము | 224 |
| అధ్యాయవిషయసంగ్రహము | 225 |
| **ఏకాదశాధ్యాయము.** | |
| ఏషణాత్రయవివరణము | 226 |
| ప్రాణైషణము | 227 |
| ధనైషణము | ,, |
| పరలోకైషణము; అందు నాస్తికాది మతానువాదము | 229 |
| ప్రత్యక్షవాదనిరసనము | 231 |
| శ్రుతిభేదవాదిమతనిరసనము | 233 |
| స్వాభావికవాది మతదూషణము | 235 |
| పరనిర్మాణమతనిరాసము | ,, |
| యదృచ్ఛావాదనిరాసము | 237 |
| నాస్తికమతనిరసనపూర్వకకర్తవ్యము | ,, |
| సదసద్విభాగము, ప్రమాణచతుష్టయము | 238 |
| ఆప్తలక్షణము | ,, |
| ప్రత్యక్షప్రమాణలక్షణము | 239 |
| అనుమానస్వరూపము | 240 |
| యుక్తి కుదాహరణములు | 242 |
| యుక్తిలక్షణము | 243 |
| పునర్భవాస్తిత్వనిరూపణము | 244 |
| ఆప్తాగమము, పునర్భవాస్తిత్వసిద్ధాంతము | ,, |
| పునర్భవమునకుఆగమాంతరప్రమాణము | 245 |
| ఋషివచనరూపమైన యాగమప్రమాణముచే పునర్భవనిర్ణయము | ,, |
| పునర్భవవిషయమై ప్రత్యక్షముచే లింగ (వ్యాప్తి) గ్రహణము | 246 |
| అనుమానప్రమాణముచే పునర్జన్మమును సాధించువిధము | 247 |
| యుక్తి ప్రమాణముచే పునర్భవనిశ్చయము | 248 |
| పరలోకైషణము, ధర్మసాధనములు | 250 |
| ఉపస్తంభాదిపరిగణనము | 251 |

| విషయము. | పుట. |
|---|---|
| ఉపస్తంభవివరణము | 251 |
| త్రివిధబలవివరణము | 252 |
| ఇంద్రియార్థముల కతియోగాయోగమిథ్యాయోగములు | ,, |
| అసాత్మ్యేంద్రియార్థసంయోగము, వాని భేదములు | 255 |
| కర్మస్వరూపము, దానిఅయోగ- అతియోగ-మిథ్యాయోగములు | 258 |
| అనుక్తమిథ్యాయోగకర్మసంగ్రహము | 260 |
| త్రివిధకర్మమునకు ప్రజ్ఞాపరాధసంజ్ఞ | ,, |
| కాలాతియోగ-అయోగ- మిథ్యాయోగములు (పరిణామము) | ,, |
| త్రివిధరోగహేతూపసంహారము | 261 |
| సమ్యగ్యోగాయోగాదులకు లోకదృష్టాంతము | ,, |
| త్రివిధరోగములు, వానియుత్పత్తికారణములు | 262 |
| మానసరోగప్రతీకారము | 263 |
| మానసరోగచికిత్సానువాదసంగ్రహము | 264 |
| మూడురోగమార్గములు, వానివివరణము | ,, |
| బహిర్మార్గజరోగములు | 265 |
| మధ్యమమార్గజరోగములు | 266 |
| కోష్ఠజరోగములు | ,, |
| త్రివిధవైద్యులు | ,, |
| త్రివిధౌషధములు, వానివివరణము | 267 |
| ప్రకారాంతరమున త్రివిధఔషధములు | 268 |
| ఉక్తానువాదము | 269 |
| రోగిభేదములు | 270 |
| అధ్యాయవిషయసంగ్రహము | 271 |
| **ద్వాదశాధ్యాయము.** | |
| వాతగుణదోషములగురించి ఋషులసంభాషణము | 272 |
| వాతమునకు స్వాభావికగుణములు | 273 |

| విషయము. | పుట. |
|---|---|
| వాతప్రకోపనములు. | 273 |
| వాతప్రశమనములు | 274 |
| వాతమునకు ప్రకోపప్రశమనములు కల్గు క్రమము | ,, |
| సమస్థితినున్న శారీరవాతకృత్యములు | 276 |
| ప్రకుపితశారీరవాతకృత్యములు | 277 |
| సమస్థితినుండు బాహ్యవాయుకృత్యములు | 278 |
| ప్రకుపితబాహ్యవాయుకృత్యములు | ,, |
| వాయుసామాన్యకృత్యములు | 279 |
| వాతగుణపరిజ్ఞానవిషయకప్రశ్నము | 280 |
| వాయుగుణపరిజ్ఞానావశ్యకత | ,, |
| వికృతావికృత-పిత్తకృత్యములు | 281 |
| సమప్రకుపితకఫకృత్యములు | 282 |
| ఆత్రేయమతసిద్ధాంతము | 283 |
| ఆత్రేయసిద్ధాంతాభినందనము | 284 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |

కల్పనాచతుష్కము.

త్రయోదశాధ్యాయము.

| విషయము. | పుట. |
|---|---|
| స్నేహవిధినుద్దేశించి యగ్నివేశునిప్రశ్నములు | 286 |
| రెండువిధములైన స్నేహయోనులు | 287 |
| స్నేహాశ్రయముల వివరణము | ,, |
| శ్రేష్ఠమైనతైలము | 288 |
| స్నేహములలో తారతమ్యము | ,, |
| ఘృతగుణములు | 289 |
| తైలగుణములు | 290 |
| వసాగుణములు | ,, |
| స్నేహపానకాలము | ,, |
| దోషానుసారముగ స్నేహపానకాలనియమము | 292 |
| కాలవ్యత్యయముగ చేసిన స్నేహపానమున గల్గురోగములు | ,, |
| స్నేహానుపానములు | 293 |
| స్నేహవిచారణము, వానిభేదములు | ,, |
| అచ్ఛపేయము, దానిప్రాశస్త్యము | 294 |
| రసభేదముచే ప్రకారాంతరముగ విచారణాభేదములు | ,, |
| స్నేహముయొక్క ఉత్తమ-మధ్యమ-హ్రస్వమాత్రలు | 295 |
| ఉత్తమస్నేహమాత్రార్హులు, దానిగుణములు | 296 |
| మధ్యమమాత్రస్నేహార్హులు, దాన గల్గు గుణములు | 297 |
| హ్రస్వమాత్రగా స్నేహపానము చేయదగినవారు, దాని గుణములు | 298 |
| ఘృతమును పానము చేయదగినవారు | ,, |
| తైలపానము చేయదగినవారు | 299 |
| వసాపానము చేయదగినవారు | ,, |
| మజ్జాస్నేహోపయోగార్హులు | 300 |
| స్నేహప్రకర్షకాలనిర్ణయము | ,, |
| సామాన్యముగ స్నేహపానార్హులు | 301 |
| స్నేహపాననిషిద్ధులు | ,, |
| అస్నిగ్ధలక్షణము | 302 |
| సుస్నిగ్ధలక్షణము | 303 |
| అతిస్నిగ్ధలక్షణము | ,, |
| స్నేహపానమునకు ముందుదినమున పథ్యసేవనక్రమము | ,, |
| సంశమన-శోధన-స్నేహపానసామాన్యకాలము | ,, |
| స్నేహము పానము జేసినప్పుడు, జీర్ణమైనపుడు చేయవలసినయుపచారములు | 304 |
| మృదుక్రూరకోష్ఠలక్షణములు | 305 |
| క్రూరమృదుకోష్ఠముల స్వరూపము | ,, |
| స్నేహపానమున గల్గువ్యాపత్తులు, వాని యుపచారములు | 306 |

| విషయము. | పుట. |
|---|---|
| పిత్తామావస్థయందు ఘృతపాననిషేధము, దాన గల్గువ్యాపత్తులు | 307 |
| స్నేహవ్యాపత్తులు, వానిచికిత్స | 308 |
| స్నేహవ్యాపత్తికారణములు | 309 |
| శోధనాంగస్నేహపానమున వృత్తినియమము | 310 |
| శమనార్థస్నేహపాననియమము | ,, |
| స్నేహవిచారణ చేయవలసినవారు, స్నేహనమాంసరసములు, వానితో జేర్పదగినవస్తువులు | 311 |
| కొన్ని స్నేహనయోగములు | ,, |
| మఱికొన్ని స్నేహనయోగములు | 312 |
| కొన్నిరోగములయందుకొన్ని స్నేహముల నిషేధము | ,, |
| కుష్ఠశోఫప్రమేహములయందు స్నేహనవిధి | 313 |
| స్నేహనయోగ్యఘృతము | ,, |
| యోనిశుక్రదోషముల కుపయోగ్యస్నేహము | 314 |
| స్నేహము శరీరమున వ్యాపించుటకు దృష్టాంతము | ,, |
| లవణయుక్తస్నేహము శీఘ్రముగ స్నేహనమనుట | 315 |
| స్నేహ-స్వేద-సంశోధనములకు పౌర్వాపర్యక్రమము | ,, |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **చతుర్దశాధ్యాయము.** | |
| స్వేదమున శమించుదోషములు | 316 |
| స్వేదప్రయోజనము | 317 |
| యుక్తస్వేదస్వరూపము | ,, |
| తీవ్రమృదుమధ్యస్వేదోపయోగ్యములు | 318 |
| ఆమాదోషానుసారముగ స్వేదకల్పనము | ,, |
| ఆమాశయాది దేశానుసారముగ స్వేదకల్పనము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| అవయవభేదమునుబట్టి స్వేదకల్పనము | 319 |
| నేత్ర-హృదయములయందు స్వేదనము చేయునపుడు చేయదగిన యుపచారములు | ,, |
| స్వేదసమ్యగ్యోగఅయోగలక్షణములు | 320 |
| స్వేదాతియోగలక్షణములు, అందుపచారములు | ,, |
| స్వేదనము చేయదగనివారు | 321 |
| స్వేదనము చేయదగినవ్యాధులు | 323 |
| స్వేదోపయోగ్యద్రవ్యములు | 324 |
| స్వేదనయోగ్యస్థలములు | ,, |
| నాడీస్వేదము, అందు వాతహరనాడీస్వేదకల్పనము | 325 |
| కఫహరనాడీస్వేదము | ,, |
| వాతకఫహరనాడీస్వేదము, అవగాహస్వేదపరికల్పనము | ,, |
| ఉపనాహస్వేదకల్పనము | 326 |
| ఉపనాహమున కట్టువిడచుటకు కాలపరిమితి | 327 |
| పదిమూడు స్వేదముల వివరము | ,, |
| 1. సంకరస్వేదము | ,, |
| 2. ప్రస్తరస్వేదము | 328 |
| 3. నాడీస్వేదము | ,, |
| 4. పరిషేకస్వేదము | 329 |
| 5. అవగాహస్వేదము | 330 |
| 6. జేంతాకస్వేదకూటాగారనిర్మాణవిధి | ,, |
| జేంతాకస్వేదవిధానము | 332 |
| 7. అశ్మఘునస్వేదము | 334 |
| 8. కర్షూస్వేదము | ,, |
| 9. కుటీస్వేదము | 335 |
| 10. భూస్వేదము | ,, |
| 11. కుంభీస్వేదము | 336 |
| 12. కూపస్వేదము | ,, |
| 13. హోలాకస్వేదము | 337 |

| విషయము. | పుట. |
|---|---|
| ప్రకరణోపసంహారము | 337 |
| అగ్నిగుణసంబంధములేని స్వేదములు | ,, |
| షడ్విధస్వేదములు | 338 |
| స్నేహాదిసేవనక్రమము | 339 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **పంచదశాధ్యాయము.** | |
| సంభారముల జేర్చికొనుట యావశ్యకమనుట | 340 |
| అగ్నివేశుడు ప్రశ్న చేయుట | 341 |
| ఆత్రేయప్రతివచనము | 342 |
| ఔషధాలయనిర్మాణము | 343 |
| చికిత్సాలయమున సంభారసంభరణము | 344 |
| వమనౌషధప్రయోగపూర్వకృత్యము | 347 |
| వమనౌషధపానవిధము | ,, |
| సంశోధనౌషధమాత్రానిర్ణయము | 348 |
| వమనమునదోలచలనాదిలక్షణములు | 349 |
| ఉపచారములు | ,, |
| వమనౌషధమును పానముచేసి వేగప్రవర్తనోపాయములు | 350 |
| వమనవేగపరీక్ష, దానిప్రయోజనము | ,, |
| వమనాయోగలక్షణములు | 351 |
| వమనసమ్యగ్యోగలక్షణములు | ,, |
| వమనాతియోగలక్షణములు | 352 |
| వమనాయోగ-అతియోగముల గల్గునుపద్రవములు | ,, |
| యథోక్తముగ వాంతియైనవానికి ధూమపానవిధి | 353 |
| వమితునకు హితములైన యాహారవిహారములు | ,, |
| వమితునకు పేయాదిక్రమాహారనియమము | 354 |
| విరేచనౌషధసేవనక్రమము | 356 |
| సమ్యగ్విరిక్తానంతరకృత్యములు | 357 |
| ఉపపత్తిలేనివారు సంశోధనము నాచరించవలసినవిధము | 358 |
| సంశోధనమున గల్గుగుణములు | 359 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **షోడశాధ్యాయము.** | |
| సద్వైద్య-అసద్వైద్య చికిత్సాగుణదోషములు | 360 |
| విరేకసమ్యగ్యోగలక్షణములు | 361 |
| విరేకఅయోగలక్షణములు | 362 |
| విరేక అతియోగలక్షణములు | ,, |
| వమనాతియోగలక్షణములు | ,, |
| సంశోధనము చేయదగినవిషయము | 363 |
| సంశోధనగుణము | 364 |
| సంశోధనప్రాశస్త్యము | ,, |
| శోధనముచే గల్గిన బలహీనమునకు బృంహణోపచారములు | 365 |
| శోధనాతియోగచికిత్స | 366 |
| శోధనాయోగచికిత్స | ,, |
| ధాతువైషమ్యసామ్యస్థితికారణములు | ,, |
| భావపదార్థముల ప్రవృత్తినివృత్తికారణములు | 367 |
| చికిత్సావిషయమై శిష్యప్రశ్నములు | 368 |
| శిష్యప్రశ్నముల కుత్తరము | 369 |
| చికిత్సాస్వరూపము, వైద్యునికృత్యము | 370 |
| చికిత్సాప్రయోజనము | ,, |
| శాస్త్రీయవైద్యునిచే గల్గునుపకారము | 371 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **రోగచతుష్కము.** | |
| **సప్తదశాధ్యాయము.** | |
| రోగములవిషయమై యగ్నివేశుని ప్రశ్నము | 373 |
| పైప్రశ్నానుసారముగ రోగసంఖ్యావిభాగము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| శిరోరోగసామాన్యకారణములు, సంప్రాప్తి | 375 |
| అంగములలో శిరస్సుకు ప్రాధాన్యము | ,, |
| సామాన్యశిరోరోగములు | 376 |
| పంచవిధశిరోరోగనిర్దేశమునకు వివరణము | ,, |
| పంచవిధశిరోరోగములు, అందు వాతికశిరోరోగనిదానము, సంప్రాప్తి | 377 |
| వాతికశిరోరోగలక్షణములు | ,, |
| పైత్తికశిరోరోగనిదానము,లక్షణములు | 378 |
| శ్లైష్మికశిరోరోగనిదానము, లక్షణములు | ,, |
| సాన్నిపాతికశిరోరోగలక్షణములు | 379 |
| క్రిమిజశిరోరోగనిదాన, సంప్రాప్తి లక్షణములు | ,, |
| పంచవిధహృదయరోగములు, అందు వాతికహృద్రోగనిదాన-సంప్రాప్తిలక్షణములు | 380 |
| పైత్తికహృద్రోగనిదాన - సంప్రాప్తి లక్షణములు | ,, |
| శ్లైష్మికహృద్రోగనిదాన లక్షణములు | 381 |
| సాన్నిపాతికహృద్రోగనిదానలక్షణములు | ,, |
| క్రిమిజహృద్రోగనిదాన - సంప్రాప్తి లక్షణములు | ,, |
| వృద్ధిక్షయాదిభేదములచే వాతాదిదోషములకుగల్గు నరువదిరెండు భేదములు | 382 |
| వృద్ధిభేదములు 25 | 386 |
| క్షీణభేదములు 25 | 387 |
| వృద్ధక్షీణమిశ్రభేదములు | 388 |
| ఏకవృద్ధి ఏకసమ ఏకక్షయమున గల్గు దోషభేదము లారిటికుదాహరణము | 388 |
| ద్వంద్వవృద్ధిఏకక్షయదోష భేదములు మూడు. అందు వాతము క్షీణించి పిత్తకఫములు వృద్ధినొందిన దోషలక్షణములు | 390 |
| అందు పిత్తము క్షీణించి వాతకఫములు ప్రకోపించినదోషలక్షణములు | 391 |
| కఫము క్షీణించి వాతపిత్తములు వృద్ధి నొందిన దోషలక్షణములు | ,, |
| ఏకవృద్ధి ద్వంద్వక్షయదోషములు మూడు. అందు కఫమువృద్ధినొంది వాతపిత్తములు క్షీణించిన దోషలక్షణములు | ,, |
| పిత్తము వృద్ధినొంది కఫవాతములు క్షీణించిన దోషలక్షణము | 392 |
| వాతము వృద్ధినొందిన, కఫపిత్తములు క్షీణించినదోషలక్షణము | ,, |
| వాతాదిదోషముల వృద్ధి-క్షయ-సామ్యావస్థల ప్రత్యేకలక్షణములు | 393 |
| పదునెనిమిదిక్షయములవివరణము | ,, |
| రసధాతుక్షయలక్షణములు | 394 |
| రక్తమాంసములక్షయలక్షణములు | ,, |
| మేదోధాతుక్షయలక్షణములు | ,, |
| అస్థిక్షయలక్షణము | ,, |
| మజ్జధాతుక్షయలక్షణములు | 395 |
| శుక్రధాతుక్షయలక్షణము | ,, |
| పురీషక్షయలక్షణము | ,, |
| మూత్రక్షయలక్షణము | ,, |
| పంచేంద్రియములక్షయలక్షణసంగ్రహము | 396 |
| ఓజోధాతుక్షయలక్షణములు | ,, |
| ఓజస్స్వరూపము | 397 |
| క్షయసామాన్యకారణములు | 399 |
| ప్రమేహనిదానము, సంప్రాప్తి | ,, |
| ప్రమేహపిటికానిదానము, సంప్రాప్తి | 400 |
| శరావికలక్షణము (౧) | ,, |
| కచ్ఛపికాలక్షణము (౨) | 401 |
| జాలినీలక్షణము (౩) | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| అనుక్తాధిమాంసాదిసంగ్రహము | 422 |
| రోహిణీసంప్రాప్తి | 423 |
| రోహిణీసాధ్యాసాధ్యత్వములు | ,, |
| కృచ్ఛ్రసాధ్యలక్షణము | 425 |
| సుఖసాధ్యలక్షణము | ,, |
| యాప్యరూపాసాధ్యలక్షణము | ,, |
| ప్రత్యాఖ్యేయరూపాసాధ్యలక్షణము | ,, |
| సాధ్యాదిభేదపరిగణనము | 426 |
| వ్యాధినానాత్వము | ,, |
| వ్యాధిసంఖ్యాభేదనిర్ణయము | 427 |
| రోగనామపరిజ్ఞానము లేకున్నను దోషజ్ఞానము చికిత్సోపయోగ్యమనుట | ,, |
| వాతాదిపరిజ్ఞానావశ్యకత | 428 |
| ప్రకృతిస్థితవాతకృత్యములు | 429 |
| ప్రకృతిస్థితపిత్తకృత్యములు | ,, |
| ప్రకృతిస్థితకఫకృత్యములు | ,, |
| వాతపిత్తకఫముల క్షీణలక్షణములు | ,, |
| త్రిదోషముల వృద్ధిలక్షణములు | 430 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **ఏకోనవింశాధ్యాయము.** | |
| రోగములభేదనిర్దేశము | 432 |
| ఎనిమిదియుదరములకును, ఎనిమిది మూత్రాఘాతములకును వివరణము | 433 |
| ఎనిమిదివిధములైన క్షీరదోషములవివరణము | ,, |
| ఎనిమిదివిధములైన శుక్రదోషములు | 434 |
| సప్తవిధకుష్ఠభేదములు | ,, |
| సప్తవిధపిడకాభేదములు | ,, |
| సప్తవిసర్పభేదములు | ,, |
| అతిసార-ఉదావర్తములయారేసీభేదము | 435 |
| గుల్మప్లీహాది రోగములయొక్క యైదేసి భేదముల వివరణము | ,, |
| అపస్మార-నేత్రరోగాదులకు నాల్గేసిభేదములవివరణము | 436 |
| శోష-క్లైబ్యముల చతుర్విధభేదములు | 437 |
| మూడేసివిధములగు శోథ-కిలాస-రక్తపిత్తములవివరణము | ,, |
| ద్వివిధజ్వరాదివివరణము | 438 |
| ఊరుస్తంభాది ఏకవిధరోగవివరణము | 439 |
| వింశతి క్రిమిజాతులవివరణము | ,, |
| వింశతిప్రమేహముల వివరణము, అందు కఫప్రమేహములు పది | 440 |
| పైత్తికమేహములు ఆరు | ,, |
| వాతికమేహములు నాల్గు | 441 |
| వింశతియోనివ్యాపత్తులవివరణము | ,, |
| రోగగణసంఖ్యావివరణము | 442 |
| సర్వరోగములకును త్రిదోషములుకారణములనుట | ,, |
| నిజాగన్తురోగములకుపరస్పరసంబంధము | 444 |
| **వింశాధ్యాయము.** | |
| రోగసామాన్యనిమిత్త-స్వభావ-అధిష్ఠానభేదములు | 446 |
| ప్రకృత్యాదివికల్పభేదములచే రోగానంత్యము | ,, |
| నిజాగంతురోగములకు వేరువేరు కారణములు | 447 |
| నిజఆగంతురోగముల రెంటికిని సామాన్యకారణములు | 448 |
| నిజాగంతురోగములకు పరస్పరసంసర్గము | ,, |
| నిజాగంతువులకు పరస్పరభిన్నలక్షణములు | 449 |
| త్రిదోషములస్థానములు, అందు వాతస్థానములు | ,, |
| పిత్తస్థానములు | ,, |
| శ్లేష్మస్థానములు | 450 |

| విషయము. | పుట. |
|---|---|
| వికృతావికృతత్రిదోషకృత్యములు | 450 |
| సామాన్యజ-నానాత్మజరోగములు,అందు నానాత్మజవిభాగము | ,, |
| అశీతివాతరోగముల వివరణము | 451 |
| వాతముయొక్క స్వరూపము, గుణములు | 453 |
| వాతకృత్యములు | 454 |
| వాతహరచికిత్సావిధానము | 455 |
| చత్వారింశత్పిత్తరోగములవివరణము | 456 |
| పిత్తముయొక్క స్వరూపము, గుణములు | 457 |
| పిత్తకృత్యములు | 458 |
| పిత్తరోగసామాన్యచికిత్స | ,, |
| వింశతి కఫరోగములవివరణము | 459 |
| కఫస్వరూపలక్షణము, దానిగుణములు | 460 |
| కఫకృత్యములు | ,, |
| కఫసామాన్యచికిత్స | 461 |
| రోగాదిపరిజ్ఞానము చికిత్సోపయోగ్యమనునిర్ణయము | 462 |
| అధ్యాయవిషయసంగ్రహము | 463 |

యోజనాచతుష్కము

ఏకవింశాధ్యాయము.

| విషయము. | పుట. |
|---|---|
| అష్టవిధనిందితపురుషులు | 465 |
| అతిస్థూలకృశులకు విశేషదోషములు, అందు అతిస్థూలవిశేషదోషములు | ,, |
| అతిస్థౌల్య కారణములు | 466 |
| స్థూలశరీరునకు ఆయుర్హ్రాసాదులకు కారణములు | ,, |
| మేదోవృద్ధివలన గల్గునుపద్రవములు | 467 |
| మేదోవృద్ధిచే నాయువు నశించుటకు కారణములు | ,, |
| స్థూలలక్షణము | 468 |
| కార్శ్యము కల్గుటకు కారణములు | ,, |
| కృశతదోషములు | 469 |
| కృశునకు ప్రాయికముగసంభవించురోగములు | ,, |
| కృశలక్షణము | 469 |
| స్థౌల్యకార్శ్యతారతమ్యము | ,, |
| నిర్దుష్టపురుషలక్షణము | 470 |
| స్థూలకృశులకు దగినచికిత్సాదివిధానము | 471 |
| స్థౌల్యహరయోగములు | ,, |
| స్థౌల్యహరభోజనము, అనుపానములు | 472 |
| స్థౌల్యహరవిహారములు | 473 |
| కృశత్వమును హరించు నాహారవిహారాదులు | ,, |
| నిద్రాస్వరూపము | 474 |
| నిద్రవలన కల్గు సుఖాసుఖములు | 475 |
| పగటినిద్ర కర్హులు | 476 |
| గ్రీష్మఋతువున దివానిద్రావిధానము | 477 |
| గ్రీష్మవ్యతిరిక్తఋతువులయందు సాధారణముగ దివానిద్రానిషేధము | 478 |
| పగటినిద్ర కనర్హులు | ,, |
| అవహితనిద్రాసేవనమున గల్గునుపద్రవములు | ,, |
| రాత్రిజాగరణ-దివానిద్రలసామాన్యగుణములు | 479 |
| నిద్రాప్రాప్తికి దగుసాధనములు | 480 |
| అర్హునకు నిద్ర రానీయకుండుట కుపాయములు | ,, |
| సామాన్యముగ నిద్రానాశకకారణములు | 481 |
| నిద్రాభేదములు | ,, |
| నిద్రావిభాగము | 482 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |

ద్వావింశాధ్యాయము.

| విషయము. | పుట. |
|---|---|
| ఆత్రేయుండు అగ్నివేశాదులకు లంఘనాదుల దెల్పుట | 483 |
| అగ్నివేశుడు లంఘనాదులనుగూర్చి ప్రశ్నము సేయుట | 484 |
| లంఘనబృంహణాదిస్వరూపలక్షణములు | ,, |
| లంఘనద్రవ్యలక్షణము | 485 |

| విషయము | పుట. |
|---|---|
| బృంహణద్రవ్యలక్షణము | 485 |
| రూక్షణద్రవ్యలక్షణము | 486 |
| స్నేహనద్రవ్యలక్షణము | ,, |
| స్వేదనద్రవ్యగుణములు, లక్షణములు | ,, |
| స్తంభనద్రవ్యలక్షణము | 487 |
| లంఘనసంగ్రహము | ,, |
| పైజెప్పిన పదివిధములైనలంఘనముల వేరు వేరుగ నుపయోగ్య విషయములు, | |
| అందు శోధనరూపలంఘనమునకర్హులు | ,, |
| పాచనరూపమైనలంఘనమున కర్హులు | ,, |
| పిపాసానిగ్రహాదులచే లంఘనము జేయ దగినవారు | 488 |
| లంఘనయోగ్యులు | ,, |
| బృంహణద్రవ్యము | 489 |
| బృంహణమున కర్హులు | ,, |
| మాంసరసముచే బృంహణము చేయవల సినవారు | ,, |
| సామాన్యముగ బృంహణోపాయములు | 490 |
| రూక్షణములు | ,, |
| రూక్షణము చేయదగినవారు | ,, |
| స్నేహన-స్వేదనాదులసంగ్రహము | ,, |
| స్తంభనములు | 491 |
| స్తంభనము చేయదగినవారు | ,, |
| లంఘనసమ్యగ్యోగలక్షణము | ,, |
| లంఘనాతియోగలక్షణములు | 492 |
| బృంహణసమ్యగ్యోగ - అతియోగలక్షణ ములు | ,, |
| రూక్షణసమ్యగ్యోగ - అయోగములు, స్తంభితలక్షణంబును | ,, |
| స్తంభనాతియోగలక్షణము | 493 |
| లంఘనబృంహణాద్యయోగలక్షణము | ,, |
| ఉపక్రమషడ్విధత్వనిర్ణయము | ,, |
| అధ్యాయవిషయసంగ్రహము | 494 |

| విషయము. | పుట. |
|---|---|
| **త్రయోవింశాధ్యాయము** | |
| సంతర్పణాధిక్యమున గల్గువ్యాధులు | 495 |
| సంతర్పణజనితవ్యాధులవివరణము | 496 |
| సంతర్పణజనితరోగచికిత్స | ,, |
| అభయాప్రాశాదియోగములు | ,, |
| ఆరగ్వధాదియోగము | 497 |
| త్వగ్దోషహరోద్వర్తనము | ,, |
| కుష్ఠాదిపానము | 498 |
| తక్రహరీతకీ మున్నగుప్రయోగములు | ,, |
| సంతర్పణజనితరోగహరవ్యోషాదిసత్తు పానము | ,, |
| స్థౌల్యహరసామాన్యచికిత్స | 499 |
| అపతర్పణముచే గల్గురోగములు | 500 |
| అపతర్పణజనితకార్శ్యమునకు సంతర్పణ విధి | 501 |
| చిరకాలక్షీణతయందు సంతర్పణాదివిధా నము | ,, |
| శర్కరాదిసంతర్పణమంథము | 502 |
| వాతాద్యనులోమనసంతర్పణమంథము | ,, |
| ఉదావర్తాదిహరతర్పణము | 503 |
| మద్యవికారహరమంథము | ,, |
| సద్యస్సంతర్పణమంథము | ,, |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **చతుర్వింశాధ్యాయయ.** | |
| రక్తము శుద్ధమగుటకు కారణములు | 504 |
| విశుద్ధరక్తకృత్యము | 505 |
| రక్తదుష్టికారణములు | 506 |
| రక్తదుష్టివలన గల్గురోగములు | 507 |
| అనుక్తరక్తరోగపరిజ్ఞానోపాయము | 508 |
| రక్తాశ్రయరోగములకు చికిత్స | 509 |
| రక్తస్రావపరిమితి | ,, |
| వాతాదిదుష్టరక్తలక్షణములు | 510 |
| నిర్దుష్టరక్తలక్షణములు | ,, |

విషయము. పుట.
రక్తస్రావానంతరము పథ్యసేవనవిధి 511
రక్తస్రావముచే శుద్ధమైనరక్తము కల వానిలక్షణములు ,,
రక్తరస సంజ్ఞావహస్రోతస్సులదుష్టిచే గల్గురోగములు ,,
వాతాదిమదసంప్రాప్తి 513
వాతికమదలక్షణము ,,
పైత్తికమదలక్షణము ,,
శ్లైష్మికమదలక్షణము ,,
సాన్నిపాతికమదలక్షణము, మదసామాన్యస్వరూపము 514
వాతికమూర్ఛాలక్షణము ,,
పైత్తికమూర్ఛాలక్షణము 515
కఫజమూర్ఛాలక్షణము 156
సాన్నిపాతికమూర్ఛాలక్షణము ,,
మదమూర్ఛలకును సన్న్యాసమునకును గలభేదము 517
సన్న్యాసరోగసంప్రాప్తి, లక్షణములు ,,
సన్న్యాసరోగమున మూర్ఛతొలగించునుపాయములు 518
మూర్ఛను దొలగించు మరికొన్ని చికిత్సలు ,,
సన్న్యాసమున ప్రజ్ఞ తెలిసినపిదప చేయదగినయుపచారాదులు 519
మద - మూర్ఛారోగములయందు పంచకర్మవిధానము ,,
మదమూర్ఛారోగముల చికిత్సాయోగములు 520
మదమూర్ఛాశామకోపాయములు ,,
అధ్యాయవిషయసంగ్రహము 521

## పంచవింశాధ్యాయము.

### అన్నపానచతుష్కము.

విషయావతరణమునకై ఋషులు ప్రసంగించుట 522
వ్యాధికారణమునుగూర్చి కాశిరాజు ప్రశ్నము 522
ఆత్రేయుంనియమానతి 523
పారీక్షి చెప్పిన రోగకారణము ,,
శరలోముడు మనస్సు జన్మరోగములకు కారణమనుట 524
జన్మరోగములకు రసము కారణమనుమతము ,,
షడ్ధాతుకారణమతము 525
జన్మరోగములకు తలిదండ్రులు కారణమనుపక్షము 526
జన్మమునకును రోగమునకు కర్మ కారణమనుట ,,
జన్మరోగములకు స్వభావము కారణమనుట 527
సృష్టికర్మజన్మాదికారణమనుట ,,
కాలము జన్మాదికారణమనుట 528
పూర్వపక్షనిరసనపూర్వకముగ నాత్రేయమతసిద్ధాంతము ,,
పురుషవృద్ధికిని రోగవృద్ధికిని హితాహితాహారములు కారణము 529
హితాహితవిషయమై యగ్నివేశుని ప్రశ్నము 530
హితాహిత నిష్కృష్టలక్షణము 532
అగ్నివేశుని ప్రశ్నము ,,
ఆత్రేయప్రతివచనము 533
స్థావరజంగమాదిభేదములచే నాహారపదార్థనిర్ణయము 534
పథ్యతమవస్తు పరిగణనప్రతిజ్ఞ 536
పథ్యతమవస్తుపరిగణనము ,,
అపథ్యతమవస్తుపరిగణనము 538
హితాహితాహారములయొక్కయు ఔషధములయొక్కయుం ప్రధానకృత్యనిర్దేశము 539

| విషయము | పుట. |
|---|---|
| వృత్తికరాహారాదులలో శ్రేష్ఠత్వము | 540 |
| సుఖవిరేచనాద్యౌషధాములలో శ్రేష్ఠములనిర్దేశము | 542 |
| తక్రాభ్యాసాదులశ్రేష్ఠత్వములు | 544 |
| పథ్యాదులలో ప్రశమాదులశ్రేష్ఠత్వము | 548 |
| అనాహార్యాదులలో శ్రేష్ఠనిర్దేశము | ,, |
| ఆతురగుణాదులలో శ్రేష్ఠములనిర్దేశము | 549 |
| అగ్ర్యవిషయములసంఖ్య, దానగల్గు ప్రయోజనము | 551 |
| అగ్ర్యాధికారోక్త విషయసంగ్రహము, దాని ప్రయోజనము | 552 |
| పథ్యలక్షణము | 553 |
| పథ్యాపథ్యత్వము మాత్రా కాలాదుల నాశ్రయించి యుండుననుట | 554 |
| అగ్నివేశుడు ఆసవద్రవ్యముల నుద్దేశించి ప్రశ్న చేయుట | 555 |
| ఆసవోత్పత్తిద్రవ్యములు | 556 |
| ఆరువిధములైన ధాన్యాసవములు 6 | 557 |
| ఇరువదియారు ఫలాసవములు 26 | ,, |
| పదునొకండుమూలాసవములు 11 | ,, |
| ఇరువది సారాసవములు 20 | 553 |
| పది పుష్పాసవములు 10 | ,, |
| నాల్గు కాండాసవములు 4 | ,, |
| పత్రాసవములు రెండు 2 | ,, |
| నాల్గు త్వగాసవములు, శర్కరాసవము ఒకటి 5 | 559 |
| ఆసవసామాన్యలక్షణము | ,, |
| ఎనుబదినాల్గు విధములైన పైజెప్పబడిన యాసవములసామాన్యగుణములు | 560 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |
| **షడ్వింశాధ్యాయము.** | |
| రసాహారనిశ్చయమునకై ఋషిసమావేశము | 561 |
| రససిద్ధాంతవిషయమై పూర్వపక్షమతాంతరములు, అందు రసైకవిధత్వపక్షము | 562 |
| రసద్వైవిధ్యపక్షము | 563 |
| రసత్రైవిధ్యపక్షము | ,, |
| రసచాతుర్విధ్యపక్షము | 564 |
| రసపంచవిధత్వపక్షము | ,, |
| రసషడ్విధత్వపూర్వపక్షము | 565 |
| రససప్తవిధత్వపక్షము | ,, |
| రసాఽష్టవిధత్వపక్షము | ,, |
| రసాఽసంఖ్యేయత్వపక్షము | ,, |
| రసషడ్విధత్వసిద్ధాంతము | 566 |
| పంచరస-షడ్రసపక్షముల నిరాకరణము | 568 |
| క్షారము రసముకాదని నిరూపించుచు రససప్తవిధపక్షనిరాకరణము | 570 |
| అవ్యక్తరసపక్షనిరాకరణపూర్వక అష్టవిధత్వనిరసనము | 571 |
| రసాపరిసంఖ్యేయత్వపక్ష నిరాకరణము | 572 |
| ద్రవ్యభేదనిరూపణప్రతిజ్ఞ | 575 |
| పాంచభౌతికద్రవ్యభేదములు, గుణాదులు | ,, |
| పాంచభౌతిక ద్రవ్య ప్రత్యేకలక్షణములు, అందు పార్థివద్రవ్యలక్షణము (గుణములు)కృత్యములును | 576 |
| ఆప్యద్రవ్యలక్షణము (గుణములు) కృత్యములు | ,, |
| ఆగ్నేయద్రవ్యలక్షణము (గుణములు) కృత్యములును | 577 |
| వాయవ్యద్రవ్యలక్షణము (గుణములు) కృత్యములును | ,, |
| ఆకాశాత్మకద్రవ్యలక్షణము (గుణములు) కృత్యములు | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| సకలద్రవ్యములకు ఔషధత్వనిర్ణయము, కర్మాదులస్వరూపము | 578 |
| రసకారణములు, రససంసర్గభేదముచే గల్గువికల్పములు అరువదిమూడు | 580 |
| రసద్వయసంసర్గభేదములు పదునైదు | 581 |
| రసత్రయసంసర్గభేదము లిరువది | 582 |
| నాల్గురసముల సంసర్గముచేగల్గు ద్రవ్యభేదములు పదునైదుఅట్టిభేదముల వివరణము | 583 |
| పంచరససంసర్గభేదములారు, ఏకైకరసములారు, షడ్రససంసర్గమొకటియు | 585 |
| ద్విరస త్రిరసాదిసంసర్గముచే గల్గు రసభేదముల నరువదిమూడిటిని సులభముగ దెలియజేయుపట్టిక | 587 |
| రససంసర్గ సంఖ్యాతీతత్వనిర్ణయము | 589 |
| చికిత్సాయోగ్యమైన కల్పనాభేదనిర్ణయము | 590 |
| చికిత్సాప్రయోగోపయుక్త ద్విరసాది కల్పనావిధానము | ,, |
| రసవికల్పజ్ఞానప్రయోజనము | 591 |
| రసాఽనురసలక్షణములు | 592 |
| చికిత్సాసిద్ధ్యుపాయములైన పరాపరత్వాదిగుణములు | 593 |
| పరత్వాఽపరత్వ, యుక్తిలక్షణములు | 594 |
| సంఖ్య, యోగలక్షణములు | ,, |
| విభాగ, పరిమాణలక్షణములు | 595 |
| పరిమాణ, సంస్కార, అభ్యాసలక్షణములు | ,, |
| రసగుణములు ద్రవ్యాశ్రితములను సిద్ధాంతము | 596 |
| భిన్నాభిప్రాయములయం దర్థనిర్ణయనియమము | 597 |
| రసషడ్విధత్వవిభాగవివరణము | 593 |
| రసోత్పత్తికి తొల్లింటికారణము | 599 |

| విషయము. | పుట. |
|---|---|
| షడ్రసోత్పత్తికి వేరువేరుగ విశేషకారణములు | 600 |
| రసషడ్విధత్వమును దృష్టాంతపూర్వకముగ నిర్ణయించుట | 601 |
| అగ్నివాయ్వాత్మకద్రవ్యస్వరూపము | 603 |
| పృథివీజలాత్మకద్రవ్యస్వరూపము | 604 |
| వ్యామిశ్రద్రవ్యస్వరూపము | ,, |
| షడ్రసములకు గుణకర్మనిరూపణము | 605 |
| మధురరసకృత్యములు, గుణములును | ,, |
| మధురరసము నధికముగ నుపయోగించుటచే గల్గురోగములు | 606 |
| అమ్లరసకృత్యములు, గుణములును | 607 |
| అమ్లరసము నధికముగ నుపయోగించుటచే గల్గురోగములు | ,, |
| లవణరసకృత్యములు, గుణములును | 608 |
| లవణరసము నధికముగ నుపయోగించుటచే గల్గురోగములు | 609 |
| కటురసకృత్యములు, గుణములును | ,, |
| కటురసాతిమాత్రోపయోగమున గల్గురోగములు | 610 |
| తిక్తరసకృత్యములు, గుణములు | 611 |
| తిక్తరసము నధికముగ నుపయోగించుటచే గల్గురోగములు | 612 |
| కషాయరసకృత్యములు, గుణములును | ,, |
| కషాయరసము నధికముగ నుపయోగించుటచే గల్గురోగములు | 613 |
| షడ్రసములగుణ-అవగుణములు మాత్రాధీనములనుట | ,, |
| ఉష్ణశీతద్వివిధవీర్యనిర్ణయము | 614 |
| రసమూలకముగ ద్రవ్యగుణనిర్దేశమున విశేషవిధి | ,, |
| రసాదివైపరీత్యమున గుణనిర్దేశనిర్ణయము | 615 |

| విషయము | పుట. |
|---|---|
| కొన్నిద్రవ్యములలో రసమునకు విరుద్ధ గుణములు | 616 |
| రసములకు నిర్ణీతములైనగుణములకు రస భేదముచే తారతమ్యము | 617 |
| గుణతారతమ్యమున మతాంతరము | ,, |
| త్రివిధవిపాకలక్షణములు | 618 |
| విపాకముల ప్రత్యేకలక్షణములు | 619 |
| విపాకకృత్యములు, స్వరూపలక్షణము | ,, |
| ద్రవ్యగుణతారతమ్యముచేత విపాక తారతమ్యము | 620 |
| మధురాదిరసములకుఉత్పత్తికారణాదుల సులభముగ దెల్పుపట్టిక. | 621 |
| అష్టవిధ, ద్వివిధవీర్యపక్షములు, (పారి భాషికవీర్యము) | 622 |
| రస-విపాక-వీర్యములపరిజ్ఞానము | 624 |
| ప్రభావలక్షణము | 625 |
| ప్రభావమున కుదాహరణములు | 626 |
| మణులయందలిప్రభావము | ,, |
| రసాదులకు ప్రత్యేకకార్యకర్తృత్వము | 627 |
| రసాదులకు నైసర్గికశక్తి | ,, |
| రసలక్షణములు,అందు మధురరసలక్షణం | 628 |
| అమ్లరసలక్షణము | 629 |
| లవణరసలక్షణము | ,, |
| కటురసలక్షణము | ,, |
| తిక్తరసలక్షణము | ,, |
| కషాయరసలక్షణము | 630 |
| విరుద్ధాహారవిషయజిజ్ఞాసాప్రశ్నము | ,, |
| విరుద్ధద్రవ్యలక్షణము, అట్టిద్రవ్యముల నిర్దేశము | 631 |
| విరుద్ధద్రవ్యముల కుదాహరణము, అందు గుణవిరుద్ధద్రవ్యోదాహరణము | 632 |
| విరుద్ధగుణములలో మతాంతరము | 633 |
| గుణవిరుద్ధములలో విశేషవిధి | 634 |

| విషయము. | పుట. |
|---|---|
| మరికొన్ని విరుద్ధద్రవ్యములు | 634 |
| సంయోగవిరుద్ధములు | 636 |
| సంస్కారవిరుద్ధములు | 637 |
| దేశవిరుద్ధము | 633 |
| మరికొన్నివిరుద్ధములు | ,, |
| సంస్కారవిరుద్ధము, శరీరవిరుద్ధము | ,, |
| ప్రమాణ, కాలవిరుద్ధములు | 639 |
| అనుక్తవైరోధికద్రవ్యసంగ్రహము | ,, |
| ఉక్త-అనుక్తవైరోధిక ద్రవ్యనిర్దేశము | 640 |
| దేశముచే విరుద్ధము | ,, |
| కాలముచే విరుద్ధములు | 641 |
| అగ్నిచేవిరుద్ధము, మాత్రావిరుద్ధంబును | ,, |
| సాత్మ్యముచే విరుద్ధము | ,, |
| సంస్కారముచే విరుద్ధము | 642 |
| వీర్యముచే విరుద్ధము | ,, |
| కోష్ఠవిరుద్ధము | ,, |
| అవస్థావిరుద్ధము | ,, |
| క్రమవిరుద్ధము | 643 |
| పరిహారవిరుద్ధము | ,, |
| పాకవిరుద్ధము | ,, |
| సంయోగవిరుద్ధము, హృద్విరుద్ధంబును | 644 |
| సంపద్విరుద్ధము | ,, |
| విధివిరుద్ధము | ,, |
| విరుద్ధాహారాభ్యనుజ్ఞ | ,, |
| విరుద్ధాహారముచే గల్గు రోగములు | 645 |
| విరుద్ధాహారముచే గల్గు రోగములకు ప్రతీకారము | ,, |
| ఉక్తచికిత్సానువాదము | 647 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |


సప్తవింశాధ్యాయము.


| | |
|---|---|
| అన్నపానస్వరూపము, వానిసామాన్య కృత్యములు | 649 |
| అన్నపానవిధి | 650 |

| విషయము. | పుట. |
| --- | --- |
| అన్నాద్యాహారముల ప్రధానకృత్యములు | 652 |
| ధాన్యాదివర్గవిభాగము | 653 |
| (౧) శూకధాన్యవర్గము, అందు రక్తశాల్యాదిభేదములు వానిగుణములు | 654 |
| రక్తశాల్యాదులలో గుణతారతమ్యము | 655 |
| యవకాది ధాన్యగుణములు | 656 |
| షష్టికాది ధాన్యభేదములు; వానిగుణములు | ,, |
| వ్రీహి, పాటలధాన్యగుణములు | 657 |
| ఆళ్లు, చామలు, వీనిగుణములు | ,, |
| తృణధాన్యగుణములు | ,, |
| యవలగుణము | 658 |
| వేణుయవలగుణము | ,, |
| గోధుమములగుణములు | 659 |
| (౨) శమీధాన్యవర్గము, అందు పెసలగుణములు | 660 |
| ఉద్దులగుణము | 661 |
| అలచందులగుణము | ,, |
| ఉలవలగుణము | 662 |
| అడవిపెసలగుణము | ,, |
| సెనగలు బటాణుల గుణములు | ,, |
| నువ్వులగుణములు | 663 |
| శింబీధాన్యసామాన్యగుణములు | 664 |
| కందులు మున్నగువానిగుణము | ,, |
| శాకాణ్డాదిగుణములు | 665 |
| జంతువులలో ప్రసహములు | ,, |
| భూమిశయములు | 666 |
| అనూపమృగములు | ,, |
| వారిశయము (జలజంతువు)లు | 667 |
| వారిచరములు | ,, |
| జాంగలమృగములు | 668 |
| లావాదివిష్కిరగణము | 669 |
| వర్తకాది విష్కిరగణము | 669 |
| ప్రతుదపక్షిగణము | ,, |
| ప్రసహాదిసంజ్ఞానిర్వచనము | 670 |
| ప్రసహాదిజంతువులమాంసగుణము | 671 |
| మాంసమునుతిను ప్రసహముల మాంసోపయోగము | 672 |
| లావాదివిష్కిర-ప్రతుద-జాంగలమాంసగుణములు | ,, |
| వర్తకాదివిష్కిరమాంసగుణము | ,, |
| మేకలమాంసగుణము | ,, |
| చిలుకకూరగుణము | 681 |
| కరివేపాకుగుణము | ,, |
| పులిచింతాకుగుణము | ,, |
| దుంపబచ్చలిగుణము | ,, |
| చిట్టికూరగుణము | 682 |
| పల్లారాకు మున్నగుశాకములగుణము | ,, |
| సూప్యశాకాదిగుణములు | ,, |
| శణపుష్పాదిశాకగుణము | 683 |
| వటపల్లవాదిశాకగుణము | 684 |
| తిప్పతీగెమున్నగువానిశాకగుణములు | ,, |
| లాంగలక్యాదిశాకగుణములు | ,, |
| కుసుంభశాకగుణము | ,, |
| దోసకూరగుణము | 685 |
| పండినదోసకాయగుణము | ,, |
| సొరకాయగుణము | ,, |
| బుడమ - పెద్దదోసకాయలగుణము | ,, |
| బూడిదెగుమ్మడికాయగుణము | ,, |
| కేలూటాదిగుణములు | 686 |
| కలువలు మున్నగువానిగుణములు | ,, |
| కలువగడ్డలు మున్నగువానిగుణములు | ,, |
| కలువకాడలు మున్నగువానిగుణములు | 687 |
| తామరగింజలగుణము | ,, |
| ముంజాతగుణము | ,, |


SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE TIRUPATI. 22059

| విషయము. | పుట. |
|---|---|
| నేలగుమ్మడుగడ్డ గుణము | 687 |
| అమ్లికాశాక గుణము | ,, |
| అవకూరపెండలము, వీనిగుణములు | 688 |
| పుట్టకొక్కుల గుణము | ,, |
| శాక వర్గసమాప్తి | ,, |
| ఫలవర్గము. | |
| ద్రాక్షపండ్ల గుణము | 689 |
| ఖర్జూరపుపండు గుణము | ,, |
| అత్తిపండు గుణము | ,, |
| ఇప్ప ఈతపండ్లగుణము | 690 |
| అంబాళపుపండుగుణము | ,, |
| తాటిపండు టెంకాయలగుణములు | ,, |
| భవ్యఫలగుణము | ,, |
| పరూషకాదిగుణములు | 691 |
| తియ్యనిగజనిమ్మపండుగుణము | ,, |
| ఈడెపండుగుణము | ,, |
| కాశ్మర్యఫలగుణము | 692 |
| టంకఫలగుణము | ,, |
| వెలగపండుగుణము | ,, |
| బిల్వఫలగుణము | ,, |
| మామిడికాయ, పండుగుణములు | 693 |
| నేరేడుపండుగుణము | ,, |
| రేగుపండుగుణము | ,, |
| సించితికాఫలగుణము | ,, |
| నాగబలాదిఫలముల గుణము | ,, |
| పనస - అరటి - మొరళిపండ్లగుణము | 694 |
| లవలీఫల గుణము | ,, |
| నీపాదిఫల గుణము | ,, |
| ఇంగుదఫల గుణము | 695 |
| తుమికిపండ్ల గుణము | ,, |
| ఉసిరికపండ్ల గుణము | ,, |
| తాండ్రకాయల గుణము | ,, |
| దానిమ్మపండు గుణము | ,, |
| చింతపండు గుణము | 696 |
| అమ్లవేతస గుణము | 697 |
| మాదీఫలముల గుణము | ,, |
| కర్చూరఫలగుణము | ,, |
| నారింజపండుగుణము | ,, |
| బాదము పప్పుమున్నగువానిగుణములు | 698 |
| చారపప్పుగుణము | ,, |
| విరిగిపండుగుణము | ,, |
| ఊడుగపండుగుణము | ,, |
| శమీ-కారంజఫలములగుణములు | 699 |
| ఆమ్రాతకాదిఫలగుణములు | ,, |
| వార్తాకాదిఫలగుణములు | ,, |
| జీడిగింజలు-పండు వీనిగుణము | 700 |
| (౬) హరితవర్గము. | |
| అల్లపు గుణము | ,, |
| నిమ్మకాయ గుణము | 701 |
| ముల్లంగి గుణము | ,, |
| తులసి (గగ్గెర) గుణము | ,, |
| యవాన్యాదిగుణము | 702 |
| గండీరాదిగుణము | ,, |
| గంధతృణము, నల్లజీలకర, వీనిగుణములు | ,, |
| ధాన్యకాదిగుణము | 703 |
| గృంజన గుణము | ,, |
| నీరుల్లి గుణము | ,, |
| వెల్లుల్లి గుణము | ,, |
| శుష్కహరితవర్గగుణములు | 704 |
| (౭) మద్య వర్గము. | |
| మద్యసామాన్యగుణములు | ,, |
| సుర, మదిరయను మద్యములగుణములు | 705 |
| జగల గుణము | ,, |
| అరిష్ట గుణము | ,, |
| శర్కరామద్య గుణము | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| పక్వరసమద్య గుణము | 706 |
| శీతరసమద్య గుణము | ,, |
| గౌడమద్య గుణము | ,, |
| తాండ్రకాయలమద్యగుణము | 707 |
| సురాసవగుణము | ,, |
| మధ్వాసవ, మైరేయములగుణములు | ,, |
| ధాతక్యాదిమద్యగుణములు | ,, |
| మార్ద్వీకాసవ గుణము | ,, |
| యవలచేసైన సురాగుణము | 708 |
| సౌవీరక, తుషోదకగుణములు | ,, |
| అమ్లకాంజిక గుణము | ,, |
| నవీన-పురాణమద్యములగుణములు | 709 |
| విధ్యుక్తముగ సేవింపబడిన మద్యసామాన్య గుణములు | ,, |
| మద్యవర్గ సమాప్తి | ,, |
| (౮) జలవర్గము | |
| జలభేదకారణము | ,, |
| జలమునకు దేశకాలములసంబంధము | 710 |
| దివ్యోదక (ఆకాశోదక) గుణములు | 711 |
| జలమునకు భూవిశేషమున గల్గుగుణములు | ,, |
| ఐంద్ర-కార-హిమజలగుణము | 712 |
| ఐంద్రజలము, దానియుత్కృష్టత | ,, |
| పాసార్హ జలము | ,, |
| వర్షర్తుజలగుణము | ,, |
| శరత్కాలవర్ష జలగుణము | 713 |
| హేమంత-శిశిరఋతువులజలగుణములు | ,, |
| వసంత - గ్రీష్మఋతువులజలగుణములు | ,, |
| విభ్రాంతకాలమునందలి జలగుణము | ,, |
| శరత్కాల వర్షోదకప్రాశస్త్యము | 714 |
| హిమాలయమునందలి నదుల జలగుణము | ,, |
| మలయపర్వతనదీజలగుణము | ,, |
| పశ్చిమాభిముఖప్రాఙ్ముఖనదీజలగుణములు | 715 |
| పారియాత్రాదిపర్వతనదీజలగుణము | 715 |
| వర్షాజలవహానదీజలగుణము | 716 |
| వాపీకూపాదిజలగుణములు | ,, |
| అగ్రాహ్య జలము | 717 |
| జలవర్గ సమాప్తి | 718 |
| (౯) క్షీరవర్గము | ,, |
| ఆవుపాల గుణములు | ,, |
| బఱ్ఱెపాల గుణము | 719 |
| ఒంటెపాల గుణము | 720 |
| ఏకశఫముల (గుఱ్ఱముమున్నగువాని) పాలగుణము | ,, |
| మేకపాలగుణము | 721 |
| గొఱియలయొక్కయుం, ఏనుగులయొక్కయుం పాలగుణములు | ,, |
| చనుబాలగుణము | ,, |
| పెరుగుగుణము | ,, |
| పెరుగు నుపయోగింపదగినవిషయములు | 722 |
| పెరుగు నుపయోగింపకూడని సమయములు | ,, |
| మస్తక-జాత-సర-మండముల గుణములు | 723 |
| తక్రగుణములు | ,, |
| నవనీతగుణము | ,, |
| ప్రాతనెయ్యిగుణము | 724 |
| మేకలుమున్నగువాని నేతిగుణములు | 725 |
| పీయూష-మోరట-కిలాటగుణములు | ,, |
| తక్రపిండక (జున్ను) గుణము | 726 |
| క్షీరవర్గ సమాప్తి | ,, |
| (౧౦) ఇక్షువర్గము | 727 |
| ఇక్షురసగుణము | ,, |
| పౌండ్రక-వాంశికేక్షుగుణములు | ,, |
| బెల్లపుసామాన్యగుణములు | 728 |
| క్షుద్రగుడాదిగుణములు | ,, |
| మత్స్యండికాదిగుణములు | ,, |

| విషయము. | పుట. |
|---|---|
| శర్కరా భేదములగుణములు | 729 |
| తేనెజాతిలో నాల్గుభేదములు | ,, |
| మాక్షికాదిమధుభేదములవర్ణములు | 730 |
| తేనె గుణములు | ,, |
| తేనెకు ఉష్ణసంబంధనిషేధము | 731 |
| తేనెను స్వల్పముగ నుపయోగించుటహిత మనుట | 732 |
| తేనె యజీర్ణమైనచో కష్టతమమనుట | ,, |
| తేనెకు యోగవాహిత్వము | ,, |
| ఇక్షువర్గసమాపనము | 733 |
| (౧౧) కృతాన్న వర్గము | ,, |
| పేయా గుణము | 734 |
| విలేపి గుణము | ,, |
| మండ గుణము | ,, |
| లాజపేయ, లాజమండగుణములు | 735 |
| సంస్కరింపబడిన లాజమండగుణము | ,, |
| సంస్కరింపబడిన మండము | 736 |
| ఓదన గుణములు | ,, |
| మాంసశాకాదుల జేర్చి సిద్ధము చేయ బడిన యన్నముగుణము | 737 |
| మాషాదుల చేర్చి పక్వమైన యన్నము గుణము | ,, |
| కుల్మాషగుణము | ,, |
| స్విన్నభక్ష్యములగుణములు | 738 |
| అకృతకృతయూషాదిగుణతారతమ్యము | ,, |
| సత్తుపిండి (పేలపిండి) గుణములు | 739 |
| వరిపేలపిండిగుణము | ,, |
| యవాపూప-యావకవాట్యగుణములు | 740 |
| వేపుడుబియ్యపుగుణము | ,, |
| కొన్ని భక్ష్యవిశేషములగుణములు | ,, |
| ఫలాదిసంస్కృతభక్ష్యముల గుణవిశేషములు | 741 |

| విషయము. | పుట. |
|---|---|
| వేశవారము, పాలపోళీలు మున్నగువాని గుణములు | 741 |
| కొన్ని భక్ష్యవిశేషముల గుణనిర్ణయము | 742 |
| అటుకులగుణములు | ,, |
| సూప్యాదిభక్ష్యవిశేషములగుణములు | 743 |
| మృదుపక్వ - స్థూల - కఠినభక్ష్యముల గుణములు | ,, |
| అనుక్తభక్ష్యముల గుణనిర్ణయము | ,, |
| విమర్దక (భక్ష్యవిశేష) గుణము | 744 |
| రసాలగుణము | ,, |
| బెల్లముకలిపిన పెరుగుగుణము | ,, |
| ద్రాక్ష, ఖర్జూరపుపండు మున్నగువాని పానకములగుణములు | ,, |
| రాగ - షాడబములగుణము | 745 |
| మామిడిపండ్లు మున్నగువానిలేహముల గుణములు | ,, |
| అనుక్తలేహముల గుణకర్మములనిర్ణయము | 746 |
| శుక్త - ఆసుతగుణములు | ,, |
| శాండాకీగుణములు | ,, |
| కృతాన్నవర్గసమాప్తి | 747 |
| (౧౨)ఆహారయోగివర్గము | 748 |
| నువ్వులనూనెగుణములు | ,, |
| ఆముదపుగుణము | 749 |
| ఆవనూనెగుణము | ,, |
| చారపప్పునూనెగుణము | ,, |
| అగసినూనెగుణము | ,, |
| కుసుమలనూనెగుణము | ,, |
| అనుక్తతైలముల గుణకర్మ నిర్ణయము | 750 |
| మజ్జవసలగుణములు | ,, |
| శుంఠిగుణము | 751 |
| పిప్పలిగుణము | ,, |
| మిరియాలగుణము | ,, |

విషయము. పుట.
ఇంగువగుణము 752
సైంధవలవణగుణము „
సౌవర్చలలవణగుణము „
బిడాలవణగుణము „
ఔద్భిదలవణగుణము 753
కృష్ణలవణగుణము „
సాముద్ర-కాచలవణములగుణములు „
సర్వలవణసామాన్యగుణములు „
యవక్షారగుణము „
సర్వక్షార సామాన్యగుణములు 754
జీలకఱ్ఱ మున్నగువానిగుణములు „
ఆహారయోగివర్గ సమాప్తి „
ధాన్యవిశేషగుణము 755
నిషిద్ధమాంసము 756
మాంసరస సేవనగుణములు „
వర్జింపవలసిన శాకములు 757
వర్జనీయఫలములు „
హారితశాకగుణవిశేషము 758
మద్యాదివర్గముల గుణదోషనిర్ణయము „
అనుపాన సామాన్యగుణము 759
ఆసవాది పేయాపేయ నిర్ణయము „
దోషాది విశేషానుసారముగ ననుపాన విశేషములు 760
అనుపానకృత్యములు „
ఉక్తార్థానువాదము 761
జలానుపాననిషేధవిషయములు „
అనుక్తాన్నపానగుణాదినిర్ణయోపాయము 762
అనుక్తాన్నపానగుణనిర్ణయమున కుపాయాంతరము 763
చరవివరణము,తదనుసారముగ ద్రవ్యగుణ నిర్దేశము „

విషయము. పుట.
శరీరావయవములు, వాని విశేషముచే గురుత్వతారతమ్యము 764
మరికొన్ని యవయవములగుణవిశేషము „
స్వభావసిద్ధమైనగుణమును నిర్ణయించుట „
ధాతు, క్రియ, అనునీరెండిటినిబట్టి గుణ నిర్దేశము 765
లింగమునుబట్టి గురులాఘవనిర్ణయము „
జంతువులపరిమాణమును బట్టి గురులాఘవ నిర్ణయము 766
సంస్కారముచే గురులాఘవనిర్ణయము „
మాత్రచే గురులాఘవనిర్ణయము „
అగ్నిబలానుసారముగ మాత్రానిర్ణయము 767
బలారోగ్యాదులకు అన్నపానములును, అగ్నియు నాధారమనుట. „
గురులాఘవపరిజ్ఞానవిషయము 768
హితాహారసేవనక్రమము, దాన గల్గు ఫలము „
హితభోజనముచే నూరువత్సరములు ఆయువు గల్గుననుట 769
అధ్యాయవిషయసంగ్రహము „
ఆహారద్రవ్యపరీక్షావశ్యకత 770

## అష్టావింశాధ్యాయము.

ఆహారముచే శరీరధారణక్రమము 771
ఆహారరసముచే శరీరపోషణక్రమము 773
రసాదిధాతుపోషణ క్రమము 774
ఆరోగ్య-అనారోగ్యములకు నాహారము కారణమనుట. 775
ఆరోగ్యానారోగ్యవిషయమై యగ్నివేశుని ప్రశ్నము 776
హితాహారోపయోగము చేయువారికిని రోగములుకల్గుటకు కారణవిశేషములు „
అహితాహారము జేసినను రోగోత్పత్తి లేని కారణములు 777

| విషయము. | పుట. |
|---|---|
| రసాదిదుష్టిచే గల్గురోగములవివరణము | 779 |
| రసదుష్టిచే గల్గురోగములు | 780 |
| రక్తదుష్టిచే గల్గురోగములు | ,, |
| మాంసదుష్టిచే గల్గురోగములు | 781 |
| మేదోదుష్టిచే గల్గురోగములు | ,, |
| అస్థిదుష్టిచే గల్గురోగములు | 782 |
| మజ్జదోషమున గల్గురోగములు | ,, |
| శుక్రదుష్టిచే గల్గురోగములు | ,, |
| ఇంద్రియదుష్టిచే గల్గురోగములు | 783 |
| స్నాయ్వాదిదుష్టిచే గల్గురోగములు | ,, |
| దోషములు మలములజేరినపుడు గల్గురోగములు | ,, |
| రసజాదిరోగములు కల్గుటకు కారణములు, కల్గకుండునుపాయములు | ,, |
| రస-రక్త-మాంస-మజ్జాజన్యరోగములకు చికిత్స | 784 |
| అస్థిజన్యరోగముల చికిత్స | ,, |
| మజ్జ-శుక్రముల బుట్టిన రోగముల చికిత్స | 785 |
| ఇంద్రియజ-స్నాయ్వాదిజ రోగముల చికిత్స | ,, |
| మలమూత్రాదిజరోగముల చికిత్సాసంగ్రహము | ,, |
| దోషములు రసరక్తాదిశాఖల జేరువిధము | ,, |
| శాఖలజేరినదోషముల కోష్ఠమునజేర్చు నుపాయము | 786 |
| సకలరోగచికిత్సాసంగ్రహము | ,, |
| అహితసేవనమునకు ప్రజ్ఞాపరాధము కారణమనుట | 787 |
| రాగ-అజ్ఞానములను అవలంబించి యహితాహారమును జేయదగదనుట | 788 |
| ఆహారవిధివిశేషకారణము లెనిమిది | ,, |
| అపథ్యనివృత్తిచే గల్గుముఖ్యఫలము | 789 |
| అధ్యాయవిషయసంగ్రహము | 790 |


## ఊనత్రింశాధ్యాయము.


| విషయము. | పుట. |
|---|---|
| పదిప్రాణాయతనములవివరణము | 791 |
| ద్వివిధవైద్యులు | 792 |
| అగ్నివేశుల ప్రశ్నము | ,, |
| ప్రాణాభిసరసామాన్యలక్షణము | 793 |
| ప్రాణాభిసరవిశేషలక్షణము (సూత్రస్థానవిషయసంగ్రహము | ,, |
| రోగాభిసరసామాన్యలక్షణములు | 798 |
| రోగాభిసర (కువైద్య) విశేషలక్షణములు | ,, |
| కుత్సితవైద్యనిరసనము | 800 |
| విద్వద్వైద్యస్తుతి | ,, |
| అధ్యాయవిషయసంగ్రహము | 801 |


## త్రింశాధ్యాయము.


| విషయము. | పుట. |
|---|---|
| హృదయాశ్రితములైనపదినాడులు | 802 |
| హృదయమునాశ్రయించినపదార్థము | ,, |
| పైజెప్పినషడంగములకు హృదయమాశ్రయమనుట | ,, |
| హృదయాశ్రితవిశేషములు | 803 |
| ధమనులు, ఓజోగుణములును | ,, |
| హృదయ-ధమనీ-ఓజస్సుల కాపాడు నుపాయములు | 805 |
| ప్రాణవర్ధనాదులలో నుత్కృష్టతమపరిగణనము | ,, |
| ఆయుర్వేదనిరుక్తి, అథర్వణవేదాన్తర్గతత్వనిర్ణయము | 807 |
| సుఖ-అసుఖ, హిత-అహిత, ఆయుస్స్వరూపము | 808 |
| ఆయువునకు ప్రమాణ-అప్రమాణనిర్ణయము | 810 |
| ఆయుర్వేదనిత్యత్వము | 811 |
| ఆయుర్వేదాష్టాంగములు | 814 |
| ఆయుర్వేదాధ్యయనమున కర్హులు | 816 |

| విషయము. | పుట. |
|---|---|
| అయుర్వేదాధ్యయనముచే గల్గు త్రివర్గరూపఫలము | 816 |
| తంత్రము మున్నగువాని నుద్దేశించిన యెనిమిది ప్రశ్నములు. | 817 |
| తంత్రస్వరూపము | 818 |
| స్థానవివరణము | 819 |
| స్థానములకు వేరువేరుగ నధ్యాయసంఖ్యానియమము | ,, |
| ఉక్తార్థానువాదము | ,, |
| సూత్రస్థానమున ముప్పదియధ్యాయములు, వాని నామభేదములు | 820 |
| చతుష్కములవివరణము | 821 |
| శ్లోకస్థానపదనిర్వచనము | 822 |
| నిదానస్థానమునందలి యధ్యాయములు (ఎనిమిది) | ,, |
| విమానస్థానాధ్యాయము లెనిమిది, వాని నామములు | ,, |
| శారీరస్థానమునందలి యధ్యాయములు ఎనిమిది, వానినామభేదములును | 823 |
| ఇంద్రియస్థానమునందలి యధ్యాయములు పండ్రెండు, వానినామములును | 823 |
| చికిత్సాస్థానమున ముప్పదియధ్యాయములు, వానివివరణము | 824 |
| కల్పస్థానమునందలి పండ్రెండధ్యాయములవివరణము | 825 |
| సిద్ధిస్థానమునందలి పండ్రెండధ్యాయములవివరణము | 826 |
| తంత్రార్థ-అధ్యాయార్థనిరూపణము | ,, |
| ప్రశ్న-ప్రశ్నార్థములవివరణము | 827 |
| తంత్ర-స్థాన-అధ్యాయపదనిర్వచనము | ,, |
| వైద్యపరీక్షావశ్యకత | 829 |
| అసద్వైద్య, సద్వైద్యనిర్ణయము | ,, |
| అసద్వైద్యనిరసనము, సద్వైద్యాశ్రయము | 830 |
| ఈతంత్రాధ్యయనమున గల్గుముఖ్యప్రయోజనము | 831 |
| అధ్యాయవిషయసంగ్రహము | ,, |

శ్రీ ర స్తు.

# చరకసంహిత

## ఆంధ్రవ్యాఖ్యానసహితము.

# సూత్రస్థానము

## (భేషజచతుష్కము.)

## ప్రథమాధ్యాయము.

మూలము. అథాతో దీర్ఘం జీవితీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

### వ్యాఖ్యానప్రారంభము.

జగదిదమన్తర్లీనం వ్యాకృత్యానుప్రవిశ్య బహుధా చ,
యో మోదతే నిరన్తరమీశమనీశం సదా హృదా కలయే.
యోగేన చైత్తమనుశాసనతోఽపి శబ్దజాలస్య వాచికమనుత్తమవైద్యకస్య
తన్త్రేణ కాయికమపి త్రివిధం చ దోషం యోఽపాకరోద్భువి పతఞ్జలిమానతస్తమ్.
బ్రహ్మాణం దక్షమహం బలసూదనమశ్వినౌ భరద్వాజమ్,
నత్వాయుర్వేదీయా నాచార్యాన్ వ్యాకరోమి చరకం చ.
గైర్వాణ్యా బహుభిరియం వ్యాఖ్యాతా చరకసంహితా పూర్వైః,
ఆంధ్రీ కౌముద్యాఖ్యా వ్యాఖ్యా క్రియతేఽద్య చరకస్య.
స ఏవ పూర్ణాం చరకస్య కౌముదీం వ్యాఖ్యాం తనోత్వార్యజనోపయోగ్యాం,
న విశ్వనాథో లఘుధీరయం తు విమోహమాయాన్తి చ యత్ర యోగినః.

అవతరణిక:—పరమకారుణికుండును, బ్రహ్మాదికీటపర్యంతమైన జంతుజాలముల సృష్టికి ప్రధానకారణభూతుండును నగునాద్యాదిదేవునిసృష్టికి లోనగు మానవకోటికి

నభిలషితములైన ధర్మార్థకామమోక్షరూపములగు నాలుగుపురుషార్థములకును ముఖ్యసాధనము శరీరము. ఈయర్థమునే "శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్" అను నభియుక్తోక్తి బోధించుచున్నయది. అట్టి ముఖ్యసాధనమైనశరీరము జ్వరాదిరోగపరిభూతమైనచో పురుషార్థసాధనకృత్యములు జేయవలనుపడదు. దానంజేసి పురుషార్థములకు హాని సంభవించును. కావున నట్టిరోగాదుల రానీయక చేసికొనుటకును, పొరపాటుచే నొకవేళ నయ్యవి సంభవించినను వానిని నివర్తిపరచుటకును దగిన సాధనము నరయుట ముఖ్య కర్తవ్యము. అట్టి యారోగ్యమును కాపాడికొనువిధానమును దెల్పునది యాయుర్వేదము. అయ్యది బ్రహ్మ మున్నగుపరమప్రాచీనులచే సవిస్తరముగ విరచితమై బోధింపబడి ఋషిపరంపరావగతమై వెలయుచున్నది. ఐనను అయ్యవి మిగుల విస్తృతములగుటం జేసి విశాలబుద్ధులును, త్రికాలజ్ఞానవేత్తలును, తపోబలప్రాప్తాపరిమితాయుష్కులును నగు మునులకు మాత్రము వేద్యములైయుండును. మానవులకు యుగధర్మానుసారముగ నాయుర్బుద్ధిబలములు నానాట తగ్గుచుండును. కావున నత్యల్పాయుఃపరిమాణంబును, అల్పబుద్ధివైశద్యంబును కలమానవులకు అట్టి తంత్రములయందలి నిష్కృష్టార్థముల జక్కగ నరయుట దుస్సాధము. చక్కగ గోచరము కానినాడు అందు చెప్పబడిన విధానముల నాచరింప వలనుపడదు. దానంజేసి రోగములు శరీరమునకు హాని గల్గింప జూచుచునే యుండును.

అట్టిలోపమును దొలగింపజూచి పరమకారుణికుండును, త్రికాలజ్ఞానవేత్తయు నగు నగ్నివేశుడనుమహర్షి అతి విస్తృతములును, నిగూఢాశయములును, మిక్కిలి జ్ఞానగరిమచే చిరకాలవేద్యములు నగు ప్రాచీనాయుర్వేదతంత్రములను సంగ్రహించి, పరిమితాయుష్కులును, అత్యల్పమేధావంతులును నగుమానవులకు సుబోధముగ నుండునట్లు కాయచికిత్సాప్రధానమైన యీయాయుర్వేదతంత్రమును రచియించెను.

అట్టి యీతంత్రము శ్లోక (సూత్ర)-నిదాన-విమాన-శారీర-ఇన్ద్రియ-చికిత్సిత-కల్ప - సిద్ధిస్థానములను నెనిమిదిప్రకరణములఁ గూడియుండును. అందు శ్లోకస్థానమున చతుర్విధపురుషార్థములకు సాధనములు సంగ్రహముగ నీయధ్యాయమున జెప్పబడును. కావున సూత్రస్థానము ప్రధానమై యీతంత్రమునకు శిరంబును బోలియుండును. దానం జేసియే తక్కినస్థానములకన్న తొలుదొలుత నీయధ్యాయము చెప్పబడినది. శ్లోకస్థానమునకు ప్రాధాన్యము ఈతంత్రముననే యిట్లుపదేశింపబడెను.—"శ్లోకస్థానం సముద్దిష్టం తంత్రస్యాస్య శిరః శుభమ్, చతుర్ణాం మహదర్థానాం స్థానేఽస్మిన్ సంగ్రహః కృతః"

అట్టి శ్లోకస్థానమునందును నిఖిలతంత్రబీజభూతములగు హేతు-లింగ-ఔషధార్థములను దెల్పునట్టి దీర్ఘంజీవితీయమను నీయధ్యాయము తొలుత జెప్పబడెను.

ఏగ్రంథము నుపక్రమించినను తొలుత హేతు-ప్రయోజన-అభిధేయ-సంబంధములను నీనాల్గు అనుబంధములను జెల్పినగాని శ్రోతలకు గ్రంథమునం దభిరుచి కల్గదు. కావున అట్టి అనుబంధచతుష్టయము నీయధ్యాయమారంభమున దెల్పుచు ప్రతిజ్ఞారూపమైన యీసూత్రము తొలుత చెప్పబడెను. అయ్యది 'అథాతో దీర్ఘం జీవితీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః, ఇతి హ స్మాహ భగవానాత్రేయః''అను నీసూత్రము.

వ్యా. అథ—బ్రహ్మాదిప్రణీతములగు తంత్రములు అతివిస్తృతము లగుటచే స్వల్పబుద్ధులగు మనుజసామాన్యులకు దురవగాహమని నిశ్చయించినపిదప, అతః—ఆయుర్వేదార్థనిర్ణయము స్వల్పబుద్ధుల కలవడకుండుతరి అనారోగ్యముచే పురుషార్థములకు హాని కల్గునను కారణమువలన, దీర్ఘం జీవితీయం అధ్యాయం—ప్రారంభమున ''దీర్ఘం జీవితం'' అను పదముకల్గి అట్టిపదమే అధికారముగ గల్గిన యధ్యాయమును, వ్యాఖ్యాస్యామః—వివరించి నిర్ణయముగ చెప్పెదను. ఇతి హ—ఈక్రింద నేను వివరించుప్రకారమే, భగవాన్—ఉత్పత్తివినాశాదిత్రికాలజ్ఞానసంపన్నుడును, సమస్తైశ్వర్యమాహాత్మ్యాదియుక్తుడును నగు, ఆత్రేయః— (అత్రిపుత్రుడగు) ఆత్రేయమహర్షి, ఆహ స్మ—చెప్పెను. (ఇది సూత్రప్రతిపదార్థము.)

లోకమున మనుజులు అత్యల్పబుద్ధులగుటచే బ్రహ్మాదు లతిగంభీరార్థముతో నతివిపులముగ జెప్పియుండు నాయుర్వేదతంత్రముల సాకల్యముగ నెరుంగ నవకాశము లేమింజేసి యనారోగ్యమునకు గురియగుదురని తలంచి, అట్టి యనారోగ్య పరిభూతులై పురుషార్థచతుష్టయమున గల్గు భాగ్యమునకు దూరస్థులగుదురనే కారణము నెంచి, అట్టిలోపమును తొలగింప దీర్ఘం జీవితశబ్దము తొలుతగల యీయధ్యాయముతోగూడిన యీ యాయుర్వేదతంత్రమును (అల్పబుద్ధులకును సుఖబోధమై నాతివిస్తృతముగను ఆరోగ్యసంపాదకముగను) వివరించెద.

నాచే రచియింపబడు నీతంత్రమునందలి విషయములనే త్రికాలజ్ఞానసంపన్నుడగు నత్రిపుత్రుడైన యాత్రేయమహర్షి యుపదేశించియుండెను. (ఈగ్రంథమున వివరింపబడు విషయములెల్ల దివ్యజ్ఞానియగు నాత్రేయమహర్షిచే నుపదేశింపబడినవి కాని నాస్వకపోలకల్పితము లించుకేనియు లేవని భావము.) దీనిచేత నీగ్రంథమునకు పరమప్రామాణికత సూచింపఁబడినది.

ఇచ్చట 'అథ' అనుపదము ఆనంతర్యమును సూచించినను గ్రంథారంభముల మంగళార్థముగ చెప్పబడినది. ''ఓంకారశ్చాథశబ్దశ్చ ద్వావేతౌ బ్రహ్మణః పురా, కంఠం భిత్వా వినిర్యాతౌ తస్మాన్మాఙ్గళికావుభౌ'' అను వాక్యముచేత అథశబ్దము మంగళ

వాచకమని భాష్యకారు లుపదేశించిరి. మరియు "మఙ్గళాదీని మఙ్గళమధ్యాని మఙ్గళాన్తాని చ శాస్త్రాణి ప్రథన్తే వీరపురుషకాణి ఆయుష్మత్పురుషకాణి చ భవన్తి" అను వాక్యముచేత గ్రంథాదియందు మంగళ మవశ్యకర్తవ్యమని శాసించిరి.

"దీర్ఘం జీవితీయ" మనుచోట దీర్ఘజీవితశబ్దమునకంటె మత్వర్థమున "అధ్యాయానువాకయోర్లుక్ చ" అనుసూత్రముచేత ఛప్రత్యయము దాని కీయాదేశమువచ్చి "దీర్ఘం జీవితీయం" అను రూపమగును. దీర్ఘం జీవితశబ్దము ఆదియందు కలయధ్యాయమని భావము. ఇత్తెరంగుననే "అపామార్గతండులీయం" "ఆరగ్వధీయం"అనునవి మున్నుగాగలచోట్ల వ్యుత్పత్తి నెరుంగునది. ఈతంత్రమునందు ప్రతియధ్యాయప్రారంభమునను ఇవ్విధంబుగనే చెప్పబడును.

"అధ్యాయః" అనుచోట 'ఇఙ్ అధ్యయనే' అను ధాతువునకు 'ఇఙశ్చ' అను సూత్రముచేత కర్మరూపార్థమున ఘఞ్ ప్రత్యయముచేత రూపము సిద్ధించును. "అధీయతే అసౌ ఇతి అధ్యాయః" అను వ్యుత్పత్తిచేత చదువబడునది యధ్యాయమని భావము. ఈపదము అధ్యాయరూపమైన ప్రకరణమునందు మాత్రము పంకజాదిశబ్దములవలె యోగరూఢముగ వ్యవహరింపఁబడును.

భగవాన్ అనుచోట "ఉత్పత్తిం ప్రలయం చైవ భూతానామాగతిం గతిమ్, వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి." అనులక్షణముచేత పాంచభౌతికముల యుత్పత్తిలయములను, గమనాగమనములను, విద్యావిద్యలను దెలిసినవాడు భగవచ్ఛబ్దవాచ్యు డని యెరుంగునది. లేక "ఐశ్వర్యస్య సమస్తస్య ధర్మస్య యశసశ్శ్రియః, జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా" అను ప్రమాణముచేత అష్టైశ్వర్యములు, ధర్మము, యశస్సు, సంపత్తు, జ్ఞానము, వైరాగ్యము, అనునీయారును భగశబ్దముచే జెప్పబడును. అట్టియారుగుణములు కలవారు భగవచ్ఛబ్దవాచ్యులని యైన జెప్పనగును. ఇట్టిజ్ఞానగరిమపూర్ణుడైన యాత్రేయుం డుపదేశించినవిషయములు ప్రమాణతమములనియు, అట్టిగురూపదేశమును అనుసరించియే అగ్నివేశులును తంత్రమును రచించుటం జేసి యీతంత్రము మిక్కిలి ప్రమాణమై విశ్వసనీయమనియు "ఇతి హ స్మాహ భగవానాత్రేయః" అనువాక్యముచే స్పష్టమగుచున్నది.

ఈతంత్రమున నభిధేయ మేమన: హితాహితాదిరూపముచే నాయువు అభిధేయము. (ముఖ్యముగ బోధింపబడువిషయము.) ధాతుసామ్యరూపమైన యారోగ్యపరిపాలనము ప్రయోజనము. ఈవిషయము "ధాతుసామ్యక్రియా చోక్తా తన్త్రస్యాస్య ప్రయోజనమ్" అనువాక్యముచే తంత్రకారుడు స్ఫుటముగ జెప్పెను. ఆయువునకును

గ్రహించెను. (బ్రహ్మ యెట్లుపదేశించెనో అందు లేశమైన వికారాన్తరము లేక పూర్తిగ యథాశ్రుతముగ గ్రహించెనని భావము). పిదప అశ్వినీదేవతలు దక్షప్రజాపతివలన సంపూర్ణముగ బ్రహ్మ దక్షున కుపదేశించినదానికి న్యూనాతిరేకములు లేక యాయుర్వేదమును గ్రహించిరి. అటుపిమ్మట నశ్వినీదేవతలవలన నింద్రుడు పైజెప్పినరీతిగనే పూర్తిగ గ్రహించెను. అట్టియింద్రుడు ఇతరులకెవ్వరికిని ఉపదేశించియుండలేదు కావున అట్టిపరిస్థితిలో అంగిరస్సు మున్నగుఋషివరులచే ప్రేరితుడై భరద్వాజుడు పైజెప్పిన రీతిగ దీర్ఘజీవితోపాయము నరయుటకై యింద్రసన్నిధానమున కేగెను.

'ప్రకర్షేణ ఉక్తం ప్రోక్తం' అనువ్యుత్పత్తిచేత బ్రహ్మచే నిరవశేషముగ (పూర్తిగ) చెప్పబడియెనని యర్థము. "యథా" అనుటచేత బ్రహ్మ యెట్లుపదేశించెనో దానికి న్యూనాతిరేకముగాక దక్షప్రజాపతి గ్రహించెనని భావము. అందును కొంచెమైన విడువక గ్రహించెనని 'నిఖిలేన' అనుపదముచే దెలిసెడిని. 'యథా ప్రోక్తం నిఖిలేన' అనునది పైరెండువాక్యములకును సమన్వయించుటచేత బ్రహ్మ చెప్పినవిధముగ లోపము లేక దక్షుడును, వానివలన నదేవిధముగ నశ్వినీదేవతలును, వారివలన నదే తీరున నింద్రుండును వరుసగ నాయుర్వేదమును గ్రహించిరని భావము. అట్టిశిష్యపరంపరగ గ్రహింపబడిన యాయుర్వేదము తొలుత బ్రహ్మ యుపదేశించినయానుపూర్వికముగ నింద్రునియొద్ద నుండుటంజేసి భరద్వాజుడు శరణము వేడుట సమంజసమని భావము.

'హ' అనునది అవధారణమును దెల్పును. ఇంద్రుడు గ్రహించెనే గాని అంతదనుక శిష్యుల కుపదేశింపలేదని భావము. కావున తొలుత శిష్యత్వమునొంది భరద్వాజుడు పోవుట యుక్తియుక్తమని తోచెడి.

హిమవంతమున ఋషులు సభచేరుట.

మూ. విఘ్నభూతా యదా రోగాః ప్రాదుర్భూతాశ్శరీరిణామ్,
తపోపవాసాధ్యయనబ్రహ్మచర్యవ్రతాయుషామ్. ౬
తదా భూతేష్వనుక్రోశం పురస్కృత్య మహర్షయః,
సమేతాః పుణ్యకర్మాణః పార్శ్వే హిమవతశ్శుభే. ౭

వ్యా. శరీరమన తనంతనే కొంతకాలమునకు చెడిపోవు స్వభావము కలదేహము. అట్టిశరీరమును ధరించిన ప్రాణులకు తపోరూపములగు చాంద్రాయణాదుల నాచరించుటకును, ఉపవాసమునకును, (పాపములకు కారణములగు కామక్రోధాదుల విసర్జించి సత్యాదిసద్గుణముల నవలంబించుట) వేదముల పఠించుటకును, బ్రహ్మచర్యమునకును

గ్రహించెను. (బ్రహ్మ యెట్లుపదేశించెనో అందు లేశమైన వికారాన్తరము లేక పూర్తిగ యథాశ్రుతముగ గ్రహించెనని భావము). పిదప అశ్వినీదేవతలు దక్షప్రజాపతివలన సంపూర్ణముగ బ్రహ్మ దక్షున కుపదేశించినదానికి న్యూనాతిరేకములు లేక యాయుర్వేదమును గ్రహించిరి. అటుపిమ్మట నశ్వినీదేవతలవలన నింద్రుడు పైజెప్పినరీతిగ నే పూర్తిగ గ్రహించెను. అట్టియింద్రుడు ఇతరులకెవ్వరికిని ఉపదేశించియుండలేదుకావున అట్టిపరిస్థితిలో అంగీరస్సు మున్నగుఋషివరులచే ప్రేరితుడై భరద్వాజుడు పైజెప్పిన రీతిగ దీర్ఘజీవితోపాయము నరయుటకై యింద్రసన్నిధానమున కేగెను.

'ప్రకర్షేణ ఉక్తం ప్రోక్తం' అనువ్యుత్పత్తిచేత బ్రహ్మచే నిరవశేషముగ (పూర్తిగ) చెప్పబడియెనని యర్థము. "యథా" అనుటచేత బ్రహ్మ యెట్లుపదేశించెనో దానికి న్యూనాతిరేకముగాక దక్షప్రజాపతి గ్రహించెనని భావము. అందును కొంచెమైన విడువక గ్రహించెనని 'నిఖిలేన' అనుపదముచే దెలిసెడిని. 'యథా ప్రోక్తం నిఖిలేన' అనునది పైరెండువాక్యములకును సమన్వయించుటచేత బ్రహ్మ చెప్పినవిధముగ లోపము లేక దక్షుడును, వానివలన నదేవిధముగ నశ్వినీదేవతలును, వారివలన నదే తీరున నింద్రుండును వరుసగ నాయుర్వేదమును గ్రహించిరని భావము. అట్టిశిష్యపరంపరగ గ్రహింపబడిన యాయుర్వేదము తొలుత బ్రహ్మ యుపదేశించినయానుపూర్వికముగ నింద్రునియొద్ద నుండుటంజేసి భరద్వాజుడు శరణము వేడుట సమంజసమని భావము.

'హ' అనునది అవధారణమును దెల్పును. ఇంద్రుడు గ్రహించెనే గాని అంతదనుక శిష్యుల కుపదేశింపలేదని భావము. కావున తొలుత శిష్యత్వమునొంది భరద్వాజుడు పోవుట యుక్తియుక్తమని తోచెడి.

### హిమవంతమున ఋషులు సభచేరుట.

మూ. విఘ్నభూతా యదా రోగాః ప్రాదుర్భూతాశ్శరీరిణామ్,
తపోపవాసాధ్యయనబ్రహ్మచర్యవ్రతాయుషామ్. ౬
తదా భూతేష్వనుక్రోశం పురస్కృత్య మహర్షయః,
సమేతాః పుణ్యకర్మాణః పార్శ్వే హిమవతశ్శుభే. ౭

వ్యా. శరీరమన తనంతనే కొంతకాలమునకు చెడిపోవు స్వభావము కలదేహము. అట్టిశరీరమును ధరించిన ప్రాణులకు తపోరూపములగు చాంద్రాయణాదుల నాచరించుటకును, ఉపవాసమునకును, (పాపములకు కారణములగు కామక్రోధాదుల విసర్జించి సత్యాదిసద్గుణముల నవలంబించుట)వేదముల పఠించుటకును, బ్రహ్మచర్యమునకును

(మోక్షాసక్తిచే స్త్రీసేవాదుల విసర్జించుట). వ్రతాదినియమములకును విఘ్నములఁ గల్గించు రోగములు బైలువెడలి బాధించుచున్నతరి, ఈక్రింద జెప్పంబడు అంగిరస్సు మున్నగు మహర్షులు జంతువులవిషయమై కృత్రిమమగు దయకలవారై వారు పుణ్యకర్మల నాచరించు స్వభావముకలవారగుటంజేసి, హిమాలయపర్వతప్రాంతమున నొక శుభ్రమైన ప్రదేశమున నొకసభచేరిరి.

రోగములు అనాదులై సమయమువచ్చినపుడు బైట వ్యాపించి మిథ్యాహారాది కారణములచే ప్రాణుల బాధింప సాగును కాని వాని కొకప్పుడు పుట్టుకలేదు కావున 'ప్రాదుర్భూతాః' అని చెప్పబడెను. అట్టిరోగములు కృతయుగాన్తమున వ్యాపించినట్లు "భ్రశ్యతి తు కృతయుగే" ఇత్యాది వాక్యములచేత జనపదోద్ధ్వంసనీయమను నధ్యాయమున నీతంత్రకారుడు చెప్పెను.

"ఉపావృత్తస్య పాపేభ్యః సహవాసో గుణై హి యః, ఉపవాసస్స విజ్ఞేయః న శరీరస్య శోషణమ్" అని యుపవాసస్వరూప ముపదేశింపబడెను. మహర్షులు కేవలము మనుజమాత్రులయందె కాక ప్రాణిసామాన్యముగ సమబుద్ధికల్గియుందురని దెలియుటకై 'భూతేషు' అని చెప్పబడినది.

### అంగిరాదిఋషుల సమావేశము.

మూ. అఙ్గిరా జమదగ్నిశ్చ వసిష్ఠః కశ్యపో భృగుః,
ఆత్రేయో గౌతమస్సాఙ్ఖ్యః పులస్త్యో నారదోఽసితః. ౮
అగస్త్యో వామదేవశ్చ మార్కణ్డేయాశ్వలాయనౌ,
పారిక్షిర్భిక్షురాత్రేయో భరద్వాజః కపిఞ్జలః. ౯
విశ్వామిత్రాశ్మరథ్యౌ చ భార్గవశ్చ్యవనోఽభిజిత్,
గార్గ్యశ్శాణ్డిల్యకౌణ్డిన్యౌ వార్క్షిర్దేవలగాలవౌ. ౧౦
సాఙ్కృత్యో బైజవాపిశ్చ కుశికో బాదరాయణః,
బడిశశ్శరలోమా చ కాప్యకాత్యాయనావుభౌ. ౧౧
కాఙ్కాయనః కైకశేయః ధౌమ్యో మారీచికాశ్యపౌ,
శర్కరాక్షో హిరణ్యాక్షో లోకాక్షః పైఙ్గిరేవ చ. ౧౨
శౌనకశ్శాకునేయశ్చ మైత్రేయో మైమతాయనిః,
వైఖానసా వాలఖిల్యాః తథా చాన్యే మహర్షయః. ౧౩
బ్రహ్మజ్ఞానస్య నిధయో దమస్య నియమస్య చ,

తపసస్తేజసా దీప్తా హూయమానా ఇవాగ్నయః. ౧౪
సుఖోపవిష్టాస్తే తత్ర పుణ్యాం చక్రుః కథామిమామ్,

వ్యా. బ్రహ్మజ్ఞానమునకును దమము (ఇంద్రియనిగ్రహము)నకును నియమమునకును తపస్సునకును నిధులవలె ప్రధానస్థానముబోలె నున్నవారును, హోమముచేయబడిన యగ్నులవలె బ్రహ్మతేజస్సుచే ప్రకాశించువారునునగు, అంగిరసుడు, జమదగ్ని, వసిష్ఠుడు, కశ్యపుడు, భృగువు, ఆత్రేయుండు, గౌతముడు, సాంఖ్యుడు, పులస్త్యుడు, నారదుడు, అసితుడు, అగస్త్యుడు, వామదేవుడు, మార్కండేయుండు, ఆశ్వలాయనుడు, పారిక్షి, భిక్షువను నామాంతరముకల ఆత్రేయుండు, భరద్వాజుడు, కపింజలుడు, విశ్వామిత్రుడు, అశ్మరథ్యుడు, భార్గవుడు, చ్యవనుడు, అభిజిత్తు, గార్గ్యుడు, శాండిల్యుడు, కౌండిన్యుడు, వార్షి, దేవలుడు, గాలవుడు, సాంకృత్యుడు, బైజవాపి, కుశికుడు, బాదరాయణుడు, బడిశుడు, శరలోముడు, కాప్యుడు, కాత్యాయనుడు, కాంకాయనుడు, కైకశేయుండు, ధౌమ్యుడు, మారీచి, కాశ్యపుడు, శర్కరాక్షుడు, హిరణ్యాక్షుడు, లోకాక్షుడు, పైంగి, శౌనకుడు, శాకునేయుండు, మైత్రేయుండు, మైమతాయని, అనువారును, వైఖానసులును, వాలఖిల్యును (హ్రస్వాకారముగలఋషులు), మున్నగు ఋషిపుంగవులు పలువురు పైబేర్కొనబడిన హిమవంతప్రాంతమున పరిశుద్ధప్రదేశమున సుఖముగ నొక్కెడ గూర్చుండి యీక్రింద జెప్పబడురీతిగ పుణ్యకథను ప్రసంగించిరి.

ఇచ్చట "బ్రహ్మజ్ఞానస్య నిధయః" అనుటచేత పైబేర్కొనిన మహర్షులకు బ్రహ్మజ్ఞానదమనియమాదులు నానాట వృద్ధినొంది యక్షయముగ నుండునని తెలిసెడి. మరియు పైజెప్పబడిన ఋషు లనేకులు జేరి ప్రయత్నపూర్వకముగ వెలువరించిన యాయుర్వేదము మిక్కిలి గ్రాహ్యతమమై లోకోపకారకముగ నుండునని తెలియుటకై యనేకఋషులు పేర్కొనబడిరి.

ఋషులు ఆరోగ్యమునుగూర్చి యోజించుట.

మూ. ధర్మార్థకామమోక్షాణాం ఆరోగ్యం మూలముత్తమమ్. ౧౫
రోగాస్తస్యాపహర్తారః శ్రేయసో జీవితస్య చ,
ప్రాదుర్భూతో మనుష్యాణాం అన్తరాయో మహానయమ్.
కస్స్యాత్తేషాం శమోపాయః ఇత్యుక్త్వా ధ్యానమాస్థితాః,
అథ తే శరణం శక్రం దదృశుర్ధ్యానచక్షుషా. ౧౬
స వక్ష్యతి శమోపాయం యథావదమరప్రభుః,

వ్యా. (ఈప్రపంచమునకెల్ల నాధారభూతమై ధరించునది ధర్మము; అయ్యది వర్ణాశ్రమాదుల ననుసరించి మన్వాదిస్మృతులయందు పలుతెరంగుల వివరింపబడినది. అట్టిధర్మము మొదలంట నశించినచో ప్రపంచమునకే హాని కల్గును. కావున నయ్యది ప్రపంచమున కాధారమైనది. ఈవిషయమునే "ధర్మో రక్షతి రక్షితః, ధర్మో హన్తి నిహన్యతే" అను ప్రాచీనోక్తి చాటుచున్నది. అర్థమనగా సువర్ణము మున్నగుధనరూపమైనది. కామమనగ ఈలోకమునకు సంబంధించిన స్త్రీసుతాదిసుఖానుభవమునందును, పరలోకమునకు సంబంధించిన స్వర్గాదిసుఖానుభవమునందునుం గలకోరిక. మోక్షమనగ అనేకజన్మములనుండి యనాదిగ పరంపరానుస్యూతమై సంబంధపడియుండు జననమరణరూపమైన సంసారమును వదలి జ్ఞానవిజ్ఞానగరిమచే పొందదగిన పునరావృత్తిరహితమై శాశ్వతమైన యునికి. ఇవియే ధర్మార్థకామమోక్షము లనునట్టి నాల్గుతెరంగులైన పురుషార్థములు. నాల్గు నుత్తరోత్తరము ఒకదానికొకటి కారణము లైయుండును. మానవజన్మము నెత్తినపుడు ఈనాల్గుపురుషార్థములను పొంద నుద్యమించుట ముఖ్యకర్తవ్యము. దానంజేసియే యివి పురుషార్థములునా ప్రసిద్ధిజెందెను. అందుకు శరీరము రోగాదిపీడితము గాక ఆరోగ్యస్థితి నుండినగాని వలనుపడదు. ఈవిషయమునే "శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్" అని ప్రాచీనులు చెప్పిరి. ఈవిషయమే యీక్రింద వివరింపబడును).

పైజెప్పినరీతిగ ధర్మార్థకామమోక్షములకు శరీరము ధాతుసామ్యరూపమైన యారోగ్యస్థితి నుండుటయే ప్రధానమైన కారణము. (రోగబాధితు డగువాడు పైజెప్పబడిన పురుషార్థముల సాధింపలేడు. కావున ఆరోగ్యము ప్రధానకారణమని భావము.) అట్టియారోగ్యమును రోగములు అపహరించునవి. (రోగములు వ్యాపించునపుడే ఆరోగ్యము చెడును కావున దాని నపహరించునవి రోగములని చెప్పబడెను.) అంతియ కాక ధర్మాదిశ్రేయస్సును సకలప్రాణులకు సర్వదా ముఖ్యాభిలషితమైన జీవితమునుగూడ నపహరించునవి రోగములు. అట్టిరోగములు వ్యాపించుటంజేసి మనుష్యులకు పైజెప్పిన పురుషార్థముల సంపాదించుటకు గొప్పవిఘ్నము సంభవించినది. కావున నీరోగముల శమింపజేయు నుపాయమెద్ది"యని చెప్పి ఋషులందరును ఆవిషయమునే నిశ్చలమైన చిత్తముతో యోజించిరి. కొంత సేపటికి ధ్యానరూపమైన జ్ఞానదృష్టిగరిమచేత పైజెప్పిన రోగశమనోపాయనిమిత్తమై యింద్రుడు గతుకుడని తెలిసికొనిరి. అట్టిరోగశమనోపాయమును ఇంద్రుడు చెప్పగలడని నిర్ణయించిరి.

ఇచ్చట "శ్రేయసో జీవితస్య చ" అనుచోట శ్రేయశ్శబ్దము జీవితమునకు విశేషణము. సుఖవంతమైన జీవితమును అపహరించునవి రోగములని భావము. ఇట్లు చెప్పుటచేత దారిద్ర్యదిదోషములచేత కష్టముల ననుభవించునపుడు జీవితమునందును నిరు

త్సాహము కల్గునని యర్థమగును. ప్రాణి సామాన్యముగ సర్వకాలసర్వావస్థలయందును జీవితమునందు నిరుత్సాహము ఒకప్పుడును కల్గబోదు. దుఃఖము సంభవించునపుడు మాత్రము దుఃఖమును తొలగింప నుపాయాంతరము గానలేక దాని నోరువజాలక దానిమూలమున మనకీజీవిత మేలయని నిరుత్సాహము కల్గునుగాని కేవలము జీవితాశ తొలగుటలేదు. కావున పైజెప్పినరీతిగ ధర్మాదిశ్రేయస్సును ప్రాణిజనముఖ్యాభిలషితమైన జీవితమును అపహరించునవి రోగములని యర్థము జెప్పుట సమంజసము.

### భరద్వాజుఁడు ఇంద్రునియాస్థానమున కరుగుట.

మూ. కస్సహస్రాక్షభవనం గచ్ఛేత్పృష్టుం శచీపతిమ్. ౧౮
అహమర్థే నియుజ్యేయమత్రేతి ప్రథమం వచః,
భరద్వాజోఽబ్రవీత్తస్మాదృషిభిస్స నియోజితః. ౧౯
స శక్రభవనం గత్వా సురర్షిగణమధ్యగమ్,
దదర్శ బలహన్తారం దీప్యమానమివానలమ్. ౨౦
సోఽభిగమ్య జయాశీర్భిరభినన్ద్య సురేశ్వరమ్,
ప్రోవాచ భగవాన్ ధీమాన్ ఋషీణాం వాక్యముత్తమమ్. ౨౧
వ్యాధయో హి సముత్పన్నాస్సర్వప్రాణిభయఙ్కరాః,
తద్బ్రూహి మే శమోపాయం యథావదమరప్రభో. ౨౨

వ్యా. అంగిరస్సు మున్నగు మహర్షులందరును హిమవత్పార్శ్వమున రోగశమనోపాయమును జెప్ప నర్హుఁడు ఇంద్రుఁడని నిర్ణయించి, పిదప శచీదేవితో క్రీడాసక్తుఁడగు నింద్రునియాస్థానమునకు 'నన్ను బంపు'డని 'తొలుత జెప్పవా డెవడని సభవారినడుగ భరద్వాజుడు "నన్ను నియోగించిన నేను పోగల"నని చెప్పెను; కావున ఋషులందరును జేరి యాభరద్వాజుని నియోగించిరి. పిమ్మట నాభరద్వాజుడు ఇంద్రభవనమునకుం జని దేవర్షిగణపరివేష్టితుఁడును, బలాసురుని సంహరించినవాఁడును, జ్వలించుచున్న యగ్నియుంబోలె దివ్యతేజంబుచే బ్రకాశించువాఁడునగు నింద్రునింగాంచి, సమీపమున నభిముఖుడై జయజయశబ్దములతో నభినందనపూర్వకముగ నాశీర్వదించి సకలప్రాణులకును మిక్కిలి భయంకరములగు రోగములు సంభవించి జనులబాధింపసాగెను; అట్టిరోగములు శమించుతగునుపాయమును యథావిధిగ జెప్పుమని తనకు ఋషులు జెప్పినవిధముగ నమరాధిపతి నడిగెను.

—భరద్వాజున కింద్రుడు ఆయుర్వేద ముపదేశించినవిధము.—

మూ. తస్మై ప్రోవాచ భగవాన్ ఆయుర్వేదం శతక్రతుః,
పదైరల్పైర్మతిం బుద్ధ్వా విపులాం పరమర్షయే. ౨౩
హేతులిఙ్గౌషధజ్ఞానం స్వస్థాతురపరాయణమ్,
త్రిసూత్రం శాశ్వతం పుణ్యం బుబుధే యం పితామహః. ౨౪

వ్యా. శతక్రతువులజేసిన యింద్రుడు పైజెప్పినరీతిగ భరద్వాజు డడుగగా అట్టి భరద్వాజునిబుద్ధి శుశ్రూషాగ్రహణధారణోహాపోహాదులయందు మిక్కిలి నిపుణ మగుటంజేసి విశాలమైనదని యెరింగి, హేతువులను లింగములను ఔషధములను దెల్పునట్టిదియు, రోగములు లేక స్వస్థత నుండువారికిని రోగపీడితులకును శ్రేష్ఠమైన మార్గమును దెలుపునదియు నగు నాయుర్వేదమును, హేతులక్షణ ఔషధముల సూచించు స్కంధత్రయమును తొలుత బ్రహ్మ యే ఆనుపూర్విగ దెలిసికొనెనో అందించు కేనియు న్యూనాతిరేకము లేక గంభీరార్థంబును స్వల్పపదంబులును గల్గియుండునట్టులు శాశ్వతమై పావనమైన యాయుర్వేదమును భరద్వాజునకు జెప్పెను. (హేతు-లింగ-ఔషధరూపమైన స్కంధత్రయముచే నిండిన యాయుర్వేదమును తొలుత బ్రహ్మ స్వప్రతిభచే దెలిసికొనిన విధమునకు కొంచెమైన లోపము లేక భరద్వాజునకు జెప్పెనని భావము.)

లోకమున నొకవిద్యను శిష్యున కుపదేశించునపుడు శిష్యుని బుద్ధిపాటవమును గమనించి తదనుసారముగ జెప్పవలెను; కాన ఇంద్రుడును భరద్వాజుని బుద్ధికౌశలము నెరింగి కొద్దిపదములచే విశేషార్థము బోధపడునట్టు లాయుర్వేదమును జెప్పెనని తెలియుటకై "పదైరల్పైర్మతిం బుధ్వా విపులాం పరమర్షయే" అని చెప్పెను. "విపులాం మతిం" అనగ:—గురువు చెప్పునట్టి విషయమును సమంజసముగ వినుట, విన్నవిషయమును యథాశ్రుతముగ గ్రహించుట గ్రహించిన విషయమును విస్మృతిజెందక మనమున నిడికొనుట అట్టివిషయమై యుత్సర్గాపవాదముల నూహాపోహలచే నిర్ణయించుట మున్నగువిషయములచే ప్రకాశించు బుద్ధియని యర్థము.

'హేతులిఙ్గౌషధజ్ఞానం' అనుచోట "హేతులిఙ్గ ఔషధాని జ్ఞాయతే అనేన (ఆయుర్వేదేనే)తి హేతులిఙ్గౌషధజ్ఞానం,"అనువ్యుత్పత్తిచేత హేతువులను, లింగమును, ఔషధములను దెల్పునది యాయుర్వేదమని దెలియునది. హేతువనగ వ్యాధులకు సన్నికృష్టవిప్రకృష్టకారణములు. లింగశబ్దముచేత ఆరోగ్యమునకును వ్యాధులకును సంబంధించిన లక్షణములన్నియు గ్రహింపబడును. ఔషధశబ్దముచేత ఔషధముల

గుణాదులును తన్మూలకములైన పథ్యాపథ్యాదివిభాగంబులును గ్రహింపబడును. శారీరము హేతులింగస్కంధములలో నంతర్భూతమగును. ఇట్టిస్కంధత్రయాత్మకమైన యాయుర్వేదమున స్వస్థముగ నుండువారికి ఆరోగ్యమును కాపాడుకొనుటకును, రోగులకు రోగనివృత్తి జేసికొనుటకును తగినమార్గములు చెప్పబడినవని 'స్వస్థాతురపరాయణమ్' అనువాక్యముచే దెలిసెడి.

భరద్వాజుడు ఆయుర్వేదముచే దీర్ఘాయుంనొందినవిధము.

మూ. సోఽనన్తపారం త్రిస్కన్ధం ఆయుర్వేదం మహామతిః,
యథావదచిరాత్సర్వం బుబుధే తన్మనా మునిః. ౨౭
తేనాయురమితం లేభే భరద్వాజస్సుఖాన్వితః,
ఋషిభ్యోఽనధికం తచ్చ శశంసానవశేషితమ్. ౨౮

వ్యా. ఆద్యంతరహితంబును, పైజెప్పినరీతిగ హేతుస్కంధము, లక్షణస్కంధము, ఔషధస్కంధము నని మూడువిభాగములతో గూడినదియు నగునాయుర్వేదమును, విశాలమైనబుద్ధికలవాడును, మననశీలుండును, జ్ఞానగరిష్ఠుండును నగుభరద్వాజుడు, ఆయాయుర్వేదమునందే మనసు నిల్పి, ఇంద్రుడుపదేశించినదానికి న్యూనాతిరేకము లేక పూర్తిగ నాయుర్వేదమును అతిశీఘ్రకాలముననే గ్రహించెను.

పిమ్మట నట్టియాయుర్వేదమును సాధనముగ జేసికొని (అందు చెప్పబడిన రసాయనముల సేవించుటచే) ప్రమాణాతీతమగునాయువును బొంది సుఖముగ నుండి, తాను అనుభవసిద్ధముగ గ్రహించినయాయుర్వేదమును న్యూనాధికవైపరీత్యములు లేక తక్కిన ఋషులకందరకును చెప్పెను.

ఇచ్చట "అనంతపార"మనుచోట పారశబ్దమునకు అది యని యర్థము చేయుటచే ఆద్యంతరహితమని యర్థమగును. లేక అనంతమనగా మోక్షమని యర్థము. పారమన నుత్కృష్టమని యర్థము. మోక్షరూపమైన యుత్కృష్టఫలమునకు సాధనమైనది యాయుర్వేదమని భావము.

త్రిస్కంధమనుటచే నాయుర్వేదము గొప్పవృక్షమును బోలి యున్నదనియు, దానికి హేతు-లింగ-ఔషధములను మూడుస్కంధములు (పట్టుకొమ్మల బోలిన ప్రకరణములు) ఉన్నవనియు, వాని నాధారముగ జేసికొని భరద్వాజుడు తనజ్ఞానగరిమచే నపారమగునాయుర్వేదమును అతిశీఘ్రకాలముననే గ్రహించెననియు తెలియుచున్నది.

మరియు త్రిసూత్రాత్మకమైన యాయుర్వేదమును బ్రహ్మ యెట్లు స్వయముగ తెలిసికొనెనో అదేవిధముగ బ్రహ్మాదగ్గిరనుండి ప్రజాపతి, అశ్వినులమూలమై పరంపరగ

వచ్చిన యాయుర్వేదమును వైపరీత్యము లేక యింద్రుడు గ్రహించెననియు, అట్టి యింద్రునివలన భరద్వాజుడును యథాశ్రుతముగ స్కంధత్రయాత్మకమగునాయుర్వేదమును తదేకమనస్కుడై గ్రహించెననియు నిచ్చట స్ఫుటముగ దెలిసెడి. ఇందుచేత నాయుర్వేదమున స్ఖాలిత్యాదిదోషములు లేక యుండుటంజేసి ప్రమాణతమమని భావమేర్పడుచున్నది.

భరద్వాజుడు లోకోపకారమునకై యాయుర్వేదమును తాను గ్రహించుటచే గల్గిన ప్రభావమునం జేసి తొలుత తాను అమితాయుష్యమును బొంది పిమ్మట ఋషుల కందరకును బోధించినట్లులు తెలిసెడి.

### భరద్వాజునివలన ఋషులు ఆయుర్వేదమును పడసినక్రమము.

మూ. ఋషయశ్చ భరద్వాజాజ్జగృహుస్తం ప్రజాహితమ్,
దీర్ఘమాయుశ్చికీర్షన్తో వేదం వర్ధనమాయుషః. ౨౭
మహర్షయస్తే దదృశుః యథావత్ జ్ఞానచక్షుషా,
సామాన్యం చ విశేషం చ గుణాన్ ద్రవ్యాణి కర్మ చ. ౨౮
సమవాయం చ తత్ జ్ఞాత్వా తన్త్రోక్తం విధిమాస్థితాః,
లేభిరే పరమం శర్మ జీవితం చాప్యనశ్వరమ్. ౨౯

వ్యా. జ్ఞానము చక్షుస్సుగా గల ఋషులందరును జనులకును తమకును నియమితమగునాయువును వృద్ధినొందింప దలంచినవారై జనులకు హితకరంబును, శాశ్వతంబును నగునాయుర్వేదమును గ్రహించిరి. మహర్షులు భరద్వాజునివలన గ్రహింపబడిన యాయుర్వేదమువలన సామాన్యము, విశేషము, గుణములు, ద్రవ్యము, కర్మ, సమవాయము, అనుపదార్థముల నారింటెని తమ దివ్యజ్ఞానదృష్టిచే యథాశ్రుతముగ గమనించి, అట్టితంత్రమున జెప్పబడిన సామాన్యాదులను విధిపూర్వకముగ (అపథ్యముల విసర్జించి పథ్యముల నాచరించి) ఆచరణములోనికి దెచ్చి ఆరోగ్యరూపమైన సుఖమును నాశరహితమైన యాయుష్యమును పొందిరి.

ఇచ్చట సామాన్యాదులను నారింటికిని లక్షణము క్రింద జెప్పబడునుగాన వాని వివరణము నచ్చట నెరుంగునది.

### భరద్వాజశిష్యుడగు నాత్రేయునివలన నగ్నివేశాదులు ఆయుర్వేదమును గ్రహించినక్రమము.

మూ. అథ మైత్రీ పరః పుణ్యమాయుర్వేదం పునర్వసుః,
శిష్యేభ్యో దత్తవాన్ షడ్భ్యః సర్వభూతానుకంపయా. 30

అగ్నివేశశ్చ భేలశ్చ జతూకర్ణః పరాశరః,
హారీతః క్షారపాణిశ్చ జగృహుస్తన్మునేర్వచః. 31

వ్యా. పైజెప్పినరీతిగ భరద్వాజునివలన నాయుర్వేదమును గ్రహించిన శిష్యులలో పునర్వసువను నామాంతరము కలయాత్రేయుఁ డనుమహర్షి అగ్నివేశుడు, భేలు(డు)డు, జతూకర్ణుడు, పరాశరుడు, హారీతుడు, క్షారపాణి, అనునార్గురు శిష్యులకు ఆయుర్వేద మును (భరద్వాజునివలన తాను గ్రహించినప్రకారము) చెప్పెను. సకలప్రాణులయందును కృత్రిమముకాని దయారసపరిపూర్ణుడై జనులహితము గోరి సకలప్రాణులయందును తన యందువలెనే సమమైన మిత్రత్వమును ప్రధానముగగల యాత్రేయడు అగ్నివేశాదుల కార్గురికిని యాయుర్వేదము నుపదేశించిరని భావము. అట్టియగ్నివేశాదులును భర ద్వాజుడు చెప్పినవిధముగనే యాయుర్వేదమును యథాశ్రుతముగ గ్రహించిరి.

ఇచ్చట భరద్వాజునకే ఆత్రేయ, పునర్వసు, అని నామాంతరములు కాని వ్యక్తి భేదము లేదని చెప్పెదరు. ఆత్రేయునకు భరద్వాజుడను నామాంతరము ఏతంత్రముల యందును జెప్పియుండలేదు కావున నయ్యది సప్రమాణము కానోపదు. హారీతసంహిత యందు ఆత్రేయాదులకు భరద్వాజుడు గురువని చెప్పబడినది. ఈగురుపరంపరవిషయమై విమర్శింపదగినవిషయము చాలభాగ మున్నది. విస్తరభీతిచే నిట వివరింపబడదయ్యె గాన విజ్ఞులు గమనించెదరు గాత.

### అగ్నివేశాదితంత్రప్రవర్తనము.

మూ. బుద్ధేర్విశేషస్తత్రాసీత్ ఉపదేశాన్తరం మునేః,
తన్త్రస్య కర్తా ప్రథమం అగ్నివేశో యతోఽభవత్. 32
అథ భేలాదయశ్చక్రుః స్వంస్వం తన్త్రం కృతాని చ,
శ్రావయామాసురాత్రేయం సర్షిసఙ్ఘం సుమేధసః. 33
శ్రుత్వా సూత్రణమర్థానాం ఋషయః పుణ్యకర్మణామ్,
యథావత్సూత్రితమితి ప్రహృష్టాస్తేఽనుమేనిరే. 34
సర్వ ఏవాస్తువంస్తాంశ్చ సర్వభూతహితైషిణః,
సాధు భూతేష్వనుక్రోశ ఇత్యుచ్చైరబ్రువన్ సమమ్. 35
తం పుణ్యం శుశ్రువుః శబ్దం దివి దేవర్షయః స్థితాః,
సామరాః పరమర్షీణాం శ్రుత్వా ముముదిరే పరమ్. 36
అహో సాధ్వితి నిర్ఘోషో లోకాం స్త్రీనన్వవాదయత్,

పిమ్మట జ్ఞానాభిమానిదేవతలైన బుద్ధి, సిద్ధి (సాధ్యాసాధ్యముల దెలిసికొను జ్ఞానము) స్మృతి (అతీతవిషయమును జ్ఞప్తికి దెచ్చుకొనుజ్ఞానవిశేషము), మేధ (ఉత్తరోత్తరవిషయములను తీవ్రముగ గ్రహించుజ్ఞానము) ధృతి (విన్నవిషయములను మరువక జ్ఞప్తి నుంచుకొనుట), కీర్తి (తానెరింగినదానిని ప్రవచముజేయుంనట్టిశక్తి), క్షమ (ఓర్పు), దయ (భూతములయందు చిత్తమార్దవము), అను నీజ్ఞానశక్తులు తంత్రకారులగు నగ్నివేశాదులను ప్రత్యక్షరూపములతో నేకకాలమున ప్రవేశించెను. (అగ్నివేశాదులయందు బుద్ధి సిద్ధి మున్నగుజ్ఞానవిశేషశక్తులు గ్రంథరచనకు ముందేయుండినను అయ్యవి గ్రంథరచనోత్తరక్షణమున వాని యధిదేవతలు స్వస్వరూపముతో వారియందు ఆవహించినవని భావము). మరియుం పైజెప్పినరీతిగ పరమఋషులచే ప్రశంసింపబడిన తంత్రములు ప్రాణికోటులు రోగాదిబాధలు లేక సుఖముగ నుండుటకు సర్వజనోపాదేయములై స్థిరముగ ప్రతిష్ఠను పొందెను.

## ఆయుర్వేదలక్షణము, నిరుక్తి.

**మూ. హితాఽహితం సుఖం దుఃఖం ఆయుస్తస్య హితాహితమ్,**
**మానం చ తచ్చ యత్రోక్తం ఆయుర్వేదస్స ఉచ్యతే. ౪౧**

వ్యా. శరీరము, చక్షురాదీంద్రియంబులు, సత్వము, ఆత్మ అను నీనాల్గును ఒకటి నొకటి బాయక యొకటిగ కూడియుండుట యాయు వనబడును. ఇదియే ఆయువుకు స్వరూపలక్షణము. ఈవిషయము 'శరీరేన్ద్రియసత్వాత్మ' అనువాక్యముచే క్రింద చెప్పబడును. అయ్యది హితము, అహితము, సుఖము, దుఃఖము నని నాల్గుతెరంగుల నుండును. అట్టి నాల్గుభేదములును అర్థేదశమహామూలీయమను ముప్పదియవయధ్యాయమున విపులముగ వివరింపబడినది. అందు సకలభూతములకును హితమునుగోరుట, పరధనాదితృష్ణను వర్జించి సత్యపరుడుగ నుండుట మున్నగుగుణములు కలవానిఆయువు హిత మనబడును. ఈలక్షణములకు వ్యతిరేకమైనది అహిత మనబడును. శారీరమానసాది రోగములచే బాధింపబడక యౌవనాదిగుణసంపన్నుని యాయువు సుఖము. దీనికి వ్యతిరేకమైనది దుఃఖము. (కష్టమును కల్గించునది). అట్టి నాల్గువిధములైన యాయువును; అట్టి యాయువుకు హితములగుపథ్యాదులును, అహితములగు నీపథ్యంబులును; అరిష్టలక్షణాదులచే నాయుఃపరిమాణంబును, శరీరేంద్రియసత్వాత్మసంయోగరూపమైన యాయుస్స్వరూపలక్షణంబును ఏగ్రంథముచే దెలుపబడునో అయ్యది ఆయుర్వేదము. "ఆయుః వేదయతీతి—ఆయుర్వేదః" అనువ్యుత్పత్తిచేత పైయర్థము లభించునని భావము. ('విద జ్ఞానే' అనుధాతునిష్పన్నమగు నాయుర్వేదశబ్దముచే ఇచ్చట గ్రాహ్యమగును. లాభాద్యర్థము గ్రహింపదగదని యెరుంగునది.)

### ఆయుస్స్వరూపలక్షణము.

మూ. శరీరేన్ద్రియసత్త్వాత్మసంయోగో ధారి జీవితమ్,
నిత్యగశ్చానుబన్ధశ్చ పర్యాయై రాయురుచ్యతే. ౪౨

వ్యా. పృథివ్యాది పంచభూతాత్మకమైన శరీరము, చక్షురాదీంద్రియములు, మనస్సు, జ్ఞానమునకు సంధానకర్తయగు నాత్మ, ఇవి యన్నియు నొకటి నొకటి నెడబాయక కూడి (కర్మవశమునంజేసి) యుండునట్టి యవస్థావిశేషము ఆయు వనబడును. అట్టియాయువు ధారి, జీవితము, నిత్యగము, అనుబంధము ననుపర్యాయనామములచే నీశాస్త్రమున వ్యవహరింపబడును.

శరీరమును చెడనీయక ధరించుటంజేసి ధారి యనబడును. 'ధారయతి శరీరమితి ధారి' అను వ్యుత్పత్తిచే నీయర్థము లభించును. 'జీవయతి ప్రాణాన్ ఇతి జీవితం' అను వ్యుత్పత్తిచేత ప్రాణముల నిల్పునది జీవితమని యర్థము. "నిత్యం గచ్ఛతి (శరీరస్య క్షణికత్వేనేతి) నిత్యగః" అను వ్యుత్పత్తిచేత శరీరము క్షణభంగురమగుటచే నియతముగ నొకకాలమున శరీరమును వదలిపోవునది నిత్యగమని యర్థము. "అనుబధ్నాతి (శరీరాణి పరంపరయా జన్మభేదేనేతి) అనుబంధః" అను వ్యుత్పత్తిచేత జన్మభేదములచే ననేకశరీరములతో సంబంధించునది యని యర్థము.

ఇచ్చట ఇంద్రియములు సూక్ష్మశరీరమగుటచే శరీరశబ్దముచేతనే గ్రహింపబడినను ఇంద్రియములకు ప్రాధాన్యమును దెల్పుటకై ప్రత్యేకముగ జెప్పబడెను.

మరియు అర్థేదశమహామూలీయాధ్యాయమున "తత్రాయుశ్చేతనానువృత్తిః; జీవితం, అనుబన్ధో, ధారి చేత్యేకోఽర్థః" అని ఆయుర్లక్షణము చెప్పబడెను. చేతనము అనువర్తించియుండుటయే ఆయువని యర్థము. ఈచెప్పిన లక్షణమునకును ప్రకృతమున జెప్పబడిన శరీర-ఇంద్రియ-సత్త్వ-ఆత్మసంయోగరూపమైన లక్షణమునకును సామరస్యమెట్లనిన:—శరీరాదిసంబంధములేక కేవలము చేతనానువృత్తి యెన్నడును సంభవింపదు. చేతనాసంబంధము ఇంద్రియసత్త్వాత్మ సంబంధము లేని కేవలశరీరమాత్రమున చేతనాసంబంధ మెకప్పుడును కల్గనోపదు. కావున చేతనానువృత్తి చెప్పినమాత్రమున శరీరాది సంబంధము అర్థాత్సిద్ధము కావున నీరెండు లక్షణములకు పరస్పరభేదము కానగాదు. మృతశరీరమున ఆత్మాదిసంబంధమును చేతనాసంబంధమును లేదు కావున అట్టిస్థితియే మరణమని చెప్పబడును. ఈలక్షణము అర్థాత్సిద్ధము.

### ఆయుర్వేద ప్రాశస్త్యము.

మూ. తస్యాయుషః పుణ్యతమో వేదో వేదవిదాం మతః,
వక్ష్యతే యన్మనుష్యాణాం లోకయో రుభయోర్హితః. ౪౩

వ్యా. పైజెప్పబడినయాయుర్వుకు సంబంధించినవేదము (ఆయుర్వేదము) ఆరోగ్య-ఆయుర్వర్ధనాది ఐహలౌకికసంపత్తుకును, చతుర్వర్గరూపమైన పారలౌకికసుఖమునకును ముఖ్యసాధనంబగుటచే నీయాయుర్వేదము మిక్కిలి పుణ్యతమమని వేదవేత్తలగు మహర్షులచేగూడ మిక్కిలి పూజనీయము.

ఋగ్వేదాదులు నాల్గును కేవలము పరలోకమునకు సంబంధించిన ధర్మముల మాత్రము బోధించి హితమైనదికావున పుణ్యములైనవి. ఆయుర్వేదము ఈలోకమున ఆయురారోగ్యములకును, తన్మూలమున పరలోకసాధనమైన ధర్మమునకు సాధనంబగుటం జేసి రెండులోకములకు హితము; కావున ఋగ్వేదాదులకన్న నయ్యది పుణ్యతమమని భావము. "నహి జీవితదానాద్ధి దానమన్యద్విశిష్యతే" అను నభియుక్తోక్తిప్రకారము ఇయ్యది జీవితమును కాపాడి వృద్ధిచేయునది కావున మిక్కిలి ప్రశంసనీయమని ముఖ్యాభిప్రాయము.

### సామాన్య-విశేషములస్వరూపము, ప్రయోజనము.

మూ. సర్వదా సర్వభావానాం సామాన్యం వృద్ధికారణమ్,
హ్రాసహేతుర్విశేషశ్చ ప్రవృత్తిరుభయస్యతు. ౪౪

వ్యా. ('భవన్తీతి—భావాః; అను వ్యుత్పత్తిచేత సద్రూపమును పొందియుండునవి భావములు; అయ్యవి గుణము, ద్రవ్యము, క్రియ యని మూడు భేదములు కలవి. సర్వదాయన:—నిత్యము ఆవస్థికము నైనకాలమునందని యర్థము. సామాన్యమన:—'సామాన్య మేకత్వకరం' అని క్రిందజెప్పబడులక్షణముచేత ఏకత్వమును కల్గించునది యని యర్థము.) సమస్తమైన గుణ-ద్రవ్య-క్రియారూపములైన భావములయొక్క సామాన్యము (ఏకత్వమును కల్గించు సమానధర్మము. అనగా:—గుణములచే నైనను, ద్రవ్యత్వముచేనైనను, క్రియలచేనైనను ఏకత్వజ్ఞానమును కల్గించుధర్మము) నిత్య-ఆవస్థికరూపమైన సర్వకాలమునందును వృద్ధికి కారణమగును. అనగా:—ఒకదానియందు కలగుణములచే నైనను ద్రవ్యత్వముచే నైనను క్రియలచే నైన, ఇంకొకటి సర్వకాలసర్వావస్థలయందును సమానముగ నుండుట (ఏకత్వమును దెల్పుచుండుట) వృద్ధికారణమని భావము.

(ఒకవస్తువు గుణములచే నైనను ద్రవ్యత్వముచే నైనను క్రియలచే నైనను సర్వకాలసర్వావస్థలయందును ఇంకొకవస్తువుచే సమానత్వమును పొందియున్నచో, అట్టి సమానధర్మము కలవస్తువుసంబంధముచేత మరియొకటి వృద్ధిజెందునని ఫలితార్థము).

మరియు సర్వకాలసర్వావస్థలయందును పైజెప్పినగుణద్రవ్యక్రియలయొక్క విశేషము (విరుద్ధధర్మము) క్షయమునకు కారణమగును. [ఒకద్రవ్యమునందలి గుణము లైనను, ద్రవ్యత్వమైనను, క్రియలైనను ఇంకొకద్రవ్యమునందు విరుద్ధములుగ నున్నచో దానియుపయోగము (సంబంధము) హ్రాసమునకు (తగ్గించుటకు). కారణమగును].

మరియు పైజెప్పినరీతిగ గుణ-ద్రవ్య-క్రియలచే సామాన్యముకలద్రవ్యములను, విరుద్ధములగుద్రవ్యములను పరస్పరమిలితములుగ సంబంధము కల్గినచో వృద్ధియు క్షయంబును లేక సమత్వము కల్గును. (ఇవి పైజెప్పినశ్లోకమునకు యథాశ్రుతమైన యర్థము).

ఇచ్చట నీవివరణము నెరుంగునది. "సామాన్యం చ విశేషం చ గుణాన్ ద్రవ్యాణి కర్మ చ, సమవాయంచ తత్ జ్ఞాత్వా తన్త్రోక్తం విధిమాస్థితాః" అను నిరువదియేడవ శ్లోకమునజెప్పిన యారీటితో సామాన్యము, విశేషము అను రెంటియొక్క కార్యము పైశ్లోకముచే నిర్దేశింపబడినది. సామాన్యమన నొకదానియందు కలధర్మము మరియొకదానియందలిధర్మముతో తుల్యముగ నుండుట. అట్టిసామ్యము గుణములచే నైనను, ద్రవ్యత్వముచే నైనను, క్రియలచే నైనను కల్గవచ్చును. ఎట్లులన: గోసమూహమును జూచినప్పుడు "ఇది గోవు, ఇది గోవు, ఇది గోవు," అనునిశ్చయము ప్రతిగోవు నుద్దేశించియు గల్గును. అట్టియెడ గోవులు వేరువేరుగ గనబడుచున్నను, ఒకగోవ్యక్తి యింకొకగోవ్యక్తితో గోత్వరూపద్రవ్యధర్మముచే సమానముగ నుండుటవలన (ద్రవ్యసామ్యమునుబట్టి) ప్రతివ్యక్తియందును గోవు అనువ్యవహారము సిద్ధించును. ఇది ద్రవ్యత్వముచే సమానత్వము. ఇట్టి సమానధర్మముకల గోవ్యక్తులపరస్పరసంబంధము (కూటమి) చేత గోవృద్ధిని తెలిసికొనుచున్నాము. కావున సమానగుణద్రవ్యములసంబంధము వృద్ధికారణమని పైని చెప్పబడినది.

గోత్వమునకు విరుద్ధమైనది అశ్వత్వము. ఇది విశేషధర్మము. ఇయ్యది హ్రాసమునకు (గోరూపసంఖ్యను తగ్గించుటకు) కారణము. మరియు దేవదత్తుడు వంటచేయువాడు, యజ్ఞదత్తుడును వంటచేయువాఁడు, వీరిద్దరును వ్యక్తిచే వేరువేరుగ నున్నను వారు చేయునట్టి పాకక్రియ యొకటియగుటచే క్రియాసామాన్యరూపధర్మమునుబట్టి ఏకత్వవ్యవహారము కల్గును.

పైజెప్పినరీతిగ సామాన్యము ద్రవ్య-గుణ-క్రియాభేదములచే మూడువిధముల నుండును. విశేషముగూడ గుణ-ద్రవ్య-క్రియాభేదములచే మూడు తెరంగుల నుండును. వానికి ప్రత్యేకముగ నీక్రిందియుదాహరణముల నెరుంగునది:—భోజ్యరూపమైన మాంసము నుపయోగించినచో శరీరమునందలి ధాతురూపమైనమాంసము వృద్ధిజెందును.

(ఇచ్చట మాంసత్వము సామాన్యము కావున వృద్ధిహేతువు) ఉదకస్వరూపముకల (ద్రవస్వరూపమైన) క్షీరము నుపయోగించినచో ద్రవరూపమైనశ్లేష్మము వృద్ధినొందును. (ఇచ్చట ద్రవము సామాన్యము కావున కఫవృద్ధికి హేతువగును). ఇత్తెరంగున ద్రవ్యరూపమైన సామాన్యముచే తక్కినద్రవ్యములకును వృద్ధి నెఱుంగునది.

నారికేళము, అరటి, ఖర్జూరము మొదలగుద్రవ్యముల నుపయోగించినచో వానియందలి శైత్యాదిగుణములచేత అట్టిశైత్యాదిగుణములు కలకఫము వృద్ధినొందును. ఇత్తెరంగున తక్కినవానికిని గుణసామాన్యముచే వృద్ధి నూహించునది.

క్రియలు శారీరము, వాచనికము, మానసికము నని మూడువిధములు. అందు పరుగిడుట దుముకుట ఎగురుట మున్నగుశారీర (అవయవసంబంధములగు) క్రియలు చలనరూపములైనవి, కావున అట్టిక్రియలచేసిననాడు చలనరూపమైనవాతము వృద్ధినొందును. (ఇచ్చట చలనరూపమైనక్రియ సామాన్యము కావున వృద్ధికారణమైనది). మాట్లాడుట, చదువుట, పాడుట మున్నగువాక్సంబంధములగు చలనరూపక్రియలచే చలనరూపమైనవాతము వృద్ధినొందును. చింత, కామము, దుఃఖము, భయము మొదలగు మానసిక (మనస్సంబంధములగు) క్షోభకరములగు క్రియలచే వాతము వృద్ధిజెందును. కోపము, అసూయ మున్నగుసంతాపకరమానసికక్రియలచే తాపరూపమైనపిత్తము వృద్ధినొందును. నిద్ర, ఆలస్యము, శయనము, సుఖము మొదలగుస్థిరరూపములైన క్రియలచే స్థిరరూపమైనకఫము వృద్ధినొందును. ఇత్తెరంగున తక్కినవానికిని క్రియాసామాన్యమున వృద్ధికారణము నెఱుంగునది.

హ్రాసకారణములు:—అడవిగోధుమలు మాంసమునకంటె భిన్నములైనవి కావున మాంసమునకు విపరీతగుణముకలవి; అట్టి గోధుమల నుపయోగించినచో వానియందలి విశేషధర్మముచేత శరీరమునందలి ధాతురూపమైన మాంసము క్షీణించును. తేజోరూపమైనది క్షారము, కఫము జలరూపమైనది. అట్టి కఫమునకన్న విరుద్ధధర్మముకల క్షారము నుపయోగించినచో క్షారమునందలి విశేషధర్మము కఫమును హరించుటకు కారణమగును. (ఇది ద్రవ్యరూపమైన విశేషము. హ్రాసహేతువు).

గుణరూపమైనహ్రాసకారణము:—కఫము స్నిగ్ధశీతాదిగుణములు కల్గియుండును. ఆరనాళమునందు ఉష్ణతీక్ష్ణాది గుణములుండును. అట్టి యారనాళోపయోగముచేసినచో కఫమునకు విరుద్ధములగు ఉష్ణతీక్ష్ణాదిగుణములు కఫమును క్షయింపజేయును.

క్రియారూపమైన హ్రాసకారణము:—నిద్ర ఆలస్యము మొదలగు క్రియలు స్థిరమైనస్వభావముకలవి. అట్టి నిద్రాదులచేత చలనస్వభావము కలవాతము క్షీణించును.

ఇచ్చట వాతమునందలి చలనమునకు స్థిరరూపమైననిద్రాక్రియ వాతమునకు విశేషము (విరుద్ధము). కావున వాతక్షయమునకు కారణమగును. ఇత్తెఱంగున ద్రవ్యగుణక్రియల సామాన్యముచే వృద్ధియును, విశేషధర్మముచే క్షయంబును కల్గును; కావున సామాన్య విశేషములు వృద్ధిహ్రాసములకు కారణములగునని సామాన్యవిశేషోద్దేశము లీశ్లోకమున నిర్దేశింపబడినవి. వానిలక్షణము క్రిందిశ్లోకమున జెప్పబడినది కావున పునరుక్తమని భ్రమింపవలదు. ఇత్తెఱంగున ద్రవ్యాదివిషయములయందును తొలుత నాయుర్వేదోపయుక్తమైన యుద్దేశమును నిర్దేశించి పిమ్మట వానిలక్షణములు చెప్పబడును.

పైజెప్పినశ్లోకార్థమునే వాగ్భటాచార్యులు:—"వృద్ధిస్సమానై స్సర్వేషాం విపరీతై ర్విపర్యయః" అనువాక్యముచే దెలిపెను. మరియు 'భావానాం' అను పదమునకు ద్రవ్యగుణక్రియలు అని యర్థము. విశేషశబ్దమునకు విపరీతమని యర్థము. ఇట్టియర్థమునే "సర్వేషాం సర్వదా వృద్ధిః తుల్యద్రవ్యగుణక్రియైః, భావైర్భవతి భావానాం విపరీతై ర్విపర్యయః" "సమానై స్సర్వభావానాం వృద్ధిః హానిర్విపర్యయాత్" "విపరీతగుణై ర్ద్రవ్యై ర్మారుత స్సంప్రశామ్యతి" ఇవి మున్నగు తంత్రాంతరవచనములు స్పష్టముగ దెలుపుచున్నవి.

మరియు సామాన్యము వృద్ధికారణమనియు, విశేషము క్షయకారణమనియు చెప్పినది విరుద్ధకారణముతో సంబంధము లేకున్నపుడే సామాన్యము వృద్ధికారణమగును కాని క్షయమునకు కారణముకూడ కలిసియున్నపుడు వృద్ధికి కారణము కానోపదు. విశేషముకూడ వృద్ధికి తగినకారణముతో మిశ్రమైయున్నపుడు హ్రాసమునకు కారణము కాజాలదు. ఎట్లులన:—ఆమలకమున (ఉసిరికాయలయందు) అమ్లరసముకలదు. పిత్తమునందును అమ్లరసము కలదు. అట్టి అమ్లరససామాన్యముచే నామలకము పిత్తమును వృద్ధినొందించవలసియున్నను, పిత్తమునకంటె విరుద్ధమైన శీతరూపమైన వీర్యము ఆమలకమునందున్నది. కావున అట్టియామలకము పిత్తమును క్షీణింపజేయునేకాని వృద్ధినొందింప సమర్థము కానోపదు.

మరియు నికుచాదిఫలములయందు వాతమునకు విరుద్ధమైన స్నిగ్ధత్వాదులుండుటచే వాతమును క్షీణింపజేయవలసియున్నను, అట్టి విశేషమునకు విరుద్ధమైన ప్రభావము కూడ నుండుటంజేసి వాతమును వృద్ధినొందించునేగాని క్షీణింపజేయనోపదు.

మరియు "ప్రవృత్తిరుభయస్య తు" అనుటచేత ... హేతువైన సామాన్య ధర్మము కలద్రవ్యమును హ్రాసహేతువైన విశేషధర్మము ...ద్రవ్యములను మిశ్రముజేసి యుపయోగించినచో ఆరోగ్యము కల్గునని యర్థము.

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI.
22-0-5?

ఎట్లులన:—కేవలము మాంసాదిధాత్వాదులతో సమానధర్మములైన మాంసాదులమాత్ర ముపయోగించినచో మాంసాదిధాతువులు వృద్ధిజెందును. ధాతువులు మిక్కుటముగ వృద్ధినొందుటంజేసి ధాతువైషమ్యము కల్గును. అట్లుగాక కేవలము ధాత్వాదులకు విరుద్ధములైన గుణాదులుంకల విశేషద్రవ్యముల నుపయోగించినచో ధాతువులు క్షీణించును. దానివలనను ధాతువైషమ్యము కల్గును. కావున అట్టిసామాన్యధర్మము కలవానిని విశేషధర్మముకలవానిని (ద్రవ్యగుణక్రియల) సమముగ నుపయోగించినచో ధాతువులు వృద్ధిక్షయములు లేక సమస్థితి నుండును. అప్పుడు ధాతుసామ్యరూపమైన యారోగ్యము కల్గును. అదియే ఆయుర్వేదతంత్రమునకు ప్రయోజనము. ఈవిషయము "ధాతుసామ్యక్రియా చోక్తా తంత్రస్యాస్య ప్రయోజనం" అని చెప్పబడెను.

### సామాన్యవిశేషములకు ప్రత్యేకలక్షణములు.

మూ. సామాన్య మేకత్వకరం విశేషస్తు పృథక్త్వకృత్,
తుల్యార్థతా హి సామాన్యం విశేషస్తు విపర్యయః. ౪౫

వ్యా. ఏకత్వమును (రెండువ్యక్తులకు) కల్గించునట్టి వస్తు నిష్ఠధర్మము సామాన్యమనబడును. ఎట్లులన: గోవ్యక్తులు దేశకాలాదుల భేదముచే పరస్పరభిన్నములుగ నున్నను గోత్వము గోవ్యక్తి సామాన్యముగ వ్యాపించి అన్నిగోవులకు ఐక్యమును కల్గించును. కావున అట్టిగోత్వము సామాన్యమని చెప్పబడును. (ఇయ్యది గోరూపవ్యక్తుల కన్నిటికిని గ్రాహకమగుటంజేసి వృద్ధికి కారణమగును.)

అనేకవ్యక్తులయందు భిన్నభిన్నములుగ (వేరువేరుగ) గానబడు ధర్మము ఒక వ్యక్తినుండి మరియొకవ్యక్తిని వేరుపరచును. ఇదియే విశేష మనబడును. ఎట్లులన:— గోత్వము గోవ్యక్తియందున్నది. గజత్వము గజ (ఏనుగు) వ్యక్తియందున్నది. అట్టియెడ గోత్వము గజత్వబుద్ధిని, గజత్వము గోత్వబుద్ధిని మరలించును; కావున నీధర్మము గోవులనుండి గజములను, గజములనుండి గోవులను వేరుపరచును. ఇదియే విశేషమనబడును. (ఇయ్యది వేరుపరచునట్టి ధర్మము కావున ఏకత్వబుద్ధిని కల్గించు సామాన్యమున కన్న విరుద్ధమైనది.) ఇచ్చట గోత్వము గజవ్యక్తిని, గజత్వము గోవ్యక్తిని (సంఖ్యను) తగ్గించును కాన నీవిశేషము హ్రాసహేతువని పై జెప్పఁబడియె.

దీనికి లోకదృష్టాంతమును ఉత్తరార్ధముచే "తుల్యార్థతా హి సామాన్యం, విశేషస్తు పృథక్త్వకృత్" అని చెప్పెను. ఏకజాతీయములగు వ్యక్తులు దేశకాలాదిభేదములచే ననేకములుగ నున్నను ఆవ్యక్తులయం దన్నిటియందును వ్యాపించియుండు ధర్మము ఏకరూపముగ నుండునపుడు ఆజాతివ్యక్తులన్నియుం సమానములని వ్యవహరింపబడును.

కావున అట్టిన్యాయము ననుసరించి అయ్యది సామాన్యమని చెప్పబడును. (గోత్వము గోవ్యక్తులయం దన్నిటియందును సమత్వబుద్ధిని కల్గించును.)

పైజెప్పినలక్షణమునకు విరుద్ధముగ సమానమైనధర్మముగాక పరస్పరవిలక్షణమైన గోత్వ గజత్వాదిధర్మములు పరస్పరవ్యావర్తకములై విరుద్ధముగ లోకమున నుండును కావున నియ్యది విశేష మనబడును. (గోత్వము అశ్వవ్యక్తిబుద్ధినుండి మరలించును కావున అశ్వవిషయమై గోత్వము వ్యావర్తకము (వేరుపరచును).

ఇది ద్రవ్యగుణక్రియలచే మూడువిధములుగ నుండును. ద్రవ్యవిషయమై గోత్వాది సామ్యమునుబట్టి చెప్పబడినది. శుక్లవర్ణములైన ఘటపటాదులు పరస్పరవిలక్షణము లైయున్నను శుక్లరూపగుణము అన్నిటియందును ఏకరూపముగ వ్యాపించియుండుటంజేసి శుక్లత్వము అన్నిటికిని ఏకత్వబుద్ధిని కల్గించును. (ఇది గుణరూపమైన సామాన్యము). పాచకులైన (వంటచేయువారైన) దేవదత్త-యజ్ఞదత్త-విష్ణుమిత్రాదులు అవస్థాదిభేదములచే పరస్పరవిలక్షణముగనున్నను పచనరూపక్రియ అందరియందును ఏకరూపముగ నుండుటంజేసి ఏకత్వబుద్ధిని కల్గించును. (ఇది క్రియారూపమైన సామాన్యము). విశేషమునకుగూడ నిట్లెఱుంగుననే ద్రవ్యగుణ క్రియా భేదములచే నుదాహరణముల నెఱుంగునది.

ఇచ్చట సామాన్యవిశేషలక్షణములవిషయమై వైశేషికాదిమతముల ననుసరించి యనేకపక్షాంతరము లేర్పడును. విస్తరభీతిచే నిట నవియన్నియుం వివరింపబడవయ్యె. ఆయుర్వేదోపయుక్తాంశములుమాత్ర మిచ్చట క్లుప్తముగ చెప్పబడినవి. విజ్ఞులు గమనించెదరుగాక.

## ఆయురధికరణము.

మూ. సత్వమాత్మా శరీరం చ త్రయమేతత్త్రిదండవత్,
లోక స్తిష్ఠతి సంయోగాత్ తత్ర సర్వం ప్రతిష్ఠితమ్. ౪౬
స పుమాంశ్చేతనం తచ్చ తచ్చాధికరణం స్మృతమ్,
వేదస్యాస్య తదర్థం హి వేదోఽయం సమ్ప్రకాశితః. ౪౭

వ్యా. "సామాన్యం చ విశేషం చ గుణాన్ ద్రవ్యాణి కర్మ చ" అని చెప్పిన యానుపూర్విప్రకారము తొలుత నిర్దేశింపబడిన సామాన్యవిశేషములు పైని నిరూపింపబడినవి. పిమ్మట క్రమప్రకారము గుణమును చెప్పవలసియున్నను అందు ప్రధానంబును, ఆయుర్వేదఉపకార్యంబును, నైనసత్వాత్మశరీరసంయోగరూపమైన హేత్వాద్యధికరణము చెప్పబడుచున్నది:—

సత్త్వము (మనస్సు), ఆత్మ, శరీరము, ఈమూడును చేరి మూడు కంబములుబోలె లోకమునకు జంగమరూపమయిన భూతగ్రామమునకు ఆధారమై యుండును. అట్టి జంగమరూపప్రపంచమును పైజెప్పిన సత్త్వాత్మశరీరములమూటిని అధారముగ జేసికొని అట్టి యాధారమువలన తమతమపనులను నిర్వర్తించుకొనుచు హానిలేక నిలబడి యుంటున్నది. ఈలోకమునందు కర్మఫలము మున్నగునవియన్నియు, అట్టిసత్త్వాత్మశరీర సంయోగరూపమైన యాధారమునందే ఆధారపడియుండును. పైజెప్పినసత్త్వము, ఆత్మ, శరీరము అను నీమూడును ఒక్కటిగ జేరి పురుషుడనియు, జ్ఞానమనియు చెప్పబడును. మఱియు నీయాయుర్వేదమునకు అధికరణమనియు నది చెప్పబడును. అట్టి సత్త్వాత్మశరీరముల కుపకారమునకై ఈయాయుర్వేదము ప్రవర్తించినదిగాన అయ్యది ఆయాయుర్వేదమునకు అధికరణమని భావము.

ఇచ్చట సత్త్వాది నిర్దేశముచేతనే మూడు అనునర్థము అగుచున్నను 'త్రయమేతత్ త్రిదండవత్' అని చెప్పుటవలన సత్త్వాత్మశరీరములు మూడును కలసియే లోకమునకు ఆధారమగునని తెలియుచున్నది. లోకమున మూడుకాళ్లుగల త్రిపదియందు దాని నాధారముగ జేసి యొకవస్తువు స్థిరముగ నిలచియుండదు. ఆకాళ్లలో నొకటి లేకున్ననాడు నిలువ వీలుండదుగదా. అత్తెరంగుననే సత్త్వాదులు మూడును కలసి లోకమున కాధారమగునుగాని అందొకటి లేనినాడు నిలువనోపదని భావము.

'లోకః' అనగా 'లోకతే ఆలోకతే ఇతి లోకః' అను వ్యుత్పత్తిచేత జంగమరూపమయిన భూతప్రపంచమని యర్థము. శరీరశబ్దముచేత చక్షురాది ఇంద్రియసముదాయరూపమయిన సూక్ష్మశరీరముగూడ గ్రహింపనగును. ఆత్మకును శరీరమునకును సంబంధించినపనులు మనస్సు అధీనముగ నుండునుగాని అట్టిమనస్సును ప్రధానముగ జేసి తొలుత నిర్దేశింపబడినది. ఆత్మశబ్దముచేత బుద్ధి అహంకారము మున్నగునవియు శరీరశబ్దముచేత శరీరమునకు సంబంధించిన ఇంద్రియములు ఇంద్రియార్థములుగూడ గ్రహింపబడును.

"అత్ర సర్వం ప్రతిష్ఠితమ్" అనుచోట కర్మఫలము, జ్ఞానము, సుఖము, దుఃఖము, జీవితము, మరణము, శుభము మున్నగునవియన్నియు సత్త్వాత్మశరీరములనే ఆధారముగ జేసియుండునని భావము. ఈవిషయము ఈతంత్రకారునిచే నిట్లు చెప్పబడినది:—"అత్ర కర్మఫలం చాత్ర జ్ఞానం చాత్ర ప్రతిష్ఠితం, అత్ర మోహాః సుఖం దుఃఖం జీవితం మరణం శుభాః."

## ద్రవ్యసంగ్రహము సేంద్రియనిరింద్రియవిభాగము.

మూ. ఖాదీన్యాత్మా మనః కాలో దిశశ్చ ద్రవ్యసంగ్రహః,
సేన్ద్రియం చేతనం ద్రవ్యం నిరిన్ద్రియ మచేతనమ్. ౪౮

వ్యా. నిర్దేశక్రమము ననుసరించి గుణములు చెప్పవలసియున్నను అట్టిగుణముల కాధారమైనద్రవ్యము ప్రధానమగుటంజేసి అట్టి ద్రవ్యసంగ్రహము తొలుత చెప్పబడుచున్నది. ఆకాశాది పంచమహాభూతములును, నిర్వికారమైన యాత్మయుం, మనస్సును, కాలంబును, దిక్కులును ఇవియన్నియు చేరి సంగ్రహముగ ద్రవ్యములు కరచరణాద్యవయవంబులును హరీతకి త్రివృతు మున్నగునవియు ద్రవ్యములు అనేకములుగ నుండునుగాన ఇచ్చట సంగ్రహముగ చెప్పబడినది. పైజెప్పినవానిలో ఇంద్రియజ్ఞానము కల్గినది చేతనద్రవ్యము. ఇంద్రియజ్ఞానములేనిది అచేతనము.

ఇచ్చట 'నిరిన్ద్రియ' మనుచోట 'నిర్' అనుదానికి అభావమని యర్థము. ఇంద్రియజ్ఞానము లేనిద్రవ్యము అచేతనమని భావము. "చేతనావాన్ యతశ్చాత్మా తతః కర్తా నిరుచ్యతే" అను ప్రమాణము ననుసరించి ఆత్మ యొక్కటియే చేతనావంతము అగునుగాని, శరీరము మనస్సు చేతనావంతములు కానేరవని చెప్పవలయును. అయినను జలమునందు ఉష్ణగుణము లేకున్నను అగ్నిసంబంధమునంజేసి వేడియైనపుడు ఉష్ణజలము అని వ్యవహరించువిధముగ చేతనావంతమైన యాత్మసంబంధమునంజేసి మనస్సును, శరీరంబును, చేతనావంతములనియే వ్యవహరింపబడును. ఆత్మకు గూడ ఇంద్రియసంయోగము కల్గినప్పుడే చేతనావత్వము సిద్ధించును. ఈవిషయమున "ఆత్మనః కరణైః యోగాత్ జ్ఞానం తస్య ప్రవర్తతే" అనువాక్యము ప్రమాణము. మఱియు వృక్షగుల్మలతాదులు గూడ ఇంద్రియజ్ఞానము కల్గియున్నవిగాన చేతనద్రవ్యముగనే పరిగణింపబడును. వృక్షాదులకు ఇంద్రియజ్ఞానము ఎట్టులన:—ఆదిత్యభక్తి (ప్రొద్దుతిరుగుడుచెట్టు) యనునది సూర్యున కభిముఖమై సూర్యునితో గూడ వాలుచుండును. కావున దీనికి చక్షురింద్రియజ్ఞానము కలదని యూహింపవలసియున్నది. ఏలకతీగె మేఘగర్జనము వినునప్పుడు కాయలు కాచును. కాన దీనికి శ్రవణేంద్రియజ్ఞానము కలదని చెప్పదగియున్నది. జీమూతము (చేదుపొట్ల) అనునది నక్కయొక్క వసా (క్రొవ్వు) గంధమును మూర్కొనునపుడు ఫలించును. కాన దీనికి ఘ్రాణేంద్రియ జ్ఞానము కలదని తోచుచున్నది. వంగచెట్లు మత్స్యపిత్తము చల్లినప్పుడు కాయలకాచును కాన దీనికి రసనేంద్రియజ్ఞానము కలదని చెప్పదగియున్నది. అశోకవృక్షము ఉత్తమజాతిస్త్రీపాదతాడనముచేత పూచును. కావున దీనికి స్పర్శేంద్రియజ్ఞానము కలదని

యూహింపదగియున్నది. మఱియు "అభివాదితస్తు యో విప్రో నాశిషం సమ్ప్రయచ్ఛతి స్మశానే జాయతే వృక్షః గృధ్రకంకోపసేవితః" అను వచనముచేత బ్రాహ్మణునకు నమస్కరించినపుడు ఆశీర్వదింపకయున్నవాడు శ్మశానమునందు చెట్టుగా పుట్టి గ్రద్దలు మున్నగువానిచే సేవింపబడునని తెలియుచున్నదికాన చెట్లకు జ్ఞానము కలదని యేర్పడుచున్నది. కావున వృక్షాదులకు ఇంద్రియజ్ఞానము కలదనువిషయము నిర్వివాదాంశము. కావున వృక్షగుల్మలతాదులు గూడ చేతనద్రవ్యములలోనే పరిగణింపబడుచున్నది.

## గుణములు, కర్మ.

మూ. సార్థా గుర్వాదయో బుద్ధిః ప్రయత్నాన్తాః పరాదయః,
గుణాః ప్రోక్తాః

వ్యా. ఇంద్రియార్థములు (శబ్ద-స్పర్శ - రూప - రస-గంధములు), గుర్వాదులు (గురు-లఘు-శీత-ఉష్ణ-స్నిగ్ధ-రూక్ష - మన్ద - తీక్ష్ణ-స్థిర-సర - మృదు - కఠిన - విశద - పిచ్ఛిల-శ్లక్ష్ణ - ఖర-స్థూల-సూక్ష్మ - సాంద్ర-విశదములను నిరువది), బుద్ధి - (స్మృతి, చేతన, ధృతి, అహంకారము మున్నగు బుద్ధివిశేషణములును), ప్రయత్నము అనునది అంతముకాగల ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, ప్రయత్నము అనునవి యైదును, పరాదులును (పరత్వము, అపరత్వము, యుక్తి, సంఖ్య, సంయోగము, విభాగము, పృథక్త్వము, పరిమాణము, సంస్కారము, అభ్యాసము అనునవి పరాదులు), ఇవి యన్నియు గుణములు.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—గుణములు విశేషగుణములు, సామాన్యగుణములు, ఆత్మగుణములు నని మూడువిధములు. అట్టి మూడువిధములైన గుణంబులును ఈశ్లోకమున నిర్దేశింపబడినవి. ఎట్టులన:—శబ్ద-స్పర్శ-రూప-రస-గంధము లనునవి యైదును పంచభూతములలో నొక్కొకదానిని ప్రధానముగ నాశ్రయించి యుండును. అందు ఆకాశమును శబ్దంబును, వాయువును స్పర్శంబును, అగ్నిని రూపంబును, జలమును రసంబును, పృథివిని గంధంబును ప్రధానముగ నాశ్రయించియుండును. ("అర్థశ్శబ్దాదయో జ్ఞేయాః గోచరా విషయా గుణాః" అని చెప్పబడినవి). కావున నీయైదుగుణములును విశేషగుణములు. వాయ్వాదులయందు గుణాంతరసంయోగము భూతాంశాను ప్రవేశమున కల్గినను పంచభూతములకు ప్రధానముగ పైజెప్పినగుణములు నియతముగ నుండును కావున విశేషములనుట నిర్వివాదము.

గురులఘ్వాదిగుణము లిరువదియు పృథివ్యాది పంచభూతములకును సాధారణము లగుటంజేసి సామాన్యగుణము లనబడును.

“ఇచ్ఛాద్వేష స్సుఖం దుఃఖం ప్రయత్నశ్చేతనా ధృతిః, బుద్ధిస్స్మృతిరహంకారః లిఙ్గాని పరమాత్మనః” అని యాత్మగుణములు చెప్పబడినవి. ఇందు బుద్ధి శబ్దముచేత చేతనము, ధృతి, స్మృతి, అహంకారము అను నీయైదును ‘ప్రయత్నాన్తాః’ అని చెప్పుటచేత ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, ప్రయత్నము అను నీయైదును గ్రహింపబడును. మొత్తమున నీపదియు నాత్మగుణములు.

పరాదులు తంత్రాంతరమున నిట్లు చెప్పబడినవి:—పరాఽపరత్వే యుక్తిశ్చ సంఖ్యాసంయోగ ఏవ చ, విభాగశ్చ పృథక్త్వం చ పరిమాణ మథాపి చ, సంస్కారోఽభ్యాస ఇత్యేతే గుణాః ప్రోక్తాః పరాదయః” ఈపరాదిగుణము పంచభూతసామాన్యములతో జేరినవి. ఐనను ఇవి యంతగ నుపయుక్తము కావు; కావున ప్రత్యేకముగ గొసన జెప్పబడినవి.

## కర్మనిర్దేశము.

మూ. ప్రయత్నాది కర్మ చేష్టిత ముచ్యతే. ౪౯

వ్యా. మఱియు ప్రయత్నము మున్నగు చేష్టారూపమైన వ్యాపారము కర్మయనబడును. (చేష్ట యనగ ఒకకార్యార్థమై కల్గిన ప్రవృత్తి. అయ్యది క్రియా (వ్యాపార) రూపమైనది. అయ్యది ప్రయత్నమనియు, కార్యసమారంభమనియుం చెప్పనగును. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—“ప్రవృత్తిస్తు చేష్టా కార్యార్థాసైవ క్రియా ప్రయత్నః కార్యసమారమ్భశ్చ” ఒకకార్యార్థమై కల్గిన యాంగికాదిచేష్టయే ప్రవృత్తి యనబడును. అయ్యది క్రియ యనియు, ప్రయత్నమనియు, కార్యసమారంభ మనియు చెప్పబడును. ఒకకార్యమును సాధించుటకై కల్గిన యాంగికాది చేష్టారూపమైన వ్యాపారము కర్మయని ఫలితార్థము.

## సమవాయము, దానిలక్షణము.

మూ. సమవాయోఽపృథగ్భావః భూమ్యాదీనాం గుణైర్మతః,
స నిత్యో యత్ర హి ద్రవ్యం న తత్రానియతో గుణః. ౫౦

వ్యా. ఈశ్లోకమున సమవాయమును నిర్దేశించి దానిలక్షణమును చెప్పబడును కావున పైన చెప్పబడు ద్రవ్యాదిలక్షణములతో కూడ సమవాయలక్షణమును ప్రత్యేకముగ చెప్పుటలేదు.

పృథగ్భావము అన వేరుగనుండుట. అపృథగ్భావమన సర్వకాల సర్వావస్థలయందును ఒకటి నొకటి విడనాడ కొకటిగ చేరియుండుట. అనేకములగు సాధర్మ్య

ములకు ఆధారములైనవి భూమ్యాదిద్రవ్యములు. కావుననే యవి ప్రధానములు. అట్టి భూమ్యాది ప్రధానద్రవ్యముల నాధారముగ జేసికొని శబ్దస్పర్శాదులును గుర్వాదులు నైన సకలగుణంబులును అవయవికి సంబంధించిన సామాన్యకర్మములును నిలచియుం డును. కావుననే గుణాదులు ఆధేయములు. ఇవి ఆధారములగు ద్రవ్యములకన్న నప్ర ధానములు. గుణశబ్దమునకు అప్రధానమనియు నర్థము కలదు. (గుణీభూతము, అను స్థలములయందు అప్రధానము అని అర్థముచేయుట సంప్రదాయసిద్ధము.)

సముదితార్థము:—పలుదెరంగులై యప్రధానములైన శబ్దస్పర్శాదిగుణములు మున్నగువానిలో, అట్టిగుణాదులకు ఆధారములగుటంజేసి ప్రధానములైన భూమ్యాది ద్రవ్యములకు కలయపృథగ్భావము (సర్వావస్థలయందును విడనాడక కలిసి యుండుట) సమవాయ మనబడును. అట్టి సమవాయము నిత్యము. ఏలయన:—ఎచ్చట ఆకాశాది ద్రవ్యము నిత్యముగ నుండునో అచ్చట నాద్రవ్యమునకు సంబంధించిన ఆకాశత్వాది గుణములు నియతముగ ననాపాయియై యుండును. కావున ఆరెంటికి ఎడలేనిచేరి కయే సమవాయమగును. గుణిని విడిచి గుణములుండవు కావున నీరెండిటికిని నిత్య సంబంధము. అదియే సమవాయము. కావున నయ్యది నిత్యము. అని నిష్కృష్టార్థము.

అవయవావయవద్రవ్యములకును, గుణగుణులకును, కర్మాకర్మవంతములకును, సామాన్యాసామాన్యవంతములకును అవినాభావసంబంధము. అయ్యదియే సమవాయము. గుణములను వదలి గుణి వేరుగనుండ వలనుపడదు. కావున నారెంటికిని చేరిన సమవాయ సంబంధము నియతమని భావము.

## ద్ర వ్య ల క్ష ణ ము.

**మూ. యత్రాశ్రితాః కర్మగుణాః కారణం సమవాయి యత్, తద్ద్రవ్యం**

వ్యా. క్రియారూపమైన కర్మయు, 'సార్థా గుర్వాదయః' అను శ్లోకముచే జెప్పబడిన విశేషసామాన్య ఆత్మగుణంబులును ఏవయస్సునందు ఆశ్రయించి సమవాయిగ (సమవాయసంబంధము కల్గినదిగ) నేది యుండునో అయ్యది ద్రవ్యమనబడును.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—సమవాయియన 'యత్సమవేతం సత్కార్య ముత్పాద్యతే తత్సమవాయి' అను నైయాయికలక్షణము ననుసరించి యేది యేకార్యము నందు సమవాయసంబంధముతో గూడియుండి కార్యము కల్గునో అయ్యది ఆకార్య మునకు సమవాయి యనబడును. ఎట్లులన:—మృత్తు ఘట రూపకార్యమునందు సమ వాయసంబంధముచే కూడియుండి ఘటరూపకార్యము జనించునో అట్టి మృత్తు ఘట

కార్యమునుగుఱించి సమవాయికారణము. ఈలక్షణము ననుసరించి యిట్లు అర్థముచేయ నగును. ఏవస్తువునందు 'సంయోగే చ విభాగే చ' అను శ్లోకముచే జెప్పబడిన క్రియా రూపమైన (చేష్టారూపమైన) కర్మయు, శబ్దస్పర్శాదులును, గుర్వాదులును, ఇచ్ఛాద్వేషా దులును నని త్రివిధగుణములు సమవాయసంబంధముచేత ఆశ్రయించియుండి, యే వస్తువు సమవాయిగ (కార్యమునకు సమవాయసంబంధము కలదిగ) నుండునో అయ్యది ద్రవ్యమనబడును. (కర్మలకును గుణములకును ఆధారమై కార్యమునందు సమవాయ సంబంధముచే నుండునది ద్రవ్యమని ఫలితార్థము).

ఉదాహరణ మెట్టులన:—త్రిఫలములు కటుతిక్తాది రసములకును విశదాది గుణములకును ధాతుసామ్యరసాయనాది కర్మలకును ఆధారములై కార్యమునకు సమవాయసంబంధముకలవియు నైనవి కావున ద్రవ్యమని యెఱుంగునది.

ఇచ్చట ద్రవ్యము తానుకూడ కలిసి కార్యమును కల్గించును కావున సమవాయి యగును. గుణములును కర్మయు తాముచేరి కార్యము కల్గుట లేదు కావున నీరెండును సమవాయి కానేరవు. ఏద్రవ్యమైనను ఉత్పత్తిక్షణమున గుణరహితముగనే యుండును. అయినను ఉత్పత్త్యుత్తరక్షణమున గుణముతో కూడియుండును కావున గుణవైశిష్ట్య యోగ్యత కల్గియుండుటంజేసి గుణవిశిష్టమే యగును. ఈలక్షణమునే వైశేషికమతమున 'క్రియావద్గుణవత్సమవాయికారణం ద్రవ్య'మని చెప్పియున్నది. క్రియయును గుణం బులును కల్గి సమవాయికారణమైనది ద్రవ్యమని నిష్కృష్టలక్షణము.

## గుణలక్షణము.

సూ. సమవాయీ తు నిశ్చేష్టః కారణం గుణః. ౫౧

వ్యా. క్రియారూపమైన చేష్టలేక సమవాయసంబంధమునకు ఆధేయమైన కారణము గుణమని చెప్పనగును. (సమవాయసంబంధము గల్గి ఆధేయతాధర్మమునకు కారణమైనది గుణమని భావము).

'ఘటో రూపవాన్' అనుచోట రూపమనునది ఘటమునకాధేయము ఘటము ఆధారము. ఆధేయమగురూపము సమవాయసంబంధముచేత ఘటమునందున్నది. 'గుణగుణినోః సమవాయస్సంబంధః' అనుటచేత గుణమైనరూపమునకును ఆధారభూతమై గుణియైన ఘటమునకును సమవాయసంబంధము. కావున సమవాయియైన ఘటమునకాధేయమై చేష్టారహితమై కారణరూపమైన రూపము గుణమని చెప్పబడును. ఇత్తెఱంగుననే ద్రవ్యములగు త్రిఫలాదులకును, దానికాధేయములగు గురులఘ్వాది గుణములకు పైజెప్పినరీతిగ లక్షణసమన్వయము నూహించునది.

ఇచ్చట 'నిశ్చేష్టః' అని చెప్పుటచేత ద్రవ్యమున సమవాయసంబంధము కల్గినను కర్మ చేష్టావంతము కావున నయ్యది గుణమని చెప్పకూడదు. పృథివ్యాదిపంచభూతములు నిశ్చేష్టములైన సమవాయాధేయములు కావు, కావున నవి గుణములని చెప్పబడవు. 'కారణం' అను విశేషణముచేత దేనికి కారణముకాని సామాన్యవిశేషసమవాయములును గుణములు కానోపవు.

## కర్మలక్షణము.

మూ. సంయోగే చ విభాగే చ కారణం ద్రవ్యమాశ్రితమ్,
కర్తవ్యస్య క్రియా కర్మ కర్మ నాన్య దపేక్షతే. ॥౨॥

వ్యా. (సంయోగమన—ఉత్తరదేశసంబంధము, విభాగమన పూర్వదేశసంయోగనాశము) పూర్వదేశసంబంధ వినాశపూర్వక ఉత్తరదేశసంయోగమునకు కారణమై సమవాయసంబంధముచే ద్రవ్యము నాశ్రయించిన వ్యాపారరూప (చేష్టారూప) క్రియ కర్మ యనబడును. అట్టి వ్యాపారము చేయదగినకార్యమునకు సంబంధించియుండును. మరియు నయ్యది యితరకారణము నపేక్షింపదు.

లక్షణపరిష్కారము:—సమకాలమున సంయోగవిభాగముల రెంటికిని కారణమై ద్రవ్యము నాశ్రయించినదియు, చేయదగినపనికి సంబంధించినదియు కారణాంతరము నపేక్షించకుండునదియు నగు చేష్టారూపమైనక్రియ కర్మయని చెప్పబడును.

'కర్మ నాన్యదపేక్షతే' అనుదాని కిది భావము.—ఉత్పన్నమైన కర్మ తన కాశ్రయమైన ద్రవ్యమునకు సంబంధించి పూర్వదేశవిభాగమును ఉత్తరదేశసంయోగమును చేయునపుడు తనకంటె నుత్తరకాలమున పుట్టు ఇతరకారణము నపేక్షింపకయే ప్రవర్తించును. ద్రవ్యము సంయోగవిభాగములరెంటికిని సమకాలమున కారణమైనను, ఉత్తరకాలమున కల్గు కారణాంతరము నపేక్షించియే యుండును. ఘటము ఉత్పన్నమైనవెనుక సంయోగవిభాగములకు గాను చేష్టారూపమైన కారణాంతరము నపేక్షించియే యుండును. కర్మ యనునది కపాలద్వయ సంయోగాది వ్యాపారమురూపముగ తాను పుట్టునపుడే ఉత్తరకాలమున బుట్టు కారణాంతరము నపేక్షింపకయే సంయోగవిభాగముల నిర్వర్తించును. కావున ద్రవ్యమునకును కర్మకును భేదము నెరుంగునది.

మరియు 'కర్తవ్యస్య క్రియా కర్మ' అని చెప్పుటచేత చేయదగిన చేష్టారూపమైన క్రియకు కర్మయని సంజ్ఞయనియర్థము. వమనాదికర్మలును అదృష్టాదికర్మలును క్రియారూపములు కావు కాన వానికి కర్మసంజ్ఞ లేదు.

## కార్యలక్షణము.

మూ. ఇత్యుక్తం కారణం; కార్యం ధాతుసామ్యమిహోచ్యతే,
ధాతుసామ్యక్రియా చోక్తా తన్త్రస్యాస్య ప్రయోజనమ్. ౫౩

వ్యా. ఇత్తెఱంగున సామాన్యము, విశేషము, గుణము, ద్రవ్యము, కర్మ, సమవాయము అని యాఱువిధములైనకారణములు ఆయుర్వేదమునకు సంబంధించి చెప్పబడినవి పూర్తియైనవి. ఇతరశాస్త్రములయందు ఘటాదులు కార్యములని చెప్పబడినవి. ఈవైద్యశాస్త్రమునకు ధాతుసామ్యరూపమైన యారోగ్యమే ప్రయోజనము; కావున నీవైద్యతంత్రమునందు ఇతరశాస్త్రములవలెగాక ధాతుసామ్యరూపమైన యారోగ్యమే కార్యమని చెప్పబడును.

ధాతుసామ్యమన:—"వికారో ధాతువైషమ్యం సామ్యం ప్రకృతి రుచ్యతే, సుఖసంజ్ఞకమారోగ్యం" అని యీతంత్రకారుఁడే పైని చెప్పబోవును.

## రోగకారణసంగ్రహము.

మూ. కాలబుద్ధీన్ద్రియార్థానాం యోగో మిథ్యా న చాతి చ,
ద్వయాశ్రయాణాం వ్యాధీనాం త్రివిధో హేతుసఙ్గ్రహః. ౫౪

వ్యా. శీత-ఉష్ణ - వర్ష భేదములచే మూఁడువిధములైనకాలము, బుద్ధి (ప్రకర్ష జ్ఞానము), ఇంద్రియార్థములు (పంచమహాభూతగుణములైన శబ్దస్పర్శరూపరసగంధములు), అను నీమూఁటి (కాల - బుద్ధి - ఇంద్రియార్థముల) యొక్కయు, ఇంద్రియార్థసహచరితములై ఇంద్రియముల ద్వారకముగ నుపయోగింపబడు ద్రవ్యగుణకర్మంబులయొక్కయు హీనయోగంబును (నియమిత పరిమాణమునకన్న తక్కువగ సంబంధము కల్గుట), మిథ్యాయోగంబును (తనకుండవలసిన పరిస్థితికన్న వ్యతిరేకముగ సంబంధము కల్గుట), సంబంధము బొత్తుగ లేకుండుటయు, అతియోగంబును (తనకు నియతమైన పరిమితికన్న నధికముగ సంబంధముఁ కల్గుటయు), శరీరమును మనస్సును నాశ్రయించి జనించువ్యాధులకు హేతువులగును. (అనగా శీతోష్ణాదికాలమునకును, బుద్ధికిని, శబ్దస్పర్శాదీంద్రియార్థములకును సంభవించు మిథ్యాయోగము, అయోగము, అతియోగము ననుమూఁడును శారీర-మానసవ్యాధుల రెంటికిని కారణములగును; ఇది వ్యాధిహేతువులసంగ్రహము అని భావము.)

ఇచ్చట హీనయోగమనునది అయోగముననే యంతర్భావము నొందునుకాన వేరుగ జెప్పబడలేదు. "శరీరం సత్వసంజ్ఞం చ రోగాణా మాశ్రయో మతః" అని

చెప్పబడుప్రకారము శరీరమునకును మనస్సునకును వేరువేరుగ సంబంధించి పుట్టినవ్యాధులును, రెంటికిని సమకాలమున సంబంధించి బుట్టినవ్యాధులును 'ద్వయాశ్రితానాం' అను పదముచే గ్రహింపబడును. పైజెప్పిన కాలాదుల అయోగాతియోగ మిథ్యాయోగ లక్షణములు తిస్రైషణీయాధ్యాయమున వివరింపబడును. మరియుం కాలము దుష్పరిహార్యమగుటంజేసి బలవత్తరము కావున తొలుత జెప్పంబడియె. బుద్ధ్యపరాధముచే నింద్రియార్థాతియోగాదులు కల్గును కావున కాలమునకు పిమ్మట చెప్పబడినది.

"ప్రజ్ఞాపరాధాద్ధ్యహితాన్ అర్థాన్ పఞ్చ నిషేవతే" అని చెప్పబడుప్రకారము అసాత్మ్యేంద్రియార్థసంయోగము ప్రజ్ఞాపరాధమునందే చేరును. అయినను అసాత్మ్యేంద్రియార్థసంయోగమునకు ప్రజ్ఞాపరాధము కారణము, అట్టిసంయోగము వ్యాధులకు సన్నిహితకారణ మగును కావున సుబోధమునకై ప్రత్యేకముగ జెప్పబడెను. మరియు అసాత్మ్యేంద్రియార్థసంయోగమునకన్న వ్యతిరిక్తమైన కాయవాఙ్మనః క్రియాపరాధమున ప్రజ్ఞాపరాధశబ్దము వర్తించును కావున ప్రత్యేకముగ జెప్పినది సమంజసమని భావము.

ఇచ్చట 'న చాఽతి చ' అనుచకారము హీనయోగమును గూడ గ్రహించును. హీనయోగ - మిథ్యాయోగ - అయోగములు మూడును వ్యాధిహేతువు లగునని యెరుంగునది. ఈయుద్దేశముచేతనే "మిథ్యాతిహీనలిఙ్గేభ్యో యో వ్యాధిరుపజాయతే" అని వేరొకచోట చెప్పబడినది. మరియుం లోకమున నొకబియ్యపుగింజను తిన్నను అశనమని చెప్పబడురీతిగ నిచ్చట నతిస్వల్పముగ యోగము కల్గినను అయోగమనియే చెప్పబడును; కావున నీయోగశబ్దముచేతనే స్వల్పయోగరూపమైన హీనయోగంబును గ్రహింపబడును. ఈవిషయమును వాగ్భటాచార్యుడు స్ఫుటముగ నిట్లు చెప్పెను:—
"కాలార్థకర్మణాం యోగాః హీనమిథ్యాతిమాత్రకాః, సమ్యగ్యోగశ్చ విజ్ఞేయః రోగారోగ్యైకకారణమ్" ఇచ్చట హీనయోగము వాచకముగనే చెప్పబడినది. మరియు కాల - అర్థ - కర్మముల సమ్యక్ యోగము ఆరోగ్యకారణ మనియు పైవాక్యమున జెప్పబడినది. మరియుం నీవిషయమున తిస్రైషణీయాధ్యాయమున 'తత్రాత్మప్రభావానాం' అని యుపక్రమించి విశేషముగ వివరింపబడును. కావున నిచ్చట నింతట విరమింపబడును.

### రోగముల కాశ్రయములు.

మూ. శరీరం సత్వసంజ్ఞం చ వ్యాధీనా మాశ్రయో మతః,
తథా సుఖానాం యోగస్తు సుఖానాం కారణం సమః. ౫౫

వ్యా. శరీరము, మనస్సు ఈరెండును వేరువేరుగను రెండును కలసియుం వ్యాధులకు నాశ్రయము (అధిష్ఠానము) అగును. (అందు కుష్ఠాదిరోగములకు శరీరంబును, కామాదిరోగంబులకు మనస్సును, ఉన్మాదము మున్నగురోగములకు శరీరమనస్సులు రెండును, ఆశ్రయము లగును.) మఱియుం సుఖకరములయిన పైజెప్పిన కాల - బుద్ధి - ఇంద్రియార్థములయొక్క సమ్యగ్యోగము ఆరోగ్యరూపమయిన సుఖములకు పైజెప్పిన మనశ్శరీరములు రెండును ఆశ్రయము లగును. అనగా కాలబుద్ధి ఇంద్రియార్థముల యొక్క న్యూనాతిరేకములేని సమయోగము సమ్యగ్యోగ మనబడును. అట్టియోగము ఆరోగమునకు కారణము, అట్టి యారోగ్యమునకును, శరీరమనస్సులు ఆశ్రయమగును. అందు మనస్సంబంధమైన యారోగ్యమునకు మనస్సును, శరీరసంబంధమయిన రోగములకు శరీరమును, ఈరెంటికిని సంబంధించిన యారోగ్యమునకు రెండును ఆశ్రయములగునని భావము. అట్టి యారోగ్యమును సుఖకరములయిన కాలబుద్ధి ఇంద్రియార్థముల యొక్క సమయోగము కారణమగునని ముఖ్యభావము.

ఇచ్చట. శరీరరోగములను ముఖ్యముగజేసి ఈతంత్రము ప్రవర్తించినవిగాన శరీరము తొలుత నిర్దేశింపబడినది. మఱియుం అధ్యాయ విషయసంగ్రహమునందు యాధ్యాశ్రయమును ప్రత్యేకముగ జెప్పియుండలేదు. అయినను "హేతశ్చ" అను చకారముచేత యాధ్యాశ్రయముకూడ గ్రహింపబడును. కావున ఇచ్చట యాధ్యాశ్రయ మని చెప్పుట అనార్షమని భ్రమింప పనిలేదు.

## ఆత్మస్వరూపలక్షణము.

మూ. నిర్వికారః పరస్త్వాత్మా సత్వభూతగుణేన్ద్రియైః,
చైతన్యే కారణం నిత్యో ద్రష్టా పశ్యతి హి క్రియాః. ౫౬

వ్యా. పరమాత్మ వికారములేనిది మిక్కిలి సూక్ష్మంబును శ్రేష్ఠంబును అయినది. అట్టి యాత్మ మనస్సు, పంచభూతములకు సంబంధించిన శబ్దస్పర్శరూపరసగంధములు, త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములు అనువాని సంబంధమునంజేసి ఇంద్రియాదిజ్ఞానమునందు కారణమగును. (అట్టి నిర్వికారంబును సూక్ష్మసూక్ష్మంబునైన యాత్మ తాను నిర్లేపముగ సంతర్యామియై ఇంద్రియేంద్రియార్థముల సంబంధమునంజేసి నేను ద్రష్టను, నేను శ్రోతను అని తాను ఆయాయింద్రియవ్యాపారములకు సాక్షియై అన్నివిషయములను తాను చూచుచుండునని భావము). సకలజ్ఞానములకును ద్రష్టగానుండు పరమాత్మ నిత్యమైనది. కావున అట్టియాత్మకు సంబంధించియెప్పుడు వ్యాధులు కల్గబోదు. కావున వ్యాధ్యాశ్రయముగ శరీరమనస్సులుమాత్రము జెప్పబడినది. 'సత్వమాత్మా

శరీరం చ త్రయం' అని చెప్పినది సత్వాదుల కన్నిటికిని ప్రధానమగుటచే పరిగణింప బడినదికాని అంతమాత్రముచే వ్యాధిసంబంధముకలదని యూహింపదగదు.

## శారీరమానసదోషసంగ్రహము.

మూ. వాయుః పిత్తం కఫశ్చోక్తశ్శారీరో దోషసఙ్గ్రహః,
మానసః పునరుద్దిష్టో రజశ్చ తమ ఏవ చ. ౫౭

వ్యా. వాయువు, పిత్తము, కఫమునని శరీరసంబంధములగు దోషములు మూడు. అని సంగ్రహముగ జెప్పబడినది. రజస్సు, తమస్సు నని మనస్సంబంధములైన దోషములు రెండు.

ఇచ్చట వాతాదులు మూడును శరీరమును ధరించుటంజేసి ధాతువులని చెప్ప వలసియున్నను, రసరక్తాదులను ప్రకోపావ్యవస్థలయందు చెరుచునవియని దెలుపుటకై దోషములని చెప్పబడెను. సమాసముగ జెప్పక వేరువేరుగ చెప్పుటచేత ఈమూడుదోషములును వ్యస్తములుగను సమస్తములుగను జేరి రోగముల గల్గించునని తెలిసెడి.

దోషముల మూటిలో వాతము 'ఆశుకారీ ముహుశ్చారీ' ఇత్యాది వాక్యముల చేత శీఘ్రముగ రోగముల గల్గించునదియు మాటిమాటికి పలుదెఱంగుల వ్యాపించు నదియు నని తెలిసెడి. వ్యాధుల పరిగణనము చేయునప్పుడు 'అశీతిం వాతజాన్ వికారాన్, చత్వారింశత్పిత్తవికారాన్, వింశతిం చ కఫజాన్' అను వాక్యముచేత వాతరోగములు ఎనుబది యనియు, పిత్తరోగములు నలువది యనియు, కఫవ్యాధులు ఇరువది యనియు తెలిసెడి. ఆశుకారిత్వాదికారణములచేతను, రోగసంఖ్యాధిక్యము చేతను ప్రధానమగుటంజేసి తొలుత నిర్దేశింపబడినది. మరియు "పిత్తం పఙ్గు కఫః పఙ్గుః పఙ్గవో మలధాతవః, వాయునా యత్ర నీయన్తే తత్ర గచ్ఛన్తి మేఘవత్" అను శ్లోకంబును వాతప్రాధాన్యమును తెలుపుచున్నది.

పిత్తము శరీరములకు మూలభూతమగు అగ్నికి కారణమగుటచేతను, కఫమునకన్న నధికసంఖ్యాకరోగముల గల్గించుటచేతను, కఫమునకన్న శీఘ్రకారి యగుటచేతను ప్రధానము కావున వాతమునకు పిమ్మట నిర్దేశింపబడినది. ఈవిషయము రోగాధ్యాయమున నిట్లు చెప్పబడినది:—"వాత మనుపిత్తం ప్రధానం శరీరమూలభూతాగ్నిహేతుత్వాత్, తథా కఫాధిక వికారకారిత్వాత్, తథా కఫాపేక్షయా చాశుకారిత్వాత్" పిమ్మట కఫమును చెప్పబడినది. మరియు "ద్వ్యుల్బణైకోల్బణైష్షట్ స్యుః" ఇత్యాదివాక్యములచే సంసర్గసన్నిపాతాది భేదములంజేసి దోషములు అనేకవిధములగును కావున నిచ్చట 'దోషసంగ్రహః' అని చెప్పబడినది.

ఇచ్చట నీవిషయము గమనింపదగినది.—వాతపిత్తకఫములను బోలె రక్తమును కూడ దోషముగ నెందుకు చెప్పదగదు? రక్తమునకును వాతాదుల బోలె హేతు-లక్షణ-వికార-చికిత్సితములు నిర్దేశింపబడియున్నవి. ఎట్లనగ:—'కాలే చానవసేచనాత్' అని రక్తప్రకోపకారణము చెప్పబడినది. "తపనీయేన్ద్రగోపాభం పద్మాలక్తకసన్నిభమ్" అని రక్తలక్షణములు చెప్పబడినవి. రక్తార్శస్సు, రక్తప్రదరము, రక్తపిత్తము మున్నగురోగములును చెప్పబడినవి. 'స్రావణం శోణితస్యతు' ఇత్యాదివాక్యములచే చికిత్సయుం జెప్పబడినది. మరియుం "తైరేవైశ్శోణితచతుర్థైః" ఇత్యాది వాక్యములచే రక్తమును దోషముగ చెప్పినట్లు తెలిసెడి. పై ప్రణాళిక ననుసరించి రక్తమును కూడ వాతాదుల తుల్యయోగక్షేమమగుటంజేసి దోషముగ నెందుకు పరిగణనము చేయకూడదు? అన్నచో కారణ మిట్లు దెలియునది.

వాతాదులు స్వతంత్రములుగ నితరాపేక్ష లేకయే రోగముల గల్గించును. రక్తము దుష్టములైన వాతాదుల సంబంధముచే తానును దుష్టమై వాతాదులం గలిసియే రోగముల గల్గించును కాని స్వతంత్రముగ గల్గింపనోపదు. పైగనబరచిన హేత్వాది లక్షణంబులును వాతాదియుక్తమైన రక్తమునకు చెప్పబడినదికాని స్వతంత్రముగ రక్తమునకు ప్రత్యేకముగ జెప్పియుండలేదు. కావున వాతాదులు దుష్టములై రక్తమును చెరచునుగాన రక్తము దూష్యమగునుకాని దోషము కానేరదు. కావున పైజెప్పిన కారణములచేత రక్తము దోషకోటిలోఁ జెప్పదగదు. మరియుం మిక్కిలి కాగియున్న నూనెచే కాలినపుడు అట్టినూనెకు వేడిని కల్గించినయగ్నియే కాల్చుటకు కారణమగుగాని నూనె కారణము కానేరదు. అట్లున్నను నూనెచే కాలినది యని వాడుక కలదు. అత్తెరంగుననే స్వకారణములచేత ప్రకుపితములైన వాతాదులచే దుష్టమగు రక్తమున కల్గినరోగము రక్తజనితమని వ్యవహరించుట గౌణముకాని ప్రధానముకాదు. కావున రక్తమును దోషమనిచెప్పుట సర్వథా అసమంజసము. ఈయుద్దేశముచేతనే నిర్దేశముచేత మూడుదోషములని యేర్పడెనని "త్రయోదోషాస్సమాసతః" వాగ్భటాచార్యులును చెప్పిరి.

'మానసః పునః' అనుచోట పునః అనునది యవధారణార్థకము. రజోగుణంబును తమోగుణంబును రెండే మనస్సంబంధములగుదోషములు అని యర్థము. ఇట్లు చెప్పుటచేత శారీరదోషములే ద్వ్యల్పణాదిభేదములచే నానాత్వము లేక రెండువిధములే యైయుండుననిభావము. కాయచికిత్సాప్రధానమైన యీతంత్రమునందు ప్రస్తావవశమున జెప్పబడును. మరియు 'నాఽరజస్కంతమః' అనుప్రమాణముచేత తమోగుణ

మునకంటె రజోగుణము ప్రధానమని తెలియుచున్నదికావున తొలుత నిర్దేశింపబడినది. 'తమ ఏవచ' అనునేవకారముచేత రజస్తమోగుణములు రెండేదోషములగునుగాని సత్వ గుణము నిర్వికారము కాన దోషము కానేరదని యర్థము.

## శారీర, మానసదోషశమనోపాయసంగ్రహము.

మూ. ప్రశామ్యత్యౌషధైః పూర్వః దైవయుక్తివ్యపాశ్రయైః,
మానసో జ్ఞానవిజ్ఞానధైర్యస్మృతిసమాధిభిః. ౫౮

వ్యా. ('దైవయుక్తి వ్యపాశ్రయైః'—వ్యపాశ్రయమనునది దైవ, యుక్తి అను పదములతో ప్రత్యేకముగ సంబంధించును. (దైవ వ్యపాశ్రయము, యుక్తి వ్యపాశ్రయము, దైవమన - అదృష్టరూపమైన దైవసంబంధమగు పూజా మంత్రో పాసన బలి మంగళాదులు. అట్టిదైవసంబంధము నాశ్రయించిన విధానమును పురస్కరించి చేయబడు వ్యాధిప్రతీకారము దైవవ్యపాశ్రయము, యుక్తియన—యోజన, సంబంధము. అయ్యది సంశోధనసంశమనాది రూపములగు నౌషధాదులతో హితముగ శరీరసంబంధము కల్గుట అని ప్రతిపదార్థము.)

పై శ్లోకమున జెప్పిన దోషములలో మొదటిదగు శారీరదోషత్రయప్రకోపం బును, దాన జనించిన రోగంబులును, దైవవ్యపాశ్రయ (బలిమంత్ర మంగళాది) రూపము లైన చికిత్సల (యౌషధముల) చేతను, సంశోధన సంశమనాది రూపములగు నౌషధ ములకు శరీరమున సంబంధము కల్గించినదానిమూలమునను శాంతినొందును.

రెండవదియగు మానసదోషములైన రజస్తమోగుణంబులును, దాని వైపరీత్యమున సంభవించు కామము ఉన్మాదము మున్నగు మానసరోగములును, అధ్యాత్మజ్ఞానము, విజ్ఞానము (శాస్త్రజన్యజ్ఞానము), ధైర్యము (ధీరతారూపమైన మానసికప్రవృత్తివిశేషము), స్మృతి (గడచినవిషయముల జ్ఞప్తికి దెచ్చుకొనుట), సమాధి (ఇంద్రియవ్యాపారములనుండి మనస్సును మరలించి ఆత్మయం దేకాగ్రతతో జేర్చుట) అను నీయుపాయములచేత శాంతినొందును.

ఇచ్చట దైవవ్యపాశ్రయము క్లేశము లేకయే శీఘ్రముగ రోగముల శమింప జేయునది కావున ప్రధానమని తలంచి తొలుత నిర్దేశింపబడినది. పూర్వశబ్దముచేత పైజెప్పబడిన శారీరదోషంబులును, దాన సంభవించు రోగములును గ్రహింపబడును. 'మానసః' అను పదముచేతగూడ మనస్సంబంధములగు దోషద్వయంబును దానగల్గు కామాదివ్యాధులును గ్రహింపబడును.

### వాతగుణములు, వాతశామక భేషజము.

మూ. రూక్షశ్శీతో లఘుస్సూక్ష్మః చలోఽథ విశదః ఖరః,
విపరీతగుణద్రవ్యై ర్మారుతః సంప్రశామ్యతి.　　　శ్లో॥

వ్యా. రూక్షత్వము (జిడ్డు లేక స్నిగ్ధముగనుండుట), శీతత్వము (చలువ), లఘుత్వము (తేలిక), సూక్ష్మత్వము, చలత్వము (కదలుస్వభావము), విశదత్వము, ఖరత్వము అను నీగుణములు వాతమునకు కల్గియుండును. అట్టి గుణములకు విరుద్ధములగు స్నిగ్ధత్వ ఉష్ణాది గుణములు కల ద్రవ్యములచే వాతము శాంతినొందును.

వాతమునకు దారుణాదిగుణములు కూడ కలవు కాని రూక్షాదిగుణములు వాతమునకు ప్రధానములుగ నుండునని భావము. అందును వాతమునకు సంబంధించిన గుణముతో రూక్షమనునది వాతమున ప్రధానముగ నుండును కావున తొలుతం జెప్పబడియె. వాతము సమశీతోష్ణమని వైశేషికమతమున సిద్ధాంతితము; అయినను ఉష్ణచికిత్సచే శాంతియు, శీతోపచారములచే వృద్ధియుం వాతమునకు అనుభవసిద్ధముగ నున్నది కావున శీతగుణమనియే ప్రకృతమున చెప్పదగినది. మరియుం వాతమునకు యోగవాహిత్వము కలదు. కావున నయ్యది యుష్ణముగ నుండువానితో సంబంధము కల్గిననాడు ఉష్ణగుణంబును, శీతసంబంధము కల్గినపుడు శీతగుణంబు నగును. అట్టి పరిస్థితిని గమనించి అట్టిగుణమునకు ప్రత్యానీకమైన చికిత్సజేయుట యుక్తము. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—"యోగవాహః పరంవాయుః సంయోగా దుభయార్థకృత్, దాహకృత్తేజసా యుక్తః శీతకృత్సోమసంశ్రయాత్. ఏవనే యోగవాహిత్వాత్ శీతం శ్లేష్మయుతే భవేత్, దాహం పిత్తయుతే" (వాయువు యోగవాహి కావున పిత్తముతో గూడినపుడు మంట మున్నగువానిని బుట్టించును. సౌమ్యగుణసంబంధము కల్గిననాడు శీతమును బుట్టించును. కఫముతో గలిసిననాడు శీతాదిగుణముల గల్గించును. కావున అట్టిపరిస్థితిని గమనించి తత్తత్ప్రత్యానీకములగు చికిత్సలజేయునది యని యర్థము). వస్త్వంతరసంబంధము కల్గినప్పుడు వాతమునకు పైజెప్పినరీతిగ గుణములు మారుచున్నను నియతముగ శీతగుణము కల్గియుండును కావున అట్టి స్వాభావికమునుబట్టి 'శీతః' అని చెప్పబడినది.

'విపరీతగుణద్రవ్యైః' అనుచోట గుణశబ్దముచేత ద్రవ్యనిష్ఠధర్మములగు మధురాది షడ్రసంబులును, శీతఉష్ణ వీర్యంబులును, అమ్లాదివిపాకంబులును, వీనికన్నిటికిని అతిరిక్తమైన ప్రభావవిశేషంబును గ్రహింపబడును. వాతనిష్ఠగుణరసవీర్యవిపాకప్రభావంబులకన్న విరుద్ధములైన రసగుణవీర్యవిపాకప్రభావములుకల యౌషధద్రవ్యములచే వాతము శమించునని ఫలితార్థము. ప్రతిద్రవ్యమునందును వాతమునకు విపరీతములైన

గుణములుమాత్ర ముండవు. విపరీతంబులును అనుకూలంబులు నైన గుణములు కలిసే యుండును. అయినను వానితో విపరీతగుణము లధికములుగను బలవత్తరములుగ నున్నచో నయ్యది వాతశామకములగును. ఈవిషయము "విరుద్ధగుణసన్నిపాతే భూయసాల్పమవజీయతే" అను వాక్యముచే జెప్పబడినది. పరస్పరవిరుద్ధములగు గుణములు ఒక ద్రవ్యమున జేరియున్నప్పుడు అందు అధికగుణములచే స్వల్పములగు గుణములు జయింపబడును అని యర్థము. అట్టి బలవత్తరములగు గుణములు వాతముయొక్క గుణములకు విరుద్ధములుగ నున్నచో వాతము శాంతినొందునని భావము. పైజెప్పినవిషయములన్నియు పిత్త కఫములకును అన్వయింపదగినవి.

## పిత్తలక్షణము, పిత్తశామకభేషజము.

మూ. సస్నేహముష్ణం తీక్ష్ణం చ ద్రవ మల్పం సరం కటు,
విపరీతగుణైః పిత్తం ద్రవ్యైరాశు ప్రశామ్యతి. ౬౦

వ్యా. కొంచెముగ స్నిగ్ధత్వంబును, ఉష్ణంబును, తీక్ష్ణత్వంబును, స్వల్పముగ ద్రవంబును కల్గినది పిత్తమును, సరగుణము(శరీరమున వ్యాపించుగుణము)ను, కటురసంబును కల్గియుండును. పైజెప్పినగుణములకు విపరీతములైనగుణములు తద్ద్రవ్యములచేత పిత్తము శీఘ్రముగ శమించును.

పిత్తము కొంచెముగ స్నిగ్ధమనుటచేత పిత్తమునకు స్నిగ్ధభేషజమును చెప్పినది సంగతమగును. పిత్తమునకు కటురసము స్వాభావికము. అయ్యది విదగ్ధమైనపుడు అమ్లరసము కల్గియుండును. ఈవిషయము "విదగ్ధం చామ్లమేవ చ" అని సుశ్రుతునిచే జెప్పబడినది.

## శ్లేష్మగుణములు, వాని శమనౌషధము.

మూ. గురుశీతమృదుస్నిగ్ధమధురస్థిరపిచ్ఛిలాః,
శ్లేష్మణః ప్రశమం యాన్తి విపరీతగుణైర్గుణాః. ౬౧

వ్యా. గురుత్వము, శీతము, మృదుత్వము, స్నిగ్ధత్వము, మధురరసము, స్థిరత్వము పిచ్ఛిలత్వము ఇవి కఫముయొక్క గుణములు. అయ్యవి వానికి విపరీతములగు లఘ్వాది గుణములు కలద్రవ్యములచే శాంతినొందును.

ఇచ్చట "విపరీతగుణైర్గుణాః" అనువాక్యముచేత కఫముయొక్క గుణముల వానికి విపరీతములైనగుణములు కలద్రవ్యములచే శాంతి చెప్పబడెను. గుణములు శాంతి నొందునపుడు అట్టిగుణముల కాధారమైనద్రవ్యము శాంతినొందుట లోకానుభవసిద్ధము. ఉష్ణద్రవ్యసంబంధముచే శీతము శాంతినొందునపుడు అట్టిగుణమున కాధా

మైన జలముకూడ శీతగుణము మారి యుష్ణమగునుకదా. అత్తెరంగుననే విపరీతగుణములచే కఫనిష్ఠ గురుశీతాదిగుణములు శాంతింబొందినపుడు వాని కాధారమైనకఫంబును శాంతి నొందునని తెలియుటకై "విపరీతగుణైర్గుణాః" అని చెప్పబడినది.

దేశమాత్రాద్యనుసారముగ కల్పించినయౌషధము రోగనివర్తకమనుట.

మూ. విపరీతగుణైః దేశమాత్రా కాలోపపాదితైః,
భేషజైర్వినివర్తన్తే వికారాస్సాధ్యసంమతాః. ౬౨
సాధనం నత్వసాధ్యానాం వ్యాధీనా ముపదిశ్యతే,

వ్యా. ("దేశ - మాత్రా - కాలోపపాదితైః" ఇచ్చట దేశశబ్దముచేత జాంగలానూపరూపమైన భూమియు, చికిత్స కధిష్ఠానమైన రోగియొక్క బలశరీరాహారాదులును సాత్మ్యసత్వప్రకృతులును గ్రహింపబడును. మాత్ర యన అపాయరహితమైన పరిమాణము. కాలశబ్దముచేత నైతికమైన వసంతాదికాలంబును, వయోఽవస్థాభేదముచే కల్గుబాల్యకౌమారవార్ధకంబును గ్రహింపబడును.)

శ్లోకార్థము:—పైజెప్పినరీతిగ వాతాదిదోషములకు విపరీతగుణంబులును, జాంగలాదిదేశమును, రోగియొక్క శరీరబలసాత్మ్యాదులను, అపాయములేని పరిమాణమును, వసంతాదికాలమును, బాల్యాదివయోభేదమును వీనినన్నింటిని గమనించి తత్తదుచితను వైద్యునిచే గల్పింపబడినవియునైన యౌషధములచేత; జ్ఞానవంతులగు వైద్యవరులచే సాధ్యములని యంగీకరింపబడిన రోగములు నివర్తించును. అరిష్టాదిలక్షణములచే నసాధ్యస్థితి నుండువ్యాధులకు నివృత్తిసాధనము నుపదేశించుటలేదు.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—వాతాదిదోషములు, ఔషధము, దేశకాలములబలములు, శరీరము, ఆహారము, సాత్మ్యము, సత్వము, ప్రకృతి, బాల్యాదివయస్సు నవి చికిత్సాసమయమున ముఖ్యముగ పరీక్షింపదగినవి. వైద్యవరుడు అట్టిదేశకాలాదుల జక్కగ పరీక్షించి తత్తదనుగుణముగ గల్పించిన యౌషధములు పైజెప్పిన రీతిగ వాతాదిదోషగుణములకు విరుద్ధములైన గుణములు కల్గియున్నచో వానిచేత సాధ్యస్థితినుండువ్యాధులు నివర్తించును. అసాధ్యములగువ్యాధులు ఒకప్పుడును సాధింపనలవికాదు. కావున వాని నివర్తింపజేయుటకై సాధనమైనయౌషధము చెప్పబడదు. అని ఫలితార్థము.

ఇచ్చట 'సాధ్యసమ్మతాః' అనుటచేత ప్రామాణికులచే సాధ్యములని నిర్ణయింపబడినవ్యాధులు పైజెప్పినరీతిగ నౌషధములచే నివర్తించునుగాని అజ్ఞానజ్ఞానవైపరీత్యముచే అసాధ్యములను సాధ్యములుగ పొరబడి నిర్ణయించినవ్యాధులు నివర్తింపనేరవని భావము.

## అనుక్తగుణకర్మసంగ్రహము.

మూ. భూయశ్చాతో యథాద్రవ్యం గుణకర్మాణి వక్ష్యతే ౬౩

వ్యా. పైజెప్పిన గుణకర్మములేగాక ఆయాద్రవ్యము ననుసరించిన గుణకర్మములను (ఏద్రవ్యమున నేవిధములైన గుణకర్మము లుండునో వానిని) విశేషముగ మరల నీతంత్రకారుడు వివరించి చెప్పునని యర్థము.

## రసలక్షణము, రసోత్పత్తిక్రమము.

మూ. రసనార్థో రసస్తస్య ద్రవ్యమాపః క్షితి స్తథా,
నిర్వృత్తౌ చ విశేషే చ ప్రత్యయాః ఖాదయస్త్రయః. ౬౪

వ్యా. ఇంతదనుక దోషములను వానిగుణాదులను నిరూపించి అట్టిదోషముల ప్రశమనమునకు ప్రధానములైన మధురాదిరసముల నిరూపించుటకై రససామాన్యలక్షణమును జెప్పుచు నట్టిరసముల యుత్పత్తిక్రమము జెప్పబడుచున్నది:—

"రస్యతే (ఆస్వాద్యతే) అనేనేతి—రసః" అను వ్యుత్పత్తిచేత రుచిని తెలిసికొనుటకు సాధనమైనది రసమని యేర్పడును. రసనేంద్రియమునకు విషయమైనది రసము. (రసనేంద్రియమునకు ఆధారమైన నాలుకచే గ్రహింపదగినది రసమని నిష్కృష్టలక్షణము.) అయ్యది రసనేంద్రియమునకు మాత్రము గోచరమైనదియనుటచేత తక్కినరూపాదులు చక్షురాదీంద్రియగ్రాహ్యములు కావున వానికి రసమనుసంజ్ఞ కల్గదు. అట్టిరసము మధురాదిరసవిశేషముల యారిటియందును వ్యాపించియుండును కావున నిది రససామాన్యలక్షణము. మధురాదులు విశేషరసములు. (రసనేంద్రియగ్రాహ్యమై మధురాదిరసవిశేషముల యారిటియందును వ్యాపించియుండురుచి రసమని ముఖ్యభావము).

అట్టి రసమునకు (పంచభూతములలో నాల్గవదియైన) జలంబును భూమియు నాధారకారణమైన ద్రవ్యమగును. (జలమును భూమిని ఆధారముగ జేసికొని రసముండునని భావము). మరియు అట్టి సామాన్యరసమునకును, మధురాదిరసవిశేషము లారిటికిని పైజెప్పినజలభూములు రెండును అభివ్యక్తికారణములగును. అనగా రససామాన్యములును, మధురము మున్నగువిశేషరసములును అభివ్యక్తములగుటకు జలంబును పృథివియు ఆధారములై ప్రధానకారణములగునని భావము). జలమును పృథివిని ఆధారముగ జేసికొనియే వానితో సమవేతమై రససామాన్యంబును విశేషరసంబును అభివ్యక్తములగునని ఫలితార్థము).

మరియు నట్టి మధురాదివిశేషరసముల కారిటికిని అభివ్యక్తము లగుటకై ఆకాశము, తేజస్సు, వాయువు అను మూడుభూతములును వేరువేరుగనైనను కలిసియైనను నిమిత్తకారణములగును. రసాభివ్యక్తికి పృథివీజలములు రెండును ప్రధాన కారణములనియు, (ఆకాశవాయ్వగ్నులు మూడును నిమిత్తకారణములనియు ముఖ్యార్థము).

ఇచ్చట "పంచేంద్రియద్రవ్యాణి, ఖం వాయుర్జ్యోతిరాపోభూరితి" అని యింద్రియోపక్రమణీయాధ్యాయమున జెప్పినప్రకారము జలము రసమునకు ఆధార రూపమైన ద్రవ్యమని చెప్పబడినది. మరియు:—ఆత్రేయభద్రకాప్యీయమున 'సౌమ్యాః ఖల్వాపః' అను వాక్యముచేత జలము రసమునకు ద్రవ్యమని చెప్పబడినది. ఈయర్థమునే "తస్మాదాప్యో రసః" అని సుశ్రుతులును చెప్పిరి. కావున జలము రసమునకు ముఖ్యమైన ద్రవ్యము కావున ముందు జలమే నిర్దేశింపబడినది. అట్టి జలమునకును పృథివికిని నియతమైన సంబంధము కల్గియుండును కావున జలమును ప్రధానాధారముగ జేసికొనిన రసము జలానుగతమై భూమినికూడ నియతముగ జేరియుండుటంజేసి భూమియు నాధారకారణమని చెప్పబడినది. అట్టిరసముతో నిత్యసంబంధము కల్గియుండుటంజేసియే భూమి రసవతియని చెప్పబడును. రసముల యభివ్యక్తియందు జలంబును పృథివియు నాధారభూతములై స్ఫురించును కాని యారెంటిని విడచి సామాన్యవిశేషరసములకు అభివ్యక్తి కల్గనేరదు. కావుననే "సోమగుణాతిరేకాన్మధురః, పృథివ్యగ్నిగుణాతిరేకాదమ్లః" ఇత్యాది గ్రంథముచేత జలనిష్ఠసోమగుణమధికంబునైనపుడు మధురరసంబును, పృథివి అగ్నిగుణము లధికముగ నుండుటచే నమ్లగుణంబును అభివ్యక్తములగునని మధురాదివిశేషరసముల యభివ్యక్తిని జలభూములను కారణములుగ జెప్పినది సంగతమగును.

ప్రత్యయమన:—'ప్రతీయతే ద్యోత్యత్యేతి ప్రత్యయః' అను వ్యుత్పత్తిచేత రసము స్ఫురించుటకు కారణమని యర్థము. అయ్యది ఆకాశవాయ్వగ్నులు నిమిత్తకారణంబులును, పృథివిజలములు ప్రధానకారణంబులును నగును.

మరియు:—ఇచ్చట "ఖాదయః" అనుటచేతనే ఆకాశము, వాయువు, అగ్ని అనునవి మూడు కారణములగునని అర్థమగుచున్నను మరల "త్రయః" అని చెప్పుటచేత అట్టి మూడుభూతములను వేరువేరుగ కలిసియు కారణములగునని యర్థమగును. ఇట్లు చెప్పుటచేత ఆకాశాది పంచభూతములయంశములు వ్యస్తములుగను సమస్తములుగను కలియుటంజేసి మధురాదిరసములయందు అట్టి గుణాధిక్యమునుబట్టి మధురతరము మధురతమము అని వ్యవహారము ఉపపన్నమగును,

## రసవిశేషములు.

మూ. స్వాదురమ్లోఽథ లవణః కటుకస్తిక్త ఏవ చ,
కషాయశ్చేతి షట్కోఽయం రసానాం సంగ్రహః స్మృతః. ౬౫

వ్యా. మధురము (తీపి), అమ్లము (పులుపు), లవణము (ఉప్పు), కటుకము (కారము), తిక్తము (చేదు), కషాయము (వగరు) అనునవి యారురసములు. ఇయ్యది రసములయొక్క సంగ్రహము.

సర్వప్రాణులకు మధురరసము మిక్కిలి ఇష్టమయినదికాన తొలుత నిర్దేశింపబడినది. తక్కిన అమ్లాదిరసము లయిదునుగూడ సామాన్యముగ ప్రాణులకు నొకదానికన్న నొకదానియందు ప్రీతి తక్కువయగుటవలన తదనుసారముగ క్రమముగ నిర్దేశింపబడినవి. మతాంతరములయందు రసములవిషయమై సంఖ్యాభేదములు గన్పట్టును. అట్టి మతములను నిరసించుటకై 'షట్కః' అని సంఖ్యానిర్దేశము చేయబడినది. ఈయారు రసములయొక్క పరస్పరసంసర్గభేదముచే ననేకములు నేర్పడును కాన నిచ్చట "సంగ్రః" అని చెప్పబడినది.

## మధురాదిరసములకృత్యములు.

మూ. స్వాద్వమ్లలవణా వాయుం, కషాయస్వాదుతిక్తకాః
జయన్తి పిత్తం, శ్లేష్మాణం కషాయకటుతిక్తకాః. ౬౬

వ్యా. మధుర-అమ్ల-లవణరసములు మూడును వాతమును శాంతినొందించును. కషాయ-మధుర-తిక్తరసములు మూడును పిత్తమును శమింపజేయును. కషాయ-కటు-తిక్తరసములు మూడును కఫమును శమింపజేయును.

ఇచ్చట వాతము నీరసమైనను పైజెప్పిన రసములయందలి స్నిగ్ధత్వాది గుణములు వాతమునందలి రూక్షాది గుణములకు వ్యతిరేకములగుటంజేసి వాతమును శమింపజేయునని యెరుగునది. మఱియు—వాతాదిదోషములకు వేరువేరుగ జెప్పిన శామకగుణములు తప్ప తక్కినవి ఆయాదోషమును వృద్ధినొందించునని యెరుంగునది. ఎట్లనగా:—

మధుర-అమ్ల-రసములు మూడును వాతమును శమింపజేయును. ఇతరములయిన తిక్త-కటు-కషాయరసములు మూడును వాతమును ప్రకోపింపజేయును. ఈతిక్త-కటు-కషాయరసములు మూడును కఫమును శమింపజేయును. తక్కిన మధు-రామ్ల-లవణములు మూడును కఫమును వృద్ధినొందించు. కషాయ-మధుర-తిక్తరసములు మూడును పిత్తమును శమింపజేయును, తక్కిన అమ్ల-లవణ-కటు-రసములు మూడును పిత్తమును

వృద్ధినొందించును. ఈవిషయమై వాగ్భటాచార్యులు ఇట్లు వివరించిరి:—"తత్రాద్యా మారుతం ఘ్నంతి త్రయః తిక్తాదయః కఫమ్, కషాయతిక్తమధురాః పిత్తమన్యే తు కుర్వతే".

## ద్రవ్యత్రైవిధ్యము.

మూ. కిఞ్చిద్దోషప్రశమనం కిఞ్చిద్ధాతుప్రదూషణమ్,
స్వస్థవృత్తౌ మతం కిఞ్చిత్త్రివిధం ద్రవ్యముచ్యతే. ౬౭

వ్యా. నానావిధద్రవ్యములలో కొన్ని దోషములను ఒక్కొకటినైనను అన్నిటినైనను శమింపజేయును. కొన్ని (శరీరధారణమునకు సాధనములగుటచే ధాతువు లనబడు) వాతాదిదోషములను చెరచును. మరికొన్ని స్వస్థవృత్తమునకు (ధాతువులు వికృతిజెందక సమస్థితి నుండుతరి అట్టి స్వస్థతను కాపాడుటకు) హితములైయుండును. ఇత్తెరంగున ద్రవ్యములు దోషప్రశమనము, దోషదూషణము, స్వస్థహితమునని మూడు విధములుగ నుండును.

ఇచ్చట దోషప్రశమన మనుచోట 'దోషస్య, దోషయోః, దోషాణాం వా ప్రశమనం-దోషప్రశమనం" అని సమాసము చేయుటచేత ఒకదోషమునైనను, రెంటినైనను, మూడిటినైనను శమింపజేయునది యని యర్థము. మరియు 'దూషయంతీతి దోషాః' అను వ్యుత్పత్తిచే నిష్పన్నమైన దోషశబ్దముచేత స్వస్థతనుండు శరీరమును ప్రకుపితములై చెరచు వాతాదులను, రసరక్తాది ధాతువులును గ్రహింపబడును. అట్లు దుష్టములైన వాతాదులను రసాదిధాతువులలో నొక్కొకటినైనను రెంటినైనను అన్నిటినైనను శమింపజేయుద్రవ్యము దోషప్రశమనమని యర్థము. ఆమలకము(ఉసిరికకాయ), దురదగొండి మున్నగునవి త్రిదోషములు ప్రకోపించినపుడు వానిమూటిని తనయందలి ప్రభావముచే శమింపజేయును. 'హన్తి వాతం తదమ్లత్వాత్' ఇత్యాదివాక్యములచే త్రిదోషహరత్వము అమ్లాదిగుణములచే నామలకాదులకు సిద్ధించునని చెప్పబడినది; అయినను అమ్లగుణముచే వాతమును శమింపజేసినను పిత్తమును వృద్ధినొందించకుండుట రసాది కార్యవ్యతిరిక్తప్రభావకృత్యమని, ప్రభావముచే త్రిదోషహారత్వము చెప్పినది సంగతమగును.

మరియు:—యవకము, మందకము, విషము మున్నగునవి శరీరమున సమస్థితి నుండు దోషదూష్యములను చెరచుననికాన ధాతుప్రదూషణము లనబడును. స్వస్థవృత్తమనగా:—"సుష్ఠు అవతిష్ఠతే నీరోగత్వేన ఇతి స్వస్థః; తస్య వృత్తిః స్వరూపతయా అనవర్తనం స్వస్థవృత్తిః" అనువ్యుత్పత్తిచేత రోగములేక నుండువానికి అనుకూల

మైనది స్వస్థవృత్తహితమని అనబడును. అయ్యది రసాయనము, వాజీకరణము మున్నగునవి "స్వస్థస్యోజస్కరం యత్తు తద్వృష్యం తద్రసాయనం" అనువాక్యము చేత వృష్యరసాయనాదులు స్వస్థహితములని స్థలాంతరమున జెప్పబడినది. మరియు ధాతుప్రశమనము, దూషణము, స్వస్థహితము నని సంఖ్యేయముల నిర్దేశించుటచేతనే మూడువిధములని సంఖ్య యేర్పడుచున్నను మరల త్రివిధమని నిర్దేశించుటచేత సంశోధన సంశమనాది యవాంతరభేదములచే పలుదెరంగులైన ద్రవ్యజాతమంతయు పై జెప్పిన త్రివిధభేదములలోనే యంతర్భావమునొంద నియమ మేర్పడును.

స్వస్థవృత్తిహితమైన రక్తశాలి మున్నగునవి దోషవృద్ధిని కల్గనీయక కాపాడుటం జేసి రాబోవు దోషశామకమగుచుకావున నయ్యదియుం దోషప్రశమనమునందే యంతర్భూత మేల కాదగదు? అన్నచో రక్తశాల్యాదులు సమస్థితినుండు ధాతువులను వృద్ధిక్షయముల నొందనీయకయుం రసాదిస్రోతస్సులను అనుగుణముగ సామ్యస్థితి నుంచునవి స్వస్థహితముగ జెప్పబడును. కావున నవి ప్రశమనమునం దంతర్భూతము కానోపదు. ఇదియే పథ్యమనియుం చెప్పనగును. 'పథ్యం పథోఽనపేతం యత్' అనియు స్థలాంతరమున పథ్యలక్షణము చెప్పబడినది.

జాంగమాది త్రివిధద్రవ్యములు, అందు జాంగమములు.

మూ. తత్పున స్త్రివిధం ప్రోక్తం జాఙ్గమౌద్భిదపార్థివమ్,
మధూని గోరసాః పిత్తం వసా మజ్జాఽసృగామిషమ్. ౬౮
విణ్మూత్రచర్మరేతోఽస్థి స్నాయుశృఙ్గనఖాః ఖురాః,
జఙ్గమేభ్యః ప్రయుజ్యన్తే కేశలోమాని రోచనాః. ౬౯

వ్యా. మరియు పైజెప్పినరీతిగ మూడువిధములైన ద్రవ్యము జాంగమము, ఔద్భిదము, పార్థివము నని మూడువిధము లగును. ("గచ్ఛతి పునః పునః ఇతి జంగమః, తత్సంబంధి—జాఙ్గమం, అనువ్యుత్పత్తిచేత పలుదెరంగుల సంచరించు స్వభావముకల ప్రాణిజాలము జంగమము; అట్టి జంతుసంబంధమయిన గోరసము మున్నగునవి జాంగమము. 'ఉద్భిద్య పృథివీం జాయతే ఇతి ఔద్భిదం' అను వ్యుత్పత్తిచేత భూమిని భేదించుకొని పుట్టుస్వభావము కలపనసప్రత్యాదులు వృక్షాదులును ఔద్భిదములు. పైజెప్పిన రెంటికంటె వేరై పృథివీసంబంధమైనది సువర్ణాదులు పార్థివములు.)

అందు తేనె, పాలు, నెయ్యి మున్నగు గోరసములు, కస్తూరి మున్నగు పిత్తములు. వస, మజ్జ (క్రొవ్వు), రక్తము, మాంసము, మలము, మూత్రము, చర్మము, రేతస్సు (శుక్రము), అస్థులు (ఎముకలు), స్నాయువులు, కొమ్ములు, గోళ్లు, గిట్టలు,

వెంట్రుకలు, రోమములు, రోచనము (గోరోచనము), ఇవియన్నియు జంగమముల నుండియుం గ్రహింపబడును.

## ౼ ఔద్భిదములు. ౼

మూ. సువర్ణం సమలాః పఞ్చ లోహాః ససికతాః సుధా,
మనశ్శిలాలే మణయో లవణం గైరికాఞ్జనే. ౭౦
భౌమమౌషధ ముద్దిష్టం

వ్యా. బంగరు, పంచలోహములు, వానిమలము (చిట్టెము)లు, ఇసుక, సున్నము, మణిశిల, తాళకము, (హారిదళము) మణులు, ఉప్పు, గైరికము (కావిరాయి) అంజనము (సౌవీరాంజనము మొదలగునవి) ఇవియన్నియుం భూమికి సంబంధించిన యౌషధములు భౌమములు అని చెప్పబడును.

ఇచ్చట జాంగమమును చెప్పినపిదప ఔద్భిదము క్రమానుసారముగ చెప్పదగి యున్నను ఔద్భిదమునకన్న పార్థివము స్వల్పమగుటంజేసి సూచీకటాహన్యాయముగ పార్థివము చెప్పబడెను. తామ్రము (రాగి), రజతము (వెండి), త్రపు (తుత్తినాగము), సీసము, కృష్ణలోహము (ఇనుము, ఉక్కు) అను నీయైదును పంచలోహము లనబడును. 'సమలాః' అనుపదముచేత శిలాజితువు పంచలోహములయొక్క మలములను గ్రహింపదగును.

## ౼ ఔద్భిదములవివరణము. ౼

మూ. ఔద్భిదంతుచతుర్విధమ్,
వనస్పతి స్తథా వీరుధ్వానస్పత్య స్తథౌషధిః. ౭౧
ఫలైర్వనస్పతిః పుష్పై ర్వానస్పత్యః ఫలైరపి,
ఔషధ్యః ఫలపాకాన్తాః ప్రతానై ర్వీరుధస్స్మృతాః. ౭౨
మూలత్వక్సారనిర్యాసనాలస్వరసపల్లవాః,
క్షారాః క్షీరం ఫలం పుష్పం భస్మ తైలాని కణ్టకాః. ౭3
పత్త్రాణి శుఙ్గాః కన్దాశ్చ ప్రరోహాశ్చోద్భిదో గణః,

వ్యా. పైజెప్పబడిన ఔద్భిద మనునది వనస్పతి, వీరుతు, వానస్పత్యము, ఔషధి అను భేదముచే నాల్గుతెరంగుల నుండును. అందు పువ్వులు లేకయే కాయలు కాచు మఱ్ఱి, అత్తి మున్నగునవి వనస్పతి యనబడును. తొలుత పువ్వులు పూచి పిదప ఫలములు చూపునవియెల్ల వానస్పత్యములు అనబడును. ఫలించినవెంటనే నాశము

నొందు స్వభావముగలపైరు, నువ్వు, మినుము, అరటి, మున్నగునవి ఓషధు లనబడును. తీగెలుబారి నల్గెడల నల్లికొను స్వభావముకల్గినదియు, గుల్మములుగ నుండునవియు వీరుత్తు లనబడును. (ఇచ్చట "ఫలపాకాన్తాః" అనుచోట అంతశబ్దమును ప్రత్యేకముగ నన్వయించి 'ఫలాన్తాః పాకాన్తాః' అని విభజించి ఫలములు లేక పాకమునే అంతముకాగల గఱిక మున్నగువానినికూడ ఓషధిగణములో చేర్చెదరు. "లతా గుల్మాశ్చ వీరుధః" అని హారీతప్రమాణము ననుసరించి గుల్మములును కూడ వీరుత్తులో చేర్చెదరు.)

మూలము (వేరు), త్వక్ (పట్ట), సారమ (చేవ) నిర్యాసము (బంక) స్వరసము (రసము), నాలము (కాడ), పల్లవము (చిగురు), క్షారములు, పాలు, ఫలములు, పువ్వులు, భస్మము, తైలములు, ముండ్లు, ఆకులు, ఊడలు, దుంపలు, మొలకలు ఇవియన్ని ఔద్భిదగణములో చేరినవి.

త్రివిధద్రవ్యములలో ప్రశస్తములును, శోధనోపయుక్తములును.

మూ. మూలిన్యః షోడశైకోనాః ఫలిన్యో వింశతిస్స్మృతాః. ౭౪
మహాస్నేహాశ్చ చత్వారః పంచైవ లవణాని చ,
అష్టౌ మూత్రాణి సంఖ్యాతా న్యష్టావేవ పయాంసి చ. ౭౫
శోధనార్థాశ్చ షడ్వృక్షాః పునర్వసువినిర్మితాః,
య ఏతాన్ వేత్తి సంయోక్తుం వికారేషు స వేదవిత్. ౭౬

వ్యా. ప్రశస్తములైన వేళ్లుకల్గినవి మూలిని యనబడును. అయ్యది క్రింద జెప్పబడురీతిగ పదునారు. ఫలిని (ప్రశస్తములగుఫలములు కల్గినది) అయ్యది పందొమ్మిది. మహాస్నేహములు నాల్గు, పంచలవణములు, ఎనిమిదివిధములైన మూత్రములు, ఎనిమిదివిధములైన క్షీరములు, ఆరువృక్షములు. ఇవి శోధనరూప చికిత్సజేయుటకు మిగుల ప్రశస్తములు. ఇవి పునర్వసువుచే నిర్దేశింపబడినవి. వీనిని చికిత్సయందు యథోచితముగ జేర్చుట కెవ్వడు చక్కగ దెలిసి ఆయారోగములయం దుపయోగించునో వాడు ఆయుర్వేదమును జక్కగ నెరింగినవాడు.

పైజెప్పిన జాంగమ-ఔద్భిద-పార్థివగణములమూటిలో మూలిన్యాదులు ఆయాగణద్రవ్యములో మిక్కిలి ప్రశస్తములైనవని నిర్దేశించి పరిగణనము చేయబడినది. వీని వివరణము క్రింద విశదముగ తంత్రకారునిచే జెప్పబడును.

మరియు 'మూలిన్యః, ఫలిన్యః' అనుచోట ప్రశస్తము అనునర్థమున ఇనీ ప్రత్యయముకావున ప్రశస్తములైన మూలములుకల్గినవి మూటిని, ప్రశస్తములగు ఫల

ములు కల్గినవి ఫలిని యనబడును. మరియు క్షీరము మాంసము మున్నగు స్నేహద్రవ్యములలో క్రిందజెప్పంబడు నెయ్యి మున్నగునవి యైదును అధికమైన స్నేహము కల్గినవి కావున స్నేహము లనబడును. విమానస్థానమున జెప్పబడులవణము లనేకము లున్నను వానిలో నీక్రిందజెప్పంబడులవణములు మిక్కిలి ప్రశస్తములని పంచైవ యని చెప్పబడెను. ఇత్తెరంగుననె మూత్రాదులును ఆయావర్గములో వానికన్న నీక్రిందజెప్పబడునవి మిక్కిలి ప్రశస్తములని పరిగణనము చేయబడినవియని యెరుంగునది.

### మూలినీవివరము, వానిప్రత్యేకప్రయోజనములు.

మూ. హస్తిదన్తీ హైమవతీ శ్యామా త్రివృదధోగుడా,
సప్తలా శ్వేతనామా చ ప్రత్యక్ శ్రేణీ గవాక్ష్యపి. ౭౭
జ్యోతిష్మతీ చ బిమ్బీ చ శణపుష్పీ విషాణికా,
అజగన్ధా ద్రవన్తీ చ క్షీరిణీ చాత్ర షోడశీ. ౭౮
శణపుష్పీ చ బిమ్బీ చ ఛర్దనే హైమవత్యపి,
శ్వేతా జ్యోతిష్మతీ చైవ యోజ్యా శీర్షవిరేచనే. ౭౯
ఏకాదశావశిష్టాః యాః ప్రయోజ్యాస్తా విరేచనే,
ఇత్యుక్తా నామకర్మాభ్యాం మూలిన్యః

వ్యా. కొండాముదపుచెట్టు, వస, నల్లతెగడ, తెల్లతెగడ, వృద్ధదారు, సంబరేణు, తెల్లదింటెన, నల్లదింటెన, చేదుపుచ్చ, మాల్కంగిని, దొండ, శణపుష్పి, విషాణిక (పిన్నపాల), వాయింట, ద్రవంతి (ఎలుకచెవి), పాలచెట్టు, ఈపదునారును మూలినిలు. (మూలములుకల్గిన జాతిచెట్లలో ప్రశస్తములు). ఈపదునారులో శణపుష్పి, దొండ, వస, ఈమూడును వాంతి (వమన) క్రియకు మిక్కిలి ప్రశస్తములు. తెల్లతెగడయు, మాల్కంగినియు శిరోవిరేచనము చేయించుటకే యుపయోగింపదగును. తక్కిన పదునొకండును విరేచనమునకై యుపయోగింపదగును. ఇత్తెరంగున మూలినియఁను వానియొక్కపేరులును వానిప్రత్యేకకృత్యములును వివరింపబడినవి.

### ఫలినీవివరణము, వానియుపయోగము.

మూ. ఫలినీశ్శృణు. ౮౦
శంఖిన్యథ విడఙ్గాని త్రపుషం మదనాని చ,
ఆనూపం స్థలజం చైవ క్లీతకం ద్వివిధం స్మృతమ్. ౮౧
ప్రకీర్యా చోదకీర్యా చ ప్రత్యక్పుష్పీ తథాభయా,

అన్తః కోటరపుష్పీ చ హస్తిపర్ణ్యాశ్చ శారదమ్. ౧౨
కమ్పిల్లకారగ్వధయోః ఫలం యత్కుటజస్య చ,
ధామార్గవమథేక్ష్వాకు జీమూతం కృతవేధనమ్. ౧౩
మదనం కుటజం చైవ త్రపుసం హస్తిపర్ణినీ,
ఏతాని వమనే చైవ యోజ్యాన్యాస్థాపనేషు చ. ౧౪
నస్తః ప్రచ్ఛర్దనే చైవ ప్రత్యక్పుష్పీ విధీయతే,
దశ యాన్యావశిష్టాని తాన్యుక్తాని విరేచనే. ౧౫
నామకర్మభిరుక్తాని ఫలాన్యేకోనవింశతిః,

వ్యా. తెల్లదింటెన, వాయువిడంగములు, కీరదోస, మ్రంగ, నీటబుట్టినయష్టిమధుకము, మెట్టనబుట్టిన యష్టిమధుకము, నెమలియడుగుచెట్టు, కానుగచెట్టు, ఉత్తరేణి, కరక, నల్లదింటెన, మోరటఫలము. (దీనిని శరత్కాలమున కాచినఫలమును గ్రహింపవలెను), కంపిల్లకము, పెద్దరేల, రెప్పాల, (కొడిసెపాల) చేదుపుచ్చ, వెఱ్ఱిసొర, దేవదాళి, చేదుబీర అనునీ పందొమ్మిదియును ప్రశస్తములైన ఫలములుకల్గినవి.

వీనిలో చేదుపుచ్చకాయ, చేదుసొరకాయ, డావరడంగి (దేవదాళి), చేదుబీర, మ్రంగకాయ, కొడిసెపాల, కీరదోస, మోరటపుఫలము వీనిని వమనమునను ఆస్థాపనమునకును ఉపయోగింపదగును. ఉత్తరేణిని నస్యకర్మ కుపయోగింపదగును. తక్కిన పదిటిని విరేచనమున కుపయోగింపదగును. ఇత్తెరంగున ఫలినుల నామభేదములను వానినుపయోగింపదగిన కర్మలును వివరింపబడినవి. (ఇచ్చట 'హస్తిపర్ణ్యాశ్చ శారదమ్' అనుటచేత హస్తిపర్ణినిని శరత్కాలమున బుట్టినదానిని గ్రహింపనగును).

## చతుర్విధమహాస్నేహములు, వానికృత్యములు.

మూ. సర్పిస్తైలం వసా మజ్జా స్నేహో దృష్టశ్చతుర్విధః,
పానాభ్యఞ్జనవస్త్యర్థం నస్యార్థం చైవ యోగతః. ౧౬
స్నేహనా జీవనా వర్ణ్యాః బలోపచయవర్ధనాః,
స్నేహా హ్యేతే చ విహితాః వాతపిత్తకఫాపహాః. ౧౭

వ్యా. నెయ్యి, నువ్వులనూనె, వస (మాసస్నేహము), మజ్జ (క్రొవ్వు) ఈ నాల్గును మహాస్నేహము లనబడును. ఇవి పానమునకును అభ్యంగనమునకును, వస్తికర్మకును, నస్యముచేయుటకును, యుక్తములుగానుండును. మఱియు పైజెప్పిన స్నేహములు నాల్గును ఆయువును వృద్ధిజేయును. శరీరమునకు వర్ణమును కల్గించును. బలము వృద్ధినొందించును. శరీరమునకు పుష్టికల్గించును, వాతపిత్త కఫములను హరించును,

పైజెప్పిన స్నేహములు నాల్గును, క్షీరము మున్నగు ఇతర స్నేహములకంటె మిక్కిలి స్నిగ్ధత్వము అధికముగ కల్గియుండునుకాన మహాస్నేహములని చెప్పబడును. అందును నెయ్యి సంస్కారాదులయందు మిక్కిలి గుణవత్తరమై యుండునుగాన మిక్కిలి యుత్తమమైనది. కావుననే తొలుత నిర్దేశింపబడినది. "నాన్యస్నేహ స్తథా కశ్చిత్ సంస్కార మనువర్తతే, యథాసర్పిరతః సర్పిః సర్వస్నేహోత్తమం మతం"

పంచలవణములు, వానిగుణములు.

మూ. సౌవర్చలం సైన్ధవఞ్చ బిడమౌద్భిద మేవ చ,
సాముద్రేణ సహైతాని పంచస్యుర్లవణాని చ. ౮౮
స్నిగ్ధాన్యుష్ణాని తీక్ష్ణాని దీపనీయతమాని చ,
ఆలేపనార్థేయుజ్యన్తే స్నేహస్వేదవిధౌ తథా. ౮౯
అధోభాగోర్ధ్వభాగేషు నిరూహేష్వనువాసనే,
అభ్యఞ్జనే భోజనార్థే శిరసశ్చ విరేచనే. ౯౦
శస్త్రకర్మణి వర్త్యర్థం అంజనోత్సాదనేషు చ,
అజీర్ణానాహయోర్వాతే గుల్మే శూలే తథోదరే. ౯౧
ఉక్తాని లవణాని

వ్యా. సౌవర్చలలవణం (నల్లఉప్పు), సైంధవలవణం (ఇందుప్పు), బిడాలవణము (ఎఱ్ఱఉప్పు), ఔద్భిదలవణము(నేలయుప్పు),సాముద్రలవణము (దక్షిణసముద్రమునపుట్టిన ఉప్పు) ఈయైదును పంచలవణములనబడును. ఇవి స్నిగ్ధంబులును,ఉష్ణవీర్యంబులును, తీక్ష్ణంబులు నైయుండును. ఆకలిబుట్టించుద్రవ్యములలో నియ్యవి మిక్కిలి యుత్తమములు. మఱియు పైని పట్టువేయుటకును, స్నేహవిధియందును, చెమటపుట్టించుటకును నుపయోగింపదగును. శరీర అధోభాగమునందును, ఊర్ధ్వభాగమునందును, నిరూహవస్తియందును, అనువాసనవస్తియందును, అభ్యంజనమునకును నుపయోగింపదగును. భోజనపదార్థముల యందు జేర్పదగును. శిరోవిరేచనమునకును, నస్యకర్మకును, శస్త్రచికిత్సయందును, ఫలవర్తి చేయుటకును, అంజనములకును ఉపయోగింపబడును. అజీర్ణము, కడుపుబ్బరము, గుల్మము, శూల, ఉదరము అనునివ్యాధులయందు విశేషముగ నుపయోగింపదగును. ఇత్తెరంగున పంచలవణములును వానిగుణాదులును చెప్పబడినవి.

మూత్రాహికములు.

మూ. ఊర్ధ్వం మూత్రాణ్యష్టౌ నిబోధ మే,
ముఖ్యాని యాని చేష్టాని సర్వాణ్యాత్రేయశాసనే. ౯౨

అవిమూత్రమజామూత్రం గోమూత్రం మాహిషం చ యత్,
హాస్తిమూత్రమథోష్ట్రస్య హాయస్య చ ఖరస్య చ. ౯౩

వ్యా. గొఱ్ఱెలమూత్రము, మేకమూత్రము, గోమూత్రము, గేదెమూత్రము, యేనుగమూత్రము, ఒంటెమూత్రము, గుఱ్ఱపుమూత్రము, గాడిదమూత్రము ఈయెనిమిదియుంజేరి అష్టమూత్రము లనబడును. తక్కినజంతువులమూత్రముల కన్నిటికన్న ఇవి గుణోత్తమమగుటంజేసి ముఖ్యములని ఆత్రేయమహర్షి శాసించియున్నారు.

ఇచ్చట స్త్రీజాతిజంతువులకు అంగోపాంగములు లఘువులుగా నుండుటవలన వాని మూత్రములును లఘువుగా నుండును. కావున పైజెప్పినమూత్రములు ఆడజంతువుల నుండియే గ్రహింపవలయును. ఈవిషయమునే "లాఘవం జాతి సామాన్యే స్త్రీణాం పుంసాం చ గౌరవం" అని తంత్రాంతరమున చెప్పబడినది.

మూత్రసామాన్యగుణములు.

మూ. ఉష్ణం తీక్ష్ణమథో రూక్షం కటుకం లవణాన్వితమ్,
మూత్రముత్సాదనే యుక్తం యుక్తమాలేపనేషు చ. ౯౪
యుక్తమాస్థాపనే మూత్రం యుక్తం చాపి విరేచనే,
స్వేదేష్వపి చ తద్యుక్తం ఆనాహేష్వగదేషు చ. ౯౫
ఉదరేష్వపి చార్శస్సు గుల్మకుష్ఠకిలాసిషు,
తద్యుక్తముపనాహేషు పరిషేకే తథైవచ. ౯౬
దీపనీయం విషఘ్నం చ క్రిమిఘ్నం చోపదిశ్యతే,
పాణ్డురోగోపసృష్టానాం ఉత్తమం శర్మ చోచ్యతే. ౯౭
శ్లేష్మాణం శమయేత్పీతం మారుతం చానులోమయేత్,
కర్షేత్పిత్తమథోభాగం ఇత్యస్మిన్ గుణసఙ్గ్రహః. ౯౮
సామాన్యేన మయోక్తస్తు పృథక్త్వేన ప్రచక్ష్యతే,

వ్యా. పైజెప్పినమూత్రము లెనిమిదియు నుష్ణంబును, తీక్ష్ణంబును, రూక్షంబును, కటులవణరసంబును నైయుండును. మర్దనమునకును, లేపనమునకును, ఆస్థాపనవస్తికర్మకును, విరేచనమునకును యుక్తమైనది. చెమటదీయుటకును, ఆనాహము (కడుపుబ్బరము)నకును, విషచికిత్సకును, ఉదరవ్యాధియందును, అర్శోరోగములయందును, గుల్మవ్యాధులయందును, కుష్ఠములయందును, కిలాసము (సిబ్బెము) అనుక్షుద్రకుష్ఠమునందును, చికిత్సకై విశేషముగ నుపయోగింపదగును. మఱియు ఉపనాహమున(కట్టుగట్టుట)కును, వ్రణాదుల

LB2el,1
35G35



యందు సేచనముచేయుటకును విశేషముగ నుపయోగించును. మరియు జాఠరాగ్నిని దీపింపజేయును. విషముల హరించును. క్రిములను పోగొట్టును. పాండువు కామల సంజ్ఞా అనురోగములయందు వీని నుపయోగించిన మిక్కిలి సుఖము కల్గును. మూత్రమును త్రాగిన కఫమును హరించును. వాతమును అనులోమముగ సంచరింపజేయును. పిత్తమును క్రిందికి నాకర్షించి వెడలించును. ఇవియన్నియు పైజెప్పినమూత్రములకు సామాన్యముగ నుండుగుణములు. ఇది సామాన్యగుణకథనముకావున పైజెప్పినమూత్రముల కెనిమిదిటికిని ప్రత్యేకగుణములు క్రింద వివరింపబడును.

### మూత్రవిశేషగుణాదులు.

మూ. అవిమూత్రం సతిక్తం స్యాత్ స్నిగ్ధం పిత్తవిరోధి చ. ౯౯
ఆజం కషాయమధురం పథ్యం దోషాన్నిహన్తి చ,
గవ్యం సమధురం కిఞ్చిత్ దోషఘ్నం క్రిమికుష్ఠనుత్. ౧౦౦
కణ్డూలం శమయేత్పిత్తం సమ్యగ్దోషోదరే హితమ్,
అర్శశ్శోఫోదరఘ్నం తు సక్షారం మాహిషం సరమ్. ౧౦౧
హాస్తికం లవణం మూత్రం హితం తు క్రిమికుష్ఠినామ్,
ప్రశస్తం బద్ధవిణ్మూత్రవిషశ్లేష్మామయార్శసామ్. ౧౦౨
సతిక్తం శ్వాసకాసఘ్నం అర్శోఘ్నం చౌష్ట్రముచ్యతే,
వాజినాం తిక్తకటుకం కుష్ఠవ్రణవిషాపహమ్. ౧౦౩
ఖరమూత్ర మపస్మారోన్మాదగ్రహవినాశనమ్,
ఇతీహోక్తాని మూత్రాణి యథాసామర్థ్యయోగతః ౧౦౪

వ్యా. గొఱ్ఱెలమూత్రము చేదుగను, స్నిగ్ధముగ (జిడ్డుకల్గినదిగ) నుండును. పిత్తమునకు విరోధముచేయదు. మేకలమూత్రము వగరును తీపియు కల్గి పథ్యముగ నుండును. త్రిదోషముల హరించును. ఆవులమూత్రము కొంచెముగ తీపికల్గి దోషముల హరించును. క్రిములను కుష్ఠములను హరించును. పానముచేసినయెడ దురదను పోగొట్టును. వాతాది ప్రకోపమున సంభవించినఉదరవ్యాధియందు మిక్కిలి హితకరము. ఎనుములమూత్రము అర్శోరోగములను, శోఫరోగమును హరించును. కారముగ నుండును. శరీరమున శీఘ్రముగ వ్యాపించుస్వభావముకల్గినది. ఏనుగులమూత్రము ఉప్పగ నుండును. క్రిమిరోగమునందును కుష్ఠరోగమునందును మిక్కిలి హితకరము. మలమూత్రములు బంధించినప్పుడును, విషమునందును, కఫరోగములయందును, అర్శోరోగములయందును మిక్కిలి

VENKATESWARA CENTRAL LIBRARY RESEARCH CENTRE TIRUPATI 22059

హితముగ (ప్రశస్తముగ) నుండును. ఒంటెలమూత్రము చేదుగ నుండును. శ్వాసకాసముల హరించును. అర్శోరోగమును హరించును. గుఱ్ఱములమూత్రము చేదును కారమును కల్గియుండును. కుష్ఠములను వ్రణములను విషములను హరించును. గాడిదెల మూత్రము అపస్మారమును ఉన్మాదమును గ్రహములను హరించును. ఇత్తెరంగున నెనిమిది విధములైనమూత్రములకు జేరినగుణాదులు వేర్వేరుగ వివరింపబడినవి.

### క్షీరభేదములు.

మూ॥ అతః క్షీరాణి వక్ష్యన్తే కర్మ చైషాం గుణాశ్చ యే,
అవిక్షీర మజాక్షీరం గోక్షీరం మాహిషం చ యత్. ౧౦౫
ఉష్ట్రీణా మథ నాగీనాం బడబాయాస్స్త్రియా స్తథా,

వ్యా. పిమ్మట నుద్దేశప్రకారము క్రమప్రాప్తమైన యెనిమిదివిధములైన క్షీరములును వానికర్మలును గుణములును చెప్పబడును:—గొఱ్ఱెపాలు, మేకపాలు, ఆవుపాలు, ఎనుములపాలు, ఒంటెపాలు, ఏనుగుపాలు, గుఱ్ఱముపాలు, ఆడువారిచనుపాలు ఈయెనిమిదియు నష్టవిధములైన క్షీరములు.

### క్షీరసామాన్యగుణాదులు.

మూ॥ ప్రాయశో మధురం స్నిగ్ధం శీతం స్తన్యం పయో మతమ్. ౧౦౬
ప్రీణనం బృంహణం వృష్యం మేధ్యం బల్యం మనస్కరమ్,
జీవనీయం శ్రమహరం శ్వాసకాసనిబర్హణమ్. ౧౦౭
హన్తి శోణితపిత్తం చ సన్ధానం విహతస్య చ,
సర్వప్రాణభృతాం సాత్మ్యం శమనం శోధనం తథా. ౧౦౮
తృష్ణాఘ్నం దీపనీయం చ శ్రేష్ఠం క్షీణక్షతేషు చ,
పాణ్డురోగేఽమ్లపిత్తే చ శోషే గుల్మే తథోదరే. ౧౦౯
అతీసారే జ్వరే దాహే శ్వయథౌ చ విధీయతే,
యోనిశుక్రప్రదోషేషు మూత్రేష్వప్రదరేషు చ. ౧౧౦
పురీషే గ్రథితే పథ్యం వాతపిత్తవికారిణామ్,
నస్యాలేపావగాహేషు వమనాస్థాపనేషు చ. ౧౧౧
విరేచనే స్నేహనే చ పయస్సర్వత్ర యుజ్యతే,
యథాక్రమం క్షీరగుణా నేకైకస్య పృథక్పృథక్. ౧౧౨
అన్నపానాదికేఽధ్యాయే భూయో వక్ష్యామ్యశేషతః,

వ్యా. క్షీరములన్నియుం బ్రాయికముగ మధురరసము ప్రధానముగ గల్గియుం డును. (ప్రధానమనుటచేత ఒంటెలక్షీరమున ఉప్పును, మేకపాలయందు వగరును అను రసములుగ నప్రధానములై యుండునని భావము.) మరియుం స్నిగ్ధంబును (జిడ్డుకల్గి నదియుం), శీతంబును శీతవీర్యంబును నగును. స్తనముల వృద్ధినొందించును. ప్రీతిని బుట్టిం చును. (చక్షురాదీంద్రియముల నాప్యాయత నొందించును.) శరీరమును బలియ జేయును. ఇంద్రియపుష్టిని కల్గించి సంభోగేచ్ఛను వృద్ధినొందించును. మేధకు మిక్కిలి హితకరము. బలమును కల్గించును. మనస్సును వృద్ధినొందించి మనశ్శక్తిని స్థిరపరచును. ప్రాణములకు బలమునిచ్చును. వ్యాయామాదులచే గల్గిన శ్రమమును పోగొట్టును. శ్వాసకాసములను, రక్తపిత్తమును హరించును. విరిగినసంధిబంధములను అతుకజేయును. మనుజులకందరకును మిక్కిలి సాత్మ్యముగ నుండును. క్రిమిదోషముల శమింపజేయు నదియు శోధించునదియు నగును. దప్పినడంచును. మందగించినజాఠరాగ్నిని దీపింప జేయును. ధాతువులు క్షీణించినవారికిని గాయములు తగిలినవారికిని మిక్కిలి శ్రేష్ఠమైనది. మరియు పాండురోగము, అమ్లపిత్తము, శోష (క్షయరోగము), గుల్మము, ఉదరరోగము, అతిసారము, జ్వరము, తాపము (మంట), వాపు, యోనిరోగములు, శుక్రరోగములు, మూత్రకృచ్ఛ్రాదిమూత్రవ్యాధులు, రక్తప్రదరము, మలబంధము అను నీవ్యాధుల యందు మిక్కిలి పథ్యముగ నుండును. వాతవ్యాధికలవారికిని పిత్తవ్యాధిపీడితులకును మిక్కిలి హితకరము. మరియుం నస్యమునకును పూయుటకును, స్నానము చేయుటకును, వమనౌషధములకును, ఆస్థాపనవస్తికిని, విరేచనమునకును, చెమటబుట్టించుటకును, ఈకృత్యముల కన్నిటికిని క్షీరము ముఖ్యముగ నుపయోగింపదగినది. ఇది పాలయొక్క సామాన్యగుణకర్మములు. మరియుం పైజెప్పినక్షీరభేదములకు ఒక్కొకదానికిని వేరువేరుగ గుణకర్మాదులు అన్నపానాదికాధ్యాయమున వివరింపబడును.

ఇచ్చట ప్రాయశః అనుపదము 'మధురం, బృంహణం, స్నిగ్ధం, శీతమ్' అనుపద ములతో వేరువేర సంబంధించును. క్షీరము సామాన్యముగ నుండుననియుం, స్నిగ్ధముగ నుండుననియుం, ప్రాయికముగ బృంహణమనియుం, శీతవీర్యమనియుం నర్థమగును. ఇటు చెప్పుటచేత ఒంటెపాలు కొంచెముగ లవణరసముకల్గియుం, మేకపాలు కషాయరసము కల్గియుం నుండుననుట సంగతమగును. క్షీరసామాన్యమున మధురము ప్రధానముగను, కొన్నిక్షీరములయందు ఇతరరసము లుపరసములైయున్నను మధురము ప్రధానముగ నుండుననియు భావము. స్నిగ్ధశీతగుణములు ప్రాయికముగ నుండుననుటచేత ఒంటెల క్షీరము రూక్షోష్ణత్వాదిగుణయుక్తమనునది సంగతమగును.

—శోధనార్థమైనమూడువృక్షములు, వానియుపయోగము.—

మూ. అథాపరే త్రయో వృక్షాః పృథగ్యే ఫలమూలిభిః. ౧౧౩
స్నుహ్యర్కాశ్మన్తకాస్తేషాం ఇదం కర్మ పృథక్పృథక్,
వమనేఽశ్మన్తకం విద్యాత్ స్నుహీక్షీరం విరేచనే. ౧౧౪
క్షీరమర్కస్య విజ్ఞేయం వమనే సవిరేచనే,

వ్యా. ఫలిని, మూలిని అని చెప్పి పైని వివరించినవానికన్న నితరములయినవి యారువృక్షములు శోధనార్థ ముపయోగింపదగినవి. అందు జెముడు, జిల్లేడు, అశ్మంతకము అనునవి మూడు. వానిమూటికిని వేరువేరుగ కృత్యములు చెప్పబడుచున్నవి. ఆమూటిలో నశ్మంతకమనునది వమనకర్మ కుపయోగించును. విరేచనమునకు జెముడుపాలు ఉపయోగింపదగును. జిల్లేడుపాలు వమనమునకును విరేచనమునకును (రెంటికిని) ఉపయోగింపదగును.

(ఇచ్చట అశ్మంతకమనునది 'మాలుయానదృశపత్రో వృక్షః' అని వ్యాఖ్యాత వ్రాసియున్నాడు. ఆరెచెట్టని కొన్నినిఘంటుకారులు వ్రాసియున్నారు. కాని అయ్యది వమనకారికాదు. కావున ప్రకృతమున దాని గ్రహించుట సమంజసముగ నుండలేదు.)

—మూడుశోధనవృక్షములు; వానిగుణకర్మములు.—

మూ. ఇమాంస్త్రీనపరాన్ వృక్షాన్ ఆహుర్యేషాం హితాస్త్వచః.
పూతికః కృష్ణగన్ధా చ తిల్వకశ్చ తథా తరుః,
విరేచనే ప్రయోక్తవ్యః పూతికః తిల్వకస్తథా. ౧౧౫
కృష్ణగన్ధా పరీసర్పే శోథేష్వర్శస్సుచోచ్యతే,
దద్రువిద్రధిగణ్డేషు కుష్ఠేష్వప్యలజీషు చ. ౧౧౬
షడ్వృక్షాన్ శోధనానేతాన్ అపి విద్యాద్విచక్షణః,

వ్యా. పైజెప్పినవిమూడుగాక యితరములైనవి మూడువృక్షములు కలవు. వానిపట్ట నుపయోగించుట చాల హితము. అవి యెవ్వియనః—నెమలియడుగుచెట్టు (కానుగులో నొకవిధమైనది), మునగచెట్టు, లొద్దుగుచెట్టు అనునవి వృక్షములు మూడు. అందు కానుగుచెట్టుపట్టయు, లొద్దుగుచెట్టుపట్టయు విరేచనమున కుపయోగింపదగును. మునగచెట్టుపట్ట విసర్పమునందును, శోథ (వాపు) యందును, అర్శోరోగమునందును, దద్దురులుగనుండు కుష్ఠవిశేషమునందును, విద్రధులయందును, గండమాలయందును, కుష్ఠములయందును, అలజియనుమాంసమును తినునట్టివ్రణములయందును; విశేషముగ

నుపయోగింపదగును. పైజెప్పినమూడువృక్షములును, ఇచ్చట జెప్పినమూడువృక్షములును జేరి యారువృక్షములును శోధనమున కుపయోగింపదగినవియని యెఱుంగునది.

ఇచ్చట లోధ్రము (లొద్దుగు) అనునది పట్టికాలోధ్రము, శాబరలోధ్రము నని రెండువిధములు. అందు పట్టికాలోధ్రము ఆకృతిచే చిన్నది. రెండవది గొప్పది. వృక్షజాతిలో జేరినది. ఈవృక్షజాతిలో జేరిన శాబరలోధ్రమునే యిచ్చట గ్రహింపనగునని తెల్పుటకై 'తరుః' అని విశేషముగ జెప్పబడినది.

మరియుం మునగచెట్టు శోధనములలో జెప్పినందున ఇది విరేచనాదిరూపముగ శోధనముచేయకున్నను పట్టువేయుటచే శరీరముపై నున్నదోషములను శోధించును కావున శోధనమని చెప్పుట సమంజసము.

### ఫలమూలిన్యాదిప్రకరణోపసంహారము.

మూ. ఇత్యుక్తాః ఫలమూలిన్యః స్నేహాశ్చ లవణాని చ. ౧౧౮
మూత్రం క్షీరాణి వృక్షాశ్చ షడ్యే దృష్టాః పయస్త్వతః,

వ్యా. ఇత్తెరంగున ఫలిని, మూలిని, స్నేహములు, లవణములు, మూత్రములు క్షీరములు, ఆరువృక్షములు (అందు పాలు నుపయోగింపదగినవి మూడు పట్ట నుపయోగింపదగినవి మూడు), అనునవి "మూలిన్యః—నిదర్శితాః" అనుగ్రంథమున నిర్దేశించిన ప్రకారము వానియవాంతరభేదములును, వానికర్మగుణాదులును వివరింపబడినవని భావము.

### ఓషధుల యోగజ్ఞానావశ్యకత.

మూ. ఓషధీర్నామరూపాభ్యాం జానతే హ్యజపా వనే. ౧౧౯
అవిపాశ్చైవ గోపాశ్చ యే చాన్యే వనవాసినః,
న నామజ్ఞానమాత్రేణ రూపమాత్రేణ వా పునః. ౧౨౦
ఓషధీనాం పరాం ప్రాప్తిం కశ్చిద్వేదితుమర్హతి,
యోగవిన్నామరూపజ్ఞః తాసాం తత్త్వవిదుచ్యతే. ౧౨౧
కిం పునర్యో విజానీయాత్ ఓషధీస్సర్వథా భిషక్,
యోగమాసాం తు యో విద్యాత్ దేశకాలోపపాదితమ్.
పురుషం పురుషం వీక్ష్య స జ్ఞేయో భిషగుత్తమః,

వ్యా. మేకలను గొఱియలను పశువులను మేపువారు అడవులయందు విశేషముగ సంచరింతురు. కావున వారికిని అడవులయందు నివసించియుండు ఏనాదులు మున్నగు

వారికిని ఓషధులనామభేదంబులును రూపభేదంబులును చక్కగ దెలిసియుండును. అట్టివారు ఓషధులనామరూపముల దెలిసినమాత్రముచేతనే ఓషధులపూర్ణజ్ఞానము కలవారు కానేరరు. కావున ఓషధులను నామరూపభేదములచే తొలుత జక్కగ గమనించి వాని గుణాదులను జక్కగ గమనించి, తత్తదనుసారముగ నొకటితో నొకటి జేర్చుటనెవడు దెలియునో వాడు ఓషధిజ్ఞానవంతుడని చెప్పబడును. ఎవడు ఓషధులను పూర్తిగ నామరూపములచే దెలిసి, పిదప వానిగుణకర్మాదుల గమనించి, పరస్పరసంయోజనాపద్ధతి నెరింగి యౌషధనిర్మాణమును చక్కగ దెలిసి, దేశకాలాద్యనుసారముగ నాయాపురుషుల ప్రకృత్యాదులను పలుమారు పరీక్షించి చికిత్సజేయగడంగునో వాడు వైద్యవరుండని చెప్పనగును.

అడవులయందు సంచరించు గొల్లుగోడి యేనాదిమున్నగువారికిగూడ అలవాటుచే నామరూపభేదములబట్టి ఓషధిజ్ఞానమాత్రము కల్గియుండును. అంతమాత్రముచేతను వారు కృతార్థులు కానోపరు. కావున నామరూపభేదములచే నోషధుల గుర్తించి వానివానిగుణరసవీర్యవిపాకాదుల చక్కగ నెరింగి తత్తదుచితముగ పరస్పరసంయోగరూపముగ నౌషధమును కల్పించి, అట్టి యౌషధమును రోగియొక్కతత్వమును ప్రకృతి మున్నగువానిని జక్కగ పలుమారు పరీక్షించి, దేశకాలప్రకృత్యాద్యనుసారముగ నౌషధ ముపయోగించుక్రమమునం దారితేరినవాడె వైద్యవరుడగునని భావము.

## ఔషధజ్ఞానావశ్యకతకు దృష్టాంతనిరూపణము.

మూ. యథా విషం యథా శస్త్రం యథాగ్నిరశనిర్యథా. ౧౨౩
తథౌషధమవిజ్ఞాతం విజ్ఞాతమమృతం యథా,
ఔషధం హ్యనభిజ్ఞాతం నామరూపగుణైస్త్రిభిః. ౧౨౪
విజ్ఞాతం చాపి దుర్యుక్తం అనర్థాయోపపద్యతే,

వ్యా. యోగ మనగా వ్యాధిని శరీరతత్వాదులను చక్కగ గమనించి తత్తదనుగుణముగ నౌషధమును చక్కగ నిర్మించడము యోగము. అట్టియోగము ఓషధులను నామరూపగుణముల జక్కగ సవిశేషముగ నెరింగినగాని చేయ వలనుపడదు. ఔషధముల నామరూపగుణాదుల నెరుంగక చేయునౌషధయోగము మహానర్థదాయకమని దృష్టాంతరముల ననేకములజూపుచు ఔషధజ్ఞానావశ్యకత ఇట్లు నిర్ణయింపబడుచున్నది.

నామరూపగుణములచే నోషధుల జక్కగ నెరుంగక తనకిచ్చవచ్చినట్లు సిద్ధముచేయబడిన యౌషధము విషమునుబోలె ప్రజ్ఞను నశింపజేసి మనుజుని చంపును. కొన్ని యౌషధములు శస్త్రములబోలె మర్మస్థానముల ఛేదించి చంపును. మరికొన్ని అగ్నినిబోలె

స్ఫోటకముల గల్గించి చంపును. కొన్ని పిడుగుబోలె అప్పుడే అతిశీఘ్రముగ ప్రాణముల వెడలించును. (కావున నౌషధమును నామరూపగుణాదుల జక్కఁగ నెరింగి దేశకాలాదులను రోగియొక్క దోషదూష్యాదులను చక్కఁగ గమనించి తత్తదనుగుణముగ నౌషధమును కల్గింపవలెనని భావము). మరియు నామరూపగుణాదుల గమనించిచేయబడిన యౌషధము అమృతమునుబోలె నారోగ్యభాగ్యముల నొనగూర్చి రోగిని ఆయుష్మంతునిగ జేసి కాపాడును.

మరియు నామరూపగుణాదులచే చక్కఁగ తెలియబడనియౌషధంబును, ఒకవేళ అట్టిజ్ఞానముచే చక్కఁగ గమనింపబడినను, వ్యాధి శరీరప్రకృతులు మున్నగువాని గమనించక సిద్ధముచేయబడినయౌషధంబును పైజెప్పినరీతిగ విషశస్త్రాదులబోలె ననర్థదాయకమగును.

ఇచ్చట "నామరూపగుణైః" అను బహువచనముచేతనే మూడు అని తెలియుచున్నను మరల 'త్రిభిః' అని చెప్పుటచేత నామరూపగుణములమూటిచే నౌషధజ్ఞానముండవలెనుగాని యీమూటిలో నొకదానిచే మాత్రము నౌషధజ్ఞానమున్న ప్రయోజనములేదని తెలిసెడి.

### యుక్తిదూరమైన యౌషధనిరసనము.

మూ. యోగాదపి విషం తీక్ష్ణం ఉత్తమం భేషజం భవేత్. ౧౨౫
భేషజం వాపి దుర్యుక్తం తీక్ష్ణం సమ్పద్యతే విషమ్,
తస్మాన్న భిషజా యుక్తం యుక్తిబాహ్యేన భేషజమ్. ౧౨౬
ధీమతా కిఞ్చిదాదేయం జీవితారోగ్యకాంక్షిణా,
కుర్యాన్నిపాతితో మూర్ధ్ని సశేషం వాసవాశనిః. ౧౨౭
సశేషమాతురం కుర్యాత్ న త్వజ్ఞమతమౌషధమ్,

వ్యా. విషము మిక్కిలి తీవ్రమై ప్రాణహారమైనది. అయినను నద్దానిని పైజెప్పిన దేశకాలదోషదూష్యాద్యనుగుణముగ 'విషస్య తు తిలం దద్యాత్' అని చెప్పినప్రకారము తిలప్రమాణము కల్పించి యుపయోగించినచో మిక్కిలి క్రూరములగువ్యాధుల నివర్తింపజేయు నుత్తమమైనయౌషధముగ నగును. దుర్యుక్తమైన (దేశకాలాదుల గమనింపక కల్పింపబడిన) యౌషధము మిక్కిలి తీవ్రతరమైన విషమై క్షణమాత్రమున రోగిని చంపజూచును. కావున యుక్తిబాహ్యముగ తన కిచ్చవచ్చినవిధముగ గల్పింపబడిన యౌషధమును, రోగియొక్క జీవితమును ఆరోగ్యమును మనఃపూర్వకముగ గోరు వైద్యవరుడు ఒకప్పుడు రోగికి ఉపయోగింపంజనదు.

మరియు ఇంద్రునిచేతనుండువజ్రాయుధమును మనుజునితలపై బడవైచినను అట్టిమనుజుని ఆవజ్రాయుధము చంపక యొకవేళ వదలిపెట్టునుగాని ఔషధజ్ఞానములేక యుక్తిదూరముగ గల్పింపబడిన యౌషధము మాత్రము రోగిని నశేషముగ నుంచదు. (వజ్రాయుధముచేనైన జావు తప్పించుకొననగుగాని, దుర్యుక్తమైన యౌషధము తప్పక చంపునని భావము) కావున పైజెప్పినఔషధజ్ఞానంబును యోగజ్ఞానంబును ఆవశ్యక మనుట.

### జ్ఞానహీనవైద్యనిరసనము.

మూ. దుఃఖితాయ శయానాయ శ్రద్దధానాయ రోగిణే. ౧౨౮
యో భేషజమవిజ్ఞాయ ప్రాజ్ఞమానీ ప్రయచ్ఛతి,
త్యక్తధర్మస్య పాపస్య మృత్యుభూతస్య దుర్మతేః. ౧౨౯
నరో నరకపాతీ స్యాత్ తస్య సంభాషణాదపి,

వ్యా. ఔషధములయొక్క గుణాదులును వానిసమ్యక్ప్రయోగమును చక్కగ తెలియకున్నను తాను వైద్యుడని పేరుబెట్టుకొని విఱ్ఱవీగుచు గర్వపడుచుండు ఏవైద్యుడు, రోగబాధలచే కష్టపడుచు పడకపై పరుండి, ఈవైద్యునిచే మనకు రోగవిముక్తి కలుగునని నమ్మియుండురోగికి ఔషధము నిచ్చునో, ధర్మమును వదలినవాడును, మహాపాపియు, ఆరోగిపాలికి మృత్యుదేవతయు, దుర్బుద్ధియునైన యావైద్యునితో సంభాషించినను అట్టిమనుజుడు నరకమున బడును. (కావున అట్టికుత్సితుడైన వైద్యబ్రువుని చెంత జేర్పం జనదని భావము).

### ద్రవ్యోపార్జనపరవైద్యనింద.

మూ. వరమాశీవిషవిషం క్వథితం తామ్రమేవవా. ౧౩౦
పీతమత్యగ్నిసన్తప్తాః భక్షితా వాప్యయోగుడాః,
న తు శ్రుతవతాం వేషం బిభ్రతా శరణాగతాత్. ౧౩౧
గృహీతమన్నం పానం వా విత్తం వా రోగపీడితాత్,
భిషగ్బుభూషుర్మతిమా న తస్స్వగుణసమ్పది. ౧౩౨
పరం ప్రయత్నమాతిష్ఠేత్ ప్రాణదస్స్యాద్యథా నృణామ్,

వ్యా. వైద్యశాస్త్రపరిజ్ఞాన మించుకేనియు లేకున్నను మిగుల చక్కగ దెలిసిన వానివలె వేషముధరించి వైద్యవృత్తి నవలంబించి తనను రోగవిముక్తునిజేసి కాపాడు మని శరణాగతుడైన రోగిదగ్గిరనుండి యన్నపానాదులనుజేసి 'వానివలన పొందబడినధన

మున జీవించుటకంటె, సర్పవిషమునైనను, బాగుగ కరగించబడినతామ్రమునైనను, మిక్కిలి అగ్నిచే కాల్చబడిన యినుపగుండ్లనైనను మ్రింగి జీవించుట మేలు. (తెలివిలేని కుత్సితవైద్యుడు వైద్యవేషము బూని రోగియొద్ద నన్నపానాదుల గుడిచి వానిధనమును మోసముచే గ్రహించిన నయ్యది సర్పవిషాదులబోలె హింసాకరములై యుండునని భావము). కావున తాను వైద్యుడుగా నుండదలచిన మానవుడు "శ్రుతే పర్యవదాతత్వం" అనువాక్యమున జెప్పిన వైద్యునికుండదగినగుణముల నన్నిటిని సంపాదించి రోగులప్రాణముల కాపాడుటకు మిక్కిలి ప్రయత్నముచేయవలెను. (శాస్త్రజ్ఞానమును సంపాదించి నామరూపగుణాదులచే నౌషధముల జక్కగ దెలిసికొని వానిసంయోగాది కల్పనాభేదముల గుర్తించి రోగులకాపాడుటకై మిక్కిలి ప్రయత్నముచేయవలెనని భావము).

### యుక్తియుక్తఔషధలక్షణము, సువైద్యలక్షణము.

మూ. తదేవ యుక్తం భైషజ్యం యదారోగ్యాయ కల్పతే. ౧౩౩
స చైవ భిషజాంశ్రేష్ఠః రోగేభ్యో యః ప్రమోచయేత్,

వ్యా. ఏయౌషధము రోగిని రోగములనుండి విడచి యారోగ్యమును కల్గింప సమర్థమైయుండునో అదియే యుక్తియుక్తమైన యౌషధమనబడును. ఏవైద్యుడు రోగిని రోగములనుండి విముక్తుని జేయుచు నుద్ధరించునో వాడు ఉత్తమవైద్యు డనబడును.

### సమ్యక్ప్రయోగవైద్యోత్తమలక్షణములు.

మూ. సమ్యక్ప్రయోగం సర్వేషాం సిద్ధిరాఖ్యాతి కర్మణామ్. ౧౩౪
సిద్ధిరాఖ్యాతి సర్వైశ్చ గుణైర్యుక్తం భిషక్తమమ్,

వ్యా. పలుదెరంగులైన చికిత్సావిధానములు ఫలవంతములై యారోగ్యరూపమైన కార్యసిద్ధి కల్గినచో నప్పుడు చికిత్స జక్కగ జేయబడినదని యెరుంగునది. వైద్యునకుండ వలసిన శాస్త్రజ్ఞానాదిగుణములన్ని యుంకల్గి వాడుచేయు చికిత్సలవలన రోగికి ఆరోగ్యము కల్గినచో నట్టివైద్యుడు మిక్కిలి శ్రేష్ఠమైనవాడని తెలియదగును.

### అధ్యాయవిషయసంగ్రహము.

తత్ర శ్లోకాః—

మూ. ఆయుర్వేదాగమో హేతురాగమస్య ప్రవర్తనమ్. ౧౩౫
సూత్రణస్యాభ్యనుజ్ఞానం ఆయుర్వేదస్య నిర్ణయః,
సంపూర్ణం కారణం కార్యం ఆయుర్వేదప్రయోజనమ్. ౧౩౬

హేతవశ్చైవ దోషాశ్చ భేషజం సఙ్గ్రహేణ చ,
రసాస్సప్రత్యయద్రవ్యాః త్రివిధో ద్రవ్యసఙ్గ్రహః. ౧౩౭
మూలిన్యశ్చ ఫలిన్యశ్చ స్నేహాశ్చ లవణాని చ,
మూత్రం క్షీరాణి వృక్షాశ్చ షడ్యే క్షీరత్వగాశ్రయాః. ౧౩౮
కర్మాణి చైషాం సర్వేషాం యోగాయోగగుణాగుణాః,
సర్వమేతత్సమాఖ్యాతం పూర్వాధ్యాయే మహర్షిణా. ౧౩౯

వ్యా. ఆయుర్వేదోత్పత్తి, దానికారణము, ఆయుర్వేదావతరణము, ఆయుర్వేద సూత్రణానుజ్ఞ, ఆయుర్వేదనిర్ణయము, సంపూర్ణమగునాయుర్వేదకారణము, కార్యము, ఆయుర్వేదప్రయోజనము, వ్యాధిహేతువులు,వ్యాధులు, వానిచికిత్సాసంగ్రహము మధురాదిరసములు, రసోత్పత్తికారణము, రసాశ్రయద్రవ్యములు, త్రివిధద్రవ్యసంగ్రహము, మూలినులు, ఫలినులు, స్నేహములు, లవణములు, మూత్రభేదములు, క్షీరభేదములు, క్షీరమునకును చర్మమునకును ఆశ్రయములైనఆరువృక్షములు, పైజెప్పినమూలిన్యాదుల కార్యములు, యోగగుణములు యోగదోషములు ఇవి యన్నియు ప్రథమాధ్యాయమున మహర్షియగు నగ్నివేశునిచే జెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
దీర్ఘంజీవితీయో నామ ప్రథమోఽధ్యాయః.

వ్యా. ఇత్తెఱంగున నగ్నివేశకృతంబును చరకునిచే సంస్కరింపబడినదియు నగు చరకసంహితయను నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమున దీర్ఘంజీవితీయ మనునది మొదటి అధ్యాయము సమాప్తము.

## ద్వితీయాధ్యాయము.

అవతారిక:—పూర్వాధ్యాయమునందు పంచకర్మముల కర్మములగుఫలములును మూలములును జెప్పఁబడినవి. ఈయధ్యాయమున పిప్పల్లి మిరియములు మున్నగునవి చెప్పబడును. మరియు అట్టిఫలమూలములును పంచకర్మోపయోగ్యములని పూర్వాధ్యాయమున జెప్పియుండలేదు. అట్టి ఫలమూలములును, ఈయధ్యాయమునం జెప్పఁబడిన అపామార్గబీజాదులును, వమనాదిపంచకర్మముల కర్మములని యీయధ్యాయాంతమున

"పూర్వం మూలఫలజ్ఞానహేతో రుక్తం యదౌషధమ్, పఞ్చకర్మాశ్రయజ్ఞానహేతో స్తత్కీర్తితం పునః." అనుశ్లోకముచేతను; అష్టావింశతి........పఞ్చకర్మాణి చాశ్రిత్య ప్రోక్తో భైషజ్యసంగ్రహః" అనుశ్లోకముచేతను వివరింపబడినది. పూర్వాధ్యాయమున కేవలము ఫలమూలజ్ఞానమునకై నిర్దేశింపబడిన యౌషధములును, ఈయధ్యాయమున జెప్పబడిన ఔషధయోగములును పంచకర్మముల నుద్దేశించి చెప్పబడినవియని ఫలితార్థము.

మూ. అథాతోఽపామార్గతణ్డులీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః ౧

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. పిమ్మట అపామార్గతణ్డులీయమను నధ్యాయమును త్రికాలజ్ఞానసంపన్నుడగు నాత్రేయుండు చెప్పినదానికి న్యూనాతిరేకములు లేక వివరించెదనని భావము. ఇచ్చట పదప్రయోజనాదులను పూర్వాధ్యాయప్రారంభవ్యాఖ్యానమువలె నెఱుంగునది.

ఇచ్చట నీయధ్యాయమునకు అపామార్గబీజములు మొదట నిర్దేశింపబడినవి, కావున అట్టి యపామార్గతండులములను కారణముగజేసి అపామార్గతండులీయమని సంజ్ఞచేయబడినది. అధ్యాయప్రారంభమున "అపామార్గస్య బీజాని" అని యుపక్రమించినను "తణ్డులీయం" అని సంజ్ఞచేయుంటచే అపామార్గబీజములను (ఉత్తరేణిగింజలను) పొట్టూడదీసి వానిబియ్యమును గ్రహింపనగునుకాని పొట్టుతోగూడ జేర్పదగదని నియమము నెరుంగునది. మరియుం అధ్యాయసంజ్ఞానుసారముగ అపామార్గతండులములు అని చెప్పక "బీజాని" అనుటచేత మొలకలెత్తుటకు దగినసారముకల అపామార్గతండులములను గ్రహింపవలె నననియమము తెలిసెడిని.

శిరోవిరేచనద్రవ్యములు.

మూ. అపామార్గస్య బీజాని పిప్పలీ ర్మరిచాని చ,
విడఙ్గాన్యథ శిగ్రూణి సర్షపాస్తుమ్బురూణి చ. ౩
అజాజీం చార్కగన్ధాం చ పీలూన్యేలాం హరేణుకామ్,
పృథ్వీకాం సురసాం శ్వేతాం కుఠేరకఫణిజ్ఝకౌ. ౪
శిరీషబీజం లశునం హరిద్రే లవణద్వయమ్,
జ్యోతిష్మతీం నాగరం చ దద్యాచ్ఛీర్షవిరేచనే. ౫
గౌరవే శిరసశ్శూలే పీనసేఽర్ధావభేదకే,
క్రిమివ్యాధావపస్మారే ఘ్రాణనాశే ప్రమోహకే, ౬

వ్యా. పోట్టొలిచినయుత్తరేణిగింజలు, పిప్పళ్లు, మిరియాలు, వాయువిడంగములు, మునగవిత్తులు, ఆవాలు, తుమికివిత్తులు, జీలకర, వాయింటవిత్తులు, వరగోగుగింజలు, ఏలకులు, రేణుకలు, నల్లజీలకర, పిన్నయేలకులు, తులసివిత్తులు, తెల్లదింటెన, నల్లతులసి, అడవితులసి, దిరిసెనపుగింజలు, ఉల్లిపాయలు, పసుపు, మ్రానిపసుపు, సైంధవలవణము, సముద్రలవణము, మాల్కాంగిని, శుంఠి ఈద్రవ్యములను శిరోవిరేచనమునకై యుపయోగింపనగును. మరియు తల బరువుగనుండుట, తలనొప్పి, పీనసము, అర్ధావభేదకమను శిరోరోగము, శిరోగతమైన క్రిమిరోగము, అపస్మారము, ఘ్రాణేంద్రియమునకు వాసనతెలియకుండుట, మూర్ఛావ్యాధి అను సీరోగములయందు పైజెప్పినగణమునందలి ద్రవ్యములను అన్నింటినైనను కొన్నిటినైనను వ్యాధిబలానుసారముగ శిరోవిరేచనమునకై యుపయోగింపవలెను.

పంచకర్మములలో వమనము మొదటిది; ఏలయన:—"సాధారణేషు ఋతుషు వమనాదీనాం ప్రవృత్తిర్భవతి" ఇది మున్నగువాక్యములయందు వమనమే తొలుత నిర్దేశింపబడినది. మరియు "అవాన్తస్య హి సమ్యగ్విరిక్తస్యా ప్యధస్స్రస్తశ్లేష్మా గ్రహణీమాచ్ఛాదయతి" అను సుశ్రుతవాక్యము గూడ వమనమునకు ప్రాధాన్యమును స్ఫుటముగ దెల్పుచున్నది. కావున పంచకర్మములలో ప్రధానమైన వమనమును వదలి శిరోవిరేచనమును తొలుత జెప్పుట యెట్లు సమంజసము? అన్నచో శరదృతువునందు పిత్తము ప్రకుపితమైనచో విరేచనము ప్రధానముగజేసి పంచకర్మముల జేయవలెననియు, వర్షర్తువున వాతము ప్రబలముగ నున్నపుడు వస్తిప్రధానముగ పంచకర్మల జేయవలెననియు, ఆయాదోషప్రాబల్యమునుబట్టి ఆయాదోషహరమగుకర్మను ప్రధానముగజేసి పంచకర్మల సాగింపనగునని చెప్పబడినది. కావున పంచకర్మలకు నిర్ణీతమైన యానుపూర్వి నిశ్చితమై యుండలేదు. కావున నియ్యెడ శిరోవిరేచనపూర్వకముగ నిర్దేశింపబడియె.

మరియు "యదుత్తమాఙ్గమఙ్గానాం శిరస్తదభిధీయతే" అనువాక్యముచేత అవయవములలో శిరస్సు ప్రధానముగ జేర్కొనంబడియె. "అనామయే యథా మూలే వృక్షస్సమ్యక్ప్రవర్ధతే, అనామయే శిరస్యేవం దేహస్సమ్యక్ప్రవర్ధతే" అని శాలాక్యతంత్రమున జెప్పబడినది. (వృక్షమునకు వేరురోగములేక నిర్దుష్టమైయున్నపుడు చెట్టు ఎట్లు చక్కగ వృద్ధినొందునో అత్తెరంగుననే శిరస్సు రోగపీడితముకాకున్నచో శరీరము చక్కగ వృద్ధినొందుననిభావము) ఈవాక్యములుగూడ శిరస్సుకు ప్రాధాన్యమును దృఢము చేయుచున్నది. లోకమున గూడ "సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమ్" అని శిరస్సుకు ప్రాధాన్యము నుద్ఘోషించుట సామాన్యము. కావున అట్టి ప్రధానమైన శిరస్సుకు సంబంధించినశిరోవిరేచనములు తొలుత నిర్దేశింపబడెను. అందును "ప్రత్యక్పుష్పీ శిరోవిరేచ

నాసాం" అనువాక్యముచేత శిరోవిరేచనద్రవ్యములలో నుత్తరేణి ప్రధానమగుటంజేసి తొలుత "అపామార్గస్య బీజాని" అని చెప్పబడెనని యెఱుంగునది.

మరియు పైజెప్పినశిరోవిరేచనవర్గములో నిర్దేశింపబడిన ద్రవ్యములలో కొన్నిటి నైనను, లేక అన్నింటినైనను ఆయాదోషములబలమును వ్యాధిస్వభావమునుబట్టి యుప యోగింపనగును. ఈవిషయము "పరిసంఖ్యాత మపి హి యద్ద్రవ్య మయోగికం మన్యేత తదపహరేత్" "సమస్తవర్గమర్ధం వా యథాలాభ మథాపి వా" ఇవి మున్నగువాక్య ములచే జెప్పబడినది. (ఏదైన నొకటి వర్గమున పరిగణనముజేయబడిన ద్రవ్యములలో ప్రకృత్యాదులకు అననుకూలముగ దోచినచో దాని విడచి తక్కుంగలద్రవ్యముల జేర్ప వలెననియు, ఆయావర్గమున జెప్పినద్రవ్యముల నన్నింటినైనను, సగమునైనను, దొరకిన వరకైనను ద్రవ్యముల జేర్చుకొనవలెనని భావము.)

వమనద్రవ్యములు.

మూ. మదనం మధుకం నిమ్బం జీమూతం కృతవేధనమ్,
పిప్పలీ కుటజేక్ష్వాకూన్యేలాం ధామార్గవాణి చ. ౭
ఉపస్థితే శ్లేష్మపిత్తే వ్యాధా వామాశయాశ్రయే,
వమనార్థం ప్రయుంజీత భిషగ్దేహ మదూషయన్. ౮

వ్యా. మ్రంగకాయ, యష్టిమధుకము, వేము, దేవదాళి, చేదుబీర, పిప్పళ్లు కొడిసెపాల, చేదుపుచ్చ, ఏలకులు, ఉత్తరేణి ఇవియన్నియు వమనమున కుపయోగింప దగినద్రవ్యములు. ఈవమనద్రవ్యములు కఫము ఆమాశయమునకు పైభాగమున జేరి పైకివెడల నుద్యమించునపుడును; పిత్తమునందును, ఆమాశయమున బుట్టినవ్యాధియం దును, వమనము జేయించుటకై యుపయోగించవలెను. వమనౌషధము నుపయోగించుచ నెడ దేహమునకు చెరుపులేకుండ మిక్కిలి మెలకువతో దోషానుసారముగ వైద్యుడటకై చికిత్స జేయవలెను.

ఇచ్చట "వమనద్రవ్యే మదనఫలాని శ్రేష్ఠతమాన్యాచక్షతే అనపాయిత్వాత్" అనువాక్యముచే వమనద్రవ్యములలో మ్రంగకాయ మిగుల శ్రేష్ఠమని చెప్పియుండుటం జేసి తొలుత మదనఫలము పేర్కొనంబడియె.

విరేచనద్రవ్యములు.

మూ. త్రివృతాం త్రిఫలాం దన్తీం నీలినీం సప్తలాం వచామ్,
కమ్పిల్లకం గవాక్షీం చ క్షీరిణీముదకీర్యకామ్. ౯

పీలూన్యారగ్వధం ద్రాక్షాం ద్రవన్తీం నిచులాని చ,
పక్వాశయగతేదోషే విరేకార్థం ప్రయోజయేత్. ౧౦

వ్యా. తెగడ, త్రిఫలములు (కరక, తాండ్ర, ఉసిరికలు), నేపాళపు గింజలు, పీలి, కానుగు, వస, కంపిల్లకము, వెఱ్ఱిపుచ్చ, చిన్నపాల, తీగెకానుగు, గోగు, రేల, ద్రాక్ష, ద్రవంతి (కొండాముదము), నీరుప్రబ్బలి ఇవియన్నియు విరేచనముల గల్గించు ద్రవ్యములు. ఈగణద్రవ్యములను పక్వాశయమున గల్గినరోగములయందు విరేచనమునకై యుపయోగించవలెను.

"త్రివృత్ సుఖవిరేచనానామ్" అనువాక్యముచే విరేచనద్రవ్యములలో తెగడ మిక్కిలి శ్రేష్ఠమని చెప్పియుండుటచే తొలుత తెగడ చెప్పబడెను.

## వస్తిద్రవ్యములు.

మూ. పాటలాం చాగ్నిమన్థం చ బిల్వం శ్యోనాకమేవ చ,
కాశ్మర్యం శాలపర్ణీం చ పృశ్నిపర్ణీం నిదిగ్ధికామ్. ౧౧
బలాం శ్వదంష్ట్రాం బృహతీం ఏరణ్డం సపునర్నవామ్,
యవాన్ కులుత్థాన్ కోలాని గుడూచీం మదనాని చ. ౧౨
పలాశం కత్తృణం చైవం స్నేహాంశ్చ లవణాని చ,
ఉదావర్తే విబన్ధేషు యుఞ్జ్యాదాస్థాపనేషు చ. ౧౩
అత ఏవౌషధగణాత్ సఙ్కల్ప్యమనువాసనమ్,
మారుతఘ్నమితి ప్రోక్తః సంగ్రహః పాఞ్చకర్మికః. ౧౪

వ్యా. పాదిరి, కూరనెల్లి, మారేడు, నక్కతోకపొన్న, పెగ్గుడు, మయ్యాకుపొన్న, కోలపొన్న, వాకుడు, చిట్టాముట్టి, పల్లేరు, ములక, ఆముదపుచెట్టు, గలిజేరు, యవలు, ఉలవలు, రేగుపండ్లు, తిప్పతీగె, మ్రంగకాయ, మోదుగు, కామంచికసవు, స్నేహద్రవ్యములు, లవణములు ఇవియన్నియు ఆస్థాపనవస్తికర్మ కుపయోగింపదగిన ద్రవ్యములు. అట్టి యాస్థాపనవస్తిని ఉదావర్తమునందును, మలమూత్రాదుల బంధమునందును ఉపయోగింపదగును. మరియు పైజెప్పిన వస్తిగణద్రవ్యములలో స్నేహద్రవ్యములను కల్పించి యనువాసనవస్తికర్మను వాతహరముగ నుపయోగింపందగును. ఇత్తెరంగున పంచకర్మలును సంగ్రహముగ జెప్పబడెను.

## పంచకర్మల జేయుపద్ధతి.

మూ. తాన్యుపస్థితదోషాణాం స్నేహస్వేదోపపాదనైః,
పఞ్చ కర్మాణి కుర్వీత మాత్రాకాలౌ విచారయన్. ౧౫

వ్యా. ఉపస్థితదోషము లనగ—శాఖలను (రక్తాదిధాతువులను త్వక్కును) వ్యాపించి యుండుదోషములు కోష్ఠమున లీనముగనుండక ప్రకుపితావస్థ నుండుదోషము లని యర్థము. తొలుత స్నేహస్వేదముల జేయుటచేత శాఖలయందుండు దోషములు కోష్ఠమున స్ఫుటముగ గోచరములగును. కావున స్నేహస్వేదములచేత తొలుత దోషముల నుపస్థితములుగ జేసికొని, పిదప నౌషధాది పరిమాణమును దేశకాల తత్వాదులను చక్కగ గమనించి పైజెప్పిన పంచకర్మలను యథాయోగముగ చేయ నగును.

కొన్ని సమయములయందు స్నేహస్వేదములు చేయకున్నను దోషములు ఉపస్థితములై లీనావస్థనొందక స్వయముగనే స్ఫుటముగ గానవచ్చును. అట్టియెడ స్నేహస్వేదములు అవసరము లేకయే పంచకర్మల జేయందగును. ఈవిషయము తంత్రాంతరమున నిట్లున్నది:—"కఫప్రధానా నుత్క్లిష్టాన్ దోషానామాశయస్థితాన్, బుద్ధ్వా జ్వరకరాన్ కాలే వమ్యానాం వమనైర్హరేత్" ప్రకుపితములై యామాశయమున నున్న దోషములను కఫప్రధానములుగ తెలిసికొని వమనమున కర్హులగువారికి వమనము జేయించవలెనని భావము. ఇచ్చట దోషములు ప్రకోపమునొంది కఫమునకు ప్రధానమైన యామాశయమున జేరి స్ఫుటముగ తెలిసి అయ్యది జ్వరకరమని గుర్తించి ప్రధానమైన కఫమునకు దగినవమనము జేయించవలెనని తెలిసెడి. స్నేహస్వేదములు లేకయె దోషపరిస్థితి స్ఫుటముగ తెలియునుకావున స్నేహస్వేదములు అవసరములేదు.

కర్మ యనగ:—దోషములను బైటవెడలించుశక్తి ప్రబలముగ కలిగిన చికిత్సావిశేషము. అయ్యది వమనవిరేచనాదులైదు. స్నేహస్వేదములు దోషశామకములగును గాని దోషముల వెడలించునవికావు. కాన నీరెండును కర్మలలో జేరవు. కొందరు స్నేహస్వేదముల గూడ జేర్చి సప్తకర్మలని నుడివినది యసంగతము. స్నేహస్వేదములు పంచకర్మల కంగములై శాఖాదులయందు వ్యాపించినదోషములను కోష్ఠమునజేర్చుటకై యుపయోగింప దగియుండును.

### మాత్రాకాలవిచారఫలము.

మూ. మాత్రాకాలాశ్రయా యుక్తిః సిద్ధిర్యుక్తౌ ప్రతిష్ఠితా,
తిష్ఠత్యుపరి యుక్తిజ్ఞో ద్రవ్యజ్ఞానవతాం సదా.    ౧౬

వ్యా. ఔషధయోజనము పరిమాణమును శీతోష్ణాదికాలభేదము నాశ్రయించి యుండును. అట్టి మాత్రాకాలానుసారముగ నుండుయోజనము (ఔషధప్రయోగము) నాధారముగజేసి కార్యసిద్ధి యుండును. (సిద్ధి యనః—చికిత్సాసాధ్యములగు రోగ

ములు నివర్తించుట సిద్ధి యనబడును.) మరియు ద్రవ్యపరిజ్ఞానము కలవైద్యులలో యోజనాక్రమమును జక్కగ దెలిసినవాడు వైద్యలోకమున నగ్రగణ్యుడై వెలయు చుండును.

పంచకర్మలయందు యవాగ్వాదిప్రయోగము.

మూ. అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి యవాగూర్వివిధౌషధాః,
వివిధానాం వికారాణాం తత్సాధ్యానాం నివృత్తయే. ౧౮

వ్యా. పిమ్మట నానావిధౌషధముల సిద్ధముచేయబడిన యవాగులు చెప్పబడును. అట్టి యవాగువులు వానిచే సాధింపదగిన నానావిధరోగములు నివర్తించుటకై తత్తదను సారముగ నీక్రింద వివరింపబడును.

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—వమనాద్యౌషధముల నుపయోగించునపుడు వమనాదులచే దోషములు పూర్తిగ వెడలకున్నపుడు జాఠరాగ్ని మందగించును. మరియు వమనాది ప్రయోగవ్యత్యయముచేత నొకప్పుడు శూల మున్నగు నుపద్రవ ములును సంభవించును. అట్టియెడ మందగించిన జాఠరానలము మెల్ల మెల్లగ వృద్ధినొం దుటకును, శూలాద్యుపద్రవములు నివర్తించుటకును తగినయవాగువు లీక్రింద వివరింప బడును. పేయాదులచే జాఠరాగ్ని వృద్ధినొందుక్రమ మీరీతి తంత్రాంతరమున జెప్ప బడియె:—"యథాణు రగ్నిస్తృణగోమయాద్యైః సన్ధుక్ష్యమాణో భవతి క్రమేణ, మహాన్ స్థిర స్సర్వపచ స్తథైవ శుద్ధస్య పేయాదిభి రన్తరగ్నిః" మిక్కిలి స్వల్పమైన యగ్ని గడ్డిపోచలు పిడకలు పొట్టు మున్నగువానిచే కొంచెము కొంచెముగ రగిలి నానాట వృద్ధినొంది యన్నింటిని దహింప సమర్థమగునట్లు, వమన విరేచనాదిప్రయో గములచే సన్నగిలిన కాయాగ్ని పేయాదుల నుపయోగించుటచేత క్రమముగ వృద్ధి నొంది గొప్పదియు స్థిరంబునై యన్నియాహారపదార్థములను పచనమునొందించుటకు సమర్థమగునని భావము.

మూ. పిప్పలీపిప్పలీమూలచవ్యచిత్రకనాగరైః,
యవాగూర్దీపనీయా స్యాత్ శూలఘ్నీ చోపసాధితా. ౧౯

వ్యా. పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి వీనిని జేర్చి సాధింప బడిన యవాగువు అగ్నిని దీపింపజేయును. శూలలను హరించును.

ఇచ్చట పిప్పలీమరీచాదిద్రవ్యములకు పరిమాణము చెప్పవలసియున్నను, అట్టిపరి మాణము దోషబలము అగ్నిబలము మున్నగువాని తారతమ్యమునుబట్టి నిర్ణయింపదగి

యయుండును కావున ప్రమాణమున కొకవ్యవస్థ నియతముగ నేర్పడియుండదు. దానంజేసి ప్రకృతమున ద్రవ్యపరిమాణము నిర్ణయించుటలేదు. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది:—“మాత్రాయా నాస్త్యవస్థానం దోష మగ్నిబలం వయః, వ్యాధిం ద్రవ్యం చ కోష్ఠం చ వీక్ష్య మాత్రాం ప్రయోజయేత్” (ఔషధాదులకు పరిమితి నిశ్చితముగ నేర్పడియుండదు. వాతాదిదోషములను, అగ్నిబలమును, బాల్యాదివయోభేదమును, వ్యాధిపరిస్థితిని, ద్రవ్యభేదమును, మృద్వాది కోష్ఠభేదములను చక్కగ పరికించి పరిమాణమును తత్తదనుగుణముగ కల్పింపనగును. కావున పరిమితినియతము నేర్పరుపవలనుపడదని భావము).

పైజెప్పినరీతిగ పరిమాణము నియతముగాకున్నను క్రిందవివరింపబడు పరిభాషాను సారముగ సామాన్యముగ నెరుంగునది. యవాగూసాధనద్రవ్యములు వీర్యప్రధానమైనది, యౌషధద్రవ్యము, రసప్రధానమైన యాహారద్రవ్యమున నీరెండు తెరంగులు. అందు ఔషధద్రవ్యము తీక్ష్ణవీర్యము, మధ్యవీర్యము, మృదువీర్యము నని వీర్యభేదముచే మూడు తెరంగులు. అందు శుంఠి పిప్పలి మున్నగునవి తీక్ష్ణవీర్యములు. బిల్వము, అగ్నిమంథము (కూరచెల్లి) మున్నగునవి మధ్యవీర్యములు. ఉసిరిక మున్నగునవి మృదువీర్యములు. అందు తీక్ష్ణౌషధములను కర్ష పరిమాణంబును, మధ్యవీర్యములను అర్ధపలపరిమాణంబును, మృదువీర్యముల పలపరిమాణంబును జేర్పనగును. ఈనియమము సామాన్యముగ జెప్పబడినది. ఈసామాన్యపరిభాషనే సాధారణముగ నుపయోగింపదగును.

అగ్నివేశులు:—“కర్షార్ధం వా కణాశుణ్ఠ్యోః కల్కద్రవ్యస్య వా పలమ్, వినీయ పాచయేద్యుక్త్యా వారిప్రస్థేన చాపరామ్” (శుంఠి పిప్పళ్లను అర్ధకర్షంబును, కల్కద్రవ్యము నొకపలమును, ఒకప్రస్థమాత్రజలమున జేర్చి పక్వముజేయవలెనని) పక్షాంతరమును జెప్పిరి. ఇచ్చట మధ్యవీర్యద్రవ్యములకు అర్ధపలప్రమాణము చెప్పియుండలేదు.

### పంచమూలికయవాగువు.

మూ. దధిత్థబిల్వచాఙ్గేరీతక్రదాడిమసాధితా,
పాచనీ గ్రాహిణీ పేయా సవాతే పాఞ్చమూలికా. ౧౫

వ్యా. వెలగ, మారేడు, పులిచింతాకు, మజ్జిగ, దానిమ్మ ఈయైదిటిని చేర్చి పక్వముజేయబడినది పంచమూలికయవాగు వనబడును. ఇయ్యది యాహారమును పచింపజేయును. మలాదు లధికముగ వెడలునప్పుడు వానిని ఆపుచేయును.

### శాలిపర్ణ్యాదియవాగువు.

మూ. శాలిపర్ణీబలాబిల్వైః పృశ్నిపర్ణ్యా చ సాధితా,
దాడిమామ్లా హితా పేయా పిత్తశ్లేష్మాతిసారిణామ్. ౨౦

వ్యా. మురియ్యాకుపొన్న, చిట్టాముట్టి, మారేడు, కోలపొన్న వీని నన్నింటిని జేర్చి పక్వముజేయబడిన యవాగువునందు పుల్లదానిమ్మపులుసును జేర్చి యుపయోగించిన పిత్తకఫములచే గల్గిన అతిసారములయందు మిక్కిలి హితకరమగును.

### హ్రీబేరాదియవాగువు.

మూ. పయస్యర్ధోదకే ఛాగే హ్రీబేరోత్పలనాగరైః,
పేయా రక్తాతిసారఘ్నీ పృశ్నిపర్ణ్యా చ సాధితా. ౨౧

వ్యా. మేకపాలుకు సగముపాలు నీళ్లు కలిపి అందు కురువేరును, కలువగడ్డలను, తుంగగడ్డలను, కోలపొన్నను కలిపి పక్వముచేయబడిన యవాగువునందు యథోచితముగ పుల్లదానిమ్మపులుపు చేర్చి త్రాగినచో రక్తాతిసారమును హరించును.

"రక్తాతిసారేఽజాక్షీరక్రోహ్రీఘనజలోత్పలైః" అను జతూకర్ణతంత్రమున జెప్పిన వాక్యము ననుసరించి యిచ్చట నాగరశబ్దమునకు తుంగగడ్డలని యర్థము చెప్పబడినది.

### ఆమాతిసార-మూత్రకృచ్ఛ్రములకు యవాగువులు.

మూ. దద్యాత్సాతివిషాం పేయాం సామే సామ్లాం సనాగరామ్,
శ్వదంష్ట్రాకణ్టకారీభ్యాం మూత్రకృచ్ఛ్రే సఫాణితామ్. ౨౨

వ్యా. అతివస, శుంఠి ఈరెంటిని చేర్చి కాచబడిన యవాగువునందు దానిమ్మపులుసును యథోచితముగ జేర్చి యామాతిసారమున త్రాగనగును. మరియు పల్లేరును వాకుడును చేర్చి పక్వముచేయబడిన యవాగువునందు చక్కెరపాకము (జీరా)ను కలిపి మూత్రకృచ్ఛ్రమునందు త్రాగనగును.

### విడంగాది యవాగువు.

మూ. విడఙ్గపిప్పలీమూలశిగ్రుభిర్మరిచేన చ,
తక్రసిద్ధా యవాగూస్స్యాత్ క్రిమిఘ్నీ ససువర్చికా. ౨౩

వ్యా. వాయువిడంగములు, మోడి, మునగపట్ట, మిరియాలు వీనిని మజ్జిగలో కలిపి పక్వముచేయబడిన యవాగువునందు మితముగ సర్జక్షారమును కలిపి త్రాగిన క్రిములు నశించును.

### విపాసా - విషహరయవాగువులు.

మూ. మృద్వీకా శారిబా లాజా పిప్పలీ మధునాగరైః,
పిపాసాఘ్నీ విషఘ్నీ చ సోమరాజీ విపాచితా. ౨౮

వ్యా. ద్రాక్షపండు, సుగంధపాలవేరు, వరిపేలాలు, పిప్పళ్లు, శుంఠి వీనిని జేర్చి పక్వముజేయబడిన యవాగువునందు తేనె కలిపి త్రాగిన దప్పి నణచును. బావంచివిత్తులను జేర్చి కాచబడిన యవాగువు విషమును హరించును.

### బృంహణకర్షణయవాగువులు.

మూ. సిద్ధా వరాహనిర్యూహే యవాగూర్బృంహణీ మతా,
గవేధుకానాం భృష్టానాం కర్షణీయా సమాక్షికా. ౨౯

వ్యా. అడవిపందిమాంసరసమును జేర్చి పక్వముజేయబడిన యవాగువు శరీరపుష్టిని కల్గించును. అడవిగోధుమలబియ్యమును వేయించి యవాగును పక్వముజేసి అందు తేనెను కలిపి త్రాగిన స్థూలముగనుండుశరీరమును కృశింపజేయును.

### స్నేహనయవాగువు.

మూ. సర్పిష్మతీ బహుతిలా స్నేహనీ లవణాన్వితా,
కుశామలకనిర్యూహా శ్యామాకానాం విరూక్షణీ. ౩౦

వ్యా. యవాగువునందు నేతిని నువ్వులను ఉప్పును జేర్చి త్రాగిన శరీరమున జిడ్డు కల్గును. కుశదర్భలవేళ్లను, ఉసిరికకాయలను జేర్చి కషాయము కాచి, అందు చామలను గూర్చి పక్వముజేయబడిన యవాగువు శరీరమును రూక్షగ (జిడ్డుగ) జేయును.

### దశమూలాదియవాగువు.

మూ. దశమూలీశృతా కాసహిక్కాశ్వాసకఫాపహా,
యమకే మదిరాసిద్ధా పక్వాశయరుజాపహా. ౩౧

వ్యా. దశమూలములను జేర్చి పక్వముచేయబడిన యవాగువు ఎక్కిళ్లను శ్వాసమును కఫమును హరించును. మరియు యమకస్నేహమున (నూనె నెయ్యి) మద్యమును జేర్చి పక్వముజేయబడిన యవాగువు పక్వాశయమున గల్గినబాధల నివర్తింపజేయును.

"పర్ణ్యౌ బృహత్యౌ గోకణ్టో బిల్వోఽగ్నిమన్థగోరళః, పాటలాకాశ్మరీ చేతి దశమూల మిహోచ్యతే." అని దశమూలములు చెప్పబడినవి. (కోలపొన్న, నేలపొన్న, చిన్నములక, పెద్దములక, పల్లేరు, మారేడువేళ్లు, కూరసెల్లి, దుండిలపువేళ్లు, పాదిరివేళ్లు, అడవిగుమ్మడివేళ్లు ఇవి దశమూలములు.)

మూ. శాకై ర్మాంసై స్తిలై ర్మాషైః సిద్ధా వర్చో నిరస్యతి,
జమ్బ్వామ్రాస్థిదధిత్థామ్లబిల్వైస్సాఙ్గ్రాహికీ మతా. ౨౮

వ్యా. శాకవర్గములోని యుక్తమయినవానిని, మాంసమును, నువ్వులను, మినుములను జేర్చి పక్వము జేసిన యవాగువుల నుపయోగించిన మలమును ధారాళముగ వెడలించును. మరియు నేరేడు, మామిడి వీనివిత్తులను, వెలగపులుపు వీనిని బిల్వఫలమును జేర్చి పక్వము జేయబడిన యవాగువు నుపయోగించిన మలమును బంధించును.

భేదినీ-వాతానులోమనీయవాగువులు.

మూ. క్షారచిత్రకహింగ్వమ్లవేతసై ర్భేదినీ మతా,
అభయాపిప్పలీమూలవిశ్వై ర్వాతానులోమనీ. ౨౯

వ్యా. యవక్షారము, చిత్రమూలము, ఇంగువ, అమ్లవేతసము ఈనాలిగింటిని గూర్చి పక్వముచేయబడిన యవాగువు కఠినముగనుండుమలమును విడదీయును. మఱియు కరక్కాయలు, పిప్పలీమూలము, (మోడి) శుంఠి ఈమూటిని జేర్చి సిద్ధముచేయబడిన యవాగువు ప్రతిలోమముగ నుండువాతాదులను అనులోమముగ జేయును.

మూ. తక్రసిద్ధా యవాగూస్స్యాత్ ఘృతవ్యాపత్తినాశినీ,
తైలవ్యాపది శస్తా స్యాత్ తక్రపిణ్యాకసాధితా. ౩౦

వ్యా. మజ్జిగనుకూర్చి పక్వముచేయబడిన యవాగువు నేతివలన గలిగినవ్యాపత్తును హరించును. మజ్జిగను, నువ్వులగానుగపిండికూర్చి సిద్ధముచేయబడిన యవాగువు తైలపానముచే కలిగినవ్యాపత్తును హరించును.

విషమజ్వరహారకంఠ్యయవాగువు.

మూ. గవ్యమాంసరసైస్సామ్లావిషమజ్వరనాశినీ,
కంఠ్యా యవానాం యమకే పిప్పల్యామలకైశ్శృతా. ౩౧

వ్యా. ఆవుపాలును, మాంసరసమును, దానిమ్మపులుపును కూర్చి పక్వముచేయబడిన యవాగువు విషమజ్వరములను హరించును. మఱియు యవలు, పిప్పళ్లు, ఉసిరికకాయలు ఈమూటిని యమకస్నేహమున (నెయ్యి, నూనె రెండు చేరిన యమకస్నేహము) చేర్చి పక్వముచేయబడిన యవాగువు కంఠసంబంధములగు వ్యాధులయందు హితకరమగును.

రేతోమార్గరోగహర, శుక్రవృద్ధికరయవాగువులు.

మూ. తామ్రచూడరసే సిద్ధా రేతోమార్గరుజాపహా,
సమాషవిదళా వృష్యా ఘృతక్షీరోపసాధితా. ౩౨

వ్యా. కోడిమాంసపురసముతో చేయబడినయవాగువు శుక్రము వెడలుమార్గమున పుట్టువ్యాధులను హరించును. ఉద్దిపప్పును, నెయ్యిని, పాలను జేర్చి కాచబడినయవాగువు శుక్రమును వృద్ధిచేయును.

మదహర-క్షుధాహరయవాగువులు.

మూ. ఉపోదికాదధిభ్యాం తు సిద్ధా మదవినాశినీ,
క్షుధం హన్యాదపామార్గక్షీరగోధారసైశ్శృతా. ౩౩

వ్యా. బచ్చలియాకు, పెరుగు ఈరెంటెనిగూర్చి సిద్ధముచేయబడిన యవాగువు విషము మద్యము మున్నగువానిచే గలిగినతిక్కను హరించును. మఱియు ఉత్తరేణి బియ్యము, ఆవుపాలు, ఉడుముమాంసము ఈమూటెని జేర్చి కాచబడినయవాగువు ఆకలిని పోగొట్టును.

ప్రకరణోపసంహారము.

మూ. అష్టావింశతిరిత్యేతా యవాగ్వః పరికీర్తితాః,
పంచకర్మాణి చాశ్రిత్య ప్రోక్తో భైషజ్యసంగ్రహః. ౩౪
పూర్వమూలఫలజ్ఞానహేతోరుక్తం యదౌషధం,
పంచకర్మాశ్రయజ్ఞానహేతోస్తత్కీర్తితం పునః. ౩౫

వ్యా. ఇత్తెరంగున ఇరువదిఎనిమిదివిధములయిన యవాగువులును, పంచకర్మముల నాశ్రయించినఔషధములును సంగ్రహముగ చెప్పబడినది. మరియు పూర్వాధ్యాయమున మూలములు ఫలములు తెలియుటకై నిర్దేశింపబడినద్రవ్యములు ఈయధ్యాయమున పంచకర్మాశ్రయజ్ఞానమునకై మరల వివరింపబడినవి.

మూ. స్మృతిమాన్ హేతుయుక్తిజ్ఞో జితాత్మా ప్రతిపత్తిమాన్,
భిషగౌషధసంయోగైశ్చికిత్సాం కర్తుమర్హతి. ౩౬

వ్యా. జ్ఞానవంతుడును, హేతువ్యాధులకు దగినప్రతిక్రియల దెలిసినవాడును, జితేంద్రియుండును, శీఘ్రకారియు నగువైద్యవరుడు పైజెప్పినపంచకర్మలకు జేరినయౌషధములను యుక్తియుక్తముగఁ గల్పించి చికిత్స జేయనగును.

ఇత్యగ్నివేశకృతే తంత్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
అపామార్గతండులీయో నామ ద్వితీయోఽధ్యాయః.

వ్యా. అగ్నివేశునిచే విరచితంబును, చరకమహర్షిచే సంస్కరింపబడినదియుం నయిన ఆయుర్వేదసంహితయందు సూత్రస్థానమున అపామార్గతండులీయమనునది రెండవఅధ్యాయము సమాప్తము.

---

## తృ తీ యా ధ్యా య ము.

అవ:—శౌషధము అంతఃపరిమార్జనమనియుం, బహిఃపరిమార్జనమనియుం రెండు విధములు. అందు శరీరకోష్ఠమున శుభ్రపరచునది అంతఃపరిమార్జనము. శరీరముపైభాగమున చేయబడుప్రలేపాదులు బహిఃపరిమార్జనము. పైజెప్పిన అపామార్గతండులీయమను ద్వితీయాధ్యాయమున పంచకర్మల కుపయుక్తమగు యవాగూరూపమయిన యంతఃపరిమార్జనము చెప్పబడినది. రెండవదియైన బహిఃపరిమార్జనము ఈక్రిందియారగ్వధీయాధ్యాయమున చెప్పబడును:—

మూ. అథాత ఆరగ్వధీయ మధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. అపామార్గతండులీయాధ్యాయము జెప్పినపిదప ఆరగ్వధమును అధికరించి చెప్పబడు నారగ్వధీయాధ్యాయమును త్రికాలజ్ఞానసంపన్నుడైన యాత్రేయమహర్షి యుపదేశించినదానికి న్యూనాతిరేకము గాకయుండునట్లు ఈక్రింద వివరించెదనని భావము.

### కుష్ఠహారలేపములు.

మూ. ఆరగ్వధసై్నడగజః కరంజో
వాసా గుడూచీ మదనం హరిద్రే,
శ్ర్యాహ్వా స్సురాహ్వాః ఖదిరో ధవశ్చ
నింబో విడంగం కరవీరకత్వక్. 3

గ్రంథిశ్చ భౌర్జో లశునం శిరీషః
సలోమశో గుగ్గులుకృష్ణగంధే,

ఫణిజ్ఝకో వత్సకస ప్తపర్ణ్యౌ
పీలూని కుష్ఠం సుమనః ప్రవాళాః. ౪
వచా హరేణుస్త్రివృతా నికుంభో
భల్లాతకం గైరికమంజనం చ,
మనశ్శిలాలే గృహధూమ ఏలా
కాసీసలోధ్రార్జునము స్తసర్జాః. ౫
ఇత్యర్ధరూపై ర్విహితా షడేతే
గోపి త్తపీతాః పునరేవ పిష్టాః,
సిద్ధాః పరం సర్షపతైలయుక్తాః
చూర్ణప్రదేహా భిషజా ప్రయోజ్యాః. ౬
కుష్ఠాని కృచ్ఛ్రాణి నవం కిలాసం
సురేశలి ప్తం కిటిభం సదద్రు,
భగందరార్శాంస్యపచీం సపామాం
హన్యుః ప్రయుక్తా స్త్వచిరాన్నరాణాం. ౭

వ్యా. పెద్దరేల, తగిరిశ, కానుగు, అడ్డసరము, తిప్పతీగె, మ్రంగకాయ, పసుపు, మ్రానిపసుపు (ఇది యొకగణము.) అందుగుచెట్టు, దేవదారు, చంద్ర, ఉమ్మెత్త, వేప, వాయువిడంగములు, గన్నేరు (ఇది రెండవగణము.) భుజపత్రియొక్కగణుపులు, ఉల్లిగడ్డ, దిరిసనపుగింజలు, జటామాంసి, గుగ్గిలము, మునగ (ఇది మూడవగణము.) కృష్ణతులసీ, రెప్పాల, ఏడాకులపొన్న, వరగోగు, చెంగల్వకోష్టు, జాజిచిగుళ్లు (ఇది నాల్గవగణము.) వస, రేణుకలు, తెగడ, నేపాళపుగింజలు, జీడిగింజలు, గైరికము (కావిరాయి) సౌవీరాంజనము (సుర్మారాయి) (ఇది యైదవగణము.) మణిశిల, హరిదళము, కరిదూపము, ఏలకులు, అన్నభేది, లొద్దుగుపట్ట, మద్దిపట్ట, తుంగగడ్డలు, సర్జరసము (ఇది యారవగణము.) పైజెప్పిన ఆరుగణములలో నొక్కొకగణద్రవ్యములను గోపిత్తము (గోరోచనము)నందు పచ్చనగువరకు భావనజేసి నూరి పొడిజేసి ఆవనూనెలో కలిపి శరీరముపై పూతపూసినచో మిక్కిలి క్రూరములయిన కుష్ఠములును, క్రొత్తగకలిగినకిలాసము (సిబ్బెము)ను, ఇంద్రలుప్తము, (తలవెంద్రుకలూడువ్యాధివిశేషము)ను, దద్రురోగమును, కిటిభమను చర్మవ్యాధిని, భగందరమును, మూలవ్యాధిని, గండమాలలను, అపచిని, తీటను హరించును.

ఇచ్చట పైజెప్పబడినశ్లోకములలో నొక్కొక్కయర్థశ్లోకమున జెప్పబడినద్రవ్యములు నొక్కొక్కగణముగ విభజించినచో నారుగణము లగును. ఆయారుయోగములలో నెద్దానినైనను పైజెప్పినప్రకారము చూర్ణముజేసి యావనూనెలో గలిపి లేపనముజేసినచో పైజెప్పినరీతిగ కుష్ఠాదివ్యాధులు నివర్తించునని భావము.

ఈతంత్రమునందు చికిత్సాస్థానమున కుష్ఠచికిత్సితము ప్రత్యేకముగ చెప్పబడును. ఆయధ్యాయముననే ఆరగ్వధాదులను చెప్పుట యుంచితమైనను, కుష్ఠరోగము మహారోగమైనందున ఇచ్చట సంగ్రహముగ దానిచికిత్సితము చెప్పబడినది. కాన పునరుక్తము కానేరదు. ఈయభిప్రాయముననే గదాధరభట్టాచార్యులు "అవ్యవహితో వ్యార్థః పునః పునః అభిధీయతే" అని చెప్పిరి. మరియు "ఖదిరః కుష్ఠహరాణాం" అనువచనముచే ఖదిరము (చండ్ర!) కుష్ఠహరద్రవ్యములలో ప్రధానమైయుండినను మొట్టమొదట దానిని విడిచి ఆరగ్వధమును చెప్పుటచేత కుష్ఠరోగమునందు బహిఃపరిమార్జనభేషజములలో ఖదిరమునకంటె నారగ్వధమే ప్రధానమని చరకాచార్యులయభిమతముగా నూహింపదగియున్నది.

### కుష్ఠహరోద్వర్తనములు, లేపములు.

మూ. కుష్ఠం హరిద్రే సురసం పటోలం
నింబాశ్వగంధే సురదారుశిగ్రు,
ససర్షపం తుంబురుధాన్యవన్యం
చండాం చ చూర్ణాని సమాని కుర్యాత్. ౭
తైస్తక్రపిష్టైః ప్రథమం శరీరం
తైలాక్తముద్వర్తయితుం యతేత,
తేనాస్య కండూః పిటకాస్సకోఠాః
కుష్ఠాని శోఫాశ్చ శమం వ్రజంతి. ౮

వ్యా. చెంగల్వకోష్టు, పసుపు, మ్రానిపసుపు, చేదుపొట్ల, తులసి, వేము, పెన్నేరుగెడ్డ, దేవదారు, మునగ, ఆవాలు, తుంబురు, దనియాలు, అడవితుంగగడ్డలు, గన్నేరు వీనినన్నిటిని సమభాగములు చేర్చి మెత్తగ నూరి పులిమజ్జిగలో కలిపి ఉంచుకొని ముందు ఆవనూనె శరీరమునకు పూసుకొని పైచెప్పిన పిష్టముచే నలుగుపెట్టుకొని స్నానముచేసినచో శరీరమునందలి దురద, బొబ్బలు, పొడలు, వాపు ఇవియన్నియు శాంతి నొందును.

మూ. కుష్ఠామృతాసంగకటంకటేరీ
కాసీసకంపిల్లకము_స్తలో_ధ్రాః,
సౌగంధికం సర్జరసో విడంగం
మనశ్శిలాలే కరవీరకత్వక్. ౧౦

తైలా_క్తగాత్రస్య కృతాని చూర్ణా
న్యేతాని దద్యాదవచూర్ణనార్థం
దద్రుస్సకండుః కిటిభాని పామా
విచర్చికా చైవ తథైతి శాంతిం. ౧౧

వ్యా. చెంగల్వకోష్టు, తిప్పతీగ, మైలుతు_త్తము, మ్రానిపసుపు, అన్నభేది, కంపిల్లకము, తుంగగడ్డలు, లొద్దుగుపట్ట, కామంచిగడ్డి, లేక (గంధకము) సర్జరసము, (మడ్డిపాలు) వాయువిడంగములు, మణిశిల, హారిదళము, తెల్లగన్నేరుపట్ట వీని నన్నిటిని సమభాగములు చేర్చి నీడ నెండించి, చూర్ణము చేసి యుంచుకొనునది. పైజెప్పిరీతిగ ఆవనూనెను శరీరమునకు పూసుకొని పైజెప్పినచూర్ణమును చల్లి మర్దన జేసినచో కుష్ఠ వ్యాధులు, దురద, కిటిమకుష్ఠము, ఏనుగగజ్జి, విచర్చిక కాలివ్రేళ్లలో కలుగుపుండ్లు) ఇవియన్నియు నివ_ర్తించును.

మూ. మనశ్శిలాలే మరిచాని తైల
మార్కం పయః కుష్ఠహరః ప్రదేహః,
తుత్థం విడంగం మరిచాని కుష్ఠం
లోధ్రం చ తద్వత్స మనశ్శిలం స్యాత్. ౧౨

రసాంజనం సప్రపున్నాటబీజం
యు_క్తః కపిత్థస్య రసేన లేపః,
కరంజబీజైడగజం సకుష్ఠం
గోమూత్రపిష్టశ్చ పరః ప్రదేహః. ౧౩

వ్యా. మణిశిల, హారిదళము, మిరియాలు వీనిని చూర్ణముచేసి ఆవనూనె జిల్లేడు పాలుబోసి మర్దనజేసి పూసిన కుష్ఠములు మున్నగునవి హరించును. వాయువిడంగములు, మిరియాలు, చెంగల్వకోష్టు, లొద్దుగుచెక్క, మణిశిల వీనిని పైచెప్పినఆవనూనె జిల్లేడు పాలలో నూరి పూసిన కుష్ఠములు హరించును.

రసాంజనము (సుర్మారాయి) తగిరిసగింజలు ఈరెంటిని వెలగపట్టరసములో నూరి లేపనముచేసిన కుష్ఠము హరించును. కానుగుగింజలు, తగిరసగింజలు, చెంగల్వకోష్టు వీనిని గోమూత్రములో నూరి పూసిన కుష్ఠములు మానును.

మూ. ఉభే హరిద్రే కుటజస్య బీజం
కరంజబీజం సుమనః ప్రవాళాన్,
త్వచం సముత్థాం హయమారకస్య
లేపం తిలక్షారయుతం విదధ్యాత్. ౧౪
మనశ్శిలా త్వక్కుటజాత్సకుష్ఠాత్
స్సలోమజస్సైడగజః కరంజః,
గ్రంథిశ్చ భౌర్జః కరవీరమూలం
చూర్ణాని సాధ్యాని తుషోదకేన. ౧౫
పలాశనిర్దాహరసేన చాపి
కర్షోద్ధృతాన్యాఢకసమ్మితేన,
దర్వీప్రలేపం ప్రవదంతి లేప
మేతత్పరం కుష్ఠనిషూదనాయ. ౧౬

వ్యా. పసుపు, మ్రానిపసుపు, కొడిసెపాలవిత్తులు, కానుకగింజలు, జాజిచిగుళ్లు, గన్నేరుపట్ట, గన్నేరుచెక్క వీనిని చూర్ణముచేసి నువ్వులచెట్లను క్షారముచేసి యాక్షారమున కలిపి పూసినచో కుష్ఠములు హరించును.

మణిశిల, కొడిసెపట్ట, చెంగల్వకోష్టు, జటామాంసి, తగిరిసగింజలు, కానుగుగింజలు, భుజపత్రిగణుపులు, గన్నేరువేరు వీనిని ఒక్కొకకర్షమువంతున చేర్చి చూర్ణముచేసి ఆచూర్ణమును, తుషోదకమునందును, పలాశనిర్దాహరసమునందును ఆఢకపరిమితమున కలిపి ఆద్రవమంతయు నిగురునట్లు కాచి గరిటెకు అంటుకొనుపక్వము చూచి దించి లేపనముచేసినచో కుష్ఠములు హరించును.

తిలక్షారమనగా:—నువ్వులచెట్లను సమూలముగ తెచ్చి కాల్చి బూడిదచేసి దానిని నీళ్లలో కలిపి పక్వముచేసినచో నీళ్లంతయు చుండి బూడిదమాత్రము నిలచును అయ్యది తిలక్షారము.

తుషోదకమన:—యవలను పొట్టుతోగూడ నలియగొట్టి నీరు పోసి యుడికించి పులియబెట్టినగంజి తుషోదక మనబడును.

పలాశనిర్దాహమన:—మోదుగచెట్టుకు అడుగుననుండు వేరు తెగగొట్టి దాని క్రింద గుంతచేసి అందొకకుండ నునిచి, చెట్టును తగులబెట్టినచో ఆవేరునుండి రసము క్రిందికుండలోనికి దిగును. అయ్యది పలాశనిర్దాహరస మనబడును.

కుష్ఠములకు చతురంగుళాదిలేపము.

మూ. పర్ణాని పిష్ట్వా చతురంగుళస్య
తక్రేణ పర్ణాన్యథ కాకమాచ్యాః,
తైలాక్తగాత్రస్య నరస్య కుష్ఠా
న్యుద్వర్తయేత్ అశ్వహనచ్ఛదైశ్చ. ౧౭

వ్యా. రేలాకులు, కాచిఆకులు, గన్నేరుపట్ట ఈమూటిని పులిమజ్జిగ పోసి నూరి యొడలిపై ఆవనూనె పూసుకొని పట్టించినయెడల కుష్ఠువులు హరించును.

వాతములకు కోలాదిలేపము.

మూ. కోలం కులుత్థాః సురదారు రాస్నా
మాషాతసీతైలఫలాని కుష్ఠం,
వచా శతాహ్వా యవచూర్ణ మమ్ల
ముష్ణాని వాతామయినా ప్రదేహాః. ౧౮

వ్యా. రేగుపండువిత్తులు, దేవదారు, ఉలవలు, సన్నరాష్ట్రము, ఉద్దులు, అవిసె విత్తులు, నువ్వులు, చిట్టాముదపుగింజలు, చెంగల్వకోష్టు, వస, సదాపవిత్తులు, యవలపిండి వీనినన్నిటిని చూర్ణముచేసి పులిమజ్జిగ మొదలగువానిలో పులియబెట్టి పట్టువేసిన వాతరోగములు హరించును.

వాతములకు మాంసాదిలేపములు.

మూ. ఆనూపమత్స్యామిష వేశవారైః
ఉష్ణైః ప్రదేహాః పవనాపహాస్స్యుత్,
స్నేహైశ్చతుర్భి ర్దశమూలమిశ్రైః
గంధౌషధైశ్చానిలహాః ప్రదేహాః. ౧౯

వ్యా. అనూపదేశమున సంచరించుమృగములయొక్క మాంసము, మత్స్యముల మాంసము ఈరెంటిని చక్కగ దంచి వేసవారముచేర్చి వేడిగనుండునపుడు లేపనము చేసిన వాతరోగములను హరించును. దశమూలములకల్కమును, నాల్గుచమురులలో

కలిపి, సుగంధద్రవ్యములగు అగరు మొదలగువానినికూడ కలిపి ముద్దయగునట్లు కాచి లేపనముచేసిన వాతరోగములు హరించును. వేసవారలక్షణము. తంత్రాంతరమున నిట్లు చెప్పబడినది. "నిరస్థి పిశితం పిష్టం స్విన్నం గుడఘృతాన్వితం, కృష్ణామరీచసంయుక్తం వేసవార ఇతి స్మృతః" ఎముకలులేనిమాంసమును బాగుగా దంచి అందు బెల్లము, నెయ్యి, మిరియాలు, పిప్పళ్లు వీనిని కలిపిన వేసవార మనబడును.

మూ. తక్రేణ యుక్తం యవచూర్ణముష్ణం
సక్షారమార్తిం జఠరే నిహన్యాత్,
కుష్ఠం శతాహ్వాం సవచాం యవానాం
చూర్ణం సతైలామ్లముశంతి వాతే. ౨౦

వ్యా. యవలపిండిని, యవక్షారమును మజ్జిగలో కలిపి కాచి, పట్టువేసిన కడుపులోనిబాధలు నివర్తించును. చెంగల్వకోష్టు, సదాపవిత్తులు, వస, యవలపిండి వీనిని చూర్ణముచేసి అందు తైలమును, పులుపును కలిపి పట్టువేసిన వాతరోగములు హరించును.

వాతరక్తమున శతాహ్వాదిలేపము.

మూ. ఉభే శతాహ్వే మధుకం మధూకం
బలాం పియాలం చ కశేరుకం చ,
ఘృతం విదారీం చ సితోపలాం చ
కుర్యాత్ప్రదేహం పవనే సరక్తే. ౨౧

వ్యా. పెద్దసదాప, చిన్నసదాప, అతిమధురము, ఇప్పపూలు, చిట్టాముట్టి, మొరటిగింజలు, తుంగగడ్డలు, నేలగుమ్ముడుగడ్డ, కల్కండ వీనినన్నిటిని చూర్ణముజేసి నేతితో కలిపి పూసిన వాతరక్తవ్యాధి నివర్తించును.

రక్తవాతాదులకు రాస్నాదిలేపములు.

మూ. రాస్నా గుడూచీ మధుకం బలే ద్వే
సజీవకం సర్షభకం పయశ్చ,
ఘృతం చ సిద్ధం మధుశేషయుక్తం
రక్తానిలార్తిం ప్రణుదేత్ప్రదేహః. ౨౨
వాతే సరక్తే సఘృతః ప్రదేహో
గోధూమచూర్ణం ఛగలీపయశ్చ,

నతోత్పలం చందనకుష్ఠయుక్తం
శిరోరుజాయాం సఘృతః ప్రదేహః. ౨౩

వ్యా. సన్నరాష్ట్రము, తిప్పతీగె, ఇప్పపూలు, చిట్టాముట్టి, పేరాముట్టి, జీవకము, ఋషభకము, మైనము వీనినన్నింటిని నేతితో కలిపి కాచి పూసిన రక్తవాతము హరించును. మరియు గోధుమపిండి, మేకపాలు, నెయ్యి వీని నొకటిగ కలిపి కాచి పట్టువేసినచో వాతరక్తము నివర్తించును. మరియు గ్రంథితగరము, నల్లకలువగడ్డ, చందనము, చెంగల్వకోష్టు వీనిని చూర్ణముజేసి నేతితో కలిపి పట్టువేసిన తలనొప్పి మానును.

తలనొప్పికి ప్రపౌండరీకాదిలేపము.

మూ. ప్రపౌణ్డరీకం సురదారు కుష్ఠం
యష్ట్యాహ్వ మేలా కమలోత్పలే చ,
శిరోరుజాయాం సఘృతః ప్రదేహో
లోహైరకాపద్మకచోరకైశ్చ. ౨౪

వ్యా. ప్రపౌండరీకము (తామరదుంప), దేవదారు, చెంగల్వకోష్టు, అతిమధురము, ఏలకులు, తామరపువ్వు, కలువపువ్వులు, అగరుచెక్క, భద్రముస్తలు, పద్మకము, కచోరములు వీనినన్నింటిని చూర్ణముజేసి నేతితో కలిపి లేపనముజేసినచో తలనొప్పి నిమ్మళించును.

పార్శ్వశూలకు రాస్నాదిలేపము.

మూ. రాస్నా హరిద్రే నలదం శతాహ్వే
ద్వే దేవదారూణి సితోపలాం చ,
జీవన్తిమూలం సఘృతం సతైలం
ఆలేపనం పార్శ్వరుజాసు కోష్ణమ్. ౨౫

వ్యా. సన్నరాష్ట్రము, పసుపు, మ్రానిపసుపు, జటామాంసి, పిన్నసదాప, పెద్ద సదాప, దేవదారు, కలకండ, మనుబాలవేరు వీనిని చూర్ణముజేసి యందు నెయ్యి నూనె కలిపి కాచి కొంచెము వేడిగనుండునపుడు పట్టువేసిన పార్శ్వశూలలు మానును.

నిర్వాపణలేపములు.

మూ. శైవాలపద్మోత్పలవేత్రతుఙ్గం
ప్రపౌణ్డరీకాన్యమృణాళలోధ్రమ్,

ప్రియఙ్గుకాలేయకచన్దనాని
నిర్వాపణస్స్యాత్సఘృతః ప్రదేహః. ౨౬

సితా లతా వేతసపద్మకాని
యష్ట్యాహ్వ మైన్ద్రీ నలినాని దూర్వా,
యవా సమూలం కుశకాశయోశ్చ
నిర్వాపణః స్యా జ్జలమేరకా చ. ౨౭

వ్యా. సీటిపాచి, తామరపువ్వు, కలువపువ్వు, నీరుప్రబ్బలి, సురపొన్న, తామర దుంపలు, వట్టివేరు, లొద్దుగుపట్ట, ప్రేంకణపుచెక్క, మ్రానిపసుపు, గంధపుచెక్క, వీనినన్నింటిని చూర్ణముజేసి నేతిలో కలిపి పట్టువేసిన చర్మముపై గల్గుమంటను మాన్పును.

మరియు తెల్లనేలగుమ్మడు, మంజిష్ఠి, ప్రబ్బలి, తామరదుంప, అతిమధురము, పెద్దపాపరకాయ, తామరపువ్వు, గరిక, దూలగొండివిత్తులు, దర్భవేరు, రెల్లువేరు, కురువేరు, భద్రముస్తలు వీనినన్నింటిని చూర్ణముజేసి నూరి పట్టువేసిన చర్మముపై గల్గుమంట నివర్తించును.

శైలేయాదిప్రలేపము.

మూ. శైలేయ మేలాఽగురుణీసకుష్ఠే
చణ్డా నతం త్వక్సురదారు రాస్నా,
శీతం నిహన్యాదచిరాత్ప్రదేహః
విషం శిరీషస్తు ససిన్ధువారః. ౨౮

శిరీషలామజ్జకహేమలోధ్రైః
త్వగ్దోషసంస్వేదహరః ప్రఘర్షః,
పత్రామ్బులోధ్రా ఽభయచన్దనాని
శరీరదౌర్గన్ధ్యహరః ప్రదేహః. ౨౯

వ్యా. రాతిపువ్వు, ఏలకులు, అగరు, చెంగల్వకోష్టు, తెల్లఉప్పిపట్ట, గ్రంథి తగరము, లవంగపుపట్ట, దేవదారు, సన్నరాష్ట్రము వీనిని నూరి పట్టువేసిన శరీరముపై గ్రమ్మినచలువ తత్కాలముననే హరించును. మరియు దిరిసెనపువిత్తులను వావిలిని నూరి పట్టువేసిన విషమును హరించును.

మరియు దిరిసెనపుగింజలు, వట్టివేరు, నాగకేసరములు, లొద్దుగుచెక్క వీనిని యొండించి సన్ననిచూర్ణముగ జేసి చర్మముపై రుద్దిన చర్మరోగములు హరించును. చర్మముపై నధికముగ నుండుచెమటను హరించును. మరియు లవంగపుపత్రి, కురువేరు, లొద్దుగపట్ట, వట్టివేరు, చందనము వీనినన్నింటిని నూరి పట్టువేసిన శరీరమున గల్గు దుర్గంధమును హరించును.

అధ్యాయసంగ్రహము.

తత్ర శ్లోకః—

మూ. ఇహాత్రిజస్సిద్ధతమానువాచ
ద్వాత్రింశతం సిద్ధమహర్షిపూజ్యః,
చూర్ణప్రదేహాన్ వివిధామయఘ్నాన్
ఆరగ్వధీయే జగతో హితార్థమ్. 30

వ్యా. సిద్ధులచేతను మహర్షులచేతను పూజితుడగు నాత్రేయమహర్షి నానావిధ రోగముల నివర్తింపదగిన ముప్పదిరెండువిధములైన చూర్ణములను, పట్టులను లోకమునకు హితమును గోరి సిద్ధులలో శ్రేష్ఠులగుబుషుల నుద్దేశించి యీయారగ్వధీయాధ్యాయమున వివరించెను.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
ఆరగ్వధీయో నామ తృతీయోఽధ్యాయః.

వ్యా. అగ్నివేశకృతంబును చరకమహర్షిచే సంస్కరింపబడినదియు నగుచరకసంహితయందు సూత్రస్థానమున ఆరగ్వధీయ మనునది మూడవయధ్యాయము సమాప్తము.

---

## చతుర్థాధ్యాయము.

అవతారిక:—అపామార్గతండులీయాధ్యాయమున నంతఃపరిమార్జనంబును, ఆరగ్వధీయాధ్యాయమున బహిఃపరిమార్జనంబును చెప్పబడినవి; ఆరెండధ్యాయముల జెప్పబడనిదియు భయపరిమార్జనము. అయ్యదియు భేషజచతుష్కమున జేరినది; కావున నీషడ్విరేచనశతాశ్రితీయాధ్యాయమున యుభయపరిమార్జనములు వివరింపబడును.

మూ. అథాతష్షడ్విరేచనశతాశ్రితీయమధ్యాయంవ్యాఖ్యాస్యామః.౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. ఆరువందలవిధములైన విరేచనములను, ఆవిరేచనద్రవ్యములయొక్క ఆరు విధములైన యాశ్రయములను అధికరించిన యధ్యాయమును త్రికాలజ్ఞానవేదియగు నాత్రేయుండు చెప్పినదానికి న్యూనాతిరేకములు గాక వివరించెదనని భావము.

"ఆశ్రీయత ఇతి - ఆశ్రితీయం, ఆశ్రయః; షట్సంఖ్యాకాని విరేచనశతాని, షట్సంఖ్యాకాని ఆశ్రితానిచ, అధికృత్య కృతోఽధ్యాయః - షడ్విరేచనశతాశ్రితీయః" అనువ్యుత్పత్తిచేత ఆరువందలవిరేచనములను, ఆరువిధములైన విరేచనాశ్రయములను ఉద్దేశించి చెప్పబడినయధ్యాయమని యధ్యాయసంజ్ఞ; అట్టి యధ్యాయమును వివరించెదనని యర్థము. ఈయధ్యాయమున ఆరువందలవిరేచనద్రవ్యములును, ఆరువిధములైనవాని యాశ్రయములును వివరింపబడునని ఫలితార్థము.

మరియు నీతంత్రమునం దధ్యాయప్రారంభమున నుండుపదమును కనుపరచి "దీర్ఘంజీవితీయము, అపామార్గతండులీయము" మున్నగు అధ్యాయసంజ్ఞలు చెప్పబడెను. ఈయధ్యాయమున 'ఇహ ఖలు' అని ప్రారంభింపబడినదికాని షడ్విరేచనశతశబ్దముచే ప్రారంభములేదు. అయినను ఇచ్చట విషయమును ప్రధానముగజేసి "షడ్విరేచనశతాశ్రితీయ"మని యధ్యాయసంజ్ఞ చేయబడినది.

## విరేచనయోగ, తదాశ్రయాదివిభాగనిర్ణయము.

మూ. ఇహ ఖలు షడ్విరేచనశతాని భవన్తి, షడ్విరేచనాశ్రయాః,
పఞ్చకషాయశతాని పఞ్చకషాయయోనయః, పఞ్చవిధం కషాయకల్పనమ్ పఞ్చాశన్మహాకషాయాః, ఇతి సఙ్గ్రహః. 3

షడ్విరేచనశతాని ఇతి యదుక్తం తదిహ సంగ్రహేణోదాహృత్య, విస్తరేణ కల్పోపనిషది వ్యాఖ్యాస్యామః. ౪

వ్యా. మిక్కిలి సంక్షిప్తమును విస్తరమునుగాని యీతంత్రమునందు విరేచనౌషధయోగములు ఆరువందలుగను, విరేచనాశ్రయములు ఆరువిధములుగను, కషాయములు ఐదువందలును, కషాయముల కుత్పత్తికారణములు ఐదుగను, కషాయకల్పనము ఐదువిధములుగను, మహాకషాయములు ఏబదిగను సంగ్రహముగ నిర్ణయింపబడినవి. అందు ఆరువందలవిరేచనయోగములు సంగ్రహముగ నీయధ్యాయమున జెప్పబడును. కల్పస్థానమున సవిస్తరముగ వివరింపబడును.

ఈతంత్రమున విరేచనయోగములు సంక్షేపముగ నారువందలవిధములు చెప్పబడెను. మరియు క్రిందచెప్పబడు విరేచనషట్ఛతంబును, ఏబదికషాయభేదములును,

ఐదువందలకషాయములును కల్పనావికల్పములచే నధికసంఖ్యాకము లగును. ఈవిషయము 'ఇహ' అనుసాభిప్రాయపదముచే తంత్రకారుడు సూచించెను. 'ఇహ' అనగా అతిసంక్షిప్తంబును అతివిపులంబును కాని యీతంత్రమున విరేచనాదియోగములచే సంఖ్యానియమము నిర్ణయింపబడెనని భావము. ఈవిషయమునే కల్పస్థానమున విరేచనయోగముల నారువందల నిరూపించి ఉపసంహారమున నిట్లు చెప్పెను:—"ఉద్దేశమాత్రమేతావత్ ద్రష్టవ్యమిహ షట్ఛతమ్, స్వబుద్ధ్యైవం సహస్రాణి కోటిర్వా సంప్రకల్పయేత్" (ఉద్దేశమాత్రముగ నియ్యెడ విరేచనయోగముల నారువందలవిధముల జెప్పినది వైద్యవరుడు తనబుద్ధినైపుణ్యముచే వేలసంఖ్య కోట్లసంఖ్యాకొలదియు విరేచనౌషధయోగముల గల్పింపనగునని భావము) ఈవాక్యముచేత కల్పనానుసారముగ నౌషధయోగములు సంఖ్యాతీతములగునని తెలిసెడిని. ఈవిషయమే "న హి విస్తరస్య ప్రమాణమస్తి" అని క్రింద చెప్పబడును.

ఇచ్చట విరేచనశబ్దముచేత వమనవిరేచనములు రెండును గ్రహింపబడును. "ఉభయం వా దోషమలవిరేచనా ద్విరేచనా ద్విరేచనశబ్దం లభతే" అనుకల్పస్థానవచనముచేత శరీరమునందలి దోషములను మలములను వెడలించుటంజేసి విరేచనశబ్దముచే వమనవిరేచనములు రెండును చెప్పబడునని భావము. "విరిచ్యతే దోషమలాదయః అనేనేతి—విరేచనం" అనువ్యుత్పత్తిచేత శరీరమునందలి దోషమలాదుల బైటవెడలించు నౌషధవిశేషము విరేచన మనబడును. అట్టి మలనిర్గమనము వమనముచేనైనను విరేచనముచేనైనను సంభవించునుకావున నీరెండువిధములైన ఔషధములును విరేచనశబ్దముచే తంత్రముల జెప్పనగునని భావము.

మరియు నియ్యది (విరేచనపదము) పంకజాదిపదములవలె వమనవిరేచనములకు మాత్రము యోగరూఢముగ తంత్రకారులు సాంకేతికముగ జెప్పిరి. కావున తక్కిన వస్తిశిరోవిరేచనము మున్నగుశోధనములను ఈపదముచే గ్రహింపదగదు.

'పంచ కషాయశతాని' అనుచోట లవణరస మొక్కటిదక్క తక్కిన మధుర-అమ్ల-కటు-కషాయ-తిక్తరసములలో నొక్కొకరసద్రవ్యమునకు నూరేసిభేదములవంతున నైదువందలకషాయద్రవ్యము లగునని భావము. అట్టి ద్రవ్యముల నాశ్రయించినకషాయములు ఐదువందలగునని ఫలితార్థము.

"కషాయయోనయః" అనుచోట మధురాదిరసభేదముచే కషాయజాతులు ఐదువిధములని యర్థము.

కషాయకల్పనమనగా యథోక్తద్రవ్యములచే కషాయముల నుపయోగించుట కనువుగ జేయబడుసంస్కారకల్పనమని యర్థము.

మహాకషాయములన:—ఒక్కొకకార్యమునకై పదేసిద్రవ్యముల నొక్కొకగణముగ పరిగణనము చేయబడును. అట్టి పదిద్రవ్యములు చేరినగణము మహాకషాయ మనబడును. అయ్యవి జీవనీయబృంహణీయాది భేదములచే నేబదివిధములుగ క్రిందజెప్పబడును. ఈపరిగణనము "దశేమాని బృంహణీయాని" ఇత్యాదివాక్యములచే జెప్పబడును.

'కల్పోపనిషది' అనుచోట కల్పస్థానము ఉపనిషత్తుతో సమానమని యర్థము. మిక్కిలి ప్రధానముగ నుపయోగ్యమును అతిరహస్యమునైన పరమార్థతత్త్వము నుపదేశించుభాగము వేదమున ఉపనిషత్తని చెప్పబడును. ఈకల్పస్థానమునందును శరీరారోగ్యమునకు ముఖ్యకారణంబును అతినిగూఢంబునైన వమనవిరేచనాదికల్పవిధానము నుపదేశించుటంజేసి కల్పోపనిషత్తని ఔపచారికముగ జెప్పబడినది.

### షడ్విరేచనశత - తదాశ్రయవివరణము.

మూ. తత్ర త్రయస్త్రింశద్యోగశతం ప్రణీతం ఫలేషు, ఏకోనచత్వారింశజ్జీమూతకేషు యోగాః, పఞ్చచత్వారింశదిక్ష్వాకుషు, ధామార్గవష్షష్టిధా భవతి యోగయుక్తః, కుటజస్త్వష్టాదశధా యోగమేతి, కృతవేధనం షష్టిధా భవతి యోగయుక్తమ్, శ్యామాత్రివృద్యోగశతం ప్రణీతం దశాపరే చాత్ర భవన్తి యోగాః, చతురఙ్గులో ద్వాదశధా యోగమేతి, లోధ్రం విధా షోడశ యోగయుక్తమ్, మహావృక్షో భవతి వింశతి యోగయుక్తః, ఏకోనచత్వారింశత్సప్తలాశఙ్ఖిన్యో యోగాః, అష్టచత్వారింశద్దన్తీద్రవన్త్యోరితి షడ్విరేచనశతాని. ౫

షడ్విరేచనాశ్రయా ఇతి:—క్షీర - మూల - త్వక్ - పత్ర - పుష్ప - ఫలానీతి. ౬

వ్యా. ఫలములతో నూటముప్పదిమూడువిరేచనౌషధయోగములు కల్పింపబడును. జీమూతకము (దేవదాళి)చే ముప్పదితొమ్మిదియోగములును, చేదుసొరచే నలుబదియైదు యోగములును, చేదుపుచ్చచే నరువదివిధములయోగములును, కొడిసెపాలచే పదునెనిమిది విధములయోగములును, కృతవేధనము(చేదుబీర)చే అరువదివిధములయోగములును గల్పింపనగును. పైజెప్పినయోగములన్నియు జేరి మూడుపందలయేబదియైదు (౩౫౫) యోగములగును. ఇవియన్నియు వమనయోగములు.

మరియుం నల్లతెగడ ఎఱ్ఱతెగడలచే నూటపదివిధములయోగములును, రేలచే పండ్రెండువిధములయోగములును, లొద్దుగుచే పదునారువిధములయోగములును, మహావృక్షము (బొంతజెముడు)చే నిరువదివిధములయోగములును, సప్తల (సాంబ్రాణిచెట్టు), శంఖిని ఈరెంటిచే ముప్పదితొమ్మిదివిధములయోగములును, దంతి (నేపాళపుగింజలు), ద్రవంతి (ఎలుకచెవికూర) ఈరెంటిచే నలువదియెనిమిదివిధములయోగములును కల్పింపనగును. (పైజెప్పినశ్యామాదియోగములన్నియుం జేరి రెండువందలనలువదియైదుయోగములగును. ఇవి విరేచనయోగములు). పైజెప్పినమూడువందలయేబదియైదు (३५५) వమనయోగములును, రెండువందలనలువదియైదు (२४५) విరేచనయోగములును చేరి ఆరువందల (६००) విరేచనయోగము లగునని యెఱుంగునది.

విరేచనాశ్రయము లెవ్వియన:—విరేచనములగల్గించుద్రవ్యముల నాశ్రయించియుండు పాలు, పట్ట, వేరు, ఆకు, పువ్వు, కాయ అను నీయాఱును విరేచనాశ్రయములగును. (విరేచనకరములని చెప్పబడినయోషధులయొక్క క్షీరాదులు ఆఱును విరేచనాశ్రయములని యెఱుంగునది.)

"స్నుక్పయస్తీక్ష్ణవిరేచనానామ్" అనువాక్యముచే విరేచనద్రవ్యములలో బొంతజెముడు తీక్ష్ణమైనదని చెప్పబడినది కావున ప్రధానమగుటంజేసి తొలుత విరేచనద్రవ్యములలో క్షీరము చెప్పబడినది.

## కషాయయోనులు.

**మూ.** పఞ్చ కషాయయోనయ ఇతిః—మధురకషాయః, అమ్లకషాయః, కటుకషాయః, తిక్తకషాయః, కషాయకషాయశ్చేతితన్త్రేసంజ్ఞా. ౭

వ్యా. కషాయయోనులు (జాతులు) ఐదువిధములు:—మధురకషాయము (మధురరసముకలద్రవ్యముచే చేయబడినకషాయము), అమ్లకషాయము (పులుపుకలద్రవ్యములచే నిష్పన్నమైనకషాయము), కటుకషాయము (కారముకలద్రవ్యములచే జేయబడినకషాయము), తిక్తకషాయము (చేదుగలద్రవ్యములచే జేయబడినకషాయము), కషాయకషాయము (వగరుకలద్రవ్యములచే చేయబడినకషాయము) నని యీతంత్రమున సంజ్ఞచేయబడినది.

కషాయమన:—లవణమునుమాత్రము వదలి తక్కినమధురాదిరసములైదిటిలో నొకరసమును ప్రధానముగజేసి సంస్కారకల్పనముచే సిద్ధమైన ద్రవౌషధము. అట్టియౌషధమున కుత్పత్తికారణము మధురాదిరసములగును కావున నయ్యవి కషాయయోనులగును. ఈవిషయమునే "కషాయయోనయః పఞ్చ రసా లవణవర్జితాః" అని తంత్రాంతరమున నుపదేశించిరి.

ఇచ్చట నిది విచారణీయము:—లవణరసము గూడ మధురాదిరసములవలె నచ్చటచ్చట యోగములయందు ప్రయోగింపబడినది. "ద్వౌ క్షారౌ లవణాని చ" ఇది మున్నగు చోట్ల ప్రయోగము కనబడుచున్నది. మరియు మధురాదిరసములకు చెప్పబడినట్లే లవణమునకు గూడ గుణాదులు చెప్పబడినవి. అట్లుండ లవణరసమును మాత్రము వదలి తక్కిన మధురాదిరసములకు మాత్రము కషాయసంజ్ఞ చేయుటకు కారణమేమని యాశంక కల్గును. సమాధాన మెట్టులన:—లవణము ద్రవ్యాంతరములచే జేర్చి యుపయోగింపబడునుగాని మధురాదిరసములవలె స్వతంత్రముగ నెచ్చటను ప్రయోగింపబడలేదు. మరియు మధురాదిద్రవ్యములు స్వరసకల్కాదికల్పనమునకు యుక్తముగ నుండును. లవణము అట్టి కల్పనకు పనికిరాదు. ఏలయన:—మధురాదిద్రవ్యములనుండి స్వరసము దీయ వీలుండును. లవణమున స్వరసము రాదు. మధురాదిద్రవ్యములతో ద్రవమును జేర్చి నూరి కల్కముజేయ వీలుండును. లవణముతో ద్రవము కలిసినచో స్వరూపము బొత్తుగ చెడి నీట గలియును కావున కల్కమునకు వీలుపడదు. మరియు లవణమును కల్కభేదమున జేరిన చూర్ణరూపముగ మాత్రము చేయనగును. కాని అట్టి చూర్ణరూపము నొందిన లవణముచే నపూర్వమైనగుణము క్రొత్తగ గల్గబోదు. మధురాదులు మాత్రము చూర్ణరూపమునొందినప్పుడు గుణవిశేషము కల్గియుండుట యనుభవసిద్ధము. మరియు శృతశీతఫాంటకషాయములు. ద్రవ్యముయొక్క కృత్స్నప్రయోగమవసరము లేనప్పుడు అందలి యవయవైకదేశము సంక్రమింపజేయుటకై సంస్కారవిశేషముచే శ్రుతశీతఫాంటకషాయకల్పనము చేయబడును. అట్టి ఏకదేశావయవానుప్రవేశము మధురాదిద్రవ్యములకు సంభవించును. లవణము ద్రవ్యము పూర్తిగ ద్రవమున కలియును కావున దాని అవయవఏకదేశము కలియుటకు వీలుపడదు. ఇట్టి కారణములచేత లవణము స్వతంత్రముగ ప్రయోగించుటకును, స్వరసాదికల్పనమునకును అర్హముకానందున దానినిమాత్రము వదలి, తక్కిన మధురాదిరసములకు కల్పనావిశేషముచే కషాయసంజ్ఞ తంత్రకారులచే నిర్ణయింపబడెను.

### కషాయ భేదములు.

మూ. పఞ్చవిధం కషాయకల్పనం ఇతి తద్యథా:—

స్వరసః, కల్కః, శ్రుతః, శీతః, ఫాణ్టః, కషాయశ్చేతి. ౭

వ్యా. స్వరసము, కల్కము, శ్రుతము, శీతము, ఫాంటము నని కషాయకల్పనము ఏదువిధముల నుండును.

స్వరసాదికల్పనాప్రకారము.

మూ. యన్త్రప్రపీడనాద్ద్రవ్యాత్ రసస్స్వరస ఉచ్యతే,
యత్పిణ్డం రసపిష్టానాం తత్కల్కం పరికీర్తితమ్. ౯
వహ్నౌ తు క్వథితం ద్రవ్యం శృతమాహుశ్చికిత్సకాః,
ద్రవ్యాదాపోత్థితాత్తోయే తత్పునర్నిశి సంస్థితాత్. ౧౦
కషాయో యోఽభినిర్యాతి స శీతస్సముదాహృతః,
క్షిప్త్వోష్ణతోయే మృదితం తత్ఫాణ్టం పరికీర్తితమ్. ౧౧

వ్యా. ఒకద్రవ్యమును నలియగొట్టి యంత్రమునందునిచి పిండినచో స్రవించు రసము (ద్రవము) స్వరస మనబడును. పచ్చిగనుండుద్రవ్యమును మెత్తగ నలియగొట్టి ముద్దగజేసిన నయ్యది కల్కమని చెప్పబడును. ద్రవ్యమును నీళ్లతో జేర్చి నిప్పున కాచి నచో నయ్యది క్వథిత శృతకషాయమని చెప్పనగును. ఒకద్రవ్యమునందునిచి రాత్రి యంతయు నానబెట్టిన నయ్యది శీతకషాయ మనబరగును. ద్రవ్యమును నలియగొట్టి కళకళకాగిన వేడినీళ్లలో నునిచి చక్కగ మర్దనముచేసిన నయ్యది ఫాంటకషాయమని చెప్పనగును.

పంచవిధకషాయముల బలతారతమ్యము.

మూ. తేషాం యథాపూర్వం బలాధిక్యం; అతః కషాయకల్పనా వ్యాధ్యాతురబలాపేక్షిణీ; నత్వేవం ఖలు సర్వాణి సర్వత్రోపయోగీని భవన్తి. ౧౨

వ్యా. పైజెప్పబడిన పంచవిధకషాయములలో వెనువెనుక నొకదానికన్న నొకటి బలాధికముగ నుండును. (ఫాంటమునకన్న శీతకషాయంబును, శీతమునకన్న శృతకషాయంబును, శృతమునకన్న కల్కంబును, కల్కమునకన్న స్వరసకషాయంబును వీర్యాధికముగ నుండునని భావము).

కావున పైజెప్పినపంచవిధకషాయపరికల్పనము వ్యాధిబలమును రోగిబలము ననుసరించియుండును. కావున అట్టికషాయముల నన్నిటిని సర్వసాధారణముగ నుపయోగింపం దగదు. (వ్యాధియొక్క క్రూరసౌమ్యబలమును, రోగియొక్క బలతారతమ్యమును చక్కగ గమనించి తత్తదనుగుణముగ శృతశీతాదికషాయభేదముల బలాబలమును గమనించి కల్పనజేసి యుపయోగింపవలెగాని, సాధారణముగ నన్నివ్యాధులకును అందరి రోగులకును ఉపయోగింపంజనదని ముఖ్యభావము).

ఇచ్చట చూర్ణము కల్కములో నంతర్భూతము. కల్కము సద్రవము, అద్ర వము నని రెండువిధములు. అందు ద్రవములేనిది చూర్ణము. ద్రవముతో గూడినది కల్కము. అని యింతమాత్రము భేదము నెరుంగునది.

ఏబదియైదు మహాకషాయవిభాగము, అందు దీపనీయాషట్కవర్గము.

మూ. పఞ్చాశన్మహాకషాయా ఇతి యదుక్తం
తదను వ్యాఖ్యాస్యామః తద్యథా
జీవనీయో బృంహణీయో లేఖనీయో
భేదనీయస్సన్ధానీయో దీపనీయ ఇతి షట్కః కషాయవర్గః. ౧౩

వ్యా. పంచకషాయకల్పనముల జెప్పినపిదప ఏబదివిధములైన మహాకషాయవర్గముల నీక్రింద వివరించెదను:—జీవనీయము (ప్రాణధారణమునకు హితమైనది.) బృంహ యము (శరీరమును బలియ జేయుటకు హితమైనది), లేఖనీయము (శరీరమును కృశత నొందింప హితమైనది), భేదనీయము గట్టిబడి యుండగట్టియుండు మలాదుల సడలింప హితమైనది), సన్ధానీయము (విరిగిన శరీరావయవముల నతుక జేయ హితమైనది), దీప నీయము (మందగించిన జాఠరాగ్నిని రాజజేసి యాకలి బుట్టింప హితమైనది), ఇది కషాయవర్గషట్కము. (ద్రవ్యగణము లారిటిచే పరిచ్ఛిన్నమైన కషాయవర్గము).

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—జీవనీయాదులు కషాయద్రవ్యగణములు. అందొక్కొకగణము పదేసిద్రవ్యములతో జేరియుండును. అట్టి కషాయగణములు ఏబదిమహాకషాయవర్గములగును. పదేసిద్రవ్యములు జేసి యొక్కొకకషాయవర్గమగుటం జేసియే మహాకషాయములని సంజ్ఞ చేయబడినది. మరియు "జీవనే హితం-జీవనీయమ్" అనువ్యుత్పత్తిచేత ప్రాణధారణమునకు హితమైనది యని యర్థము. జీవనశబ్దమునకు హితార్థమునందు ఛప్రత్యయము వచ్చి దానికి 'ఈయ' అనునాదేశమువచ్చినచో 'జీవ నీయ' అని నిష్పన్నమగును. బృంహణీయము మున్నగుశబ్దములకు నైదింటికిని ఇత్తెరంగు ననే నిష్పత్తియు అవయవావయవంబులును నూహింపదగును. మరియు మహాకషాయవర్గ ముల నేబదిని వరుసగ జెప్పదగియున్నను, ఈయప్రత్యయాంతశబ్దములచే జెప్పదగి హితార్థమును బోధించువర్గము లారు'అని తెలియుటకై యీయాఱును అవాంతరవర్గముగ నాచార్యులచే పరిగణింపబడినది. ఇత్తెరంగుననే బల్యాదివర్గములు నాల్గు యత్ప్రత్య యాంతశబ్దములచే వాచ్యములుగాన నది యొకవర్గముగను, తృప్తిఘ్నాదులు ఘ్నాంతశబ్ద బోధ్యములుగాన వాని నొకవర్గముగను, పరిగణనము చేయబడినది. స్తన్యజననాది యవాంతరవర్గములకును వివరణము నెఱుంగునది. (ఈయప్రత్యయాంతవర్గము, యత్ప్ర)

త్యయాంతవర్గము, ఘ్నాంతవర్గము, జననాంతవర్గము ఇవి మున్నగు నవాంతరవర్గములు అవాంతరార్థభేదములను సంగ్రహముగ దెల్పుటకై విచిత్రరచనను దెల్పుచు జెప్పిరని భావము) ఇట్టి విచిత్రవిభాగముచే విశేషార్థమును సంగ్రహముగ జెప్పుట శాస్త్రమర్యాద. ఈవిషయమునే "అనవపతితశబ్ద మకష్టశబ్దం పుష్కలాభిధానం" అని యాతంత్రకారు డుపదేశించెను. ఇట్టిరచనకు పుష్కలాభిధానమని సంజ్ఞ జేసిరి.

### బల్యాదివర్గచతుష్కవర్గము.

మూ. బల్యో, వర్ణ్యః, కణ్ఠ్యో, హృద్యః, ఇతి చతుష్కః కషాయవర్గః.

వ్యా. బల్యము (బలకరము), వర్ణ్యము (శరీరమునకు వర్ణోత్కర్షమును కల్గించునది), కంఠ్యము (కంఠస్వరమును చక్కబరచునది), హృద్యము (హృదయమునకు హితకరము), ఈనాల్గుగుణములను జేరినది చతుష్కకషాయవర్గము. (నాల్గుమహాకషాయవర్గములు చేరిన వర్గమని భావము).

బల్యాదిశబ్దములు యత్ప్రత్యయాంతములని యెరుంగునది 'బలాయ హితం - బల్యం' అని హితార్థమున యత్ప్రత్యయము. తక్కినమాటికి నిత్తెరంగుననే వ్యుత్పత్తి నెరుంగునది.

### తృప్తిఘ్నాదికషాయషట్కవర్గము.

మూ. తృప్తిఘ్నో, ఽర్శోఘ్నః, కుష్ఠఘ్నః, కణ్డూఘ్నః, క్రిమిఘ్నో, విషఘ్న, ఇతి షట్కః కషాయవర్గః. ౧౫

వ్యా. తృప్తిఘ్నము (తృప్తిజెందినవానివలె కఫము పూరించుకొనియుండు రోగవిశేషమును హరించునది), అర్శోఘ్నము (అర్శోరోగము (మూలవ్యాధిని) ను హరించునది), కుష్ఠఘ్నము (కుష్ఠరోగమును హరించునది), కండూఘ్నము (దురదను పోగొట్టునది), క్రిమిఘ్నము (క్రిమిరోగమును హరించునది), విషఘ్నము (విషమును హరించునది); నని కషాయవర్గముల షట్కము.

'తృప్తిం హన్తీతి-తృప్తిఘ్నః' కఫము పూరించుటచే తృప్తిజెందినవానివలె నిండినట్లుండు వ్యాధిని హరించునది యని యర్థము. తక్కిన యైదిటికి నిత్తెఱంగుననే యెరుంగునది.

### స్తన్యజననాదికషాయవర్గచతుష్కవర్గము.

మూ. స్తన్యజననః, స్తన్యశోధనః, శుక్రజననః, శుక్రశోధనః, ఇతి చతుష్కః కషాయవర్గః ౧౬

వ్యా. స్తన్యజననము (స్తన్యమును (చనుబాలను) పుట్టించునది), స్తన్యశోధనము (స్తన్యమునందలి దోషమును పోగొట్టి శుభ్రపరచునది), శుక్రజననము (శుక్రమును కల్గించునది), శుక్రశోధనము (శుక్రమువందలి దోషమును హరించి శుభ్రపరచునది) నని నాల్గును చేరి కషాయవర్గచతుష్కము.

స్నేహోపగాదికషాయసప్తకవర్గము.

మూ. స్నేహోపగః, స్వేదోపగో, వమనోపగో, విరేచనోపగ, ఆస్థాపనోపగో, ఉనువాసనోపగః, శిరోవిరేచనోపగ ఇతి సప్తకః కషాయవర్గః. ౧౭

వ్యా. స్నేహోపగము (నెయ్యి మున్నగు స్నేహద్రవ్యముల కనుకూలముగనుండి స్నేహనాదిక్రియలయందు సహాయపడునది), స్వేదోపగము (స్వేదనక్రియ కనుకూలముగ నుండునది), వమనోపగము (వమనౌషధములతో జేరి వమనక్రియయందు దోడ్పడునది), విరేచనోపగము (విరేచనౌషధములతో జేరి సహాయపడునది), ఆస్థాపనోపగము (ఆస్థాపనవస్త్యౌషధమున జేరి వస్తిక్రియయందు సహాయపడునది), అనువాసనోపగము (అనువాసనవస్తి క్రియయందు సహాయపడునది), శిరోవిరేచనోపగము (శిరోవిరేచన క్రియయందు సహాయపడునది) నని యేడుకషాయవర్గములుజేరి కషాయసప్తకవర్గము.

'స్నేహోపగః' ఇత్యాదిస్థలములయందు ఇత్తెరంగున నర్థవిశేషము నెరుంగునది:— నెయ్యి మొదలగు స్నేహద్రవ్యములతో జేరి స్నేహనాదిక్రియలయందు అట్టి స్నేహద్రవ్యములకు శక్త్యతిశయమును కల్గించుచు సహాయమొనరించు ప్రాశస్త్యమందు మున్నగునవి స్నేహోపగము. ఇత్తెరంగుననే స్వేదవమనవిరేచనాదులయందును అర్థవిశేషము నెరుంగునది.

ఛర్దినిగ్రహణాదిత్రికకషాయవర్గము.

మూ. ఛర్దినిగ్రహణః, తృష్ణానిగ్రహణః, హిక్కానిగ్రహణ ఇతి త్రికః కషాయవర్గః. ౧౮

వ్యా. ఛర్దినిగ్రహణము (వాంతుల నిలుపునది), తృష్ణానిగ్రహణము (దప్పినడంచునది), హిక్కానిగ్రహణము (ఎక్కిళ్లు మాన్పునది) నని మూడును చేరినది కషాయత్రికవర్గము.

పురీషసంగ్రహణీయాదిపంచకకషాయవర్గము.

మూ. పురీషసఙ్గ్రహణీయః, పురీషవిరజనీయో, మూత్రసఙ్గ్రహ

ణీయో, మూత్రవిరజనీయో, మూత్రవిరేచనీయ ఇతి పఞ్చకః కషాయవర్గః. ౧౯

వ్యా. పురీషసంగ్రహణీయము (పురీషమును బంధించునది), పురీషవిరజనీయము (పురీషమునందలి దోషమును బోనడచి శుభ్రపరచునది), మూత్రసంగ్రహణీయము (మూత్రమును అధికముగ వెడలునపుడు నిలుపునది), మూత్రవిరజనీయము (మూత్రమునందలి దోషమును హరించి శుభ్రపరచునది), మూత్రవిరేచనీయము (మూత్రమును (బద్ధగించినపుడు) ధారాళముగ వెడలించునది) నని యైదును చేరినది కషాయపంచకము.

### కాసహరాదిపంచకకషాయవర్గము.

మూ. కాసహరః, శ్వాసహరః, శోథహరో, జ్వరహరః, శ్రమహరః, ఇతి పఞ్చకః కషాయవర్గః. ౨౦

వ్యా. కాసహరము (దగ్గును హరించునది), శ్వాసహరము (శ్వాసమును హరించునది), శోథహరము(వాపు(నంజు)ను హరించునది),జ్వరహరము (జ్వరమును హరించునది), శ్రమహరము (శ్రమమును హరించునది) నని యైదును జేరినది కషాయపంచకము.

### దాహప్రశమనాదిపంచకకషాయవర్గము.

మూ. దాహప్రశమనః, శీతప్రశమనః, ఉదర్దప్రశమనః, అఙ్గమర్దప్రశమనః, శూలప్రశమనః, ఇతి పఞ్చకః కషాయవర్గః. ౨౧

వ్యా. దాహప్రశమనము, (శరీరములోని వేండ్రమును శరీరముపై మంటను శమింపజేయునది), శీతప్రశమనము (చలిని చలువను శమింపజేయునది), ఉదర్దప్రశమనము (శరీరముపైని కణితిరీగెలు కుట్టినవిధమున లేచుదద్దులు ఉదర్దము; దానిని శమింపజేయునది), అంగమర్దప్రశమనము (శరీరమున గల్గునొప్పుల శమింపజేయునది), శూలప్రశమనము (శూలరోగమును శమింపజేయునది) నని యైదును జేరి కషాయపంచకవర్గము.

### శోణితస్థాపనాదిపంచకకషాయవర్గము.

మూ. శోణితస్థాపనో, వేదనాస్థాపనః, సంజ్ఞాస్థాపనః, ప్రజాస్థాపనో, వయస్స్థాపన ఇతి పఞ్చకః కషాయవర్గః. ౨౨

వ్యా. శోణితస్థాపనము, (చెడినరక్తము శుభ్రపరిచి నిర్దుష్టావస్థయందుంచునది), వేదనాస్థాపనము (శరీరమున వేదన సంభవించునపుడు దానిని పోగొట్టి శరీరమును

ఆరోగ్యస్థితినుంచునది), సంజ్ఞాస్థాపనము (స్మృతిని జ్ఞానమును చెడనీయక స్వభావస్థితి నుంచునది), ప్రజాస్థాపనము (సంతానమునకు భంగకరమైనదోషమును పోగొట్టి సంతానమును గల్గించి చెడనీయక నిల్పునది), వయస్థాపనము (ముదిమిని రానీయక యుక్తమైనవయస్సును నిల్పునది) నని యైదును జేరిన కషాయపంచకము.

మహాకషాయోపసంహారము.

మూ. ఇతి పఞ్చాశన్మహాకషాయాః మహతాం చ కషాయాణాం లక్షణోదాహరణార్థం వ్యాఖ్యాతా భవంతి; తేషా మేకైకస్మిన్ మహాకషాయే దశదశాఽవయవికా అనువ్యాఖ్యాస్యామః తాన్యేవ పఞ్చ కషాయశతాని భవన్తి. ౨౩

వ్యా. ఇత్తెరంగున "పఞ్చాశన్మహాకషాయా భవన్తి" అని నిర్దేశింపబడిన యేబది కషాయములయొక్క లక్షణములను జీవనీయాదిస్వరూపమును విపులముగ వివరించుటకై చెప్పబడినవి. అట్టి జీవనీయాదిమహాకషాయములవర్గములలో నొక్కొక్కకషాయవర్గమున పదేసి అవయవములవంతున నీక్రింద వివరింపబడును. అట్టి యవాంతరావయవములు జేరి (పదేసి యవయవద్రవ్యములతో గూడిన మొత్తము) యైదువందలకషాయము లగును.

పంచాశన్మహాకషాయవివరణము;
అందు కషాయవర్గషట్కములో జీవనీయవర్గము.

మూ తద్యథా:—జీవకర్షభకౌ, మేదా మహామేదా, కాకోలీ క్షీరకాకోలీ, ముద్గమాషపర్ణ్యౌ, జీవన్తీ మధుక మితి దశేమాని జీవనీయాని భవన్తి. ౨౪

వ్యా. జీవకము, ఋషభకము, మేద, మహామేద, కాకోలి, క్షీరకాకోలి, ముద్గపర్ణి (పిల్లపెసర), మాషపర్ణి (కారుమినుము), పాలకూర, అతిమధురము ఈపదియును జేరి జీవనీయము (ప్రాణధారణమునకు హితము) లగును.

బృంహణీయవర్గము.

మూ. క్షీరిణీ, రాజక్షవక, బలా, కాకోలీ, క్షీరకాకోలీ, వాట్యాయనీ, భద్రౌదనీ, భారద్వాజీనీ, పయస్యా, ఋశ్యగన్ధా, ఇతి దశేమాని బృంహణీయాని భవన్తి. ౨౫

వ్యా. పాలతీగె, రాజక్షవకము (చిరుబాల), చిట్టాముట్టి, కాకోలి, క్షీరకాకోలి, వాట్యాయని (తెల్లనిచిట్టాముట్టి) ఇదియే పేరాముట్టి, భద్రౌదని (పచ్చని

చిట్టాముట్టి), అడవిప్రత్తి, తెల్లనేలగుమ్ముడు, ఋశ్యగంధ (పాలగుమ్ముడు) ఈపదియును జేరి బృంహణీయవర్గము (శరీరమును బలియజేయుటకు హితమైనది).

### లేఖనీయవర్గము.

మూ॥ ముస్తకుష్ఠహరిద్రాదారుహరిద్రా వచాతివిషా కటురోహిణీ చిత్రకచిరిబిల్వాహైమవత్య ఇతి దశేమాని లేఖనీయాని భవన్తి.

వ్యా॥ తుంగగడ్డలు, చెంగల్వకోష్టు, పసుపు, మ్రానిపసుపు, వస, అతివస, కటుక రోహిణి, చిత్రమూలము, కానుగ, తెల్లనివస ఈపదియును జేరినవర్గము లేఖనీయమగును.

### భేదనీయవర్గము.

మూ॥ సువహార్కోరుబుకాగ్నిముఖీ చిత్రాచిత్రకచిరిబిల్వశఙ్ఖినీశకులాదనీస్వర్ణక్షీరిణ్య ఇతి దశేమాని భేదనీయాని భవన్తి. ౨౭

వ్యా॥ తెగడ, జిల్లేడు, ఆముదము, నాగటిచాలుగడ్డ (పొత్తిగడ్డ), దన్తి (చిత్రమూలము), చిత్రమూలము, కానుగ, తెల్లగంటెన, కటుకరోహిణి, కంఠపత్త్రము (లేక బ్రహ్మదండి) ఈపదియును జేరినవర్గము భేదనీయము (గట్టిగనుండుమలమును భేదించునది.)

### సంధానీయవర్గము.

మూ॥ మధుకమధుపర్ణీ పృశ్నిపర్ణ్యమ్బష్ఠకీ సమఙ్గామోచరసధాతకీ లోధ్రప్రియఙ్గుకట్ఫలానీతి దశేమాని సన్ధానీయాని భవన్తి.

వ్యా॥ అతిమధురము, మధుపర్ణి, తీయనిమ్మ (లేక తిప్పతీగె), కోలపొన్న, చిరుబొద్ది, సమంగ (ముణుగుదామర), బూరుగబంక, ఆరెపువ్వు, లొద్దుగు, ప్రేంకణము, కాయఫలము ఈపదియును జేరినవర్గము సంధానీయము (విరిగిన అవయవముల నతుకజేయుటకు హితమైనది).

### దీపనీయవర్గము.

మూ॥ పిప్పలీ పిప్పలీమూల చవ్యచిత్రక శృఙ్గబేరామ్లవేతసమరిచాజమోదాభల్లాతకాస్థిహిఙ్గునిర్యాసా ఇతి దశేమాని దీపనీయాని భవన్తి, ఇతి షట్కః కషాయవర్గః. ౨౮

వ్యా॥ పిప్పలి, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి (అల్లము), అమ్లవేతసము, మిరియాలు, ఓమము, జీడిగింజలు, ఇంగువ. ఈపదియును జేరినవర్గము దీపనీయ

వర్గము, (మందగించిన జాఠరాగ్నిని దీపింపజేసి యాకలిఖుట్టించునది.) ఇత్తెరంగున పదేసి ద్రవ్యములు జేరిన జీవనీయాదికషాయవర్గము లారు జెప్పబడినది.

మహాకషాయవర్గచతుష్కము అందు బల్యవర్గము.

మూ. ఐన్ద్ర్యృషభ్యతిరసర్ష్యప్రోక్తాపయస్యాశ్వగన్ధాస్థిరారోహిణీ బలాతిబలా ఇతి దశేమాని బల్యాని భవన్తి. 30

వ్యా. పాపరబుడమ, దురదగొండి, అతిరస (పిల్లి పీచరగెడ్డలు), కారుమినుము, పాలగుమ్ముడు, పెన్నేరుగెడ్డ, ముయ్యాకుపొన్న, రోహిణి (మాంసరోహిణి), చిట్టాముట్టి, పేరాముట్టి ఈపదియును బల్యములు (బలకరములు).

వర్ణ్యవర్గము.

మూ. చన్దన తుఙ్గపద్మకోశీరమధుకమఞ్జిష్ఠాశారిబాప యస్యాసితాలతా ఇతి దశేమాని వర్ణ్యాని భవన్తి 31

వ్యా. చందనము, సురపొన్న, పద్మకము, వట్టివేరు, అతిమధురము, మంజిష్ఠి, సుగంధపాల, క్షీరకాకోలి, తెల్లగరుక, పచ్చనిగరుక ఈపదియును వర్ణ్యములు (శరీరమునకు మంచిరంగును కల్గించునవి).

కంఠ్యవర్గము.

మూ. శారిబేక్షుమూల మధుక పిప్పలీద్రాక్షావిదారీకైడర్యహంసపాదీ బృహతీకణ్టకారికా ఇతి దశేమాని కణ్ఠ్యాని భవన్తి. 32

వ్యా. సుగంధపాల, చెరకువేరు, అతిమధురము, పిప్పళ్లు, ద్రాక్ష, నేలగుమ్ముడు, కాయఫలము, హంసపాది, పెద్దములక, చిన్నములక ఈపదియును కంఠ్యములు (కంఠమునకు హితకరములు).

హృద్యవర్గము.

మూ. ఆమ్రామ్రాతకనికుచకరమర్దవృక్షామ్లామ్లవేతసకువలబదర దాడిమ మాతులుఙ్గానీతి దశేమాని హృద్యాని భవన్తి, ఇతి చతుష్కః కషాయవర్గః. 33

వ్యా. మామిడి, అమ్రాతక (కొండమామిడి), నిమ్మకాయ, వాకపండు (కలివిపండు), చింతపండు, అమ్లవేతసము, పెద్దరేగు, పిన్నరేగు, దానిమ్మ, మాదీఫలము ఈపదియును హృద్యములు (హృదయమునకు హితకరములు).

పైజెప్పిన నాల్గును జేరి మహాకషాయవర్గచతుష్కము.

### కషాయవర్గషట్కము, అందు తృప్తిఘ్నములు.

మూ. నాగరచవ్యచిత్రకవిడఙ్గమూర్వాగుడూచివచాముస్తపిప్పలీపటోలానీతి దశేమాని తృప్తిఘ్నాని భవన్తి ౩౪

వ్యా. శుంఠి, చవ్యము, చిత్రమూలము, వాయువిడంగములు, చాగ, తిప్పతీగె, వస, తుంగగడ్డలు, పిప్పళ్లు, పొదిరిచెట్టు ఇవి పదియును తృప్తిఘ్నములు (కఫప్రకోపముచే తృప్తిబొందినట్లున్నపుడు అట్టితృప్తిని హరించునవి).

### అర్శోఘ్నవర్గము.

మూ. కుటజబిల్వచిత్రకనాగరాతివిషాభయాధన్వయాసకదారుహరిద్రావచాచవ్యానీతి దశేమాని అర్శోఘ్నాని భవన్తి. ౩౫

వ్యా. కొడిసెపాల, మారేడు, చిత్రమూలము, శుంఠి, అతివస, కరకకాయ, దూలగొండి, మ్రానిపసుపు, వస, చవ్యము ఈపదియును అర్శోఘ్నములు (అర్శోరోగమును హరించునవి).

### కుష్ఠఘ్నములు.

మూ. ఖదిరాభయామలకహరిద్రారుష్కరసప్తపర్ణారగ్వధకరవీర విడఙ్గజాతీప్రవాళా ఇతి దశేమాని కుష్ఠఘ్నాని భవన్తి. ౩౬

వ్యా. చండ్ర, కరకకాయలు, ఉసిరికకాయలు, పసుపు, జీడిగింజలు, ఏడాకులపొన్న, రేల, గన్నేరు, వాయువిడంగములు, జాజిచిగుళ్లు ఈపదియును కుష్ఠఘ్నములు (కుష్ఠముల హరించునవి).

### కండూఘ్నములు.

మూ. చన్దన నలదకృతమాలనక్తమాలనిమ్బకుటజసర్షపమధుకదారుహరిద్రాముస్తానీతి దశేమాని కణ్డూఘ్నాని భవన్తి. ౩౭

వ్యా. చందనము, వట్టివేరు, రేల, కానుగు, వేము, కొడిసెపాల, ఆవాలు, అతిమధురము, మ్రానిపసుపు, తుంగగడ్డలు ఈపదియును కండూఘ్నములు (దురదను హరించునవి).

### క్రిమిఘ్నముల వర్గము.

మూ. అక్షీబమరిచగణ్డీర కేబుకవిడఙ్గనిర్గుణ్డీకిణిహీశ్వదంష్ట్రావృషపర్ణికాఖుపర్ణికా ఇతి దశేమాని క్రిమిఘ్నాని భవన్తి. ౩౮

వ్యా. మునగ, మిరియాలు, గండీరము (శమఠశాకము), కేబుకము, వాయువిడంగములు, నల్లవావిలి, ఉత్తరేణి, పల్లేరు, భారంగి, ఎలుకచెవియాకు ఈపదియును క్రిమిఘ్నములు (క్రిముల హరించునవి).

### విషఘ్నవర్గము.

మూ. హరిద్రామఞ్జిష్ఠా సువహాసూక్ష్మైలాపాలిన్దీచన్దనకతకశిరీషసిన్ధువారశ్లేష్మాతకా ఇతి దశేమాని విషఘ్నాని భవన్తి. ఇతి షట్కః కషాయవర్గః. ౩౯

వ్యా. పసుపు, మంజిష్ఠి, సన్నరాష్టము, చిన్నయేలకులు, నల్లతెగడ, చందనము, చిల్లగింజలు, దిరిసెనము, వావిలి, విరిగిచెట్టు ఈపదియును విషఘ్నములు (విషమును హరించునవి). ఇవి కషాయవర్గషట్కము.

### కషాయవర్గచతుష్కము; అందు స్తన్యజననవర్గము.

మూ. వీరణశాలిషష్టికేక్షువాలికాదర్భకుశకాశగున్ద్రేత్కటకత్తృణమూలానీతి స్తన్యజననాని భవన్తి. ౪౦

వ్యా. అవురుగడ్డివేళ్లు, వరి పైరువేళ్లు, అరువదినాళ్లసంబావులవేళ్లు, ఇక్షువాలికా (చెరకువేళ్లు), దర్భవేళ్లు, కుశదర్భవేళ్లు, రెల్లుదర్భవేళ్లు, కాకి వెదురువేళ్లు, ఉత్కటయను గడ్డివేళ్లు, కామంచి పూరివేళ్లు ఈపదియును స్తన్యజననములు (స్తన్యమును వృద్ధిజేయునవి).

### స్తన్యశోధనవర్గము.

మూ. పాఠామహౌషధసురదారుముస్తమూర్వాగుడూచీవత్సకఫలకిరాతతిక్తకటురోహిణీ సారిబా చేతి దశేమాని స్తన్యశోధనాని భవన్తి. ౪౧

వ్యా. చిరుబొద్ది, శుంఠి, దేవదారు, తుంగగడ్డలు, చాగ, తిప్పతీగె, కొడిసెపాలగింజలు, నేలవేము, కటుకరోహిణి, సుగంధపాల ఈపదియును స్తన్యశోధనములు (స్తన్యమును (చనుబాలను) శుభ్రముగ జేయునవి).

### శుక్రజననవర్గము.

మూ. జీవకర్షభకకాకోలీక్షీరకాకోలీముద్గపర్ణీమాషపర్ణీమేదావృద్ధరుహాజటిలాకులిఙ్గా ఇతి దశేమాని శుక్రజననాని భవన్తి. ౪౨

వ్యా. జీవకము, ఋషభకము, కాకోలి, క్షీరకాకోలి, అడవి పెసర, కారుమినుము, మేద, పిల్లిపీచర, జటామాంసి, కర్కాటకశృంగి ఈపదియును శుక్రజననములు (శుక్రమును కల్గించునవి).

ఇచ్చట "వృద్ధరుహా" అనుచోట 'వృషరుహా' అని పాఠాంతరము కొన్నిప్రతులలో నున్నది. "వృద్ధరుహా—శతావరీ" అని డల్వణవ్యాఖ్యానమున నున్నది. కావున పాఠాంతరము సప్రమాణము కానేరదు.

## శుక్రశోధనాని.

మూ కుష్ఠైలవాలుకకట్ఫలసముద్రఫేనకదమ్బనిర్యాసేక్షుకాణ్డేక్ష్వ్
క్షురకవసుకోశీరాణీతి దశేమాని శుక్రశోధనాని భవన్తి. ఇతి
చతుష్కః కషాయవర్గః.                                                   ౪౩

వ్యా. చెంగల్వకోష్టు, కూతురుబుడమ (నూగుదోస), కాయఫలము, సముద్రపునురుగు, కడిమిచెట్టుబంక, చెరకు, కాండేక్షు (ములుగోలిమిడి), నీరుగొబ్బివిత్తులు, వసుకము (బకపుష్పము), వట్టివేరు ఈపదియును శుక్రశోధనములు (శుక్రమునందలి దోషమును బోనడచి శుభ్రపరచునవి). పైజెప్పిననాల్గును కషాయవర్గచతుష్కము.

## కషాయసప్తకము, అందు స్నేహోపగముల వర్గము.

మూ. మృద్వీకామధుకమధుపర్ణీమేదావిదారీకాకోలీక్షీరకాకోలీ జీవక
జీవన్తీశాలిపర్ణ్య ఇతి దశేమాని స్నేహోపగాని భవన్తి.

వ్యా. ద్రాక్షపండు, అతిమధురము, లిప్పతీగె, మేద, తెల్లనేలగుమ్ముడు, కాకోళి, క్షీరకాకోళి, జీవకము, పాలకూర, ముయ్యాకుపొన్న ఈపదియును స్నేహోపగములు (స్నేహద్రవ్యములతో గలసి స్నేహనక్రియయందు సహాయపడునవి).

## స్వేదోపగవర్గము.

మూ. శోభాఞ్జనకైరణ్డార్కవృశ్చీర పునర్నవాయవ తిలకులుత్థమాష
బదరాణీతి దశేమాని స్వేదోపగాని భవన్తి.                              ౪౫

వ్యా. మునగ, ఆముదము, జిల్లేడు, తెల్లగలిజేరు, ఎఱ్ఱగలిజేరు, యవలు, నువ్వులు, ఉలవలు, ఉద్దులు, రేగు ఈపదియు స్వేదోపగములు (చెమటబుట్టించు నౌషధములతో గలిసి చక్కగ చెమట బుట్టించునవి).

## వమనోపగవర్గము.

మూ. మధుమధుకకోవిదారకర్బుదారనీపవిదులబిమ్బీశణపుష్పీసదా పుష్పీప్రత్యక్పుష్ప్య ఇతి దశేమాని వమనోపగాని భవన్తి. ౨౬

వ్యా. తేనె, అతిమధురము, ఎఱ్ఱని దేవకాంచనము, తెల్లని కాంచనము, కడిమి, నీరుప్రబ్బలి, దొండ, జనుము, జిల్లేడు, ఉత్తరేణి ఈపదియును వమనోపగములు (వమనౌషధములతోఁజేరి వమనక్రియకు సాయపడునవి).

## విరేచనోపగములు.

మూ. ద్రాక్షాకాశ్మర్యపరూషకాభయామలకవిభీతకకువలబదరకర్కన్ధుపీలూనీతి దశేమాని విరేచనోపగమాని భవన్తి. ౨౭

వ్యా. ద్రాక్షపండు, నేలగుమ్ముడు, చిట్టీత, కరకకాయలు, ఉసిరికకాయ, తానికాయ, పెద్దరేగు, పిన్నరేగు, కోలరేగు, గోగు ఈపదియును విరేచనోపగములు (విరేచనౌషధములతోఁజేరి సహాయపడునవి.)

## ఆస్థాపనోపగములు.

మూ. త్రివృద్బిల్వపిప్పలీకుష్ఠసర్షపవచావత్సకఫలశతపుష్పామధుకమదనఫలానీతి దశేమాని ఆస్థాపనోపగమాని భవన్తి.

వ్యా. తెగడ, బిల్వము, పిప్పళ్లు, చెంగల్వకోష్ఠు, ఆవాలు, వస, కొడిసెపాల విత్తులు, సదాప, అతిమధురము, మ్రంగకాయ ఈపదియును ఆస్థాపగములు. (ఆస్థాపనవస్తియందు సహాయపడునవి.)

## అనువాసనోపగవర్గము.

మూ. రాస్నాసురదారుబిల్వమదనశతపుష్పావృశ్చీరపునర్నవాశ్వదంష్ట్రాఽగ్నిమన్థశ్యోనాకా ఇతి దశేమాని అనువాసనోపగాని భవన్తి. ౨౯

వ్యా. సన్నరాష్ట్రము, దేవదారు, మారేడు, మ్రంగకాయ, సదాప, తెల్లగలిజేరు, ఎఱ్ఱగలిజేరు, పల్లేరు, కూరనెల్లి, నక్కతోకపొన్న ఈపదియును అనువాసనోపగములు (అనువాసనవస్తికి సాయపడునది.)

### శిరోవిరేచనీయవర్గము.

మూ. జ్యోతిష్మతీక్షవకమరీచపిప్పలీవిడఙ్గశిగ్రుసర్షపాపామార్గతణ్డులశ్వే
తామహాశ్వేతా ఇతి దశేమాని శిరోవిరేచనోపగాని భవన్తి.
ఇతి సప్తకః కషాయవర్గః. ౫౦

వ్యా. మాల్కంగిని, క్షవకము (తుమ్ములగల్గించు నోషధివిశేషము), మిరియాలు, పిప్పళ్లు, వాయువిడంగములు, మునగ, ఆవాలు, ఉత్తరేణిబియ్యము, తెల్లదింటెన, నల్ల దింటెన ఈపదియును శిరోవిరేచనోపగములు (శిరోవిరేచనములకు సాయపడునవి). ఇది కషాయవర్గసప్తకము.

### కషాయవర్గత్రికము, అందు ఛర్దినిగ్రహణములు.

మూ. జమ్బ్వామ్రపల్లవమాతులుఙ్గామ్లబదరదాడిమయవయష్టికోశీర
మృల్లాజా ఇతి దశేమాని ఛర్దినిగ్రహణాని భవన్తి. ౫౧

వ్యా. నేరేడుచిగుళ్లు, మామిడిచిగుళ్లు, మాదీఫలములు, పుల్లనిరేగు, పుల్లదానిమ్మ, యవలు, అతిమధురము, వట్టివేరు, మన్ను, వరిపేలాలు ఈపదియు ఛర్దినిగ్రహణములు (వాంతిని నిల్పునవి.)

### తృష్ణానిగ్రహణములు.

మూ. నాగరధన్వయాసకముస్తపర్పటకచన్దనకిరాతతిక్తగుడూచీహ్రీబే
రధాన్యకపటోలానీతి దశేమాని తృష్ణానిగ్రహణాని భవన్తి.

వ్యా. శుంఠి, దూలగొండి, తుంగగడ్డలు, పర్పాటకము, చందనము, నేలవేము, తిప్పతీగె, కురువేరు, దనియాలు, చేదుపొట్ల ఈపదియును తృష్ణానిగ్రహణములు (వాంతుల నిల్పునవి.)

### పురీషనిగ్రహణములవర్గము.

మూ. శఠీపుష్కరమూలబదరబీజకణ్టకారికా బృహతీ వృక్షరుహాఽభ
యాపిప్పలీదురాలభాకుళీరశృఙ్గ్య ఇతి దశేమాని హిక్కానిగ్ర
హణాని భవన్తి. ఇతి త్రికః కషాయవర్గః. ౫౩

వ్యా. కచోరములు, పుష్కరమూలము, రేగువిత్తనములు, ములక, వాకుడు, వృక్షరుహా (బదనిక), కరకకాయలు, పిప్పళ్లు, దూలగొండి, కర్కాటకశృంగి ఈపది

యును హిక్కానిగ్రహణములు (ఎక్కిళ్లను నిరోధించునవి.) పైజెప్పినమూడును కషాయ వర్గత్రికము.

### కషాయపంచకము; అందు పురీషసఙ్గ్రహణవర్గము.

మూ. ప్రియఙ్గ్వనన్తామ్రాస్థికట్వఙ్గలోధ్రమోచరససమఙ్గాధాతకీపుష్ప పద్మాపద్మకేసరాణీతి దశేమాని పురీషసఙ్గ్రహణాని భవన్తి.

వ్యా. ప్రేంకణము, సుగంధపాల, మామిడిపప్పు, దుందిలము, లొద్దుగు, బూరుగబంక, ముణుగుదామర, ఆరెపువ్వు, భారంగి, పద్మకేసరములు ఈపదియును పురీషసంగ్రహణములు (పురీషమును నిరోధించునవి.)

### పురీషవిరజనీయములవర్గము.

మూ. జమ్బుసల్లకీత్వక్కచ్ఛురామధుకశాల్మలీశ్రీవేష్టకభృష్టమృత్పయస్యోత్పలతిలకణా ఇతి దశేమాని పురీషవిరజనీయానిభవన్తి. ౪౪

వ్యా. నేరేడు, అందుకుపట్ట, దూలగొండి, అతిమధురము, బూరుగ, శ్రీవేష్టము (ధూపద్రవ్యవిశేషము), వేయించినమట్టి, పాలగుమ్ముడు, కలువ, నువ్వులంపొడి ఈపదియును పురీషవిరజనీయములు (పురీషమునందలి దోషమును హరించి శుభ్రపరచునవి.)

### మూత్రసంగ్రహణీయవర్గము.

మూ. జమ్బ్వామ్రప్లక్షవటకపీతనోదుమ్బరాశ్వత్థభల్లాతకాశ్మన్తకసోమవల్కా ఇతి దశేమాని మూత్రసఙ్గ్రహణీయాని భవన్తి. ౪౫

వ్యా. నేరేడు, మామిడి, జువ్వి, మఱ్ఱి, కపీతన (కొండమామిడి), అత్తి, రావి (వీనిపట్టలు), జీడిగింజలు, ఆరెపువ్వు, చంద్ర ఈపదియును మూత్రసంగ్రహణీయములు (మూత్రమును నిరోధించునవి.)

### మూత్రవిరజనీయగణము.

మూ. పద్మోత్పలనళినకుముదసౌగన్ధికపుణ్డరీకశతపత్రమధూకప్రియఙ్గుధాతకీపుష్పాణీతి దశేమాని మూత్రవిరజనీయానిభవన్తి. ౪౬

వ్యా. ఎఱ్ఱదామరపువ్వు, నల్లకలువపువ్వులు, నళినము (నీరుకావిరంగుకలతామర పువ్వులు), తెల్లకలువలు, సౌగంధికము (ఇంచుక యెఱ్ఱనై యధికపరిమళముకలచెంగలు

పలు), పుండరీకము (తెల్లనితామరపువ్వు), కుశేశయము (నూరు రేకులుకల తామరపువ్వు), అతిమధురము, ప్రేంకణము, ఆరెపువ్వు ఈపదియును మూత్రవిరజనీయములు (మూత్రము నందలి దోషమును హరించి శుభ్రపరచునవి).

మూత్రవిరేచనీయవర్గము.

మూ. వృక్షాదనీశ్వదంష్ట్రావసుకవశిరపాషాణభేదదర్భకుశకాశగున్ద్రో త్కటమూలానీతి దశేమాని మూత్రవిరేచనీయానిభవన్తి. ఇతి పఞ్చకః కషాయవర్గః. ౪౯

వ్యా. బదనిక, పల్లేరు, అగసి, వశిరము, (ప్రొద్దుతిరుగుడుపువ్వుచెట్టు) పాషాణభేది (పిండిబొద్దిచెట్టు), దర్భ, కుశదర్భ, రెల్లు, కిక్కిసగడ్డి, కామంచిగడ్డివేళ్ల ఈపది యును మూత్రవిరేచనీయములు (మూత్రమును ధారాళముగ వెడలించునవి). పైజెప్పిన యైదును జేరి కషాయవర్గపంచకము.

ద్రాక్షాదికషాయవర్గపంచకము, అందు కాసహరవర్గము.

మూ. ద్రాక్షాభయామలకపిప్పలీ దురాలభాశృఙ్గీకణ్టకారికావృశ్చీర పునర్నవాతామలక్య ఇతి దశేమాని కాసహరాణి భవన్తి ౫౦

వ్యా. ద్రాక్షపండు, కరకకాయ, ఉసిరికకాయ, పిప్పళ్లు, దురదగొండి, కర్కాటకశృంగి, వాకుడు, తెల్లగలిజేరు, ఎఱ్ఱగలిజేరు, నేలఉసిరిక ఈపదియును కాసహర ములు (దగ్గును హరించునవి.)

శ్వాసహరవర్గము.

మూ. శటీపుష్కరమూలామ్లవేతసై లాహిఙ్గ్వగురుసురసాతామలకీజీవ న్తీచణ్డా ఇతి దశేమాని శ్వాసహరాణి భవన్తి. ౫౧

వ్యా. కచ్చువరీలు, పుష్కరమూలము, అమ్లవేతసము (పుల్లప్రబ్బలి), ఏలకులు, ఇంగువ, అగరు, తులసి, నేలయుసిరిక, పాలకూర, చండ (కల్లెచెట్టు) ఈపదియును శ్వాసహరములు. (శ్వాసమును హరించునవి.)

శ్వయథుహరములు.

మూ. పాటలాగ్నిమన్థశ్యోనాకబిల్వకాశ్మర్యకణ్టకారికాబృహతీ శాలి పర్ణిపృశ్నిపర్ణిగోక్షురకా ఇతి దశేమాని శ్వయథుహరాణి భవన్తి. ౫౨

వ్యా. పాదిరి, కూరనెల్లి, దుందిలము, మారేడు, నేలగుమ్ముడు, వాకుడు, ములక, కోలపొన్న, ముయ్యాకుపొన్న, పల్లేరు ఈపదియును శ్వయథుహారములు (వాపును హరించునవి.)

### జ్వరహరములు.

మూ. శారిబాశర్కరాపాఠామఞ్జిష్ఠాద్రాక్షాపీలుపరూషకా౽భయామలకవిభీతకానీతి దశేమాని జ్వరహరాణి భవన్తి ౬౨

వ్యా. సుగంధపాల, చక్కెర, చిరుబొద్ది, మంజిష్ఠి, ద్రాక్షపండు, గోగు, చిట్టీత, కరకకాయలు, ఉసిరికకాయలు, తానికాయలు ఈపదియును జ్వరహరములు (జ్వరమును హరించునవి.)

### శ్రమహరవర్గము.

మూ. ద్రాక్షాఖర్జూరపియాలబదరదాడిమఫల్గుపరూషకేక్షుయవషష్టికా ఇతి దశేమాని శ్రమహరాణి భవన్తి. ఇతి షట్కః కషాయవర్గః. ౬౩

వ్యా. ద్రాక్షపండు, ఖర్జూరపండు, చారపప్పు, రేగుపండు, దానిమ్మ, బ్రహ్మమేడిపండు, చిట్టీతపండ్లు, చెరకు, యవలు, అరువదినాళ్లసంబావులు ఈపదియును శ్రమహరములు. (శ్రమమును పోగొట్టునవి.) పైజెప్పినవి యైదువర్గములును జేరి కషాయపంచకము.

### లాజాదివర్గపంచకము; అందు దాహప్రశమనవర్గము.

మూ. లాజాచన్దనకాశ్మర్యఫలమధూకశర్కరానీలోత్పలోశీరశారిబాగుడూచీహ్రీబేరాణీతి దశేమాని దాహప్రశమనానిభవన్తి ౬౪

వ్యా. వరిపేలాలు, చందనము, నేలగుమ్ముడుకాయ, అతిమధురము, చక్కెర, నల్లకలువలు, వట్టివేరు, సుగంధపాల, తిప్పతీగె, కురువేరు ఈపదియును దాహప్రశమనములు (తాపమును శమింపజేయునవి).

### శీతప్రశమనవర్గము.

మూ. తగరాగరుధాన్యకశృఙ్గబేరభూతీకవచాకణ్టకార్యగ్నిమన్థశ్యోనాకపిప్పల్య ఇతి దశేమాని శీతప్రశమనాని భవన్తి. ౬౫

వ్యా. గ్రంథితగరము, అగరు, దనియాలు, శుంఠి, ఓమము, వస, వాకుడు, కూరనెల్లి, దుందిలము, పిప్పళ్లు ఈపదియును శీతప్రశమనములు (చలిని శమింపజేయునవి).

## ఉదర్దప్రశమనవర్గము.

మూ. తిన్దుకపియాలబదరఖదిరకదరసప్తపర్ణాశ్వకర్ణార్జునాసనారిమేదా ఇతి దశేమాన్యుదర్దప్రశమనాని భవన్తి. ౬౬

వ్యా. తుమికిపండు, చారపప్పు, రేగుపండు, చండ్ర, వెలిచండ్ర, ఏడాకులపొన్న, ఏపిచెట్టు, మద్ది, వేగిచెట్టు, నల్లతుమ్మ ఈపదియును ఉదర్దప్రశమనములు. (కణుదురీగెలు కుట్టినవిధముగ జనించుదద్దురులు ఉదర్దము అట్టిరోగమును శమింపజేయునవి యని భావము).

## అంగమర్దప్రశమనములు.

మూ. విదారిగన్ధాపృశ్నిపర్ణీబృహతీకణ్టకారికైరణ్డకాకోలీచన్దనోశీరైలామధూకానీతి దశేమాన్యఙ్గమర్దప్రశమనాని భవన్తి. ౬౭

వ్యా. ముయ్యాకుపొన్న, కోలపొన్న, ములక, వాకుడు, ఆముదము, కాకోలీ, చందనము, వట్టివేరు, ఏలకులు, అతిమధురము ఈపదియును అంగమర్దప్రశమనములు (ఒడలినొప్పులను శమింపజేయునవి).

## శూలప్రశమనవర్గము.

మూ. పిప్పలీపిప్పలీమూలచవ్యచిత్రకశృఙ్గబేరమరిచాజమోదా ఽజగన్ధాఽజాజీగణ్డీరాణీతి దశేమాని శూలప్రశమనాని భవన్తి ఇతి పఞ్చకః కషాయవర్గః. ౬౮

వ్యా. పిప్పళ్లు, మోడి, చవ్యము, చిత్రమూలము, శుంఠి, మిరియాలు, ఓమము, వాయింట, జీలకర, సముద్రపుసురుగు ఈపదియును శూలప్రశమనములు (శూలరోగమును శమింపజేయునవి). పైజెప్పిన లాజాదివర్గములైదును జేరి కషాయవర్గపంచకము.

## మధ్వాదివర్గపంచకము; అందు శోణితస్థాపనవర్గము.

మూ. మధుమధుకరుధిర మోచరసమృత్కపాలలోధ్రగైరికప్రియఙ్గుశర్కరాలాజా ఇతి దశేమాని శోణితస్థాపనాని భవన్తి. ౬౯

వ్యా. తేనె, అతిమధురము, కుంకుమపువ్వు, బూరుగబంక, కుండపెంకు, లొద్దుగు, గైరికము (కావిరాయి), ప్రేంకణము, చక్కెర, వరిపేలాలు ఈపదియును శోణితస్థాపనములు (రక్తమును శుభ్రపరచి నిల్పునవి).

## వేదనాస్థాపనవర్గము.

మూ. సాలకట్ఫలకదమ్బ పద్మకుమ్భుదమోచరసశిరీషవఞ్జుళైలావాలు
కాశోకా ఇతి దశేమాని వేదనాస్థాపనాని భవన్తి. ౨౦

వ్యా. ఏపిచెట్టు, కాయఫలము, కడిమిచెట్టు, తామరగడ్డ, కలువలు, బూరుగుబంక, దిరిసెనము, నీటిప్రబ్బలి, నూగుదోస, అశోకము ఈపదియును వేదనాస్థాపనములు (శరీరమున కల్గినవేదనను నివర్తిజేసి సుఖమున నుంచునది).

## సంజ్ఞాస్థాపనములవర్గము.

మూ. హిఙ్గుకైడర్యారిమేదావచాచోరకవయస్థాగోలోమీజటిలా
పలఙ్కషాశోకరోహిణ్య ఇతి దశేమాని సంజ్ఞాస్థాపనాని
భవన్తి. ౨౧

వ్యా. ఇంగువ, కాయఫలము, నల్లతుమ్మ, వస, గడ్డిదవనము, వల్లారియాకు, తెల్లనిగటిక, జటామాంసి, గుగ్గిలము, అశోకరోహిణి ఈపదియును సంజ్ఞాస్థాపనములు (శరీరముపై ప్రజ్ఞ నిల్పునవి).

## ప్రజాస్థాపనముల వర్గము.

మూ. ఐన్ద్రీబ్రాహ్మీశతవీర్యాసహస్రవీర్యాఽమోఘావ్యథాశివా రిష్టా
వాట్యపుష్పీవిష్వక్సేనకాన్తా ఇతి దశేమాని ప్రజాస్థాపనాని
భవన్తి. ౨౨

వ్యా. వెఱ్ఱిపాపర, వల్లారియాకు, గటిక, తెల్లగటిక, లక్ష్మణపంజి, తిప్పతీగె, కరకకాయలు, వేము, పచ్చముత్తావపులగము, ప్రేంకణము ఈపదియును ప్రజాస్థాపనములు (సంతానమునకు ప్రతిబంధకమైనదోషమును హరించి సంతతి కల్గించునవి).

## వయస్థాపనములు.

మూ. అమృతాభయాధాత్రీముక్తాశ్వేతాజీవన్త్యతిరసామణ్డూకపర్ణీ
స్థిరాపునర్నవా ఇతి దశేమాని వయస్థాపనాని భవన్తి. ఇతి
పంచకః కషాయవర్గః. ౨౩

వ్యా. తిప్పతీగె, కరకకాయలు, ఉసిరికకాయలు, సన్నరాష్ట్రము, దుంపరాష్ట్రము, పాలకూర, పిల్లిపీచర, వల్లారియాకు, ముయ్యాకుపొన్న, గలిజేరు ఈపదియును వయస్థాపనములు (ముసలితనమును రానీయక వయసును నిలుపునవి). పైజెప్పిన మధ్వాదిగణము మొదలుజేసి యైదును వర్గపంచకము.

ప్రకరణోపసంహారము.

మూ. ఇతి పఞ్చకషాయశతాన్యభిసమస్య పఞ్చాశన్మహాకషాయాః మహతాం చ కషాయాణాం లక్షణోదాహరణార్థం వ్యాఖ్యాతా భవన్తి. ౨౪

వ్యా. ఇత్తెరంగున జీవకాదిద్రవ్యము లొక్కొకటి యొక్కొకకషాయమువంతున యేనూరు కషాయములను, ఇదేసికషాయమును నొక్కొక వర్గమువంతున సంగ్రహించి యేబది మహాకషాయములు మందమతులకు విశదముగ తెలియుటకును, తీవ్రమతులకు ఆయాప్రయోగములయం దుదహరించుటకును, అట్టివర్గములకు జీవనీయబృంహణీయాది సంకేతముల నొనర్చి వివరముగ జెప్పబడినవి.

(జీవంతి మున్నగునవి యొక్కొకటిగ లెక్కడిన యైదువందల కషాయములగును. వానిని ఇదేసి నొక్కొకవర్గముగ పరిగణనముచేసి, అట్టిగణములకు జీవనీయము బృంహణీయము మున్నగుసంజ్ఞలజేసి అట్టివర్గములకు మహాకషాయములు అని సంకేతములజేసి అవియే పైన వివరింపబడినవి. పైజెప్పినకషాయమహాకషాయభేదములు మందమతులకు కషాయభేదములు సులభముగ దెలియుటకును, బుద్ధిమంతులకు ఆయాయోగములయందు దృష్టాంతముగను సౌకర్యముగ నుండుటకై చెప్పబడినవని భావము).

మూ. న హి విస్తరస్య ప్రమాణమస్తి, న చాప్యతిసంక్షేపో ఽల్పబుద్ధీనాం సామర్థ్యాయోపకల్పతే; తస్మాదనతిసంక్షేపేణ అనతివిస్తరేణ చోపదిష్టాః, ఏతావన్తో హ్యలమల్పబుద్ధీనాం వ్యవహారాయ, బుద్ధిమతాం చ స్వాలక్షణ్యానుమానయుక్తికుశలానామనుక్తార్థజ్ఞానాయేతి. ౨౫

వ్యా. లోకమున నుపయోగ్యములగు కషాయద్రవ్యముల నన్నిటిని చెప్పవలెనన్నచో అట్టిద్రవ్యములు అనంతములగుటంజేసి విస్తరింప నలవికాదు. అటుగాక కషాయద్రవ్యములలో రెంటిమూటిమాత్రము నిర్దేశించినచో మిక్కిలి స్వల్పమతులగు వారికి చికిత్సావ్యవహారమునకు సమర్థములు కానోపదు. కావున మిక్కిలి సంక్షేపంబును

మిక్కిలి విస్తరంబునుగాక పైజెప్పినవిధముగ జీవంతి మున్నగు అవయవభేదములచే నైదువందల కషాయములును, జీవనీయాది వర్గభేదముచే నేబది మహాకషాయములును విభజించి చెప్పబడినవి. ఇట్లు చెప్పుటచేత మందమతులైన చికిత్సకులకు చికిత్సాసమయమునందు వ్యవహరించుటకును, వస్తుస్వరూప రసగుణవీర్యవిపాకాదుల జక్కగ దెలిసి అట్టిరసాదులచే ననుమానించి (ఊహించి) యోగముల గల్పింప కుశలులగు వైద్యవరులకు, పైనిజెప్పబడని తక్కిన ద్రవ్యముల దెలిసికొనుటకును పైజెప్పిన నాతివిస్తరసంక్షేపరూపమైన కషాయద్రవ్యవిభాగము సమర్థమై యుండునుకావున పైజెప్పిన విభాగము సార్థకమగునని భావము.

బుద్ధిమంతులగువైద్యులు జీవకఋషభకాదిద్రవ్యములయందు స్నిగ్ధశీతమధురాదిగుణవిశేషములచే జీవనాది క్రియలజేయుటను పలుమారు గమనించి నిర్ణయించి, అట్టిగుణములుకల తక్కిన ద్రాక్షాక్షీరము మున్నగుద్రవ్యములును జీవకాదులకు సజాతీయములు కాన నవియును జీవనసాధనములగునని యనుమానించి ఆయా యోగముల జేర్పవలనుపడును; కావున పైజెప్పినవిభాగము సమంజసమని భావము.

మూ. ఏవంవాదినం భగవన్తం ఆత్రేయమగ్నివేశ ఉవాచ:—

నైతాని భగవన్! పఞ్చ కషాయశతాని పూర్యన్తే; తాని తాని హ్యేవాఙ్గాన్యుపప్లవన్తే తేషు తేషు మహాకషాయేష్వితి. ౭౬

వ్యా. ఇత్తెరంగున జెప్పిన యాత్రేయమహర్షిని అగ్నివేశుడు ఇట్లడిగెను:—భగవంతుడైన యోమహాత్మా! పైజెప్పినవర్గములలో నొకవర్గమున జెప్పిన కొన్నిద్రవ్యములు తదితరములగు నితరద్రవ్యములలో పలుమరు పరిగణింపబడినవి; కావున నైనువందలను సంఖ్యానియమము పూర్తికానేరదు. అని అగ్నివేశుడు ఆత్రేయునితో జెప్పెను.

(జీవకము ఋషభకము కాకోళి మున్నగుద్రవ్యములు కొన్ని, జీవనీయబృంహణీయ శుక్రజననాదివర్గములయందు పలుమారు చెప్పబడినవి. ఒకవర్గమున జెప్పినవానినే మాటిమాటికి వేరొండువర్గముల బఠించుటంజేసి ఐదువంద లనుసంఖ్యకు తక్కువయగును అని అగ్నివేశుని ప్రశ్నించెనని భావము.)

మూ. తమువాచ భగవానాత్రేయః:—నైతదేవం బుద్ధిమతా ద్రష్టవ్యమగ్నివేశ! ఏకోఽపి హ్యనేకాం సంజ్ఞాం లభతే. కార్యాన్తరాణి కుర్వన్. తద్యథా:—పురుషో బహూనాం కర్మణాం కరణే సమర్థో భవతి. స యద్యత్కర్మ కరోతి, తస్య తస్య కర్మణః

కర్తృకరణకార్యసంప్రయుక్తం తత్తద్గౌణం నామవిశేషం ప్రాప్నోతి. తద్వదౌషధద్రవ్యమపి ద్రష్టవ్యమ్. యది చైకమేవ కిఞ్చిద్ద్రవ్య మాసాదయామః తథాగుణయుక్తం యత్సర్వ కర్మణాం కరణే సమర్థం స్యాత్, కస్తదన్యదిచ్ఛే దుపధారయితు ముపదేష్టుం వా శిష్యేభ్య ఇతి. ౭౭

వ్యా. పైజెప్పినరీతిగ ప్రశ్నజేసిన యగ్నివేశున కాత్రేయుం డిట్లుత్తరము చెప్పెను:—ఓయగ్నివేశా! బుద్ధిమంతు డీలాగున చెప్పుట యుక్తియుక్తము కానోపదు. అది యేలయన: లోకమున నొకపురుషుడు అనేకములగుపనులసేయ సమర్థుడుగ నుండును. అట్టి పురుషుడు ఏయేపనిచేయునో ఆయాపనులకును సాధనములకు సంబంధించిన గౌణనామధేయముచే పిలువంబడును. (ఎట్టులన ఒకపురుషుడు వంట జేయుటకును, కుండలజేయుటకును, నేతపనులజేయుటకును సమర్థుడుగ నున్నచో నాయాపనులనుపట్టి వంటవాడనియు, కుంభకారుడనియు, నేతగాడనియు లోకులచే బిలువంబడును.) అట్టులే ఒకద్రవ్యము అనేకకార్యములజేయ సమర్థమైనచో నదియును క్రియాభేదముచే పలువిధములైననామములచే పిలువంబడును. (ఎట్టులన: క్షీరకాకోళియొక్కటి జీవనబృంహణశుక్రజననాదిక్రియలజేయ సమర్థముగ నున్నదికావున అట్టిగుణవిశేషమునుబట్టి జీవనీయగణమునందును, బృంహణీయగణమునందును, శుక్రజననగణమునందును జేర్పబడును.

మరియు నొకేద్రవ్యము పైజెప్పినరీతిగ జీవనాదికార్యముల ననేకముల జేయునది తటస్థమైనపుడు దానిని విడచి యప్రధానమైన వేరొండుద్రవ్యమును నిర్ణయించుటకైనను, శిష్యుల కుపదేశించుటకైనను ఎవ్వరైన నిచ్ఛగొందురా? (అనేకకార్యముల జేయ సమర్థమైన యొకవస్తువునే గ్రహించుట మిక్కిలి సమంజసమని భావము.)

### అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః:—

యతో యావన్తి యైర్ద్రవ్యైః విరేచనశతాని షట్,
ఉక్తాని సఙ్గ్రహేణేహ తథైవైషాం షడాశ్రయాః. ౭౮
రసా లవణవర్జ్యాశ్చ కషాయ ఇతి సంజ్ఞితాః,
తస్మాత్పఞ్చవిధా యోనిః కషాయాణా ముదాహృతా. ౭౯

మహతాం చ కషాయాణాం పఞ్చాశత్పరికీర్తితాః. ౮౦
పఞ్చ చాపి కషాయాణాం శతాన్యుక్తాని భాగశః,
లక్షణార్థం ప్రమాణం హి విస్తరస్య న విద్యతే. ౮౧
న చాలమతిసంక్షేపః సామర్థ్యాయోపకల్పతే,
అల్పబుద్ధేరయం తస్మాత్ నాతిసంక్షేపవిస్తరః. ౮౨
మన్దానాం వ్యవహారాయ బుధానాం బుద్ధివృద్ధయే,
పఞ్చాశత్కో హ్యయం వర్గః కషాయాణా ముదాహృతః. ౮౩
తేషాం కర్మసు బాహ్యేషు యోగమాభ్యన్తరేషు చ,
సంయోగం చ ప్రయోగం చ యో వేద స భిషగ్వరః. ౮౪

వ్యా. ఆరువందలవిరేచనౌషధములలో నేయేయౌషధమువలన నెన్నెన్నివిరేచనయోగము లేర్పడునో, అయ్యవి యేద్రవ్యములచే గల్పింపనగునో వానివివరణంబును; అట్టివిరేచనముల కాశ్రయములైన త్వక్కు, పత్రము, పుష్పము, ఫలము, మూలము, క్షీరము ననుషడంగములును వరుసగ నీయధ్యాయమున సంగ్రహింపబడినవి.

మరియు మధురాదిరసములలో లవణ మొక్కటిదక్క తక్కినయైదురసంబులును వేరువేరుగ గలకషాయము లైదుగ నుండును; కావున వానిపుట్టుకకు కారణములైన మధురామ్లకటుకషాయతిక్తరసంబులైదును కషాయోత్పత్తికారణములని సంగ్రహముగ జెప్పబడినది.

మరియు స్వరసాదికషాయకల్పనభేదములైదును, ఏబదిమహాకషాయవర్గంబులును, ఐదువందలకషాయంబులును, విస్తరముగ జెప్పుటకు పారములేదు కావున వాని లక్షణమును గుర్తించుటకై యల్పబుద్ధులకు గోచరమగుటకును, బుద్ధిమంతులకు బుద్ధివికాసము నొందుటకును అనువగునట్లు అతివిస్తరంబును, అతిసంక్షేపంబును గాకుండునట్లు పైజెప్పిన విధముగ నేబదిమహాకషాయవర్గములు వివరింపబడినవి.

మరియు పైజెప్పిన ఆరువందలవిరేచనయోగములను, ఐదువందలకషాయములను, బాహ్యాభ్యంతరకర్మలయందు సంయోగప్రయోగములను వివరముగ నెవ డెరుంగుదురో అట్టివైద్యవరుడు భిషగ్వరుడని చెప్పబడును. ఇదియ యధ్యాయవిషయసంగ్రహము.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
షడ్విరేచనశతాశ్రితీయో నామ చతుర్థోఽధ్యాయః.
ఇతి భేషజచతుష్కః.

వ్యా. అగ్నివేశకృతంబును చరకమహర్షిచే సంస్కరింపబడినదియు నగుచరకసంహిత యనునాయుర్వేదతంత్రమున సూత్రస్థానంబున షడ్విరేచనశతాశ్రితీయమను నది నాల్గవయధ్యాయము.

ఇది భేషజచతుష్కము.

---

## (స్వస్థవృత్తచతుష్కము.)

### పంచమాధ్యాయము.

అవతారిక:—రోగపీడితులకు రోగమును నివృత్తిజేసి యారోగ్యమును కల్గించుటయు, రోగములు లేక స్వస్థత నుండువారలకు అట్టియారోగ్యమును చెడనీయక పరిపాలించుటయు, నీరెండును ఆయుర్వేదశాస్త్రమునకు ప్రయోజనములు. అందు మొదటిది యాతురవృత్తమనియు, రెండవది స్వస్థవృత్తమనియు చెప్పబడును. ఈవిషయమునే "స్వస్థాతురపరాయణమ్" అని తంత్రకారు లుపదేశించిరి. అందు జనించినవ్యాధికి ప్రతీకారము నొనరించి రోగులకాపాడునట్టి భేషజచతుష్కము పైయధ్యాయముల నాల్గిటిలో సంగ్రహముగ జెప్పబడినది. రెండవదియగు స్వస్థవృత్తము చెప్పవలసియున్నది. అయ్యది మాత్రాశనము, ఋతుచర్య, వేగనిరోధనిషేధము, ఇంద్రియముల కనుగుణములగు నియమములు అనునాల్గును ఆవశ్యకములు. ఇవియే స్వస్థచతుష్క మనబరంగు. ఈ నాల్గును స్వాస్థ్యపరిపాలనమునకు ముఖ్యకారణములు. ఈనాల్గిటిలో మాత్రాశనము (పరిమాణము ననుసరించి యాహారము జేయుట) ప్రధానము. ఈవిషయమునే "ప్రాణినాం పునర్మూలమాహారోబలవర్ణౌజసాం చ" అని "తచ్చేహ మాత్రావదశ్నం విధీయతే" అని చెప్పబడినది. (పరిమాణవిశిష్టమైన యాహారపదార్థముల భుజించినచో నట్టియాహారము బలమునకు వర్ణమునకును, ఓజస్సునకును ముఖ్యకారణములై యుండునని భావము.) పైజెప్పిన స్వస్థవృత్తచతుష్కములో నాహారపరిమాణనియమము ప్రధానమగుటంజేసి అట్టి యాహారపరిమాణము దెల్పుమాత్రాశితీయమను నధ్యాయము చెప్పబడుచున్నది:—

మూ. అథాతో మాత్రాశితీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. మాత్రాశితమును అధికరించినయధ్యాయము మాత్రాశితీయము; అట్టిమాత్రాశితీయ మనునధ్యాయమును వివరముగ జెప్పెదను; అద్దానిని భగవంతుడైన యాత్రేయమహర్షి నాకుపదేశించిన ధ్యానుపూర్వికి న్యూనాతిరేకము గాకుండునట్లు యథాశ్రుతముగ వివరించెదనని భావము.

ఈయధ్యాయప్రారంభమున 'మాత్రాశీ' యని యుపక్రమింపబడినది; అయినను సుఖోచ్చారణమునకు అట్టియర్థమునే దెల్పునట్టిమాత్రాశితశబ్దమును జేర్చి మాత్రాశితీయ మనుసంజ్ఞ చెప్పబడినది.

ఇచ్చట అశితశబ్దము ఖాద్య-లేహ్య-పేయ-ప్రాశ్యములకు సామాన్యబోధకము. అట్టిచతుర్విధాహారపదార్థముల భుజించుట యనునర్థమును అశితశబ్దముచే బోధ్యము. అట్టి చతుర్విధాహారముల నుపయోగించుట ప్రమాణము ననుసరించి యుండవలెను. ప్రమాణము ననుసరించి యాహారపదార్థములను తినునట్టిపద్ధతిని బోధించునధ్యాయము మాత్రాశితీయము అని యర్థము. ఈయధ్యాయమున ఖాద్య (నమలి తినదగినది), ప్రాశ్య (నమలకయే తినదగినది), లేహ్య (నాలుకచే చప్పరించి తినదగినది), పేయ (మిక్కిలి ద్రవరూపమగుటంజేసి త్రాగదగినది.) భేదములచే నాల్గుతెరంగులైన యాహారపదార్థములను యుక్తపరిమాణముతో భుజించుపద్ధతి జెప్పబడునని ముఖ్యాభిప్రాయము.

## మాత్రసామాన్యలక్షణము.

మూ. మాత్రాశీ స్యాత్, ఆహారమాత్రా పునరగ్నిబలాపేక్షిణీ. 3

వ్యా. మనుజుడు పరిమాణముననుసరించి పైజెప్పిన చతుర్విధాహారపదార్థములను భుజించుస్వభావము కల్గియుండవలెను. అట్టి యాహారపదార్థముల పరిమాణము మాత్రము జాఠరాగ్ని బలముయొక్క యుత్తమ - మధ్యమ - అల్పరూపమైన పరిస్థితినిబట్టి తత్తదనుసారముగ (ఉత్తమాగ్ని కుత్తమపరిమాణంబును, మధ్యమాగ్నులగు మధ్యమపరిమాణంబును, అల్పాగ్నుల కల్పపరిమాణంబును) మారుచుండును.

ఇచ్చట—"ఆహారమాత్రా పునః" అని చెప్పుటచేత ఆహారపదార్థముల పరిమాణము మాత్రము అగ్నిబలము ననుసరించి యుండునుగాని, ఔషధపరిమాణంబును వ్యాయామపరిమాణంబును జాఠరాగ్నిబలమును అపేక్షింపదని యర్థమగును. ఇట్లు చెప్పుటచేత ఔషధపరిమాణము రోగిబలమును రోగముయొక్కబలమును అనుసరించి యుత్తమ-మధ్యమ - అల్పమాత్రల గల్పింపవలెనుగాని అగ్నిబలము అపేక్షితము గాదని యెరుంగునది.

లేక 'పునః' అనుదానికి మాటిమాటి కని యర్థము. ఆహారపరిమాణమును అగ్నిబలానుసారముగ మాటిమాటికి మార్చి కల్పింపవలెనని యర్థము. ఎట్లనగా:—ఒకేపురుషునకు బాల్యయౌవన వృద్ధత్వవయోభేదముచేతను, హేమంతాది ఋతుభేదముచేతను అగ్నిబలము ఎచ్చుతగ్గులుగ మారుచుండునుగాని యొకేపద్ధతి నుండదు. కావున అట్టి యగ్నిబలమును గమనించి ఆయాకాలమునందు తదనుసారముగ అప్పుడప్పుడు నాహార

పరిమాణమును మార్చవలెనుకాని ఒకప్పుడు నిర్ణయించిన పరిమితియే యెప్పటికిని యుండదు.

ఇత్తెరంగుననే వ్యాయామమాత్రయుం దోషాది బలతారతమ్యమునుబట్టి నిర్ణయింప నగునుకాని అగ్నిబలమును గమనింపదగదు.

మాత్రకు అగ్నిబలాపేక్షిత్వనిర్ణయము.

**మూ. యావద్ధ్యస్యాశనమశితమనుపహత్య ప్రకృతిం యథాకాలం జరాం గచ్ఛతి తావదస్య మాత్రాప్రమాణం వేదితవ్యం భవతి.**

వ్యా. పైజెప్పిన నాల్గువిధములైన యాహారపదార్థము నెంత పరిమాణముతో సేవించినచో భుజించినమనుజునకు వాతాదిదోషంబులును రసాదిధాతువులును చెడక స్వభావస్థితినుండి, జీర్ణమునకు నిర్ణీతమైన ప్రభాతకాలమునకు జీర్ణము సుఖముగ నగునో అంతపరిమాణము ఆమనుజునకు మాత్రాపరిచ్ఛిన్నమైనదని యర్థము.

(ఏమనుజుడు ఎంతపరిమితిగల యాహారమును భుజించినచో వాతాదిదోషంబులును రసాదిధాతువులు వికృతిజెందక తమతమ వ్యాపారములయందు నిర్దుష్టములై యుండి నిశాంతసమయమున జీర్ణమగునో అట్టిపరిమితి యామనుజునకు సరియైన మాత్రాప్రమాణము కలదియని యూహించునది.) ఇత్తెరంగున ప్రతిమనుజునకును అగ్నిబలమును గమనించి మాత్రాప్రమాణమును నిర్ణయింపవలెనుగాని, ఒకనికి నిర్ణయించినపరిమాణము వేరొకనికి సరిపడదని భావము.

మరియుం మాత్ర యనునది సర్వగ్రహరూపయనియు, పరిగ్రహరూపయనియుం రెండువిధములు. అందు మధురాదిమద్రసవిశేషములతో గూడిన యాహారసముదాయమునకు సంబంధించినదిసర్వగ్రహరూపమాత్ర. అట్టి యాహారసముదాయమునకు అవయవములైన మధురాదిరసవిశేషపదార్థములకు ప్రత్యేకముగ జెప్పబడిన పరిమాణము పరిగ్రహరూప యనబడును. అట్టియెడ ఆహారసముదాయమునకు విహితమైన మాత్రాపరిమాణము కల్గియున్నను, ఆహారావయవములు స్వభావముచే హితములైయున్నను వానికి విహితములైన మాత్రాపరిమాణము వ్యత్యస్తమైయున్నచో నట్టియాహారమును భుజించుటవలన వాతాదిదోషములు వికృతినొందును. అట్టి యాహారము యథాకాలమున జీర్ణమును కానేరదు; కావున నాహారావయవములైన మధురాదిరసములకు విహితమైన పరిమాణముతో గూర్పబడిన యాహారసముదాయమును మాత్రాప్రమాణము కల్పించి భుజింపనగును.

ఈయర్థమును దెల్పుటకై "ప్రకృతి మనుపహత్య జరాం చ గచ్ఛతి" అని విశేషవిధిగ జెప్పబడినది.

### ద్రవ్యభేదముచే మాత్రాభేదనిర్ణయము.

మూ. తత్ర శాలిషష్టికముద్గలావకపిఞ్జలైణశశశరభశమ్బరాదీన్యాహార
ద్రవ్యాణి ప్రకృతిలఘూన్యపి మాత్రాపేక్షీణి భవన్తి. తథా
పిష్టేక్షుక్షీరవికృతిమాషానూపౌదకపిశితాదీన్యాహారద్రవ్యాణి
ప్రకృతిగురూణ్యపి మాత్రామేవాపేక్షన్తే. ౫

వ్యా. అట్టి యాహారద్రవ్యములలో రాజనములు, అరువదినాళ్ల సంబావులు, పెసలు, లావుకపిట్ట, కపింజలము, జింక, కుందేలు, శరభము, ఎఱ్ఱనిజింక మొదలగు జంతువులమాంసములు మున్నగు నాహారద్రవ్యములు స్వాభావికముగనే లఘువుగ నున్నను ప్రమాణము ననుసరించియే యుండును (పైజెప్పిన ద్రవ్యములను ప్రమాణము నతిక్రమించి భుజింప దగదని భావము). మరియు పిండితో జేయబడినపదార్థములు, బెల్లము మున్నగు మధురద్రవ్యములచే జేయబడినపదార్థములు, పాలచే జేరినపదార్థములు, మినుములు, జలప్రాంతములనుండు జంతువులమాంసములు ఇవిమున్నగు నాహారద్రవ్యములు ప్రకృతిచేతనే గురువులై ప్రమాణము ననుసరించి యుండును.

### గురులఘుద్రవ్యముల ప్రత్యేకప్రయోజనము.

మూ. న చైవముక్తే ద్రవ్యే గురులాఘవమకారణం మన్యేత, లఘూ
ని హి ద్రవ్యాణి వాయ్వగ్నిగుణబహులాని భవన్తి, పృథ్వీసోమ
గుణబహులానీతరాణి, తస్మాత్స్వగుణాదపి లఘూన్యగ్నిసన్ధు
క్షణస్వభావాన్యల్పదోషాణి చోచ్యన్తేఽపి సౌహిత్యోప
యుక్తాని, గురూణి పునర్నాగ్నిసన్ధుక్షణస్వభావాన్యసామాన్యా
దతశ్చాతిమాత్రం దోషవన్తి సౌహిత్యోపయుక్తాన్యన్యత్ర
వ్యాయామాఽగ్నిబలాత్, సైషా భవత్యగ్నిబలాపేక్షిణీ
మాత్రా. ౬

వ్యా. పైవాక్యములచేత లఘుగుణము కలద్రవ్యములును, గురుగుణము కల ద్రవ్యములున్ను కూడ నగ్నిబలతారతమ్యానుగుణముగ మాత్రాపరికల్పనము నపేక్షించి యుండునని యేర్పడినది. ఇట్లు చెప్పుటచేత గురులఘుద్రవ్యములు రెండును మాత్రానుసారముగ భుజింపబడి హితకరములగునని స్పష్టమైనది కావున ద్రవ్యములయందు గురులఘుగుణముల భేద మెందుకు జెప్పవలెనన్నచో నీవివరము నెరుంగునది— ద్రవ్యములన్నియు పంచభూతాత్మకము లైయున్నను లఘుద్రవ్యములు వాయువుయొక్కయు

అగ్నియొక్కయు (తేలిక వేడిమి) గుణముల నధికముగ గల్గియుండును; గురుద్రవ్యములు భూమియొక్కయు జలముయొక్కయు గుణములు (భారము చలువ) అధికముగ గల్గియుండును. అందు లఘుద్రవ్యములు తమకు స్వాభావికములైన (అగ్నిని వృద్ధినొందింప నను వైన) వాయ్వగ్నిగుణములచేత (తృప్తిగ) సౌహిత్యముగ భుజించినను స్వల్పముగ దోషమును గల్గించును. గురుపదార్థములను మాత్ర ననుసరింపక సౌహిత్యముగ (తృప్తిగ) భుజించినచో నయ్యవి తమయందలి (అగ్నిగుణములకు విరుద్ధములైన) పృథ్వీజలగుణములచేత నగ్నిని వృద్ధినొందింప సమర్థములు కానోపవు; కావున ప్రబలదోషమును కల్గించును. వ్యాయామముచే నగ్ని బలిష్ఠమైనపుడు మాత్రము గురుద్రవ్యములు పైజెప్పిన రీతిగ దోషప్రాబల్యమును చేయనేరవు కావున అట్టిసమయమున సౌహిత్యముగ నుపయోగించినను ప్రత్యవాయము లేదు. పైజెప్పిన కారణములచేత మాత్రాపరిమాణము జాఠరాగ్నిబలమునే ప్రధానముగ నపేక్షించియుండునని భావము.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—"గురూణా మర్ధసౌహిత్యం లఘూనాం నాతితృప్తతా, మాత్రాప్రమాణం నిర్దిష్టం" అని గురులఘుపదార్థముల మాత్రాపరిమాణము వాగ్భటాచార్యునిచే జెప్పబడినది. (గురుపదార్థములను అర్ధతృప్తి గల్గునట్లును, లఘుపదార్థములను కొంచెము తక్కువగ తృప్తికల్గునట్లును భుజింపవలెనని యర్థము). ఇదియే గురులఘుపదార్థములకు మాత్రానిర్ణయము). ఈనియమము ననుసరింపక పూర్ణముగ తృప్తిగల్గునట్లు భుజించినను లఘుపదార్థములు అగ్నివాయుగుణములు అధికముగ గల్గియుండుటవలన జాఠరాగ్నిని చెరుపకయే స్వల్పముగ దోషమును వృద్ధినొందించును. గురుపదార్థములన్నచో పైచెప్పిన మాత్రానియమమును అతిక్రమించి పూర్తిగ తృప్తి గల్గునట్లు భుజించినచో తనయందు అగ్నికి విరుద్ధములైన (అగ్నిని నశింపజేయు) పృథివీజలగుణములు కల్గియుండుటవలన అట్టిగుణములచే నగ్నిని మందగింపజేసి దోషములను ప్రబలముగ వృద్ధినొందించును. పైజెప్పిన మాత్రాప్రమాణమున నియమమునకై సకలద్రవ్యములకు గురులఘుగుణములు పేర్కొనబడినవి. అట్టి పరిమాణంబును అగ్నిబలమును అనుసరించియే యుండును; కావున "అగ్నిబలాపేక్షిణీ మాత్రా" అను ప్రతిజ్ఞకు భంగములేదు. గురులఘువిభావము సౌహిత్య (తృప్తి) భేదము నుద్దేశించి చెప్పబడెనుగాన నిరర్థము కానేరదు.

## ద్రవ్యాశ్రయమాత్రానిర్ణయము.

మూ. న చ నాపేక్షతే ద్రవ్యం. ద్రవ్యాపేక్షయా చ త్రిభాగసౌహిత్య మర్ధసౌహిత్యం వా గురూణా ముపదృశ్యతే; లఘూనామపి

చ నాతిసౌహిత్య మగ్నేర్వ్యక్త్యర్థం. మాత్రావద్ధ్యశన మశితం అనుపహత్య ప్రకృతిం బలవర్ణసుఖాయుషా యోజయత్యుప యోక్తా రమవశ్యమితి. 8

వ్యా. ద్రవ్యములయందలి గురులఘుగుణములనుబట్టి యాహారపరిమాణ మిట్లు నిర్ణయింపబడినది:—గురుపదార్థములను ముక్కాలుభాగమైన అర్ధభాగమైనను తృప్తి గల్గునట్లు భుజింపవలెను. లఘుద్రవ్యములను తృప్తి నతిక్రమింపక భుజింపవలెను. ఇట్టి నియమము జాఠరాగ్ని వ్యత్యస్థముగాక సమస్థితి నుండుటకై చెప్పబడినది. పైజెప్పిన ప్రకారము మాత్రానియమము ననుసరించి భుజింపబడినయాహారము రసాదిధాతువులను వాతాదిదోషములను చెరచక సమస్థితినుంచి భుజించినవారికి శరీరబలమును వర్ణమును సుఖమును ఆయువును అవశ్యముగ వృద్ధినొందించును. పైజెప్పినరీతిగ నేర్పడినసిర్ణయ మేమన:—అగ్నిబలమును కల్గించునట్టిద్రవ్యమును, దానగల్గినయగ్నిబలమును ఆశ్ర యించి మాత్రాపరిమాణ ముండును. అట్టిమాత్రానుసారముగ భుజింపబడినయాహారము శరీరబలాదులను వృద్ధినొందించి మనుజుని కాపాడును అని భావము.

ఇచ్చట నీవిమర్శనము నెరుంగునది:—గురుపదార్థములు అగ్నికి విరుద్ధమైన (అగ్నిని నశింపజేయునట్టి) పృథివి జలగుణములు కల్గియుండుటంజేసి అట్టి యగ్నిని కాపాడుటకై మాత్రాపరిమాణము నతిక్రమించి భుజింపదగదని అతిమాత్రనిషేధము యుక్తియుక్తమగును. లఘుద్రవ్యములు అగ్ని కనుగుణమైన వాయ్వగ్నిగుణములు కల్గి యుండుటవలన అగ్నికి సమానగుణములచే నగ్నివృద్ధి నొందింపవలెను. వానిని అతిమాత్ర ముగ భుజించినచో జాఠరాగ్ని వృద్ధినొందవలెనుకాని నశింపదు. అట్టి లఘుపదార్థముల కేల అతిమాత్రాశనమును నిషేధింపవలెను? అన్నచో నీసమాధానము నెరుంగు నది:—చక్షురింద్రియము తేజస్స్వభావముకల్గినది. తేజోవంతములగు సూర్యచంద్రాది సంబంధముచే తనశక్తి (చూచుశక్తి) వృద్ధినొంది ఘటపటాదిపదార్థముల జూడగల్గును. అట్టి తేజఃపుంజములయతియోగము సంభవించినయప్పుడు సమానగుణములైనను వాని సంబంధాతియోగమునంజేసి బొత్తుగ చెడిపోవును. ఈలాగుననే ప్రకృతమున లఘు పదార్థములు అగ్నికి సమానగుణములైనను అతియోగమునంజేసి గుణసామ్యమును గూడ తిరస్కరించి జఠరాగ్నిని మందగింపజేయును. కావున లఘుపదార్థములకును అతిమా త్రోపయోగమును నిషేధించుట సమంజసమగును. ఈవిషయ మిట్లు శాలాక్యతంత్రమున జెప్పబడినది:—

"యత్తేజో జ్యోతిషాం దీప్తం శారీరం ప్రాణినాం చ యత్, సంయుక్తం తేజసా తేజః తద్రూపాణి పశ్యతి. తదేవ చక్షుస్త్వేవ జ్యోతీంష్యతితు పశ్యతః, వికారం భజతేఽత్యర్థం అథవాపి వినశ్యతి. శస్త్రస్యాశ్మా యథాయోనిః నిశితం చ తద శ్మని, తీక్ష్ణం భవత్యతీయోగాత్ తత్రైవ ప్రతిహన్యతే."

అగ్నిని చెరచకుండునట్లు ద్రవ్యనిష్ఠ లఘుగురుగుణముల కనుగుణముగను, దాని వృద్ధినొందిన యగ్నిబలమున కనుగుణముగను మాత్రాపరిమాణమును గల్పింపవలె ననియు, అట్టిమాత్ర అగ్ని కనుగుణమైనద్రవ్యమును, దానగల్గిన జాఠరాగ్నిబలమును అనుసరించియుండుననియు ముఖ్యభావము.

మరియు పైజెప్పినప్రకారము యుక్తమాత్రానుసారముగ భుజింపబడిన యాహారముకూడ దాన జనించుబలాదులకు విరుద్ధములైన కాలవిపర్యయము అసాత్మ్యములైన శబ్దస్పర్శరూపరసగంధాదులు మున్నగువానిసంబంధము లేకుండునప్పుడు బలవర్ణాదుల గల్గించునుకాని, వానిసంబంధము కల్గినప్పుడు సమర్థము కానోపదు.

### ఉక్తార్థానువాదము.

మూ. భవతి చాత్ర:—

గురు పిష్టమయం తస్మాత్ తణ్డులాన్ పృథుకానపి,
న జాతు భుక్తవాన్ ఖాదేత్ మాత్రాం ఖాదేద్బుభుక్షితః. ౮

వ్యా. పిండితో జేయబడినపదార్థములు గురుత్వము కల్గియుండును. కావున అట్టి పిండివంటకములన్ను, అటుకులను, బియ్యమును ఒకప్పుడును భుజించినపిదప తినకూడదు. ఆకలిగొనియున్నపుడు మాత్రాపరిమాణము ననుసరించి అపాయము లేకుండ తినదగును.

తంత్రకారుడు విపులముగ వివరించినవిషయమును మరల సంగ్రహముగ జెల్పునప్పుడు "భవతి చాత్ర శ్లోకః" అని యుపక్రమించి చెప్పునది యలవాటు. తక్కిన స్థలములయందును ఈవిషయమును గమనించునది.

### అలవాటుగ భుజింపదగని పదార్థములు.

మూ. వల్లూరం శుష్కశాకాని శాలూకాని బిసాని చ,
నాభ్యసేద్గౌరవాత్ మాంసం కృశం నైవోపయోజయేత్. ౯
కూర్చికాంశ్చ కిలాటాంశ్చ సౌకరం గవ్యమాహిషే,
మత్స్యాన్ దధి చ మాషాంశ్చ యవకాంశ్చ న శీలయేత్. ౧౦

వ్యా. ఎండినమాంసము, ఎండినకాయగూరలు, కలువదుంపలు, తామరదుంపలు, తామరకాడలు ఇవి గురుపదార్థములు కావున వీనిని ఎడతెగక వాడుకగా నుపయోగింపజనదు. వ్యాధిచే కృశించినజంతువులమాంసమును ఒకప్పుడు నుపయోగింపజనదు. మరియు కార్చిక (పాలుకాగుచున్నపుడు అందు సమభాగము పెరుగును జేర్చిన పాలు విరిగి గడ్డకట్టును. అదియే జున్ను), కిలాటము (పాలు ఇగురునట్లు కాచిన నది ముద్ద యగును. అదియే కిలాటము), పందిమాంసము, ఎద్దుమాంసము, ఎనుబోతుమాంసము, చేపలు, పెరుగు, ఉద్దులు, యవలు వీనిని విడువక యలవాటుగ భుజింపజనదు.

(కృశించినజంతువులమాంసమున సారముండదు కావున నిషేధింపబడినది).

## నియతమున నభ్యసింపదగినపదార్థములు.

మూ. షష్టికాన్ శాలిముద్గాంశ్చ సైన్ధవామలకే యవాన్,
ఆన్తరిక్షం పయస్సర్పిః జాఙ్గలం మధు చాభ్యసేత్. ౧౧

వ్యా. అరువదిదినములకు ఫలించునట్టివరిధాన్యము, రాజనములు, పెసలు, సైంధవ లవణము, ఉసిరికకాయలు, యవలు, అంతరిక్ష (ఆకసమునుండి వర్షించునప్పుడు క్రింద పడనీయక నడుమన గ్రహింపబడిన) జలము, ఆవుపాలు, నెయ్యి, జాంగల (అడవిప్రదేశమున సంచరించుజంతువుల), మాంసము, తేనె ఈపదార్థములను నిత్యము అలవాటుగ భుజింపదగును.

"త్రీణి ద్రవ్యాణి నాత్యుపయుఞ్జీత, పిప్పల్యో లవణం క్షారః." అనువాక్యమున లవణమును విశేషముగ భుజింపదగదని నిషేధింపబడినది కావున ప్రకృతమున ఆవాక్యమును విరోధము కాకుండునట్లు సైంధవమును మితముగ భోజ్యపదార్థములతో గూర్చి సంస్కరించి యుపయోగించవలెనని యర్థము చేయనగును.

## స్వాస్థ్యపరిపాలనక్రమము.

మూ. తచ్చ నిత్యం ప్రయుఞ్జీత స్వాస్థ్యం యేనానువర్తతే,
అజాతానాం వికారాణాం అనుత్పత్తికరం చ యత్. ౧౨

వ్యా. మరియు నేపదార్థము నుపయోగించుటచేత శరీరమున ధాతువులన్యూనాతిరేకములేక సమస్థితినుండునట్టి స్వస్థత (ఆరోగ్యము) చెడక నిల్కడగ నుండునో అట్టి పదార్థములను నియతముగ నుపయోగింపదగును. (శరీరమున స్వస్థతను చెడనీయక కాపాడునట్టివస్తువుల నియతముగ నుపయోగించవలెననుట).

మరియు శరీరమున నింతకుము న్నెన్నడును లేనివ్యాధులను కల్గించకుండుపదార్థములను నిత్యముగ నుపయోగింపదగును.

లోకమున దీపమును కాపాడుటకు వత్తి చమురులు మున్నగునవి ముఖ్యకారణములు. (దీపమును నశింపనీయక కాపాడునవి). అట్టిస్థితి చెడగొట్టునవి గాలి మిడుతలు మున్నగునవి. ఈరెంటిచేత దీపమును చెడనీయక కాపాడుట సమంజసము కదా. అవిధముగనే శరీరమున కల్గించుస్వస్థతను కాపాడుటకై పరిశుద్ధములగు నాహారవిహారాదుల నాచరింపవలెను. అట్టి స్వస్థతను చెడగొట్టుటకు కారణములైన యాహారవిహారాదుల వర్జింపవలెను. కావున నిచ్చట శ్లోకార్ధముచేత స్వస్థపరిపాలనపద్ధతియు, ఉత్తరార్ధముచేత రోగానుత్పత్త్యుపాయంబును చెప్పబడెనని యెరుంగునది.

### స్వస్థపరిపాలనమునకైన యభ్యంజనాదులు.

మూ. అత ఊర్ధ్వం శరీరస్య కార్యమభ్యఙ్జ (అఞ్జ్యంజ) నాదికమ్,
స్వస్థవృత్త మభిప్రేత్య గుణతస్సమ్ప్రవక్ష్యతే.   ౧౩

వ్యా. పిమ్మట స్వస్థపరిపాలనము నుద్దేశించి ముఖ్యముగ జేయదగిన శరీరాభ్యంజనము నేత్రాంజనము మున్నగువానిని వానిగుణములను ఈక్రింద వరుసగ వివరించెదనని యర్థము.

### నేత్రాంజనవిధి.

మూ. సౌవీర మంజనం నిత్యం హితమక్ష్ణోః ప్రయోజయేత్,
పఞ్చరాత్రేఽష్టరాత్రే వా స్రావణార్థే రసాంజనమ్.   ౧౪

వ్యా. సౌవీరాంజనమును (సుర్మారాయిని) కన్నులరెంటియందును ప్రతిదినమునను ప్రయోగించవలెను. కంటిలో చెడ్డనీరు మున్నగునవి చేరును కావున అట్టి చెడు పదార్థముల స్రవింపజేయుటకుగాను ఐదురాత్రుల కొకసారియైనను, ఎనిమిదిరాత్రుల కొకసారియైనను రసాంజనమును ప్రయోగించవలెను.

సువీరానదియందు పుట్టినది సౌవీరాంజనము. ఇచ్చట "అక్ష్ణోః" అని ద్వివచనము చెప్పుటచేత రెండుకండ్లయందును ఏకకాలమున ప్రయోగింపవలెనని తెలియనగును. 'పంచరాత్ర, అష్టరాత్ర' అనునది యుపలక్షకము; కావున కనులయందు దోషము కల్గినప్పుడును, కల్గనున్నప్పుడును రసాంజనము నుపయోగింపవలెనని తెలియునది.

మరియు "చక్షుః ప్రధానం సర్వేషా మిన్ద్రియాణాం విదుర్బుధాః, ఘనసీహార యుక్తానాం జ్యోతిషామివ భాస్కరః" అనుప్రమాణము ననుసరించి తేజోవంతములలో సూర్యుడు ప్రధానమగునట్లు ఇంద్రియసముదాయములో నేత్రేంద్రియము ప్రధానము కావున అంజనప్రకరణమున చక్షురంజనము ప్రధానముగ జెప్పబడినది.

### స్రావణాంజనోపయోగకాలము.

మూ. చక్షు స్తేజోమయం తస్య విశేషాచ్ఛ్లేష్మతో భయమ్,
దివా తన్న ప్రయోక్తవ్యం నేత్రయో స్తీక్ష్ణమంజనమ్. ౧౫
విరేకదుర్బలా దృష్టిః ఆదిత్యం ప్రాప్య సీదతి,
తస్మాత్స్రావ్యం నిశాయాం తు ధ్రువమంజనమిష్యతే. ౧౬
తతశ్శ్లేష్మహరం కర్మ హితం దృష్టేః ప్రసాదనమ్,

వ్యా. నేత్రములు తేజస్స్వరూపములు కావున అట్టి చక్షురింద్రియమునకు కఫమువలన భయము కల్గును; అట్టి కఫమువలనిబాధ కల్గకుండుటకై తీక్ష్ణమైనయంజనము నుపయోగించవలెను. అట్టి యంజనమును రాత్రులయందు ప్రయోగింపవలెను. స్రావణాంజనమును పగటిపూట యుపయోగించినచో కన్నీరుకారుటవలన బలహీనమైనదృష్టి సూర్యసందర్శనమునంజేసి మిక్కిలి క్షీణించును; కావున సూర్యప్రచారములేని రాత్రులయందే స్రావణాంజనము నుపయోగింపవలెనుగాని పగటియం దుపయోగింపంజనదు. స్రావణాంజనమును ప్రయోగించినపిదప శ్లేష్మహరంబును దృష్టికి నిర్మలత్వమును కల్గించునదియగు నగునుపచారముల జేయవలెను.

పైజెప్పినవిషయమునే జంతూకర్ణతంత్రమున చెప్పిరి:—"సప్తాహాద్రసాఞ్జనం నక్తమ్" శాలాక్యతంత్రమునను ఇట్లు చెప్పబడెను.—"విరేకదుర్బలా దృష్టిః ఆదిత్యం ప్రాప్య సీదతి. రాత్రౌ సుప్తగుణాచ్చాక్షి పుష్యత్యఞ్జనకర్శితమ్."

సౌవీరాంజనము రసాంజనమువలె తీవ్రముగాక సౌమ్యముగ నుండును. కావున పగటియం దుపయోగించినను బాధకముగాదు. రేయింబవలును నిత్యముగ నుపయోగించవచ్చును.

### అంజనోపయోగగుణము.

మూ. యథా హి కనకాదీనాం మణీనాం వివిధాత్మనామ్. ౧౭
ధాతూనాం నిర్మలా శుద్ధిః తైలచేలకచాదిభిః,
ఏవం నేత్రేషు మర్త్యానాం అంజనాశ్చ్యోతనాదిభిః. ౧౮
దృష్టిర్నిరాకులా భాతి నిర్మలే నభసీన్దువత్,

వ్యా. బంగరు మున్నగులోహంబులును, పలుతెరంగులైనమణులును, తైలము వస్త్రము కెంద్రుకలు మున్నగువానిచే రుద్ది కడిగినచో నిర్మలమై ప్రకాశించును; అత్తెరంగుననే మనుజులనేత్రంబులును అంజనము, ఆశ్చ్యోతనము మున్నగువాని ప్రయో

గములంజేసి నిర్మలములై మేఘాచ్ఛాదనములేక నిర్మలమైన యాకసమున చంద్రుడు స్వచ్ఛముగ ప్రకాశించుచందమున దృష్టి తేటగ ప్రకాశించును. (ద్రవరూపమై నేత్రమున దోషములను ప్రవింపజేయు ఔషధవిశేషము ఆశ్చ్యోతన మనంబరగు).

## ధూమపానవిధి.

మూ. హరేణుకాం ప్రియఙ్గుం చ పృథ్వీకాం కేసరం నఖమ్ ౧౯
హ్రీబేరం చన్దనం పత్రం త్వగేలోశీరపద్మకమ్,
ధ్యామకం మధుకం మాంసీ గుగ్గుల్వగురుశర్కరమ్. ౨౦
న్యగ్రోధోదుమ్బరాశ్వత్థప్లక్షలోధ్రత్వచశ్శుభాః,
వన్యం సర్జరసం ముస్తం శైలేయం కమలోత్పలే. ౨౧
శ్రీవేష్టకం సల్లకీం చ శుకబర్హమథాపి చ,
పిష్ట్వా లిమ్పేచ్ఛరేషీకాం తాం వర్తిం యవసన్నిభామ్. ౨౨
అఙ్గుష్ఠసమ్మితాం కుర్యాత్ అష్టాఙ్గుళసమాం భిషక్,
శుష్కాంనిగర్భాం తాం వర్తిం ధూమనేత్రార్పితాం నరః ౨౩
స్నేహాక్తామగ్నిసంప్లుష్టాం పిబేత్ప్రాయోగికీం సుఖామ్,

వ్యా. రేణుకలు, ప్రేంకణము, నల్లజీలకర, నాగకేసరములు, నఖముచిప్పలు, కురువేరు, చందనము, లవంగపుపత్రి, లవంగపుపట్ట, ఏలకులు, వట్టివేళ్లు, పద్మకము, కామంచిగడ్డి, అతిమధురము, జటామాంసి. గుగ్గిలము, అగరు, చక్కెర, మఱ్ఱిపట్ట, అత్తిపట్ట, రావిపట్ట, జువ్విపట్ట, లొద్దుగుపట్ట, అడవితుంగగడ్డలు, సర్జరసము (మడ్డిపాలు), రాతిపువ్వు, తామరపువ్వులు, నల్లకలువలు, సరళద్రవము (దేవదారుబంక), అందుగుచెట్టుబంక, గ్రంథిపర్ణము (మాచిపత్రి) వీనినన్నిటిని నూరి యొకరెల్లుదర్భపుల్లకు పట్టించి వత్తిని యవాకారముగ నుండునట్లు చేయవలెను. ఆవత్తి బొటనవ్రేలిలావును ఎనిమిదియంగుళములనిడుపును కల్గియుండవలెను. దానిని చక్కగ నెండించి లోపల నుండు దర్భపుల్లను వత్తిని చెడనీయక విడదీసి ధూమపానమునకై చేయబడినయంత్రద్వారమున పదిలముగ నిడి ఆవత్తికి నెయ్యిబూసి కొనన నిప్పంటించి పొగను నోటితో పీలువనగును. శరీరమునకు బాధలేకుండునట్లు పీలువనగును.

"నావనాఞ్జననిద్రాన్తే చాత్మవాన్ ధూమపో భవేత్" అని పైచెప్పబడుప్రకారము అంజనానంతరధూమపానము విహితము. ఈవిషయము శాలాక్యతంత్రమున నిట్లు చెప్పబడినది:—

“తీక్ష్ణాఞ్జనేనాఞ్జితలోచనస్య యస్స్యాద్దుష్టో న నిరేతి నేత్రాత్, శ్లేష్మా శిరస్థస్సతు పీతమాత్రే ధూమే ప్రశాన్తిం లభతే క్షణేన” పైజెప్పిన రసాంజనరూపమైన తీక్ష్ణాంజనమును ప్రయోగించినప్పుడు శిరమునందలి దుష్టమైనశ్లేష్మము నేత్రమునుండి బైట వెడలకయున్నచో నాసమయమున ధూమపానము జేసినచో నప్పుడే యాదోషము శాంతినొందునని భావము. పైజెప్పిన ధూమపానము నియతముగ ప్రయోగింపదగినది కావున ప్రాయోగికి యనబడును.

### స్నైహికధూమపానము.

మూ. వసాఘృతమధూచ్ఛిష్టైః యుక్తియుక్తైర్వరౌషధైః. ౨౮
వర్తిం మధురకైః కృత్వా స్నైహికీం ధూమమాచరేత్,

వ్యా. వస (మాంసమునందలి క్రొవ్వు), నెయ్యి, మైనము వీనితోగూడ జీవకము ఋషభకము మున్నగు శ్రేష్ఠములైన యౌషధములను యుక్తియుక్తముగ జేర్చి నూరి పైజెప్పినరీతిగ వత్తిజేసి పైజెప్పినరీతిగ ధూమపానము జేసిన నయ్యది స్నైహికధూమపానమనబడును. (స్నైహికమనగా స్నేహద్రవ్యములను జేర్చిచేయబడిన వర్తిచే చేయబడు ధూమపానమని యర్థము).

### శిరోవిరేచనధూమము.

మూ. శ్వేతా జ్యోతిష్మతీ చైవ హరితాళం మనశ్శిలా. ౨౯
గన్ధాశ్చాగరుపత్రాద్యాః ధూమశ్శీర్షవిరేచనమ్.

వ్యా. తెల్లదింటెన, మాల్కంగిని, హరిదళము, మణిశిల, అగరు, లవంగపత్రి మున్నగు సుగంధద్రవ్యములు వీనినన్నిటింగూర్చి పైజెప్పినవిధముగ వర్తిజేసి ధూమపానము జేసినచో నయ్యది శిరమునందలి దోషములను బైట వెడలించును. ఇది శిరోవిరేచనధూమమని చెప్పబడును.

### ధూమపానముచే గల్గుగుణములు.

మూ. గౌరవం శిరసశ్శూలం పీనసార్ధావభేదకౌ. ౨౯
కర్ణాక్షిశూలం కాసశ్చ హిక్కాశ్వాసౌ గలగ్రహః,
దన్తదౌర్బల్యమాస్రావః స్రోతోఘ్రాణాక్షిదోషజః. ౩౦
పూతిఘ్రాణాస్యగన్ధశ్చ దన్తశూలమరోచకః,
హనుమన్యాగ్రహః కణ్డూః క్రిమయః పాండుతా ముఖే. ౩౧

శ్లేష్మప్రసేకో వైస్వర్యం గలశుణ్డ్యుపజిహ్వికా,
ఖాలిత్యం పిఞ్జరత్వం చ కేశానాం పతనం తథా. ౨౮
క్షవథుశ్చాతితన్ద్రా చ బుద్ధేర్మోహోఽతినిద్రతా,
ధూమపానాత్ప్రశామ్యన్తి బలం భవతి చాధికమ్. ౨౯
శిరోరుహకపాలానాం ఇన్ద్రియాణాం స్వరస్య చ,
న చ వాతకఫాత్మానో బలినోఽప్యూర్ధ్వజత్రుజాః. ౩౦
ధూమవక్త్రకపానస్య వ్యాధయస్స్యుశ్శిరోగతాః,

వ్యా. తలబరువుగనుండుట, తలనొప్పి, పడిసెము, అర్ధావభేదకము (ఒంటి కణత నొప్పి, చెవిపోటు, కంటిపోటు, దగ్గు, ఎక్కిళ్లు, శ్వాసము, గొంతుఅదుపు, దంతముల బలముచెడుట, చెవిలో చీముకారుట, ముక్కున ద్రవము స్రవించుట, కండ్లనీరుగారుట, ముక్కున కంపుపుట్టుట, నోటదుర్గంధము, పండ్లపోటు, అరోచకము, అంకిళ్లు పట్టియుండుట, శిరస్సు వెనుకటినరములు లాగిపట్టియుండుట, దురద, క్రిములు పుట్టుట, ముఖము తెల్లపడుట, గొంతునుండి కఫము వెడలుట, కంఠస్వరముచెడుట, గలశుండి (ఎదురుకుత్తుకలు), ఉపజిహ్వక (కఫరక్తప్రకోపముచేత నాలుక వాచి వంగి యందుండి చొంగకారునట్టి కంఠరోగము). తలవెండ్రుకలూడి బట్టగట్టుట, తలవెండ్రుకలు ఎరుపుతోగూడిన పచ్చని రంగుకల్గియుండుట, తలవెండ్రుకలూడుట, తుమ్ములు, కునికిపాటు, బుద్ధిభ్రంశము, అధికమైననిద్ర ఈవ్యాధు లన్నియు పైజెప్పిన ధూమపానముచేత శాంతినొందును. మరియు తలవెండ్రుకలు, కపాలాస్థి, ఇంద్రియములు, కంఠస్వరము వీనికన్నిటికిని అధికముగ బలమునిచ్చును. మరియు కంఠమున పైభాగమున వాతకఫములచే కల్గిన ప్రబలవ్యాధులు, శిరస్సున పుట్టినరోగంబులు ధూమపానముచేయువారల కొకప్పుడును సంభవింపవు.

### ధూమపానము చేయదగినకాలములు.

మూ. ప్రయోగపానే తస్యాష్టౌ కాలాస్సమ్పరికీర్తితాః. ౩౧
వాతశ్లేష్మసముత్క్లేశః కాలేష్వేషు హి లక్ష్యతే,
స్నాత్వా భుక్త్వా సముల్లిఖ్య క్షుత్వా దన్తాన్నిఘృష్య చ. ౩౨
నావనాఞ్జననిద్రాన్తే చాత్మవాన్ ధూమపో భవేత్,
తథా వాతకఫాత్మానో న భవన్త్యూర్ధ్వజత్రుజాః. ౩౩
రోగాస్తస్య తు పేయాస్స్యుః ఆపానాస్త్రిస్త్రయస్త్రయః,

వ్యా. ప్రాయోగికము, స్నైహికము, వైరేచనికము నని ధూమపానములు మూడువిధములుగ పైనిజెప్పబడినవి; అందు ప్రాయోగికధూమపానమునకు ఎనిమిది కాలములు నిర్ణయింపబడినవి; అవి యెవ్వియన:—స్నానము చేసినపిమ్మట, భుజించిన వెనుక, కుత్తుకలోనుండుకఫమును బలాత్కారముగ వెళ్లగించి వెడలించినపిదప, తుమ్మిన పిమ్మట, దంతధావన మొనరించినపిమ్మట, నస్యము నుపయోగించినపిమ్మట, కన్నుల కంజనము నుపయోగించినపిమ్మట, నిదుర మేల్కాంచినపిమ్మట ఈసమయములయందు వాతంబైనను కఫంబైనను వాతకఫములు రెండును కలిసియైనను ప్రకోపము నొందును; కావున నీయెనిమిదిసమయములయందును పైజెప్పిన ప్రాయోగికాంజనమును నియతముగ సేవింపనగును. నియమము దప్పక యథోక్తముగ పైజెప్పిన కాలములయందు ధూమపానము జేసినచో వానికి కంఠమునకు పైభాగమున వాతరోగంబులును, పిత్తరోగంబులును, వాతపిత్తరోగంబులును ఒకప్పుడైన గల్గవు. ధూమమును పీల్చునప్పుడు ఒక్కొక తడవకు మూడేసిమార్లవంతున మూడుపర్యాయములు త్రాగవలెను.

ఇచ్చట ప్రాయోగికము నిత్యము నుపయోగింపదగినది. అయ్యది స్వస్థవృత్తమున ముఖ్యముగ నాచరింపదగినది; కావున ప్రాయోగిక ధూమపానము నుద్దేశించి పైగన బరచిన యెనిమిదికాలములును నిర్దేశింపబడినవి. లేక 'ప్రయోగపానే' అనుదానికి ప్రాయోగికధూమపానము జేయదగిన స్వస్థవృత్తమునందు అని యర్థము. స్వవృత్తమునందు ధూమపానసామాన్యముగ పైజెప్పిన యెనిమిదికాలములు నిర్దేశింపబడినది యని భావము.

### ధూమపానపర్యాయనియమము.

మూ. పరం ద్వికాలపాయీ స్యా దహ్నః కాలేషు బుద్ధిమా౯. ౩౪
ప్రయోగే స్నైహికే త్వేకం వైరేచ్యం త్రిచతుః పిబేత్,

వ్యా. ధూమపానమునకు పైజెప్పిన యెనిమిదికాలములలో రెండుకాలముల యందు మాత్రము ప్రాయోగికధూమమును పానము జేయనగును. స్నైహికధూమమును పానముజేయునెడ అట్టికాలములలో నొక్కకాలమునందు మాత్రము పానముచేయ నగును. విరేచనధూమమును పానముజేయవలసినచో మూడుకాలములయందైనను, నాల్గుకాలములయందైనను పానముజేయనగును. (ఇచ్చట మూడు నాల్గు అని చెప్పినది దోషబలానుసారముగ జేయుటకై చెప్పబడినది యని యెరుంగునది).

### ధూమపానసమ్యగ్యోగలక్షణము.

మూ. హృత్కణ్ఠేన్ద్రియసంశుద్ధిః లఘుత్వం శిరసశ్శమః. ౩౫
యథేరితానాం దోషాణాం సమ్యక్పీతస్య లక్షణమ్,

వ్యా. ధూమపానమును యథోక్తముగ జేసినచో హృదయంబును కంఠంబును ఇంద్రియంబులును దోషము హరించి పరిశుద్ధముగ నుండును. తలబరువు లేక తేలికగా నుండును. కంఠమునకు పైభాగమున ప్రకుపితములగుదోషములు శమించును. ఇవి ధూమపానమును చక్కగ చేసినందుకు లక్షణములు.

ధూమపానమిథ్యారోగాతియోగమున గల్గునుపద్రవములు.

మూ. బాధిర్యమాన్ధ్యమూకత్వం రక్తపిత్తం శిరోభ్రమమ్. ౩౬
అకాలే చాతిపీతస్య ధూమః కుర్యా దుపద్రవాన్,

పైజెప్పినధూమమును పైజెప్పినకాలమునకు వ్యతిరిక్తమైనకాలమున నుపయోగించినను, పరిమాణమును మీరి అధికముగ పానముజేసినను, చెవుడు పుట్టును. కన్నులు కానరావు. మాట లుడిగి మూగియగును. రక్తపిత్తము సంభవించును. తల దిరుగును. (ధూమపానవ్యత్యయముచే నీయుపద్రవములు కల్గునని భావము).

ధూమపానవ్యాపత్తున కుపచారములు.

మూ. తత్రేష్టం సర్పిషః పానం నావనాఞ్జనతర్పణమ్. ౩౭
స్నైహికం ధూమజే దోషే వాయుః పిత్తానుగో యది,
శీతం తు రక్తపిత్తే స్యాత్ శ్లేష్మపిత్తే విరూక్షణమ్. ౩౮

వ్యా. పైజెప్పిన ధూమపానవ్యాపత్తునందు నేతిని ద్రాగుట మంచిది. మరియు స్నేహద్రవ్యములను జేర్చి నావనమును (నస్యమును) అంజనమును తర్పణమును (తృప్తి నొందించుక్రియలను) జేయనగును. వాతము పిత్తముతో గూడి ప్రకోపించియుండునెడ శీతోపచారములను, రక్తమునందు రూక్షణములగు నుపచారములను జేయనగును.

ధూమపాననిషిద్ధులు.

మూ. పరంత్వతః ప్రవక్ష్యామి ధూమో యేషాం విగర్హితః,
న విరిక్తః పిబేద్ధూమం న కృతే వస్తికర్మణి. ౩౯
న రక్తీ న విషేణార్తః న శోచన్నచ గర్భిణీ,
న శ్రమే న మదే నామే న పిత్తే న ప్రజాగరే. ౪౦
న మూర్ఛాభ్రమతృష్ణాసు న క్షీణే నాపి చక్షతే,
న మద్యదుగ్ధే పీత్వా చ న స్నేహం న చ మాక్షికం. ౪౧
ధూమం న భుక్త్వా దధ్నా చ న రూక్షః క్రుద్ధ ఏవచ,

న తాలుశోషే తిమిరే శిరస్యభిహతే న చ. ౪౨
న శఙ్ఖకే న రోహిణ్యాం న మేహే న మదాత్యయే,
ఏషు ధూమమకాలేషు మోహాత్పిబతి యో నరః. ౪౩
రోగా స్తస్య ప్రవర్ధన్తే దారుణా ధూమవిభ్రమాత్,

వ్యా. పైనిచెప్పిన ధూమపానమునకు తగనివారి నీక్రింద వివరించెదను:—విరేచనౌషధమును సేవించినవారును, వస్తికర్మ జేసికొనినవారును, రక్తమునకు సంబంధించిన వ్యాధికలవారును, విషపీడితులును, వ్యసనపడువారును, గర్భవతులను, శ్రమజెందినవారును, మద్యపానాదులచే మత్తెక్కినవారును, అజీర్ణదోషముకలవారును, పిత్తరోగముకలవారును, రాత్రి నిదురలేక మేల్కాంచినవారును, మూర్ఛారోగముకలవారును, ఒడలుత్రిప్పుచుండువారును, దప్పిగొనినవారును, ధాతువులు క్షీణించినవారును, గాయపడినవారును, (లేక ఉరఃక్షతముచే బాధితులును), మద్యమునైనను, పాలనైనను త్రాగినవారును, స్నేహద్రవ్యమునైనను, తేనెనైనను త్రాగినవారును, పెరుగన్నము భుజించినవారును, శరీరమున జిడ్డులేక రూక్షముగ నుండువారును, కోపోద్దీపితులును, తాలుశోష (దవుడ లెండుకొను)వ్యాధికలవారును, తిమిరమనునేత్రరోగముకలవారును, శిరమునందభిఘాతముకల్గినవాడును, శంఖకమను శిరోరోగముకలవారును, రోహిణియనురోగముకలవారును, ప్రమేహరోగపీడితులును, మద్యపానమునగల్గిన మదాత్యయముచే పీడితులును, వీరందరును ధూమపానమునకు అర్హులుకారు. అటుకాక పైజెప్పినవిషయములయందు పొరబడి ధూమపానము జేసినచో అట్టి ధూమపానవ్యత్యయమునంజేసి రోగములన్నియు వృద్ధినొందును. మరియు క్రూరములై బాధించుచుండును కావున పైవిషయములయందు బొత్తుగ ధూమపానము జేయరాదని భావము.

## ధూమపానమునకు జేరిన కొన్నినియమములు.

మూ. ధూమయోగ్యః పిబేద్దోషే శిరోఘ్రాణాక్షిసంశ్రయే. ౪౪
ఘ్రాణేనాస్యేన కణ్ఠస్థే ముఖేన ఘ్రాణపో వమేత్,
ఆస్యేన ధూమకబలాన్ పిబన్ ఘ్రాణేన నోద్వమేత్. ౪౫
ప్రతిలోమం గతో హ్యాశు ధూమో హింస్యాద్ధి చక్షుషీ,

వ్యా. పైజెప్పినధూమపానమునకు దగినవాడు దోషము శిరమునందును, నాసారంధ్రములయందును, నేత్రములయందును చేరియుండునపుడు నాసారంధ్రములతో పొగ పీల్చవలెను. కంఠమున దోషమున్నపుడు నోటితో పొగ పీల్చవలెను. నాసారంధ్ర

ములచే పొగ పీల్చునపుడు ఆపొగను నోటితో బైట విడువనగును. నోటితో పొగ పీల్చినపుడు ఆధూమకబలములను నాసారంధ్రములనుండి వెడలించినచో నయ్యది ప్రతిలోమవాతముచే కండ్లకెగసి బాధించును; కావున నోట పీలువబడినపొగగ్రుక్కలను నోటనే వెడలింపవలెగాని ముక్కులనుండి విడువందగదు.

## నాసారంధ్రముచే పొగపీల్చువిధము.

మూ. ఋజ్వఙ్గచక్షుస్తచ్చేతాః సూపవిష్టస్త్రిపర్యయమ్. ౨౫
పిబేచ్ఛిద్రం పిధాయైకం నాసయా ధూమమాత్మవాన్,

వ్యా. నాసారంధ్రముచే ధూమమును పీల్చునప్పుడు శరీరమును వంకరలేక నిలువుగనుండునట్లుంచుకొని, చూపుసరియైనస్థితి నుంచుకొని సమస్థితిని చతిగిలబడి కూర్చుండి, ముక్కురంధ్రములలో నొక్కదానిని మూసి రెండవరంధ్రమునుండి పొగ పీల్చవలెను. మనసును ధూమపానమునందే చెదరనీయక నిలిపి మూడుపర్యాయములు పీలువవలెను.

## ధూమనేత్రపరిమాణము.

మూ. చతుర్విංశతికం నేత్రం స్వాఙ్గుళైస్స్యా ద్విరేచనే. ౨౬
ద్వాత్రింశదఙ్గుళం స్నేహే ప్రయోగేఽధ్యర్థమిష్యతే,
ఋజుస్త్రికోషాఫలితం కోలాస్థ్యగ్రప్రమాణితమ్. ౨౭
వస్తినేత్రసమం ద్రవ్యం ధూమనేత్రే ప్రశస్యతే,

వ్యా. ధూమపానముచేయుటకై నిర్మింపబడినగొట్టము ధూమనేత్ర మనబడును. అయ్యది శిరోవిరేచనధూమపానమునకు తనవ్రేళ్లవెడలుపుచేత నిరువదినాల్గంగుళముల పొడవు కల్గియుండవలెను. స్నైహికధూమపానమునకు ముప్పదిరెండంగుళములపొడవు కల్గియుండవలెను. ప్రాయోగికధూమపానమునకు వైరేచనమునకు జెప్పినదానికన్న ఒకటిన్నరింతపొడవు కల్గియుండవలెను. (ముప్పదియారంగుళములపొడవు గల్గియుండవలెననుట.) మరియు నాగొట్టమును చక్కగనుండు మూడుఖండములచే జేయవలెను. ఆ గొట్టముయొక్క కొసయందు రేగుగింజ దూరునంతటిరంధ్రము కల్గియుండవలెను. అట్టిగొట్టమును వస్తియంత్రమునకు జెప్పినద్రవ్యములతోనే చేయవలెను. అట్టి ధూమనేత్రము మిక్కిలి ప్రశస్తమైయుండును.

## గొట్టమునుండి ధూమపానము జేసినగుణము.

మూ. దూరాద్వినిర్గతః పర్వచ్ఛిన్నో నాడీతనూకృతః. ౨౮
నేన్ద్రియం బాధతే ధూమో మాత్రాకాలనిషేవితః,

వ్యా. పైజెప్పిన ప్రమాణము ననుసరించి మూడుగణుపులు గల్గునట్లు చేయబడిన గొట్టమునుండి పొగ పీల్చినచో ద్వారమునుండి వెడలి గణుపులయందు సన్నగిలివచ్చునట్టిధూపమును, పరిమాణమును, కాలమును అనుసరించి పీల్చినచో నేత్రేంద్రియమును బాధింపక సుఖకరముగ నుండును.

## మితధూమపానలక్షణము.

మూ. యదా చోరశ్చ కణ్ఠశ్చ శిరశ్చ లఘుతాం వ్రజేత్. ౪౯
కఫశ్చ తనుతాం ప్రాప్తః సుపీతం ధూమమాదిశేత్,

వ్యా. ధూమపానముచేయుచున్నప్పుడు రొమ్మునందును, కంఠమునందును, శిరస్సునందును కఫము తగ్గి బలువులేకుండ తేలికగా నుండునప్పుడు పొగ బాగుగ పీలువబడినదియని యెరుంగునది.

## హీనధూమపానలక్షణము.

మూ. అవిశుద్ధస్స్వరో యస్య కణ్ఠశ్చ సకఫో భవేత్. ౫౦
స్తిమితో మస్తకశ్చైవ మపీతం ధూమమాదిశేత్,

వ్యా. కంఠమున కఫము శేషించి కంఠస్వరము చక్కగ వెడలక, శిరస్సు బరువుగనున్నయెడ ధూమమును చక్కగ పీలువలేదని యెరుంగునది.

## అతిధూమపానలక్షణము.

మూ. తాలు మూర్ధా చ కణ్ఠశ్చ శుష్యతే పరితప్యతే. ౫౧
తృష్యతే ముహ్యతే జన్తూ రక్తం చ స్రవతేఽధికమ్,
శిరశ్చ భ్రమతేఽత్యర్థం మూర్ఛా చాస్యోపజాయతే. ౫౨
ఇన్ద్రియాణ్యుపతప్యన్తే ధూమేఽత్యర్థం నిషేవితే,

వ్యా. పొగను అధికముగ పీల్చినచో దవుడలును, శిరస్సును, కుత్తుకయు శోషించును. మంటపుట్టును. డప్పి యధికమగును. మైకము గ్రమ్మును. రక్తము స్రవించును. తల దిరుగును. మూర్ఛ కల్గును. చక్షురాదీంద్రియములు మంటబుట్టును. (ఈయుపద్రవములు అధికముగ పొగను పీల్చినప్పుడు కల్గునని భావము.)

## నస్యకర్మవిధానము.

మూ. వర్షే వర్షేఽణుతైలం చ కాలేషు త్రిషు నాచరేత్. ౫౩
ప్రావృట్ఛరద్వసన్తేషు గతమేఘే నభస్థలే,
నస్యకర్మ యథాకాలం యో యథోక్తం నిషేవతే. ౫౪

న తస్య చక్షుర్న ఘ్రాణం న శ్రోత్రముపహన్యతే,
న స్యుశ్శ్వేతా న కపిలాః కేశాశ్శ్మశ్రూణి వా పునః ౫౫
న చ కేశాః ప్రముచ్యన్తే వర్ధన్తే చ విశేషతః,
మన్యాస్తమ్భశ్శిరశ్శూలం అర్దితం హనుసంగ్రహః ౫౬
పీనసార్ధావభేదౌ చ శిరఃకమ్పశ్చ శామ్యతి,
సిరాశ్శిరః కపాలానాం సన్ధయస్స్నాయుకణ్డరాః. ౫౭
నావనప్రీణితాశ్చాస్య లభన్తే ఽభ్యధికం బలమ్,
ముఖం ప్రసన్నోపచితం స్వరస్స్నిగ్ధస్స్థిరో మహాన్. ౫౮
సర్వేన్ద్రియాణాం వైమల్యం బలం భవతి చాధికమ్,
న చాస్య రోగాస్సహసా ప్రభవన్త్యూర్ధ్వజత్రుజాః. ౫౯
జీర్యతశ్చోత్తమాఙ్గేషు జరా న లభతే బలమ్,

వ్యా. ప్రతిసంవత్సరమునందును వర్షశరద్వసంతఋతువులయందు ఆకసమున మేఘములావరింపకుండుసమయమున మనుజుండు అణుతైలముచేత నస్యప్రయోగము చేయవలెను. అట్టి నస్యకర్మమును యథోక్తకాలమున విధ్యుక్తప్రకారముగ నాచరించు మనుజునకు కన్నులును, ముక్కులు, చెవులును చెడకుండును. వానివెండ్రుకలును, మీసములు కపిలవర్ణంబులును, శ్వేతవర్ణంబులును గాక యూడక చక్కగ వృద్ధినొందును. మెడకు వెనుకప్రక్కనరములు స్తంభింపకయుండును. తలనొప్పి, అర్దితవాతము, హనుగ్రహము (తాలువులు బిగబట్టియుండువ్యాధి), పీనసము, అర్ధావభేదకము, (ఒంటిచెతలనొప్పి), తలవణకు ఈరోగములన్నియు నివర్తించును. తలయందలిశిరసు, కపాలాస్థిసంధులు, స్నాయువులు (సన్ననినరములు), కండరములు ఇవియన్నియు నస్యకర్మచే తృప్తినొంది యధికముగ బలము నొందియుండును. ముఖము ప్రసన్నమై బలిసియుండును. కంఠస్వరము స్నిగ్ధము (శ్రావ్యము)గ నుండును. మహారక స్థిరముగ నుండును. చక్షురాదీంద్రియములన్నియు నిర్మలములై మిక్కిలి బలముగల్గి తమతమకృత్యములను జక్కగ నాచరించుచుండును. నస్యకర్మముజేయువానికి ఒకప్పుడు కంఠమునకు పైభాగమున రోగము సంభవింపవు. ముసలితనమువచ్చినను శిరస్సునందు ముసలితనమునకు సంబంధించి వలీపలితాదులు ఒకప్పుడు కల్గవు. జర యనువ్యాధి ప్రబలము కానేరదు.

ఇచ్చట "త్రిషు నాచరేత్" అనుచోట 'నా, చరేత్' అని పదవిభాగము చేయనగును. "నా=మనుష్యుడు" అని యర్థము. "అణూనాం స్రోతసాం హితం తైలం" అనువ్యుత్పత్తిచేత స్రోతస్సులైన నాసాదిరంధ్రములకు హితమైనతైలమని యర్థము. అణుతైలలక్షణము క్రింద వివరింపబడును.

## అణుతైలపాకవిధానము.

మూ. చన్దనాగురుణీ పత్రం దార్వీత్వఙ్మధుకం బలామ్, ౬౦
ప్రపౌణ్డరీకం సూక్ష్మైలాం విడఙ్గం బిల్వముత్పలమ్,
హ్రీబేరమభయాం వన్యం త్వఙ్ముస్తం శారిబాం స్థిరామ్. ౬౧
జీవన్తీం పృశ్నిపర్ణీం చ సురదారు శతావరీమ్,
హరేణుం బృహతీం వ్యాఘ్రీం సురభీం పద్మకేసరమ్ ౬౨
విపాచయేచ్ఛతగుణే మాహేన్ద్రే విమలేఽమ్భసి,
తైలాద్దశగుణం శేషం కషాయ ముపతారయేత్. ౬౩
తేన తైలం కషాయేణ దశకృత్వో విపాచయేత్,
అథాస్య దశమే పాకే సమాంశం చ్ఛాగలం పయః. ౬౪
దద్యాదేషోఽణుతైలస్య నావనీయస్య సంవిధిః,

వ్యా. గంధపుచెక్క, అగరుచెక్క, లవంగపుపత్రి, మ్రానిపసుపుపట్ట, అతిమధురము, చిట్టాముట్టి, తామరగడ్డ, చిన్నయేలకులు, వాయువిడంగములు, మారేడువేరుపట్ట, కలువదుంపలు, కురువేరు, కరకకాయలు, దనియాలు, లవంగపుపట్ట, తుంగగడ్డలు, సుగంధపాలపట్ట, పేరాముట్టి, పాలకూర, ముయ్యాకుపొన్న, దేవదారుపట్ట, పిల్లిపీచరగడ్డలు, రేణుకలు, పెద్దములక, వాకుడు, సంపంగిమొగ్గలు, తామరపువ్వులోని కేసరములు ఇవియన్నియుం సమభాగములుగగూడిన సముదాయమును క్రిందజెప్పబడునూనెకు నూరింతల పరిమితికల మాహేంద్రజలమున (క్రిందపడనీయక వర్షధారలనుండి నడుమనే గ్రహింపబడినజలమున) జేర్చి కషాయము కాచి పదియవభాగము కషాయము మిగిలియుండ్నపుడు దించి యుంచునది. (తైలపరిమాణమునకు పదింతల కషాయము మిగులునట్లు కాచవలెనని భావము).

పిమ్మట నాకషాయమున పదియవభాగమును గ్రహించి దానికి సమభాగము నూనె కల్పి (నూనెకు సమభాగము కషాయ ముండవలెను) తైలపాకవిధిప్రకారము కాచునది. ఇత్తెరంగున ఆకషాయమున నొక్కొకభాగమును (తైలమునకు సమభాగముగ) కషాయముచేర్చి మాటిమాటికిని కాచవలెను. మొత్తము పదిపర్యాయములగును. అందు పదియవసారి కాచునప్పుడు తైలమునకు సమభాగము మేకపాలను కషాయమును కూడ చేర్చి పక్వముచేయవలెను. ఇదియే నస్యకర్మమున కర్హమైన యణుతైలమును పక్వముచేయుంవిధము.

ఇచ్చట 'క్వాథ్యాచ్చతుర్గుణంవారి, స్నేహాచ్చతుర్గుణం క్వాథ్యం' అనుపరిభాషల ననుసరించి తైలమునకు నాల్గింతలు కషాయద్రవ్యమునుగాని, లేక ఉదకమునకు నాల్గవపాలు కషాయద్రవ్యమునుగాని చేర్పవలెనని యెరుంగునది.

అణుతైలోపయోగక్రమము, దానగల్గుగుణములు.

మూ. తస్య మాత్రాం ప్రయుఞ్జీత తైలస్యార్ధపలోన్మితామ్. ౬౫
స్నిగ్ధస్విన్నోత్తమాఙ్గస్య పిచునా నావనైస్త్రిభిః,
త్ర్యహాత్త్ర్యహాచ్చ సప్తాహ మేతత్కర్మ సమాచరేత్. ౬౬
నివాతోష్ణసమాచారో హితాశీ నియతేన్ద్రియః,
తైలమేతత్త్రిదోషఘ్నం ఇన్ద్రియాణాం బలప్రదమ్. ౬౭
ప్రయుఞ్జానో యథాకాలం యథోక్తా నశ్నుతే గుణాన్,

వ్యా. పైజెప్పబడిన అణుతో నర్ధపలప్రమాణమును నస్యమునకై యుపయోగింపదగును. నస్యకర్మ జేసికొనదలచినవాడు తొలుత శిరమునకు నూనెబూసి రుద్ది చెమటబుట్టించి పిమ్మట ప్రత్తిచే చేయబడినవత్తిచేత తైలమును తీసికొని మూడుమార్లు నస్యమును చేయవలెను. మూడుదినముల కొకతూరి నస్యమును చేయవలెను. అనగ దినము మార్చిదినము మూడేసిమార్లు నస్యము చేయవలెను. ఇత్తెరంగున నేడు దినములు నస్యము చేయవలెను. (దినము మార్చి దినమువంతున నేడుదినములు నస్యప్రయోగము చేయవలెనని భావము.) నస్యము నుపయోగించునపుడు స్నానపానాదులకు వేడినీళ్ల నుపయోగించవలెను. గాలిలో సంచరింపదగదు. తినుపథ్యములగు నాహారముల భుజింపవలెను. ఇంద్రియములను తనవశమున నుంచుకొని మితప్రచారమున నుండవలెను. మరియుం నీతైలము త్రిదోషములహరించును. నేత్రము మొదలగునింద్రియములకు బలమునిచ్చును. దీనిని విధ్యుక్తముగ పైజెప్పినకాలమున నుపయోగించినచో పైజెప్పబడిన గుణము లన్నియు కల్గును.

దంతధావనవిధి, దానగల్గుగుణములు.

మూ. ఆపోథితాగ్రం ద్వౌ కాలౌ కషాయం కటుతిక్తకమ్. ౬౮
భక్షయేద్దన్తపవనం దన్తమాంసాన్యబాధయన్,
నిహన్తి గన్ధం వైరస్యం జిహ్వాదన్తాస్యజం మలమ్. ౬౯
నిష్కృష్య రుచిమాధత్తే సద్యోదన్తవిశోధనమ్,

వ్యా. పలుదోముటకైనపుడక వగరైనను చేదైనను కారమైనను కల్గియుండవలెను. అట్టిపుడకను కొనయందు మెత్తగ నమలి దంతమాంసమును (చిగుళ్లను) బాధిం

పక దినమునకు రెండుపర్యాయములు (ఉదయము సాయంకాలము) పలుదోమవలెను. ఈదంతధావనముచేత నోటికంపు నివర్తించి రుచి పుట్టించును. నాలుకయందును దంతములయందును నోటియందును కల్గినమలినము పోగొట్టి యప్పుడే రుచిని పుట్టించును.

దంతధావనకాష్ఠములు.

మూ. కరఞ్జకరవీరార్కమాలతీకకుభాసనాః. ౭౦
శస్యన్తే దన్తపవనే యే చాప్యేవం విధా ద్రుమాః,

వ్యా. కానుగు, గన్నేరు, జిల్లేడు, జాజి, మద్ది, వేగి ఈచెట్లపుల్లలు దంతధావనమునకు దగియుండును. వీనితో సమానముగ వగరు ముస్నుగురసములుకల యితరములైన చెట్లపుడకలును ప్రశస్తములు.

నాలుకను గీచుట, దానిగుణము.

మూ. సువర్ణరూప్యతామ్రాణి త్రపుసీసమయాని చ,
జిహ్వానిర్లేఖనాని స్యుః అతీక్ష్ణాన్యనృజూని చ. ౭౧
జిహ్వామూలగతం యచ్చ మలముచ్ఛ్వాసరోధి చ,
సౌగన్ధ్యం భజతే తేన తస్మాజ్జిహ్వాం వినిర్లిఖేత్. ౭౨

వ్యా. బంగరు, వెండి, రాగి, తుత్తినాగము, సీసము అనునీలోహములలో నొకదానిచే చేయబడినరేకుచేత నాలుకను గీచవలెను. అట్టిరేకులు కర్కశములు కాక మృదువుగ నుండవలెను. నాలుకను గీచుటవలన నాలుక మొదటనుండుమలినంబును, నిశ్వాసము నడ్డగించు మలినంబును పోయి, నోటికి సువాసన కల్గును. కావున దంతధావనమును జేసికొని వెంటనే పైజెప్పినరేకులచేత నాలుకను గీచవలెననుట.

తాంబూలధారణము, దానిగుణములు.

మూ. ధార్యాణ్యాస్యేన వైశద్య రుచిసౌగన్ధ్యమిచ్ఛతా,
జాతీ కటుక పూగానాం లవఙ్గస్య ఫలాని చ. ౭౩
క(త)క్కోలస్య ఫలం పత్రం తామ్బూలస్య శుభం తథా,
తథా కర్పూరనిర్యాసః సూక్ష్మైలాయాః ఫలాని చ. ౭౪

వ్యా. జాజికాయ, లతాకస్తూరి, వక్కలు, లవంగములు, తక్కోలములు, జాజిపత్రి, మంచితమలపాకులు, పచ్చకర్పూరము, ఏలకికాయలు వీనినన్నిటిని జేర్చి నోటనుంచుకొని నమలియుంచుకొన్నచో నోరు జిగురులేక విశదముగ నుండును. రుచిపుట్టును. మంచివాసన కల్గును.

## స్నేహగండూషము, దానిగుణములు.

మూ. హన్వోర్బలం స్వరబలం వదనోపచయః పరః,
స్యాత్పరం చ రసజ్ఞానం అన్నే చ రుచిరుత్తమా. ౭౫
న చాస్యకణ్ఠశోషస్స్యాత్ నోష్ఠయోస్స్ఫుటనాద్భయమ్,
న చ దన్తాః క్షయం యాన్తి దృఢమూలా భవన్తి చ. ౭౬
న శూల్యన్తే న చామ్లేన హృష్యన్తే భక్షయన్తి చ,
పరానపి ఖరాన్ భక్ష్యాన్ తైలగణ్డూషధారణాత్. ౭౭

వ్యా. స్నేహద్రవ్యములతో గండూషమొనరించినవారికి అంకిళ్లయందు బలము కల్గును. కంఠస్వరమునకు బలము కల్గును. ముఖము వికాసము కల్గియుండును. మధురాది రసములు నోటికి చక్కగ తెలియును. అన్నమునందు శ్రేష్ఠమైనరుచి కల్గును. కుత్తుక యెండకుండును. పెదవులు పగులవు. దంతములు నశించవు. వానికుదుళ్లు దృఢముకల్గి గట్టిగనుండును. దంతశూల కల్గదు. పులుపు తగిలినను పండ్లు జలబరించవు. ఇతరములగు కఠినపదార్థముల తిని నమలినను బాధ కలుగనేరదు.

## తైలముచే శిరోఽభ్యంజనగుణములు.

మూ. నిత్యం స్నేహార్ద్రశిరసః శిరశ్శూలం న జాయతే,
న ఖాలిత్యం న పాలిత్యం న కేశాః ప్రపతన్తి చ. ౭౮
బలం శిరః కపాలానాం విశేషేణాభివర్ధతే,
దృఢమూలాశ్చ దీర్ఘాశ్చ కృష్ణాః కేశా భవన్తి చ. ౭౯
ఇన్ద్రియాణి ప్రసీదన్తి సుత్వగ్భవతి చామలమ్,
నిద్రాలాభస్సుఖం చ స్యాత్ మూర్ధ్ని తైలనిషేవణాత్. ౮౦

వ్యా. శిరస్సు తైలము నుంచుకొని దానిచే తడిగల్గియుండునెడ వానికొకప్పుడును తలనొప్పి గలుగదు. తలవెండ్రుకలూడి బట్టగట్టదు. తలవెండ్రుకలు తెల్లబడవు. ఊడవు. శిరమునందలి కపాలాస్థులకు విశేషముగ బలము నానాట వృద్ధినొందును. వాని తలవెండ్రుకలు నల్లనికాంతితో నిగనిగలాడుచు మిక్కిలి నిడుదలై పెరుగుచుండును. చక్షురాదీంద్రియములు నిర్మలములై యుండును. ముఖము చర్మము మంచికాంతికల్గి రాత్రులయందు సుఖముగ నిదురపట్టును. ఎల్లప్పుడును వాడు సుఖముగ నుండును.

### కర్ణపూరణమున గల్గుగుణములు.

మూ. న కర్ణరోగా వాతోత్థాః న మన్యాహనుసఙ్గ్రహః,
నోచ్చైశ్శ్రుతిర్న బాధిర్యం స్యాన్నిత్యం కర్ణతర్పణాత్. ౮౧

వ్యా. తైలముచే చెవులను తృప్తినొందించుటచేత వాతసంబంధములైన కర్ణరోగములు కల్గవు. మన్యాస్తంభంబును హనుగ్రహంబును కల్గదు. తిన్నగ మాట్లాడిన వినబడక బిగ్గరగ మాట్లాడవలసినట్లుండదు. చెవులు బొత్తుగ వినబడని చెవుడును కల్గబోదు.

### శరీరాభ్యంగనగుణములు.

మూ. స్నేహాభ్యఙ్గాద్యథా కుమ్భః చర్మస్నేహవిమర్దనాత్,
భవత్యుపాఙ్గాదక్షశ్చ దృఢః క్లేశసహో యథా. ౮౨
తథా శరీరమభ్యఙ్గాద్దృఢం సుత్వక్చ జాయతే,
ప్రశాన్తమారుతాబాధం క్లేశవ్యాయామసంసహమ్. ౮౩
స్పర్శనేఽభ్యధికో వాయుః స్పర్శనం చ త్వగాశ్రితమ్,
త్వచ్యశ్చ పరమోఽభ్యఙ్గస్తస్మాత్తం శీలయేన్నరః. ౮౪
న చాభిఘాతాభిహతం గాత్రమభ్యఙ్గసేవినః,
వికారం భజతేఽత్యర్థం బలకర్మణి వా క్వచిత్. ౮౫
సుస్పర్శోపచితాఙ్గశ్చ బలవాన్ ప్రియదర్శనః,
భవత్యభ్యఙ్గనిత్యత్వాన్నరోఽల్పజర ఏవ చ. ౮౬

వ్యా. ఒకకుండనైనను చర్మమునైనను నూనెతో తడిపినను, తేరుయొక్కయు బండియొక్కయు ఇరుసుకు చమురుబూసినను, అయ్యవి కష్టములైనభారాదులకు నోర్చి దృఢముగ నుండును. అత్తెరంగుననే ఒకమనుజునిశరీరమునకు చమురు బూసి మర్దనము చేసినచో బలముకల్గినదై స్నిగ్ధమై వృద్ధినొందును. వాతసంబంధము లగుదోషము లెన్నడును వానిని బాధింపనేరవు. అట్టిశరీరము దృఢమై ఏవిధమైన శ్రమనైన నోర్చి, ఎంతశ్రమనైన నోరువగల్గి దృఢముగ నుండును. చర్మము నునుపుకల్గి స్నిగ్ధముగ నుండును.

మరియు స్పర్శనముచేత నధికమైనది వాయువు; అట్టిస్పర్శనము చర్మము నాశ్రయించి యుండును. అభ్యంగనము చర్మమునకు మిక్కిలి హితకరమైనది. కావున మనుజుడు మిక్కిలి శ్రద్ధతో శరీరాభ్యంగనమును జేసికొనవలెను. అభ్యంగమును నియ

తముగ జేసికొనువానిశరీరము పలుదెరంగులైన యభిఘాతము లెన్నిసంభవించినను, మిక్కిలి ప్రబలమైన పనులజేసినను వికృతిజెందనేరదు. అట్టి మనుజుడు సుఖస్పర్శముౖలై వృద్ధినొందు అవయవములుకలవాడై బలశాలియు, చూచుట కందమైనవాడును, జరావర్జితుండునై దృఢముగ నుండును. కావున మనుజుడు ఎల్లప్పుడును నియతముగ నభ్యంగనమును శరీరమునకెల్ల జేసికొనవలెను.

## పాదాభ్యంగనగుణములు.

మూ. ఖరత్వం స్తబ్ధతా రౌక్ష్యం శ్రమస్సుప్తిశ్చ పాదయోః,
సద్య ఏవోపశామ్యన్తి పాదాభ్యఙ్గనిషేవణాత్. ౫౭
జాయతే సౌకుమార్యం చ బలం స్థైర్యం చ పాదయోః,
దృష్టిః ప్రసాదం లభతే మారుతశ్చోపశామ్యతి. ౫౮
న తస్య గృధ్రసీ వాతః పాదయోస్స్ఫుటనం న చ,
న సిరాస్నాయుసఙ్కోచః పాదాభ్యఙ్గేన పాదయోః. ౫౯

వ్యా. పాదముల (అరికాళ్లు) యందు అభ్యంగనము జేసికొనినచో పాదములయందుకల్గిన ఖరత్వము (కఠినముగనుండుట), ఎండియుండుట, జిడ్డులేక కర్కశముగ నుండుట, నొప్పి మున్నగుబాధ, స్పర్శజ్ఞానము లేకుండుట, ఈవ్యాధులన్నియు నాక్షణముననే శమించును.

మరియు పాదములు మిక్కిలి సుకుమారముగ నుండును. బలము, స్థిరత్వము కల్గును. వానికి దృష్టి నిర్మలమై యుండును. వాతము శాంతినొందును. మరియు పాదములయందు నూనెపూసికొనువానికి గృధ్రసీవాతంబును, పాదస్ఫుటనంబును (అరకాళ్లు పగులుట), పాదములయందలి సిరలును స్నాయువులును ముడుంచుకొనుట, ఈవ్యాధులు పాదాభ్యంగనమును నియతముగ జేసికొనువారి కెొకప్పుడును గల్గనేరవు.

## నలుగు (ఉద్వర్తనము) స్నానము, ఈరెంటిగుణములు.

మూ. దౌర్గన్ధ్యం గౌరవం తన్ద్రీం కణ్డూమలమరోచకమ్,
స్వేదం బీభత్సతాం హన్తి శరీరపరిమార్జనమ్. ౬౦
పవిత్రం వృష్యమాయుష్యం శ్రమస్వేదమలాపహమ్,
శరీరబలసన్ధానం స్నానమోజస్కరం పరమ్. ౬౧

వ్యా. శరీరమునకు నూనెచే నభ్యంగనము చేసికొనినపిదప సుగన్ధద్రవ్యములతో గూడిన నలుగుపిండిచేత ఉద్వర్తనము (నలుగు) చేసికొనినచో శరీరమునగల దుర్గన్ధము

మానును. ఒడలు బరువుగలేక చులకనగా నుండును. చేతులు కాళ్లు స్పర్శమును చక్కగ తెలిసియుండును. (కునికిపాటు నివర్తించును.) దురదయు, మురికియు పోవును. అరోచకము నివర్తించును. (శరీరపరిమార్జనమన:—మంచి పరిమళద్రవ్యములను కలిపిన నలుగుపిండితో శరీరముపై రుద్ది నలుగుపెట్టుకొనుట యనియర్థము). చెమటచే గల్గు నపరిశుద్ధత మానును.

మరియు నభ్యంగస్నానమువలన పరిశుద్ధత గలుగును. ఇంద్రియపుష్టి కల్గి సంభోగేచ్ఛ యధికమగును. ఆయువు వృద్ధినొందును. బడలికను చెమటను మురికిని పోగొట్టును. శరీరమున బలమును వృద్ధిచేయును. ఓజస్సు శరీరకాన్తిని వృద్ధినొందించును.

శుభ్రవస్త్రములు గంధమాల్యాదులు మున్నగువాని ధరించుటచే గల్గుగుణములు.

మూ. కామ్యం యశస్యమాయుష్యమలక్ష్మీఘ్నం ప్రహర్షణం,
శ్రీమత్పారిషదం శస్తం నిర్మలాంబరధారణం. ౯౨
వృష్యం సౌగంధ్యమాయుష్యం కామ్యం పుష్టిబలప్రదం,
సౌమనస్యమలక్ష్మీఘ్నం గంధమాల్యనిషేవణం. ౯౩
ధన్యం మంగళ్యమాయుష్యం శ్రీమద్వ్యసనసూదనం,
హార్షణం కామ్యమోజస్యం రత్నాభరణధారణమ్. ౯౪
మేధ్యం పవిత్రమాయుష్యం అలక్ష్మీకవినాశనమ్,
పాదయోర్మలమార్గాణాం శౌచాధానమభీక్ష్ణశః. ౯౫
పౌష్టికం వృష్యమాయుష్యం శుచిరూపవిరాజనమ్,
కేశశ్మశ్రునఖాదీనాం కల్పనం సంప్రసాధనమ్. ౯౬
చక్షుష్యం స్పర్శనహితం పాదయోర్వ్యసనాపహమ్,
బల్యం పరాక్రమసుఖం వృష్యం పాదత్రధారణమ్. ౯౭
ఈతేః ప్రశమనం బల్యం గుప్త్యావరణశంకరమ్,
ఘర్మానిలరజోంబుఘ్నం ఛత్రధారణ ముచ్యతే. ౯౮
స్ఖలతస్సంప్రతిష్ఠానం శత్రూణాం చ నిషూదనమ్,
అవష్టంభనమాయుష్యం భయఘ్నం దణ్డధారణమ్. ౯౯

వ్యా. మలినములేక స్వచ్ఛమైన తెల్లనివస్త్రముల ధరించినచో, మనస్సునకు రమ్యముగ నుండును, కీర్తిని కలిగించును, ఆయువును వృద్ధినొందించును. (అలక్ష్మిని దౌర్భా

గ్యము) పోఁగొట్టును. సంతోషమును కలిగించును. సొగసును అధికముగ జేయును. సభలోనికి పోవుటకు యోగ్యతను కలిగించును. శుభముల నొసంగును.

మంచి వాసనగలగంధమును పుష్పమాలికలు మొదలగువానిని ధరించినచో, కామమును వృద్ధిపరచును. మంచిసువాసనను కల్గించును. ఆయువును వృద్ధిజేయును. మనోహరముగ నుండును. శరీరమునకు బలమునుకల్గించి చక్కఁగ పోషించును. మనస్సునకు సంతసముకల్గును. దుఃఖమును దురదృష్టమును తొలగించును.

రత్నములు, ఆభరణములు మున్నగు నలంకారముల ధరించినచో గౌరవమును గల్గించును. శుభమును వృద్ధిజేయును. ఆయువును పెంపొందించును. అందము నిచ్చును. దుఃఖమును పోఁగొట్టి సంతసమును కల్గించును. చూచుటకు మనోహరమై ఓజస్సును వృద్ధి పరచును.

పాదములయందును, మలద్వారములయందు నుండుమలినమును చక్కఁగా కడిగి కొనినచో బుద్ధివికాసముకల్గి పరిశుద్ధముగ నుండును. ఆయువు వృద్ధినొందును అలక్ష్మి తొలగును.

తలవెండ్రుకలు, మీసములు, గోళ్లు మున్నగువానిని యుక్తానుసారముగ ఖండించి కేశములను యుక్తమైనస్థితినుంచి దువ్వడము మున్నగు సంస్కారముల జేసినచో శరీరమునకు పుష్టికల్గి మనస్సునకు ఉల్లాసము జనించును. ఆయువు వృద్ధినొందును. శుభ్రమైన సౌందర్యమును ప్రకాశింపజేయును.

పాదములకు పాదుకలు (చెప్పులు) మున్నగు పాదరక్షల ధరించి సంచరించినచో కన్నులకు మిక్కిలి హితముగనుండును. కాలికి భూమియొక్క వేడిని సోకనీయక సుఖముగ నుండును. ముండ్లు మొదలగువానివలన కల్గుకష్టములను తొలగించును. బలము, పరాక్రమము, సుఖము, మనస్సుకు ఉల్లాసము మొదలగువానిని కల్గించును.

ఛత్రమును ధరించినచో, ఈతిబాధలు శమించును. బలమును కల్గించును. పిశాచరాక్షసాదిబాధల బారదోలును. ఎండ, గాలి, దుమ్ము, వాన మొదలగు వానివలన హాని కలగనీయక ముఖ్యముగా శిరస్సును కాపాడును. (ఈతి బాధలనగా "అతివృష్టి రనావృష్టిః మూషకాః శలభాశ్శుకాః, స్వచక్రం, పరచక్రం చ షడేతా ఈతయస్స్మృతాః" అనువాక్యప్రకారము అధికవర్షము, వర్షములేకుండుట, ఎలుకలు, మిడతలు, చిలుకలు, స్వచక్రము, పరచక్రము ఇవి ఈతిబాధలని ఎరుంగునది.)

సంచరించునపుడు చేత కొయ్యను ధరించినచో, నడుచునపుడు క్రిందపడనీయక కాపాడును. శత్రువులవలని భయమును తొలగించి, ధైర్యమును బుట్టించును. ఆయువును వృద్ధిజేయును.

### శరీరసంరక్షణావశ్యకత.

మూ. నగరీ నగరస్యేవ రథస్యేవ రథీ యథా,
స్వశరీరస్య మేధావీ కృత్యేష్వవహితో భవేత్. ౧౦౦

వ్యా. ఒకపట్టణమునకు అధికారియైనప్రభువు ఆపట్టణముననుండు జనులనెల్ల తన వశముచేసికొని పట్టణమును చెడనీయక యెట్లు కాపాడుచుండునో, ఒకరథికుడు తన రథమునకు గాలి మున్నగువానిచే హానికలగనీయక యెట్లు కాపాడునో ఆత్తెరంగుననే బుద్ధిమంతుడైనమనుజుడు అంతరింద్రియబాహ్యేంద్రియములను శబ్దస్పర్శాదులను తన వశమున నుంచుకొని శరీరసంరక్షణమునకు ఆవశ్యకములయిన కృత్యములనెల్ల దేశకాలాదిపరిస్థితులకు అనుగుణముగ సమకూర్చుకొనుచు శరీరమునకు అపాయము కలగనీయక కాపాడవలయును.

### సద్వర్తనము, దానిఫలము.

మూ. భవతి చాత్ర:—
వృత్త్యుపాయాన్నిషేవేత యే స్యుర్ధర్మావిరోధినః,
శమమధ్యయనం చైవ సుఖమేవం సమశ్నుతే. ౧౦౧

వ్యా. మానవుడు పైజెప్పినపద్ధతుల ననుసరించి శరీరమును చక్కగ కాపాడుకొనుచు కులాచారధర్మములకు విరోధములేని జీవనోపాయములనరసి నిర్బాధకముగ కాలము గడుపుచు శమదమాదిగుణములు కలిగి వేదాధ్యయనాదివిధుల నెరవేర్చుకొన్నచో అట్టివానికి సుఖము చేకూరును.

### అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః:—
మాత్రా ద్రవ్యాణి మాత్రాం చ సంశ్రిత్య గురులాఘవమ్,
ద్రవ్యాణాం గర్హితోఽభ్యాసో యేషాం యేషాం చ శస్యతే.
అంజనం ధూమవర్తిశ్చ త్రివిధా వర్తికల్పనా,
ధూమపానగుణాః కాలాః పానమానం చ యస్య యత్. ౧౦౩
వ్యాపత్తిచిహ్నం భైషజ్యం ధూమో యేషాం విగర్హితః,
పేయో యథా యన్మయం చ నేత్రం యస్య చ యద్విధమ్. ౧౦౪
నస్యకర్మగుణాః నస్తః కార్యం యచ్చ యథా యదా,
భక్షయేద్దన్తపవనం యదా యద్గుణం చ యత్. ౧౦౫

యదర్థం యాని చాస్యేన ధార్యాణి కవలగ్రహే,
తైలస్య యే గుణాః దృష్టాః శిరస్తైలగుణాశ్చ యే. ౧౦౬
కర్ణతైలే తథాభ్యంగే పాదాభ్యంగేంగమార్జనే,
స్నానే వాససి శుద్ధే చ సౌగన్ధ్యే రత్నధారణే. ౧౦౭
శౌచే సంహారణే లోమ్నాం పాదత్రఛత్రధారణే,
గుణా మాత్రాశితీయేఽస్మిన్ స్తథోక్తా దండధారణే. ౧౦౮

వ్యా. ఆహారమునకు సరియైనప్రమాణము, ఆహారమున కుపయోగించుకొనవలసిన ద్రవ్యములు, పదార్థములయందలి గురు లఘుగుణముల ననుసరించిన మాత్రాపరిమాణము, ప్రతిదినము నుపయోగించక నిషేధింపదగినద్రవ్యములు, ప్రతిదినమును ఉపయోగించుటకు ప్రశస్తమైన ద్రవ్యములు, నేత్రాంజనము, ధూమవర్తి, మూడువిధములయిన ధూమవర్తిపరికల్పనము, ధూమపానమునగల్గు గుణములు. ధూమపానమునకు యుక్తకాలము, ధూమపానము ఎవరికి ఎంత చేయదగునో దానిప్రమాణము, ధూమపానముచే గల్గువ్యాపత్తులు, వానిలక్షణములు, అందుకుతగినచికిత్స, ధూమపానము చేయగూడనివారు, ధూమపానము చేయదగినవిధము, ధూమపానయంత్రమును నిర్మించవలసినద్రవ్యము, అది యుండవలసినరూపము, ధూమపానముచేయు గొట్టమునకు పరిమాణభేదములు, నస్యకర్మగుణములు, నస్యకర్మచేయువిధము, దంతధావనవిధి, దంతకాష్ఠనిర్ణయము, దంతకాష్ఠముల గుణభేదములు, కబళగ్రహము, వానియుపయోగము, దానకల్గుగుణములు, తైలగండూషము, దానిగుణము, శిరోభ్యంగనముచే గల్గుగుణములు, కర్ణపూర్ణమున గల్గుగుణములు, శరీరాభ్యంగనము, పాదాభ్యంగనము, వానిగుణములు, ఉద్వర్తనమున కల్గుగుణములు, స్నానగుణము, వస్త్రధారణగుణము, ఆభరణధారణగుణము, శౌచగుణము, క్షౌరగుణము, కేశసంస్కారగుణము, ఛత్రపాదరక్షల దారణమునగల్గుగుణము, దండదారణమునగల్గుగుణము ఇవియన్నియు నీమాత్రాశితీయాధ్యాయమున వరుసగ చెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
మాత్రాశితీయో నామ పంచమోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున అగ్నివేశునిచే విరచితంబును చరకునిచే సంస్కరింపబడినదియు నగు నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమున మాత్రాశితీయాధ్యాయమనునదియైదవయధ్యాయము సమాప్తము.

## ష ష్ఠా ధ్యా య ము.

అవతారిక:—పైని మాత్రాశితీయాధ్యాయమున మాత్రాపరిమాణము ననుసరించి భుజించినచో నయ్యది బలాదికారణ మగునని, అట్టిమాత్రాప్రమాణములు వివరింపబడినవి; మాత్రానుసారముగ నున్నను అట్టియాహారము ఋతుసాత్మ్యము నపేక్షించియున్నగాని బలాదుల గల్గింపనేరవు కావున నీయధ్యాయమున తొలుత ఋతువిభాగమును వివరించి పిమ్మట ఋతుసాత్మ్యము వివరింపబడును.

మూ. అథాత స్తస్యాశితీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. మాత్రాశితీయము జెప్పినపిదప, అట్టిమాత్రాహారముయొక్క ఋతుసాత్మ్యమును, తస్యాశితీయ మనునధ్యాయమును, (తస్యాశితశబ్దము ప్రారంభమునకలిగిన యధ్యాయమును), త్రికాలజ్ఞాని యగునాత్రేయుం డుపదేశించినదానికి న్యూనాతిరేకము గాకుండునట్లు వివరించెదనని అర్థము.

### ఋతుసాత్మ్యప్రయోజనము.

మూ. తస్యాశితాద్యాదాహారాత్ బలం వర్ణశ్చ వర్ధతే,

తస్యర్తుసాత్మ్యం విదితం చేష్టాహారవ్యపాశ్రయమ్. 3

వ్యా. మాత్రా(పరిమాణ)యుక్తమైన, అశిత-పీత-జగ్ధ - రూపమైన ఆహారముల వలన, శరీరబలంబును, వర్ణంబును, ధాతుసామ్యంబును మున్నగునవి వృద్ధినొందును. అట్టి వృద్ధికి వ్యాయామము, వ్యవాయాభ్యఙ్గాదిచేష్టలు, ఆహారము మున్నగువాని నాశ్రయించియుండు ఋతుసాత్మ్యము కారణమైయుండునని తెలియునది. (అనగా పైజెప్పిన మాత్రాపరిమాణయుక్తమైన ఆహారవిహారాదిచేష్టలు శరీరమునకు బలవర్ణాదుల వృద్ధినొందించును. అయినను, అట్టిఆహారవిహారాదులు ఋతుసాత్మ్యము లైయున్నగాని, బలవర్ణముల గల్గింపనోపవు. కావున నీక్రింద చెప్పబడు ఋతుసాత్మ్యమును అనుసరించి ఆహారవిహారాదుల సలుపవలెనని భావము.)

### అయనవిభాగములు ఆదానవిసర్గకాలము.

మూ. ఇహ ఖలు సంవత్సరం షడంగమృతువిభాగేన విద్యాత్. తత్ర ఆదిత్యస్య ఉదగయనమాదానం చ త్రీనృతూన్ శిశిరాదీన్ గ్రీష్మాన్తాన్ వ్యవస్యేత్. వర్షాదీన్ పునః హేమన్తాన్తాన్ దక్షిణాయనం విసర్గం చ. ౪

వ్యా. ఈప్రకరణమున ఒకసంవత్సరకాలము వసంతాదిఋతువిభాగముచేత ఆరు అంగములుగలదై యుండునని తెలియదగును. అట్టివసంతాదిఋతువులలో శిశిర-వసంత-గ్రీష్మనులు మూడును ఉత్తరాయణమనియు, ఆదానకాలమనియు చెప్పబడును. వర్ష-శరత్-హేమంతఋతువులు మూడును దక్షిణాయనమనియు, విసర్గకాలమనియు చెప్పబడును.

"ఉత్తరాం దిశం ప్రతి అయనం (గమనం) ఉత్తరాయణం" అను వ్యుత్పత్తిచేత సూర్యుడు భూమధ్యరేఖకు ఉత్తరభాగమున సంచరించెడికాలము ఉత్తరాయణము. ఈ కాలమున సూర్యుడు తనస్వాభావికమైన తీక్ష్ణత్వముచే ప్రాణికోటియొక్క బలమును ఆకర్షించుటవలన ఆదానకాలమనియు చెప్పబడును. "ఆదదాతి సౌమ్యాంశం ఇతి ఆదానా" అను వ్యుత్పత్తిచేత పైయర్థము లభించును. ఈయర్థమునే వాగ్భటాచార్యులు, "ఆదానం చ తదాదత్తే నృణాం ప్రతిదినం బలం" అనువాక్యముచే చెప్పెను. అయ్యది శిశిరవసంతగ్రీష్మఋతువులు.

మరియు దక్షిణాయనం అనునది "దక్షిణాం దిశం ప్రతిఅయనం"అను వ్యుత్పత్తిచేత భూమధ్యరేఖకు దక్షిణభాగమున సూర్యుడు సంచరించుకాలము దక్షిణాయన మనబడును. ఈకాలమున సూర్యుడు బలహీనుడై చంద్రుడు ప్రబలుడైయుండి జనులయొక్క బలమును నానాట వృద్ధినొందించును గాన విసర్గకాలమని చెప్పబడును. "విసృజతి ప్రాణినాం బలం ఇతి విసర్గః" అను వ్యుత్పత్తిచేత పైయర్థము లభించును. మరియు చంద్రునిబల మధికముగ నుండుటంజేసి ఈకాలమునకు సౌమ్యకాలమనియు పేరు కలదు. ఉత్తరాయణము అగ్నిగుణమైన తీక్ష్ణత్వము కల్గియుండుటవలన ఆగ్నేయ మనియు చెప్పబడును.

### సౌమ్యాగ్నేయకాల భేదములు : అట్టిభేదమునకు కారణములు.

మూ. విసర్గే చ పునర్వాయవో నాతిరూక్షాః ప్రవాంతీతరే పునరాదానే, సోమశ్చావ్యాహతబలః శిశిరాభిర్భాభిరాపూరయన్ జగదాప్యాయయతి శశ్వదతో విసర్గస్సౌమ్యః, ఆదానం పునరాగ్నేయం, తావేతావర్కవాయూ సోమశ్చ కాలస్వభావమార్గపరిగృహీతాః కాలర్తురసదోషదేహబలనిర్వృత్తిప్రత్యయభూతాః సముపదిశ్యంతే. ౫

వ్యా. విసర్గకాలమునందు గాలి మిక్కిలి రూక్షములుగాక (ఎండతాకుడుచేత తీవ్రములుగాక) సుఖస్పర్శముగ వీచుచుండును. ఆదానకాలమున తీవ్రమైనఎండ

తాకుడువలన వేడికల్గి విసర్గకాలమునకన్న వ్యతిరేకగుణములు కలగాలి వీచును. మరియు విసర్గకాలమున చంద్రుడు పూర్ణబలము కలవాడై చల్లని తనకిరణములచేత ప్రపంచమునంతయు వ్యాపింపజేయుచు లోకమును చల్లనజేసి మాటిమాటికి సాప్యాయత నొందించును. దానంజేసి విసర్గకాలము సౌమ్యము. (సోమగుణప్రధానమైనది) అని చెప్పబడును.

ఆదానకాలము సూర్యునియొక్క ప్రతాపమధికమైయుండుటంజేసి యాగ్నేయమని చెప్పబడును. పైజెప్పబడిన గుణభేదములుకల సూర్యుండును, గాలియు, చంద్రుండును కాలస్వభావమున సంబంధించిన దక్షిణోత్తరమార్గములచే గ్రహింపబడినదియై సంవత్సరాత్మకమైనకాలము, శిశిరాదిఋతువులు, మధురాదిషడ్రసములు, వాతాదిదోషములు, దేహము, బలము వీని కన్నిటికిని నిష్పత్తికారణములై యుండునని మునిపుంగవులచే నుపదేశింపబడినది.

## ఆదానకాలగుణము.

మూ. తత్ర రవిర్భాభిరాదదానో జగతస్స్నేహం వాయవస్తీవ్ర
రూక్షాశ్చోపశోషయన్తః శిశిరవసన్తగ్రీష్మేషు యథాక్రమం
రౌక్ష్యముత్పాదయన్తో రూక్షాన్ రసాన్ తిక్తకషాయ కటు
కాంశ్చ అభివర్ధయన్తో నృణాం దౌర్బల్యమావహన్తి. ౬

వ్యా. పైజెప్పిన యాదానకాలమున సూర్యుడు తనతీవ్రమైన కిరణములచేత, స్థావరజంగమరూపమైన జగత్తునందలి ద్రవరూపమైన సారమును, (సౌమ్యభాగమును) ఎండించును. గాలియు అట్టి సూర్యసంబంధముచేత మిక్కిలి తీక్ష్ణంబును రూక్షంబునై వీచుచు, పైజెప్పిన సౌమ్యభాగమైన సారమును ఆకర్షించును. మఱియు శిశిర-వసంత-గ్రీష్మములను మూడుఋతువులయందును వరుసగా రౌక్ష్యగుణమును కల్గించుచు, రూక్షగుణప్రధానమైన తిక్త-కషాయకటురసములను నానాట నభివృద్ధినొందించుచు, క్రమముగా మనుజులకు బలహీనము కల్గించును.

పైజెప్పినకాలమున వాయువు, యోగవాహి యగుటంజేసి సూర్యునియొక్క తీవ్రత ననుసరించి, వానిసంబంధముచేత మిక్కిలి తీక్ష్ణముగ నుండును. అట్టితీక్ష్ణత్వము శిశిరమున స్వల్పంబును, వసంతమున మధ్యమంబును, గ్రీష్మంబున అత్యధికంబునునై సూర్యబలానుసారముగ వృద్ధినొందియుండును. కావున అట్టి సూర్యవాతములు కలిసి శిశిరఋతువున స్వల్పమైన రౌక్ష్యమును, తిక్తరసమును, స్వల్పముగ దౌర్బల్యమును కల్గించును. వసంతఋతువునందు మధ్యమమైన రౌక్ష్యమును, కషాయరసమును, మధ్యమ

మైన దౌర్బల్యమును కల్గించును. గ్రీష్మఋతువున అత్యధికమైన రౌక్ష్యమును, కటురసమును, మిక్కిలి దౌర్బల్యమును కల్గించునని భావము. ఈయర్థమును "యథాక్రమం" అనుపదము బోధించుచున్నది.

విసర్గకాలగుణము.

మూ. వర్షాశరద్ధేమంతేష్వృతుషు తు దక్షిణాభిముఖేఽర్కే కాలమార్గమేఘవాతవర్షాభిహతప్రతాపే, శశిని చావ్యాహతబలే, మాహేంద్రసలిలప్రశాంతసంతాపే జగత్యరూక్షా రసాః ప్రవర్ధంతే అమ్లలవణమధురాః, యథాక్రమం తత్ర బలముపచీయతే నృణామితి. ౭

వ్యా. విసర్గకాలమైన వర్ష, శరత్, హేమంత ఋతువులయందు సూర్యుడు దక్షిణాభిముఖుడగును. అప్పుడు కాలముయొక్కయు, మార్గముయొక్కయు, మేఘములయొక్కయు, చల్లనయినగాలియొక్కయు, వానియొక్కయు సంబంధముచేత సూర్యుడు తనకు స్వభావసిద్ధమైన ప్రతాపమును నానాట తగ్గియుండును. చంద్రుడు అడ్డములేని బలముకలవాడైయుండును. అట్టికాలమున వర్షోదకముచేత స్థావరజంగమరూపమైన జగత్తునందంతట సంతాపమంతయు శాంతినొందును. దానంజేసి రూక్షములుగాని రసములగు అమ్ల లవణ మధురములు మూడును క్రమముగ వృద్ధినొందును. దానంజేసి యాకాలమున మనుజులకు బలము నానాట క్రమముగా వృద్ధినొందును.

ఇచ్చటగూడ ముందుజెప్పినప్రకారము తారతమ్యము లెరుంగునది. యెట్టులన:- వర్షాకాలమున అల్పబలంబును, శరదృతువున మధ్యబలంబును, హేమంతఋతువున పూర్ణబలంబును వరుసగ కల్గునని యూహించునది. మరియు వర్షఋతువున అమ్లరసంబును, శరదృతువున లవణరసంబును, హేమంతమున మధురసంబును వృద్ధినొందును. ఈ విభాగము సూర్యునియొక్క ప్రతాపము నానాట తగ్గుచు చంద్రుడు నానాట బలిష్ఠుడగుటచే కల్గును. ఈవిషయమంతయు "యథాక్రమం"అను పదముచేత బోధింపబడినది.

శిశిరాదిఋతువులందు కల్గు బలముయొక్క తారతమ్యము.

మూ. భవంతి చాత్ర:—

ఆదావన్తే చ దౌర్బల్యం విసర్గాదానయోర్నృణాం,
మధ్యే మధ్యబలం త్వంతే శ్రేష్ఠమగ్రే వినిర్దిశేత్. ౮

వ్యా. విసర్గకాలముయొక్క ప్రారంభమైన మొదటిభాగమున వర్షఋతువునందును, ఆదానకాలమున కడపటిభాగమైన గ్రీష్మఋతువునందును, బలహీనము అధిక

ముగా నుండును. విసర్గకాలమునకు మధ్యభాగమయిన శరదృతువునందును, ఆదానమునకు మధ్యభాగమైన వసంతఋతువునందును బలము అధికంబును, అల్పంబును గాక మధ్యమముగా నుండును. విసర్గకాలముయొక్క యంత్యభాగమైన హేమంతఋతువునందును, ఆదానమునకు ప్రథమభాగమైన శిశిరఋతువునందును బలము పూర్ణముగా నుండును.

ఇచ్చట నీనిర్ణయము నెరుంగునది:—విసర్గకాలమున వర్షాశరత్ హేమంత ఋతువులలో నానాట వృద్ధినొందుబలము హేమంతమున పూర్ణమైయుండును. శిశిరమున నానాట తగ్గుటకు ప్రారంభముగాన, హేమంతమునకు సమానమైన బలప్రకర్షము కల్గియుండును. అత్తెరంగుననే దానవిసర్గకాలములకు మధ్యభాగములైన వసంతశరదృతువులందు బలము మధ్యమముగా నుండును. విసర్గకాలములో మొదటిభాగమైన వర్షఋతువున బలోపచయమునకు ప్రారంభమగుటంజేసియు, ఆదానకాలముయొక్క అంత్యభాగమైన గ్రీష్మఋతువునందును బలము మిక్కిలి తక్కువగ నుండును. ఈవిషయమునే వాగ్భటాచార్యులు "శీతేఽగ్ర్యం వృష్టిఘర్మేఽల్పం బలం మధ్యం తు శేషయోః"అను వాక్యముచే క్లుప్తముగ దెలిపెను. ఇత్తెరంగున ఆదానవిసర్గకాలములయందు ఋతుభేదముచే గల్గు మనుజుల బలతారతమ్యమును ఎరుంగునది.

## హేమన్తఋతుచర్య.

మూ. శీతే శీతానిలస్పర్శసంరుద్ధో బలినాం బలీ,
పక్తా భవతి హేమంతే మాత్రాద్రవ్యగురుక్షమః. ౯
స యదా నేంధనం యుక్తం లభతే దేహజం తదా,
రసం హినస్త్యతో వాయుః శీతః శీతే ప్రకుప్యతి. ౧౦
తస్మాత్తుషారసమయే స్నిగ్ధామ్లలవణాన్ రసాన్,
ఔదకానూపమాంసానాం మేధ్యానాముపయోజయేత్. ౧౧
బిలేశయానాం మాంసాని ప్రసహానాం భృతాని చ,
భక్షయేన్మదిరాం శీధుం మధు చానుపిబేన్నరః. ౧౨
గోరసానిక్షువికృతీః వసాం తైలం నవోదనం,
హేమంతేఽభ్యస్యత స్తోయ ముష్ణం చాయుర్న హీయతే. ౧౩

వ్యా. మిక్కిలిచల్లదనము అధికముగాగల హేమంతఋతువునందు, ఆఋతుస్వభావమునంజేసి, మిక్కిలి చల్లనయినగాలి వీచుటంజేసి మనుజులశరీరమునందలి చర్మము మిక్కిలి చల్లనైయుండును. ఆకారణమువలన ఋతుస్వభావముచే బలిష్ఠులయిన మను

జులయొక్క జాఠరాగ్ని బయలువెడలక కోశమునందే యడ్డగింపబడినదై మిక్కిలి ప్రబలమగును. అందుచేత ఆకాయాగ్ని పరిమాణమునకంటె యధికముగ భుజించినను, గురుపదార్థములను భుజించినను, వానిని పచింపజేయుశక్తి గల్గియుండును.

అట్టిప్రబలమయినకాయాగ్ని తనకు వలసినంతయాహారము లేనినాడు శరీరము నందలి ధాతుసారరూపమైనరసమును నశింపజేయును. దానంజేసి శీతగుణాధిక్యముకల వాతము ప్రకోపమునందును.

కావున అట్టిహేమంతఋతువునందు స్నిగ్ధంబులును అమ్లలవణరసప్రధానంబులు నయినయాహారముల భుజింపదగును. మఱియు ఉదకమున సంచరించునవియు, మేదోవృద్ధిచే మిక్కిలి బలసినవియునైన అనూపజంతువులయొక్క మాంసరసములను విశేషముగ నుపయోగింపదగు.

మరియు బొరియలయందు నివసించు ఉడుము మున్నగుజంతువులయొక్కయు, ప్రసహములయిన, ఖరములు మున్నగువానియొక్కయు, మాంసములను కాల్చి తినవలయును. మఱియు ద్రాక్షారసమును, సారాయి, మద్యము వీనిని పైజెప్పినయాహారమునకు అనుపానముగ త్రాగవలయును.

మఱియు పైజెప్పిన హేమంతకాలమునందు ఆవుపాలను, చెరకురసమును, మాంసరసమును, తైలమును, క్రొత్తయన్నమును, ఉష్ణోదకమును వీనినన్నిటిని విశేషముగ నభ్యసించువారికి ఒకప్పుడును ఆయువు క్షీణించక నానాట వృద్ధినొందుచుండును.

ఇచ్చట హేమంతమున శీతము స్వతస్సిద్ధముగ నుండుటంజేసి 'హేమన్తే' అని చెప్పుటచేతనే శీతకాలమని యర్థము లభించినను, మరల 'శీతే' అనువిశేషణముచేత మిక్కిలిశీతమైన హేమంతకాలమున జఠరాగ్ని ప్రబలముగ నుండునని యర్థమగును. ఇట్లు చెప్పుటచేత హేమంతప్రారంభమున శీతము ప్రారంభమగునుకావున శీతము స్వల్పము. అప్పుడు జఠరాగ్ని మిక్కిలి ప్రబలముగ నుండదని తోచెడిని. మరియు వాతము స్వభావముచేతనే చల్లగనున్నను శీతకాలసంబంధముచేత యోగవాహిగుణము గల్గియుండుట వలన మరింతచల్లనైయుండును. అట్టిచల్లని వాతసంబంధముచేత జాఠరాగ్నియడ్డగింపబడి బైట వెడలవీలుకాక కోశమునందే యణగి (కమ్మరివాడు కుండలమూటువేసి దానిపై బురదమట్టిచే మూసినప్పుడు లోపలనే నిప్పు వృద్ధినొందువిధముగ) చక్కగ రగిలి వృద్ధినొందునని భావము.

మరియు "బలినాం బలీ" యనియు చెప్పుటచేత కాలస్వభావముచేత మిక్కిలి బలిష్ఠులైనమనుజులకే పైజెప్పినరీతిగ కాయాగ్నియు బలిష్ఠమగునని యర్థమగును.

కాయాగ్నిబలవృద్ధికి మనుజులబలము కారణమగునని ఫలితార్థము. ఈవిషయము హస్త్యాయుర్వేదమున నిట్లు చెప్పబడినది:—"అవ్యాహతాదభిప్రాయా త్ప్రీతిః ప్రీతేర్బలమ్ బలాత్, అగ్నిః, అగ్నిశ్చ ధాతూనాం బలం నాశస్తతో రుజామ్."

"వాయుశ్శీతశ్శీతే ప్రకుప్యతి" అనుచోట శీతగుణయుకలవాతము శీతకాలమైన హేమంతఋతువున తనకు సమానగుణమైన శీతగుణసంబంధమునంజేసి 'వృద్ధిస్సమానైస్సర్వేషాం' అనున్యాయప్రకారము ప్రకోపమునొందునని యర్థము.

### హేమంతమున నభ్యంగాదివిధులు.

మూ. అభ్యఙ్గోత్సాదనం మూర్ధ్ని తైలం జేన్తాకమాతపమ్,
భజేద్భూమిగృహం చోష్ణం ఉష్ణం గర్భగృహం తథా. ౧౪

వ్యా. శరీరమున కభ్యంగనము జేసికొని నలుగుపెట్టికొనుట, తలకు నూనె అంటికొనుట, జేంతాకమనుస్వేదమును జేసికొనుట, ఎండకాచుటచేతను చెమటబుట్టించికొనుట, వేడికల్గినభూమి గృహముననైనను, గర్భగృహముననైనను నివసించుట, ఈకృత్యము లన్నియు హేమంతఋతువున నాచరింపదగినవి.

### హేమంతమున శయనాసనాదులనియమము.

మూ. శీతేషు సంవృతం సేవ్యం యానం శయనమాసనమ్,
ప్రావారాజినకౌశేయప్రవేణీకుథకాస్తృతమ్. ౧౫
గురూష్ణవాసా దిగ్ధాఙ్గో గురుణాఽగురుణా సదా,
శయనే ప్రమదాం పీనాం విశాలోపచితస్తనీమ్. ౧౬
ఆలిఙ్గ్యాగురుదిగ్ధాఙ్గీం సుప్యాత్సమదమన్మథః,
ప్రకామం చ నిషేవేత మైథునం శిశిరాగమే. ౧౭

వ్యా. మరియు హేమంతకాలమునందు వాహనములు, పడక, కూర్చుండునట్టి కుర్చీ మొదలగునాసనములు వీనికన్నిటికిని పైనకపచమువలె ఆచ్ఛాదనములచే గప్పి వానిని ఆయాపనులయం దుపయోగింపవలయును. మరియు వానిపై దట్టముగానుండు గుడ్డలను, చిత్రకంబళమును, పెద్దపులి మొదలగువానిచర్మము పట్టుగుడ్డలు గోతములు మొదలగువానిచే పైజెప్పినయానము మున్నగువానిని గప్పియుంచవలెను. దళసరమై వేడిగనుండుగుడ్డలను (దుప్పట్లను) గప్పికొనవలెను. ఎల్లప్పుడును అగరుగంధమును దట్టముగ పూసికొనవలెను. మిక్కిలిబలసి అగరుచేత పూయబడినశరీరముకల్గి విశాలమైనయు రోజములుగలనారీమణిని కౌగలించుకొని మదముచేతను, మదనవికారముచేతను,

యుక్తుడైన పురుషుడు శయ్యపై బవళించి నిదురించవలెను. మఱియు నీశిశిరకాలమున యథేచ్ఛముగ క్రీడాసుఖము ననుభవింపవచ్చును.

హేమంతమున సేవింపకవిడువదగినవి.

మూ॥ వర్జయేదన్నపానాని లఘూని వాతలాని చ,
ప్రవాతం ప్రమితాహారం ఉదమన్థం హిమాగమే. ౧౮

వ్యా. మఱియు హేమంతఋతువునందు తేలికయైనపదార్థములను వాతమును వృద్ధినొందించుపదార్థములను తినకూడదు. మిక్కుటమైనగాలిని సేవింపదగదు. మిక్కిలి స్వల్పమైనయాహారమును భుజింపదగదు. ఉదకముతో కూడినసత్తుపిండిని తినగూడదు.

శిశిరఋతుచర్య.

మూ. హేమంతశిశిరే తుల్యే శిశిరేఽల్పం విశేషణమ్,
రౌక్ష్యమాదానజం శీతం మేఘమారుతవర్షజమ్. ౧౯
తస్మాద్ధైమంతికస్సర్వః శిశిరే విధిరిష్యతే,
నివాతముష్ణం త్వధికం శిశిరే గృహమాశ్రయేత్. ౨౦
కటుతిక్తకషాయాణి వాతలాని లఘూని చ,
వర్జయే దన్నపానాని శిశిరే శీతలాని చ. ౨౧

వ్యా. హేమంత శిశిరఋతువులు రెండును సమానగుణములైయుండును. కావున హేమంతఋతువునకు చెప్పిననియమములే శిశిరఋతువునందును ఆచరింపదగియుండును. అయినను స్వల్పమాత్రము విశేషము ఉండును. ఏమన శిశిరఋతువు ఆదానకాలమునకు ప్రారంభమగుటంజేసి రౌక్ష్యగుణంబును, మేఘావరణముచేతను, గాలిచేతను, వర్షముచేతను, చలియు మిక్కుటముగా నుండును. కావున హేమంతమునకన్న నీగుణములు శిశిరఋతువునందు అధికముగానుండును. కావున హేమంతఋతువునకు చెప్పిననియమములన్నియు శిశిరఋతువునందును ఆచరింపదగియుండును. మఱియు గాలిలేక మిక్కిలి వేడిగనుండు ఇంటిని ఆశ్రయించవలయును. కటుతిక్తకషాయరసములను, వాతమును వృద్ధినొందించుపదార్థములను, లఘుపదార్థములను, పైజెప్పినగుణములుగల యన్నపానములను, శీతమును వృద్ధినొందించు నన్నపానములను విడువవలెను.

వసంతఋతుచర్య.

మూ. వసన్తే నిచితశ్ళ్లేష్మా దినకృద్భాభిరీరితః,
కాయాగ్నిం బాధతే రోగాంస్తతః ప్రకురుతే బహూన్. ౨౨
తస్మాద్వసన్తే కర్మాణి వమనాదీని కారయేత్,

వ్యా. వసంతఋతువునందు అంతకుముందు శీతకాలమున వృద్ధిజెంది గడ్డగట్టియుండుకఫము సూర్యకిరణములవేడిమిచేత కరగి జఠరాగ్నిని మందగింపజేయును. దానంజేసి (కఫము కరగి జఠరాగ్ని మందగించియుండుటవలన) కఫప్రకోపమును కారణముగాకల యనేకవ్యాధులను కల్గించును; కావున అట్టివసంతకాలమునందు వమనము మున్నగు కఫహరములైనకర్మల జేయనగును.

ఇచ్చట 'కాయాగ్నిం' అనుటవలన జఠరాగ్నిని మాత్రము కఫము బాధించును గాని ధాత్వగ్నుల బాధింపనేరదని యర్థము. 'వమనాదీని' అనుచోట వమనమును ప్రధానముగ కలవిరేచనము, ఆస్థాపనము, అనువాసనము మున్నగునవి అయాదోషానుసారముగ నాచరింపదగునని భావము. ఆదానమధ్యకాలమున వాతపిత్తములు ప్రకోపించునపుడు వానిశాంతికై విరేచన - వస్తికర్మల కూడ జేయవలెనని యుద్దేశించి పైజెప్పినప్రకారము అర్థము జేయబడినది. మరియు కఫము హరించుటకై శిరోవిరేచనంబును జేయందగును.

### వసంతమున ఆహారాదినియమము.

మూ. గుర్వమ్లస్నిగ్ధమధురం దివాస్వప్నం చ వర్జయేత్. ౨౩
వ్యాయామోద్వర్తనం ధూమం కబళగ్రహమంజనం,
సుఖాంబునా శౌచవిధిం శీలయేత్ కుసుమాగమే. ౨౪

వ్యా. మఱియు వసంతఋతువునందు గురపదార్థములను, పులుపుగల పదార్థములను, స్నిగ్ధంబులును మధురంబులు నగుపదార్థములను భుజియింపందగదు. పగటియందు నిదురించకూడదు. మఱియుం, దేహపరిశ్రమమును, ఉద్వర్తనమును, ధూమపానమును, కబళగ్రహణమును చేయనగును. నేత్రముల కంజనమును చేయదగును. సుఖోష్ణమైన జలముచే స్నానశౌచాదుల నెరవేర్చవలెను. ఈవ్యాయామాదులను ప్రతిదినమునందు అలవాటుగ చేయనగును.

### వసంతమున చేయదగిన అనులేపాదులు.

మూ. చందనాగరుదిగ్ధాంగో యవగోధూమభోజనః,
శారభం శాశమైణేయం మాంసం లావకపింజలం. ౨౫
భక్షయేన్నిగదం శీధుం పిబేన్మాధ్వీకమేవ వా,
వసన్తేఽనుభవేత్ స్త్రీణాం కాననానాం చ యౌవనమ్. ౨౬

వ్యా. మఱియు వసంతఋతువునందు, మంచిగంధమును, అగరును, శరీరమునకు పూసికొనవలెను. యవలచేతను, గోధుమలచేతను చేయబడిన యాహారమును భుజింపవలయును. శరభము, కుందేలు, లావుకపిట్ట, కపింజలము అను నీజంతువుల మాంసమును భుజింపవలెను. అట్టియాహారమును జేసినపిదప చెరకురసమును, సారాయిని, మాధ్వీకమను మద్యమును త్రాగనగును. మఱియు నీకాలమున వనవిహారము సల్పుచు తమకాంతల యొక్క యౌవనమును పురుషులు అనుభవింపదగును.

## గ్రీష్మఋతుచర్య.

మూ. మయూఖైర్జగతస్స్నేహం గ్రీష్మే పేపీయతే రవిః,
స్వాదు శీతం ద్రవం స్నిగ్ధమన్నపానం తదా హితం. ౨౭
శీతం సశర్కరం మన్థం జాఙ్గలాన్మృగపక్షిణః,
ఘృతం పయస్సశాల్యన్నం భజన్ గ్రీష్మే న సీదతి. ౨౮

వ్యా. గ్రీష్మఋతువునందు సూర్యుడు తనతీవ్రములైన కిరణములచే లోకమునందలి చెమ్మను ఆకర్షించును. అట్టిసమయమున మనుజులు రుచికరంబులును, చల్లగను, ద్రవంబులును స్నిగ్ధంబులునునయిన అన్నపానములు సేవించుట మిక్కిలి హితకరము. చల్లగనుండు, మందమున (యవల సత్తుపిండితో చేయబడినగంజి) చక్కెరకలిపి త్రాగవలెను. మఱియు జాంగలదేశమున సంచరించు మృగములయొక్కయు, పక్షుల యొక్కయు మాంసమును, నేతిని, ఆవుపాలను, రాజనంపుబియ్యముచే సిద్ధమయిన యన్నమును ఉపయోగించినచో, గ్రీష్మఋతువునం దొకప్పుడును హానికల్గదు. మంథమనగా తంత్రాంతరమున ఇట్లు చెప్పబడినది:—"సక్తవస్సర్పిషా యుక్తాః శీతవారిపరిప్లుతాః, నాత్యచ్ఛా నాతిసాంద్రాశ్చ మన్థ ఇత్యభిధీయతే" సత్తుపిండిని నేతిలో కలిపి మిక్కిలి ద్రవంబును, ఘనంబును గాకుండునట్లు చల్లని నీళ్లలో కలిపిన నయ్యది మంథ మనబడును.

## గ్రీష్మఋతువున మద్యపానాదినిషేధము.

మూ. మద్యమల్పం న వా పేయం అథవా సుబహూదకమ్,
లవణామ్లకటూష్ణాని వ్యాయామం చ వివర్జయేత్. ౨౯

వ్యా. మఱియు గ్రీష్మకాలమున మద్యపానము చేయదగదు. అట్టిపానము అలవాటైయున్నవారు, ఆమద్యమున పులుపును తీక్ష్ణత్వమును తగ్గుటకై చల్లనినీళ్లను విశేషముగచేర్చి అట్టిమద్యమును కొంచెముగ త్రాగవలెను. ఉప్పును పులుపును కారమును

కల్గినపదార్థములను, మిక్కిలి యుష్ణములైన పదార్థములను సేవింపదగదు. దేహపరిశ్రమమును బొత్తుగా విడువవలెను.

గ్రీష్మఋతువునందు ఋతుస్వభావముచే శరీరమునందలి స్నేహమును ఆకర్షించును. అట్టిసమయమున మద్యపానము చేసినచో మద్యమునందలి తీక్ష్ణాదిగుణములచే స్నేహమును బొత్తుగ నాకర్షించునుగాన మద్యపానము నిషేధింపబడినది. మద్యమును అలవాటుగ నుపయోగించువారు దానిని బొత్తుగ మానినచో, సహసాత్యాగమునం జేసి యనేకరోగములు సంభవించునుగాన అట్టి మద్యసాత్మ్యముగలవారు మద్యమునందలి అమ్లతీక్ష్ణాదిగుణములు తగ్గుటకై చల్లనినీళ్లను విశేషముగ జేర్చి కొంచెముగ త్రాగవలెనని అనుజ్ఞ యొసగబడినది.

## గ్రీష్మకాలమున నిద్రానియమము.

మూ. దివా శీతగృహే నిద్రాం నిశి చంద్రాంశుశీతలే,
భజేచ్చందనదిగ్ధాంగః ప్రవాతే హర్మ్యమస్తకే. ౩౦

వ్యా. మఱియు గ్రీష్మకాలమున మిక్కిలి చల్లనైనగాలి వీచుచుండు ఇంటియందు పగటిపూట నిదురించవలెను. రాత్రులయందు వెన్నెలచే చల్లనై నిరాటంకముగ గాలి వీచుచుండు మేడల పైభాగమున శరీరముపై చందనముపూసికొని శయ్యపై పరుండి నిదురించవలెను.

## గ్రీష్మమున శీతాద్యుపచారములు.

మూ. వ్యజనైః పాణిసంస్పర్శైః చందనోదకశీతలైః,
సేవ్యమానో భజేదాస్యాం ముక్తామణివిభూషితః. ౩౧
కాననాని చ శీతాని జలాని కుసుమాని చ,
గ్రీష్మకాలే నిషేవేత మైథునాద్విరతో నరః. ౩౨

వ్యా. మఱియు గ్రీష్మమున గందపునీటిచే చల్లనైన వీవనలచే విసరికొనుచును, అట్టిజలముచే చల్లనైన హస్తస్పర్శము చేసికొనుచును కూర్చొని యుండవలెను. ముక్తామణులచే కట్టబడినహారములను ధరించవలెను. మిక్కిలి చల్లనిగాలి వీచుచుండు నుద్యానవనములయం దుండవలెను. చల్లనినీటిని స్నానపానాదుల కుపయోగించవలెను. మల్లెలు మొల్లలు మొదలగుపుష్పములను ధరించవలెను. రాత్రియందును పగటియందును సంభోగమును బొత్తుగ మానవలెను.

—⊙ వర్షఋతుచర్య. ⊙—

మూ. ఆదానదుర్బలే దేహే పక్తా భవతి దుర్బలః,
స వర్షాస్వనిలాదీనాం దూషణైర్బాధ్యతే పునః. 33

వ్యా. ఆదానకాలమున సూర్యసంతాపమునంజేసి మిక్కిలి బలహీనమైన దేహమునందు కాయాగ్నియు వర్షాకాలమున మిక్కిలి బలహీనమై యుండును. అట్టి వర్షాకాలమున వాయువు మొదలగువాని ప్రకోపమునంజేసి జాఠరాగ్ని మిక్కిలి హీనస్థితి నొందును.

—⊙ వర్షఋతువున త్రిదోషప్రకోపకారణము, దానియుపచర్య. ⊙—

మూ. భూబాష్పాన్మేఘనిష్యందాత్ పాకాదమ్లాజ్జలస్య చ,
వర్షాస్వగ్నిబలే క్షీణే కుప్యంతి పవనాదయః. 3౪
తస్మాత్సాధారణస్సర్వో విధిర్వర్షాసు శస్యతే,

వ్యా. మఱియు వర్షాకాలమున భూమియొక్క యావిరివలనను, మేఘముల నుండి వర్షము కురియుటవలనను, జలము కలకబారి అమ్లపాకము గల్గియుండుటవలనను, పైశ్లోకమున జెప్పినరీతిగ అగ్ని మందగించియుండుటచేతను, వాతపిత్తకఫములు మూడును ప్రకోపమునొందును. కాన అట్టికాలమునందు త్రిదోషములకు సాధారణమైన విధానమును, అగ్నిని దీపింపజేయువిధిని ముఖ్యముగ నాచరింపవలయును.

ఇచ్చట భూమియొక్క ఆవిరి ప్రభావముచే త్రిదోషములను ప్రకోపింపజేయును. వర్షము వాతశ్లేష్మముల రెంటిని ప్రకోపింపజేయును. అగ్ని మందగించినప్పుడు ఆహారము జీర్ణముకాక ధాతువుల పోషించురసమును కల్గించకుండును. కాన అట్టిధాతుక్షయముచే వాతము ప్రకోపించును. అజీర్ణమునంజేసి కఫపిత్తములు రెండును ప్రకోపించును. కాన అగ్నిమాంద్యము త్రిదోషములను ప్రకోపమునొందించును. ఇత్తెరంగున పైజెప్పినరీతిగ అగ్నిమాంద్యముచే త్రిదోషప్రకోపంబును, త్రిదోషప్రకోపముచే అగ్నిమాంద్యంబును కల్గునని పరస్పరకారణములు దెలియుచున్నవి. ఈవిషయమునే వాగ్భటాచార్యుడు "భూబాష్పేణామ్లపాకేన మలినేన చ వారిణా, వహ్నినైవ చ మన్దేన తేష్విత్యన్యోన్యదూషిషు" అని చెప్పిరి.

—⊙ వర్షఋతువునందు విడువవలసినది. ⊙—

మూ. ఉదమన్థం దివాస్వప్నమవశ్యాయం నదీజలం. 3౫
వ్యాయామమాతపం చైవ వ్యవాయం చ వివర్జయేత్,

వ్యా. వర్షఋతువునందు ఉదకముతో కూడిన మంథము, పగటినిద్ర, మంచు, నదీజలము, దేహపరిశ్రమము, ఎండ, సంభోగము వీనినన్నిటిని వదలియుండవలయును.

వర్షఋతువునందు పానభోజనాదినియమము.

మూ. పానభోజనసంస్కారాన్ ప్రాయః క్షౌద్రాన్వితాన్ భజేత్. 36
వ్యక్తామ్లలవణస్నేహం వాతవర్షాకులేఽహని,
విశేషశీతే భోక్తవ్యం వర్షాస్వనిలశాంతయే. 38
అగ్నిసంరక్షణవతా యవగోధూమశాలయః,
పురాణాః జాఙ్గలైర్మాంసైః భోజ్యా యూషైశ్చ సంస్కృతైః. 39

వ్యా. మఱియు త్రాగుటకు ఉపయోగింపబడుజలము మున్నగువానిని భోజనపదార్థములయిన అన్నము మున్నగువానిని ప్రాయికముగ తేనెతో కూర్చి సంస్కరించి యుపయోగింపనగును. ఆఋతువునందు గాలియు, వర్షమును ప్రబలముగా నుండుదినముల లోను, చలి యధికముగా నుండుదినములయందును, ఆమ్లలవణరసమును, స్నేహమును అధికంబుగ జేర్చి యుపయోగించవలయును. అందును శీత మధికమయిననాడు వాతము శమించుటకును, జఠరాగ్నిని కాపాడుటకును, యవలును, గోధుమలును, శాలిధాన్యమును (రాజనములు) ప్రాతవిగానుండువానిని, జాంగలజంతువుల మాంసములచేతను, మాంసరసములచేతను సంస్కరించి భుజింపవలెను.

వర్షఋతువున పానాదినియమము.

మూ. పిబేత్ క్షౌద్రాన్వితం చాల్పం మాధ్వీకారిష్టమంబు వా,
మాహేన్ద్రం తప్తశీతం చ కౌపం సారసమేవ చ. 39
ప్రహర్షోద్వర్తనం స్నానం గన్ధమాల్యపరో భవేత్,
లఘుశుద్ధాంబరస్థానం భజేదక్లేది వార్షికమ్. 40

వ్యా. మఱియు వర్షాకాలమునందు సారాయిలో కొంచెము తేనెకలిపియు, మజ్జిగలో అధికముగ నీళ్లుబోసియు త్రాగవలయును. లేక వర్షోదకమునైనను కాచి సుఖోష్ణముగ చల్లార్చి త్రాగవలయును. ఈకాలమున శరీరమును చక్కగా మర్దనజేయువలయును. మంచిపరిమళముగల సున్నిపిండిచేత నలుగుపెట్టుకొనవలయును. మంచివాసనగలగంథమును బూసికొని పూలమాలికల ధరించియుండవలెను. పలుచనై తేలికగానుండు వస్త్రములను కట్టుకొనవలయును. తడిలేక ఎండినస్థళమున నివసించవలయును. తెల్లనిబట్టల కట్టుకొనవలయును.

## శరదృతుచర్య, అందు పిత్తప్రకోపకారణము.

మూ. వర్షాశీతోచితాఙ్గానాం సహసైవార్కరశ్మిభిః,
తప్తానామాచితం పిత్తం ప్రాయః శరది కుప్యతి. ౪౧

వ్యా. వర్షాకాలమునందు శరీరమునకు విశేషముగ చలి సోకినవార్లకు చయావస్థ నొందిన పిత్తము శరత్కాలమునందు తటాలున సంభవించిన సూర్యకిరణముల వేడిమి సోకినంతమాత్రముననే ప్రాయికముగా ప్రకోపమునొందును. (ఇచ్చట "సహసైవ" అనుటచేత శరదృతువులో అభ్యాసములేని తీవ్రమైనఎండ సోకుటవలన పిత్తము ప్రకోపించునని భావము.) "ప్రాయః" అనుటచేత ఆపిత్తమునకు కఫము తోడై ప్రకోపము నొందునని తెలిసెడి. ఈవిషయము ఇతరతంత్రమునందు "తస్య చానుబలః కఫః" అని కంఠోక్తిగ చెప్పబడినది.

## శరదృతువున నన్నపాననియమము.

మూ. తత్రాన్నపానం మధురం లఘు శీతం సతిక్తకం,
పిత్తప్రశమనం సేవ్యం మాత్రయా సుప్రకాంక్షితైః. ౪౨

వ్యా. ఈశరత్కాలము నందు మధురరసప్రధానంబును, చులకనగ జీర్ణమగునదియు, కొంచెముగ చేదుగల్గినదియు, పిత్తమును శమింపతగినదియు నయిన యన్నపానములను మాత్రాశితీయమున జెప్పిన యథోక్తపరిమాణము ననుసరించి చక్కగ నాకలి గొన్నప్పుడు సేవింపదగును.

ఇచ్చట సామాన్యముగ మాత్రావంతముగ భుజింపవలెనని విధియున్నను ఇచ్చట 'మాత్రయా' అని మరల చెప్పుటచేత శరదృతువునందు మాత్రాపరిమాణమున కొంకింత వ్యత్యస్తమైనను ప్రత్యవాయము తప్పక కల్గునని యర్థమగును.

## శరదృతువున లావాదిమాంసాహారము.

మూ. లావాన్ కపింజలానేణా నురభ్రాన్ శరభాన్ శశాన్,
శాలీన్ సయవగోధూమాన్ సేవ్యానాహుర్ఘనాత్యయే. ౪౩

వ్యా. లావుకపిట్ట, కపింజలము (ఊరపిచ్చుక), జింకలు, ఒంటె, శరభము, చెవులపిల్లి (కుందేలు) అను నీజంతువులమాంసంబును; రాజనపుబియ్యము, యవలు, గోధుమలు, అనుధాన్యముచే సిద్ధమైనయన్నమును సేవింపదగును. (శరదృతువున పైజెప్పినవాని నుపయోగింపదగునని భావము.)

### శరదృతువున పిత్తప్రతీకారము.

మూ. తిక్తస్య సర్పిషః పానం విరేకో రక్తమోక్షణమ్,
ధారాధరాత్యయే కార్యం ఆతపస్య చ వర్జనమ్ ౪౪

వ్యా. మరియు శరత్కాలమున ప్రకోపమునొందినపిత్తము శమించుటకై తిక్తరసమును గూర్చి పక్వముజేయబడినఘృతమును పానముచేయవలెను. లేక విరేచనముజేయించవలెను. లేక రక్తమోక్షణమునైన చేయనగును. ఎండయందు మాత్రము బొత్తుగ సంచరింపదగదు.

ఇచ్చట పిత్తశాంతికై తిక్తఘృతపానము, విరేచనము, రక్తమోక్షణమును చెప్పబడినవి. ఈమూటిలో నొకదానిచేసినచో దాన పిత్తము శాంతిగాకున్న వేరొకదానిజేయవలయునని యాచార్యాభిప్రాయము.

### శరత్కాలమున వర్జనీయములు.

మూ. వసాం తైలమవశ్యాయ మౌదకానూపమామిషమ్,
క్షారం దధి దివాస్వప్నం ప్రాగ్వాతం చ వివర్జయేత్. ౪౫

వ్యా. వస, తైలము, మంచు, ఉదకమునవివసించు జంతువులమాంసము, జలప్రాంతమునవివసించు జంతువులమాంసము, ఉప్పుకలపదార్థములు, పెరుగు, పగటినిద్ర, తూర్పుగాలి వీనిని శరత్కాలమున సేవింపదగదు.

### హంసోదకము, దానిగుణము.

మూ. దివా సూర్యాంశుసన్తప్తం నిశి చన్ద్రాంశుశీతళమ్,
కాలేన పక్వం నిర్దోషం అగస్త్యేనావిషీకృతమ్. ౪౬
హంసోదకమితి ఖ్యాతం శారదం విమలం శుచి,
స్నానపానావగాహేషు హితమమ్బు యథామృతమ్. ౪౭

వ్యా. శరత్కాలమున పగటియందెల్ల సూర్యకిరణములచే చక్కగ కాచబడినదియు, రాత్రులయందెల్ల చంద్రుని చంద్రికలచే చల్లనైనదియు, కాలస్వభావముచేత దోషరహితముగా పక్వమైనదియు, వర్షాకాలమున భూస్పర్శముచే కీటములు మొదలగువానిసంబంధముచే కల్గినవిషము అగస్త్యోదయమునంజేసి అట్టివిషము తొలగినదియు, నిర్మలమై పరిశుద్ధముగా నుండునదియు నగు నీశరత్కాలమునందలిజలము హంసోదకమని చెప్పబడును. అట్టి హంసోదకమును, స్నానమునకును, పానమునకును, అవగాహనమున్నగువానికిని అమృతమునుబోలె మిక్కిలి హితకర మైయుండును.

ఇచ్చట "సూర్యాంశుసంతప్తం" అనుటచేతనే పగలు అనునర్థము అగుచున్నను "దివా" అని మరల చెప్పుటచేత దినమంతయుం సూర్యకిరణములచే సంతాపము నొందినదని యర్థమగును. "అంశు" అని చెప్పుటచేత మేఘాచ్ఛాదనము లేక నిరంతరముగ సూర్యకిరణస్పర్శముచే తపింపబడినదని యర్థము. "సంతప్తం" అనుటచేత సరస్సు మొదలగువానియందు ఒక్కచోటనైన కొరంత లేక కిరణములచే వ్యాపింపబడినదనియుం అర్థమగును. ఇత్తెరంగుననే "నిశి చంద్రాంశుశీతలమ్" అనుచోటను రాత్రులయందెల్ల చంద్రకాంతుల స్పర్శమునంజేసి చల్లనైనది యని యర్థము. ఈయర్థమును వాగ్భటాచార్యులు స్ఫుటముగ నిట్లుపదేశించెను.—"తప్తం తప్తాంశుకిరణైః శీతం శీతాంశురశ్మిభిః, సమన్తాదప్యహోరాత్రం అగస్త్యోదయనిర్విషం. శుచి హంసోదకం నామ నిర్మలం మలజిజ్జలం, నాభిష్యంది నవా రూక్షం పానాదిష్వమృతోపమమ్" ఇచ్చట పైజెప్పినయర్థము కంఠోక్తిగ చెప్పబడినది. ఇంతియేగాక రూక్షగుణరహితమై జలుబు మున్నగుదోషములు గల్గించక స్నానపానాదులకు అమృతమును బోలియుండునని స్ఫుటముగ జెప్పబడినది.

మరియుం హంసోదకమన:—హంస అనగ సూర్యచంద్రులు, అట్టి సూర్యచంద్రులచే పరిశుద్ధము చేయబడినదియని యర్థము. లేక హంసలు మిక్కిలి పరిశుద్ధమైనజలమునే త్రాగును. అట్టిహంసలకును త్రాగుటకు పరిశుద్ధమైనది యగుటంజేసి యీశరత్కాలజలము హంసోదకమని యన్వర్థముగ జెప్పబడును.

### శరత్కాలమున మాల్యాదులయుంపయోగము.

మూ. శారదాని చ మాల్యాని వాసాంసి విమలాని చ,
శరత్కాలే ప్రశస్యన్తే ప్రదోషే చేన్దురశ్మయః.	౪౮

వ్యా. ఈశరత్కాలమున బూచునట్టిపుష్పముల మాలికలును, నిర్మలములై తెల్లనైయుండు వస్త్రములును, ధరించుటకు మిక్కిలి ప్రశస్తములైయుండును. మరియుం సాయంకాలములయందు చంద్రుని బండువెన్నెలయందుండుట చాలమంచిది.

ఇచ్చట 'ప్రదోషే' యని విశేషవిధిగ చెప్పుటచేత ప్రదోషకాలమునందు మాత్రమే సుఖస్పర్శముగ నుండుటవలన వెన్నెలయందుండదగుగాని, రాత్రులయందు శీత మధికముగనుండునుకాన ప్రదోషమునకన్న తక్కిన రాత్రియందు చంద్రికలో నుండదగదని భావము.

మరియుం పైజెప్పిన యారుఋతువులలో నొకఋతువు మారి వేరొక ఋతువు వచ్చునపుడు ముందటిఋతువుయొక్క అంతమున నేడుదినములును, పైఋతువుయొక్క యాదియందు ఏడుదినములును చేరి ఋతుసంధి యనబడును. అట్టిసంధికాలమున పూర్వ

ఋతువునకు జెప్పిన కార్యక్రమమును కొంచెము కొంచెముగ విడచుచు పైఋతువిధానమును కొంచెము కొంచెముగ నలవాటుచేయవలెను. అటుగాక తటాలున నలవాటుననుండువిధిని బొత్తిగ విడచి క్రొత్తవిధానము నారంభించినచో సహసాత్మ్యాగశీలనదోషమువలన రోగములు సంభవించును. ఈవిషయమును వాగ్భటాచార్యు లిట్లుపదేశించిరి:—"ఋత్వో రన్త్యాదిసప్తాహావృతుసన్ధిరితి స్మృతః, తత్ర పూర్వో విధిస్త్యాజ్యః సేవనీయోఽపరః క్రమాత్. అసాత్మ్యజా హి రోగాస్స్యుః సహసాత్మ్యాగశీలనాత్" దీనియర్థము పైన వివరింపబడినది.

## ఉపసంహారము, అభ్యాససాత్మ్యము

మూ. ఇత్యుక్తమృతుసాత్మ్యం యత్ చేష్టాహారవ్యపాశ్రయమ్,
ఉపశేతే యదౌచిత్యాత్ ఓకసాత్మ్యం తదుచ్యతే. ౪౯

వ్యా. ఇత్తెరంగున ఆయాఋతువులకు సంబంధించి చెప్పబడిన యాహారవిహారాదులనిర్ణయము ఋతుసాత్మ్యమని చెప్పబడును. (అనగ నాయాఋతువులకు జెప్పిన విధానక్రమము ఆయాఋతువులయందు అలవాటుజేయదగినదని భావము.) మరియు నెవరికి ఏవిధములైన యాహారవిహారాదుల నలవాటుగ నుపయోగించుటచే రోగాదులు సంభవించక దోషసమస్థితి చెడక స్వస్థతకు హానిలేక సుఖకరమైయుండునో అట్టి యాహారౌషధవిహారాదులు వారికి ఓకసాత్మ్యమనియు, అభ్యాససాత్మ్యక మనియు చెప్పబడును. (అహితమై ఆపత్కరమైన విషము కూడ ప్రతిదినము క్రమాభ్యాసవశమున నమృతప్రాయమై ఆపత్తులేక తుదకు అమృతమును బోలె రసాయన మగును; కావున నభ్యాసవశమున నహితంబులును హితము లైయుండును; దీనినే యభ్యాససాత్మ్యమని యందురు).

## దేశరోగసాత్మ్యములు.

మూ. దేశానామామయానాం చ విపరీతగుణం గుణైః,
సాత్మ్యమిచ్ఛన్తి సాత్మ్యజ్ఞాః చేష్టితం చాద్యమేవ చ. ౫౦

వ్యా. మరియు జాంగల-అనూపదేశములకును, జ్వరాదిరోగములకును వానివాని గుణములచే విరుద్ధములైనగుణములుగల చేష్టలును ఆహార విహార ఔషధాదులును ఆయా దేశరోగాదులకును సాత్మ్యములని యాయుర్వేదవేత్తలు చెప్పెదరు.

(అనూపదేశముయొక్క గుణము స్నేహగౌరవాదులు, అట్టిగుణములకు విరుద్ధములగు రౌక్ష్యలాఘవాదిగుణములుకల యన్నపానాదులు దేశసాత్మ్యములు. జాంగల దేశమునకు నిత్తెరంగున నూహించునది. మరియు రోగములకును రోగోత్పత్తి కారణములైన వాతపిత్త కఫములకు విరుద్ధములైన గుణములు (రసగుణవీర్యవిపాకప్రభావములు)

కల యన్నపానఔషధవిహారచేష్టాదులు రోగసాత్మ్యములనియు, దోషసాత్మ్యము లనియుం జెప్పబడును.) ఇచ్చట అద్యమనగ నాహారమని యర్థము. ఇయ్యది ఔష ధాదుల కుపలక్షణము.

ఇచ్చట 'విపరీతగుణం' అనుచోట హేతువిపరీతము, వ్యాధివిపరీతము, హేతు వ్యాధివిపరీతము, హేతువిపరీతార్థకారి, వ్యాధివిపరీతార్థకారి, హేతువ్యాధివిపరీతార్థ కారి యను నారుభేదములును గ్రహింపబడును. వీనియారిటి వివరణము మాచే విరచిత మగు మాధవనిదానవ్యాఖ్యానమున 'హేతువ్యాధివిపర్యస్త' అను శ్లోకవ్యాఖ్యానమున వివరింపబడియె.

### అధ్యాయవిషయసంగ్రహము.

మూ. ఋతావృతౌ నృభిస్సేవ్యం న సేవ్యం యచ్చ కించన,
తస్యాశితీయే నిర్దిష్టం హేతుమత్సాత్మ్యమేవ చ. ౫౧

వ్యా. ఒక్కొకఋతువునందు మనుజులచే సేవింపదగిన యాహార విహారాదు లును, ఆయాఋతువున విసర్జింపవలసిన యాహార విహారాదులును, ఆయాఋతువులయందు బొత్తిగ మానవలసిన విషయములును, సాత్మ్యంబును, దానికి హేతువులును ఈతస్యా శితీయాధ్యాయమున నిర్దేశింపబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
తస్యాశితీయో నామ షష్ఠోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున అగ్నివేశఋషిచే జెప్పబడినదియుం చరకునిచే సంస్కరింపబడి నదియుం నగు చరకసంహితయందు సూత్రస్థానమున తస్యాశితీయమనునది యారవయధ్యా యము సమాప్తము.

---

## సప్తమాధ్యాయము.

అవతారిక:—పైజెప్పబడిన యధ్యాయముల రెంటియందును స్వస్థవృత్తమునకు హితమైనయాహారము ప్రధానముగ చెప్పబడినది. అట్టి యాహారము పక్వమైనపిదప కల్గు మూత్రపురీషముల వేగములను నిరోధించక అవి వెడలనుండుసమయమున వానిని విస ర్జించినగాని యథోక్తమైన యాహారముచే స్వస్థత కాపాడబడనేరదు; కావున అట్టి మలమూత్రాదివేగధారణనిషేధము ఈయధ్యాయమున చెప్పబడును. దానంజేసియే యీయధ్యాయము నవేగాంధారణీయమని చెప్పబడును.

మూ. అథాతో నవేగాన్ధారణీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. స్వస్థపరిపాలనమునకు సంబంధించిన యాహారవిహారాదుల నియమమును చెప్పినపిదప మలమూత్రాదివేగధారణమును నిషేధించునట్టి నవేగాంధారణీయము అను నధ్యాయమును త్రికాలజ్ఞానవేత్తయగు ఆత్రేయమహర్షి యుపదేశించినదానికి న్యూనాతిరేకములేక యుండునట్లు చెప్పెదనని యర్థము.

ఇచ్చట "నవేగాన్ధారయేత్" అనుపదమును ప్రారంభమునగల యధ్యాయము గాన నవేగాంధారణీయమని యీయధ్యాయమునకు సంజ్ఞ చేయబడినది.

మలమూత్రాదివేగనిరోధనిషేధము

మూ. న వేగాన్ధారయేద్ధీమాన్ జాతాన్మూత్రపురీషయోః,
న రేతసో, న వాతస్య, న చ్ఛర్ద్యాః, క్షవథోర్న చ. ౩
నోద్గారస్య, న జృంభాయాః, న వేగాన్, క్షుత్పిపాసయోః,
న బాష్పస్య, న నిద్రాయాః, నిఃశ్వాసస్య శ్రమేణ చ. ౪

వ్యా. మూత్రపురీషములు, శుక్రము, అపానవాతము, వాంతి, తుమ్ము, ఆవలింత, ఆకలి దప్పులు, కన్నీరు ఇవి తమంతట బయలువెడలనున్నప్పుడు వానిని వెడలనీయక యడ్డగించకూడదు. మఱియు నిద్రరానున్నప్పుడు దాని నాపగూడదు. శరీరమునకు శ్రమ కల్గించుపనులు జేయుటవలన కల్గిన నిశ్వాసమును (రొజును) వెడలనీయక యడ్డగించ కూడదు.

ఇచ్చట 'జాతాన్' అని చెప్పుటచేత పైఁ జెప్పబడిన మలమూత్రాదులు వెడలుటకు ప్రారంభించునప్పుడే వాని నడ్డగింపక ధారాళముగ అప్పుడే వెడలింపవలెననిభావము. ప్రతివిషయమునకు నిషేధార్థకమైన నకారమును ప్రత్యేకము జెప్పుటవలన అట్టివేగములను ఒకప్పుడును ఆపకూడదని నిషేధప్రాబల్యమును తెలుపును. 'మూత్రపురీషయోః' 'క్షుత్పిపాసయోః' అని సమస్తపదములుగ చెప్పుటచేత మలమూత్రములను, ఆకలిదప్పులును, సమకాలమున రెండేసిచేరి సంభవించునని సూచింపబడెను. అందును మలమునకన్న మూత్రము ముందు వెడలునుగాన మూత్రమే ముందు నిర్దేశింపబడెను. 'నిఃశ్వాసస్య' అని చెప్పుటచేత శ్రమమువలన కల్గిన నిశ్వాసమును మాత్రము నిరోధించకూడదని తెలియుచున్నది. ఈవిషయమునే 'శ్రమనిశ్వాసధారణాత్' అని క్రిందఁ జెప్పియున్నారు. సుశ్రుతాచార్యుడును 'శ్రాంతస్య నిశ్వాసవినిగ్రహేణ హృద్రోగ మూర్ఛాభ్యథవాపి గుల్మః' అని చెప్పిరి.

## వేగనిరోధమున గల్గువ్యాధులు, అందు మూత్రనిరోధముచే గల్గురోగములు.

మూ. ఏతాన్ధారయతో జాతాన్ వేగాన్ రోగా భవంతి యే,
పృథక్ పృథక్చికిత్సార్థం తన్మే నిగదతశ్శృణు. ౫
వస్తిమేహనయోశ్శూలం మూత్రకృచ్ఛ్రం శిరోరుజా,
వినామో వంక్షణానాహః స్యాల్లింగం మూత్రనిగ్రహే. ౬

వ్యా. పైజెప్పిన మలమూత్రాదివేగమును నిరోధించుటచే సంభవించురోగములను ఆయారోగములకు తగినచికిత్స చేయుంటకై ప్రత్యేకముగ నీక్రింద వివరించెద:—

అందు మూత్రము వెడలనున్నపుడు విసర్జింపక యాపినచో వస్తి (మూత్రపుసంచి) యందును మేఢ్రమునందును పోటు బుట్టును. మూత్రకృచ్ఛ్రము (కష్టముచే మూత్రము వెడలువ్యాధి), తలనొప్పి కలుగును, శరీరము వంగును. గెజ్జలయందు గడబిడయనుశబ్దముతో నుబ్బియుండును.

## మూత్రనిరోధజనితవ్యాధిచికిత్స.

మూ. స్వేదావగాహనాభ్యంగాన్ సర్పిషశ్చావపీడకం,
మూత్రే ప్రతిహతే కుర్యాత్ త్రివిధం వస్తికర్మ చ. ౭

వ్యా. చెమటబుట్టించుట, నీటియందు మునిగియుండుట, తైలాదులచే నభ్యంగనము చేసికొనుట, పరిమాణమునకన్న నధికముగనే తిని యుంపయోగించుట, నిరూహము అనువాసనము ఉత్తరవస్తియనునట్టి మూడువిధములయిన వస్తికర్మలను చేయుంట ఇవి యన్నియు మూత్రనిరోధమునందుగల్గు వ్యాధులకు చికిత్సగా జేయనగును.

ఇచ్చట అవపీడకమనగా వ్యాధిని హరించుటకై ప్రమాణాధికముగ నుపయోగింపబడి ఘృతమని యెరుగునది. ఈయర్థము ఈతంత్రమున "అవపీడక సర్పిర్భిః కోష్ణైః ఘృతతైలకైః తథాభ్యంగైః" అని స్థలాంతరమున చెప్పబడెను.

## మలనిరోధజనితరోగములు.

మూ. పక్వాశయశిరశ్శూలం వాతవర్చోఽప్రవర్తనం,
పిండికోద్వేష్టనాధ్మానం పురీషే స్యాద్విధారితే. ౮

వ్యా. పురీషమును అడ్డగించినచో పక్వాశయమునందును శిరస్సునందును పోటు బుట్టును. అపానవాతంబును మలంబును బయటవెడలకుండును. కాలిపిక్కలయందును తొడలయందును గలమాంసమున వడవేసినట్లు బాధకల్గును.

## పురీషనిగ్రహాజనితరోగోపచారములు.

మూ. స్వేదాభ్యంగావగాహాశ్చ వర్తయో వస్తికర్మ చ,
హితం ప్రతిహతే వర్చస్యన్నపానం ప్రమాథి చ. ౯

వ్యా. పురీషనిగ్రహముచే గల్గువ్యాధులయందు చెమటపట్టించడము, అభ్యంగనము, అవగాహనము, వర్తుల నుపయోగించడము, వస్తికర్మ (ఎనిమా) చేయుట, యీ యుపచారముల చేయవలెను. మఱియు వాతమును అప్రతిహతముగ వెడలించు, నన్నపానము సేవించుటకూడ సుఖకరమైనది.

## శుక్రనిరోధజనితరోగములు.

మూ. మేఢ్రే వృషణయోశ్శూలం అఙ్గమర్దో హృది వ్యథా,
భవేత్ప్రతిహతే శుక్రే విబద్ధం మూత్రమేవ చ. ౧౦

వ్యా. శుక్రమును వెడలనీయక యడ్డగించినచో మేఢ్రమునందును వృషణములయందును పోటు పుట్టును. ఒడలియందెల్ల నొప్పి గల్గును. హృదయమున నొప్పి పుట్టును. మూత్రము వెడలక యాగిపోవును.

## శుక్రనిరోధజనితరోగోపచారములు.

మూ. తత్రాభ్యంగావగాహాశ్చ మదిరాశ్చరణాయుధాః,
శాలిః పయో నిరూహాశ్చ శస్తం మైథునమేవ చ. ౧౧

వ్యా. పైజెప్పిన శుక్రనిరోధమున జనించిన రోగములయందు అభ్యంగనము, నీళ్లలో మునిగి స్నానము చేయుటయు హితకరములు. మద్యమును, కోడిమాంసమును, శాలిధాన్యపుటన్నమును, పాలును ఉపయోగించవలెను. నిరూహవస్తికర్మ చేయదగును. సంభోగము చేయుట చాల మంచిది.

## వాతనిరోధమున కల్గురోగములు.

మూ. వాతమూత్రపురీషాణాం సఙ్గాధ్మానం క్లమో రుజా,
జఠరే వాతజాశ్చాన్యే రోగాస్స్యుర్వాతనిగ్రహాత్. ౧౨

వ్యా. అపానవాతము వెడలనున్నప్పుడు అడ్డగించినయెడల అపానవాతము మూత్రపురీషంబులును వెడలక యాగిపోవును. కడుపులో గడబిడయను శబ్దముగల్గి కడుపుబ్బును, బడలికయు కడుపునొప్పియు కల్గును. వాతప్రకోపమునంజేసి ఇతర వాతవ్యాధులును సంభవించును.

### వాతనిగ్రహజనితరోగముల కుపచారము.

మూ. స్నేహస్వేదవిధిస్తత్ర వర్త్తయో భోజనాని చ,
పానాని వస్తయశ్చైవ శస్తం వాతానులోమనం. ౧౩

వ్యా. వాతనిగ్రహమున గల్గినరోగములయందు స్నేహపానము చేయవలెను. శరీరమున చెమట పుట్టించవలెను. వాతహరౌషధములచే చేయబడినవత్తులను ఆసనమున ప్రయోగించవలెను. వాతము అనులోమముగ జేయునట్టి పానభోజనములను, అట్టివస్తువులచే నిర్మింపబడిన వస్తికర్మను జేయుటయు చాల ప్రశస్తము.

### ఛర్దినిరోధమున గల్గురోగములు.

మూ. కండూకోఠారుచివ్యంగశోథపాండ్వామయజ్వరాః,
కుష్ఠహృల్లాసవీసర్పాః ఛర్దినిగ్రహజా గదాః. ౧౪

వ్యా. వాంతిని వెడలనీయక నిరోధించినయెడల శరీరమున దురద పుట్టును. మండలాకారములయిన పొడలు పుట్టును. నోట అరుచి కల్గును, ముఖముపై మంగు పుట్టును. వాపును, పాండురోగంబును, కుష్ఠంబును, ఎక్కిళ్లును, విసర్పరోగంబును కల్గును. ఓకరింతలు వచ్చును.

### ఛర్దినిగ్రహమున గల్గురోగముల కుపచారములు.

మూ. భుక్త్వా ప్రచ్ఛర్దనం ధూమో లఙ్ఘనం రక్తమోక్షణం,
రూక్షాన్నపానం వ్యాయామో విరేకశ్చాత్ర శస్యతే. ౧౫

వ్యా. వాంతిని నిరోధించుటచే గల్గినరోగములయందు భుజించినవెనుక వమనము చేయించవలెను. పొగను పీల్చవలెను. ఆహారము లేక లంకణముండవలెను. రక్తమోక్షణము చేయవలెను. రూక్షములగు నన్నపానంబులు సేవించుటయు, దేహపరిశ్రమ చేయుటయు, విరేచనంబు చేసికొనుటయు మిక్కిలి ప్రశస్తములు.

### తుమ్ముల నడ్డగించుటచే గల్గురోగములు.

మూ. మన్యాస్తమ్భశ్శిరశ్శూలం అర్దితార్ధావభేదకౌ,
ఇన్ద్రియాణాం చ దౌర్బల్యం క్షవథోస్స్యాద్విధారణాత్. ౧౬

వ్యా. తుమ్ముల వెడలనీయక యడ్డగించినచో మన్యాస్తంభము (మెడకు వెనుక ప్రక్క నరములు బిగబట్టియుండుట,) తలనొప్పి, అర్దితవాతము, అర్ధావభేదకము (శిరస్సునం దర్ధభాగమున పోటు), అను నీవ్యాధులు సంభవించును. కన్నులు చెవులు మున్నగు నింద్రియములు బలముచెడును.

—ఆ తుమ్ము నిరోధించుటచే గల్గురోగముల కుపచారములు. ఆ—

మూ. తత్రోర్ధ్వజత్రుకేఽభ్యంగః స్వేదో ధూమః సనావనః,
హితం వాతఘ్నమాద్యం చ ఘృతం చోత్తరభక్తికమ్. ౧౭

వ్యా. పైజెప్పిన రోగములయందు కంఠమునకు పైభాగమున నభ్యంగనము చేయుట, చెమటబట్టించుట, పొగపీల్చుట, నస్యము నుపయోగించుట, వాతహారములైన యాహారమును భుజించుట, భుజించినపిదప నెయ్యిని పానముజేయుట ఈయుపచారములు మిక్కిలి ప్రశస్తములు.

ఆద్యమనగ భుజింపదగిన యాహారపదార్థములు. 'ఆద్యం చ' అను చకారము సముచ్చయార్థకము కావున పైజెప్పిన స్వేదాభ్యంగాదులును వాతహారములై యుండవలెనని యర్థము.

—ఆ ఉద్గారనిగ్రహజనితరోగములు, వానియుపచారములు. ఆ—

మూ. హిక్కాశ్వాసోఽరుచిః కమ్పో విబన్ధో హృదయోరసోః,
ఉద్గారనిగ్రహాత్తత్ర హిక్కాయాస్తుల్యమౌషధమ్. ౧౮

వ్యా. త్రేనుపుల వెడలనీయక నిరోధించినయెడల ఎక్కిళ్లును, శ్వాసంబును, అరుచియు, కంపవాతంబును కల్గును. హృదయమును రొమ్మును పట్టినట్లు బాధ కల్గును. అట్టియెడ ఎక్కిళ్లకు చెప్పిన చికిత్సలన్నియు చేయనగును.

—ఆ ఆవలింతల నిగ్రహించినచో గల్గురోగములు, వానిచికిత్స. ఆ—

మూ. వినామాక్షేపసఙ్కోచాః సుప్తిః కమ్పః ప్రవేపనమ్,
జృమ్భాయా నిగ్రహాత్తత్ర సర్వం వాతఘ్నమౌషధమ్. ౧౯

వ్యా. ఆవలింతల వేగమును నిరోధించినయెడ శరీరము వంగును. ఆక్షేపకవాతము సంభవించును. (అవయవముల మాటిమాటికి కదలించు వ్యాధి యాక్షేపకము), అవయవములు ముడుచుకొనును. శరీరముపై స్పర్శము దెలియక మొద్దుబారి యుండును. శరీరము వణకును. ఇట్టి యుపద్రవములయందు వాతహారములగు చికిత్సలు చేయుదగును.

—ఆ ఆకలి నణచుటచే గల్గురోగములు, వానియుపచారములు. ఆ—

మూ. కార్శ్యదౌర్బల్యవైవర్ణ్య మఙ్గమర్దోఽరుచిర్భ్రమః,
క్షుద్వేగనిగ్రహాత్తత్ర స్నిగ్ధోష్ణం లఘు భోజనమ్. ౨౦

వ్యా. ఆకలియెత్తినప్పుడు భుజింపక ఆకలినణచికొనియున్నయెడ శరీరము కృశించును, బలముతగ్గును, శరీరవర్ణము మారును, బడలికయు అరుచియు కల్గును, భ్రమము (చక్రమున నున్నవానివలె నొడలు తిరుగుట) కల్గును. అట్టియెడ కొంచెముగ వేడికల్గి చుల్కనగ జీర్ణమగునట్టి యాహారమును నేయి కలిపి భుజించుట యుక్తము.

### తృష్ణానిగ్రహజనితరోగములు, వాని కుపచారము.

మూ. కణ్ఠాస్యశోషో బాధిర్యం శ్రమస్సాదో (శ్వాసో) హృది వ్యథా,
పిపాసానిగ్రహా త్తత్ర శీతం తర్పణ మిష్యతే. ౨౧

వ్యా. దప్పి కల్గినప్పుడు పానీయము త్రాగక యున్నచో కుత్తుకయు నోరును ద్రవములేక యెండును, చెవుడు బట్టును, బడలిక కల్గును, శరీరము కృశించును, రొమ్ము నొప్పియెత్తును. అట్టియెడ చల్లనై శరీరేంద్రియముల తృప్తినొందించునట్టి పానకములు మున్నగువానిని త్రాగవలెను.

### బాష్పనిగ్రహమున గల్గురోగములు, వాని చికిత్స.

మూ. ప్రతిశ్యాయోఽక్షిరోగశ్చ హృద్రోగశ్చారుచిర్భ్రమః,
బాష్పనిగ్రహణా త్తత్ర స్వప్నో మద్యం ప్రియాః కథాః. ౨౨

వ్యా. భయశోకాదులచే కన్నీరు వెడలనున్నపుడు బైట వెడలనీయక యాపినచో పడిసెము పట్టును. కండ్లరోగము కల్గును. హృదయరోగము కల్గును. అరుచి పుట్టును. చక్రముపై నున్నవానివలె నొడలు తిరుగును. అట్టియెడ నిద్ర సేవించుటయు, మద్యమును పానముచేయుటయు, మనసు కింపైనకథల వినుటయు మంచిది.

### నిద్రానిరోధజనితరోగములు, వాని యుపచారములు.

మూ. జృమ్భాఙ్గమర్ద స్తన్ద్రా చ శిరోరోగాక్షిగౌరవమ్,
నిద్రావిధారణా త్తత్ర స్వప్నస్సంవాహనాని చ. ౨౩

వ్యా. నిద్రవచ్చునపుడు నిదురించక దానినడ్డగించినయెడ ఆవలింతలు, ఒడలినొప్పులు, కునికిపాటు, తలనొప్పి, కన్నులు బరువుగనుండుట, ఈరోగములు కల్గును. అప్పుడు సుఖముగ నిదురించుటయు ఒడలు పిసికించుకొనుటయు తగినయుపచారములు.

### శ్రమనిశ్వాసనిరోధమున గల్గురోగములు, వాని చికిత్స.

మూ. గుల్మహృద్రోగసమ్మోహాః శ్రమనిశ్వాసధారణాత్,
జాయన్తే తత్ర విశ్రామో వాతఘ్నాశ్చ క్రియా హితాః. ౨౪

వ్యా. శ్రమముచేగల్గిన శ్వాసమును బిగబట్టినచో గుల్మంబును, హృదయరోగ మును కల్గును. మూర్ఛ గ్రమ్మును. అట్టియెడ విశ్రాంతిగ నుండుటయుం, వాతహరములైన చికిత్సల జేసికొనుటయు మిక్కిలి హితకరములు.

## వేగధారణనిషేధఫలము.

మూ. వేగనిగ్రహజా రోగాః య ఏతే పరికీర్తితాః,
ఇచ్ఛంస్తేషాం అనుత్పత్తిం వేగానేతాన్నధారయేత్. ౨౫

వ్యా. ఇత్తెరంగున వేగధారణమువలన జనించు నేయేరోగములు పైని జెప్పఁబడియెనో వానిని కల్గనీయకుండ కోరువాడు పైజెప్పిన మలమూత్రాదివేగముల నిరోధించక, వానివాని నాయాసమయముల విసర్జించవలెను. (ఒకవేళ పొరబాటుచే నిరోధించినప్పుడు పైజెప్పినరోగములు సంభవించును. అట్టియెడ వానివానికి ప్రత్యేకముగ పైజెప్పిన యుపచారములచే శాంతినొందించవలెనని భావము).

ఈవిషయము తంత్రాంతరమున నిట్లుపదేశింపబడెను:—"అనుత్పత్త్యై సమాసేన విధిరేష ప్రదర్శితః, నిజాగన్తువికారాణాం ఉత్పన్నానాం తు శాన్తయే."

## నిరోధింప దగినవేగములు.

మూ. ఇమాంస్తు ధారయేద్వేగాన్ హితార్థీ ప్రేత్య చేహ చ,
సాహసానామశస్తానాం మనోవాక్కాయకర్మణామ్. ౨౬

వ్యా. ఈలోకమునందును పరలోకమునందును తనకు హితమును గోరుమనుజుడు ఈక్రింద జెప్పంబడు మనోవాక్కాయములకు సంబంధించిన వ్యాపారములయొక్క వేగములను నిరోధించవలెను. మరియుం తనశక్తిని గమనించక శక్తికిమీరినపనులు, సాహసములు, మనస్సు వాక్కు శరీరము ఈమూడింటికిని సంబంధించినవియు, ఫలరహితంబులునైన సాహసకృత్యముల నొకప్పుడును చేయక వాని నాపుదల చేయవలెను. అట్లు చేసినచో నిహపరలోకముల రెంటియందును మనుజునకు హితము చేకూరునని భావము.

## లోభాదిమానసిక వ్యాపారవేగనిరోధము.

మూ. లోభశోకభయక్రోధమానవేగాన్ విధారయేత్,
నైర్లజ్జేర్ష్యాతిరాగాణాం అభిధ్యాయాంశ్చ బుద్ధిమాన్. ౨౭

వ్యా. అనుచితములైన విషయములయందు బొడమిన యాస లోభము, పుత్రదారధనాదులకు హానికల్గినప్పుడు మనసుకు కల్గుదైన్యము శోకము, తనకపకారము కల్గునేమోయను నాశంకచేకల్గు మనోదైన్యము భయము, తనకు ప్రతికూలమైన యప

కారాదులు కల్గినప్పుడు బొడమునట్టి మనోవికారము క్రోధము. తనయందు మంచి గుణములనైనను చెడ్డగుణములనైన నారోపించుకొని తానే యధికుడు అని తలంచుట మానము. జుగుప్సాకరములగు గుహ్యాదుల గ్రమ్మి యుంచుటయం దిచ్ఛ లజ్జ; దానికి వ్యతిరేకముగ లజ్జను వదలియుండుట నైర్లజ్జ్యము. అందరకు సమానమైన ద్రవ్యము నందు ఇతరసంబంధముకల్గ నోర్చకుండుట ఈర్ష్య. ఉచితమైన విషయములయందును మాటిమాటికి ప్రవర్తింపవలెనను ఇచ్ఛ అతిరాగము. పరద్రవ్యమునందలి యాస, లేక పరులకు ద్రోహముచేయుటయం దిచ్ఛ అభిధ్యానము. బుద్ధిమంతుడగు మనుజుండును పైన వివరింపబడిన మానసికకర్మలైన లోభము, శోకము, భయము, క్రోధము, మానము, నైర్లజ్జ్యము, అతిరాగము, అభిధ్యానము అను నీయెనిమిది మానసికవ్యాపారములు ఉద్రేకించునపుడు వానిని విచ్చలవిడిగ పోనీయక నిరోధించి జయించవలెను. (దానం జేసి యిహాపరములయందు సుఖము కల్గునని భావము).

### అప్రశస్తవాక్యవేగ నిరోధము.

మూ. పరుషస్యాతిమాత్రస్య సూచకస్యానృతస్య చ,
వాక్యస్యాకాలయుక్తస్య ధారయే ద్వేగముత్థితమ్.　　౨౮

వ్యా. (పరులకు కష్టమును కల్గించువాక్యము పరుషము. మితిమీరిన సంభాషణము అతిమాత్రము. ఒకరికి ద్వేషముకల్గునట్లు చాడీలుచెప్పుట సూచకము. అర్థములేనిమాట అనృతము. దేశకాలము లాదులకు సంబంధములేని యప్రచ్ఛాసంభాషణము అకాల యుక్తము. ఇట్టిసంభాషణములు వాక్కునకు సంబంధించిన యప్రశస్తవాక్యములు) అట్టి మాటలు బైలువెడలునప్పుడు వానివేగము నణచి వర్తింపవలెను.

### అప్రశస్త శరీరవ్యాపారవేగనిరోధము.

మూ. దేహప్రవృత్తి ర్యాకాచిత్ విద్యతే పరపీడయా,
స్త్రీభోగస్తేయహింసాద్యా తస్యా వేగాన్ విధారయేత్.　౨౯

వ్యా. పరస్త్రీసంభోగము, పరద్రవ్యమును దొంగలించుట, శాస్త్రవిరుద్ధమైన ప్రాణిహింస ఇవి మున్నగుకార్యములు ఒరులకు కష్టమును కల్గించునట్టికార్యములు. ఇయ్యవి శరీరమునకు సంబంధించిన యప్రశస్తవ్యాపారములు. కావున వీనివేగమును నిరోధించి యుండవలెను.

ఇచ్చట 'హింసాద్యా' అని చెప్పుటచేత గురువు మున్నగు పూజ్యులయెదుట కాళ్లుచాచి కూర్చొనియుండుట మున్నగు శరీరసంబంధమైన యప్రశస్తవ్యాపారములని యెరుంగునది.

### త్రివిధవేగధారణమువలన కల్గుఫలము.

మూ. పుణ్యశబ్దో విపాపత్వా న్మనోవాక్కాయకర్మణామ్,
ధర్మార్థకామా న్పురుషః సుఖీ భుఙ్క్తే చినోతి చ. 30

వ్యా. పైజెప్పిన నియమముల ననుసరించి నటించుమనుజునకు మనస్సు వాక్కు కాయము అనునట్టి త్రికరణములకు సంబంధించిన కర్మలయొక్క పాపములు బొత్తుగ నశించి పుణ్యశబ్దముచే జెప్పదగినవాడై యీలోకమున ధర్మము, అర్థము, కామమనను త్రివర్గములకు సంబంధించిన నిరతిశయసుఖము ననుభవించి, పరమార్థమైన మోక్షసామ్రాజ్యమునకు కావలసిన పుణ్యవిశేషమును సంపాదింపగలడు.

### వ్యాయామలక్షణము, దానిమాత్ర.

మూ. శరీరచేష్టా యా చేష్టా స్థైర్యార్థా బలవర్ధినీ,
దేహవ్యాయామసంఖ్యాతా మాత్రయా తాం సమాచరేత్.

వ్యా. శరీరబలమును వృద్ధినొందించునదియు, శరీరసంధిబంధాదులకు స్థిరత్వమును కల్గించునదియు, తనకిష్టమైనదియు నగు శరీరచేష్ట (శరీరమునకు సంబంధించిన కుస్తీ మున్నగువ్యాపారములు) దేహవ్యాయామమని చెప్పబడును. అట్టి వ్యాయామమును పరిమాణము నతిక్రమించక యాచరింపదగును.

ఇచ్చట 'దేహవ్యాయామ' అని చెప్పుటచేత మనోవ్యాయామమైన చింతనము మున్నగునవి నిరసింపబడును. 'యాచ+ఇష్టా' అని చెప్పుటచేత భారమును మోచుట మున్నగు శారీరచేష్టలు వ్యాయామమున జేరవు. సంచారరూపమైన చేష్టమాత్రము వ్యాయామమున చేరును. శ్రమ భ్రమాదులులేక శరీరమున లాఘవాదిగుణములు ఎంత వ్యాయామము చేసిన కల్గునో అయ్యది వ్యాయామ పరిమాణము. సంచారము ఎంత మాత్రము చేసిన శరీరమునకు మిక్కిలి యలమట మున్నగు బాధల గల్గింపక యుండునో అంతమాత్రము ఆచరింపవలెను. దానివలన ఆయువు, శరీరబలము, బుద్ధివికాసము, జఠరాగ్ని ఇవి వృద్ధినొందును. చక్షురాదీంద్రియములు తమతమ వ్యాపారములయందు జాగ్రత్త గల్గియుండును. ఈవిషయమును సుశ్రుతాచార్యు లిట్లు చెప్పెను:—"యత్తు చఙ్క్రమణం నాతిదేహపీడాకరం భవేత్, తదాయుర్బలమేధాగ్నిప్రదమిన్ద్రియబోధనమ్"

### వ్యాయామమున గల్గుగుణములు.

మూ. లాఘవం కర్మసామర్థ్యం స్థైర్యం దుఃఖసహిష్ణుతా,
దోషక్షయోఽగ్నివృద్ధిశ్చ వ్యాయామాదుపజాయతే. 3౨

వ్యా. వ్యాయామమును తగినపరిమాణముగ చేసినచో శరీరము చులకనై యుండును. పనులుచేయుటయందు ఆలస్యములేక శక్తికల్గియుండును. అవయవసంధి బంధములు దృఢముగ నుండును. కష్టముల కోర్వగల్గిన పాటవము కల్గును. ఉత్పథములైన దోషములను సమస్థితికి దెచ్చును. జఠరాగ్ని వృద్ధినొందును.

ఇచ్చట దోషక్షయమన:—కఫమును హరించునని యర్థము. లేక జఠరాగ్నిని వృద్ధినొందించునది కావున త్రిదోషములను కూడ సమస్థితికి దెచ్చునదియనియు నర్థము చేయదగును. ఏలయన—'సమప్రకోపౌ దోషాణాం సర్వేషా మగ్నిసంశ్రయా" అని చెప్పుటచేత వాతాదిదోషత్రయమునకు సామ్యస్థితియు ప్రకోపంబును అగ్నిబలము నను సరించి యుండును కావున అగ్ని వృద్ధినొందునపుడు వాతపిత్తకఫములు మూడును సమ స్థితి నుండునని భావము.

## వ్యాయామాధిక్యమున గల్గురోగములు.

మూ. శ్రమః క్లమః క్షయః తృష్ణా రక్తపిత్తం ప్రతామకః,
అతివ్యాయామతః కాసః జ్వరశ్ఛర్దిశ్చ జాయతే.        33

వ్యా. పైజెప్పిన వ్యాయామమును ప్రమాణమును మీరి యాచరించినచో శ్రమము (శరీరమున బడలిక) క్లమము (మనస్సునకును ఇంద్రియములకును బడలిక) రస రక్తాది ధాతుక్షయము, దప్పి, రక్తపిత్తము, తమకశ్వాసము, దగ్గు, జ్వరము, వాంతి ఇవి యన్నియు కల్గును.

## వ్యాయామహాస్యాదుల యతిమాత్రనిషేధము.

మూ. వ్యాయామహాస్యభాష్యాధ్వగ్రామ్యధర్మప్రజాగరాన్,
నోచితానపి సేవేత బుద్ధిమానతిమాత్రయా.        3౪

వ్యా. పైజెప్పబడిన వ్యాయామము, నవ్వు, సంభాషణము, త్రోవనడచుట, సంభోగము, నిదురమేల్కాంచుట, ఈవ్యాపారముల నవశ్యముగ జేయవలసినట్లు తట స్థించినను అధికముగ జేయదగవు.

ఇచ్చట అతివ్యాయామము పైన నిషేధింపబడినది. ఐనను పూర్వము క్రొత్తగ నభ్యసించువారి నుద్దేశించి నిషేధింపబడినది. ఈశ్లోకమున నలవాటుగ వ్యాయామమును చేయువారును, అధికముగ చేయగూడదని నిషేధింపబడినది. మరియు హాస్యాదులతో వ్యాయామమును జెప్పినందువలన వ్యాయామాతియోగమునకు జెప్పిన యుపద్రవములు హాస్యాదులయతియోగమునగూడ కల్గునని తెలియదగును.

### అనుక్తవ్యాపారాతియోగనిషేధము.

మూ. ఏతానేవంవిధాంశ్చాన్యాన్ యోఽతిమాత్రం నిషేవతే,
గజం సింహ ఇవాకృష్య సహసా స వినశ్యతి. 35

వ్యా. పైజెప్పిన వ్యాయామ-హాస్య-భాషణాదులను, వీనితో సమానములైన భారమును మోచుట, గొప్పరాళ్లను పెకలించుట మున్నగు వ్యాపారములను అధికముగ (తన శక్తికి మిక్కుటముగ)చేసినయెడల, స్వల్పబలముకల సింహము బలాధికమైన యేనుగుతో (తనబలమునకు మిక్కుటముగ) పోరి నాశము నొందుభంగి శీఘ్రముగనే నశించును.

సింహము స్వల్పప్రమాణము. ఏనుగు గొప్పదియుం బలాధికంబునైనది. అట్టి సింహము తనకు నైజమైన శౌర్యాతిరేకముచే తనశక్తిని గమనించక బలాధికమైన యేనుగును చించి చెండాడి శీఘ్రముగనే యాపత్తునొందును; కావున అట్టి యుపమానము ప్రకృతమున సంగతమగును. కొన్ని ప్రతులయందు 'గజస్సింహమివాకృష్య' అని పాఠాంతరము కన్పట్టుచున్నది. గజము సింహముతో పోరాడి యని యర్థము. ఈ పాఠము దృష్టాంతమునకు దగియుండలేదు.

### అహితత్యాగహితసేవనక్రమము.

మూ. ఉచితాదహితాద్ధీమాన్ క్రమశో విరమేన్నరః,
హితం క్రమేణ సేవేత క్రమశ్చాత్రోపదేక్ష్యతే. 36

వ్యా. పైవివరింపబడిన స్వస్థపరిపాలనప్రకరణమున హితములగు నాహార విహారాదులు గ్రాహ్యములనియుం, అహితములగు నాహారవిహారాదుల వర్జింపవలెననియుం చెప్పబడినది. ఒకవేళ పొరబడి యహితములైన యాహారవిహారాదుల నలవాటుచేసియున్నచో దానిని విడచి హితములైనవానిని అభ్యాసము చేయవలెనని ఫలితార్థమేర్పడినది. అలవాటునను్న నపథ్యములగు నాహార విహారాదుల తటాలున విడచి పథ్యములైన యాహారాదుల నప్పుడే ప్రారంభించినచో సహాత్యాగ సహసాశీలన దోషముచే నానారోగములు సంభవించును; కావున అభ్యాసమైన యపథ్యమును విడచి అభ్యాసమునలేని పథ్యముల సేవించుటకై క్రమము క్రింద చెప్పబడుచున్నది.

బుద్ధిశాలియగు మనుజుడు తనకు అలవాటై యభ్యాసమునను్డు నపథ్యములైన యాహారవిహారాదులను క్రమక్రమముగ వదలుచు హితములైనవానిని నానాట క్రమక్రమముగ నలవాటు చేయవలెను. అహితముల విడచుటకు, హితముల నభ్యాసము చేయుటకును క్రమము ఈక్రింద వివరింపబడును.

—॥ అపథ్యత్యాగ పథ్యసేవన క్రమాభ్యాసము. ॥—

మూ. ప్రక్షేపాపచయే తాభ్యాం క్రమః పాదాంశికో భవేత్,
ఏకాన్తరం తతశ్చోర్ధ్వం ద్వ్యన్తరం త్ర్యన్తరం తథా. 3౭

వ్యా. పైజెప్పిన అహితపరిత్యాగమునకును, హితాభ్యాసమునకును క్రమము నిట్లెరుంగునది. చిరకాలమునుండి యభ్యాసముననుండు అపథ్య ఆహారాదులను వదలుట కును, ఇంతకుమున్ను అభ్యాసములేని హితాహారాదుల జేర్చుకొనుటకును, నాల్గవవంతు క్రమముగ నభ్యాసముచేయవలెను. అప్పుడు నాల్గవవంతు జేర్చుకొని యొకదినమును, సగభాగము చేర్చుకొని రెండుదినములును, మూడుభాగములు జేర్చుకొని మూడుదిన ములును, వరుసగ అభ్యాసముచేయవలెనని యర్థము.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—చాలకాలమునుండి యభ్యాసముననుండి అహితమైన యవలు మున్నగువాటినివదలి,అంతవరకు అభ్యాసములేని హితములైన యెఱ్ఱ వరిధాన్యము మున్నగువానిని అభ్యాసముచేయుట యవశ్యకర్తవ్యము. అట్టియెడ మొదటిదినమున అభ్యాసమై అహితమైన యవధాన్యము మున్నగువానిలో నాల్గవవంతు వదలి దానికిబదులు యెఱ్ఱవరిధాన్యము మున్నగుహితాహారద్రవ్యములో నాల్గవపాలు చేర్చుకొని యుపయోగించునది. రెండవదినము అహితమైనవానిలో రెండుభాగములు వదలి, చేర్చుకొనవలసిన పథ్యద్రవ్యములో రెండుభాగములుచేర్చుకొని ఉపయోగించునది. మూడవదినమున కూడ నదియేపద్ధతి. ఇట్లు రెండుదినములు ద్విపాదాభ్యాసము చేయ వలెను. పిమ్మటనాల్గవదినమున అహితమైనయాహారములో మూడుభాగములువదలి, అభ్యా సము చేయవలసిన పథ్యమును ఆమూడుభాగములకు బదులు చేర్చుకొని యుపయోగించ వలెను. ఐదవదినమందును ఆరవదినమందును అదియేపద్ధతి నవలంబించనగును. అంతట త్రిపాదాభ్యాసమగును. పదవదినమున అలవాటులోనుండు అపథ్యమును నాల్గుభాగ ములు పూర్తిగ వదలి దానికిబదులు తా నభ్యాసముచేయవలసిన పథ్యమును పూర్తిగ జేర్చుకొని యుపయోగించునది. అప్పటికిని చిరకాలమునుండి అభ్యాసమయిన యహి తాహారమును పూర్తిగవదలి యభ్యాసములోలేని హితాహారాదులయొక్క పూర్తియైన యభ్యాసము సంభవించును. ఇదియే అహితమును వదలుటకును హితమును అభ్యసించుట కును క్రమమైనపద్ధతి.

కొందరు వ్యాఖ్యాతలు ఈవిషయమై పక్షాంతరముల వ్రాసిరి గాని ఇదియే ముఖ్య పక్షము. విస్తరభీతిచే పక్షాంతరము లిట వివరింపలేదు.

### పైజెప్పిన క్రమాభ్యాసఫలము.

మూ. క్రమేణాపచితా దోషాః క్రమేణోపచితా గుణాః,
సన్తో యాన్త్యపునర్భావం అప్రకంప్యా భవంతి చ. 3౮

వ్యా. పైజెప్పినక్రమముగ చిరకాలమునుండి యభ్యాసముననుండు అపథ్యమును వదలినచో దానజనించినదోషములు నానాట శాంతినొందును. అత్తెరంగుననే అల వాటులోలేని పథ్యములను పైజెప్పినక్రమముగ నభ్యసించినయెడ నానాట క్రమక్రమ ముగ గుణములు వృద్ధినొంది స్థిరముగ నిలబడును. అపథ్యాహారము జనించినదోషములు మరల నొకప్పుడును తలసూపకుండును. ఇదియే క్రమాభ్యాసఫలము.

పైజెప్పినపద్ధతిని వదలి చిరకాలాభ్యస్తమైన యపథ్యమును తటాలున వదలి, అన భ్యస్తమైనహితమును అప్పుడే సేవించినచో అసాత్మ్యముచేత అరుచి అగ్నిమాంద్యము మొదలగురోగములు సంభవించును. ఈవిషయమునే తంత్రాంతరమున 'అసాత్మ్యజా హి రోగాః స్యుః సహసా త్యాగశీలనాత్' అని చెప్పియున్నది.

### వాతాదిప్రకృతివివరణము.

మూ. సమపిత్తానిలకఫాః కేచిద్గర్భాదిమానవాః,
దృశ్యంతే వాతలాః కేచిత్పిత్తలాః శ్లేష్మలాస్తథా. 3౯
తేషామనాతురాః పూర్వే వాతలాద్యాస్సదాతురాః,
దోషానుశయితా హ్యేషాం దేహప్రకృతిరుచ్యతే. ౪0

వ్యా. లోకమున కొందరుమానవులు శుక్రశోణితజీవసంయోగరూపమైన గర్భ ప్రారంభముననుండియే వాతపిత్తకఫములుమూడును వానివానిపరిమాణముమించక సమస్థితి నుండువారై యుందురు. కొందరు అట్టిగర్భావస్థ మొదలుజేసి వాతప్రధానము కల్గి యుందురు. మఱికొందరు పిత్తప్రధానముగను, వేరొకరు కఫప్రధానముగను యుందురు.

ఈముగ్గురిలో తొలుత చెప్పబడిన సమదోషస్థితినుండువారు రోగరహితులుగా నుందురు. తక్కినవారు వాత-పిత్త-కఫప్రధానులు ముగ్వురును రోగపీడితులైయుందురు. వీరికి దేహప్రకృతి ఆయాదోషము ననుసరించియుండును. (అనగా జన్మప్రభృతి వాత మధికముగనుండువారిశరీరము వాతప్రకృతియనియు, పిత్తము గర్భావస్థమొదలు అధిక ముగనుండువారికి పిత్తప్రకృతియనియు, కఫ మధికముగనుండువారికి కఫ ప్రకృతి యనియు చెప్పబడును. గర్భప్రారంభముననే దోషములు మూడును సమస్థితినుండు వారికి సమప్రకృతి యని భావము. ఇత్తెరంగున సమప్రకృతి, వాతప్రకృతి, పిత్తప్రకృతి, కఫప్రకృతియు ననిదేహప్రకృతి నాల్గుతెరంగుల నుండును.

ఇచ్చట నీవిషయము నెఱుంగునది:—పైజెప్పినప్రకృతులలో తొల్లింటిదియైన సమప్రకృతియైనమనుజులు ఉపచారములు లేకయే స్వస్థత నుందురు. తక్కినవాతాది ప్రకృతులు మువ్వురును ఉపచారముల తత్తదుచితముగ జేసికొనినగాని స్వస్థత నుండ నోపరు కావున 'సదాతురాః' అని చెప్పబడెను.

### వాతాదిప్రకృత్యనుగుణాహారము.

మూ. విపరీతగుణస్తేషాం స్వస్థవృత్తేర్విధిర్హితః,
సమసర్వరసం సాత్మ్యం సమధాతోః ప్రశస్యతే. ౪౧

వ్యా. పైజెప్పిన వాతాదిప్రకృతులకు విరుద్ధములైన యాహారాదుల సేవించుట స్వస్థవృత్తికి అనుకూలము. (వాతప్రకృతికి వాతగుణములైనరూక్షాదులకు విరుద్ధములైన స్నిగ్ధాదిగుణములుకల యాహారవిహారాదులును, పిత్తప్రకృతులకు పిత్తగుణములకు విరుద్ధగుణములుకల యాహారాదులును, కఫప్రకృతులకు కఫమునకు విరుద్ధగుణములైన యాహారాదులును హితములని భావము.) మరియు సమధాతువులై సమప్రకృతికలవారికి పరస్పరవిరుద్ధములు గాకయుండు మధురాదిరసములన్నియు నుపయోగించినచో నయ్యది సాత్మ్యమైయుండును.

### మలముల క్షయవృద్ధికారణములు, లక్షణములు.

మూ. ద్వే అధః సప్త శిరసి ఖాని స్వేదముఖాని చ,
మలాయనాని బాధ్యన్తే దుష్టైర్మాత్రాధికైర్మలైః. ౪౨
మలవృద్ధిం గురుతయా లాఘవాన్మలసంక్షయమ్,
మలాయనానాం బుధ్యేత సఙ్గోత్సర్గాదతీవ చ. ౪౩

వ్యా. మనుజులశరీరమునందు అధోభాగమున గుదములింగము అనురంధ్రములును, శిరస్సుననేత్రములు, చెవులు, నాసారంధ్రములు, నోరు అనునీయేడురంధ్రములును, చెమటవెడలు అనేకరంధ్రములును కలవు. ఇయ్యవి మూత్రపురీషాదిమలములకు ముఖ్యస్థానములు. స్వస్థవృత్తినుద్దేశించి పైజెప్పినవిధానము నవలంబించనినాడు పైజెప్పినమలము దుష్టము (క్షీణము) లగును. ఒకప్పుడు తమకు నియతమైనపరిమితికన్న నధికములగును. అత్తెరంగున క్షీణతనైనను వృద్ధినైననొందిన మలములచే పైజెప్పిన మలస్థానములకు బాధ సంభవించును.

మరియు మలము లధికముగ నున్నపుడు మలములు వృద్ధినొందినవియనియు, అయ్యవి తక్కువగనున్నపుడు మలములు క్షీణించినవనియు నెఱుంగునది. మరియు మల

ములు నియతమైనపరిమాణము ననుసరించి వెడలియున్నప్పుడు మలములు క్షీణించిన వనియు, అధికముగ వెడలినపుడు వృద్ధినొందినవియనియు నెరుంగునది.

## మలాయనరోగోపచారములు.

మూ. తాన్ దోషలిఙ్గైరాదిశ్య వ్యాధీన్ సాధ్యానుపాచరేత్,
వ్యాధిహేతుప్రతిద్వన్ద్వైర్మాత్రాకాలౌ విచారయన్. ౪౪
విషమస్వస్థవృత్తానాం ఏతే రోగా స్తథాపరే,
జాయన్తేఽనాతుర స్తస్మాత్ స్వస్థవృత్తపరో భవేత్. ౪౫

వ్యా. పైజెప్పినరీతిగ మలవృద్ధిక్షయములచే సంభవించినవ్యాధులను వాతపిత్త కఫరూపములైనదోషముల చిహ్నములచే చక్కగ గమనించి అయ్యవి సాధ్యావస్థ నున్నచో వానికి వ్యాధివిపరీతములును, హేతువిపరీతములును, హేతువ్యాధివిపరీతము లును, హేతు-వ్యాధి-ఉభయవిపరీతంబులు నైన ఔషధ అన్నపానవిహారాదులచేత మాత్రాకాలాదుల జక్కగ గమనించి యుపచరింపవలెను.

మరియు పైజెప్పినస్వస్థవృత్తమునకు విరుద్ధముగ నటించువారికి ఈప్రకరణమున జెప్పినరోగములేకాక యితరములైన యనేకరోగములును తప్పక సంభవించును; కావున రోగము లేక స్వస్థత నుండుమనుజుడు పలుదెరంగులైనరోగముల కెడమీయక స్వస్థ వృత్తమున జెప్పినవిధుల నన్నిటిని విడువక యాచరించుచు మిక్కిలి జాగరూకుడై యుండవలెను.

## చైత్రాదిమాసములయందు దోషనిర్హరణము.

మూ. మాధవప్రథమే మాసి నభస్యప్రథమే పునః,
సహస్యప్రథమే చైవ హారయేద్దోషసఞ్చయమ్. ౪౬
స్నిగ్ధస్విన్నశరీరాణాం ఊర్ధ్వం చాధశ్చ నిత్యశః,
వస్తికర్మ తతః కుర్యాత్ నస్తః కర్మ చ బుద్ధిమాన్. ౪౭

వ్యా. వైశాఖమునకు మొదటిదైన చైత్రమాసమునందును, భాద్రపదమునకు మొదటిదియైన శ్రావణమాసమునందును, పౌషమాసమునకు మొదటిదియైన మార్గశీర్ష మాసమునందును అంతకుముందు సంచితమైన (చయావస్థనొందిన) దోషములను బైట వెడలించవలెను. తొలుత స్నేహపానముచే శరీరమును స్నిగ్ధముగ జేసికొని, పిదప శరీ రముపై చెమట బుట్టించి పిమ్మట నాయాదోషానుసారముగ వమనవిరేచనవస్తికర్మలచే

దోషముల బైట వెడలింపనగును. (చైత్రమాసమున ప్రధానముగ వమనమును, మార్గశీర్షమున విరేకంబును, శ్రావణమున వస్తికర్మయు ప్రధానముగ జేయవలెను). పిమ్మట నాయాదోషానుసారముగ నస్యకర్మయు చేయనగును.

పైజెప్పిన యర్థమునే తంత్రాంతరమున:—"మధౌ సహే నభసి చ మాసి దోషాన్ ప్రవాహయేత్, వమనైశ్చ విరేకైశ్చ నిరూహైస్సానువాసనైః" అనుశ్లోకముచే వివరముగ దెల్పిరి.

### రసాయనాదిప్రయోగము, దానిప్రయోజనము.

మూ. యథాక్రమం యథాయోగ్యం అత ఊర్ధ్వం ప్రయోజయేత్,
రసాయనాని సిద్ధాని వృష్యయోగాంశ్చ కాలవిత్. ౪౮
రోగాస్తథా న జాయన్తే ప్రకృతిస్థేషు ధాతుషు,
ధాతవశ్చాభివర్ధన్తే జరా మాన్ద్యముపైతి చ. ౪౯
విధిరేష వికారాణా మనుత్పత్తౌ నిదర్శితః,
నిజానామితరేషాస్తు పృథగేవోపదేక్ష్యతే. ౫౦

వ్యా. పైజెప్పినరీతిగ నాయాదోషాద్యనుగుణముగ వమనాది కర్మలను విధ్యుక్తప్రకారము పైజెప్పినవిధి ననుసరించి చేసి, పిమ్మట ఎట్టిపరిస్థితియం దేవిధమైనది యుక్తముగనుండునో అట్టిరసాయనములను, అనుభవసిద్ధములైన వృష్యయోగములను కాలాద్యనుగుణముగ ప్రయోగింపనగును. పైజెప్పినరీతిగ వమనాదివిధుల నాచరించినయెడ ధాతువులు ప్రకోపమునొందక సమస్థితినుండును. దానంజేసి రోగములు గల్గకుండును. రసాయనాదుల విధ్యుక్తముగ సేవించుటవలన రసరక్తాదిధాతువులు వృద్ధినొంది ముదిమిరాక వయసు చెడకయుండును.

ఇత్తెరంగున త్రిదోషజన్యములైన రోగములు కల్గకుండుటకై విధానము చెప్పబడినది. ఇక ప్రజ్ఞాపరాధమున కల్గు ఆగంతుకరోగములును, మానసికములైన వ్యాధులు కల్గకుండుటకు దగినవిధానము ఈక్రింద వేరుగ వివరింపబడును.

### ఆగంతుమానసికరోగములు.

మూ. యే భూతవిషవాయ్వగ్నిసమ్ప్రహారాదిసమ్భవాః,
నృణామాగన్తవో రోగాః ప్రజ్ఞా తేష్వపరాధ్యతి. ౫౧
ఈర్ష్యాశోకభయక్రోధమానద్వేషాదయశ్చ యే,
మనోవికారాస్తేఽప్యుక్తాః సర్వే ప్రజ్ఞాపరాధజాః. ౫౨

వ్యా. భూతప్రేతపిశాచాదుల యావేశముచేతను, విషము గాలి అగ్నిప్రహార ములు మున్నగు బాహ్యకారణములచేతను మనుజులకు సంభవించురోగములు శరీర సంబంధములేని బాహ్యకారణములచే సంభవించుటంజేసి యాగంతువులని చెప్పబడును. అట్టి వ్యాధులు సంభవించుటకు మనుజులయజ్ఞానంబును అన్యథా (విపరీత) జ్ఞానంబును ప్రాథమిక కారణములగును.

మరియుం ఈర్ష్య, శోకము, భయము, క్రోధము, మానము (గర్వము), ద్వేషము మున్నగునవి మనస్సునపుట్టు (మానసిక) రోగములు. ఈవ్యాధులును గూడ ప్రజ్ఞాపరాధము (అజ్ఞానము) చేతనే సంభవించును. (ఇచ్చటజెప్పబడిన ఈర్ష్య మున్నగువాని వివరణము ఈయధ్యాయముననే పైన వివరింపబడినది).

ఆగంతు మానసికరోగానుత్పత్త్యుపాయములు.

మూ. త్యాగః ప్రజ్ఞాపరాధానాం ఇన్ద్రియోపశమస్స్మృతిః,
దేశకాలాత్మవిజ్ఞానం సద్వృత్తస్యానువర్తనమ్. ౫౩
ఆగన్తూనామనుత్పత్తా ఏష మార్గో నిదర్శితః,
ప్రాజ్ఞః ప్రాగేవ తత్కుర్యాత్ హితం విద్యాద్యదాత్మనః ౫౪

వ్యా. జ్ఞానమును చెరచునట్టి కార్యములమానుట, చక్షురాదీన్ద్రియములను తమ తమవ్యాపారములయందు విచ్చలవిడిగ పోనీయక స్వాధీనమున నుంచుకొనుట, స్మృతి (పుత్రాదులకు హాని కల్గినప్పుడు పరమార్థజ్ఞానముచే నట్టిపుత్రాదులు నశించు స్వభావము కల్గినపదార్థములని తెలివిని జ్ఞప్తికి దెచ్చుకొనుట), భూతాదులు సంచరించుటకు కారణములైన శూన్యగృహము శ్మశానము మున్నగుదేశములను, అమావాస్య మున్నగు భూతాది సంచారకాలమును, తనకు స్వభావసిద్ధముగనుండు బలాదులను చక్కగ గమనించి తెలిసికొనుట, ఇంద్రియోపక్రమణీయాధ్యాయమున జెప్పబడు సద్వర్తనముల ననుసరించి నటించుట, ఇవియన్నియుం పైజెప్పిన యాగంతురోగములును మానసికరోగములును కల్గకుండుటకు కారణములు. కావున జ్ఞానవంతుడైన మానవుడు పైజెప్పిన ప్రజ్ఞాపరాధత్యాగాదులను, క్రిందజెప్పబడు ఆప్తోపదేశాద్యనుసరణమును, ఆగంతురోగములు కల్గకమునుపే యాచరించినచో నాగంతురోగములు పొడసూపకుండును.

ఇచ్చట ఇంద్రియోపశమంబును స్మృతియుం మానసికరోగ నివృత్త్యుపాయములు. దేశకాలజ్ఞానముచేత భూతపిశాచాది సంచారయోగ్యమైన శూన్యగృహ శ్మశానాది దేశములయందును పూర్ణిమ అమావాస్య మున్నగు కాలములయందును సంచారమును వదలుటచే పిశాచాదులు సోకకుండజేయుం నుపాయములగు. ఆత్మశక్తిజ్ఞానము

చేత తనశక్తిని ఎదటిబలమును చక్కఁగ గమనించి బలవద్విగ్రహాదుల వర్జించియుండ దగును.

### రోగానుత్పత్త్యుపాయాంతరములు.

మూ. ఆప్తోపదేశప్రజ్ఞానం ప్రతిపత్తిశ్చ కారణమ్,
వికారాణా మనుత్పత్తౌ ఉత్పన్నానాం చ శాన్తయే. ౫౫

వ్యా. రాగద్వేషాదులవర్జించి జ్ఞానవంతులైన పురుషులు ఆప్తులు; అట్టియాప్తులచే నుపదేశింపబడిన విశేషజ్ఞానమును తెలిసికొనుట, అట్టియుపదేశమును పొరబాటులేక చక్కఁగ నెరుంగుట, ఈరెండును రోగములు కల్గకుండుటకును, ఒకవేళ కల్గినను వానిని శాంతినొందించుటకును కారణములగును.

ఇచ్చట పైజెప్పిన రెండుకారణములును రోగములు కల్గకుండునపుడు అట్టి రోగకారణముల గమనించి వానిని వదలియుండుటచే రోగములు సంభవించకయే యుండును కావున రోగానుత్పత్తికి కారణములగును. ఇదియే నిదానపరివర్జనము. ఒక వేళ రోగములు కల్గినను వానియుత్పత్తికారణముల గుర్తించి వానికి ప్రతికూలములైన హేత్వాది ప్రత్యనీకచికిత్సల జేసి రోగముల శాంతినొందించుటకును పైజెప్పినవి రెండును కారణములగును కావున ఉత్పన్నరోగనివృత్తికిని కారణములగునని భావము.

ఆప్తులలక్షణము తంత్రాంతరమున నిట్లు చెప్పబడెను:—

"యేషాం త్రికాలమమలం జ్ఞానమవ్యాహతం సదా, ఆప్తాశ్శిష్టాశ్చ విబుధాః తేషాం వాక్యమసంశయమ్" (ఏపురుషులకు నిరంకుశమైన త్రికాలజ్ఞానము కల్గియుండునో వారు ఆప్తులనియు, శిష్టులనియు, పండితులనియు చెప్పనగును.)

### సహవాసమున కనర్హులు.

మూ. పాపవృత్తవచస్సత్త్వాః సూచకాః కలహప్రియాః,
మర్మోపహాసినో లుబ్ధాః పరవృద్ధిద్విషశ్శఠాః. ౫౬
పరాపవాదరతయః చపలా రిపుసేవినః,
నిర్ఘృణా స్త్యక్తధర్మాణః పరివర్జ్యా నరాధమాః. ౫౭

వ్యా. పాపమునకు కారణములైన శరీరవ్యాపారములను సంభాషణాది వాగ్వ్యాపారములను మనోవ్యాపారములును కలవారును, కొండెములచెప్పెడు స్వభావము కల వారును, లేనిపోని కలహముల దెచ్చుటయందు ప్రీతికలవారును, రహస్యముల వెలి బుచ్చువారును, ధనాదులయం దధికముగ నాశకలవారును, ఇతరులసంపత్తు మొదలగు

వానివృద్ధిని జూచి యోరువజాలక ద్వేషించువారును, క్రూరములైన పనులజేయువారు (క్రూరబుద్ధికలవారు)ను, పరులపై లేనిపోని యపవాదముల మోపుటయం దాసక్తులును, మనస్సు నిలుకడలేక చంచలచిత్తులును, తనకు శత్రువుల సేవించువారును, దయలేని వారును, స్వాభావికములైన ధర్మముల వదలినవారును, వీరందరును మనుజులలో మిక్కిలి యధములు. కావున అట్టిదుర్జనులతో సంభాషణాది సహవాసముల నొకప్పుడును చేయక దూరముగ విసర్జింపవలెను.

### సేవింపదగినవారు.

మూ. బుద్ధివిద్యావయశ్శీల ధైర్యస్మృతిసమాధిభిః,
వృద్ధోపసేవినో వృద్ధాః స్వభావజ్ఞా గతవ్యథాః. ౫౮
సుముఖాస్సర్వభూతానాం ప్రశాన్తాశ్శంసితవ్రతాః,
సేవ్యాస్సన్మార్గవక్తారః పుణ్యశ్రవణదర్శనాః. ౫౯

వ్యా. బుద్ధి, విద్య, వయస్సు, సదాచారము, ధైర్యము, జ్ఞాపకశక్తి, ఏకాగ్రచిత్తము అను నీగుణములచే వృద్ధులును (అనగా ప్రశస్తములయిన బుద్ధి విద్య మున్నగు వానిని కలవారని భావము). అట్టిగుణములు గలపెద్దలను గౌరవబుద్ధితో సేవించువారును, పరేంగితమును తెలిసినవారును, శోకము మున్నగు మనోవ్యథలు లేనివారును, సమస్తప్రాణులకును సుముఖులయినవారును, శాంతగుణము కలవారును, నియమము నవలంబించినవారును, మంచిమార్గముల బోధించువారును, పుణ్యమయినమాటలజెప్పుచు పుణ్యకరములయిన వస్తువులను జూచువారును, వీరందరును మంచివర్తనముకలవారు. అట్టిపెద్దలతో సహవాసముచేసి వారిని సేవించుట ముఖ్యకర్తవ్యము.

### ఆహారాదులయందు హితసేవనము.

మూ. ఆహారాచారచేష్టాసు సుఖార్థీ ప్రేత్య చేహ చ,
పరం ప్రయత్నమాతిష్ఠేత్ బుద్ధిమాన్ హితసేవనే. ౬౦

వ్యా. ఇహపరలోకములయందు సుఖమును గోరుమనుజుడు ఆహారము, ఆచారము (శాస్త్రవిహిత అనుష్ఠానము), చేష్టలు (త్రికరణవ్యాపారములు) ఈమూటి నెయ్యది తనకు మిక్కిలి హితకరమగునో అద్దాని సేవించుటకు మిక్కిలి ప్రయత్నము కలవాడై యుండవలయును.

### పెరుగును సేవింపదగినపద్ధతి.

మూ. న నక్తం దధి భుంజీత న చాప్యఘృతశర్కరం,
నాముద్గయూషం న క్షౌద్రం నోష్ణం నామలకైర్వినా. ౬౧

వ్యా. రాత్రులయందు పెరుగును భుజింపదగదు. మఱియు నేతినైనను, పంచదారనైనను, పెసరకట్టునైనను, తేనెనైనను, ఉసిరికకాయలనైనను జేర్పక పెరుగును భుజింపదగదు. (అనగా నెయ్యి మున్నగువానితో జేర్చియే పగటియందు పెరుగు నుపయోగించవలెనుకాని కేవలము పెరుగును మాత్ర ముపయోగింపదగదని భావము.) మఱియు వేడిగనుండు పదార్థములతో జేర్చి పెరుగు నుపయోగింపజనదు.

మూ. *(అలక్ష్మీదోషయుక్తత్వాత్ నక్తం తు దధివర్జితం,
శ్లేష్మలం స్యాత్ ససర్పిష్కం దధి మారుతసూదనం. ౬౨
న చ సంధుక్షయేత్పిత్తం ఆహారం చ విపాచయేత్,
శర్కరాసంయుతం దద్యాత్ తృష్ణాదాహనివారణం. ౬౩
ముద్గసూపేన సంయుక్తం దద్యాద్రక్తానిలాపహమ్,
సురసం చాల్పదోషం చ క్షౌద్రయుక్తం భవేద్దధి,
ఉష్ణం పిత్తాస్రకృద్దోషాన్ధాత్రీయుక్తస్తు నిర్హరేత్.) ౬౪

వ్యా. రాత్రులయందు పెరుగును సేవించినచో సంపత్తు తొలగును. కావున రాత్రులయందు పెరుగు నిషిద్ధము. మరియు రాత్రి దధి నుపయోగించినచో కఫమును వృద్ధినొందించును. నేతిని చక్కెరను కలిపినపెరుగు వాతమును హరించును. పిత్తమును రేపెట్టదు. ఆహారమును సుఖముగ జీర్ణింపజేయును. చక్కెరనుమాత్రము జేర్చి యుపయోగించినచో దప్పిని తాపమును శమింపజేయును. పెసలపప్పుతో జేర్చి పెరుగు నుపయోగించినచో రక్తవాతములను హరించును. తేనెకల్పి పెరుగును సేవించినచో మంచిరుచి కల్గును. దోషముల తగ్గించును. పెరుగును వెచ్చచేసియైనను వేడిపదార్థములతో జేర్చియైన నుపయోగించినయెడ రక్తపిత్తమును కల్గించును. ఉసిరికకాయతొక్కుతో జేర్చి యుపయోగించినచో త్రిదోషములను వెడలించును. (కావున పైజెప్పిన నియమప్రకారము పెరుగు నుపయోగింపవలెనని భావము).

---

* ఇచ్చట ౬౨, ౬౩, ౬౪, సంఖ్యలుకల గ్రంథము జీవానందవిద్యాసాగర భట్టాచార్యునిచే కలకత్తానగరమున ముద్రింపబడిన గ్రంథమున నున్నది. బొంబయిలో నిర్ణయసాగరముద్రాయంత్రముద్రితప్రతిలో మాత్రము ఫుట్‌నోటులో నధికపాఠముగ గనుపరచబడినది. ఎట్లైనను విషయము ముఖ్యముగ గమనింపదగినదని తలచి మూలముతో జేర్చి మాచే వ్యాఖ్యానము వ్రాయబడినది. విజ్ఞులు గమనింతురుగాక!

## వ్యత్యస్తముగ దధిని సేవించుటచే గల్గురోగములు.

మూ. జ్వరాఽసృక్పిత్తవీసర్పకుష్ఠపాండ్వామయభ్రమాన్,
ప్రాప్నుయాత్కామలాం చోగ్రాం విధిం హిత్వా దధిప్రియః.

వ్యా. పెరుగును పైజెప్పినపద్ధతి నవలంబించక వ్యత్యస్తముగ నుపయోగించినచో జ్వరము, రక్తపిత్తము, విసర్పము, కుష్ఠము, పాండురోగము, భ్రమను, తీవ్రమైనకామల అను నీరోగములను కల్గించును.

(ప్రతిదినము భోజనమున నుపయోగింపదగిన పదార్థములలో పెరుగు అనేకవిధములచే నిషిద్ధము కావున అట్టిపెరుగు నుపయోగించువిధము సూచనామాత్రముగ నియ్యెడ స్వస్థవృత్తసందర్భమున జెప్పబడియె).

## అధ్యాయవిషయసంగ్రహము.

మూ. అత్రశ్లోకాః—
వేగా వేగసముత్థాశ్చ రోగాస్తేషాం చ భేషజమ్,
యేషాం వేగా విధార్యాశ్చ యదర్థం యద్ధితాఽహితమ్. ౬౬
ఉచితే చాహితే వర్జ్యే సేవ్యే వానుచితే క్రమః,
యథాప్రకృతి చాహారో మలాయనగదౌషధమ్. ౬౭
భవిష్యతామనుత్పత్తౌ రోగాణామౌషధం చ యత్,
వర్జ్యాః సేవ్యాశ్చ పురుషాః ధీమతాఽఽత్మసుఖార్థినా, ౬౮
విధినా దధి సేవ్యం చ యేన యస్మాత్తదత్రిజః,
న వేగాన్ ధారణేఽధ్యాయే సర్వమేవాఽవదన్మునిః. ౬౯

వ్యా. మలమూత్రాదివేగములు, అట్టి వేగనిరోధమున బుట్టునట్టివ్యాధులు, అట్టి రోగములకు దగినచికిత్సలు, ధరింపదగినవేగములు, వానిప్రయోజనములు, హితములు, అహితములు, అభ్యస్తమైనయహితమును వదలుటకును అభ్యస్తముకాని హితమును సేవించుటకును క్రమము. ఆయాప్రకృతులకు దగినయాహారములు, మలాయనములు, అందు సంభవించువ్యాధులు, వానిచికిత్స, రాకుండువ్యాధుల రానీయకజేసికొను నుపాయములు, సంభవించినవ్యాధుల నివర్తింపజేయునుపాయములు, ఔషధములు, తనకు సుఖమును కోరువారిచే వర్జింపవలసినపురుషులు, సేవింపదగినపురుషులు, పెరుగును సేవించవలసినవిధి. విధిననుసరింపక సేవింపబడినపెరుగుచే గల్గువ్యాధులు అను నీవిషయముల నన్నిటిని వివరణముగ నీ "నవేగాన్ ధారణీయ" మనునధ్యాయమునందు ఆత్రేయమహాముని చెప్పెను.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
న వేగాన్ధారణీయో నామ సప్తమోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతమై చరకునిచే సంస్కరింపబడిన చరకసంహిత యందు సూత్రస్థానమున నవేగాన్ధారణీయ మనునధ్యాయమున నేడవయధ్యాయము సమాప్తము.

---

## అష్టమాధ్యాయము.

అవతారిక:—పైజెప్పినయధ్యాయాంతమున ఆహారాచారచేష్టలయందు మిక్కిలి శ్రద్ధవహించి యుండవలెనని "ఆహారాచారచేష్టాసు పరం ప్రయత్నమాతిష్ఠేత్" అను వాక్యములచే జెప్పబడినది. అందు ఆహారచేష్టలు కొన్ని పైయధ్యాయములు మూటియందును నిరూపింపబడినవి. తక్కినయాచారమును, ఇంద్రియములయొక్కయు మనస్సుయొక్కయు అతియోగ మిథ్యాయోగపరిహార రూపచేష్టలను నిరూపించుటకై యింద్రియోపక్రమణీయ మనునీయధ్యాయము చెప్పబడును.

మూ. అథాత ఇన్ద్రియోపక్రమణీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. నవేగాంధారణీయాధ్యాయమును జెప్పినపిదప ఇంద్రియోపక్రమణీయ మనునధ్యాయమును ఆత్రేయుండు త్రికాలజ్ఞానసంపన్నుడు నాకుపదేశించిన విషయములకు న్యూనాతిరేకములు లేక యుండునట్లు వివరించెదనని యర్థము.

ఇంద్రియముల వివరణము నధికరించి చెప్పబడిన యధ్యాయము ఇంద్రియోపక్రమణీయము. అని యధ్యాయసంజ్ఞ.

### ఇంద్రియాదిసంఖ్యావివరణము.

మూ. ఇహ ఖలు పంచేంద్రియాణి, పంచేంద్రియద్రవ్యాణి, పంచేంద్రియాధిష్ఠానాని, పంచేంద్రియార్థాః, పంచేంద్రియబుద్ధయో భవన్తీత్యుక్తం ఇంద్రియాధికారే. 3

వ్యా. ఈ ఇంద్రియాధికారమునందు ఐదు ఇంద్రియములనియు, ఐదు ఇంద్రియ ద్రవ్యములనియు, ఐదు ఇంద్రియాధిష్ఠానములనియు, ఐదు ఇంద్రియార్థములనియు, ఐదు ఇంద్రియబుద్ధులనియు నిర్ణయించి చెప్పబడినది.

ఇచ్చట ఈప్రకరణమునందు పైజెప్పిన నిర్ణయము సంఖ్యానియమము అని చెప్పుటచేత ప్రకరణాంతరమునందు మధురరసప్రస్తాపగుణ 'షడింద్రియప్రసాదనః' అను వాక్యముచే ఆరు ఇంద్రియములని మనస్సుతో కూడ చేర్చి చెప్పినది సంగతమగును. మఱియుం సాంఖ్యవైశేషికాదిమతముల మతానుసారముగ ఏకాదశేంద్రియ అభిధానము గూడ సంగతమగును.

మనస్సు, దానివ్యాపారము.

మూ. అతీన్ద్రియం పునర్మనః సత్వసంజ్ఞకం చేత ఇత్యాహు రేకే, తద
ర్థాత్మసంపదాయత్తచేష్టం చేష్టాప్రత్యయభూతం ఇన్ద్రియాణాం. ౮

వ్యా. మనస్సు అనునది బాహ్యజ్ఞానములకు కారణములుగానుండు చక్షురాది ఇంద్రియములకంటె వేరయినది. అదియే సత్వమనియు, చేతస్సనియు కొందరు చెప్పెదరు. అట్టి మనస్సుకు సుఖాదులును, చింతనీయవిషయంబును విషయములై యుండును. అట్టి విషయములను చేతనమును గూర్చునట్టి ఆత్మయును, ఈరెంటికిని అధీనమైనచేష్టలు గల్గి మనస్సుండును. మఱియు చూచుట వినుట మున్నగు నింద్రియచేష్టలకు ఈమనస్సే కారణమైయుండును.

ఇచ్చట నీసంగ్రహము నెరుంగునది:—సుఖాదులును, చింత్యాదులును, మనస్సుకు విషయములు; అయ్యవి యెప్పుడు మనస్సుకు విషయములుగా (గోచరములుగా) స్ఫూర్తికి వచ్చునో అప్పుడు ఆత్మయనునది ప్రయత్నపడి మనస్సును ప్రేరేపించును. ఆ మనస్సు స్వవిషయములయందు ప్రవర్తించును. పిమ్మట ఆ మనస్సు ఇంద్రియముల ప్రేరేపించి ఆయావిషయములయందు ఇంద్రియములను ప్రవేశపెట్టును కావున మనస్సుకు సంబంధించిన విషయములను ఆత్మను ఆధారముగ జేసికొని ఇంద్రియముల వాని వాని కృత్యములయందు ప్రేరేపించును. కావున మనస్సుయొక్క వ్యాపారము చింత్యాదివిషయములయందును, ఆత్మయందును ఆధారపడియుండునని భావము.

మనస్సు ఏకత్వసిద్ధాంతము.

మూ. స్వార్థేన్ద్రియార్థ సంకల్పవ్యభిచరణాచ్చానేకమేకస్మిన్ పురుషే
సత్వం, రజః తమస్సత్వగుణయోగాచ్చ, న చానేకత్వం; న
హ్యేకం హ్యేకకాలమనేకేషు ప్రవర్తతే; తస్మాన్నైకకాలా
సర్వేన్ద్రియప్రవృత్తిః. ౯

వ్యా. మనస్సు సర్వకాల సర్వావస్థలయందును ఏకరూపంబును, పరమాణువుబోలె నతిసూక్ష్మంబు నైయుండును. అట్టియేకరూపమైన మనస్సు స్వవిషయములైన చింత్యవిచార్యాదుల యొక్కయు, ఇంద్రియార్థములైన శబ్ద-స్పర్శ-రూప-రస-గంధముల యొక్కయు, సంకల్పముయొక్కయు భేదముచేతను; సత్వ-రజ-స్తమోగుణసంబంధము చేతను, అనేకముగ నున్నట్లు గాన్పించును. అట్టి యేకరూపమైన మనస్సు ఏకకాలము నందు అనేకవిషయములయందు ప్రవర్తింపదు; కావున (మనస్సు ఏకరూపమగుటవలన) చక్షురాదీంద్రియములన్నియు నేకకాలమున స్వవిషయములయందు ప్రవర్తింపనోపదు. అని యర్థము.

ఇచ్చట నీవివరణము నెరుంగునది: మనస్సు ఏకరూపమనుట నిర్వివాదాంశము:—అయ్యది తనకు విషయమయిన చింత్యములు అనేకములుగ నుండుటంజేసి వానిసంబంధరూపమైన యుంపాధిభేదమున ననేకముగ కన్పట్టును. ఎట్టులన:—మనస్సు ఎప్పుడు ధర్మమును చింతించునో అప్పుడు ధర్మచింతకమనియు, ధర్మము నువదలి కామమును చింతించునపుడు కామచింతకమనియు, ఇట్టిభేదములచే అర్థచింతకము, మోక్షచింతకము అని మనోవ్యాపారభేదములచే భిన్నభిన్నములుగ చెప్పబడును.

ఇత్తెరంగుననే ఇంద్రియార్థసంబంధ భేదమునుజేసియు ననేకముగ గానవచ్చును. ఎట్టులన:—మనస్సుయొక్క సంబంధము లేక చక్షురాదీంద్రియములు తమతమ విషయముల గ్రహించుటకు ప్రవర్తింపనేరవు. మనస్సు చక్షురింద్రియమును ప్రేరణచేసి తద్వారా రూపము నెప్పుడు గ్రహించునో, అప్పుడు రూపగ్రాహకమని చెప్పబడును. ఎప్పుడు ఘ్రాణేంద్రియముతో కలిసి గంధమును గ్రహించునో అప్పుడు గంధగ్రాహకమని చెప్పనగును. ఇత్తెఱంగున తక్కిన యింద్రియముల గలసి ఆయావిషయముల గ్రహించునప్పుడు రసనగ్రాహకము, శబ్దగ్రాహకము, స్పర్శగ్రాహకము నని విషయభేదరూపమైన యుంపాధిభేదముచే ననేకరూపములుగ గన్పట్టును.

ఇత్తెరంగుననే సంకల్పభేదమునను భిన్నముగ నుండును:—ఆయాసంకల్పమునకు సంబంధించి విషయముల ననేకముల సంకల్పించునపుడు ఇది మనకు గుణవంతము, ఇయ్యది దోషభూయిష్ఠము అను సంకల్పభేదములచేతను మనస్సు నానారూపముగ గన్పట్టును.

మరియు సత్వరజస్తమోగుణముల భేదముచే ననేకముగ గన్పడును:—సత్వగుణముతో మనస్సు సంబంధించినపుడు సత్యము శౌచము మున్నగు గుణములతో గూడియుండును. రజోగుణసంబంధము కల్గిననాడు తృష్ణ మొదలగు గుణముల గల్గియుండును. తమోగుణసంబంధము కల్గినప్పుడు అజ్ఞానము భయము మున్నగుగుణములు కల్గును. అట్టి

గుణరూపమైన యుంపాధిభేదముచే మనస్సు అనేకముగ గన్పట్టును. కావున పైజెప్పిన రీతిగ నుపాధిభేదములచే మనస్సు నానారూపముగ గన్పట్టును గాని పరమార్థముగ నేక రూపము. మరియు దేవదత్త-యజ్ఞదత్త-విష్ణుమిత్రులను మువ్వురియందును మనస్సు వేరువేరుగనుండును. కావున ఒకరిమనస్సు గంధమును గ్రహించునపుడు వేరొకనిమనస్సు రూపమును గ్రహించును. ఆసమయముననే మరియొకనిమనస్సు శబ్దమును గ్రహించును. ఇచ్చట నీముప్వురియందును మనస్సు వేరు వేరుగ నుండుటవలన సమకాలముననే యనేకకార్యములజేయ సమర్థమైనది.

ఒక్క మనుజునియందును మనస్సు అనేక రూపములుగ నున్నచో నొక్క కాలమునందే యనేక వ్యాపారములయందు ప్రవర్తించును. లోకమున నొకని మనస్సు చక్షురింద్రియముతో కలిసి రూపమును గ్రహించునపుడు తక్కినయింద్రియముల వ్యాపారములు కల్గుట లేదు. ఇది యనుభవసిద్ధము. కావున మనస్సు ఒక్కమనుజుని యందు ఒకటిగనే యుండును కాని అనేకముగ నుండదు. ఉపాధిభేదమునంజేసి పైజెప్పినరీతిగ నానారూపముగ దోచునని సిద్ధాంతము.

మరియు మనస్సు అణురూపమైనది. ఈవిషయము తంత్రాంతరమున నిట్లు చెప్ప బడినది:—''అణుత్వమథ చైకత్వం ద్వౌ గుణౌ మనసః స్మృతౌ'' అణుత్వంబును, ఏక త్వంబును మనస్సుకు రెండుగుణములని భావము.

## మనస్సుకు సాత్వికాదిగుణసంబంధము.

మూ. యద్గుణం చాభీక్ష్ణం పురుషమనువర్తతే సత్వం, తత్సత్వమే వోపదిశన్తి మునయో గుణబాహుళ్యాత్. ౬

వ్యా. (పైజెప్పినప్రకారము మనస్సు ఏకమని సిద్ధాంతముచేయబడినది; అట్లైన యెడ మనస్సు సత్వము, రజస్సు, తమస్సు అను మూడుగుణములలో నొకప్పుడు సత్వ గుణముతో జేరియుండును, మరియొకప్పుడు రజోగుణముతోను, వేరొకప్పుడు తమో గుణముతోను జేరియుండును, గాని మనస్సు మాత్ర మొక్కటియె అట్టిగుణత్ర యముతో కాలభేదమున కల్గియుండుననియు నిర్ణయింపబడినది. అట్టియెడ వీడు సాత్వి కుడు, వీడు రాజసుడు, వీడు తామసుడు అని భేదమెట్లు సంభవించుననిన దానికారణము 'యద్గుణం' అను వాక్యముచే నిరూపింపబడినది).

మనస్సు సత్వాదిగుణములలో నేగుణముతో జేరి యొకపురుషుని మాటిమాటి కనుసరించియుండునో, అట్టి యధికగుణ సంబంధమునంజేసి మనస్సు అట్టిగుణముకల్గి నదిగా (సాత్వికము, రాజసము, తామసమునని) మునులు చెప్పెదరు.

ఇచ్చట నీవిషయము నెఱుంగునది:—సత్వరజస్తమోగుణములు మూఁడును మనస్సుకు సంబంధించియుండును. అందు ఏగుణమధికముగ మనస్సుకు సంబంధించి యభివ్యక్తమగునో ఆమనస్సు అట్టిగుణము కల్గినదని వ్యవహరింపబడును. సత్వగుణం బధికముగ సంబంధించినయెడ సాత్వికము అని చెప్పబడును. అట్టిపురుషుడు సత్వగుణమునకు సంబంధించిన సత్యశౌచాదిగుణములు కల్గియుండును. అట్టి సత్వగుణప్రధానమైన మనస్సుకల్గియుండుటంజేసి సాత్వికుడని చెప్పబడును. రజోగుణసంబంధం బధికముగగల మనస్సు రాజసము; అట్టి మనస్సుకలమానవుడు తృష్ణాదిగుణములు కల్గియుండును. దానంజేసి రాజసుడని చెప్పబడును. తమోగుణ మధికముగగల మనస్సు తామసము. అట్టిమనస్సు కలమనుజుడు ప్రమాదము ఆలస్యము నిద్ర మొదలగుగుణములు కల్గియుండును. దాని వలన తామసుడని పేర్కొనంబడును. కాన ఇంతమాత్రమున మనస్సు నానారూపము అని చెప్పదగదని భావము.

## ఇంద్రియవ్యాపారములకు మనస్సు కారణము, ఇంద్రియపంచకము.

మూ. మనఃపురస్సరాణి చేన్ద్రియాణి అర్థసఙ్గ్రహసమర్థాని భవన్తి తత్ర చక్షు, శ్శ్రోత్రం, ఘ్రాణం, రసనం, స్పర్శనమితి పఞ్చేన్ద్రియాణి.　　　౭

వ్యా. పైజెప్పిన మనస్సును ప్రధానముగ జేసికొని యింద్రియములు తమతమ విషయములను గ్రహించుటకు సమర్థములగును. (మనస్సు ఏయింద్రియముతో గూడి ప్రేరణచేయునో అప్పు డాయింద్రియము దానికిసంబంధించిన విషయమును గ్రహింపసమర్థ మగునుగాని, మనస్సు ఇంద్రియముతో సంబంధింపకుండిన తనవిషయమును గ్రహింపనోపదని భావము). పైజెప్పినవానిలో నింద్రియములు చక్షుస్సు, శ్రోత్రము, ఘ్రాణము, రసనము, స్పర్శనము నని యింద్రియములు ఐదువిధములు.

చక్షురాదులకు అన్వర్థత నిట్లెరుంగునది:—'చష్టే రూపం, రూపవంతం చ ప్రకాశయతీతి = చక్షుః' (నీల పీతాదిరూపమును అట్టిరూపముతోగూడిన ఘటపటాది పదార్థములను గ్రహించితెల్పునది చక్షుస్సు) అయ్యది రెండు నేత్రగోళముల నాశ్రయించియుండు శక్తివిశేషము. ఏకరూపము.

శ్రుణోత్యనేన శబ్దమితి = శ్రోత్రం; (శబ్దమును వినుటకు సాధనమైన శక్తి విశేషము శ్రోత్రము. ఇయ్యదియు రెండు కర్ణరంధ్రముల నాశ్రయించి యేకరూపముగ నుండును). జిఘ్రత్యనేన గంధమితి = ఘ్రాణమ్, గంధమును గ్రహించుటకు సాధనమైనశక్తి ఘ్రాణము, ఇది నాసారంధ్రముల రెంటి నాశ్రయించియుండును. రస్యత్య

నేనేతి రసనమ్, (మధురాదిరసముల గ్రహింప సాధనమైన శక్తి రసనము. ఇయ్యది జిహ్వా నాశ్రయించియుండును). స్పృశత్యనేనేతి = స్పర్శనమ్, శీతోష్ణములను తెలిసికొనుటకు సాధనమైనది స్పర్శనము. ఇచ్చట కరణరూపార్థప్రత్యయములచే పైజెప్పిన యర్థములు లభించును. దానంజేసియే యింద్రియములు కరణములనియు చెప్పబడును.

ఐదు ఇంద్రియద్రవ్యములు.

మూ. పఞ్చేన్ద్రియద్రవ్యాణి:—ఖం వాయుర్జ్యోతిరాపో భూమిరితి.

వ్యా. ఇంద్రియములను ప్రధానముగ నారంభించునది (ఇంద్రియోత్పత్తికి ఉపాదానకారణము) ఇంద్రియద్రవ్యములు. అట్టిద్రవ్యములు ఆకాశము, వాయువు, తేజస్సు (అగ్ని), జలము, భూమియు నని యైదు. (ఆకాశము శ్రోత్రేన్ద్రియమునకును, వాయువు స్పర్శనమునకును, తేజస్సు చక్షురింద్రియమునకును, జలము రసనేంద్రియమునకును, భూమి ఘ్రాణేంద్రియమునకును ద్రవ్యములు).

పంచేంద్రియములలో చక్షుస్సు ప్రధానము కావున తొలుత జెప్పబడినది. శాలాక్యమున చక్షురింద్రియప్రాధాన్య మిట్లు చెప్పబడినది:—"శ్రోత్రత్వఘ్రాణరసనైః శ్రైరపి సమన్వితః, బలవర్ణాద్యుపేతోఽపి నష్టదృక్కుడ్యసన్నిభః" శ్రేష్ఠములైన శ్రోత్రత్వక్ ఘ్రాణరసనములను నాల్గుఇంద్రియములతో గూడి బలవర్ణాదులు కల్గియున్నను చక్షురింద్రియ మొక్కటి మాత్రము లేనిపురుషుడు గోడవలె నిరుపయోగమగును; కావున చక్షురింద్రియము తక్కినయింద్రియములకన్న ప్రధానము.

ఇంద్రియద్రవ్యములు ఇంద్రియములవరుస ననుసరించి చెప్పవలసియున్నను, పైజెప్పబడు "మహాభూతాని ఖం వాయురగ్నిరాపః క్షితిస్తథా" అనునట్టి మహాభూతములవరుస ననుసరించి చెప్పబడినవి.

పంచేంద్రియాధిష్ఠానములు.

మూ. పఞ్చేన్ద్రియాధిష్ఠానాని:—

అక్షిణీ, కర్ణౌ, నాసికే, జిహ్వా, త్వక్చేతి.

వ్యా. ఇంద్రియముల కాశ్రయములు ఇంద్రియాధిష్ఠానములు. అయ్యవి రెండు నేత్రగోళములు, రెండు కర్ణరంధ్రములు, రెండు నాసాద్వారములు, నాలుక, త్వక్కు అనియు నైదుగ నుండును.

పైజెప్పినవి వరుసగ చక్షురాదీంద్రియక్రమము ననుసరించి యైదిటికి నైదుఆశ్రయములని యెరుంగునది. ఇచ్చట అక్షి-కర్ణ-నాసికలు రెండేసి యైయున్నను, ఒక్కొక యింద్రియమున కధిష్ఠానము కావున ఐదు అని చెప్పినది సమంజసము.

## పంచేంద్రియార్థములు.

మూ. పఞ్చేన్ద్రియార్థాః—శబ్దస్పర్శరూపరసగన్ధాః. ౧౦

వ్యా. ఇంద్రియార్థములనగ ఇంద్రియములచే గ్రహింపదగిన విషయములు. అయ్యవి శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము నని యైదుగ నుండును.

ఇచ్చట స్పర్శశబ్దముచేత స్పర్శము, స్పర్శమున కాశ్రయమైన ద్రవ్యమూ, స్పర్శముతోఁగూడ సమవాయసంబంధముచే గలిసియున్న స్పర్శపరిమాణాదులును అని గ్రహింపబడును. ఇత్తెరంగుననే రూపాదులయందును ఊహించునది.

## పంచేంద్రియబుద్ధులు.

మూ పఞ్చేన్ద్రియబుద్ధయః చక్షుర్బుద్ధ్యాదికాః; తాః పునరిన్ద్రియేన్ద్రియార్థసత్త్వాత్మసన్నికర్షజాః క్షణికా నిశ్చయాత్మికాశ్చ; ఇత్యేతత్పఞ్చపఞ్చకమ్. ౧౧

వ్యా. ఇంద్రియబుద్ధులన:—అసాధారణకారణమైన యింద్రియముచేత వ్యవహరింపబడిన బుద్ధులు ఇంద్రియబుద్ధులు. అవి చక్షుర్బుద్ధి, శ్రోత్రబుద్ధి, ఘ్రాణబుద్ధి, రసనబుద్ధి, స్పర్శనబుద్ధియుఁ ననియైదు. (అసాధారణ కారణమైన చక్షురింద్రియముచే గల్గినబుద్ధి చక్షుర్బుద్ధి. తక్కిననాల్గిటి నిత్తెరంగున నూహించునది.) అట్టిబుద్ధులు ఇంద్రియములు, ఇంద్రియార్థములు, మనస్సు, ఆత్మ అను నీనాల్గిటి యొక్క సంబంధముచే గల్గును. (అట్టిసంబంధము కొన్నిటికి సంయోగసంబంధము కొన్నిటికి సమవాయసంబంధము. అందు చక్షుర్బుద్ధియందు తొలుత నాత్మ మనస్సుతోఁ కూడి ప్రేరేపించును. ఆమనస్సు చక్షురింద్రియమును ప్రేరణ చేయుఁను. అయ్యది రూపయుక్తద్రవ్యముతోఁ సంయోగరూపమైన సంబంధమున రూపాదుల గ్రహించును. ఇది చక్షురింద్రియబుద్ధికి సంపత్తు. శ్రోత్రేంద్రియబుద్ధియందు శ్రోత్రమునకును శబ్దమునకును సమవాయసంబంధము. ఇత్తెరంగుననే తక్కిన యింద్రియబుద్ధుల యుత్పత్తిక్రమము నెరుంగునది). అట్టి యింద్రియబుద్ధులు క్షణికములు (శీఘ్రముగ నశించునవి) అనగ పైజెప్పినరీతిగ ఆత్మ మనస్సు ఇంద్రియములు ఇంద్రియార్థములు అనువాని పరస్పరసంబంధము కల్గినప్పుడు ఆయాయింద్రియబుద్ధులు బొడమును. అట్టిసంబంధము ఆగినప్పుడు ఆయాయింద్రియబుద్ధియుఁ నశించునని భావము). మరియుఁ నవి వస్తుస్వరూపాదుల నిశ్చయించు స్వభావము కల్గినవి. ఇత్తెరంగున నింద్రియపంచకము, ఇంద్రియద్రవ్యపంచకము, ఇంద్రియాధిష్ఠానపంచకము, ఇంద్రియార్థపంచకము, ఇంద్రియబుద్ధిపంచకము నను ఐదుపంచకములు చెప్పబడినవి.

## అధ్యాత్మద్రవ్యగుణసంగ్రహము.

మూ. మనో మనోఽర్థో బుద్ధిరాత్మా చ, ఇత్యధ్యాత్మద్రవ్యగుణసంగ్రహః, శుభాఽశుభప్రవృత్తినివృత్తిహేతుశ్చ, ద్రవ్యాశ్రితం చ కర్మ, యదుచ్యతే క్రియేతి. ౧౨

వ్యా. మనస్సు, 'మనసస్తు చింత్యోఽర్థః' అను పదునారవ వాక్యమున జెప్పబడు మనోఽర్థము, మనస్సుకు సంబంధించిన బుద్ధి, ఆత్మ అను నీనాల్గును ఆత్మకు సంబంధించి చెప్పబడిన ద్రవ్యములయొక్కయు గుణములయొక్కయు సంగ్రహము. (అందు రూపాదిబుద్ధులు గుణములు, తక్కినవి ద్రవ్యములు.)

పైజెప్పిన యధ్యాత్మద్రవ్యగుణసంగ్రహము శుభము యొక్కయును సుఖము యొక్కయును ప్రవృత్తికిని, అశుభమైన యధర్మముయొక్కయు దుఃఖముయొక్కయు నివృత్తికిని కారణమగును. మరియు ద్రవ్యము నాశ్రయించిన క్రియారూపమైనది కర్మ యనబడును.

పైజెప్పిన యధ్యాత్మద్రవ్యగుణ సంగ్రహముయొక్క సమ్యగ్యోగము (విధ్యుక్తాచరణము) కల్గునప్పుడు శుభముయొక్క ప్రవృత్తికిని అశుభముయొక్క నివృత్తికిని హేతువగును. అయోగ-అతియోగ-మిథ్యాయోగములు కల్గునప్పుడు కేవలము అశుభ ప్రవృత్తికి హేతువగును.

## చక్షురాదీంద్రియములకు తైజసత్వాదినిర్ణయము.

మూ. తత్రానుమానగమ్యానాం పఞ్చమహాభూతవికారసముదాయాత్మకానామపి సతామిన్ద్రియాణాం తేజశ్చక్షుషి, ఖం శ్రోత్రే, ఘ్రాణే క్షితిః, ఆపో రసనే, స్పర్శనే అనిలః విశేషేణోపపద్యతే.

వ్యా. పైజెప్పిన చక్షురాదీంద్రియము లైదిటిలో నొక్కొక్కటియు పృథివ్యాది పంచభూతవికారసముదాయాత్మకమై యుండును; అట్టి పంచభూతవికారవైశిష్ట్యము అనుమానముచే దెలియందగియుండును. అట్లు పంచభూతాత్మకము లైనను చక్షురింద్రియమున తేజస్సును, శ్రోత్రేంద్రియమున నాకాశంబును, ఘ్రాణేంద్రియమున భూమియు, రసనేంద్రియమున జలంబును, స్పర్శనేంద్రియమున వాయువును అధికముగ నుండును. (ఆయాయింద్రియమునకు జెప్పిన ఆయా భూతముయొక్కభాగ మధికముగ నుండునని భావము).

మరియుం చక్షురాదీంద్రియములయందు పంచభూతాంశము లన్నియుం జేరి యున్నను తేజోభాగ మధికమగుటచే చక్షురింద్రియము తైజసమనియుం, ఆకాశభాగ మధికమగుటచే శ్రోత్రేంద్రియము నాభసమనియుం, భూమియంశ మధికమగుటంజేసి ఘ్రాణేంద్రియము పార్థివమనియుం, జలభాగ మధికమగుటవలన రసనేంద్రియము అప్యమనియుం, వాయుభాగ మధికమగుటవలన వాయ్వాత్మకమనియుం ముఖ్యముగ వ్యవహరింపబడునని భావము.

## ఇంద్రియములకు తైజసత్వాదినిర్ణయము.

మూ. తత్ర యద్యదాత్మకమిన్ద్రియం విశేషాత్తత్తదాత్మకమేవార్థ మనుగృహ్ణాతి తత్స్వభావాత్, విభుత్వాచ్చ. ౧౪

వ్యా. పృథివ్యాదిపంచభూతములలో నొక్కొకభూతాంశము ఒక్కొక యింద్రియమున నధికముగ నుండుననియుం, దానంజేసి తైజసము నాభసము మున్నగు వ్యవహారము ఆయాయింద్రియమునకు కల్గియుండుననియుం పైని జెప్పబడినది. ఇయ్యది తేజోధికము ఇయ్యది ఆకాశాధికము ఇవి మున్నగుపరిజ్ఞానము ఎట్లు కల్గునని ఆవిషయ మీవాక్యమున వివరింపబడును:—

ఏయింద్రియము పంచభూతములలో నేభూతముయొక్క భాగ మధికముగ కల్గియుండునో అట్టిభూతముచే నారంభింపబడిన యాయింద్రియము అట్టిభూతమునకు సంబంధించినవిషయమునే గ్రహించును. అది యేలయన:—ఇద్రియమునకు అట్టిగుణము స్వాభావికమైనది. తనకు సజాతీయవిషయమునే గ్రహించుటకు శక్తికల్గినది. కావున పైజెప్పినరీతిగ నాయాయింద్రియమునకు సజాతీయమగువిషయమునే గ్రహించును. అని యర్థము.

ఉదాహరణము:—చక్షురింద్రియము తేజఃప్రధానమైనది. తేజఃప్రధానమైన రూపమాత్రమును గ్రహించుటవలన తైజసము. అని అనుమానముచే నిర్ణయింపదగి యుండును. రసనేన్ద్రియము రూపాదులలో తనకు సజాతీయమైన రసమును మాత్రము గ్రహించుటవలనఆప్యము. ఇత్తెరంగున నాభసాదులమూటిని యనుమానముచే నెరుంగునది.

## ఇంద్రియముల అతియోగమిథ్యాయోగసమయోగములు, వాని కారణములు.

మూ. తదర్థాతియోగాయోగమిథ్యాయోగాత్సమనస్క మిన్ద్రియం వికృతిమాపద్యమానం యథాస్వం బుద్ధ్యుపఘాతాయ సమ్పద్యతే, సామర్థ్యయోగాత్పునః ప్రకృతిమాపద్యమానం బుద్ధిమాప్యాయయతి. ౧౫

వ్యా. పైజెప్పిన యింద్రియార్థములయొక్క అతియోగము (చక్షురాదీంద్రియములకు వానివానికి సంబంధించి రూపాదివిషయములతో నధికముగ సంబంధమును జేసి అట్టివిషయముల నధికముగ గ్రహించుచుండుట), అయోగము (మిక్కిలి సూక్ష్మములైన సూచీరంధ్రము మున్నగువాని విశేషముగ జూచుట, లేక రూపాదులకు బొత్తుగ చూడకుండుట, ఈరెండును అయోగము), మిథ్యాయోగము (చక్షురాదీంద్రియములచేత వికృతరూపములును భయంకరములైన రూపాదులను జూచుట) అను నీమూడు కారణములు సంభవించినప్పుడు అట్టియింద్రియమునకు ప్రేరకమైనమనస్సుతో కూడిన యాయింద్రియము వికృతిని జెంది ఆయింద్రియమునకు సంబంధించినబుద్ధికి విఘాతము కల్గును. (అట్టియింద్రియబుద్ధి కల్గనేరదనుట).

మరియు ఆయాయింద్రియములు తమతమ విషయములయందు సమ (న్యూనాతిరేకములు లేక) మైనయోగము కల్గినప్పుడు ఆయాయింద్రియములు వికృతిజెందక స్వభావస్థితినుండి వానివానికిసంబంధించినబుద్ధిని హానిలేకనిరంతరముగ వృద్ధినొందించును.

## మనోఽర్థము, దాని సమహీనమిథ్యాయోగములచే గల్గుఫలము.

మూ. మనసస్తు చిన్త్యమర్థః, తత్ర మనసో మనోబుద్ధేశ్చ తఏవ సమాతిహీనమిథ్యాయోగాః ప్రకృతివికృతిహేతవో భవన్తి. ౧౬

వ్యా. మనస్సుకు చింత్యము విషయము (చింతన మనగ నాలోచన, అట్టియాలోచనకు సంబంధించినవిషయము చింత్యము. అదియే మనస్సుకు సంబంధించినయర్థమని భావము). అందు మనస్సుకును మనోబుద్ధికిని స్వవిషయమునందు సమయోగము కల్గినప్పుడు మనస్సు వికృతిజెందక స్వవిషయమైన చింత్యమునందు చక్కగ ప్రవర్తించును. అట్టిమనస్సుకును మనోబుద్ధికిని స్వవిషయమునందు హీనయోగము అయోగము కల్గిన నప్పుడును,పరిమాణమునకన్న నధికముగ సంబంధము కల్గినప్పుడును వికృతిజెందును.

ఇంద్రియముల నపేక్షించక కేవలము మనస్సు మాత్రము దేనిని గ్రహించునో అయ్యది చింత్యము. లేక యింద్రియములచే గ్రహింపబడిన విషయమునే యింద్రియసంబంధము నపేక్షింపక మనస్సుమాత్రము గ్రహించిన నయ్యదికూడ చింత్యము. అట్టిరెండుచింత్యములును మనస్సుకు విషయములని భావము. మరియు సుఖదుఃఖాదులును మనస్సుకు విషయము లైయున్నను వానిలో చింత్యము ప్రధానమైనవిషయమని భావముచే నిచ్చట ప్రధానముగ జెప్పబడినది. (మనస్సు న్యూనాధికములు లేక సమచింతనమున మనస్సు వికృతిజెందక స్వభావస్థితి నుండుననియు, చింతనము బొత్తుగ లేకున్నను, అధికముగ చింతనము జేసినను, భయంకరాదిచింతనము జేసినను మనస్సు వికృతిజెంది, మనోబుద్ధిని కూడ చెరచునని ముఖ్యభావము).

## ఇంద్రియములకును మనస్సుకును స్వస్థపరిపాలనోపాయము.

మూ. తత్రేన్ద్రియాణాం సమనస్కానాం అనుపతప్తానా మనుపతా
పాయ, ప్రకృతిభావే ప్రయతితవ్యం ఏభిర్హేతుభిః; తద్యథా:—
సాత్మ్యేన్ద్రియార్థసంయోగేన, బుద్ధ్యా సమ్యగవేక్ష్యాఽవేక్ష్య
కర్మణాం సమ్యక్ప్రతిపాదనేన, దేశకాలాత్మగుణవిపరీతోపాస
నేన చ ఇతి. తస్మాదాత్మహితం చికీర్షతా సర్వేణ సర్వం సర్వదా
స్మృతిమాస్థాయ సద్వృత్తమనుష్ఠేయమ్                    ౧౭

వ్యా. వికృతిజెందక స్వభావస్థితినుండు చక్షురాదీంద్రియములకును మనస్సుకును ఏవిధమైన వికృతియు కల్గకుండుటకై (వికృతిని కల్గించుకారణముల వర్జించుటచేతను, ఒకవేళ వద్దికల్గినప్పుడు దానిని తొలగించునౌషధాదులచేతను) మిక్కిలి ప్రయత్న ముతో నుండవలెను. అది యెట్టులన:—తనకు ఇది హితము ఇది యహితము నని బుద్ధి చేత పలుమారు చక్కగ నాలోచించి, తనకు సాత్మ్యములైన (ప్రతికూలముకాని) యింద్రియార్థసంయోగముచేత నాయావ్యాపారములను (అహితములవదలి హితములను) ఆచరించుటచేతను, ఇంద్రియములకును మనస్సునకును వికృతి గల్గనీయక స్వస్థతను కాపాడవలెను. (ఇటు చెప్పుటచేత అసాత్మ్యేంద్రియార్థసంయోగముచేతను ప్రజ్ఞాపరా ధముచేతను సంభవించు అహితములైన ఇంద్రియ మనోవ్యాపారములను మాని హితము లైన సాత్మ్యేంద్రియ మనోవ్యాపారములచేత, స్వస్థతనుండు ఇంద్రియాదులను వికృతి జెందనీయక కాపాడవలెనని భావము).

మరియు (అట్టి యింద్రియములును మనస్సును వికృతిజెందినప్పుడు) జాంగలాది దేశగుణములకును, వసంతాదికాలగుణములకును, వాతాదిప్రకృతిగుణములకును, రోగ ములకును, విపరీతములైన యౌషధాహారాదుల హితాహితముల చక్కగ గమనించి అందు హితముల నాచరించుటచేత ఇంద్రియమనస్సంబంధమైన వికారమునకు నివృత్తిచేయుం టకు యత్నించవలెను.

కావున తనకు హితమును జేయ కోరువారందరును అన్నివిషయములను చక్కగ నిర్మలమైన మనస్సుచే నాలోచించి అసద్వర్తనమును బొత్తుగ వదలి మంచివృత్తమును అనుష్ఠానము చేయుచుండవలెను.

## సద్వృత్తానుష్ఠానక్రమము.

మూ. తద్ధ్యనుతిష్ఠన్ యుగపత్ సంపాదయత్యర్థద్వయమారోగ్య
మిన్ద్రియవిజయం చేతి; తత్సద్వృత్తమఖిలేనోపదేక్ష్యామోఽ

గ్నివేశ! తథా:— దేవగోబ్రాహ్మణగురువృద్ధసిద్ధాచార్యా నర్చ
యేత్, అగ్నిముపచరేత్, ఓషధీః ప్రశస్తాః ధారయేత్, ద్వౌ
కాలావుపస్పృశేత్, మలాయనేష్వభీక్ష్ణం పాదయోశ్చ వైమ
ల్యమాదధ్యాత్, త్రిః పక్షస్య కేశశ్మశ్రులోమనఖాన్ సంహార
యేత్, నిత్యమనుపహతవాసాః సుమనాస్సుగన్ధిస్స్యాత్. ౧౮

వ్యా. ఈక్రిందచెప్పబడు సద్వృత్తములను అనుష్ఠించినచో మానవుడు ఆరోగ్య
మును ఇంద్రియవిజయమును ఒకేకాలమున సంపాదించుకొనగలడు. కావున అట్టి
సద్వృత్తమును పూర్తిగ నీక్రింద నుపదేశించెదను. అది యెట్టిదనిన:— దేవతలు, బ్రాహ్మ
ణులు, గురువులు, జ్ఞానవయోవృద్ధులు, తపస్సిద్ధులు, ఉపదేశాదుల జేసిన యాచార్యుల
వీరినందరిని తగినభక్తితో పూజించవలెను. శ్రౌతాగ్నిని స్మార్తాగ్నిని హోమవిధిచే నుప
చరించవలెను. మిక్కిలిప్రశస్తములైన యోషధుల సంగ్రహించి పదిలముగ నుంచవలెను
ప్రతిదినమున సాయంప్రాతఃకాలముల రెంటియందును స్నానముచేసి సంధ్యనుపాసించ
వలెను. (ఇచ్చట నుపస్పర్శమన స్నానంబును సంధ్యోపాసనమును నర్థము; 'ఉపస్పర్శ
స్స్పర్శమాత్రే స్నానాచమనయోరపి' అని మేదిని.) మలస్థానములైన గుదాదిస్థానము
యందును, పాదములయందును, మలినమును చేరనీయక శుభ్రపరచవలెను. పక్షమునకు
మూడుమార్లు (ఐదుదినములకొకతూరి) కేశములను, మీసములను, రోమములను, గోళ్లన
క్షౌరము చేసికొనవలెను. ప్రతిదినంబును నిర్మలమైన బట్టల ధరించి, మంచి మనస్సుక
మంచి పరిమళము కల్గియుండవలెను.

'త్రిర్మాసస్య రోమనఖాన్ సంహారయేత్' అని క్షీరపాణి చెప్పియున్నాడు
ఈ వాక్యము ననుసరించి ఇచ్చట 'పక్షస్య' అను పదమునకు మాసమని యర్థముచే
మాసమునకు మూడుమార్లు క్షౌరము చేసికొనవలెనని యర్థముచేయుట సమంజసము
"పతతి బుతుర్మాసాభ్యాం పక్షరూపాభ్యాం" అను ప్రమాణాంతరముచేత పక్షమన
మాసమనియు అర్థమగుచున్నది.

### సాధువేశాదిసద్వృత్తము.

మూ. సాధువేశః, ప్రసాధితకేశః, మూర్ధశ్రోత్రఘ్రాణపాదతైలనిత్యో
ధూమపః, పూర్వాభిభాషీ, సుముఖః, దుర్గేష్వభ్యుపపత్తా
హోతా, యష్టా, దాతా, చతుష్పథానాం నమస్కర్తా, బ
నాముపహర్తా, అతిథీనాం పూజకః, పితౄణాంపిణ్డదః, కా

హితమితమధురార్థవాదీ, వశ్యాత్మా, ధర్మాత్మా, హేతావీర్షుః,
ఫలేనేర్షుః నిశ్చిన్తో(త్తో), నిర్భీకః, ధీమాన్, హ్రీమాన్, మహో
త్సాహో, దక్షః, క్షమావాన్, ధార్మికః, ఆస్తికో, వినయబుద్ధి
విద్యాభిజనవయోవృద్ధసిద్ధాచార్యాణాముపాసితా, ఛత్రీ,
దణ్డీ, మౌనీ, సోపాత్కో, యుగమాత్రదృగ్విచరేత్. ౧౯

వ్యా. మంచివేషముకల్గి తలవెండ్రుకలను చక్కగదువ్వి కట్టియుంచుకొనవలెను. శిరస్సు, చెవులు, ముక్కులు, పాదములు అను నీయవయవములయందు నియతముగ తైలము నుపయోగించుకొనవలెను. ధూమవిధియందు జెప్పినప్రకారము పొగపీల్చవలెను. పూజనీయులగు పెద్దలు తటస్థించినపుడు వారిముందు గౌరవించి ముందుగ మాట్లాడవలెను. ఎల్లప్పుడును సుముఖుడుగ నుండవలెను. కష్టముగనుండువారికి ధైర్యముచెప్పి కాపాడవలెను. అగ్నిహోత్రము మున్నగు హోమములజేయవలెను. యాగములచేయవలెను. తనశక్తికొలది దానము చేయుంవాడుగ నుండవలెను. నాల్గుత్రోవలు కలియుం స్థలమును చూచినప్పుడు నమస్కారము చేయవలెను. దేవతల బూజించవలెను. అతిథుల బూజించవలెను. పితృదేవతలకు పిండదానము చేయవలెను. దేశకాలాదుల నెరింగి హితంబులును, మితంబులును, వినుటకు మధురంబులు అర్థముతో కూడినవియు నగు మాటల బల్కవలెను. ఇంద్రియములను మనస్సు తనవశమున నుంచుకొనవలెను. ధర్మస్వభావము కల్గియుండవలెను. హేతువునందు ఈర్ష్యకలవాడైయుండవలెను. (ఒకడు ద్రవ్యవంతుడును విద్యావంతుడును మున్నగు సంపదలకలవాడై యున్నపుడు అట్టివానిసంపదలకు ఈర్ష్య లేక అయ్యవి వానికెట్లు లభించెనని వానికారణములయందు ఈర్ష్యకల్గి వానిని సంపాదించుటకై ప్రయత్నము చేయవలెను.) ఫలమునం దసూయ లేకుండవలెను. మంచికర్మములచే నొకరికి సంపత్తు మున్నగు ఫలము కల్గిననాడు అట్టి ఫలమును జూచి యసూయపడదగదు.) ప్రతివిషయమునందును, సంశయములేక నిశ్చయజ్ఞానము కల్గియుండవలెను. భయరహితుడును (ఆపత్కాలమున భయపడువాడును), బుద్ధిమంతుడును, పాపకృత్యములజేయ లజ్జించువాడును, సత్కార్యములజేయుట కుత్సాహము కలవాడును, సమర్థుడును, ఓర్పుకలవాడును, ధర్మబుద్ధికలవాడును, ఆస్తికుడు (దేవుడు కలడని నమ్మకము కలవాడు) నై యుండవలెను. విద్యచేతను, వినయముచేతను, బుద్ధిచేతను, సత్కులముచేతను, వయస్సుచేతను అధికులైనవారిని, సిద్ధులను, ఆచార్యులను మిక్కిలి భక్తిశ్రద్ధలతో ననువర్తించుచుండవలెను. తాను సంచరించునప్పుడు గొడుగు దండమును పట్టుకొని, సిగ ముడివేసి, పాదరక్షల దొడిగికొని మడకకాడి యంతదూరము వరకు ముందుచూచుచు నడువవలెను.

మంగళాచారాదిసద్వృత్తములు.

మూ. మజ్గళాచారశీలః, కుచేలాస్థికణ్టకామేధ్యకేశతుషోత్కరభస్మకపాలస్నానభూమీనాం పరిహర్తా, ప్రాక్ శ్రమాత్ వ్యాయామవర్జీ స్యాత్, సర్వప్రాణిషు బన్ధుభూతస్స్యాత్, క్రుద్ధానామనునేతా, భీతానామాశ్వాసయితా, దీనానామభ్యుపపత్తా, సత్యసన్ధః, సామప్రధానః, పరపరుషవచనసహిష్ణుః, అమర్షఘ్నః, ప్రశమగుణదర్శీ, రాగద్వేషహేతూనాం హన్తా. ౨౦

వ్యా. శుభకరములైన యాచారంబును స్వభావంబును కల్గియుండవలెను. చింపి పేలికలును, ఎముకముక్కలును, ముండ్లును, జలమలాదులైన యశుద్ధంబులును, వెండ్రుకలును, పొట్టును, పెంటయు, బూడిదెయు, చిల్లరపెంకులును, కల్గినప్రదేశములయందు సంచరింపదగదు. మరియు స్నానముచేయు స్థలమున సంచరింపదగదు. (కావున పైజెప్పినస్థలముల వర్జించవలెను). తనకు బడలిక కలుగకమునుపే దేహపరిశ్రమమును విడువవలెను.)సకలప్రాణులయందును బంధువుబోలె ప్రీతి కల్గియుండవలెను. కోపముకలవారినను నయముల బల్కవలెను. భయపడువారికి దిగులుతీర్చి భయము నుడుపవలెను. బీదలకు సహాయపడవలెను. తాజేసిన ప్రతిజ్ఞ నేరవేర్చుకొనవలెను. సామోపాయము ప్రధానముగ గల్గి యుండనగును. (వివాదము కల్గినప్పుడు సమాధానము పరచుటయందే మనస్సు కల్గియుండవలెను.) ఇతరులు క్రూరముగ మాట్లాడినను దాని సహించుకొనవలెను. కోపము కల్గినప్పుడు దాని నణచికొనవలెను. శాంతము ప్రధానమైన గుణముగ గలవాడై, యుండవలెను. రాగద్వేషాదుల గల్గించుకారణముల మానియుండవలెను.

మనుజులు విసర్జింపవలసినవిషయములు.

మూ. నానృతం బ్రూయాత్, నాన్యస్వమాదదీత, నాన్యస్త్రియమభిలషేత్, నాన్యశ్రియం, న వైరం రోచయేత్, న కుర్యాత్పాపం, న పాపేఽపి పాపీ స్యాత్, నాన్యదోషాన్ బ్రూయాత్, నాన్యరహస్యమాగమయేత్,నాఽధార్మికైర్న నరేన్ద్రద్విష్టైస్సహాసీత, నోన్మత్తైర్న పతితైర్న భ్రూణహన్తృభిః న క్షుద్రైర్న దుష్టైః, న దుష్టయానాన్యారోహేత్,న జానుసమం కఠినమాసనమధ్యాసీత, నోనాస్తీర్ణమనుపహిత మవిశాలమసమం వా శయనం

సంపద్యేత, న గిరివిషమమస్తకేష్వనుచరేత్, న ద్రుమమారోహేత్, న జలోగ్రవేగమవగాహేత, న కులచ్ఛాయాముపాసీత, నాగ్న్యుత్పాతమభితశ్చరేత్, నోచ్చైర్హసేత్, న శబ్దవన్తం మారుతం ముఞ్చేత్, నానావృతముఖో జృమ్భాం క్షవథుం హాస్యంవా ప్రవర్తయేత్, న నాసికాం కుష్ణీయాత్, న దన్తాన్ విఘట్టయేత్, న నఖాన్ వాదయేత్, నాస్థీన్యభిహన్యాత్, న భూమిం విలిఖేత్, న ఛిన్ద్యాత్తృణమ్, నలోష్టంమృద్నీయాత్.

వ్యా. అబద్ధము పల్కరాదు. ఇతరుల ద్రవ్యమును అపహరింపదగదు. ఇతరుల భార్యల గోరదగదు. ఇతరుల సంపత్తును హరింపరాదు. ఇతరులతో వైరము బూనదగదు. పాపకృత్యముల జేయదగదు. తనకపకారము చేసినవారికైనను బదులుగ నపకారము చేయరాదు. ఇతరులదోషమును వెల్లడిగ జెప్పరాదు. ఇతరుల రహస్యమును గమనింపకూడదు. ధర్మమును దప్పినవారు పరిపాలకుడగు ప్రభువుతో ద్వేషించినవారు,పిచ్చిబట్టినవారు కులాచారములకు విరుద్ధములైన యకృత్యముల జేయుటచే భ్రష్టులు,భ్రూణహత్య (గర్భమును చెరచుట)ను చేసినవారు, క్షుద్రులు (ఆభిచారికాది క్రూరకృత్యములజేయువారు) దుష్టములైనపనుల జేయువారు, వీరితో నొకప్పుడు సహశయనాసన భోజనాది సహవాసము చేయరాదు. దుష్టములైన గుఱ్ఱములు మున్నగు వాహనములపైనెక్కి సవారి చేయదగదు. మోకాటియెత్తుకల్గిన యాసనముపైకూర్చుండదగదు. కఠినమైన యాసనముపై కూర్చుండదగదు. సరిగా పరచక దిండ్లులేక విశాలముకాక మెత్తనలేక సమముకాని పడకపై పరుండరాదు. పర్వతములయొక్క శిఖరములపైనను మిట్ట పల్లములైన ప్రదేశమునందును సంచరింపదగదు. చెట్లపై నెక్కదగదు. అతివేగముగ ప్రవహించు జలమున స్నానాదులకై దిగకూడదు. మైనీడయం దుండరాదు. నిప్పు రగిలి పెద్దగ మండుచుండ దానివద్దకు పోదగదు. బిగ్గరగ నవ్వకూడదు. నిశ్వాసవాతమును శబ్దముతో గూడినట్టులు వెడలింపరాదు. ఆవలించుట, తుమ్ముట, నవ్వుట ఈపనుల జేయునప్పుడు నోరు మూసికొనక యుండరాదు. (నోరు మూసికొని అట్టిపనుల జేయవలెనని భావము.) ముక్కును గీరకూడదు. పండ్లు కొరకరాదు. గోళ్లతో గోళ్లను రుద్ది చప్పుడు చేయరాదు. ఎముకలతో నెముకలను గొట్టరాదు. భూమి గీరదగదు. తృణాదులను గోట గిల్లరాదు. మట్టిపెళ్లలను చేతులతో పిసకరాదు.

మూ. న విగుణమఙ్గైశ్చేష్టేత, జ్యోతీంష్యనిష్టమమేధ్యమశస్తం చ నాభివీక్షేత, న హుంకుర్యాచ్ఛవమ్,న చైత్యధ్వజగురుపూజ్యాశస్త

చ్ఛాయామాక్రమేత్, న క్షపాసు అమరసదనచైత్యచత్వరచతుష్పథోపవనశ్మశానాఘాతనాన్యాసేవేత, నైకశ్శూన్యగృహమ్, న చాటవీమనుప్రవిశేత్, న పాపవృత్తాన్ స్త్రీమిత్రభృత్యాన్ భజేత, నోత్తమైర్విరుధ్యేత, నావరానుపాసీత, న జిహ్మాం రోచయేత్, నానార్యమాశ్రయేత్, న భయముత్పాదయేత్, న సాహసాతిస్వప్నప్రజాగరస్నానపానాశనాన్యాసేవేత, నోర్ధ్వజానుశ్చిరంతిష్ఠేత్, న వ్యాళానుపసర్పేత్, న దంష్ట్రిణః, న విషాణినః. పురోవాతాతపావశ్యాయాతిప్రవాతాన్ జహ్యాత్, కలిం నారభేత, నాసునిభృతోఽగ్నిముపాసీత, నోచ్ఛిష్టోనాధఃకృత్వా ప్రతాపయేత్, నావిగతక్లమః నానాప్లుతవదనః న నగ్న ఉపస్పృశేత్, న స్నానశాట్యా స్పృశేదుత్తమాఙ్గమ్, న కేశాగ్రాణ్యభిహన్యాత్, నోపస్పృశ్యేత ఏవ వాససీ బిభృయాత్, నాస్పృష్ట్వా రత్నాజ్యపూజ్యమఙ్గళసుమనోఽభినిష్క్రామేత్, న పూజ్యమఙ్గళాన్యపసవ్యం గచ్ఛేత్. నేతరాణ్యనుదక్షిణమ్.

వ్యా. కరచరణాద్యవయవములతో వికారములుగ చేష్టలజేయరాదు. సూర్యుడు మున్నగు మిక్కిలి తేజోవంతములైనవానిని, ఇష్టముగాని పదార్థములను, అమేధ్యము (మనసు కింపుగాని) పదార్థములను, అప్రశస్తములగు శ్మశానమునందలి మంట మున్నగువాని కండ్ల జూడదగదు. శవమును హుంకరించరాదు. చైత్యవృక్షము (గ్రామమున ప్రధానముగనుండు రచ్చమాను), దేవాలయములయందలి ధ్వజస్తంభము, గురువులు, పూజార్హులగు తలిదండ్రులు మున్నగువారు వీని నీడయం దుండరాదు. (ఆనీడ సోకునట్లుండరాదు). ఆరోగ్యులును అపరిశుద్ధులు నగువారినీడ నుండజనదు (శరీరముపై సోకరాదు.) దేవాలయములయందును, బలిచేయుటకై విడచియుండు స్థలమునందును, అశ్వత్థము మున్నగు చెట్లక్రిందను, నాల్గుత్రోవలు చేరునట్టి స్థలమునందును, ఉద్యానవనములయందును, రుద్రభూమియందును, జీవవధగావింప నిర్ణయించిన స్థలమునందును రాత్రులయం దుండదగదు. శూన్య (జనములేని) గృహమునందును, అడవియందును ఒక్కడుగ నుండరాదు. పాపకృత్యముల జేయునట్టిస్త్రీలను మిత్రులను భృత్యులను దగ్గిర చేర్పరాదు. ఉత్తములైనవారితో విరోధింపరాదు. నీచులతో చెలిమి చేయరాదు. కపటబుద్ధి కలవానిని మనసునందైన దలపరాదు. దుష్టుల నాశ్రయింప దగదు.

ఇతరులకు భయమును గల్గింపగూడదు. సాహసము, నిద్ర, జాగరణము, స్నానము, జలపానము, భోజనము వీని నన్నిటిని అధికముగ జేయజనదు. మోకాళ్లపైన చాలకాలము కూర్చొని యుండరాదు. సర్పములు, కోరలుకల క్రూరజంతువులు, కొమ్ములుకల మృగములు వీనిసమీపమునకు పోరాదు. తూర్పుగాలి, ఎండ, మంచు, పెనుగాలి వీని సంబంధమును విడువవలెను. జగడము నారంభింపరాదు. అగ్నిని మిక్కిలి జాగ్రత్తగ నుపాసించవలెను. అపరిశుద్ధుడై యగ్ని నుపాసింపదగదు. క్రింద నేమియు నుంచక కేవలము భూమిపై నగ్నినిడి మంటవేయదగదు. శరీరవ్యాయామాదులచే గల్గిన బడలిక తీరకమునుపు స్నానము చేయరాదు. ముఖమును కడిగికొనకయు, దిగంబరుడయ్యును స్నానము చేయదగదు. స్నానము చేసినవస్త్రముతో తలను తుడుచుకొనదగదు. తలవెంట్రుకలకొనలను విదలింపరాదు. తాను కట్టియున్నగుడ్డల విడిచిపెట్టి స్నానముచేసి మరల నాగుడ్డలను కట్టరాదు. తాను ప్రయాణముచేసి బైట పోదలచినప్పుడు రత్నములనైనను, ఆజ్యమునైనను, పూజింపదగిన వస్తువులనైనను, మంగళకరములగు పుష్పఫలాదులనైనను కంటచూచి స్పృశింపక వెడలకూడదు. (పైజెప్పినవానిని స్పృశించి వెడలవలెననుట). పూజ్యములగు దేవతలయాలయము మున్నగు వానికిని మంగళకరములైన ద్రవ్యములకును అపసవ్యముగ పోవజనదు. పూజ్యములుకాని ద్రవ్యములకును, మంగళకరములుకాని వానికిని ప్రదక్షిణముగ జనకూడదు.

ఇచ్చట "న శవం హుం కుర్యాత్" అనుదానికి శవమును హుంకరించినచో శరీరమునందలి సౌమ్యభాగము వెడలునని భావము. ఈవిషయము 'యశ్శవం హుం కుర్యాత్ తేన సోమో బహిర్నిరస్తో భవతి' అనుప్రమాణముచే దెలిసెడి.

### భోజనకాలనియమములు.

మూ. నారత్నపాణిర్నాస్నాతో నోపహతవాసాః, నాజపిత్వా, నాహుత్వా దేవతాభ్యో, నానిరూప్య పితృభ్యో, నాదత్త్వా గురుభ్యో, నాతిథిభ్యో, నోపాశ్రితేభ్యో, నాపుణ్యగన్ధో, నామాలీ, నాప్రక్షాళితపాణిపాదవదనో, నాశుద్ధముఖో, నోదఙ్ముఖో, న విమనాః, నాభక్తాశిష్టాశుచిక్షుధితపరిచరో, నాపాత్రీష్వమేధ్యాసు, నాకాలే, నాదేశే, నాకీర్ణే, నాదత్త్వాగ్రమగ్నయే, నాప్రోక్షితం ప్రోక్షణోదకైః, మన్త్రైరనభిమన్త్రితం, న కుత్సయన్న కుత్సితం, న ప్రతికూలోపహితమన్నమాదదీత, న పర్యుషితమన్యత్ర మాంసహరితకశుష్కశాకఫలభక్ష్యేభ్యః,

నాశేషభుక్ స్యాత్ అన్యత్ర దధిమధులవణసక్తుసలిలసర్పిర్భ్యః,
న నక్తం దధి భుఞ్జీత, న సక్తూనేకానశ్నీయాత్, న నిశి, న
భుక్త్వా, న బహూన్, న ద్విరోదకాన్తరితాన్, న ఛిత్త్వా
ద్విజైర్భక్షయేత్. ౨3

వ్యా. చేతి వ్రేలియందు మణిని ధరించక భుజింపదగదు. మరియు స్నానము చేయకయు, ఉతికి మడుగులేని గుడ్డల గట్టకయు, సంధ్యాదిజపము సేయకయు, ఔపాసనాదిహోమము సేయకయు, దేవతలకు నివేదింపకయు, పితృదేవతలకు భాగమియ్యకయు, గురువులకు ఇయ్యకయు, అతిథులకును ఆశ్రితులకును బెట్టకయు భుజింపదగదు.

మరియు పరిశుద్ధమైన గంధమును బూసికొనకయు, పుష్పమాలికల ధరింపకయు, చేతులను కాళ్లను ముఖమును కడిగికొనకయు, నోరు పుక్కిలించి యాచమనమును సేయకయు భుజింపరాదు. ఉత్తరాభిముఖముగ గూర్చుండి యెుకప్పుడును భుజింపరాదు. సంతోషములేకయు, భక్తిలేకయు భుజింపరాదు. భక్తిలేనివారిని, సదాచారములేనివారిని, అపరిశుద్ధులను, ఆకలిగొన్నవారిని ముందరనిడికొని భుజింపరాదు. అపాత్రులును అపరిశుద్ధులును నగువారియింట భుజింపదగదు. యుక్తముకాని దేశమునందును అకాలమునందును భుజింపరాదు. అనేకజనులచే వ్యాపించినస్థలమున భుజింపదగదు. తొలుత నగ్నియందు హోమము (వైశ్వదేవము) చేయకయు, మంత్రముచే నభిమంత్రించిన జలముచే ప్రోక్షణముచేయకయు, వేదోక్తమంత్రములచే నభిమంత్రించకయు భోజనము చేయకూడదు. నిర్దుష్టమైనయన్నమును నిందించుచును భుజింపదగదు. తనకు ప్రతికూలులగువారిచే బెట్టబడినయన్నమును భుజింపజనదు. పర్యుషితమైన (ఒకరాత్రిగడచిన యాహారపదార్థమును) భుజింపజనదు. మాంసము, అల్లము మున్నగు పచ్చిపదార్థములు, ఎండిన యాకుకూరలు, పండ్లు, చక్కిలములు మున్నగుభక్ష్యములు మాత్రము పర్యుషితములైనను భుజింపదగును. పెరుగు, తేనె మున్నగు మధురపదార్థములు, ఉప్పు, సత్తుపిండి, ఉదకము, నెయ్యి అను నీపదార్థములుదక్క తక్కినపదార్థములను నిశ్శేషముగ భుజింపదగదు. (పెరుగు మున్నగువానిని మాత్రము నిశ్శేషముగ (ఆకులో నుంచినవానిలో మిగలనీయక) భుజింపవలెననియు, తక్కినవానిని కొంచెము శేషముండునట్లు తినవలెననియు భావము). రాత్రులయందు పెరుగును భుజింపదగదు. సత్తుపిండితో చక్కెరను నేతిని పెరుగును చేర్చక ఒక్కదానిని మాత్రము తినకూడదు. ఆసత్తుపిండిని రాత్రియందును, అధికముగను, భుజించినపిమ్మటను రెండుమార్లును తిన

కూడదు. నీళ్లను పడమనడమ త్రాగుచు సత్తుపిండిని తినకూడదు. కూరలు ఊరుగాయలు మున్నగువానిని పండ్లతో కొంచెము కొంచెముగ కొరికి తినగూడదు.

"దివా కపిత్థే వసతి రాత్రౌ దధ్ని చ సక్తుషు, అలక్ష్మీః కలహాధారా కోవిదారే కృతాలయా" అను ప్రమాణాంతరముచేత రాత్రిపూట పెరుగునందును సత్తుపిండి యందును అలక్ష్మియుండును కావున వానిని రాత్రులయందు తినగూడదు.

### ఇంక కొన్ని సద్వృత్తములు.

మూ. నాఽనృజుః క్షుయాన్నాద్యాన్న శయీత, న వేగితోఽన్య కార్యస్స్యాత్, న వాయ్వగ్నిసలిలసోమార్కద్విజగురుప్రతి ముఖం నిష్ఠీవికావాతవర్చోమూత్రాణ్యుత్సృజేత్, న పన్థానమవ మూత్రయేత్, న జనవతి, నాన్నకాలే, న జపహోమాధ్యయన బలిమంగళక్రియాసు, శ్లేష్మసింఘాణక ముంచేత్. ౨౪

వ్యా. తుమ్మునపుడును, భుజించునపుడును, పరుండునపుడును, శరీరమును వంకర టింకరగ నుంచుకొనక చక్కగ నుంచుకొనవలెను. మలమూత్రవాతములు వెడలనున్న పుడు వానిని నిరోధించి (బిగబట్టి) ఇతరకార్యములను చేయరాదు. గాలికిని, అగ్నికిని, ఉదకమునకును, సూర్యచంద్రులకును, బ్రాహ్మణులకును, పూజ్యులయిన తల్లిదండ్రులు మున్నగువారికిని యెట్టయెదుట, నుమియరాదు. మఱియుం అపానవాతమును మల మూత్రములును వారియెదుట విడువకూడదు. పలువురు నడుచుత్రోవయందును, పదు గురు జనులు కూడియుండుచోటను, పైజెప్పిన మలమూత్రాదులను విసర్జింపదగదు. మరియుం పైజెప్పిన స్థలములయందును, అన్నమును భుజించునపుడును, జపము హోమము అధ్యయనము పూజ మంగళకరమైనకృత్యములు, మున్నగు పనులజేయునపుడును శ్లేష్మ మును ముక్కునుండి చీదగూడదు.

### స్త్రీలవిషయమై తానుండవలసిన నడవడిక.

మూ. న స్త్రియమవజానీత, నాతివిస్రంభయేత్, న గుహ్యమనుశ్రావ యేత్, నాధికుర్యాత్; నరజస్వలాం, నాతురాం, నామేధ్యాం, నాశస్తాం,నానిష్టరూపాచారోపచారాం,నాదక్షాం,నాదక్షిణాం, నాకామాం, నాన్యకామాం, నాన్యస్త్రియం, నాన్యయోనీం, నాయోనౌ, న చైత్యచత్వరచతుష్పథోపవనశ్మశానాఘాతసలి లౌషధిద్విజగురుసురాలయేషు,న సన్ధ్యయోః,నాతిథిషు,నాశుచిః,

నాజగ్ధభేషజో, నాప్రణీతసఙ్కల్పో, నానుపస్థితప్రహర్షో, నాభుక్తవాన్, నాత్యాశితో, న విషమస్థో, న మూత్రోచ్చార పీడితో, న శ్రమవ్యాయామోపవాసక్లమాభిహతో నాఽరహసి వ్యవాయం గచ్ఛేత్. ౨౫

వ్యా. స్త్రీని యవమానింపరాదు. స్త్రీయం దధికముగ చనవు జూపరాదు. గోప్యమయిన రహస్యమును స్త్రీకి దెలుపగూడదు. అధికారమును అధికముగ నివ్వదగదు. మఱియు రజస్వల, రోగపీడితురాలు, అపరిశుద్ధురాలు, కుష్ఠము మున్నగు రోగముల చేత పీడితురాలైన స్త్రీతో సంభోగము చేయదగదు. ఇంపుగాని కురూపముగలదియు, ఇష్టములేని యుపచారములు చేయునదియు, ప్రతికూలమయిన ఆచారముగలదియు, అసమర్థురాలును, తనయందు ప్రీతిలేనిదియు, తనయందు కామములేనిదియు, పర పురుషునియందు కోరికకల్గినదియు నయినస్త్రీలతో కలియరాదు. ఇతరులస్త్రీలను, ఇతరజాతియందు బుట్టినస్త్రీని పొందకూడదు. గుహ్యములకంటె నితరమైనస్థళమున రమింపగూడదు. గ్రామమునడుమనుండు రచ్చమాను, యాగభూమి, చతుష్పథము, (నాల్గుత్రోవలు కలియుచోటు) ఉద్యానవనము, స్మశానము, జంతువుల హింసజేయు స్థళము, జలము, మందుల నుంచుస్థళము, బ్రాహ్మణులయిల్లు, గురువులయిల్లు, దేవాలయము అను నీస్థళములయందు స్త్రీలతో రమింపగూడదు. సంధ్యాకాలముల రెంటి యందును, ఏకాదశీ మొదలగు సంభోగనిషిద్ధమయిన దినములయందును, సంభోగము చేయరాదు. ఆశౌచాదులచే నపరిశుద్ధుడుగ నున్నపుడు రమింపదగదు.

వృష్యములును, రసాయనములును నగునౌషధముల సేవింపకయు, సంకల్పము జేయకయు, సంతోషములేకయు, భుజింపకయు, అధికముగ భుజించియు, కష్టమైన మిట్టపల్లములయిన స్థలముననుండియు, మలమూత్రాదివేగములచే పీడితుడయ్యును సంభోగము చేయరాదు. త్రోవనడచుట మున్నగు పనులచే అలసటజెందినపుడును, దేహ పరిశ్రమముచే నయినను, ఉపవాసముచే నయినను, బడలిక జెందినపుడును సంభోగము చేయదగదు. రహస్యముగాక ప్రకటమైనస్థళమున స్త్రీల గూడరాదు.

### కొన్నినియమాంతరములు.

మూ. న సతో, న గురూన్పరివదేత్, నాశుచిరభిచారకర్మచైత్యపూజ్య పూజాధ్యయనమభినిర్వర్తయేత్. ౨౬

వ్యా. సత్పురుషులను, గురువులను, తల్లిదండ్రులను దుర్భాషణలంగ దూషింప రాదు. అభిచారకర్మమును, (యితరులకు బాధను కల్గించు జపహోమాదులను) అపరి

శుద్ధుడుగా నుండునపుడు చేయదగదు. అట్టివాడు యాగభూమికి పోదగదు. పూజ్యు లయినవారిని పూజించుటయు, అధ్యయనమును జదువుటయు అశుచిగ నుండువాడు చేయదగదు.

## వేదాధ్యయననియమములు.

మూ. న విద్యుత్సు అనార్తవీషు, నాభ్యుదితాసు దిక్షు, నాగ్నిసంప్లవే, న భూమికంపే, న మహోత్సవే, నోల్కాపాతే, న మహాగ్రహోపగమనే, న నష్టచంద్రాయాం తిథౌ, న సంధ్యయోః, నాముఖాద్గురోః, నావపతితం, నాతిమాత్రం, న తాంతం, నవిస్వరం, నానవస్థితపదం, నాతిద్రుతం, నాతివిలంబితం,నాతిక్లీబం, నాత్యుచ్చైః, నాతినీచైః స్వరైరధ్యయనమభ్యసేత్. ౨౮

వ్యా. అకాలమునందు ఆకసమున ఉరుములు మెరుములు గల్గినప్పుడును, ఎండచేత దిక్కులు మండుచున్నపుడును, అగ్నిచే నుపద్రవము గల్గినప్పుడును, భూకంపము గల్గినప్పుడును, గొప్పఉత్సవములు గల్గినప్పుడును, ఆకసమునుండి పిడుగులు పడునప్పుడును, చంద్రసూర్యుల గ్రహణకాలమునందును, అమావాస్యనాడును, రెండు సంధ్యాకాలములయందును, వేదాధ్యయనము చేయతగదు. ఎప్పుడయినను గురుముఖముగ వేదమును చెప్పుకొనవలయునుగాని, పుస్తకాదులను పెట్టుకొని, తాను చదువరాదు. మఱియు కొన్ని యక్షరములను వదలియు, లేనిపోని దీర్ఘములదీసియు, లేక హ్రస్వములపెట్టియు, ఉదాత్తాది స్వరములు లేకయు, పదమును వేరువేరుగ దెలియకయు నధ్యయనము చేయరాదు. మఱియు అతివేగముగను, అతివిళంబముగ (మిక్కిలి నిదానముగ)ను, మిక్కిలి తేలికగను, మిక్కిలి బిగ్గరగను, మిక్కిలి మందస్వరముగను అధ్యయనము చేయరాదు.

## కొన్నిసదాచారములు.

మూ. నాతిసమయం జహ్యాత్, న నియమం ఛింద్యాత్, న నక్తం నాదేశే చరేత్, న సన్ధ్యాస్వభ్యవహారాధ్యయనస్త్రీస్వప్నసేవీ స్యాత్, న బాలవృద్ధలుబ్ధమూర్ఖక్లిష్టక్లీబైస్సహ సఖ్యం కుర్యాత్. న మద్యద్యూతవేశ్యాప్రసఙ్గరుచిస్స్యాత్, న గుహ్యం వివృణుయాత్, న కశ్చిదవజానీయాత్, నాహంమానీ స్యాత్, నాదక్షో, నాదక్షిణో, నాసూయకః, న బ్రాహ్మణాన్ పరి

వదేత్, న గవాం దణ్డముద్యచ్ఛేత్, న వృద్ధాన్, న గురూన్, న గణాన్, న నృపాన్ వాధిక్షిపేత్, న చాతిబ్రూయాత్, న బాన్ధవానురక్తకృచ్ఛ్రద్వితీయగుహ్యజ్ఞాన్ బహిః కుర్యాత్. నాధీరో నాత్యుచ్ఛ్రితసత్వస్స్యాత్, నాభృతభృత్యో, నాఽవిస్రబ్ధస్వజనో, నైకస్సుఖీ, న దుఃఖశీలాచారోపచారో, న సర్వవిస్రంభీ, న సర్వాభిశఙ్కీ, న సర్వకాలవిచారీ ॥

వ్యా. అధ్యయనము, హోమము మొదలగు సత్కార్యములకు నిర్ణయింపబడిన కాలమును అతిక్రమింపగూడదు. శాస్త్రసమ్మతమైన నియమములను మీరగూడదు. రాత్రియందును, పోగూడనిస్థళములయందును సంచరించగూడదు. భోజనము, అధ్యయనము, స్త్రీసంభోగము, నిద్ర అను నీకార్యములను సంధ్యాకాలములయందు చేయగూడదు. బాలురతోడను, లుబ్ధులతోడను, వృద్ధులతోడను, రోగపీడితులతోడను, మూర్ఖులతోడను, నపుంసకులతోడను ఒకప్పుడును చెలిమిచేయరాదు. మద్యపానమునందును, జూదమాడుటయందును, వేశ్యలయందును, ఒకప్పుడును అభిరుచికల్గియుండరాదు. రహస్యమును వెలిబుచ్చరాదు. యెవ్వరినైన అవమానింపరాదు. గర్వమును బూనరాదు. పనులయందు సమర్థుడుగను నుండవలెను. ఇతరులయందు దాక్షిణ్యము కల్గియుండవలెను. ఒకరిని చూచి ఓర్వజాలకుండదగదు. బ్రాహ్మణుల దూషింపదగదు. గోవులను కొట్టుటకు కఱ్ఱబూనరాదు. జ్ఞానవయోవృద్ధులను, తలిదండ్రులను, ఆచార్యులను, జనసంఘమును, ప్రభువులను, వీరిని యెదిరించి ధిక్కరింపగూడదు. ఏవిషయమునైనను నధికముగ మాట్లాడదగదు. బంధుగులను తనయందు ప్రీతిగలవారిని, ఆపత్కాలమున సాయపడినవారిని, తనగుట్టును తెలిసినవారిని విరోధించి నిరసింపదగదు. ధైర్యమును వదలకూడదు. అన్నివిషయములయందు మిక్కిలి యోర్పుకల్గి యుండతగదు. భృత్యుల (సేవకుల)ను పోషింపక యుండదగదు. తనబంధువులవిషయముల నమ్మకముకల్గి యుండవలయును. తానొక్కడై సుఖింపరాదు. దుఃఖమైన (పరులకు దుఃఖమును కల్గించునట్టి) స్వభావంబును ఆచారంబును, ఉపచారంబున కల్గియుండరాదు. అందరిని నమ్మియుండరాదు. అందరియందును అనుమానపడియుండరాదు. సర్వకాలములందును విచారింపకూడదు.

## మరికొన్ని విధులు.

మూ. న కార్యకాలమతిపాతయేత్, నాఽపరీక్షితమభినివిశేత్, నేన్ద్రియవశగస్స్యాత్, న చఞ్చలం మనోఽనుభ్రామయేత్, న బుద్ధీన్ద్రి

యాణామతిభారమాదధ్యాత్, న చాతిదీర్ఘసూత్రీ స్యాత్, న క్రోధహర్షావనువిదధ్యాత్, న శోకమనువసేత్, న సిద్ధావుత్సేకం గచ్ఛేత్, నాఽసిద్ధౌ దైన్యమ్. ౨౯

వ్యా. మంచికార్యముల జేయవలసిన సమయమును పోగొట్టరాదు. (ఏకాలమున నేపని జేసిన ననుకూలమగునో అట్టికాలమును వృథ జేయరాదని భావము). ఒకరిస్వభావాదుల చక్కగ పరిశీలించక వారిని కార్యసాధనమునకై నియమింపదగదు. ఇంద్రియవ్యాపారములకు తాను లొంగియుండరాదు. చంచలస్వభావమైన మనస్సును పలుదెరంగుల భ్రమింపరాదు. బుద్ధికిని, ఇంద్రియములకును అధికముగ భారమును (పనిని) ఇయ్యరాదు. కార్యములపట్ల చాలకాలము ఆలోచింపదగదు. (కాలోచితముగ త్వరలో కార్యముల సాధింపవలెగాని చాలకాలము యోచనచే కాలముగడపరాదని భావము.) క్రోధమునైనను, సంతోషమునైనను, అధికముగ బూనదగదు. శోకముతో నుండకూడదు. కార్యమనుకూలమైనపుడు గర్వమును, ప్రతికూలమైనపుడు దీనభావమును బొందకూడదు.

మఱికొన్ని నియమవిధులు.

మూ. ప్రకృతిమభీక్ష్ణం స్మరేత్, హేతుస్వభావనిశ్చితస్స్యాత్, హేత్వారమ్భనిత్యశ్చ, న కృతమిత్యాశ్వసేత్, న వీర్యం జహ్యాత్, నాపవాదమనుస్మరేత్, నాఽశుచిరుత్తమాజ్యాక్షతతిలకుశసర్షపైరగ్నిం జుహుయాత్,ఆత్మానమాశీర్భిరాశాసానః, అగ్నిర్మేనాపగచ్ఛేచ్ఛరీరాత్, వాయుర్మే ప్రాణానాదధాతు, విష్ణుర్మేబలమాదధాతు, ఇన్ద్రో మే వీర్యం, శివా మాం ప్రవిశన్త్వాపః, ఆపోహిష్ఠేత్యప ఉపస్పృశేత్, ద్విః పరిమృజ్యోష్ఠౌ, పాదౌ చాభ్యుక్ష్యమూర్ధానం ఖాని చ ఉపస్పృశేత్, అద్భిరాత్మానం హృదయం శిరశ్చ, బ్రహ్మచర్యజ్ఞానదానమైత్రీకారుణ్యహర్షాపేక్షాప్రశమపరశ్చ స్యాదితి. ౩౦

వ్యా. ఉత్పత్తికారణమును పలుమారు స్మరించవలెను. పంచభౌతిక లక్షణమైన ప్రకృతి యనిత్యమని స్మరించుచు రాగద్వేషాదుల విసర్జించి యుండవలెనని భావము. ఈకారణమువలన ఇట్టికార్యము కల్గునని నిశ్చయజ్ఞానము కల్గియుండవలెను. ఏకార్యమునకు ఏవిధమైనయుక్తి సమంజసమగునో అట్టి యుక్తిని నిశ్చయించుకొని దానినారంభము చేయవలెను. కృతకృత్యుడనైతినని యెప్పుడును నమ్మియుండవలదు. పరా

క్రమమును విడువదగదు. ఇతరులు తనకు జేసిన యపకారమును తలచవలదు. తాను యశుచిగా నుండునపుడు ఉత్తమమగు నాజ్యము, అక్షతలు, నువ్వులు, దర్భ ఆవాలు వీనితో హోమము చేయరాదు. హోమము చేసినపెనుక దేవతల యాశీర్వాదముచేత తనకు శుభము కల్గవలెనని కోరవలయును. మఱియు "నాశరీరము నుండి యగ్ని పోకూడదు. వాయుదేవుడు నాకు ప్రాణముల నిచ్చుగాక. విష్ణువు బలమును గల్గించుగాక. ఇంద్రుడు పరాక్రమమును కల్గించుగాక. మంగళకరములగు తీర్థములు నాశరీరమున ప్రవేశించుగాక" అని కోరవలెను. "ఆపోహిష్ఠామయోభువః" అను మంత్రముతో నీళ్లచే ప్రోక్షించుకొనవలెను. ఆచమనముచేసి రెండుసార్లు పెదవుల దుడుచుకొని చేతిని కడుగుకొని పాదముల ప్రోక్షించుకొని శిరస్సును, నాసికమును, శ్రోత్రములను తాకి జలముతో ఆత్మను, హృదయమును, శిరస్సును తాకవలయును. బ్రహ్మచర్యవ్రతము, జ్ఞానము, దానము, మైత్రి, కరుణ, హర్షము, అపేక్ష అను వీటిచే ఆత్మ ప్రశాంతమును పొందియుండవలెను.

ఇచ్చట పదునెనిమిదవ సూత్రమయిన "తద్యథా దేవబ్రాహ్మణ" యనువాక్యము మొదలుజేసి పై సూత్రాంతమువరకు సద్వృత్తము చెప్పబడినది. అయ్యవి కొన్ని ఇహమునకును, కొన్ని పరమునకును, కొన్ని ఇహపరముల రెంటికిని అనుకూలములై ఆరోగ్యమునకును, స్వస్థపరిపాలనమునకును ముఖ్యసాధనములైయుండును. మఱియు శరీరము, మనస్సు, ఇంద్రియములు అను నీమూటిని సంబంధించి పై నియమములు చెప్పబడినవి. అట్టి నియమములను విడువక యాచారమున నుంచుకొనినచో నీతంత్రమునకు ముఖ్య ప్రయోజనమైన ధాతుసామ్యమును అలవడును.

మూ. తత్ర శ్లోకాః—

## అధ్యాయవిషయసంగ్రహము.

పఞ్చపఞ్చకముద్దిష్టం మనో హేతుచతుష్టయమ్,
ఇన్ద్రియోపక్రమేఽధ్యాయే సద్వృత్తమఖిలేన చ. 31
స్వస్థవృత్తం యథోద్దిష్టం యస్సమ్యగనుతిష్ఠతి,
స సమాశ్శతమవ్యాధిః ఆయుషా న వియుజ్యతే. 32
నృలోకమాపూరయతే యశసా సాధుసమ్మతః,
ధర్మార్థావేతి భూతానాం బన్ధుతాముపగచ్ఛతి. 33
పరాన్ సుకృతినో లోకాన్ పుణ్యకర్మా ప్రపద్యతే,
తస్మాద్వృత్తమనుష్ఠేయం ఇదం సర్వేణ సర్వదా. 34

వ్యా. ఈయింద్రియోపక్రమణీయాధ్యాయమున నాయుర్వేదోపయుక్తము లగు నింద్రియపంచకాది పంచకములైదును, మనస్సును, హేతుచతుష్టయంబును, సంపూర్ణమైన సద్వృత్తంబును చక్కగ వివరింపబడినవి. ఈవిధానమును చక్కగ నెవరాచరింతురో వారు నూరుసంవత్సరములకాలము శారీరమానసికాగంతురోగవిముక్తులై జీవించియుందురు. అట్టిమనుజుడు సాధువులకు పూజ్యుడై తనకీర్తిచేత భూలోకమునెల్ల నిండించి, ధర్మార్థకామములనొంది, సకలమానవులకును బంధువైయుండి, పుణ్యకర్మల నాచరించి, పుణ్యవంతులగు వారిచే నొందదగిన స్వర్గాదిలోకముల నొంది సుఖించును. కావున బుద్ధిమంతులగు మానవులందరును ఈ యింద్రియోపక్రమణీయాధ్యాయమున జెప్పిన ధర్మోపదేశముల నన్నింటిని సర్వకాలసర్వావస్థలయందును చక్కగ నాచరింపదగినది.

### అనుక్తసద్వృత్తాభ్యనుజ్ఞ.

మూ. యచ్చాన్యదపి కించిత్ స్యాదనుక్తమిహ పూజితం,
వృత్తం తదపి చాత్రేయః సదైవాభ్యనుమన్యతే. 3౫

వ్యా. మరియు నీ యింద్రియాధికారమున నుపదేశించిన విషయములుగాక యితరములగు లోకోపకారకములును పుణ్యవంతములును నగు పెద్దలచే పూజింపదగిన సద్వృత్తము లన్నియు నాచరింపదగినవనియు నాత్రేయుండు అనుజ్ఞనొసంగుచున్నాడు.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
ఇన్ద్రియోపక్రమణీయో నామ అష్టమోఽధ్యాయః.

ఇతి స్వస్థవృత్తచతుష్కః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకునిచే సంస్కరింపబడినదియు నగు నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమునందు ఇంద్రియోపక్రమణీయమనునది యెనిమిదవయధ్యాయము సమాప్తము.

ఇది స్వస్థవృత్తచతుష్కము.

---

## (నిర్దేశచతుష్కము.)

## నవమాయధ్యాయము.

అవతారిక:—పైన చెప్పబడిన స్వస్థవృత్తచతుష్కమునందు స్వస్థపరిపాలనమునకు కావలసిన విషయములు చెప్పబడినవి. పిమ్మట స్వస్థ-ఆతురుల కుభయులకును ఆవశ్యకమగు

నిర్దేశచతుష్కము చెప్పబడును. నిర్దేశచతుష్కమన: స్వస్థతనుండువారికిని రోగపీడితులకును హితములగు వైద్యుడు, ఔషధము, పరిచారకుడు, రోగి అను నాల్గువిషయములను నిర్దేశించి చెప్పునట్టి ప్రకరణము నిర్దేశచతుష్కము. అందును స్వస్థాతురహితములలో ప్రధానమైన చికిత్సకు అంగములగు వైద్య-భేషజ-పరిచారక-రోగి అను నాల్గుపాదములను దెల్పునట్టి ఖుడ్డాకచతుష్పాదమను నధ్యాయము చెప్పబడును.

మూ. అథాతః ఖుడ్డాకచతుష్పాదమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. 'భిషగ్ద్రవ్యాణ్యుపస్థాతా రోగీపాద చతుష్టయమ్' అను వాక్యప్రకారము వైద్యుడు, ద్రవ్యములు (ఔషధములు), పరిచారకుడు, రోగి అను నీనాల్గును చికిత్సకు నాల్గుపాదములు. (ఈ నాల్గుపాదములును సరియైనపద్ధతి నుండినగాని చికిత్స ఫలవంతము కానేరదు; కావున నీనాల్గుపాదములకు సంబంధించిన గుణముల నిర్దేశించునది నిర్దేశచతుష్కము.) ఖుడ్డాకమన స్వల్పమని యర్థము. "చతుర్ణాం పాదానాం సమాహారః-చతుష్పాదం, ఖుడ్డాకంచ తత్ చతుష్పాదంచ-ఖుడ్డాకచతుష్పాదమ్" అను వ్యుత్పత్తిచేత చికిత్సకు సంబంధించిన వైద్యాదిపాదచతుష్టయము స్వల్పముగ నుండునది ఖుడ్డాకచతుష్పాదము. అట్టి ఖుడ్డాకచతుష్పాదమును అభిధేయముగ జేసి యధికరించి చెప్పబడిన యధ్యాయము ఖుడ్డాకచతుష్పాదము. ఇచ్చట "అధ్యాయానువాకయోర్లుక్ చ" అను సూత్రముచేత ఛప్రత్యయము లోపించి 'ఖుడ్డాకచతుష్పాద' అని నిలచినది.

పైజెప్పినరీతిగ స్వల్పమైన వైద్యాదిపాదచతుష్టయము నధికరించిన యధ్యాయమును త్రికాలవేత్తయగు నాత్రేయుం డుపదేశించినదానికి న్యూనాతిరేకము లేనట్లు వివరించెదనని యర్థము. పైజెప్పబడు మహాచతుష్పాదమునకన్న నియ్యది స్వల్పమగుటం జేసి ఖుడ్డాకచతుష్పాదమని చెప్పబడును.

## పాదచతుష్టయము.

మూ. భిషగ్ద్రవ్యాణ్యుపస్థాతా రోగీ పాదచతుష్టయమ్,
గుణవత్కారణం జ్ఞేయం వికారవ్యుపశాన్తయే. 3

వ్యా. వైద్యుడు, ఔషధద్రవ్యములు, పరిచారకుడు, రోగి అనునవి చికిత్సకు నాల్గుపాదములు. అట్టి పాదచతుష్టయము 'శ్రుతే పర్యవదాతత్వం' ఇత్యాదివాక్యములచే జెప్పబడు మంచిగుణములు కల్గియున్నచో రోగములు పూర్తిగ శాంతినొందుటకు కారణమగును.

ఇచ్చట పాదచతుష్టయమనగ ఛందోబద్ధమైన శ్లోకమునకు నాల్గుపాదములున్న విధముగ చికిత్సకు వైద్యాదులు నాల్గును నాల్గుపాదములని భావము. పాదమన నాల్గవ పాలు. ఈనాల్గిటిలో నొక్కటియైనను గుణహీనమైనచో గుణహీనమైన శ్లోకపాదము ఛందస్సును చెరచునట్లు చికిత్సను చెడగొట్టి నిష్ఫలమగునని భావము.

'ప్రధానం భిషగత్ర తు' అని పదియవశ్లోకమున చెప్పినప్రకారము పైజెప్పిన నాల్గుపాదములలో వైద్యుడు చికిత్సాకారకు డగుటంజేసి ప్రధానము. కావున తొలుత నిర్దేశింపబడియె. పిమ్మట చికిత్సకు ప్రధానకారణమైన ఔషధము చెప్పబడినది. పిదప కల్కకషాయాది సాధ్యమైన భేషజప్రయోగము పరిచారకుని యధీనమున నుండును కావున పరిచారకుడు నిర్దేశింపబడెను. ఈమూడును ఉపకరించునవి కావున ఉపకారకములు. అట్టియుపకారకములగు మూటిని నిర్దేశించినపిమ్మట నుపకార్యమైనరోగి నిర్దేశింపబడెను.

లోకమున కొందరు పాదచతుష్టయసంపత్తి లేకున్నను కొంతకాలమునకు సుఖముగ రోగవిముక్తులగుదురు. అట్లైనను వారికి శీఘ్రముగ నారోగ్యమును గల్గింప పాదచతుష్టయము సాయపడును. ఈవిషయము మహాచతుష్పాదాధ్యాయమును 'యే పునరాతురాః కేవలాత్ విశేషో నాస్తి' అను గ్రంథముచే నుపదేశింపబడును. కావున పైజెప్పిన భేషజాదులచేతనే రోగనివృత్తికావలెనని నియమములేదు. చికిత్సావిధానము శీఘ్రముగ రోగము నివర్తించుటకుమాత్రము కొన్నిసమయములయందు కారణమగునని భావము.

### వికారము, ప్రకృతి, వీనిస్వరూపములు.

మూ. వికారో ధాతువైషమ్యం సామ్యం ప్రకృతిరుచ్యతే,
సుఖసంజ్ఞకమారోగ్యం వికారో దుఃఖమేవ చ. ౪

వ్యా. (ఇచ్చట ధాతుశబ్దముచేత శరీరధారణమునకు సాధనములైన వాతపిత్తకఫములును, రసరక్తాది దూష్యములును, సత్వరజస్తమోగుణములు గ్రహింపబడును.) అట్టి ధాతువులయొక్క స్వష్టహేతువుగా నిర్ణయింపబడిన ప్రమాణమునకన్న న్యూనముగనైనను, అధికముగనైనను, ఉండునట్టిస్థితి ధాతువైషమ్యము. అయ్యది వికారమని చెప్పబడును. అట్టిన్యూనాధిక్యములేక పైజెప్పినధాతువులు వానివానికి విహితమైనపరిమాణమునందే యున్నచో నది ధాతుసామ్యము. అట్టియవస్థయే ప్రకృతి యనియు, ఆరోగ్యమనియు చెప్పబడును. అందు ధాతుసామ్యరూపమయిన యారోగ్యము (ప్రకృతి) సుఖమునకు హేతువగుటంజేసి సుఖమని చెప్పబడును. ధాతువైషమ్యరూపమయిన వికారము కష్టమునకు కారణమగుటంజేసి దుఃఖమని వ్యవహరింపబడును.

ఇచ్చట 'ధాతువైషమ్యం' అను పదముచేత ధాతువైషమ్యమును కారణముగ జేసి జ్వరాదిరోగములు చెప్పబడును. ఇటు చెప్పుటచేత ధాతువైషమ్యముచే జనించిన జ్వరాదిరోగములు వికారశబ్దములచే జెప్పబడును. ఈవిషయమునే "స్వధాతువైషమ్య నిమిత్తజా యే వికారసంఘా బహవశ్శరీరే" ఇత్యాదివాక్యములచే నీతంత్రకారుడుపదేశించును. సుశ్రుతాచార్యుడును "ధాతుశోణితసన్నిపాతవైషమ్యనిమిత్తాః" అను వాక్యముచే నీవిషయమునే చెప్పెను. ఇది వికృతివివరణముగ ధాతువులయొక్క సమస్థితియే ఆరోగ్యము అదియే ప్రకృతియనియు చెప్పబడును.

## చికిత్సాలక్షణము.

మూ. చతుర్ణాం భిషగాదీనాం శస్తానాం ధాతువైకృతే,
ప్రవృత్తిర్ధాతుసామ్యార్థా చికిత్సేత్యభిధీయతే. ౫

వ్యా. ధాతువులు పైజెప్పిన లక్షణప్రకారము వికృతిజెందుటచే గల్గినరోగమునందు, క్రిందజెప్పబడురీతిగ వానివానిగుణములు గల్గి ప్రశస్తములైన వైద్యుడు, ఔషధము, పరిచారకుడు, రోగి అను నాల్గుపాదములయొక్క ప్రవృత్తి (వ్యాపారము) ధాతువుల సమస్థితికి దెచ్చుటకై ప్రవర్తించుటయే చికిత్సయని చెప్పబడును.

ఇచ్చట 'చతుర్ణాం' అని చెప్పుటచేత పైజెప్పిన నాల్గుపాదములును వానికి చెప్పినగుణములుకల్గి వానివానికి సంబంధించినవ్యాపారముల యథోక్తముగ ప్రవర్తించిననాడు చికిత్స యనబడును. గాని, వానిలో నొకదాని వ్యాపారమైన లోపించినచో చికిత్సయనదగదని భావము. అందు 'ఈవిధముగ నుండవలెను, ఈపని చేయకూడదు' అని హితాహితముల బోధించి నియమించుట మున్నగునవి వైద్యునివ్యాపారము. ఉపయోగింపబడినయౌషధము తనయందలి ప్రభావాదులచే తనకార్యమును చక్కగ చేయుట ఔషధవ్యాపారము. వైద్యుడు చెప్పినప్రకారము ఔషధమును సంస్కరించి రోగికి నియతకాలమున నుపయోగించుట రోగికి సమయోచితముగ పరిచర్య చేయుట మున్నగునవి పరిచారకుని వ్యాపారము. వైద్యుడుపదేశించిన నియమముల జక్కగ నాచరించుట, తనకు శరీరమునగలబాధలు మున్నగువానిని విశదముగ జెప్పుట మున్నగునవి రోగియొక్క వ్యాపారములు. ఈనాల్గువ్యాపారములును యథోక్తముగ ధాతుసామ్యార్థము ప్రవర్తించుటయే చికిత్సయని ఫలితార్థము.

## వైద్యుని కుండవలసిన గుణములు.

మూ. శ్రుతే పర్యవదాతత్వం బహుశో దృష్టకర్మతా,
దాక్ష్యం శౌచమితి జ్ఞేయం వైద్యే గుణచతుష్టయమ్. ౬

వ్యా. గురుసేవ శాస్త్రావలోకనము మున్నగువ్యాపారములచేత శాస్త్రమునందు పరిపూర్ణజ్ఞానము కల్గియుండుట, పలుమారు చికిత్సలచేసి యనుభవజ్ఞానము కల్గియుండుట, చికిత్సావిషయమున నూహాపోహలచే సమయోచితకృత్యమున సామర్థ్యము కల్గియుండుట (లేక రోగియందు దయాదాక్షిణ్యము కల్గియుండుట), పరిశుద్ధతగల్గియుండుట ఈనాల్గుగుణములును వైద్యునకు ముఖ్యముగ నుండవలసినవి. (జితహస్తత మున్నగుగుణములును పైజెప్పిన నాల్గుగుణములలో నంతర్భూతములగును.)

### ఔషధద్రవ్యగుణములు.

మూ. బహుతా తత్ర యోగ్యత్వం అనేకవిధకల్పనా,
సమ్పచ్చేతి చతుష్కోఽయం ద్రవ్యాణాం గుణ ఉచ్యతే. ౭

వ్యా. అధికముగనుండుట, వ్యాధివిషయమై యుక్తముగనుండుట, కషాయ కల్కాది కల్పనాభేదములకు దగియుండుట, పురుగులు జలము మున్నగువాని సంబంధముచే గుణాదులు చెడకయుండుట ఈనాల్గును ఔషధద్రవ్యమున కుండవలసినగుణములు.

### పరిచారకగుణములు.

మూ. ఉపచారజ్ఞతా దాక్ష్యం అనురాగశ్చ భర్తరి,
శౌచం చేతి చతుష్కోఽయం గుణః పరిచరే జనే. ౮

వ్యా. రోగికిని సమయమునకును దగినయుపచారముల జక్కగ దెలిసియుండుట, అట్టి యుపచారములజేయ సమర్థతకల్గియుండుట, తనకు యజమానుడగురోగియందు ప్రీతికల్గియుండుట, పరిశుద్ధత, ఈనాల్గుగుణములును రోగియొక్కపరిచారకున కుండదగినవి.

### రోగి కుండవలసిన గుణములు.

మూ. స్మృతిర్నిర్దేశకారిత్వం అభీరుత్వమథాపి చ,
జ్ఞాపకత్వం చ రోగాణాం ఆతురస్య గుణాస్స్మృతాః. ౯
కారణం షోడశగుణం సిద్ధౌ పాదచతుష్టయమ్,

వ్యా. స్మృతి (జరిగినవిషయముల జ్ఞప్తికి దెచ్చుకొని శక్తి) కల్గియుండుట, వైద్యుడు నియమించినప్రకారము నడచుకొనుట, భయము లేకుండుట రోగములకు సంబంధించిన ఆయాలక్షణాదుల జెప్పునట్టి శక్తికల్గియుండుట, ఈనాల్గును రోగి కుండదగినగుణములు. ఇత్తెరంగున నొక్కొక్కపాదమున నాల్గేసిగుణములవంతున నన్నియుంజేరి పదునారుగుణములుకల పాదచతుష్టయము చికిత్సాసిద్ధికి (రోగనివృత్తికి) కారణమగును.

ఇచ్చట స్మృతి, భీరుత్వము, అను నీరెండుగుణములు కొన్నిరోగములయం దున్నచో రోగనివృత్తికి కారణములగును. ఎట్లులన:—జ్వరమునందు జ్వరము వ్యాపించు కాలాదులు స్మృతికివచ్చుచు జ్వరము వ్యాపించినచో నయ్యది దుస్సాధమగును. కావున నాసమయమున స్నేహితులతో సంభాషణము, చిత్రములగు కథలవినిపించుట మున్నగు వ్యాపారములచే రోగికి స్మృతిని మూర్చవలెను. ఈవిషయము—"జ్వరవేగం చ కాలం చ చిన్తయన్ జ్వర్యతే తు యః, తస్యేష్టైశ్చ విచిత్రైశ్చ ప్రయోగై ర్నాశయేత్ స్మృతిమ్" అనువాక్యముచే జెప్పబడినది. ఉన్మాదచికిత్సయందు సర్పాదులచే రోగికి భయము బుట్టింపవలెనని "సర్పేణోద్ధృతదంష్ట్రేణ" ఇత్యాదివాక్యములచే జెప్పబడినది. కావున జ్వరమునందు జ్వరవేగకాలాని స్మృతియుండకుండుటయు, ఉన్మాదమునందు సర్పాదులచే భయపడుటయు రోగనివృత్తికి కారణములగును. కావున నొకసమయమున స్మృతిలేకుండుటయు, భయంబును గుణములలో చేరును. ఈవిషయము దెల్పుటకై 'అథాపి చ' అని చెప్పబడినది.

## పాదచతుష్టయములో వైద్యునకు ప్రాధాన్యము.

మూ. విజ్ఞాతా శాసితా యోక్తా ప్రధానం భిషగత్ర తు. ౧౦
పక్తుర్హి కారణం పక్తుర్యథా పాత్రేన్ధనానలాః,
విజేతుర్విజయే భూమి శ్చమూః ప్రహరణాని చ. ౧౧
ఆతురాద్యా స్తథా సిద్ధౌ పాదాః కారణసంజ్ఞితాః,
వైద్యశ్చాతశ్చికిత్సాయాం ప్రధానాం కారణం భిషక్. ౧౨

వ్యా. పైజెప్పిన నాల్గుపాదములలో వైద్యుడు ఔషధాదుల గుణములను చక్కగ దెలిసినవాడును, దీని నిత్తెరంగున జేయనగునని పరిచారకునకు ఆజ్ఞనొసగు వాడును, రోగి పథ్యసేవనాదినియమములను రోగాద్యనుగుణముగ నిర్ణయించువాడు నైయుండును కావున పైజెప్పిన ద్రవ్య - పరిచారక - రోగులకన్న ప్రధానుడుగ నుండును.

ఎట్లులన:—పాకక్రియయందు పాకముచేయు వంటవానికి పాత్రలును, కట్టెలును, నిప్పును కారణములై పాకక్రియను నెరవేర్ప సాధనములగునో, అత్తెరంగున చికిత్స జేయు వైద్యునకు రోగియు, పరిచారకుడును, ఔషధంబులును దోడ్పడి చికిత్సా కార్యమును నెరవేర్చును. (ఇచ్చట పాత్రమువలె రోగియు, కట్టెలవలె పరిచారకుడును, అగ్నివలె నౌషధంబును సాధనములై యుండునని యెరుంగునది)· వంటవాడు లేనిచో పాకక్రియ జరుగదు. అత్తెరంగుననే వైద్యుడులేనియెడ తక్కినపాదములు మూడున్నను చికిత్స నెరవేరదు. కావున ప్రధానము.

మరియు యుద్ధమున యుద్ధముచేయుశూరునకు యుద్ధభూమియు, సైన్యంబును, ఆయుధములును కారణములై వీరునకు దోడ్పడి జయమును కల్గించుభంగి, పైజెప్పిన రీతిగ రోగియు, పరిచారకుండును, ఔషధంబును బాసటజేసి చికిత్సావిధిని నెరవేర్చును. ఇచ్చటను వీరుడు లేనిచో తక్కిన యుపకరణములున్నను జయము సమకూరదు. (కావున పాకక్రియకు వంటవానిబోలె, జయమునకు వీరునిబోలె చికిత్సకు తక్కినమూడు సాధనములకన్న వైద్యుడు ప్రధానమని సదృష్టాంతముగ నిర్ణయింపబడినది).

### వైద్యప్రాధాన్యమునకు వ్యతిరేకదృష్టాంతము.

మూ. మృద్దణ్డచక్రసూత్రాద్యాః కుమ్భకారాదృతే యథా,
న వహన్తి గుణం వైద్యాత్ ఋతే పాదత్రయం తథా. ౧౩

వ్యా. మృత్తు, దండము, చక్రము, దారము మున్నగు నుపకరణము లెన్నియున్నను కుమ్మరివాడొకడు లేనినాడు ఘటరూపకార్యము కొనసాగదు కదా? అత్తెరంగుననే పరిచారకాది పాదత్రయ మున్నను వైద్యుడొకడు లేనిచో చికిత్సారూపకార్యము నెరవేరదు.

### అన్వయవ్యతిరేకదృష్టాంతములచే వైద్యునిగుణదోషనిరూపణము.

మూ. గన్ధర్వపురవన్నాశం యద్వికారాస్సుదారుణాః,
యాన్తి యచ్చేతరే వృద్ధి మాశూపాయప్రతీక్షిణః. ౧౪
సతి పాదత్రయే జ్ఞాఽజ్ఞౌ భిషజావత్ర కారణమ్,

వ్యా. లోకమున మిథ్యాహారాదుల కారణముగజేసి సంభవించువ్యాధులు మిక్కిలి క్రూరములైనను, తమకు తగినయుపాయముల ప్రతీక్షించి (అట్టి నాశమునకు దగినయుపాయములు సంభవించినపుడు) గంధర్వనగరముబోలె శీఘ్రముగ నశించును. రోగవృద్ధికరములగు నుపాయములు తటస్థించినయపుడు శీఘ్రముగ గంధర్వనగరముబోలె వృద్ధినొందును. ఇట్టిరోగనాశమునకు పాదత్రయమున్నను, పరిజ్ఞాతయైన వైద్యుడు కాపణమగును. రోగవృద్ధికి పాదత్రయమున్నను పరిజ్ఞానములేని వైద్యుడు కారణమగును.

పాదత్రయసంపత్తి యున్నపుడు జ్ఞానవంతుడైన వైద్యుడొక డున్నచో వాని చికిత్సవలన రోగనాశకగములగు కారణములు తటస్థించును; అట్టియెడ గంధర్వనగరము(ఇంద్రజాలముచే నిర్మింపబడిన పట్టణాదుల)వలె క్షణకాలముననే క్రూరములైన వ్యాధులన్నియు నశించును. అట్టిరోగములు యుక్తమైన పాదత్రయమున్నను జ్ఞానములేని వైద్యునిచే ప్రయోగింపబడి కుత్సితచికిత్సలచేత గంధర్వనగరముబోలె నళిశీఘ

ముగ వృద్ధినొందునని భావము. ఈసముదాయముచేత రోగనాశమునకు జ్ఞానవంతుడగు వైద్యుడును, రోగవృద్ధికి జ్ఞానములేనివైద్యుడును ముఖ్యకారణములని ఫలితార్థము)-

—జ్ఞానహీనవైద్యునిచికిత్సానిషేధము.—

మూ. వరమాత్మా హతోఽజ్ఞేన న చికిత్సా ప్రవర్తితా. ౧౫

పాణిచారాద్యథాచక్షుః అజ్ఞానాద్భీతభీతవత్,

నౌర్మారుతవశేవాజ్ఞో భిషక్చరతి కర్మసు. ౧౬

వ్యా. తెలియనివాడును అయోగ్యుడునైన వైద్యునివద్ద చికిత్స చేసికొనుటకన్న చికిత్సలేకయే చచ్చుట మంచిది. కన్నులు కానరాని గ్రుడ్డివాడు భయపడుచు చేతుల చే దడవికొనుచు సంచరించువిధముగను, గాలిలోచిక్కి దరితప్పి తిరుగులాడు ఓడవిధముగను, జ్ఞానములేనివైద్యుడు చికిత్సాక్రియలయందు వర్తించును. (అట్టివానిని చికిత్సావిషయమై స్వతంత్రశక్తి లేమింజేసి చికిత్సావిషయమున పొరబడి రోగికి లేనిపోని యాపత్తును దెచ్చిపెట్టును. కావున అట్టి శాస్త్రపరిజ్ఞానములేని వైద్యునివద్ద చికిత్స జేసికొనుటకన్న విధినియతిప్రకారము జచ్చుటమేలని ముఖ్యభావము).

—అజ్ఞవైద్యచికిత్సాఫలము.—

మూ. యదృచ్ఛయా సమాపన్నముత్తార్య నియతాయుషమ్,

భిషజ్మానీ నిహన్త్యాశు శతాన్యనియతాయుషామ్. ౧౭

వ్యా. జ్ఞానహీనుడగు వైద్యుడొకడు నియతమైన యాయువుకల రోగిని జేరి, యాదృచ్ఛికముగ వానికి తగినచికిత్స జేసి, అయ్యది జ్ఞానపూర్వకముగ తనప్రయత్నము లేకున్నను రోగనివృత్తియైనచో తనకు జ్ఞానములేకున్నను వైద్యుడను గర్వముచే విఱ్ఱవీగుచు, వానిచికిత్సనుసమ్మిన యితరరోగులనేకులకు నియతముగాని యాయువుకలవారికి తారుమారుగ చికిత్సలజేసి వారినెల్ల వైవస్వతపురమునకు పయనము జేయును.

అజ్ఞుడగు వైద్యుడు ఒకరోగికి చికిత్స జేసినపుడు వాని కర్మపరిపాకమునంజేసి ఘుణాక్షరన్యాయముగ రోగవిముక్తుడై బ్రతుకును; వాని వైద్యగుణమును తెలియకున్నను యాదృచ్ఛికముగ వానిచేగల్గిన యారోగ్యమును కారణముగజేసి యనేకులు వానిని బిలిచినచో వాడు తెలియనిచికిత్సల జేయును. దానంజేసి యాయుశ్శేషమున్న రోగులును అకాలమరణమునకు గురియగుదురు. అని ఫలితార్థము.) 'భిషజ్మానీ' యనగా:—'అభిషజం భిషజమాత్మానం మన్యతే ఇతి—భిషజ్మానీ' యను వ్యుత్పత్తిచేత, వైద్యుడుకాని తనను వైద్యుడుగా తలంచువాడు; కాని వాస్తవ్యముగ వైద్యుడు కాడని భావము).

పురుషప్రయత్నమును విధ్యుక్తప్రకారము లోటులేక జేసినయెడల దైవము కూడ తోడై కార్యసిద్ధియగును. పురుషప్రయత్నము చక్కగ లేనినాడు దాని చెడ్డఫల మనుభవింపవలసియుండును. కావున జ్ఞానహీనుడగు వైద్యునిదోషమువలన రోగికి అకాలమృత్యువు కూడ సంభవించునని ఫలితార్థము.

ప్రాణాభిసరలక్షణము.

మూ. తస్మాచ్ఛాస్త్రేఽర్థవిజ్ఞానే ప్రవృత్తౌ కర్మదర్శనే,
భిషక్చతుష్టయే యుక్తః ప్రాణాభిసర ఉచ్యతే. ౧౮

వ్యా. అజ్ఞానుడగువైద్యుని చికిత్సవలన నాపత్తు సంభవించును, కావున శాస్త్రాభ్యాసమునందును, శాస్త్రార్థపరిజ్ఞానమునందును, తాను స్వతంత్రించి చికిత్సావిధానమును నెరవేర్చుటయందును, చికిత్సాభావమునందును ఈనాల్గువిషయములయందును వైద్యవరుడు మిక్కిలి పూనికతో పరిశ్రమముచేసి గుణాధిక్యమును సంపాదించవలెను. అట్టివైద్యుడు 'ప్రాణాభిసరుడు' అని చెప్పబడును. "ప్రాణాన్ (గచ్ఛతః) అభిసారయతి (వ్యావర్తయతి) ఇతి ప్రాణాభిసరః" అని చెప్పబడును. (వెడలిపోవనున్న ప్రాణములను మరలించుశక్తి కలవాడని యర్థము.) (పైజెప్పిన నాల్గువిధములైన గుణములు కల్గిన వైద్యవరునకు "ప్రాణాభిసరః" అను బిరుదమునకు అర్హుడగునని తోచెడి.

రాజవైద్యలక్షణము.

మూ. హేతౌ లిఙ్గే ప్రశమనే రోగాణామపునర్భవే,
జ్ఞానం చతుర్విధం యస్య స రాజార్హో భిషక్తమః. ౧౯

వ్యా. వ్యాధిహేతువుల పరిజ్ఞానమునందును, ఆయావ్యాధులకు జెప్పిన లక్షణ పరిజ్ఞానమునందును, రోగముల శమింపజేయుటయందును, శమించిన వ్యాధులు మరల కాలాంతరమున పొడసూపకజేయుటయందును, ఈనాల్గు విషయములయందును చక్కని జ్ఞానముకల వైద్యుడు రాజార్హుడగును. (అనగా ప్రభువులకును చికిత్సజేయ సర్హుడని భావము. (అట్టివానికి రాజవైద్యుడని బిరుదము నివ్వదగునని తోచెడి.)

మూ. శస్త్రం శాస్త్రాణి సలిలం గుణదోషప్రవృత్తయే,
పాత్రాపేక్షీణ్యతః ప్రజ్ఞాం చికిత్సార్థం విశోధయేత్. ౨౦

వ్యా. ఆయుధంబును, శాస్త్రంబులు, జలంబును, వానిగుణములనైనను, దోషములనైనను కనుపరచుటకు వాని పాత్రముల నపేక్షించియుండును. (ఆయుధము ఆ యాయుధముచే పనిచేయదగిన వానివద్ద నున్నచో చక్కగ పనిచేయును. అటుగాక

చేతగానివానివద్ద నున్నచో నాపత్తును దెచ్చిపెట్టును. శాస్త్రములును సద్గురువులవద్ద గ్రహించినచో జ్ఞానప్రదమగును. అటు గానినాడు విపరీతజ్ఞానము కల్గును. జలము యుక్తమైన పాత్రమునం దున్నయెడ శ్రేష్ఠముగ నుండును. చెడ్డపాత్రయందున్నచో చెడిపోవును.) కావున చికిత్సకొరకై వైద్యశాస్త్రమును చక్కగ పరిశోధించి ప్రశస్తమైన జ్ఞానమును సంపాదింపవలెనని భావము.

## మరికొన్ని వైద్యగుణవిశేషములు.

మూ. విద్యా వితర్కో విజ్ఞానం స్మృతి స్తత్పరతా క్రియా,
యస్యైతే షడ్గుణా స్తస్య న సాధ్యమతివర్తతే. ౨౧
విద్యా మతిః కర్మదృష్టిః అభ్యాసః సిద్ధిరాశ్రయః,
వైద్యశబ్దాభినిష్పత్తౌ అలమేకైకమప్యదః. ౨౨
యస్య త్వేతే గుణాస్సర్వే సన్తి విద్యాదయశ్శుభాః,
స వైద్యశబ్దం సద్భూతం అర్హన్ ప్రాణిసుఖప్రదః. ౨౩

వ్యా. వైద్యశాస్త్రపరిజ్ఞానము, వితర్కము (అట్టి శాస్త్రవిషయమైన ఊహాపోహాజ్ఞానము), విజ్ఞానము (ఇతరశాస్త్రపరిజ్ఞానము), స్మృతి (అట్టి పరిజ్ఞానమును సమయానుగుణముగ జ్ఞప్తికిదెచ్చుకొను శక్తి) వ్యాధుల చికిత్సచేయుటకు మిక్కిలి ప్రయత్నము కల్గియుండుట, పలుమారు చికిత్సలజేయుచు నలవాటు కల్గియుండుట అను నీయారుగుణములును కలవైద్యునకు సాధ్యముకానివ్యాధి యుండదు. (అసాధ్యమైన వ్యాధియుం సాధ్యావస్థ నొందునని భావము.)

మరియుం విద్య, మతి (సహజమైనబుద్ధి), చికిత్సకు సంబంధించిన పనులయందు సమయోచితజ్ఞానము, చికిత్సాభ్యాసము, సిద్ధి, వ్యాధిని శమింపజేయు సామర్థ్యము, సద్గురువుల యాశ్రయము అనునీగుణములలో నొక్కొకటియుం వైద్యశబ్దమునుచే చెప్పుటకు చాలియుండును. (ఈగుణములలో నొక్కొక గుణము కల్గియున్నను అట్టివానిని సాధారణముగ వైద్యుడని చెప్పనగునని భావము). పైజెప్పిన యారుగుణములలో నేదైన నొక్కగుణము కల్గియున్నవానికి 'వైద్యః' అను బిరుదము నియ్యదగుననితోచెడి.

మరియు పైజెప్పిన విద్యాదిగుణములన్నియుం మంచివిగ నెవనియందుండునో, వాడు 'సత్' అను శబ్దముతోగూడిన 'వైద్య' అను శబ్దమునకు అర్హుడై ప్రాణులకు ఆరోగ్యరూపమైన సుఖమును కల్గించువాడగును.

ఈప్రకరణమున వైద్యాదిపాదముల నాల్గిటికిని వేరువేరుగ ముఖ్యముగ నుండవలసిన గుణముల జెప్పి, 'విజ్ఞాతా శాసితా' అను పదియవశ్లోకము మొదలు ఇరువది

మూడవశ్లోకమగు "వైద్యశబ్దాభి" అను శ్లోకమువరకుగల గ్రంథముచేత వైద్యుని గుణావశ్యకత అన్వయ వ్యతిరేకదృష్టాంతములచే నిరూపించుచు, వైద్యగుణములే పలుమారు చేర్కొనబడియె. మరియు పాదత్రయమున్నను వైద్యుడు లేనినాడు చికిత్స నెరవేరదనియు, దానంజేసి వైద్యుడు తగిన పరిచారకాదులకన్న ప్రధానమనియు సదృష్టాంతముగ సిద్ధాంతముచేయబడి, జ్ఞానహీనవైద్యునిచికిత్స యపాయకరమని నిరసింపబడినది.

మరియు:—'తస్మాచ్ఛాస్త్రే...ఉచ్యతే' అనుశ్లోకమున జెప్పిన నాల్గుగుణములు కల వైద్యుడు "ప్రాణాభిసర"అనుపదమున కర్హుడనియు, "హేతౌలింగే...భిషక్తమః" అనుశ్లోకమున జెప్పిన నాల్గు గుణములుకల వైద్యవరుడు 'రాజవైద్య' అని చెప్పదగుననియు, "విద్యామతిః...ప్యదః" అనుశ్లోకమున జెప్పినయారుగుణములలో నొక్కగుణమున్నను వైద్యపదవాచ్యుడనియు, ఆగుణము లారును ఉన్నపుడు సద్వైద్యపదవాచ్యుడగుననియు చెప్పబడినది. ఇట్టిలక్షణముల వేరువేర జెప్పుటంజూడ ప్రకృతకాలమున శాస్త్రజ్ఞానాదుల తారతమ్యమునుబట్టి 'మహోపాధ్యాయ, మహామహోపాధ్యాయ' మున్నగు బిరుదముల కర్హులగుభంగి పూర్వకాలముననుజ్ఞానగరిమ తారతమ్య భేదానుసారముగ పైజెప్పిన బిరుదముల కర్హత కల్గియుందురని గ్రంథకర్తయభిప్రాయముగ నూహింపదగియున్నది.

## శాస్త్రజ్ఞానము, సహజబుద్ధి, వానియావశ్యకత.

మూ. శాస్త్రం జ్యోతిః ప్రకాశార్థం దర్శనం బుద్ధిరాత్మనః,
తాభ్యాం భిషక్సుయుక్తాభ్యాం చికిత్సన్నాపరాధ్యతి. ౨౮
చికిత్సితే త్రయః పాదాః యస్మాద్వైద్యవ్యపాశ్రయాః,
తస్మాత్ప్రయత్నమాతిష్ఠేత్ భిషక్స్వగుణసంపది. ౨౯

వ్యా. శాస్త్రాభ్యాసమున గల్గినబుద్ధి పదార్థజ్ఞానమునకు దీపము మున్నగు తేజస్సును బోలియుండు. (బాహ్యమైన తేజోవిశేషములు లోకమునంగల ఘటపటాది పదార్థముల దెలిసికొనుట కెట్లు సాధనమగునో, అత్తెరంగున శాస్త్రాభ్యాసముగ జనించిన బుద్ధివిశేషము చికిత్సాసంబంధములైన పరికరముల నరయుటకు సాధనమగునని భావము). తనకు సహజమైనబుద్ధి కన్నులబోలె వస్తుపరిజ్ఞానమునకు సాధనమగును. అట్టిశాస్త్ర పరిజ్ఞానంబును నైసర్గికమైన బుద్ధియు యుక్తమైనస్థితి నున్నచో నీరెండును సాధనములుగ గల వైద్యుడు చికిత్సావిషయమున నొకప్పుడును పొరబడడు.

మరియు చికిత్సావిషయమై చెప్పిన నాల్గుపాదములలో ద్రవ్యాది మూడుపాదంబులను వైద్యుని నాధారముగ జేసికొనియుండును. కావున వైద్యుడు తనకు నియ

మితములైన గుణముల సంపాదించు నిమిత్తము మిక్కిలి ప్రయత్నము కల్గియుండ వలెను.

(వైద్యుడు పైజెప్పబడిన శాస్త్రపరిజ్ఞానాదులయం దారితేరి యున్నచో తక్కిన ద్రవ్యము, పరిచారకుడు, రోగి అనుపాదములు మూడును గుణహీనములుగ నున్నచో వానిని తనబుద్ధికౌశలముచే సరియైనపద్ధతికి తెచ్చుకొని చికిత్సను నిరపాయముగ సాగింపనగును. తక్కినవి గుణము గల్గియున్నను వైద్యుడు జ్ఞానములేనివాడైనచో తన యజ్ఞానమునంజేసి చికిత్సను చెడగొట్టును; కావున వైద్యవరుడు పైజెప్పినగుణములను సంపాదించుటయందు మిక్కిలి శ్రద్ధవహించవలెనని సముదితభావము.)

### చతుర్విధవైద్యవృత్తులు.

మూ. మైత్రీ కారుణ్య మార్తేషు శక్యే ప్రీతి రుపేక్షణమ్,
ప్రకృతిస్థేషు భూతేషు వైద్యవృత్తిశ్చతుర్విధా. ౨౬

వ్యా. రోగియందు మిత్రభావము, రోగులవిషయమై వారిబాధల తొలగించుట యందు దయకల్గియుండుట, సాధ్యములగు వ్యాధులవిషయమై చికిత్సజేయవలెనని ప్రీతికల్గియుండుట, మరణమును సూచించు అరిష్టలక్షణములతో గూడిన వ్యాధుల యందు ఉపేక్షాభావముతో రోగిని త్యజించుట అను నీనాల్గును వైద్యునకు ముఖ్యముగ నుండవలసినవృత్తులు.

(ఇచ్చట ప్రకృతి యనగ మరణమని యర్థము. అట్టి మరణసూచకములైనలక్షణములతో గూడిన రోగులకు చికిత్సజేసినచో నప్రతిష్ఠ సంభవించును కావున వారిని త్యజించి చికిత్సమానవలెనని భావము.)

### అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః—

భిషగ్జితం చతుష్పాదం పాదః పాదశ్చతుర్గుణః,
భిషక్ప్రధానం పాదేభ్యో యస్మాద్వైద్య స్తు తద్గుణః. ౨౭
జ్ఞానాని బుద్ధిర్బ్రాహ్మీ చ భిషజాం యా చతుర్విధా,
సర్వమేతచ్చతుష్పాదే ఖుడ్డాకే సంప్రకాశితమ్. ౨౮

వ్యా. చికిత్సకు సంబంధించిన వైద్యాది పాదచతుష్టయము, ఒక్కొక్కపాదమునకు సంబంధించిన నాల్గేసిగుణములు, నాల్గుపాదములలో వైద్యునకు ప్రాధాన్యము, అట్టి ప్రాధాన్యమునకు సంబంధించిన గుణములు, వైద్యున కావశ్యకములైన పరిజ్ఞానములు,

వైద్యునకు ప్రధానములైన నాల్గువృత్తులు అను నీవిషయములన్నియుం ఖుడ్డాకచతుష్పాదమను నీయధ్యాయమున వివరింపబడెను.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
ఖుడ్డాకచతుష్పాదో నామనవమోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకునిచే సంస్కరింపబడినదియునగు నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమునందు ఖుడ్డాకచతుష్పాదమనునది తొమ్మిదియవ యధ్యాయము సమాప్తము.

---

## దశమాధ్యాయము.

అవతారిక:—పూర్వాధ్యాయమున వైద్య-ద్రవ్య-పరిచారక-రోగులను చికిత్సాపాదములనాల్గిటిని, వానిగుణాదులను నిరూపించి, అయ్యవి రోగశాంతికి కారణములని చెప్పబడినది. వానినే మరల ననువదించి యనేకపూర్వపక్షములజూపి యీయధ్యాయమున వానికి రోగనివృత్తికారణత్వము సిద్ధాంతము జేయబడును:—

మూ. అథాతో మహాచతుష్పాదమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. చతుష్పాదమనునది పూర్వాధ్యాయమున వివరింపబడినది; అట్టి చతుష్పాదము నుద్దేశించి పూర్వాధ్యాయమునకన్న నీయధ్యాయమున గ్రంథబాహుళ్యముచే ననేక పూర్వపక్షముల జూపి వ్యాధినివర్తకహేతుత్వమును సిద్ధాంతము చేయుటచేతను, అనేకప్రయోగముల జూపుటచేతను ఈయధ్యాయము మహాచతుష్పాద మనబడును. అట్టి మహాచతుష్పాదాధ్యాయమును త్రికాలవేత్తయగు నాత్రేయు డుపదేశించిన దానికన్న న్యూనాతిరేకము లేక వివరించెదనని యర్థము.

### యుక్తియుక్తౌషధము ఆరోగ్యకారణమని యాత్రేయమతము.

మూ. చతుష్పాదం షోడశకలం భేషజమితి భిషజో భాషన్తే, యదుక్తం
పూర్వాధ్యాయే షోడశగుణమితి, తద్భేషజం యుక్తియుక్తా
మలమారోగ్యాయేతి, భగవాన్ పునర్వసురాత్రేయః. 3

వ్యా. వైద్యాది నాల్గుపాదములును, వానికి నాల్గిటికిని చెప్పిన పదునారు గుణములును కల్గినది భేషజమని (చికిత్సయని) వైద్యవరులు చెప్పెదరు; పూర్వాధ్యాయమున పదునారుగుణములు కల్గినది చికిత్సయని నిర్దేశింపబడిన భేషజము వైద్యాది ప్రవృత్తి రూపమైన వ్యాపారము పూర్వాధ్యాయమున జెప్పినరీతిగ సత్ప్రవర్తనముతో గూడి యున్నచో నారోగ్యమును గల్గింప సమర్థమగునని భగవత్స్వరూపుడగు నాత్రేయుడు చెప్పెను.

(ఆత్రేయునకు పునర్వసువను నామాంతరము. 'యుజ్యన క్తీతి-యుక్తిః' అనువ్యుత్పత్తి చేత యోజనారూపమైన వ్యాపారము యుక్తి యనబడును. అయ్యది వైద్య-ఔషధ-పరిచారక-రోగులనుద్దేశించి పైయధ్యాయమున జెప్పబడిన ప్రకారము సత్ప్రవర్తము. అట్టి వైద్యాదిసత్ప్రవర్తనముతో కూడినది యుక్తియుక్తము. అట్టియౌషధము రోగముల శమింపజేయ సమర్థమగునని యాత్రేయమతము).

ఔషధముచే ప్రయోజనములేదని పూర్వపక్షము.

మూ. నేతి మైత్రేయః; కిం కారణమ్:—దృశ్యన్తే హ్యాతురాః కేచిత్ ఉపకరణవన్తశ్చ, పరిచారకసమ్పన్నాశ్చ, ఆత్మవన్తశ్చ, కుశలైశ్చ భిషగ్భిరనుష్ఠితాః సముత్తిష్ఠమానాః. తథాయుక్తాశ్చాపరే మ్రియమాణాః. తస్మాద్భేషజమకిఞ్చిత్కరం భవతి. తద్యథా:— శ్వభ్రే సరసిచ ప్రసిక్తమల్పముదకం నద్యాం వాస్యన్దమానాయాం, పాంసుధానే వా పాంసుముష్టిః ప్రకీర్ణ ఇతి. తథాపరే దృశ్యన్తే ఽనుపకరణాశ్చ, అపరిచారకాశ్చ, అనాత్మవన్తశ్చ, అకుశలైశ్చ భిషగ్భిరనుష్ఠితాః సముత్తిష్ఠమానాః; తథాయుక్తా మ్రియమాణాశ్చాపరే. యతశ్చ ప్రతికుర్వన్ సిధ్యతి. ప్రతికుర్వన్ మ్రియతే; అప్రతికుర్వన్ సిధ్యతి, అప్రతికుర్వన్ మ్రియతే. తతశ్చిన్త్యతే భేషజమభేషజేనావిశిష్టమితి.

వ్యా. పైజెప్పినరీతిగ నౌషధము ఆరోగ్యమునకు కారణము కాదని మైత్రేయుడు చెప్పెను. ఏలయన:—లోకమున కొందరురోగులు పైజెప్పిన గుణములుకల యౌషధములును పరిచారకులును కల్గి, యథోక్తముగ వైద్యుడుచెప్పిన నియమము దప్పక నడచుకొనియుండియు, గుణోత్తరులై సమర్థులైన వైద్యులచే విధ్యుక్తముగ చికిత్సజేయబడి రోగవిముక్తులై సుఖించుచున్నారు. కొందరురోగులు పైజెప్పిన

యౌషధాది పాదత్రయ సంపత్తికల్గియుం, కుశలులగు వైద్యులచే చికిత్స సకాలమున చేయబడియుం కాలవశమునం జేసి చచ్చుచున్నారు. కావున ఔషధముచే కొంచెమైనను ప్రయోజనములేదు. ఎట్లనగా:—కొద్దిపాటి పల్లమునందును ఉదకముచే నిండియుండు సరస్సునందును కొద్దిగ నీళ్లుపోసినయెడ ఆనీళ్లచే నారెండును నిండుటలేదు. (తనకు స్వయముగ నుండునీళ్లచే నిండియున్నదికాని క్రొత్తగపోసిన నీళ్లచేత నపూర్వముగ నిండుటలేదు). అత్తెరంగుననే ఉపకరణములును పరిచారకులును లేకయుండి, విహితాచరణములేకయుం, కుశలులుకాని వైద్యులచే చికిత్సచేయబడినను, (వారి కర్మపరిపాకమునం జేసి) కొందరురోగులు వ్యాధి వినిర్ముక్తులై యారోగ్యమును బొందుచున్నారు. మరియు ప్రవహించునదియందును, మట్టిగుట్టయందును పిడికెడు మట్టిని వేసినచో ప్రవహించునది పూడుటలేదు, మట్టిగుట్ట ముందుకన్న నధికమగుటలేదు. ఆవిధముగనే కొందరురోగులు పైజెప్పినరీతిగ పరిచారకాది సంపత్తిలేకయుండియుం (కర్మపరిపాకమునం జేసి) చచ్చుచున్నారు. (ఇచ్చట గర్తమునం దుంచబడినజలంబును, ప్రవాహమునం దుంచబడిన పాంసుముష్టియు గర్తమును పూరించుటకును, ప్రవాహము నింకజేయుంటకును సమర్థము కానోపదు. ఆవిధముగ కారణాంతరముచే 'చావనున్నరోగిని ఔషధము బ్రతికింపనేరదు. కారణాంతరముచే నిండియున్న సరోవరమున నుంచబడిన స్వల్పజలము సరస్సును నిండించుటకును, స్వయముగనే నిండియున్న మట్టిగుట్టయం దుంచబడిన పిడికెడుమట్టి యాగుట్టను పెద్దదిగ జేయుటకును కారణము కానివిధముగ, దైవవశమునం జేసి (చికిత్సావిధానము లేకున్నను) బ్రతుక సిద్ధముగనున్నవానికి ఔషధము ఆరోగ్యమును గల్పింప కారణము కానోపదు అనిభావము). పైజెప్పినవిధము యుక్తియుక్తమైన చికిత్సజేసినను చేయకున్నను కొందరురోగులు ఆరోగ్యము నొందుచున్నారు. కొందరు చికిత్సజేసినను చేయకున్నను రోగములచే బాధింపబడి చచ్చుచున్నారు. (అట్టి యారోగ్యమునకును మరణమునకును వారికర్మవిపాకము కారణమగునుకాని ఔషధము కారణము కానోపదు. ఇది యనుభవముచే ప్రత్యక్షము) కావున చికిత్సజేసినను చేయకున్నను విశేషము కానరాదు. (కావున ఆత్రేయుడు చెప్పిన 'ఔషధము ఆరోగ్యకారణము' అనునది సద్ధేతుకము కాదని మైత్రేయుని పూర్వపక్షము). (ఇచ్చట అనుమానమునకు సంబంధించిన హేత్వాభాసాదులు నిరూపింపవలసినను ప్రకృత శాస్త్రమున నయ్యవి యనుపయుక్తము లగుటచేతను, విస్తరభీతిచేతను విడువంబడియె. పండితవర్యు లూహించెదరుగాక!)

### ఔషధప్రయోజనసిద్ధాంతము.

మూ. మైత్రేయ! మిథ్యా చిన్త్యతే, ఇత్యాత్రేయః కిం కారణమ్?—
యే హ్యాతురాః షోడశగుణసముదితేనానేన భేషజేన ఉపపద్య

మానాః మ్రియన్తే, ఇత్యుక్తం తదనుపపన్నమ్;—న హి భేషజసాధ్యానాం వ్యాధీనాం భేషజమకారణం భవతి. యే పునరాతురాః కేవలాద్భేషజాదృతే సముత్తిష్ఠన్తే, న తేషాం సమ్పూర్ణభేషజోపపాదనాయ సముత్థానవిశేషో నాస్తి, యథా హి—పతితం పురుషమ్ సమర్థముత్థానాయ, ఉత్థాపయన్ పురుషో బలమస్యోపాదధ్యాత్, సః క్షిప్రతరముపరిక్లిష్ట ఏవోత్తిష్ఠేత్; తద్వత్సమ్పూర్ణభేషజోపలమ్భాదాతురాః. యే చాతురాః కేవలాద్భేషజాదృతే మ్రియన్తే, న చ సర్వ ఏవ తే భేషజోపపన్నాః సముత్తిష్ఠేరన్. న హి సర్వే వ్యాధయో భవన్త్యుపాయసాధ్యాః, న చోపాయసాధ్యానాం వ్యాధీనాం అనుపాయేన సిద్ధిరస్తి, న చాసాధ్యానాం వ్యాధీనాం భేషజసముదాయోఽయమస్తి,న హ్యలం జ్ఞానవాన్ భిషక్ ముమూర్షుమాతురముత్థాపయితుమ్, పరీక్ష్యకారిణో హి కుశలా భవన్తి. యథాహి—యోగజ్ఞోఽభ్యాసనిత్యః ఇష్వాసో ధనురాదాయ ఇషుమపస్యన్ నాతివిప్రకృష్టే నాతి మహతి కాయేనాపరాధవాన్ (నాపరాధో) భవతి, సమ్పాదయతి చేష్టకార్యమ్, తథా భిషక్ స్వగుణసమ్పన్నః ఉపకరణవాన్ వీక్ష్య కర్మారభమాణః సాధ్యరోగమనపరాధః సమ్పాదయత్యేవాతురమారోగ్యేణ; తస్మాన్న భేషజమభేషజేన అవిశిష్టం భవతి. ౫

వ్యా. ఓ మైత్రేయా! 'నీవు యోచించునది పొరబాటని మైత్రేయునితో నాత్రేయుండు చెప్పుచున్నాడు:—ఏల పొరబాటన:—'పదునారుగుణములతోఁ గూడిన పాదచతుష్టయసంపత్తిగల చికిత్స జేసినను కొందరు రోగులు మృతులగుచున్నారు' అని నీవు చెప్పినది సమంజసము కానేరదు. భేషజసాధ్యములగు రోగములకు ఔషధము ఒకప్పుడును కారణము కాకపోదు. ఏరోగులు భేషజము, (ఔషధము) పూర్తిగ లేకున్నను రోగవిముక్తులగుదురో వారికి సంపూర్ణమైనచికిత్స నుపపాదించుటకుగాను ఉపాయాంతరము లేదని చెప్పుటకు వీలులేదు. (అనగా వారు వ్యాధివిముక్తులగుటకు దైవసహాయము కూడ నౌషధమునకు దోడ్పడునని భావము.) ఇచ్చట దీనినిశ్చయ మిది:—సంపూర్ణ

మైన చికిత్సాసాహాయ్యము లేకయే కొందరురోగులు వ్యాధివిముక్తులై బ్రతుకుచున్నారు. అట్టియెడ వారు బ్రతుకుటకు దైవము కారణమగును; అయినను ఆపరిస్థితియందు దృష్టసహాయరూపమైన చికిత్సకూడ తోడ్పడినయెడ, దృష్ట-అదృష్టకారణములు రెండును కలిసి పరస్పరసహాయబలమునంజేసి రోగమును శీఘ్రముగ నివర్తింపజేయును. ఎట్టులన:—క్రిందబడిన యొకమానవుడు తనకు సహాయము నపేక్షింపకయే లేచుటకు సామర్థ్యము కల్గియున్నను, వానికి ఇతరుడొకడు కొంచెము చేయూత నొసంగినచో, క్రిందపడినవాడు తాను తనంత లేచుదానికన్న శీఘ్రముగను మిక్కిలి కష్టము లేకయే (అట్టి సహాయబలదానమున) లేవగలడు. అత్తెరంగుననే రోగులు చికిత్సలేకున్నను రోగవిముక్తులగుటకు సామర్థ్యము దైవసహాయము కల్గియున్నను సంపూర్ణ ఔషధసాహాయ్యబలమునంజేసి తాను తనంతట స్వస్థతనొందుటకన్న శీఘ్రముగ కష్టము లేక యారోగ్యము నొందును.

మరియు కొందరు రోగులు పూర్ణముగ చికిత్స జేసినను ఏల మృతిజెందెదరు? అన్నచో (సాధ్యరోగులు, అసాధ్యరోగులు అను భేదముకల) అందరురోగులు చికిత్స నొందినమాత్రమున బ్రతుకుట లేదు. రోగములన్నియు కేవలము చికిత్సాసాధ్యములు కానోపవు. చికిత్సచే సాధింపదగినవ్యాధులు చికిత్సాసాహాయ్యము లేక నివర్తింపవు. అసాధ్యావస్థ నుండురోగములు ఔషధసముదాయముచే నైనను శమింపవు. మిక్కిలి జ్ఞానసంపన్నుడైన వైద్యవరుండును చావనుసిద్ధమై యరిష్టలక్షణములు కలరోగిని చికిత్సచే బ్రతికింప సమర్థుడు గానోపడు. సాధ్యాసాధ్యపరిజ్ఞానముకల్గి చికిత్సచేయు వైద్యుడే సమర్థుడని చెప్పదగును. చక్కగ లక్ష్యజ్ఞానము (గురి) దెలిసి, ప్రతిదినమునందును అభ్యాసముచేయుచుండు విలుకాడు ధనువును కేల బుచ్చుకొని, అందు బాణమును చక్కగ సంధించి, మిక్కిలి దూరముగాక దాదాపుననుండు గొప్పయాకారము కల లక్ష్యమును గురిజేసి బాణమును ప్రయోగించిన తనపొరపాటు లేక యిష్టసిద్ధిని పొందకలడు. అత్తెరంగుననే వైద్యవరుండును తనకుండవలసిన గుణములన్నియు కల్గి, ప్రశస్తములగు నుపకరణములు (పాదత్రయసంపత్తి) కలవాడై, రోగములయొక్క సాధ్యాఽసాధ్యవ్యవస్థను జక్కగ గమనించి, పిమ్మట చికిత్సావిధానమునకు గడంగినయెడ సులభముగ రోగిని ఆరోగ్యవంతునిగ జేసి యుద్ధరించి, తాను నిరపరాధియై కీర్తివహింపగలడు. కావున భేషజము అభేషజమునకు భిన్నముకాదు అనుట పొరబాటు. అని భావము.

ఇచ్చట నీవిషయసంగ్రహము నెరుంగునది:—కర్మ బలవత్తరమనియు, బలహీనమనియు రెండుతెరంగుల నుండును. అందు బలవత్తరమైనకర్మ నియతమైనకాలమున

ఫలమునిచ్చును. (దానిఫలము ననుభవించుటకు కాలము నియతముగ నుండును). 'ఈకర్మ ఈకాలమున మరణము నొందించును' అని దానికాలము నియతముగనుండును. బలహీనమైనను కాలనియతి లేదు, కావున అట్టికర్మ మరణానుకూలమైనసామగ్రి (ఔషధాభావము, అపత్థ్యసేవనము మున్నగుకారణములు) తటస్థించినపుడు చంపును. అట్టి మరణానుకూలకారణములు లేనినాడు (మరణమునకు ప్రతికూలమైనపత్థ్యసేవనము, యుక్తమైనచికిత్స మున్నగుసంపత్తి కల్గుటంజేసి) చంపనేరదు. ఈవిషయమునే జనపదోద్ధ్వంసనీయాధ్యాయమున నీతంత్రకారు లిట్లుపదేశించిరి:—"కర్మ కిఞ్చిత్ క్వచిత్కాలే విపాకనియతం మహత్, కిఞ్చిన్న కాలనియతం ప్రత్యయైః ప్రతిబోధ్యతే."

కొందరు కేవలము అదృష్టకర్మయే కారణమగునుకాని దృష్టకర్మ కారణము కానోపదని వచించెదరు:—ఎట్టులన? కేవలము దైవయత్నరూపమైనకర్మ అదృష్టము-ఇయ్యది నియతకాలముననే ఫలమునిచ్చును. మనుష్యప్రయత్నప్రవృత్తిరూపమైన పత్థ్యసేవనచికిత్సాదులు దృష్టకర్మ. ఈరెంటిలో అదృష్టకర్మయే తనకు నియతకాలమున చెడ్డఫలమునుగాని మంచిఫలమునుగాని ఇచ్చును. అదృష్టరూపమైన మనుష్యప్రవృత్తి ఫలము నియ్యనోపదని కొందరు చెప్పెదరు. ఈవిషయమున:—"నాకాలే జాయతే కశ్చిత్ నాకాలే మ్రియతే తథా, జగత్కాలవశం సర్వం కాలస్సర్వత్ర కారణమ్" అను ప్రమాణమును కూడ చూపెదరు. (జగమంతయు కాలమున కధీనమైయుండును కావున నకాలమునపుట్టుటయు, అకాలమున చచ్చుటయులేదు అని యర్థము).

దీనికిట్లు సమాధానము చెప్పనగును.—పురుషప్రయత్నములేక కేవలము అదృష్టకర్మ వేరుగ లేదు. దృష్టరూపమైన యాగాదులచే సత్కర్మయు, బ్రహ్మహత్యాది కర్మలచే దుష్కర్మయు నుత్పన్నమగును. ఇచ్చట యాగాదికర్మలచే స్వర్గాది సత్ఫలంబును, దుష్కర్మలచే చెడ్డఫలంబును అనుభవింపకతీరదు నిప్పున కాలినప్పుడు మంటలుబుట్టును. ఇది కేవలము దృష్టకర్మ. ఈన్యాయము ననుసరించియు అదృష్టకర్మయు పురుషకారము (పురుషప్రయత్నము) లేక కల్గనేరదని యూహింపదగియుండును. ఇట్లుండుతరి పురుషకారరూపమైన నపత్థ్యాది సేవనచే కల్గినరోగములు, బలవత్తరమైన చతుష్పాద సంపత్తితోకూడిన చికిత్సచే సాధింపదగియుండును కాని కేవల దైవబలముచే నెట్లు నివర్తింపనోపును; కావున నిట్లు నిర్ణయింపదగును:—దైవబలము స్వల్పముగ నున్నపుడును ప్రబలమైన యపత్థ్యాది సేవచే గల్గినవ్యాధులు ప్రబలమైన చతుష్పాదసంపత్తిచే గల్గినచికిత్స చేసినయెడ నివర్తించును. అట్టివ్యాధులు ప్రబలచికిత్స లేనినాడు దైవబలము స్వల్పమై పురుషప్రయత్నము ప్రతికూలముగ (నపత్థ్యాదిసేవనరూపముగ) ప్రబలమైయుండుటం

జేసి, తత్ప్రతీకారరూపమైన పురుషకారము లేమింజేసి వ్యాధి యసాధ్యదశనొందును గాని దైవబలమాత్రమున నివర్తికానేరదు. ఈవిషయమునం దభియుక్తోక్తియం దిట్లున్నది:—"దైవం పురుషకారేణ దుర్బలం హ్యుపహన్యతే, దైవేన చేతరత్కర్మ విశిష్టేనోపహన్యతే" (దైవబలము స్వల్పమైయున్నపుడు ప్రబలమైన పురుషకారముచే నిరసింపబడి కార్యసమర్థము కానోపదు. దైవబలము ఎక్కుడై పురుషప్రయత్నము మిక్కిలి హీనస్థితి నున్నపుడు దైవబలముచే దిరస్కరింపబడి కార్యసమర్థము కానోపదు. అని భావము. దైవబలము (అదృష్టకర్మ) ఒకటియున్నను పురుషప్రయత్నము ప్రబలముగ నున్నపుడు కార్యసాధనమగునని ముఖ్యభావము).

## ఔషధప్రయోజనవిషయమున ప్రత్యక్షానుభవము.

మూ. ఇదం చేదం చ నః ప్రత్యక్షం:—యదనాతురేణ భేషజేన ఆతురముపచరామః, క్షామమక్షామేణ, కృశం చ దుర్బలమాప్యాయయామః, స్థూలం మేదస్వినమపతర్పయామః, శీతేనోష్ణాభిభూతముపచరామః, శీతాభిభూతముష్ణేన, న్యూనాన్ ధాతూన్ పూరయామః, వ్యతిరిక్తాన్ హ్రాసయామః, వ్యాధీన్ మూలవిపర్యయేణోపచరన్తః స్వస్వప్రకృతౌ స్థాపయామః, తేషాం నః తథాకుర్వతామయం భేషజసముదాయః కాన్తతమో భవతి. ౬

వ్యా. మరియు రోగిగుణములకు ప్రతికూలము (విపరీతగుణము) లైన యౌషధములచే రోగికి చికిత్స జేయుంటయు, దానివలన కల్గుగుణంబులును మనకు ప్రత్యక్షములు. (అనుభవసిద్ధములు):—ద్రవములేనిరోగికి ద్రవమును బుట్టించు ఔషధముచేత చికిత్స జేసెదము. కృశుడై బలహీనుడగురోగిని ధాతువుల తృప్తినొందించు చికిత్స జేసెదము. మేదోవృద్ధిచే మిక్కిలి స్థూలముగ బలిసియున్నరోగిని అపతర్పణచికిత్సచే కృశింపచేసెదము. ఉష్ణముచే తాపము నొందినవానిని శీతోపచారముచే నుపచరించెదము. చలిచే బాధపడువానిని ఉష్ణమైన యుపచారముచే చికిత్స జేసెదము. తక్కువగా నుండు రసాదిధాతువులను రసాయనాదివిధిచే నిండించెదము. ప్రమాణమునకన్న నధికముగ నుండుధాతువులను తగ్గించెదము. జ్వరము అతిసారము మున్నగు రోగములకు వానికి కారణము లైనవానికి విపరీతగుణము లైన యౌషధములచే చికిత్స చేసెదము. ఇత్తెరంగున నాయారోగములకుయుక్తియుక్తమైన యౌషధములచే చికిత్స

జేసి యట్టిరోగముల నివర్తింపజేసి యారోగ్యమును మరల నెలకొల్పెదము. ఇత్తెరంగున చికిత్స చేసి దానివలన నారోగ్యము నొందుచున్న మనకు అట్టి భేషజసముదాయమంతయుం (ప్రాణాంతకరములగురోగముల ధ్వంసము చేసి యారోగ్యభాగ్యము నొసగూర్చుటవలన) తక్కిన ధర్మార్థసాధకములగు నుపాయములకన్న మిక్కిలి ప్రియమైనది.

పైజెప్పిన ప్రక్రియచేత ఔషధమువలన రోగములు శమించుట మనకందరకును అనుమానాది ప్రమాణములచేత కాక ప్రత్యక్షప్రమాణముచేత గూడ ననుభవసిద్ధముగ నున్నది. కావున "ఔషధము యుక్తియుక్తముగ నుపయోగించిన నయ్యది యారోగ్యమును కల్గింప సమర్థమగును" అని తొలుత పునర్వసు చెప్పినది నిర్వివాదముగ సిద్ధాంతితమని భావము.

మూ. భవన్తి చాత్ర:—(ఉక్తానువాదశ్లోకములు)

—చికిత్సానియమము.—

సాధ్యాఽసాధ్యవిభాగజ్ఞో జ్ఞానపూర్వం చికిత్సకః,
కాలే చారభతే కర్మ యత్తత్సాధయతి ధ్రువమ్. ౭
అర్థవిద్యాయశోహానిముపక్రోశమసఙ్గ్రహమ్. (సద్గ్రహమ్)
ప్రాప్నుయాన్నియతం వైద్యః యోఽసాధ్యం సముపాచరేత్.

వ్యా. రోగములయొక్క సాధ్యాఽసాధ్యభేదములను చక్కగ గమనించి ద్రవ్యనిష్ఠరసగుణాదుల చక్కగ నెరింగి యుక్తమైన కాలమున వైద్యుడు చికిత్స జేయ ప్రయత్నించినచో నట్టిచికిత్స తప్పక వ్యాధుల శమింపజేయును. వైద్యుడు దానివలన కార్యసిద్ధినొంది కీర్తిని వహింపగలడు.

అటుకాక వైద్యుడు అసాధ్యస్థితి నుండురోగమును చికిత్సజేయ ప్రయత్నించినయెడ వ్యాధి శమింపదు; దానంజేసి వైద్యునకు ధనము విద్య కీర్తి ఈమూటికిని హానికల్గి లోకులచే వైద్యుడు నిందింపబడును. ఒకచోట చికిత్స వ్యర్థమగుటచేత ఇంక నెవ్వరును చికిత్సార్థమై వీనిని పిలువబోరు. లేక చికిత్సావ్యత్యయరూపమైన నేరముచే రాజదండనమునకు పాత్రుడై చండాలాదులచే గ్రహింపబడును. (కావున నసాధ్యరోగములకు చికిత్సజేయ నొకప్పుడును వైద్యుడు ప్రయత్నింప దగదనుట.)

—సాధ్యాఽసాధ్యరోగభేదములు.—

మూ. సుఖసాధ్యం మతం సాధ్యం కృచ్ఛ్రసాధ్యమథాపి చ,
ద్వివిధం చాప్యసాధ్యం స్యాత్ యాప్యం యచ్చానుపక్రమమ్.

సాధ్యానాం త్రివిధశ్చాల్పమధ్యమోత్కృష్టతాం ప్రతి,
వికల్పో న త్వసాధ్యానాం నియతానాం వికల్పనా. ౧౦

వ్యా. రోగములు సాధ్యములు, అసాధ్యములు నని రెండుభేదములు కలుగ పైని 'సాధ్యాఽసాధ్యవిభాగజ్ఞః' అనువాక్యముచే సూచింపబడినది. అందు సాధ్యములు (చికిత్సచే నివర్తిచేయదగినవి) సుఖసాధ్యము (సుఖముగ సాధింపదగినది), కృచ్ఛ్రసాధ్యము (కష్టముచే సాధింపదగినది) నని రెండు విధములు. యాప్యము (కాలము గడుపదగినది.), అనుపక్రమము (ప్రయోజనము లేమింజేసి చికిత్సజేయదగనది) నని యసాధ్యరోగములు రెండు విధములుగ నుండును. (అనుపక్రమ మన్నచోట చికిత్స చేసినను కొంచెమైన ప్రయోజనము కల్గనిస్థితినుండునది కావున ఉపక్రమము (చికిత్స) లేనిది అనుపక్రమము అని యర్థము. యాప్యము బొత్తుగ కుదురకున్నను చికిత్స జేసినచో వ్యాధి యుత్పథము నొందక నిలబడియుండును కావున చికిత్సచే కించిత్ప్రయోజనము కలది కావున అనుపక్రమమునకన్న భిన్నము).

అందు సాధ్యములైన రెండును అల్పసాధ్యము (స్వల్పమైన చికిత్సోపాయముచే సాధింపదగినది.), మధ్యసాధ్యము (మధ్యమమైన యుపాయముచే సాధింపదగినది.), ఉత్కృష్టసాధ్యము (మిక్కిలి గుణోత్తరమైన యుపాయముచే సాధింపదగినది.) నని మూడువిధములు. (ఇట్టి భేదములు చికిత్సాసౌకర్యమునకై వ్యాధియొక్క బలతారతమ్యమునుబట్టి చెప్పబడినది.)

నియతముగ నసాధ్యములగు అనుపక్రమవ్యాధులకు పైజెప్పిన అల్పాదిభేదములు లేవు. (చికిత్సకు సాధ్యము కానిది యసాధ్యము. అయ్యది అల్ప-మధ్యమ-ఉత్కృష్టరూపములగు చికిత్సల మూటికిని అసాధ్యములు. కావున వాని కిట్టివికల్పములు లేవు అని భావము.) యాప్యములకు మాత్రము చికిత్స కొంచెము ప్రయోజనకారి యగుటంజేసి అల్పయాప్యము, మధ్యమయాప్యము, ఉత్కృష్టయాప్యము నని మూడు వికల్పకల్పనములు కలవు.

### సుఖసాధ్యరోగలక్షణములు.

మూ. హేతవః పూర్వరూపాణి రూపాణ్యల్పాని యస్య చ,
న చ తుల్యగుణో దూష్యో న దోషః ప్రకృతిర్భవేత్. ౧౧
న చ కాలగుణస్తుల్యః న దోషో దురుపక్రమః,
గతిరేకా నవత్వం చ రోగస్యోపద్రవో న చ. ౧౨

దోషశ్చైకస్సముత్పత్తౌ దేహస్సర్వౌషధక్షమః,
చతుష్పాదోపపత్తిశ్చ సుఖసాధ్యస్య లక్షణమ్. ౧౩

వ్యా. రోగోత్పత్తి కారణములును పూర్వరూపంబులును, రూపంబులును, స్వల్పములుగ నుండుట, దూష్యములు, (రసరక్తాదులు) వాతాదిదోషముల గుణములతో సమానములు కాకుండుట, వ్యాధికి ఆరంభకారణమగు దోషము ప్రకృతికి సమానగుణము కాకుండుట (వాతము రోగకారణ మైనచో నావ్యాధి పిత్తప్రకృతికి సంభవించిన యెడ ప్రకృతికిని దోషమునకు గుణసామ్యముండదు.) వ్యాధుల గుణంబులును హేమంతాదికాలముయొక్కయు జాంగల-అనూప దేహ భేదములచే మూడువిధములైన దేశముయొక్కయు గుణంబులును సమానము కాకుండుట, ఉపక్రమమునకు సాధ్యము కాని మర్మములు మున్నగుస్థలములుకాక యితరస్థలముల జనించుట, శాఖలు, మర్మాస్థిసంధులు, కోష్ఠము అనునవి మూడుగతులు, వానిలో నొక్కగతినే ఆశ్రయించి యుండుట, చిరకాలము గడపక నూతనముగ జనించి యుండుట, ఉపద్రవములు లేకుండుట, రోగము వాతాది దోషములలో నొక దోషముచేతనే జనించుట, రోగియొక్క శరీరము సకలమైన యౌషధమునకు నోరువదగి యుండుట, వైద్య-ఔషధ-పరిచారక-రోగులను నాల్గు పాదములును వానికి జెప్పబడిన పదునారుగుణములు కల్గి యుండుట, ఇవి యన్నియు సుఖసాధ్యవ్యాధికి లక్షణములు.

పై జెప్పిన సుఖసాధ్యలక్షణములు సామాన్యముగ జెప్పబడినవి. కొన్ని రోగముల యందు విశేషలక్షణములు దీని కపవాదముగ చెప్పబడును. ఎట్టులన:—"జ్వరే తుల్యర్తు దోషత్వం ప్రమేహే తుల్యదూష్యతా, రక్తగుల్మే పురాణత్వం సుఖసాధ్యస్య లక్షణమ్" (జ్వరమునందు దోషములకును ఋతువులకును గుణములు సమానములుగ నుండుటయు, ప్రమేహమునందు దూష్యదోషములు సమానగుణములుగ నుండుటయు, రక్తగుల్మమునందు చిరకాలము గడచి యుండుటయు సుఖసాధ్యలక్షణములు అని భావము).

కృచ్ఛ్రసాధ్యరోగలక్షణములు.

మూ. నిమిత్తపూర్వరూపాణాం రూపాణాం మధ్యమే బలే,
కాలప్రకృతిదూష్యాణాం సామాన్యేఽన్యతమస్య చ. ౧౪
గుర్విణీవృద్ధబాలానాం నాత్యుపద్రవపీడితమ్,
శస్త్రక్షారాగ్నికృత్యానాం, అనవం, కృచ్ఛ్రభేషజమ్. ౧౫
విద్యాదేకపథం రోగం నాతిపూర్ణచతుష్పదమ్,
ద్విపథం నాతికాలం వా కృచ్ఛ్రసాధ్యం ద్విదోషజమ్. ౧౬

వ్యా. నిమిత్తములు (రోగహేతువులు), పూర్వరూపములు, రూపములు, ఇవి మధ్యమబలములుగ (వాని సంపూర్ణలక్షణములు లేక స్వల్పముగ) నుండువ్యాధి కృచ్ఛ్రసాధ్యము. కాలము, ప్రకృతి, దూష్యములు - వీనిలో నొక్కదానితో సమానమైన గుణములుకల దోషముచే జనించినవ్యాధి కృచ్ఛ్రసాధ్యము. గర్భవతిగా నుండుస్త్రీకిని, వృద్ధులకు, బాలురకును సంభవించిన యేరోగమైనను నయ్యది కృచ్ఛ్రసాధ్యము. మిక్కుటములైన యుపద్రవములచే పీడింపబడక (స్వల్పోపద్రవముల గూడియుండు) వ్యాధియు కృచ్ఛ్రసాధ్యము. శస్త్రకర్మ, క్షారకర్మ, అగ్నికర్మ అను నీచికిత్సల చేయ వలసిన వ్యాధులును, చిరకాలముగ ననువర్తించియుండు వ్యాధులును, మర్మస్థలము మున్నగు కష్టప్రదేశముల జనించినవ్యాధులును కృచ్ఛ్రసాధ్యములు. ఒక మార్గముననే జనించినను పూర్ణలక్షణములు లేని వైద్యాది పాదచతుష్టయము కల్గినవ్యాధి కృచ్ఛ్రసాధ్యము. రెండు మార్గముల ననుసరించి జనించి చాలకాలము గడవకయుండు వ్యాధియు, దోషద్వయసంసర్గమున సంభవించిన వ్యాధియు కృచ్ఛ్రసాధ్యములు.

### యాప్యరోగలక్షణములు.

మూ. శేషత్వాదాయుషో యాప్యం అసాధ్యం పథ్యసేవయా,
లబ్ధాల్పసుఖమల్పేన హేతునాశుప్రవర్తకమ్. ౧౪
గమ్భీరం బహుధాతుస్థం మర్మసన్ధిసమాశ్రితమ్,
నిత్యానుశాయినం రోగం దీర్ఘకాలమవస్థితమ్. ౧౫
విద్యాద్ద్విదోషజం;

వ్యా. వ్యాధి యసాధ్యముగ ఔషధసేవచే పూర్తిగ నివర్తి కాకున్నను ఆయుశ్శేష ముండుటచే జీవితకాలముపరకును కాలము గడపదగినది యాప్యము. మరియు నయ్యది పథ్యసేవనము హితోపచారములు ఔషధసేవ మున్నగువిధానములచే కొంచెముగ సుఖము కల్గించును. స్వల్పమైనకారణముచే గూడ ప్రకోపము నొందజూచును. మరియు మిక్కిలి గంభీరములైన (శరీరాంతర్భాగముననుండు) మేదస్సు మున్నగు ధాతువుల నాశ్రయించి జనించినవ్యాధియు, అనేకధాతువుల నాశ్రయించి సంభవించిన వ్యాధియు, మర్మస్థానములయందును సంధిస్థానములయందును పుట్టినవ్యాధులును, సర్వకాలసర్వావస్థలయందు ననువర్తించి యుండువ్యాధియు, చాలకాలముగ నివర్తించక నిలువబడియుండి రెండుదోషములసంసర్గమున సంభవించినవ్యాధియు యాప్యములగును.

## ప్రత్యాఖ్యేయరోగలక్షణము.

మూ. తద్వత్ప్రత్యాఖ్యేయం త్రిదోషజమ్,
క్రియాపథమతిక్రాన్తం సర్వమార్గానుసారిణమ్ 19
ఔత్సుక్యారతిసమ్మోహకరమిన్ద్రియనాశనమ్,
దుర్బలస్య సుసంవృద్ధం వ్యాధిం సారిష్టమేవ చ. 20
భిషజా ప్రాక్పరీక్ష్యైవం వికారాణాం స్వలక్షణమ్,
పశ్చాత్కార్యసమారమ్భః కార్యసాధ్యేషు ధీమతా. 21

వ్యా. పైజెప్పిన గంభీరాదియాప్యలక్షణములు కల్గి సమముగ ప్రకోపించిన దోషత్రయమున సంభవించినరోగములు ప్రత్యాఖ్యేయములు (అసాధ్యము లగుటంజేసి చికిత్సజేయక నిరసింపదగునని భావము). మరియు యుక్తచికిత్స జేసినపుడు ఆట్టిచికిత్సను లొంగక అతిక్రమించి యుండురోగంబును, అన్నిమార్గముల ననుసరించి సంభవించినరోగంబును ప్రత్యాఖ్యేయము. మరియు హర్షోద్రేకమును కల్గించురోగంబును, అరతిని (ఈలోకమునకు సంబంధించిన విషయము లన్నిటియందును విరక్తిని) బుట్టించు రోగంబును, మనస్సుకు సంబంధించిన యజ్ఞానమును కల్గించురోగంబులును ఇంద్రియ వ్యాపారముల నశింపజేయు వ్యాధులును ప్రత్యాఖ్యేయములు. మరియు బలహీనస్థితి నున్నవానికి సంభవించి మిక్కిలి వృద్ధినొందినవ్యాధులును, అరిష్ట (మరణసూచక) లక్షణములతో గూడినవ్యాధియు అసాధ్యములు. కావున చికిత్సజేయదలచినవైద్యుడు ఆయారోగములకు సంబంధించినలక్షణములలో నసాధ్యాదిలక్షణములు చక్కగ తొలుత నే పరీక్షించి, సాధ్యరోగములను నిర్ణయించి పిదప తత్తదనుకూలము లైనచికిత్సల జేయ గడంగవలెను. ఇదియే బుద్ధిమంతు డగువైద్యుని ప్రథమకృత్యము.

## సాధ్యాసాధ్యవిభాగజ్ఞానప్రయోజనము.

మూ. సాధ్యాఽసాధ్యవిభాగజ్ఞో యస్సమ్యక్ప్రతిపత్తిమాన్,
న స మైత్రేయతుల్యానాం మిథ్యాబుద్ధిం వివర్ధయేత్. ఇతి. 22

వ్యా. సాధ్యాసాధ్యరోగములవిభాగమును చక్కగ తెలిసి చికిత్సవిషయమై మంచియనుభవజ్ఞానము కల్గి యెవ్వడు చికిత్స జేయ గడంగునో వాడు ఔషధముచే వ్యాధిప్రశమనమును ప్రత్యక్షముగజేసి, మైత్రేయులతో సమానమైనవారికి మైత్రేయుడు జెప్పిన 'భేషజమభేషజేన సమానం' అనునట్టి మిథ్యాజ్ఞానమును వృద్ధిచేయక యుండును.

అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః:—

ఇహౌషధం పాదగుణాః ప్రభావో భేషజాశ్రయః,
ఆత్రేయమైత్రేయమతీ మతిద్వైవిధ్యనిశ్చయః. ౨౩
చతుర్విధవికల్పాశ్చ వ్యాధయస్స్వస్వలక్షణాః,
ఉక్తా మహాచతుష్పాదే యేష్వాయత్తం భిషగ్జితమ్. ఇతి. ౨౪

వ్యా. ఔషధము, వైద్యాదినాల్గుపాదములకు జేరిన పదునారుగుణములు చికిత్స నాశ్రయించిన ప్రభావము. ఆత్రేయమైత్రేయమతములు, ఆరెండుమతముల లోని సిద్ధాంతము. వ్యాధులసాధ్యాదిభేదము నాల్గు, వానిలక్షణములు, ఇవి యన్నియు చికిత్సకు నాధారము లైయున్నవి. అట్టివిషయము లన్నియు నీమహాచతుష్పాదాధ్యాయమున వివరింపబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
మహాచతుష్పాదో నామ దశమోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున అగ్నివేశకృతంబును, చరకమహర్షిచే సంస్కరింపబడినదియు నగు చరకసంహితయందు సూత్రస్థానమున మహాచతుష్పాదమనునది పదియవ యధ్యాయము సమాప్తము.

---

## ఏకాదశాధ్యాయము.

అవతారిక:—పైజెప్పిన అధ్యాయమున వైద్యుడు, ఔషధములు, పరిచారకులు, రోగి యను నాల్గుపాదములును వానివానికి జెప్పిన లక్షణములతో గూడియున్నయెడ నయ్యవి ఆరోగ్యమునకు ముఖ్యకారణమగునని నిర్ణయింపబడినది. అట్టిచతుష్పాద సంపత్తి కలిగినవానిచే ముఖ్యముగ సంపాదింపదగినది ప్రాణపరిపాలనము, ధనార్జనము, ధర్మార్జనము, అనునీమూటికిని సాధనములు ఆవశ్యకములు. కావున నామూటిని నీ యధ్యాయమున చెప్పుటకుగా నుపక్రమింపబడును.

మూ. అథాతస్త్రిస్రైషణీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. ఏషణములు అనగా సాధనమని యర్థము. మహాచతుష్పాదాధ్యాయమును చెప్పినపిదప త్రిస్రైషణీయము అనునధ్యాయము త్రికాలవేత్తయగు ఆత్రేయుండు

చెప్పినదానికి న్యూనాతిరేకములు గాకుండునట్లు వివరించెదను అని యర్థము. ప్రాణ పరిపాలనమునకు సాధనము, ధనార్జనమునకు సాధనము, ధర్మార్జనమునకు సాధనము అను నివిమూడును త్రిస్రైషణములు, ఈమూటిని యధికరించి చెప్పునట్టి యధ్యాయము త్రిస్రైషణీయ మనబడును. మరియుం త్రిస్రైషణశబ్దమును గలయధ్యాయ మనియుం నర్థము.

ఏషణాత్రయవివరణము.

మూ. ఇహ ఖలు పురుషేణానుపహతసత్త్వబుద్ధిపౌరుషపరాక్రమేణ హితమిహ చాముష్మింశ్చ లోకే సమనుపశ్యతా తిస్ర ఏషణాః పర్యేష్టవ్యా భవన్తి. తద్యథా—ప్రాణైషణా, ధనైషణా, పరలోకైషణేతి. 3

వ్యా. భోగమును కోరుపురుషాధికారమునందు మనస్సు, బుద్ధి, పౌరుషము, (శరీరసంబంధమయినబలము) శౌర్యము ఇవియన్నియుం హానిలేక యుండుమనుజుడు ఇహపరలోకముల రెంటియందును హితమును కోరినయెడల వాడు మూడు ఏషణముల (సాధనముల)ను వెదకవలయును. అవి యెవ్వి యనిన:—ప్రాణైషణము (రోగములు లేక తనప్రాణమును కాపాడుకొనుటకు తగిన యుపాయము) ధనైషణము (ధనమును సంపాదించుటకు తగినయుపాయము) పరలోకైషణము (పరలోకమునకు ఉపకారకమై పుణ్యరూపమైన సాధనము) నవి మూడును త్రిస్రైషణములు. వీనిని ముఖ్యముగా మనుజమాత్రుడు సాధింపవలెను. ఇట్టిసాధనములు లేనిమనుజుడు పురుషుడని చెప్పుటకు అర్హుడు కాడని భావము.

ఇచ్చట మోక్షార్థి యైనపురుషునకు పుత్త్రైషణ విత్తైషణ దారైషణములు మూడును వర్జింపదగినవి కావున ధనైషణము సంగతము కాదుకావున ఇహ అనుపదమునకు యోగార్థి యైనపురుషునివిషయమై క్రింద జెప్పంబడు ఏషణములు మూడును సంపాదింపదగినవని యర్థము.

ఏషణయన:—"ఇష్యతే (అన్విష్యతే, సాధ్యతే,) అనయేతి—ఏషణా" అను వ్యుత్పత్తిచేత సాధించుటకు తగినయుపాయము ఏషణమని యర్థము. ప్రాణమన జీవితము. అట్టిజీవితము రోగాదులచే బాధలేక దీర్ఘకాల మనువర్తించి యుండునట్లు సాధించుటకు దగినయుపాయము ప్రాణైషణము, ధనమును సంపాదించుటకు దగినయుపాయము ధనైషణము, పరలోకోపకారక మైనధర్మమును సాధించుటకు దగినయుపాయము పరలోకైషణము. పైజెప్పిన సత్త్వపౌరుషాదులు కలపురుషునకు పైజెప్పిన మూడు విధములైన ఏషణములు అవశ్యము సంపాదనీయములని భావము. అట్టియేషణముల

సంపాదింపలేనిపురుషుడు పశుప్రాయుడని తెలుపుటకై 'పురుషేణ' అని చెప్పబడినది. కామైషణ మనునది ప్రాణైషణ ధనైషణములలో జేరినది. (శరీరధనసంపత్తిచే సాధ్యమగు టంజేసి వానిలో జేరినది కామైషణమని భావము.) లేక శరీరధనసంపత్తి కల్గిననాడు పురుషు డుపదేశము లేకున్నను తనంతటనే కామైషణమున ప్రవృత్తి కల్గియుండును కావున ప్రత్యేకముగ జెప్ప నవసరములేదని విడువబడినది.

## ప్రాణైషణము.

మూ. ఆసాం తు ఖల్వేషణానాం ప్రాణైషణాం తావత్పూర్వతర మాపద్యేత. కస్మాత్ ప్రాణపరిత్యాగే హి సర్వత్యాగః; తస్యాఽనుపాలనం—స్వస్థస్య స్వస్థవృత్తిః, ఆతురస్య వికారప్రశమనేఽప్రమాదః, తదుభయమేతదుక్తం, వక్ష్యతే చ, తద్యథోక్త మనువర్తమానః ప్రాణానుపాలనాద్దీర్ఘమాయు రావ్నోతీతి ప్రథమైషణా వ్యాఖ్యాతా భవతి. ౪

వ్యా. పైజెప్పిన మూడువిధములైన యేషణములలో ప్రాణైషణమునది తొలుత చేయదగినది. ప్రాణపరిత్యాగముచే సకలవ్యాపారములకును పరిత్యాగము కల్గును కావున ప్రాణరక్షణమునకు సాధనమైన ప్రాణైషణము తొలుత సాధింపదగినదని భావము. అట్టి జీవితమును పరిపాలనము జేయునది రోగములు లేక స్వస్థత నుండువానికి స్వస్థవృత్తము ననుసరించి నడచుకొనుట, ధాతువైషమ్యరూపమైన రోగములు సంభవించి నపుడు అట్టిరోగముల శమింపజేయునట్టి చికిత్సయందు పొరపాటులేక జాగ్రత్తతో నాచరించుట. ఈరెండువిధములైన యుపాయములును ఇంతదనుక కొంత జెప్పబడినది. అంతయు నీశాస్త్రమున పూర్తిగ నింకను చెప్పబడును. అట్టి రెండుపాయములను విధ్యుక్తప్రకారము అనుసరించి యనుష్ఠానము చేసినచో జీవితమును పరిపాలనము జేసికొనుచు దీర్ఘాయువును పొందగలడు. ఇత్తెరంగున తొల్లింటిది యైన ప్రాణైషణము వివరింపబడినది.

ఇచ్చట ప్రాణశబ్దమునకు జీవితమని యర్థము. కావున 'తస్యానుపాలనం' అనుచోట 'తస్య' అని యేకవచననిర్దేశము సంగతము. "త్రీణీ వాయతనాన్యాహుః ప్రాణో యేషు ప్రతిష్ఠితః" అనుచోట కూడ ప్రాణశబ్దమునకు జీవితమని యర్థము.

## ధనైషణము.

మూ. అథ ద్వితీయాం ధనైషణామాపద్యేత. ప్రాణేభ్యో హ్యనన్తరం ధనమేవ పర్యేష్టవ్యం భవతి. న హ్యతః పాపాత్పాపీయోఽస్తి,

యదనుపకరణస్య దీర్ఘమాయుః. తస్మాదుపకరణాని పర్యేష్టుం యతేత. తత్రోపకరణోపాయాననువ్యాఖ్యాస్యామః. తద్యథా:- కృషిపాశుపాల్యవాణిజ్యరాజోపసేవాదీని యాని చాన్యాన్యపి సతామవిగర్హితాని కర్మాణి వృత్తిపుష్టికరాణి విద్యాత్, తాన్యారభేత కర్తుమ్. తథా కుర్వన్ దీర్ఘజీవితం జీవత్యనవమతః పురుషో భవతీతి ద్వితీయా ధనైషణా వ్యాఖ్యాతా భవతి. ౫

వ్యా. ప్రాణైషణమును జెప్పినపిదప ధనైషణము చెప్పబడును:—ప్రాణముల కాపాడుటకు సాధనమును సంపాదించినపిదప ధనసంపాదనమునే ముఖ్యముగ జేయవలెను. ఆరోగ్యమునకును భోగమునకు పరలోకసాధనమగుధర్మముల నాచరించుటకును సాధన (ఉపకరణ) మైనది ధనము; అట్టిధనరూపమైన యుపకరణము లేనిమానవునకు దీర్ఘకాలము జీవించుటకన్న దుఃఖము వేరొండు లేదు; కావున ప్రాణపరిపాలనము జేసికొని వెంటనే అన్నిటికిని ముఖ్యసాధనమైన ధనమును సంపాదించుటకు ప్రబలప్రయత్నమును జేయందగును. అట్టియుపకరణమును సాధించుటకు దగినయుపాయము లీక్రింద వివరింపబడును. ఎట్టు లన:—

కృషి (వ్యవసాయము), పాశుపాల్యము (పశువుల పరిపాలించుట), వాణిజ్యము (వ్యాపారము), రాజసేవనము (ప్రభువునొద్ద నౌకరిచేయుట), ఇవి మున్నగునవియు, సత్పురుషులకు నింద్యములు కాన జీవనమునకును ధనసంపత్తుకును వృద్ధికరములైన యితర వ్యాపారములును ధనార్జనోపాయము లగును. కావున అట్టిపనుల జేయ నారంభించవలెను. అట్టిపనుల జేసి ధనము నార్జించినపురుషుడు దీర్ఘాయుష్మంతుడై లోకమున నవమానమునొందక గౌరవనీయుడై సుఖజీవనమును సంపాదించుకొని యుండును. ఇత్తెరంగున రెండవదియైన ధనైషణము వివరముగ జెప్పబడినది.

ఇచ్చట "ధనోపాయానను" అని చెప్పక "ఉపకరణోపాయా ననువ్యాఖ్యాస్యామః" అని చెప్పుటచేత నీక్రింద జెప్పబడు ధనోపాయములచే సంపాదింపబడిన ధనము తాననుభవించుటకును, పరలోకసాధనమైన ధర్మము నుపార్జించుటకును ఉపయోగింపవలెనుకాని, తాను కేవలము కృపణుడై ధనమును మాత్రము వృద్ధిచేయుటకుగాను క్రిందిసాధనములు జెప్పినవి కాదని భావము.

'అన్యాన్యపి' అనుపదముచేత నిర్దిష్టములగు ప్రతిగ్రహము, అధ్యాపనము మున్నగుకృత్యములు గ్రహింపబడును.

## పరలోకైషణము; అందు నాస్తికాదిమతానువాదము.

మూ. అథ తృతీయాం పరలోకైషణామాపద్యేత, సంశయశ్చాత్ర:— కథం భవిష్యామః తశ్చ్యుతాః, న వేతి. కుతస్సంశయః పునః? ఇత్యుచ్యతే:—సన్తి హ్యేకే ప్రత్యక్షపరాః, పరోక్షత్వాత్పునర్భవస్య నాస్తిక్యమాశ్రితాః సన్తి చాపరే యేత్వాగమప్రత్యయాదేవపునర్భవ మిచ్ఛన్తి. శ్రుతిభేదాచ్చ:—'మాతరం పితరం చైకేమన్యన్తే జన్మకారణం, స్వభావం పరనిర్మాణం యదృచ్ఛాంచాపరే జనాః.' ఇత్యతస్సంశయః. కిన్ను ఖల్వస్తి పునర్భవో న వేతి. ౬

వ్యా. ప్రాణైషణ విత్తైషణముల రెంటిని సంపాదించిన పిదప మూడవియగు పరలోకైషణమును పురుషు ననువర్తించవలెను. (ప్రత్యక్షవాదులైన చార్వాకాది నాస్తికమతానుసారులు కొందరు పరోక్షమైన పరలోకమును అంగీకరించుటలేదు. కావున వారిమతముల నిరూపించి ఆస్తికమతసిద్ధాంతమును నిర్ణయించుటకై నాస్తికమతమును తంత్రకారుడు "సంశయశ్చాత్ర" అనుగ్రంథముచేత అనువదించుచున్నాడు).—

పరలోకవిషయమైన గొప్పసంశయము:—మన మీజన్మమున మృతినొంది యీ శరీరమును వదలి మరల మనమే జన్మాంతరము నొందుదుమా? లేదా? యని సంశయము. ఈసంశయ మెందుకు కల్గినదన్న:—కొందరు ప్రత్యక్షములగు (చక్షురాదీంద్రియగోచరములగు) ఘటపటాదిపదార్థములే ప్రమాణములు కాని కంటికగపడని పునర్భవము (మరల జననమందుట) ప్రత్యక్షము కాదు; కావున పునర్భవంబును, అట్టిజన్మాంతరమునకు కారణమని చెప్పబడు కర్మఫలంబును, ఆత్మయు (అప్రత్యక్షము లగుటచేత) లేదనుపక్షము నవలంబించి పరలోకాదులును లేవని చెప్పువారు కొందరు కలరు. మరియు వేదములు, స్మృతులు మున్నగుప్రమాణవచనముల ప్రామాణ్యమువలన పునర్జన్మంబును పరలోకసాధనము లైన కర్మఫలాదులును కలవని యంగీకరించు ఆస్తికులు కొందరు కలరు. కావున పరస్పరవిరుద్ధము లైన రెండుపక్షములు కనబడుటంజేసి పునర్జన్మము కలదా? లేదా? యని సంశయము.

మరియు "మాతరం—జనాః" అనుప్రమాణవచనము కూడ పైజెప్పినసంశయమును దెలుపుచున్నది:—జన్మమెత్తుటకు కారణము తల్లిదండ్రులు. (వారిశుక్రశోణితసంయోగముచే గర్భరూపముగ పరిణమించి శిశువు పుట్టును కావున తల్లిదండ్రులు జన్మ

మునకు కారణము) అని కొందరు నాస్తికులు చెప్పెదరు. (మరియు వీరిమతమున ఈ శరీరమును వదలి శరీరాంతరమును బొందుటకు పరలోక మనుసాధనము లేదని వీరి సిద్ధాంతము.)

ప్రత్యక్షములగు పృథివ్యాదిపంచభూతములస్వభావము జన్మకారణమని మరి కొందరు తలచెదరు. (పృథివ్యాదిపంచమహాభూతములు పరస్పరసంయోగముచే పురుషాది లక్షణయుక్త మగుచేతనపదార్థమును గల్గింప నారంభించును. (సురాబీజాదిపదార్థములు పరస్పరసమ్మేళనమునంజేసి మదకరమైన మద్యమును కల్పించువిధముగ అచేతనములైనపంచ భూతములును పరస్పరసమ్మేళనమున చేతనావంతమగు పురుషుని కల్గించును; కావున పంచ భూతములస్వభావమే జన్మకారణ మగునుకాని పరలోకము కలయాత్మ వేరుగ జన్మ కారణము లేదని స్వభావవాదుల సిద్ధాంతము.)

ఐశ్వర్యాదిగుణములతో గూడిన యాత్మవిశేషము పరము. అట్టియాత్మ ఈశరీ రము నాశ్రయించి సంసృతి (జన్మాంతరసంబంధము)నొందు ఆత్మాంతరము నపేక్షింప కయే చేతనావంతమైన పురుషుని నిర్మించును. కావున అట్టియాత్మ నిర్మాణమే జన్మాం తరమునకు కారణమని పరనిర్మాణవాదులు తలచెదరు. (వీరిమతమున ఈశరీరమునకు సంబం ధించిన యాత్మసంబంధము లేకయే ఐశ్వర్యాదిగుణములతో గూడినయాత్మ యొకటి తన స్వతంత్రవ్యాపారముచే చేతనావంతమైనపురుషుని నిర్మించును. కాని ఈశరీరమున నుండునాత్మ కర్మపరిపాకమున వేరుజన్మము నొందుట లేదని భావము.)

నియతమైనకారణము లేక తనంతనే యాదృచ్ఛికముగ జన్మ కల్గునని యదృచ్ఛా వాదులు చెప్పెదరు. జన్మమునకు నియతమైనకారణము కానరాదు. ఆగమాదిప్రమాణ ములబట్టి అందు జెప్పినకర్మ కారణమని చెప్పుదమన్న నయ్యది ప్రత్యక్షము కామింజేసి ప్రమాణముగ జెప్ప వలనుపడదు. కావున నదృష్టమును కారణముగ జెప్పదగదు. ఇక నేమన్న కారణము లేకయే అప్రయత్నముగ ఘుణాక్షరన్యాయముగ జన్మ మేర్పడు నని యదృచ్ఛాకారణవాదుల యభిప్రాయము.

ఇత్తెరంగున ప్రత్యక్షప్రమాణవాదులగు చార్వాకాదినాస్తికమతవాదులు జన్మ మునకు పైజెప్పినరీతిగ ప్రత్యక్షప్రమాణదూరమైన కర్మఫలాదులు కారణములు కానో పవు కాన ఈజన్మ విడచినవారికి జన్మాంతరము లేదని చెప్పెదరు. ఆగమాదిప్రమాణ ముల నమ్మునట్టిమాస్తికవాదులు అట్టిప్రమాణములనుబట్టి ఈపురుషునకే కర్మానుగుణముగ జన్మాంతరము కల్గునని చెప్పెదరు. ఇట్టిపక్షద్వయ ముండుటచేత నాస్తికమతరీతిగ పునర్భవము లేదా? ఆస్తికమతరీతిగ జన్మము కలదా? యనుసంశయమునకు కారణము.

## ప్రత్యక్షవాదనిరసనము.

మూ. తత్ర బుద్ధిమాన్నాస్తిక్యబుద్ధిం జహ్యాత్, విచికిత్సాం చ. కస్మాత్?—ప్రత్యక్షం హ్యల్పం, అనల్పమప్రత్యక్షమస్తి; యదాగమానుమానయుక్తిభిరుపలభ్యతే. యైరేవ తావదిన్ద్రియైః ప్రత్యక్షముపలభ్యతే, తాన్యేవ సన్తి చాప్రత్యక్షాణి. ౬
సతాం చ రూపాణాం అతిసన్నికర్షాత్ అతివిప్రకర్షాత్, ఆవరణాత్, కరణదౌర్బల్యాత్, మనోఽనవస్థానాత్, సమానాభిహారాత్, అభిభవాత్, అతిసౌక్ష్మ్యాచ్చ ప్రత్యక్షానుపలబ్ధిః తస్మాత్ అపరీక్షితమేతదుచ్యతే—ప్రత్యక్షమేవాస్తి, నాన్యదస్తీతి. ౭

వ్యా. ప్రశస్తమైనబుద్ధికలమనుజుడు పైజెప్పినరీతిగ ప్రత్యక్షప్రమాణమును మాత్ర మనుసరించి పరలోకము లేదనునాస్తిక్యబుద్ధిని, పక్షద్వయమునుబట్టి పైజెప్పిన రీతిగ పరలోకవిషయమైనసందేహబుద్ధిని విడువవలెను. (ఇచ్చట నాస్తికత్వము పరలోకము లేదని నిర్ణయించునది కావున పరలోకవిషయమై ప్రత్యక్షముగ విరుద్ధమగుటంజేసి ధర్మానుష్ఠానమునకు ప్రత్యక్షముగ విరోధకము. పక్షద్వయపర్యాలోచన చేత కల్గిన పరలోకము కలదా లేదా? యను సందేహజ్ఞానము ఒకపక్షమున లేదనుజ్ఞానమునకును స్వల్పమైన యవకాశము కల్గించును. అట్టిస్వల్పమైనవిపర్యయజ్ఞానంబును పరలోకమునకును, పరలోకసాధనమైన ధర్మానుష్ఠానమునకును విరోధకమగును. కావున ధర్మానుష్ఠానమునకు పూర్ణముగ విరోధకమైన నాస్తిక్యమును, స్వల్పముగ విరోధకమైన సంశయజ్ఞానమును కూడ బొత్తుగ మానవలెనని 'నాస్తిక్యబుద్ధిం విచికిత్సాం చ జహ్యాత్' అని నిషేధింపబడినది.)

ఎట్లనగా:—చక్షురాదీంద్రియములకు గోచరమైన (ప్రత్యక్షప్రమాణగోచరములైన ఘటపటాదిపదార్థములు మిగుల స్వల్పముగ నున్నవి. కేవలము ప్రత్యక్షప్రమాణమునకు గోచరములు గాక ఆగమము, అనుమానము, యుక్తి, యనుప్రమాణములకు గోచరములైన స్వర్గాదులు అధికముగ నున్నవి. కావున ప్రత్యక్షప్రమాణమునకు గోచరము కాని పరలోకాదులు లేవు అని చెప్పుట సమంజసము కాదు. (ప్రమాజనకము ప్రమాణము. ప్రత్యక్షప్రమాణము ఎట్లు ప్రమాజనకమో, అత్తెరంగుననే ఆగమానుమానయుక్తులును కూడ ప్రమాజనకము లగుటంజేసి ప్రమాణములే యగు. ప్రత్యక్షప్రమాణగోచరములైన ఘటపటాదు లెట్లు ప్రమాణసిద్ధములో అతెరంగుననే ఆగమానుమానాదీతర

ప్రమాణగోచరములైన పరలోకాదులును ప్రమాణసిద్ధములు కాక మానవు. కావున ప్రత్యక్షప్రమాణమాత్రమునకు గోచరము కానందున పరలోకపునర్భవాదులు లేవని చెప్పుట యుక్తము కాదని భావము.)

మరియు నేయింద్రియములచే (ప్రత్యక్షప్రమాణ)గోచరము లైన ఘటపటాదు లున్నవని చెప్పెదరో, అట్టిచక్షురాదీంద్రియములు కూడ ప్రత్యక్షప్రమాణసిద్ధములు కావు. (చక్షురాదీంద్రియములు అనుమానసాధ్యములు కాని, ప్రత్యక్షప్రమాణసిద్ధ ములు కావు. కావున ప్రత్యక్షవాదులును చక్షురాదీంద్రియముల విషయమై యను మానప్రమాణము నంగీకరించి తీరవలెను. అట్టియనుమానప్రమాణముచే సిద్ధమైన పరలోక పునర్భవాదులు లేవని చెప్పుట మిక్కిలి యనాలోచితమని భావము.)

మరియు ప్రత్యక్షప్రమాణముచే నింద్రియగ్రాహ్యములైన ఘటపటాది వస్తు వులును మిక్కిలి సమీపమున నుండుటచేతను, మిగుల దూరమున నుండుటచేతను, ఇతర వస్తువుచే మరుగుచేయుంటచేతను, చక్షురాదీంద్రియములు దుర్బలము లగుటచేతను, మనస్సు నిల్కడ లేకుండుటచేతను, తనకు సమానజాతీయములైన వస్తువులతో కలిసి యుండుటచేతను, తేజోఽధికవస్తువుచే దిరస్కరింపబడుటచేతను, మిక్కిలి సూక్ష్మముగ నుండుటచేతను, ప్రత్యక్షజ్ఞానగోచరము లగుటలేదు. కావున ప్రత్యక్షప్రమాణసిద్ధమైన ఘటపటాది పదార్థములే సత్యముకాని ప్రత్యక్షముకాని పరలోకాదులు ప్రమాణ దూరమగుటచే లేవని చెప్పుట చక్కగ పరికింపక చెప్పినది.

(చక్షురాదీంద్రియగ్రాహ్యములైన ఘటపటాదులు ప్రత్యక్షప్రమాణసిద్ధములు; కావున నవియే సత్పదార్థములని ప్రత్యక్షవాదులసిద్ధాంతము. అట్టి ప్రత్యక్షప్రమాణ సిద్ధములని చెప్పబడు పదార్థములునుగూడ అతిసమీపమున నుండుట ఇవి మున్నగు కారణములచేత ఇంద్రియగ్రాహ్య మగుటలేదు. అంతమాత్రముచేతనే అవి లేవని చెప్పుట యుక్తమా ? కాదు. కావున ఇంద్రియగోచరము కాకుండుటకు వస్త్వభావము కారణ మని చెప్పుట సమంజసము కాదనియు విచారమారమనియు భావము.)

పైజెప్పిన సామీప్యాది కారణముల కుదాహరణముల నిట్లెరుంగునది:—కన్నుల యందుంచబడిన కాటుక కన్నుల కతిసమీపమున నుండుటవలన కనబడుటలేదు. ఇచ్చట చక్షుర్గోచరము కాకుండుటకు సామీప్యము కారణము కాని కాటుకయొక్క అభావము కారణము కాదు. ఆకసమున నతిదూరములో సంచరించు పక్షులు కన్నులకు కానరావు. ఇచ్చట దూరముగనుండుట కనుపడకపోవుటకు కారణము. నీటిలో మునిగి యుండు ఘటము కన్నులకు కానబడదు. ఇచ్చట ఘటము కనబడకుండుటకు జల మావ

రించియుండుట కారణము. కామలారోగముచే పీడింపబడినవానికి తెల్లగనుండు పటాదులెల్ల పచ్చగ నగపడును. ఇచ్చట నేత్రదోషము పటనిష్ఠమైన తెలుపు కనబడకుండుటకు కారణము. తనప్రియురాలిముఖమును ప్రీతితో జూచువానికి ప్రక్కనసుండు పదార్థము లగపడుటయుం మాటలవినుటయు లేదు. ఇచ్చట ప్రక్కనున్న వస్తువు లగపడకుండుటకు మనస్సు కేకాగ్రత లేకుండుట కారణము. (మనస్సు ప్రియురాలి ముఖమును జూచుటయందే యాసక్తి కల్గినదికాని ఇతర వస్తువులయందు మనస్సులేదని భావము.) బిల్వరాశిలోనుండు నొకబిల్వము ప్రత్యేకముగ నగపడుటలేదు. ఇచ్చట తాను చూచుచున్నను సమానజాతియైన బిల్వసముదాయమున కలిసియుండుటచే నొక బిల్వము ప్రత్యేకముగ నగపడుటలేదు. ఇది సమానాభిహారము. మధ్యాహ్నకాలమున నక్షత్రము లగపడుటలేదు. ఇందుకు తేజోఽధికమైన సూర్యకాంతిచే తిరస్కరింప బడుట కారణము. (అంతమాత్రముచేతనే పగలు నక్షత్రములు లేవనుట యుక్తమా). రెండుమూడు మూరలదూరమున నుండు మిక్కిలి సన్ననిక్రిము లగపడవు. ఇచ్చట వస్తువునకు సంబంధించిన సూక్ష్మత్వకారణము. (పైజెప్పినకారణములచే చక్షుర్గోచరము కానివస్తువుల నన్నిటిని ప్రత్యక్షవాదిసిద్ధాంతప్రకారము లేవనియే చెప్పవలసియుండును. కావున ప్రత్యక్షప్రమాణమునకు గోచరముకావు కావున పరలోకాదులు లేవని చెప్పునట్టి నాస్తికమతము అంగీకారము కాదని భావము).

## శ్రుతిభేదవాదిమతనిరసనము.

మూ. శ్రుతయశ్చైతా న కారణం, యుక్తివిరోధాత్ ౯
ఆత్మా మాతుః పితుర్వా యః సోఽపత్యం యది సంచరేత్,
ద్వివిధం సంచరేదాత్మా సర్వో వావయవేన వా. ౧౦
సర్వశ్చేత్సంచరేన్మాతుః పితుర్వా మరణం భవేత్,
నిరన్తరం నావయవః కశ్చిత్ సూక్ష్మస్య చాత్మనః. ౧౧
బుద్ధిర్మనశ్చ నిర్ణీతే యథైవాత్మా తథైవ తే,
యేషాం చైషా మతిస్తేషాం యోనిర్నాస్తి చతుర్విధా. ౧౨

వ్యా. పైచెప్పబడిన "మాతరం పితరం చైవ" ఇది మున్నగు శ్రుతిభేదంబును (అట్టిశ్రుతులలో జెప్పబడిన తల్లిదండ్రులు మున్నగునవియుం) పునర్భవ ప్రతిషేధమునకు కారణము కాదు. ఏలయన:—అయ్యవి యుక్తికి విరుద్ధములు కావున సరియైన హేతువులు కావని యర్థము. (పుత్రునియొక్క శరీరోత్పత్తికి తల్లిదండ్రుల శుక్రశోణితములు కారణముగ నగును. చైతన్యము మాత్రము ఈజన్మమును విడచి పరలోకమునకు

బోయి పుణ్యపాపరూపమైన కర్మానుసారముగ వాసనావశమునం జేసి మరల శరీరాంతరమున ప్రవేశించునట్టి యఖండాత్మసంబంధముననే సంభవించునని సిద్ధాంతము.)

అట్టి యఖండాత్మసంబంధము లేకయే తల్లిదండ్రుల చైతన్యమునకు హేతువైన యే ఆత్మ కలదో అట్టియాత్మవలననే వారిసంతతికిని చైతన్యము కల్గుటకు కారణమని కొందరు చెప్పెదరు. ఇది యుక్తియుక్తము కాదు. ఎట్టులన:—తల్లిదండ్రులయాత్మయే వారికొడుకులు మున్నగువారికి సంక్రమించి సంచరించునెడ అయ్యది తల్లినైనను తండ్రినైనను పూర్తిగ వదలి సంతతికి జేరునా? లేక ఆయాత్మయం దేకదేశము సంక్రమించునా? యను నాశంక:—ఆయాత్మ తల్లిది సంపూర్ణముగ నపత్యమున జేరునన్నచో తల్లి యాక్షణముననే మృతిజెందును. లేక తండ్రియాత్మ పూర్తిగ సంక్రమించు నన్నచో ఆక్షణముననే తండ్రి మరణించును. కావున తల్లియాత్మయైనను తండ్రియాత్మయైనను అఖండముగ నపత్యమున సంక్రమించుననుట యుక్తికి (అనుభవమునకు) విరుద్ధము కావున అటు చెప్పదగదు. లేక తల్లిదండ్రులయాత్మలలో నొకభాగము మాత్రము అపత్యమునకు సంభవించు ననుటకు వీలుండదు. పృథివ్యాదులలో స్థూలరూపమైన భూతములకు అవయవములుండును గాని సూక్ష్మములగు ఆకాశము, కాలము, మనస్సు, బుద్ధి మున్నగువానికి అవయవములు లేవు. అవయవములులేక యఖండాకారమైన యాత్మలో నొకభాగము అపత్యమున జేరుననుట యసంభవము.

అఖండమైన యాత్మసంబంధము కల్గ వీలులేకున్నను తల్లిదండ్రులమనస్సైనను బుద్ధియైనను అపత్యమున జేరి చైత్యమును కల్గించునన్నచో నవియును ఆత్మనుబోలె పూర్తిగనైనను ఏకదేశముగనైనను సంక్రమించుటకు వీలుపడదు. అవి పూర్తిగ సంక్రమించినపుడు తల్లికైనను తండ్రికైనను బుద్ధి మనస్సు పూర్తిగ లేక పోవలెను. మనోబుద్ధులతో నేకదేశము సంక్రమించునన్నచో నాత్మనుబోలె నీరెండును సూక్ష్మములును నిరవయవములు నగుటచే నేకదేశము సంక్రమింప నొకప్పుడును సంభావితము కాదు.

మరియుం అపత్యచైతన్యమునకు తల్లిదండ్రులే కారణ మన్నచో వారిమతమున జరాయుజములు, అండజములు, స్వేదజములు, ఉద్భిజ్జములు నను నాల్గువిధములైన ప్రాణిసృష్టిలో స్వేదజములు, ఉద్భిజ్జములు అను రెండు సృష్టులు లేకపోవును. కావున చతుర్విధసృష్టి యనుదానికి భంగము కల్గును. (స్వేదజములగు (చెమటవలన బుట్టిన) మశకాదులకును, ఉద్భిజ్జములైన భూనాగాదులకును తల్లిదండ్రులు లేనందున వానికి చైతన్యము లేకుండవలసివచ్చును కావున చతుర్విధసృష్టి యనుటకు భంగము కల్గును).

### స్వాభావికవాది మతదూషణము.

మూ. విద్యాత్స్వాభావికం షణ్ణాం ధాతూనాం యత్స్వలక్షణమ్,
సంయోగే చ వియోగే చ తేషాం కర్మైవ కారణమ్. ౧౩

వ్యా. స్వాభావికవాదులు పృథివ్యాది పంచభూతములయొక్క కూటమిచేత (పరస్పర సంబంధముచేత చేతనాత్మకమైన పురుషుడు జన్మించును. ఇది పంచభూతముల స్వభావము. అనుస్వాభావికవాదుల మతమును నిరసించుచున్నాడు.—(పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశము అనునవి యైదును, చేతనాత్మకమైన యాత్మయుఁ జేరి యారును శరీరమును ప్రపంచమును ధరించుటంజేసి ధాతువు లనంబడును). ఈయారు ధాతువులకును వానివానికిని ప్రత్యేకముగ జెప్పబడిన లక్షణములు స్వభావకృతములై నియతముగ నాయాధాతువు నాధారముగ జేసికొని (యెకప్పుడు మార్పులేక) యుండును. (అందు కాఠిన్యాదిగుణములు పృథివి నాశ్రయించినవి. ద్రవత్వాదులు జలమును, ఉష్ణత్వాదులు తేజస్సును, తిర్యగ్గమనాదులు వాయువును, అప్రఘాతము (అడ్డులేకయుండుట) మున్నగునవి ఆకాశమును, జ్ఞాన విజ్ఞానాదులు ఆత్మను ఆశ్రయించియుండును. ఇవియే ఆరుధాతువులకు నియతములైన స్వాభావికగుణములు) పైజెప్పిన ధాతువులలో ఆత్మకు దక్క తక్కిన పృథివ్యాదులకు ఐదింటికిని చైతన్యము స్వాభావికముగ నొకప్పుడును లేదు. కావున పంచభూతముల చేరికచేత నపూర్వమైన చైతన్యము ఎట్లు కల్గనోపును ? ప్రత్యేకముగ నుండునప్పుడు లేని చైతన్యము వాని చేరిక వలన క్రొత్తగ కల్గబోదు. పంచభూతస్వాభావికముచే చేతనావంతమైనజన్మము కల్గదని భావము.

అట్టి పంచభూతములకును చేతనాత్మకమైన యాత్మతో సంబంధము కల్గినప్పుడు చైతన్యవంతమగును; మరియు అట్టి పాంచభౌతికమైన శరీరమునకును చేతనారూపమైన యాత్మకును సంబంధము కల్గుటకును, వియోగము కల్గుటకును, జన్మాంతరకృతకర్మమే కారణమగును. (ఒకజన్మమున జేసిన పుణ్యాపాపరూపమైన కర్మము పంచభూతములకును ఆత్మకును సంయోగరూపమైన జన్మమునకును, వియోగరూపమైన మరణమునకును, కర్మ కారణము కాని వేరొండు కారణము కాదు. ఈచెప్పినరీతిగ పంచభూతస్వభావము జన్మకు కారణమని స్వాభావికవాదిమతము నింద్యమని భావము.)

### పరనిర్మాణమతనిరాసము.

మూ. అనాదేశ్చేతనాధాతోర్నేష్యతే పరనిర్మితిః,
పర ఆత్మా స చేద్ధేతురిష్టోఽస్తు పరనిర్మితిః. ౧౪

వ్యా. పరనిర్మాణవాదు లిట్లు చెప్పెదరు:—("ఐశ్వర్యాదిగుణములతో గూడిన యాత్మవిశేషము పరబ్రహ్మముతో చెప్పబడును. అట్టి యాత్మవిశేషము అనేకజన్మసంబంధము కల్గి చేతనావంతమైన యాత్మను అపేక్షించకయే యపూర్వముగ జన్మను కల్గించును. అట్టి యైశ్వర్యాది గుణయుక్తమైన యాత్మసంబంధముచేతనే జడములైన పంచభూతములును చేతనావంతములగును. కావున జన్మాంతరసంబంధము కలయాత్మకు వేరు జన్మము లేదు"అని పరనిర్మాణవాదులసిద్ధాంతము.) అట్టి పరనిర్మాణవాదము ఈశ్లోకముచే నిరసింపబడును:—పరనిర్మాణమనునది ఆత్మతో కూడిన శరీరమునకు పరనిర్మాణమా? లేక ఆత్మకు కూడ పరనిర్మాణమును చెప్పెదరా ?

అందు ఆత్మ చేతనాధాతు (జ్ఞానాత్మక) రూపమైనది. ఆద్యంతశూన్యమై నిత్యమైనది; అట్టియాత్మకు పరులచే నిర్మాణము ఒకప్పుడును సంభవింపదు. పరనిర్మాణము సంభవించునెడ ఆత్మకు నిత్యత్వము ఎట్లు సంగతమగును ? (ఆత్మనిత్యత్వము ఈతంత్రముననే శారీరమున చెప్పబడును) కావున నిత్యమై యాద్యంతరహితమైన యాత్మకు పరనిర్మాణము చెప్పుట సర్వథా సంగతము కాదు. అట్టి పరాత్మచేత శరీరము మాత్రము సృజింపబడునన్నచో శరీరమాత్రసృష్టికి పరాత్మ కారణమగును. అయ్యది సమ్మతమైనది.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—ఐశ్వర్యాదిగుణములతో గూడిన యాత్మవిశేషము చేతనాహేతుభూతముగ నుండు ఆత్మసంబంధము లేకయే శరీరమును సృజించినచో శరీరము ఘటపటాదులవలె నచేతనమగును. అట్టిచేతనాహేతుభూతాత్మతో సంబంధముచేత విశేషాత్మమాత్రము శరీరముగ చేతనాయుక్తముగ సృజింప వలను పడదు. చేతనాహేతువగునాత్మ నిత్యము కావున శరీరసంబంధము లేక సృజింపబడదు. కావున చైతన్యకారణ మగునాత్మ నిత్యమగుటవలన జన్మాంతరమందు కర్మసంబంధము కలవాడని యొప్పుకొని అట్టియాత్మకు కర్మాయత్తమగు శరీరముతో సంబంధమును పరమాత్మ కల్గించుచున్నాడని యంగీకరింపవలెను. లోకమున ధర్మము చేసినవాడు ధనవంతుడును, పాపముచేసినవాడు దరిద్రుడును నగుట యనుభవసిద్ధము. అట్టిపరిస్థితికి ధర్మాధర్మములే కారణమని యొప్పుకొనక తీరదు. అట్టిధర్మాధర్మములతో నాత్మకు సంబంధము కలదు. అట్టిధర్మాధర్మమునకు కారణముగ జేసికొని చైతన్యరూపమైనయాత్మ జన్మాంతరమునకు సమవాయకారణ మగునని చెప్పుట సమంజసము; వేరొక యాత్మను కల్పించి అయ్యది కారణమని చెప్పుటచే నేమిప్రయోజనము? కావున జన్మాంతరమునకు అనేకజన్మములనుండి సంబంధపడియుండు ధర్మాధర్మములే కారణము. అట్టిధర్మాధర్మములను కారణముగ జేసికొని (నిమిత్తకారణముగజేసికొని) యాత్మకు శరీరాంతరసంబంధము తత్తత్కర్మానుగుణముగ కల్గును. కావున పరనిర్మాణవాదము సమంజసము కానేరదని భావము.

—— యదృచ్ఛావాదనిరాసము. ——

మూ. న పరీక్షా న పరీక్ష్యం న కర్తా కారణం న చ,
న వేదా న ర్షయస్సిద్ధాః కర్మ కర్మఫలం న చ. ౧౪
నాస్తికస్యాఽస్తి నైవాత్మా యదృచ్ఛోపహతాత్మనః,
పాతకేభ్యః పరం చైతత్ పాతకం నాస్తికగ్రహః. ౧౬

వ్యా. యాదృచ్ఛికముగ సర్వవస్తువులును అగుచున్నవను వ్యతిరేకజ్ఞానముచేత ప్రతిహతమైన యాత్మకలనాస్తికునకు పరీక్షాహేతువులైన ప్రమాణములు లేవు కావున పరీక్ష లేదు. పరీక్షకప్రమాణముల నంగీకరించకుండుటచేతనే పరీక్షింపదగినదియు లేదు. కర్తయు కారణంబును లేదు. మరియు సర్వసమ్మతమైన వేదంబులును, దేవతలును, ఋషులును, సిద్ధాదులును లేరు. కర్మయు కర్మఫలంబును లేదు. పుణ్యపాపరూపములగు కర్మలును వానిచే గల్గు ఫలంబును లేదు. అట్టికర్మఫలముల ననుభవించునాత్మయు లేదు. అట్టినాస్తికమతము నవలంబించుట బ్రహ్మహత్యాదిమహాపాతకములకన్న మహా పాతకము. (సర్వజనసమ్మతములగు వేదములను, దేవతలను, పుణ్యాపాపాదికర్మలను, దాన కల్గుఫలమును బొత్తుగ లేదని నమ్మిన నాస్తికులు తమ కిచ్చవచ్చినవిధముగ నెట్టిపాప కృత్యములనైన జేయ సిద్ధముగ నుందురు; కావున మహాపాతకములకన్నిటికిని మూల కారణమైనది నాస్తికమతమని భావము.)

(ఈయదృచ్ఛావాదులు ప్రత్యక్షానుమానాదిప్రమాణములను నమ్ముటలేదు. దానంజేసి ప్రమాణమునకు సంబంధించినప్రమేయాదులను అంగీకరింపక కృత్యాకృత్యము ములను సరకుసేయక యెట్టియకృత్యములనైన జేయుటకు వెనుదీయరు. అట్టియుచ్ఛృం ఖలప్రవృత్తులై ప్రమాణాతీతులగునాస్తికులబొల్లిమాట లేరికిని విశ్వసనీయములు కావు. కావున అట్టిమతము నవలంబించి నిరంకుశముగ ప్రవర్తించుటకన్న పాపము వేరొండు లేదు. కావున నాస్తికమతము సుతరాం నమ్మదగినది కాదని ఫలితార్థము.)

—— నాస్తికమతనిరసనపూర్వకకర్తవ్యము. ——

మూ. తస్మాన్మతిం విముచ్యైతామమార్గప్రసృతాం బుధః,
సతాం బుద్ధిప్రదీపేన పశ్యేత్సర్వం యథాతథమ్. ఇతి. ౧౭

వ్యా. పైజెప్పినకారణములచేత ధర్మాపేతమై యత్యంతదుష్టమార్గమున ప్రవేశించిననాస్తికబుద్ధిని బొత్తుగ మరలించి, సత్పురుషులయొక్క బుద్ధియనేప్రదీపముచేత (ప్రత్యక్షాదిప్రమాణములచేత) సకలమును గమనించి వాస్తివాస్తవ్యమును గమనించి నడచుకొనుట సమంజసము.

### సదసద్విభాగము, ప్రమాణచతుష్టయము.

మూ. ద్వివిధ మేవ ఖలు సర్వం సచ్చ అసచ్చ. తస్య చతుర్విధా పరీక్షా:—
ఆప్తోపదేశః, ప్రత్యక్షం, అనుమానం, యుక్తిశ్చ, ఇతి. ౧౮

వ్యా. ప్రమాణములకు విషయమైన సర్వమును 'సత్, అసత్' అని రెండువిధ ములు. (అందు విధివిషయమైన ప్రత్యక్షాదిప్రమాణగమ్యమై భావ (సత్తా) రూపమైనది 'సత్' నిషేధవిషయప్రమాణగమ్యమై యభావరూపమైనది 'అసత్.' అట్టిసదసద్రూప మైనసమస్తమునకు పరీక్ష (వస్తుస్వరూపమును నిర్ణయించుటకు సాధనమైన యుపా యము) నాల్గువిధములు. అయ్యవి—ఆప్తోపదేశము, ప్రత్యక్షము, అనుమానము, యుక్తియు నని నాల్గు (వీనిలక్షణములు క్రింద వివరింపబడును). "పరీక్ష్యతే (వ్యవస్థా ప్యతే) వస్తుస్వరూపం అనయేతి—పరీక్షా" అను వ్యుత్పత్తిచేత వస్తుస్వరూపమును నిర్ణ యించుటకు సాధనమైనది పరీక్ష యనబడును.

### ఆప్తలక్షణము.

మూ. ఆప్తాస్తావత్:—

రజస్తమోభ్యాం నిర్ముక్తాః తపోజ్ఞానబలేన యే,
యేషాం త్రికాలమమలం జ్ఞానమవ్యాహతం సదా. ౧౯
ఆప్తాశ్శిష్టా విబుద్ధాస్తే తేషాం వాక్యమసంశయమ్,
సత్యం వక్ష్యన్తి తే కస్మాదసత్యం నీరజస్తమాః. ౨౦
(కస్మాన్నీరజస్తమసో మృషా)

వ్యా. రజస్తమోగుణములను బొత్తుగ వదలి, తపోబలముచేతను జ్ఞానబలము చేతను నిరంకుశమై (అడ్డు లేక వ్యాపించు) నిర్మలమైనత్రికాల (భూత - భవిష్యత్ - వర్తమానకాల) జ్ఞానము ఎవ్వరికి కలదో, వారు ఆప్తులనియు, శిష్టులనియు, విబుద్ధులనియు జెప్పబడుదురు. (రజస్తమోరూపదోషముల విసర్జించినవారు ఆప్తులు; జగత్తునంతయు చేయదగినపనులయందు ప్రవర్తింపజేసి, అకృత్యములనుండి మరలించి శిక్షించువారు శిష్టులు; తెలిసికొనవలసిన యంశముల నన్నిటిని పూర్తిగ తెలిసికొనినవారు బుద్ధులు.)

అట్టి మహనీయులవాక్యము ఇంచుకేనియు సందియము లేక సత్యమైయుండు దును. రజోగుణమును బొత్తుగ మానియుండు అట్టిత్రికాలజ్ఞానవేత్తలు ఎందుకు అస త్యపుమాటల బల్కుదురు? (వారికి అసత్యము బల్కనవసరము లేదు కావున నొకప్పుడు వారు అబద్ధమాడరు. కావున వారివాక్యము నిస్సంశయముగ సత్యమనుట).

ఇచ్చట 'నీరజస్తమాః' అనుచోట నీరజశ్శబ్దమునకు తమప్ ప్రత్యయము వచ్చి రూపము. రజోగుణరహితులలో నుత్తములని యర్థము. 'నారజస్కం తమః' అను ప్రమాణముచేత రజోగుణము లేనప్పుడు తమోగుణంబును బొత్తుగ నుండదని భావము. లేక 'నీరజస్తమసో మృషా' అనుపాఠము చాల సుగమము. అసత్యము బల్కుటకు మిథ్యాజ్ఞానము, రాగము, ద్వేషము అని మూడుకారణములు. ఒకదానియొక్క సత్యమును జ్ఞానవైపరీత్యమునంజేసి వేరువిధముగ గ్రహించినప్పుడు అబద్ధమును బల్కును. మంచిజ్ఞానముచేత వస్తుతత్వము నెరింగియు రాగద్వేషములచే నసత్యమును బల్కును. రజస్తమోగుణముల బొత్తుగ వదలినవారికి రాగద్వేషములు కల్గవు. తపోబలంబును జ్ఞానబలంబును కల్గి త్రికాలజ్ఞానసంపన్నులైనవారికి అన్యథాజ్ఞానము (పొరబాటు) ఒకప్పుడు కల్గబోదు; కావున అట్టియాప్తులు ఒకప్పుడును అసత్యము బల్కరు. వారి మాటలు మిక్కిలి విశ్వసనీయములు అని భావము. పైజెప్పిన యాప్తులు చెప్పునట్టి వాక్యములు సత్యానపేతములును జ్ఞానవిజ్ఞానవిలసితంబులు నైయుండును కావున నయ్యవి ప్రమాణమని భావము. పైశ్లోకముచేత ఆప్తలక్షణంబును, వారివాక్యప్రమాణ లక్షణంబును చెప్పబడెను.

## ప్రత్యక్షప్రమాణలక్షణము.

మూ. ఆత్మేన్ద్రియమనోఽర్థానాం సన్నికర్షాత్ప్రవర్తతే,
వ్యక్తా తదాత్వే యా బుద్ధిః ప్రత్యక్షం సా నిరుచ్యతే. ౨౧

వ్యా. చేతనారూపమైన యాత్మ చక్షురాదీంద్రియము, మనస్సు వీనికి సంబంధించినవిషయములు వీనియొక్కసంబంధమువలన ఉత్తరక్షణముననే వ్యక్తమగు (వాస్తవమైన) ఏబుద్ధి కల్గునో అట్టిబుద్ధి ప్రత్యక్షమని చెప్పబడును. (లోకమున ఇది ఘటము అనుజ్ఞానము ప్రత్యక్షము. ఇచ్చట ఆత్మ మనస్సుతో కూడి ఆమనస్సు చక్షురాదీంద్రియముల ప్రేరణచేయును. ఆత్మ మనస్సులతో గూడిన యింద్రియములు తనకు విషయములగు ఘటాది పదార్థములతో చక్షుస్సంయోగాదిసంబంధము కల్గినప్పుడు ఇది ఘటము అను వస్తువిషయకవాస్తవబుద్ధి (జ్ఞానము) కల్గును. ఇదియే ప్రత్యక్షజ్ఞానమగును.)

ఇచ్చట 'వ్యక్తా' అనుటచేత వాస్తవ్యమై నిశ్చయాత్మకమైనజ్ఞానము ప్రత్యక్షమని యర్థము. ఇట్లు చెప్పుటచేత అయథార్థబుద్ధియు, సంశయబుద్ధియు ప్రత్యక్షము కాదని భావము. 'తదాత్వే' అనగా చక్షురాదిసంయోగక్షణముననే కల్గుజ్ఞానమని యర్థము. ఇట్లు చెప్పుటచేత ఆత్మేంద్రియార్థసంయోగముచే గల్గిన ప్రత్యక్షజ్ఞానానంతరము కల్గు అనుమానజ్ఞానంబును పూర్వానుభూతవిషయస్మరణజ్ఞానంబును ప్రత్యక్ష

జ్ఞానమున చేరదు. ఆత్మాదిసంబంధము కల్గినయుత్తరక్షణమున కల్గినజ్ఞానము అనుమానముగ మారును కావున ఆత్మాదిసంయోగక్షణముననే కల్గుయథార్థజ్ఞానమే ప్రత్యక్షమని చెప్పబడును.

అనుమానస్వరూపము.

మూ. ప్రత్యక్షపూర్వం త్రివిధం త్రికాలం చానుమీయతే,
వహ్నిర్నిగూఢో ధూమేన మైథునం గర్భదర్శనాత్. ౨౨
ఏవం వ్యవస్యన్త్యతీతం బీజాత్ఫలమనాగతమ్,
దృష్ట్వా బీజాత్ఫలం జాతం ఇహైవ సదృశం బుధాః. ౨౩

వ్యా. (అనుమానమనగ:—"అను (వ్యాప్తిగ్రహణానంతరం) మీయతే (సమ్యజ్నిశ్చీయతే) ఇతి అనుమానమ్" అనువ్యుత్పత్తిచేత వ్యాప్తిగ్రహణానంతరము వస్తునిశ్చయము చేయుటకు సాధనమైనది యనుమాన మనబడును.)

'పర్వతః వహ్నిమాన్, ధూమాత్.' అనునది అనుమానము. ఇచ్చట పర్వతమునందు వహ్నిమత్త్వము సాధ్యము (సాధింపదగినది). సాధనము ధూమము (కారణము). కొండనుండి వెడలుపొగను దూరమునందుండి చూచి, ప్రత్యక్షము కానియగ్ని పర్వతమున నున్నదని నిశ్చయించుట. ఇదియే అనుమానము. పొగనుబట్టి అగ్ని యున్నదని నిశ్చయించుటకు ధూమమున్నచోట అవశ్యము పొగ యుండితీరవలె ననుజ్ఞాన మున్నగాని అనుమానముచే నిశ్చయించుటకు వలనుపడదు. ధూమమున్నచోట నవశ్యము అగ్ని యుండును అనుజ్ఞానము వంటయింటియందు అనుభవసిద్ధము. ఎట్లులన:—వంట యింటిలో ప్రొయి మండునపుడు పొగనుకూడ చూచి తనయనుభవమున ధూమమున్నచోట నిప్పు అవశ్య ముండితీరును. నిప్పులేనిచోట పొగ కల్గదు. అనుజ్ఞానము అనుభవసిద్ధము. ఇదియే "యత్ర ధూమః తత్రాగ్నిః" అనుజ్ఞానము. ఈజ్ఞానమునకే వ్యాప్తి జ్ఞానమనియుం పేరు. ఈవ్యాప్తిజ్ఞానము తాను వంటయింటిలో నిప్పును పొగను కలసంబంధమును అనుభవసిద్ధముగ చూచి గ్రహింపబడినది కావున ప్రత్యక్షసిద్ధము. ఇట్టి యనుభవసిద్ధమైన (ప్రత్యక్షసిద్ధమైన) పొగయుండుస్థలమున నవశ్యము అగ్నియుండును అను వ్యాప్తి జ్ఞానముచేత కాలాంతరమున పర్వతమునుండి వెడలుపొగను చూచి, "ఈపర్వతమున పొగ వెడలుటంజేసి అగ్నియున్నది, అగ్నిలేనిచో పొగయుండదు. బావిలో అగ్నిలేదు కావున పొగయు లేదు. ఇచ్చట పొగయున్నది కావున అగ్నియుం సిద్ధముగ నుండితీరవలెను. వంటయింటిలో నగ్ని యుండుటంజేసి పొగ వెడలెను. కావున పర్వతమున అగ్ని యున్నది." అను నిశ్చయజ్ఞానము కల్గును. ఇచ్చట పర్వతమునందు ధూమమును చూచి

అగ్ని యున్నదని నిశ్చయింపబడును. ఈవిషయమున వంటయింటిలో నిప్పునకును పొగ కును ఉండు సాహచర్యమును గమనించియుండెను. ఇదియే వ్యాప్తిజ్ఞానము. కాలాంతర మున పర్వతమున పొగను చూచినప్పుడు, తాను మున్ను గ్రహించిన వ్యాప్తిజ్ఞానము జ్ఞప్తికి వచ్చును. పిమ్మట 'పర్వతో వహ్నిమాన్ ధూమాత్' అనుమానముచే సాధింప దగినది అగ్ని కావున నయ్యది సాధ్యమనబడును. ధూమాత్ అనునది కారణము కావున నయ్యది సాధనము. ధూమమును సాధనముగ (కారణముగ) జేసి పర్వతమున వహ్ని సాధింపబడును. ఇచ్చట సాధనమైనపొగ, సాధ్యమైన వహ్ని, ఈరెంటికినిగల సాహ చర్యము వ్యాప్తి, ఈమూడిటి జ్ఞానము ప్రత్యక్షసిద్ధముగ నుండినగాని అనుమానింప వీలుపడదు. క్రిందిశ్లోకమున 'ప్రత్యక్షపూర్వం' అనుచోట వ్యాప్తి జ్ఞానపూర్వము అని యర్థము. పైజెప్పిన యనుమానమునే నైయాయికు లిట్లు చెప్పెదరు.—"పర్వతో వహ్నిమాన్ ధూమాత్, యోయో ధూమవాన్, సస అగ్నిమాన్, యథామహానసః, తథా చాయం, తస్మాత్తథా" దీనివివరమే పైని కనబరచబడినది. ఈవివరణము పైశ్లోక విషయమున కనుబంధముకావున ముందుగ సుబోధమునకై తెలుపబడియె.)

ప్రకృతశ్లోకార్థము:—సాధనములగు ధూమాదులయొక్కయు, సాధ్యములగు అగ్నిమున్నగువానియొక్కయు ప్రత్యక్షజ్ఞానము (వ్యాప్తిజ్ఞానము) చేత భూతము (జరిగినది), భవిష్యత్తు (జరగబోవునది), వర్తమానము (జరుగుచున్నది) నైనవిషయము నూహించి నిర్ణయింపబడును. ఇదియే అనుమానము. ఇయ్యది కార్యలింగానుమానము (కార్యముచే కారణము ననుమానించుట) కారణలింగానుమానము (కారణముచే కార్య ము ననుమానించుట), కార్యకారణలింగానుమానమునని మూడువిధములు. (ఈమూడు విధములైన యనుమానములకును వ్యాప్తిజ్ఞానము ముందుండవలెను.)

పర్వతమున ప్రత్యక్షముగాక నిగూఢముగ (మరగి) ఉండు అగ్ని ధూమము (పొగ)చే ననుమానించి సాధింపబడును. (ఇయ్యది తత్కాలమున గనబడుచుండు అగ్నిని అనుమానముచే సాధింపబడుటంజేసి వర్తమానవిషయానుమానము. ఇది అ కార్యకారణ రూపమైన సామాన్యానుమానము.)

గర్భమును జూచి ముందుజరిగిన దంపతుల మిథునకృత్యము అనుమానింపబడును. భూతకాల విషయానుమానము (గర్భమును జూచి సంభోగము జరగనినాడు గర్భో త్పత్తి కల్గనేరదు కావున, కార్యరూపమైన గర్భమును చూచుటచే గర్భోత్పత్తికి కారణ మైన దంపతులమైథునము అనుమానింపబడినది. కావున కార్యముచే కారణానుమానము. అట్టి సాధ్యకారణము భూతకాలవిషయము కావున భూతకాలానుమాన మగును.

ఇచ్చట సాధ్యము మైథునము, సాధనము గర్భము, (హేతువు), ఈరెంటికినింగల కార్య కారణసంబంధము వ్యాప్తి.)

ఒకవిత్తనమువలన పండు పండుటను తాను ప్రత్యక్షముగ జూచి ఆప్తివ్యాప్తి జ్ఞానముచేత విత్తనమును చూచినపుడు 'ఈవిత్తనమువలన (ఇందుకు సహకారులైన కర్షకుడు జలము మృత్తు అనుకారణములుకూడ సంభవించిననాడు పండు పండును' అనునట్టి యనుమానముచే కాలాంతరమునగల్గ నున్నఫలము నిశ్చయింపబడును. కావున నిది భవిష్యత్కాలవిషయానుమానము. కారణముచే కార్యానుమానము నగును. ఇదియే కారణలింగానుమానము.) ఇచ్చట బీజమున్నంతమాత్రమున ఫలము కల్గ బోదు కావున ఫలమునకు బీజమెట్లు కారణమగునన్నచో జలము కర్షకుడు మున్నగు సహకారికారణములతో గూడిన విత్తనముచే నవశ్యము ఫలము కల్గును కావున స్వరూపా సిద్ధిదోషము లేదని యెరుంగునది. 'సహకారికారణవిశిష్టబీజాత్ ఫలం ఉత్పత్స్యతే' అని అనుమానశరీరము. ఇచ్చట బీజఫలములకుంగల కార్యకారణభావము వ్యాప్తి.

## యుక్తి కుదాహరణములు.

మూ. జలకర్షణబీజర్తుసంయోగాత్సస్యసంభవః,
యుక్తిః, షడ్ధాతుసంయోగాత్ గర్భాణాం సంభవస్తథా. ౨౮
మథ్యమన్థనమన్థానసంయోగాదగ్నిసంభవః,
యుక్తియుక్తా చతుష్పాదసంపద్వ్యాధినిబర్హణీ. ౨౯

వ్యా. ఉదకము, దున్నబడినభూమి, విత్తనములు, అంకురోత్పత్తి, యోగ్యమైన ఋతుకాలము అనునివి యన్నియు సమయోచితముగ నొకటిగ జేరినచో పైరు మొల చును. (ఇందొకటియైన లోపించినచో మొలవదు. వృద్ధి కానోపదు). పైజెప్పినరీతిగ జలాదిసంయోగముచే పైరు వృద్ధినొందును అనునట్టిజ్ఞానము యుక్తి యనబడును. (ఇది యనుభవసిద్ధము). పృథివ్యాది పంచమహాభూతములు, చైతన్యరూపమైన యాత్మ అను నీయారుధాతువుల సమ్యగ్యోగము (నిర్దుష్టమైన కూటమి) చేత గర్భములు సంభ వించుననుజ్ఞానము యుక్తి యగును. మంథనకాష్ఠమైన యరణి, మథించుటకు సాధన మైన మంథిప్రమంథులు, మథించుటకు సాధనమైనదారము. అనునీసాధనముల సంయో గముచే మథించినచో నగ్ని తప్పక పుట్టును. వైద్యుడు, ఔషధములు, పరిచారకుడు, రోగియను చికిత్సకు సంబంధించిన నాల్గుపాదములు, వానివానికి నియమింపబడిన లక్ష ణములతోగూడి యుక్తియుక్తముగ సంభవించినచో నయ్యాది సాధ్యస్థితి నుండువ్యాధు లను పోగొట్ట సమర్థములగును.

"యుజ్యతే (సంబధ్యతే) అనయేతి యుక్తిః" అను వ్యుత్పత్తిచేత జేర్పబడుటకు సాధనమైనది యుక్తి యని భావము. చికిత్సకు సంబంధించిన ఔషధయోజనారూపమైనది యుక్తి. అట్టి యుక్తియుక్తమైన చతుష్పాదసంపత్తి వ్యాధిహారమగునని భావము. చతుష్పాదమని చెప్పక చతుష్పాదసంపత్తని చెప్పుటచేత వైద్యాదిపాదచతుష్టయంబును వానివానికి నియమింపబడిన గుణసంపత్తితో గూడి యుండవలెనని యర్థము.

## యుక్తిలక్షణము.

మూ. బుద్ధిః పశ్యతి యా భావాన్ బహుకారణయోగజాన్,
యుక్తిస్త్రికాలా సా జ్ఞేయా త్రివర్గస్సాధ్యతే యయా. ౨౫

వ్యా. ఏబుద్ధి అనేకకారణముల సంబంధముచేత (అనేకోపపత్తులచేత) దెలియబడుచున్న జ్ఞానవిషయములైన అనేకభావములను గమనించునో అట్టిబుద్ధియే యుక్తి యనబడును. (అనేకవిషయముల నుద్దేశించి పలుదెరంగులైన యుపపత్తులను గమనించు ఊహయను బుద్ధివిశేషము (బుద్ధివ్యాపారరూపమైన యూహ) యుక్తి యనబడును. అయ్యది అతీత-అనాగత-వర్తమానకాలముల మూటికి సంబంధించి, ధర్మము, అర్థము, కామము నను త్రివర్గములకును సాధనోపాయమై యుండును.

అనేకములగు నుపపత్తులచే గల్గిన జ్ఞానమునకు గోచరములైన భావములను ఇది యట్లుండును. ఇది యట్లుండదు. అని యోజించుబుద్ధివ్యాపారరూపమైన యూహ యుక్తియనియు, అయ్యది భూతభవిష్యద్వర్తమానవిషయములయందు వ్యాపించుటంజేసి త్రికాలవిషయమనియు, ధర్మార్థకామములమూటికి సాధనమైనదనియు నిష్కృష్టార్థము. అట్టియూహారూపమైనయుక్తి స్వతంత్రముగ ప్రమాణము కాకున్నను అనుమానాదిప్రమాణములకు సహకారి యగుటంజేసి ప్రమాణమని యౌపచారికముగ జెప్పబడెను. మరియు త్రికాలవిషయకమై మూడువిధములైన యనుమానమునకు సహకారి యగుటంజేసియే యిదియును త్రికాలవిషయమని చెప్పబడెను. మరియు నీతంత్రకారుడు స్థలాంతరమున యుక్తి యను ప్రమాణమును వదలి 'త్రివిధా పరీక్షా సహోపదేశేన' అని శబ్ద అనుమాన ప్రత్యక్షములమూటినే చెప్పియున్నాడు. రోగభిషగ్జితీయాధ్యాయమున ఉపమానమును జేర్చుకొని శబ్దాదిప్రమాణములమూటితో నాల్గుప్రమాణములని చెప్పబడినది. ధర్మార్థకామములను త్రివర్గములయనుష్ఠానము ప్రాయికముగ నూహామాత్రముచేతనే సాధించుటయందు ప్రవృత్తి కల్గును కావున త్రివర్గసాధనమని చెప్పబడెను. పైజెప్పినరీతిగ ప్రమాణములకు సహకారియైనయూహ యుక్తి. ప్రమాణముగ గణనము జేయబడ

లేదు. (ఈవిషయమున మతాంతరముల పూర్వపక్షము లనేకముగనున్నను విస్తరభీతిచేతను, అప్రస్తుతమగుటచేతను వానిని వదలి సారభూతములగు ముఖ్యాంశములమాత్ర ముదహరించి సిద్ధాంతసారము మాత్రము చెప్పబడినది. విస్తరమును విజ్ఞులు గమనించెదరుగాక!)

## పునర్భవాస్తిత్వనిరూపణము.

మూ. ఏషా పరీక్షా నాస్త్యన్యా యథా సర్వం పరీక్ష్యతే,
పరీక్ష్యం సదసచ్చైవం తథా చాస్తి పునర్భవః. ౨౭

వ్యా. ఈశాస్త్రమునందు పైప్రకరణమున వివరింపబడిన ఆగమము (ఆప్తోపదేశము, శాబ్దము), ప్రత్యక్షము, అనుమానము, యుక్తి అను నాల్గుప్రమాణములే గ్రహింపబడును గాని యితరతంత్రములలో ప్రసిద్ధములగు అర్థాపత్తి, అనుపలబ్ధి మున్నగు ప్రమాణాంతరములు గ్రహింపబడవు. ఈనాల్గుప్రమాణములచేతనే సకలంబును పరీక్షింపబడును. పరీక్ష్యము (పరీక్షింపదగినది), సత్తు, అసత్తు అనునవి. ఆట్టిప్రమాణములచేత పరీక్షించినచో పునర్భవము అవశ్యము కలదు. (కావున పైనిరూపింపబడిన నాస్తికమతానుసారముగ ప్రత్యక్షగోచరము కాకుండుటచే పునర్భవము లేదనువాదము దూరముగ నిరసింపదగినదని యర్థము.)

## ఆప్తాగమము, పునర్భవాస్తిత్వసిద్ధాంతము.

మూ. తత్రాప్తాగమస్తావద్వేదః, యశ్చాన్యోఽపి కశ్చిత్ వేదార్థాదవిపరీతః పరీక్షకైః ప్రణీతః శిష్టానుమతో లోకానుగ్రహప్రవృత్తః శాస్త్రవాదః స చాప్తాగమః, ఆప్తాగమాదుపలభ్యతే దానతపోయజ్ఞసత్యాఽహింసాబ్రహ్మచర్యాణి అభ్యుదయనిశ్శ్రేయసకరాణీతి. ౨౮

వ్యా. పై జెప్పబడిన నాల్గువిధములైన ప్రమాణములలో నాప్తాగమ మనునది వేదములు. వేదార్థమునకు విరుద్ధముగాక, విధినియమములజేయ సమర్థులగు శిష్టులకు సమ్మతముగ త్రికాలజ్ఞానసంపన్నులగు ప్రామాణికులైన ఋష్యాదులచే లోకానుగ్రహము నకై విరచితము లగుస్మృతులు ధర్మప్రతిపాదకశాస్త్రములు, ఇతిహాసములు, పురాణములు మున్నగు శాస్త్రరూపమైనవి యన్నియును ఆప్తాగమమనియే చెప్పబడును. అట్టి యాప్తాగమమైన వేదమువలన దానము, మనోనియమనరూపమైన తపస్సు, అగ్నిష్టోమాది యజ్ఞములు, సత్యము, అహింస, బ్రహ్మచర్యము, (స్త్రీసంభోగనివృత్తిరూపమైన నియమము.) ఇవి స్వర్గాదిసుఖమునకును, బ్రహ్మసాక్షాత్కారరూపమైన మోక్షమునకును కార

ణములని తెలియుచున్నది. 'జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత' అను ప్రమాణవచనములచే స్వర్గాదిపరలోకసాధనము యజ్ఞాదులనియు, తపస్సు మున్నగునవి మోక్షసాధనములనియు ప్రమాణవాక్యములచే దెలియుచున్నది.)

ఈప్రమాణముచేత జన్మాంతరభోగ్యమైన స్వర్గంబును, అనేకజన్మసంచితపుణ్యాతిరేకమున పొందగలమోక్షంబును ఉపదేశింపబడినది. దీనిచేత ఆత్మకు పరలోకసంబంధము కలదని యేర్పడును.

### పునర్భవమునకు ఆగమాంతరప్రమాణము.

మూ. న చానతివృత్తసత్వదోషాణాం అదోషైరపునర్భవో ధర్మద్వారేషూపదిశ్యతే. ౨౯

వ్యా. మానసదోషములైన రజస్తమోగుణములు రెండును శాంతినొందకయుండువారలకు జన్మరాహిత్యరూపమైన మోక్షము మహాత్ములచే ధర్మశాస్త్రములయం దుపదేశింపబడలేదు. (మానసదోషములైన రజోగుణమును, తమోగుణమును వదలకయుండువారలకు మోక్షము కల్గునని యుపదేశించియుండలేదు. రజస్తమోగుణములను వదలి శ్రవణమనననిదిధ్యాసనములచే మనస్సు పరిపక్వమై తపోవిశేషముచే నాత్మానుసంధానము చేయువారికే మోక్షము విధింపబడినది. ప్రవృత్తికర్మయోగము నవలంబించినవారు ఆయాకర్మానుగుణముగ స్వర్గాదిభోగముల ననుభవించి మరల జన్మము నెత్తెదరని ప్రమాణవచనములచే ఋషులు బోధించిరని భావము.) ఈవిషయమును ''తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి''-''తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే''-''అథవా యోగినా మేవ కులే భవతి ధీమతామ్'' ఇని మున్నగుప్రమాణవచనములు స్వర్గాదిపరలోకము కలదని, ప్రవృత్తికర్మయోగాదుల నవలంబించినవారికిని, యోగభ్రష్టులు మున్నగువారికిని కర్మానుగుణముగ పునర్భవము కలదనియు నిరూపించుచున్నవి. కావున పునర్భవము కలదనుటయును, స్వర్గము కలదనుటయును ఆగమప్రమాణసిద్ధమని భావము.

### ఋషివచనరూపమైన యాగమప్రమాణముచే పునర్భవనిర్ణయము.

మూ. ధర్మద్వారాపహితైశ్చ వ్యపగతభయరాగద్వేషలోభమోహమానైః బ్రహ్మపరైరాప్తైః కర్మవిద్భిః అనుపహతసత్వబుద్ధిప్రచారైః పూర్వైః పూర్వతరైః మహర్షిభిః దివ్యచక్షుర్భిః దృష్టోపదిష్టః పునర్భవ ఇతి వ్యవస్యేదేవమ్. ౩౦

వ్యా. ధర్మశాస్త్రములచే బోధింపబడినవిషయముల జక్కఁగ ననుష్ఠించువారును, భయము, రాగము, ద్వేషము, లోభము, మోహము, అభిమానము అనువానిని బొత్తుగ మానినవారును, ఆత్మజ్ఞాననిష్ఠులును, ఆప్తులును, కర్మకోవిదులును, రజస్తమోగుణములచేత తిరస్కరింపబడని సత్వగుణముకల బుద్ధియొక్కప్రచారము (బోధము) కలవారును, ఇంద్రియగోచరముకాని విషయములను గమనించు జ్ఞానగరిమకలవారును, ప్రాచీనులును, అంతకన్న ప్రాచీనులు నగు మహర్షులు తమ మనశ్శక్తిచే గమనించి స్వయముగ ననుభవించి యుపదేశించినది పునర్భవము కావున పై జెప్పినరీతిగ నాగమప్రమాణసిద్ధము పునర్భవమని నిశ్చయింపబడును. (కావున పునర్భవము ఆగమప్రమాణసిద్ధమని భావము.)

పునర్భవవిషయమై ప్రత్యక్షముచే లింగ(వ్యాప్తి)గ్రహణము.

మూ. ప్రత్యక్షమపి చోపలభ్యతే:—

మాతాపిత్రోర్విసదృశాని అపత్యాని, తుల్యసంభవానాం వర్ణస్వరాకృతిసత్వబుద్ధిభాగ్యవిశేషాః, ప్రవరావరకులజన్మ, దాస్యైశ్వర్యం, సుఖాసుఖమాయుః, ఆయుషో వైషమ్యమ్, ఇహాకృతస్యావాప్తిః, అశిక్షితానాం చ రుదితస్తనపానహాసత్రాసాదీనాం చ ప్రవృత్తిః, లక్షణోత్పత్తిః, కర్మసాదృశ్యే ఫలవిశేషః, మేధా క్వచిత్ క్వచిత్కర్మణ్యా, మేధాజాతిస్మరణమ్, ఇహాగమనమితశ్చ్యుతానాం చ భూతానాం, సమదర్శనే ప్రియాప్రియత్వం.

వ్యా. (ప్రత్యక్షప్రమాణము పునర్జన్మమును గ్రహింపనేరదు. (ప్రత్యక్షప్రమాణముచేత ఘటపటాదిపదార్థనిశ్చయజ్ఞానము కల్గునట్లు పునర్జన్మముయొక్క నిశ్చయజ్ఞానము కల్గదు.) అయినను అట్టిపునర్భవమునకు గ్రాహకమైన యనుమానమునకు సాధనమైన లింగగ్రహణమున వ్యాప్తిరూపమును ఈక్రింద నిరూపించుచున్నాడు.)

పునర్జన్మము కలదని చెప్పుట వాస్తవ్యమని కొన్నినిదర్శనములచే దెలియుచున్నది:—తల్లిదండ్రులకు విసదృశముగ కొందరు కురూపులుగను, కొందరు సురూపులుగను బిడ్డలు కల్గుచున్నారు. ఒకవేళ సమానముగ పుత్రులుకల్గినను దేహకాంతియందును, కంఠస్వరమునందును, రూపమునందును, మనస్సునందును, బుద్ధియందును, భాగ్యమునందును భేదముకలవారుగ నగుపడుచున్నారు. కొందరు శ్రేష్ఠమైనకులమునందును, మరికొందరు నీచకులమునందును పుట్టియున్నారు. కొందరు దరిద్రులై సేవకవృత్తి జేసెదరు. మరి కొందరు సంపన్నులైయున్నారు. కొందరు జీవితాంతము సుఖముగ నున్నారు. మరి

కొందరు జీవితాంతమువరకును కష్టములనే యనుభవించుచున్నారు. కొందరు ఆయుఃపరిమితిలో వైపరీత్యముగ కొందరు చిరాయుంవు కల్గియు, కొందరు అల్పాయువులుగను కన్పట్టెదరు. కొందరు ఎంతప్రయత్నముచేసినను కార్యము సమకూరకయున్నారు. కొందరకు ప్రయత్నములేకయే కార్యము కొనసాగుచున్నది. బిడ్డలకు అతిబాల్యముననే నవ్వుట, ఏడ్చుట, చనుబాలుద్రాగుట, భయపడుట మున్నగునవి ఇతరులు నేర్పకున్నను తనంతటనే అలవడుచున్నది. కొందరు సాముద్రికలక్షణములతో గూడి పుట్టెదరు. కొందరు ఒకరితో సమానముగ కృషిసల్పినను వారికన్న నధికముగనైనను, తక్కువగనైనను ఫలము నొందుచున్నారు. కొందరికి చిత్రలేఖనాదివ్యాపారములయందు మేధాశక్తికల్గి శస్త్రశిక్షణాదికృత్యములయందు మేధాశక్తి ప్రసరించుటలేదు. ఈలోకమునందుండి మరణము నొంది మరల నీలోకమున పుట్టెనని మునుజన్మమును స్మరించుజ్ఞానము కొందరికి కలదు. సమానముగ ప్రీతిపాత్రులై యుండతగినపుత్రాదులలో కొందరియందు ప్రీతియు, కొందరియందు ద్వేషంబును కల్గుచున్నది. (పై గనబరచిన భేదమునుబట్టి జన్మాంతరకృత కర్మము ఇట్టిభేదము కల్గుటకు కారణమని యూహించి యనుమానముచే పునర్భవము సాధింపదగియున్నదని భావము.)

ఇచ్చట చనుబాలుద్రాగు లేతకూనలకు నవ్వు, ఏడ్పు, భయము మున్నగు మనోవికారములు కల్గుట ప్రత్యక్షము. ఈకార్యములు సుఖదుఃఖవికృతదర్శనాదికారణములు లేకయే కల్గనేరవు. అట్టి పసిబాలురకు ఈకారణములు తటస్థింపవు. తటస్థపడినను జ్ఞానము లేదుకదా? కావున అట్టి హాస్యాదికార్యములచేత పూర్వజన్మమునకు సంబంధించిన కారణస్మరణము అనుమానముచే నూహింపదగియున్నది. కావున ఇట్టి కారణములచే పూర్వజన్మంబును, అట్టి జన్మమునజేసిన కర్మ విశేషంబులును, దాన సంభవించు (పైవివరింపబడిన) రూపభేదాదులును అనుమానముచే సాధింపదగియున్నవి. అట్టి యనుమానము ప్రత్యక్షముగనుండు కార్యమునుబట్టి కారణములను ఊహించి చెప్పదగినది. పైజెప్పినవానితో నవాంతరానుమానముల విస్తరభీతిచే నిట నిరూపించుటలేదు. ప్రాజ్ఞులు కల్పించెదరుగాత!

## అనుమానప్రమాణముచే పునర్జన్మమును సాధించువిధము.

మూ. అత ఏవానుమీయతే—యత్ - స్వకృతమపరిహార్యమవినాశిపౌర్వదేహికం దైవసంజ్ఞకమానుబన్ధికం కర్మ, తస్యైతత్ఫలమ్. ఇతశ్చాన్యద్భవిష్యతీతి. ఫలాద్బీజమనుమీయతే, ఫలం చ బీజాత్.

వ్యా. పై గనబరచిన విసదృశాపత్యాది ప్రత్యక్షసాధనముచేత పరోక్షమైన పూర్వజన్మకృతకర్మ అనుమానముచే సాధింపబడును. ఎట్లనగా:—తనచేత పుణ్యాపాపముల

వలన సంపాదింపబడినదియు, ఎట్టికార్యముచేనైన తప్పించుకొన సాధ్యము కానిదియు నాశములేనిదియు (అనుభవింపక తీరనిదియు) పూర్వజన్మమునకు సంబంధించినదియు, అనేకజన్మములనుండి పరంపరగ ననుసరించియుండునదియు నైన ప్రారబ్ధరూపమైన కర్మ యేది కలదో, ఆకర్మయొక్క ఫలము విసదృశకురూపాదిజన్మము కల్గుట. ఇట్టికర్మ చేత నింకొకవిధమైన ఫలము రానున్నది అని. విత్తునుబట్టి ఫలమును, ఫలమునుబట్టి విత్తును అనుమానించువిధముగ ననుమానించి పునర్జన్మము సాధింపబడును.

ఇచ్చట నీవిధముగ ననుమానశరీరము నెరుంగునది:—లోకమున నొకడు మామిడి విత్తనమును నాటి చెట్టుచేసి అది పండినపిదప దానిపండును ప్రత్యక్షముగ జూచును. పిమ్మట మామిడివిత్తనమున మామిడిపండు కల్గునను వ్యాప్తిజ్ఞానముచేత ఇంకొకకాలమున తాను మామిడిపండును చూచినప్పుడు తాను అనుభవసిద్ధముగ గమనించిన వ్యాప్తిజ్ఞానమును స్మరించి ఈమామిడిపండు దీని సజాతీయమైన విత్తనమువలన కల్గినది. విత్తనము లేనిచో నిది కల్గదు. అని మామిడిపండుకు కారణమైన బీజము అనుమానముచే నిశ్చయింపబడును. అత్తెరంగుననే పైజెప్పిన కార్యరూపమైన విసదృశ అపత్యజన్మాదుల ప్రత్యక్షముగ జూచినప్పుడు ఇట్టిజన్మము కల్గుటకు జన్మాంతరకృతమై యనుభవింపక దీరని కర్మ యొకటి యుండి తీరవలెను. లేనిచో నిట్టిజన్మము కల్గబోదు. అని అనుమానించి కర్మఫలమైన జన్మముచేత అప్రత్యక్షమైన జన్మాంతరకృత కర్మరూపమైన హేతువు అనుమానముచే సాధింపబడును. ఇత్తెరంగుననే (మామిడివిత్తనముజూచి మామిడి పండును అనుమానించి నిశ్చయించినట్లు) ఈజన్మమున జేయబడు సుకృత దుష్కృత రూపకర్మనుబట్టి పైజన్మమున కల్గబోవు సుఖదుఃఖాదులు అనుమానముచే నిశ్చయింపబడును. ఇట్టి యనుమానముచేత పునర్జన్మము అవశ్యము కలదని నిశ్చయింపబడును.

### యుక్తిప్రమాణముచే పునర్భవనిశ్చయము.

మూ. యుక్తిశ్చైషా:—షడ్ధాతుసముదాయాద్గర్భజన్మ, కర్తృకరణసంప్రయోగాత్క్రియాయాః; కృతస్య కర్మణః ఫలం నాకృతస్య నాఙ్కురోత్పత్తిరబీజాత్, కర్మసదృశం ఫలం, నాన్యస్మాద్బీజాదన్యస్యోత్పత్తిరితి యుక్తిః. 33

వ్యా. పరలోకము కలదని నిశ్చయించుటకు దగినయుక్తి క్రింద జెప్పబడును:— పృథివ్యాది పంచభూతములును చేతనాత్మకమైన యాత్మయును కలసిన యారుధాతువులు లోకమున నొకక్రియ కలుగవలెనన్న అందుకు ప్రధానమైన కర్తయును ముఖ్యము

లగు నుపకరణములును చేరిన కాని కార్యము కానేరదు. (ఘటరూపకార్యము కావలె నన్న కర్తయైన కుమ్మరియు దండచక్రాదిసాధనంబులున్నగాని ఘటమేర్పడదు.) కావున పైజెప్పిన యూరుధాతువుల సముదాయముచేత గర్భగోళమున శిశుజన్మము కలుగును. ఏదైన నొకవిధమైన కర్మను చేసినదానంజేసి ఫలము కల్గును. పనిచేయకయున్నపుడు ఫలము కల్గనేరదు. బీజము (విత్తనము) లేక మొలక కల్గనేరదు. (కారణము లేక కార్యము కల్గదనుట). కర్మానుగుణముగ ఫలము కల్గును. ఒకవిత్తనమువలన వేరొకజాతి మొలక మొలవదు. వరిధాన్యము చల్లిన వరిమొలకలే మొలచును కాని యవల మొలకలు ఎట్లు మొలచును? కావున అన్యజాతి విత్తనముచేత వేరొకజాతి మొలక మొలవదు. ఇట్టి యనేకకారణముల నుత్ప్రేక్షించునట్టి యూహ యుక్తి యనబడును.

ఇచ్చట 'షద్ధాతుసముదాయాత్' "కర్తృకరణసంప్రయోగాత్" అనుటవలన కర్తయు కరణములునుండి వాని సంబంధమున క్రియ కల్గినగాని కార్యము పుట్టదు. అత్తెరంగున సాధనములైన పంచభూతములును కర్తయైన యాత్మయు కల్గినప్పుడు క్రియ యేర్పడును. దానివలన గర్భోత్పత్తిరూపమైన కార్యము సంభవించును అని యర్థమగును. ఇటు చెప్పుటచేత చేతనాత్మకమైన యాత్మ సంబంధము లేక చేతనావంతమైన గర్భోత్పత్తి కల్గదని భావము.

ఇచ్చట నీసముదాయార్థము నిట్లెరుంగునది:—అనేకకారణముల నుత్ప్రేక్షించుటచే కల్గినజ్ఞానమునకు గోచరములగు విషయముల నుద్దేశించిన బుద్ధివ్యాపారరూపమైన యూహయె యుక్తియనియు, నయ్యది వస్తునిర్ణయప్రమాణమునకు సాధనంబనియు యుక్తిలక్షణము చెప్పబడినది. అట్టి యుక్తిచేత కర్మయు, పరలోకంబును, పునర్జన్మంబును కలదని నిశ్చయింపబడును. ఎట్టులన:—లోకమున కొందరు ఐశ్వర్యసంపన్నులుగను, కొందరు దరిద్రులుగను, కొందరు రూపవంతులుగను, కొందరు కురూపులుగను పైజెప్పినరీతిగ ననేకవిధముల పరస్పర విలక్షణముగ గన్పట్టుచున్నది. ఇట్లుండుటకు కారణ మేమని విమర్శించినచో నిందుకు బలవత్తరమైన కారణ మేదైన యుండి తీరవలెను. ఇందుకు బీజఫలదృష్టాంతముచేత పూర్వజన్మకృతకర్మ కారణమనియు, అట్టిజన్మమున రూపాదివైలక్షణ్యము కల్గుటకు సుకృత దుష్కృత భేదముచే తత్తదనుగుణముగ భేదము కల్గుననియు 'కర్మసదృశం ఫలం' ఇత్యాదిదృష్టాంతములచేతను ఊహించి, జన్మమునకు అనేక జన్మకృత కర్మ కారణముగ నొకటి యున్నదనియు, అందువలన పరలోకమున్నదనియు మరల జన్మముకూడ నున్నదనియు ఊహాపోహారూపమైన బుద్ధివ్యాపారముచే గూడ నిశ్చయింపబడును. (ఈయుక్తివిషయమై యనేకములగు విమర్శనీయాంశములు కలవు. విస్తరభీతిచే నిట నిరూపింపబడవయ్యె.)

### పరలోకైషణము, ధర్మసాధనములు.

మూ. ఏవం ప్రమాణైశ్చతుర్భిరుపదిష్టే పునర్భవే ధర్మద్వారేష్వవధీయేత; తద్యథా:—గురుశుశ్రూషాయాం అధ్యయనే వ్రతచర్యాయాందారక్రియాయాం అపత్యోత్పాదనే భృత్యభరణే అతిథిపూజాయాం దానేనాభిధ్యాయాం తపస్యనసూయాయాం దేహవాఙ్మానసే కర్మణ్యక్లిష్టే దేహేన్ద్రియమనోబుద్ధ్యాత్మపరీక్షాయాం మనస్సమాధావితి; యాని చాన్యాన్యప్యేవంవిధాని కర్మాణి సతామవిగర్హితాని స్వర్గ్యాణి వృత్తిపుష్టికరాణి విద్యాత్తాన్యారభేత కర్తుమ్; తథా కుర్వన్నిహ చైవ యశో లభతే, ప్రేత్య చ స్వర్గమితి తృతీయా పరలోకైషణా వ్యాఖ్యాతా భవతి. 3౮

వ్యా. పై జెప్పిన గ్రంథముచేత ఆప్తోపదేశము, ప్రత్యక్షము, అనుమానము, యుక్తి అనునాల్గుప్రమాణములచేత పరలోకంబును, పునర్జన్మంబును కలదని నిశ్చయింపబడినది. అట్టినిశ్చయజ్ఞానము కుదిరినపిదప ధర్మసాధనము లగుమార్గములయందు తన బుద్ధిని వినియోగింపవలెను. అది యెట్లులన:—

గురుశుశ్రూష, వేదాధ్యయనము, శాస్త్రవిహితమైనవ్రతముల నాచరించుట, బ్రహ్మచర్యవ్రతమును పూర్తిచేసినపిదప వివాహమును చేసికొనుట, అగ్నిసాక్షికముగ వివాహముచేసికొనిన ధర్మపత్నియందు పుత్రోత్పత్తిజేయుట, తనపరివారములో జేరిన భృత్యులను కాపాడుట, అతిథుల పూజించుట, తనశక్తికి వంచనలేక దానముచేయుట, పరద్రవ్యము నాశించకుండుట, తపస్సుచేయుట, అసూయ (సోకోర్వమి) లేకుండుట, శాస్త్రసమ్మతములైన కాయిక - వాచిక - మానసికకర్మలయందు విసుకుజెందక ప్రీతికల్గియుండుట దేహము, ఇంద్రియములు, మనస్సు ఈమూటిని వీనికి సంబంధించినవిషయములను బుద్ధిని, ఆత్మను వీనినన్నిటిని ప్రతిదినము పరీక్షించుట, మనస్సును పలువిధములు పోనీయక తనవశమున నుంచుకొని ఏకాగ్రత కల్గియుండుట ఈకృత్యము లన్నిటియందును మిక్కిలి ప్రయత్నముతో సాధింప యత్నించవలయును. మఱియు పైజెప్పినవియేకాక వీనికన్న నితరములయి పెద్దలచే నింద్యములుగాక యాచరింపబడినవియు, స్వర్గప్రాప్తికి సాధనములును, జీవనోపాయమైన ధనమును వృద్ధిజేయునవియు నైన కర్మలను చక్కగ గమనించి వానిని చేయ నారంభింపవలయును. అట్లు జేసినచో నీలోకమున కీర్తిని పరలోకమున స్వర్గాదిసుఖములును పొందగలదు. ఇత్తెఱంగున మూడవదియైన పరలోకైషణము వివరింపబడినది.

(గురుశుశ్రూషాదులు ఇంద్రియోపక్రమణీయమున జెప్పబడినను ప్రకరణానుసారముగ నిచ్చట నుదాహరణార్థము మఱల జెప్పబడినది.)

### ఉపస్తంభాదిపరిగణనము.

మూ. అథ ఖలు త్రయ ఉపస్తంభాః, త్రివిధం బలం, త్రీణ్యాయతనాని, త్రయో రోగాః, త్రయో రోగమార్గాః, త్రివిధా భిషజః, త్రివిధమౌషధమితి. 3౫

వ్యా. పై గ్రంథముచేత ఏషణాత్రయముల నిరూపించి త్రిత్వసంఖ్యావచ్ఛిన్నములయిన స్వస్థాతురహితములయిన కొన్నివిషయము లీక్రింద వివరింపబడును. మూడు ఉపస్తంభములు, (ఆధారములు), మూడువిధములగు బలములు, మూడువిధములయిన రోగకారణములు, మూడువిధములయిన రోగములు, మూడురోగమార్గములు, త్రివిధవైద్యులు, మూడువిధములయిన ఔషధములు ఇవి ఈక్రింద వివరింపబడును:—

### ఉపస్తంభవివరణము.

మూ. త్రయ ఉపస్తంభా ఇతి—ఆహారః, స్వప్నో, బ్రహ్మచర్యమితి. ఏభిస్త్రిభిర్యుక్తియుక్తైః ఉపస్తబ్ధముపస్తంభైః శరీరం బలవర్ణోపచయోపచితమనువర్తతే యావదాయుఃసంస్కారాత్. సంస్కారమహితమనుపసేవమానస్య య ఇహైవోపదేక్ష్యతే. 3౬

వ్యా. (ఉపస్తంభమనగా:—"ఉప (సమీపే స్థిత్వా) స్తంభయతి (ధారయతి) ఇతి ఉపస్తంభః" అను వ్యుత్పత్తిచేత ప్రధానమైనయాధార మొకటియుండగా దానికుపబలముగా నుండు నాధారమునకు ఉపస్తంభమని పేరు. ఒక ఇంటికి ఆధారముగ ప్రధానమైనస్తంభ మొకటియుండ అట్టిస్తంభమునకు ఉపబలముగా నుండు నితరసాధనము ఎట్లు ఆధారమగునో, శరీరధారణమునకు ఆయువు ప్రధానకారణమైయున్న అట్టి యాయువునకు హానిని కల్గనీయక కాపాడుటకు సహకారియైన ఆహారాదులు ఉపస్తంభమని చెప్పబడును.) అట్టియుపస్తంభము (శరీగధారణమున కుపబలము) ఆహారము, నిద్ర, బ్రహ్మచర్యము నని మూడువిధములు. యుక్తియుక్తములైన (శాస్త్రవిహితపద్ధతి నవలంబించి యుపయోగింపబడిన) యీమూడిటిచేత వృద్ధినొందిన బలవర్ణములచే శరీరము నానాట వృద్ధినొంది ఆయుఃపరిమితి నున్నంతవరకును శరీరమును చెడనీయక యనువర్తించునట్లు చేయును. అట్టిసంస్కారము శరీరమునకు ప్రతికూలముగాక హితముగ నుండవలెను. అహితమైన శరీరసంస్కారమును వదలి హితమైనసంస్కారము నవలంబించి

నచో నట్టియాహారాదులు శరీరధారణమునకు సాయపడును. అని భావము. ప్రాణమును కాపాడి యాయువును వృద్ధినొందించువిధాన మిచ్చట నే వివరింపబడును.

ఇచ్చట బ్రహ్మచర్యశబ్దము చేత బ్రహ్మజ్ఞానానుగుణమైన యింద్రియనిగ్రహము, మనోస్థైర్యము, మున్నగునవి గ్రహింపబడును. ఇచ్చట నాహారాదులు ప్రధానములుగ జెప్పబడినవి కావున అభ్యంజనము మున్నగునవి కూడ శరీరధారణమునకు కారణములని యెరుంగునది.

## త్రివిధబలవివరణము.

మూ. త్రివిధం బలమితి:—

సహజం, కాలజం, యుక్తికృతం చ. సహజం యచ్ఛరీరసత్వయోః ప్రాకృతం, కాలకృత మృతువిభాగజమ్, వయఃకృతం చ. యుక్తికృతం పున స్తద్యదాహారచేష్టాయోగజమ్. 36

వ్యా. సహజము, కాలజము, యుక్తికృతము నని బలము మూడువిధములు. అందు ఆహారాదికారణముల నపేక్షింపక పుట్టిననాటంగోలె రసాదిధాతువులు తమంతటనే వృద్ధినొంది దాన సంభవించిన ప్రాకృతబలము సహజ మనబడును. అట్లేరంగుననే సహాయకారణ నిరపేక్షముగ జన్మప్రభృతి తనంతట కల్గిన మనోబలము, (ఉత్సాహము) సహజ మనబడును. (లోకమున కొందరు స్వభావము చేతనే పుట్టిననాటనుండియే శరీరబుద్ధిబలము కలవారుగను, కొందరు బలహీనులుగను కానవచ్చెదరు. అట్టిబలము సహజమని భావము.)

విసర్గ - ఆదానకాలముల ననుసరించి 'ఆదావన్తే చ దౌర్బల్యం' ఇత్యాదివాక్యములచే చెప్పబడిన బలంబును, బాల్యాదివయోభేదమున గల్గుబలంబును కాలకృతబల మనంబడును. మాంసము నెయ్యి మున్నగువానికి, వ్యాయామము మున్నగు శరీర చేష్టలకును శరీరముతో చక్కగ (విధ్యుక్తముగ) సంబంధము కల్గుటచే సంభవించినబలము యుక్తికృత మనబడును. (ఇచ్చట యోగమనగ రసాయనాదియోగమని యర్థము చేసి దానకల్గిన బలముకూడ యుక్తమని కొందరు చెప్పెదరు.) ఆహారచేష్టలకు శరీరముతో సమ్యగ్యోగము కల్గుట యుక్తి. దాన సంభవించినది యుక్తికృతమని యెరుంగునది.

## ఇంద్రియార్థముల కతియోగాయోగమిథ్యాయోగములు.

మూ. త్రీణ్యాయతనానీతి:—అర్థానాం కర్మణః కాలస్య చ అతియోగాయోగమిథ్యాయోగాః. 37

తత్ర అతిప్రభావతాం దృశ్యానామతిమాత్రం దర్శనం అతియోగః, సర్వశోఽదర్శనం అయోగః, అతిశ్లిష్ట అతివిప్రకృష్ట రౌద్రభైరవాద్భుతద్విష్టబీభత్సనవికృతాదిరూపదర్శనంమిథ్యాయోగః. ౩౯

తథాతిమాత్రస్తనితపటహోత్క్రుష్టాదీనాం శబ్దానామతిమాత్రం శ్రవణమతియోగః, సర్వశోఽశ్రవణమయోగః,పరుషేష్టవినాశోపఘాతప్రఘర్షణభీషణాదిశబ్దశ్రవణం మిథ్యాయోగః ౪౦

తథాఽతితీక్ష్ణోగ్రాభిష్యన్దినాం గన్ధానాం అతిఘ్రాణమతియోగః సర్వశోఽఘ్రాణమయోగః, పూతిద్విష్టామేధ్యక్లిన్నవిషపవనకుణపగన్ధాదిఘ్రాణం మిథ్యాయోగః. ౪౧

తథా రసానామత్యాదానమతియోగః, అనాదానమయోగః, మిథ్యాయోగో రాశివర్జ్యేషు ఆహారవిధివిశేషాయతనేషూపదేక్ష్యతే. ౪౨

తథాతిశీతోష్ణానాం స్పృశ్యానాం స్నానాభ్యఙ్గోత్సాదనీయానాం చాత్యుపసేవనమతియోగః, సర్వశోఽనుపసేవనమయోగః, స్నానాదీనాం శీతోష్ణాదీనాం చ స్పృశ్యానాం అననుపూర్వ్యోపసేవనం విషమస్థానాభిఘాతాశుచిభూతసంస్పర్శాదయశ్చ మిథ్యాయోగః. ౪౩

వ్యా. చక్షురాదీంద్రియములకు విషయములైన శబ్దస్పర్శరూపరసగంధములను నింద్రియార్థములకును, వాక్కునకును, మనస్సునకును సంబంధించి వ్యాపారరూపమైన కర్మకును, శీతోష్ణరూపకాలమునకును, అతియోగము, అయోగము, మిథ్యాయోగము అనుమూడును ఆయతనములు (రోగముల గల్గించు కారణములు) అని చెప్పబడును. (చక్షురాదీంద్రియములకు వానివానివిషయములైన రూపాదులతో నధికముగ సంబంధము కల్గిన నది అతియోగమనియు, రూపాదులతో బొత్తుగ సంబంధము లేకున్న నది అయోగమనియు, అయుక్తమైనసంబంధము కల్గిన నది మిథ్యాయోగమనియు భావము. మరియు శరీరమునకును, వాక్కునకును, మనస్సునకును సంబంధించినవ్యాపారము కర్మ. అట్టి కర్మకు సంబంధించిన అతియోగము అయోగమిథ్యాయోగములును పైజెప్పినరీతిగ

నెరుంగునది. శీతోష్ణరూపమైన కాలముతో నధికసంబంధము అతియోగము, సంబంధము లేకుండుట అయోగము, వ్యత్యస్తముగ సంబంధము కల్గుట మిథ్యాయోగము. అట్టి అర్థ కర్మకాలములకు సంబంధించిన అతియోగ-అయోగ-మిథ్యాయోగములు మూడును నానా విధరోగములకు మూడుకారణములని ఫలితార్థము.) ౩౮

అందు మిక్కిలి కాంతికల ఎండ అగ్ని మున్నగు దృశ్యపదార్థములను అధికముగ కండ్లతో జూచుట అతియోగము. అట్టి ప్రభావంతములగు వానినిబొత్తుగ జూడకుండుట అయోగము. కన్నుల కతిసమీపమున నుండువస్తువులను, మిక్కిలి దూరముగ నుండువస్తువులను, మిక్కిలి క్రూరములైన పెద్దపులి మున్నగువానిని, భయంకరములగు జంతువులు మున్నగువానిని, ఆశ్చర్యమును కల్గించువానిని, మనస్సు కింపుగాని (ఏవగింపు గల్గించు) పురీషాదులను, తనకు ద్వేషముకల పదార్థములను, వికృతాంగాదులను నగు వానిని కన్నుల జూచుట మిథ్యాయోగము. (ఇయ్యవి చక్షురింద్రియమునకు సంబంధించిన అతియోగాయోగమిథ్యాయోగములు.) ఇచ్చట 'అతిప్రభావతాం' అని చెప్పుటచేత ప్రభాహీనములైన ఘటపటాదిదర్శనముచే నైన అతియోగము రోగకారణము కాదని యెరుంగునది. ౩౯

ప్రబలమైన మేఘగర్జనమును, తప్పెట రణభేరి మున్నగువాని ధ్వనిని, గర్వముచే కల్గిన యుత్కటధ్వనిని, ఇవి మున్నగాగల ధ్వనులను శ్రవణేంద్రియముచే నధికముగవినుట అతియోగము. అట్టిధ్వనులను బొత్తుగ వినక శ్రవణేంద్రియవ్యాపారమును మానియుండుట అయోగము. వినుటకు కఠినంబులగు ధ్వనులను, తనకిష్టమైన వస్తువుల వినాశమును వార్తలను, కఠినవస్తు పరస్పర సంఘర్షణముచేకల్గిన పెద్దధ్వనిని, ధిక్కారవాక్యమును, భయమునుకల్గించు ధ్వనులను, ఇవి మున్నగువానిని చెవులతో వినుట మిథ్యాయోగము, (ఇవి శ్రవణేంద్రియమునకు విషయములతోగల్గిన అతియోగాయోగ మిథ్యాయోగములు.) ౪౦

కన్నులయందు నీళ్లనుకల్గించు మిక్కిలి తీక్ష్ణములైన నల్లజీలకర మున్నగువాని వాసనను, ఉగ్రములైన (ముక్కున ద్రవమును వెడలించు) వస మున్నగువానిని, మత్తును కల్గించు ముక్కునపడిశెముచే ద్రవమును గల్గించు కల్లు సారాయి మున్నగు ద్రవ్యములను, వీనిగంధమును అధికముగ ఘ్రాణేంద్రియముచే మూర్కొనుట అతియోగము. సర్వదా దేనిని మూర్కొనక ఘ్రాణేంద్రియవ్యాపారమును మానియుండుట అయోగము. దుర్గంధమును, తనకు ద్వేషము కలగంధమును, మలము మున్నగు నశుద్ధపదార్థములను, కుళ్లినపదార్థములను, విషముతోగూడినగాలిని, పీనుగను ఇవి మున్నగు చెడ్డవాసన

లను మూరొక్కనిన మిథ్యాయోగము. (ఇవి ఘ్రాణేంద్రియమునకు తన విషయములతో గల్గిన అతియోగాయోగ మిథ్యాయోగములు.) ౪౧

మధురాది రసములుగల పదార్థములను అధికముగ రసనేంద్రియముచే గ్రహించుట అతియోగము. అట్టిరసములను గ్రహించక రసనేంద్రియవ్యాపారమును బొత్తుగ మానియుండుట అయోగము. పరిమాణమునువదలి యాహారమునుదినుట మిథ్యాయోగము. రసవిషయమైన మిథ్యాయోగము రసవిమానాధ్యాయమునందు రాశివర్జ్యములైన ఆహారాయతనములయందు విపులముగ జెప్పబడును. (ఇవి రసనేంద్రియవిషయ అతియోగ అయోగ మిథ్యాయోగములు.) ౪౨

మిక్కిలి చల్లనైన పదార్థములను, మిక్కిలి వేడియైన పదార్థములను, అధికముగ స్పృశించుట, స్నానము, అభ్యంగము, నలుగుపెట్టుకొనుట మున్నగు త్వగింద్రియమునకు సంబంధించినవ్యాపారముల నధికముగజేయుట ఇవి అతియోగము. ఏవిధమయిన స్పర్శమును లేకయుండుట అయోగము. పైజెప్పినవానిని క్రమమును (యథోక్తవిధిని) అతిక్రమించి వ్యత్యస్తముగ జేయుటయు, నిమ్నోన్నతస్థలముల కూర్చునియుండుటయు, అట్టిస్థలమున పరుండుటయు, కత్తి మున్నగు నాయుధములచే నభిఘాతము కల్గుటయు, అశుద్ధములగు వస్తువుల స్పృశించుటయు, పిశాచాది బలిపాత్రముల స్పృశించుటయు మొదలగునవి అతియోగము. (ఇవి స్పర్శనేంద్రియ విషయ మిథ్యాయోగము) ఇచ్చట "స్నానాదీనాం అననుపూర్వ్యాశ్ ఉపసేవనం" అనుచోట పైజెప్పిన స్నానాదులను శీతోష్ణాదులను యథోక్తక్రమమును విడచి సేవించుట యని యర్థము. స్నానమునకుముందు ఉద్వర్తనముచేయుటయు, ఉష్ణముగనున్నపుడు శీతజలస్నానంబును క్రమము. అట్టిక్రమమును పదలి తొలుత స్నానముచేసి పిమ్మట ఉద్వర్తనము చేసికొనుట, ఉష్ణముగనున్నపుడు ఉష్ణజలముచేతను, శీతముగనున్నపుడు శీతజలముచేతను స్నానముచేయుట అక్రమమని భావము. ఇది మిథ్యాయోగము. ౪౩

## అసాత్మ్యేంద్రియార్థసంయోగము, వాని భేదములు.

మూ. తత్రైకం స్పర్శనేన్ద్రియం ఇన్ద్రియాణాం ఇన్ద్రియవ్యాపకం చేతస్సమవాయి, స్పర్శనేన్ద్రియవ్యాప్తేః వ్యాపకమపి చ చేతః, తస్మాత్ సర్వేన్ద్రియాణాం వ్యాపకస్పర్శకృతో యో భావ విశేషః సోఽయమనుపశయాత్ పఞ్చవిధ స్త్రివిధవికల్పో భవత్య సాత్మ్యేన్ద్రియార్థసంయోగః, సాత్మ్యార్థో హ్యుపశయార్థః. ౪౪

వ్యా. చక్షురాదీంద్రియము లైదిటిలో త్వక్కు నాశ్రయించియుండు స్పర్శనేంద్రియము తక్కిన యింద్రియములతో గూడి ఆయావిషయమును గ్రహించును కావున చక్షుశ్శ్రోత్ర జిహ్వాఘ్రాణములకన్న వ్యాపకము. (చక్షురాదీంద్రియములు వానివాని విషయమును గ్రహించుతరి స్పర్శనేంద్రియసంబంధము లేక గ్రహింపనేరవు కావున అన్నియింద్రియముల వ్యాపించుటంజేసి స్పర్శనేంద్రియము ఇంద్రియవ్యాపకమని భావము). అట్టిస్పర్శనేంద్రియము మనస్సుతో కూడియేయుండును. (మనస్సుకును స్పర్శనేంద్రియమునకును సంబంధము నియతము కావున నయ్యది మనస్సుతో కూడియే తక్కినయింద్రియములతో వ్యాపించును. అట్టి చేతనాత్మకమైన మనస్సంబంధము కల్గియుండుటచేతనే తక్కిన యింద్రియములతో కలిసి రూపాదివిషయముల గ్రహింప సమర్థమైనది.) అట్టిచేతనాత్మకమైనమనస్సు సర్వేంద్రియములయందును వ్యాపించియుండు స్పర్శనేంద్రియవ్యాప్తికిని వ్యాపకమైనది మనస్సు. (సర్వేంద్రియములయందును వ్యాపించు స్వభావముకలది స్పర్శనేంద్రియము, అయ్యదియు అచేతనము కావున మనస్సంబంధముచేతనే తక్కినయింద్రియములతో వ్యాపించును. కావున స్పర్శనేంద్రియవ్యాప్తికన్న వ్యాపకమైనది మనస్సు అని భావము.) పైజెప్పినరీతిగ సర్వేంద్రియవ్యాపకమైన మనస్సుతోకూడిన స్పర్శనేంద్రియము తక్కిన యింద్రియములతోగూడి విషయముల గ్రహించునని యేర్పడినది; కావున చక్షురాదీంద్రియములకు గల ఇంద్రియార్థములైన రూపాదులగ్రహించు స్వభావవిశేషము (శక్తి) ఏది కలదో అయ్యది తక్కినయింద్రియములకు వ్యాపకమైన (మనస్సుతోకూడిన) స్పర్శనేంద్రియ సంబంధముచే కల్గినది. (స్పర్శనేంద్రియము తొలుత మనస్సుతోకూడి పిమ్మట చక్షురాదీంద్రియముల కాశ్రయములగు నేత్రగోళాదుల స్పృశించి వ్యాపించును. పిమ్మట స్పర్శనేంద్రియసంబంధముకల చక్షురాదీంద్రియములు వానివానికి నియతములగురూపాదుల గ్రహించుటకు సమర్థములగును. స్పర్శనేంద్రియ సంబంధము లేనినాడు స్వవిషయముల గ్రహించుశక్తి తక్కిన యింద్రియములకు లేదు. కావున చక్షురాదులకు రూపాదుల గ్రహించు స్వభావ మస్పర్శకృతమని భావము. ఇదియే యింద్రియములకు ఇంద్రియార్థములతో సంబంధక్రమము. (ఇంద్రియార్థసంయోగము) అట్టి యింద్రియార్థసంయోగము (స్పర్శనేంద్రియసంబంధముచే నింద్రియములకు తమతమవిషయములతోగల సంయోగము) ప్రకృతము అనుపశయము (శరీరమనస్సులకు కష్టమును (రోగమును) కల్గించునది అగుటంజేసి అసాత్మ్యము, కావున అసాత్మ్యేంద్రియార్థ సంయోగమని చెప్పబడును. అయ్యది పైజెప్పినరీతిగ ఇంద్రియవ్యాపకమైన స్పర్శనేంద్రియమునకు గోచరమగుటంజేసి ఒకటిగనే యుండునని చెప్పబడినది. అట్టి యేకరూప

మైన యసాత్మ్యేంద్రియార్థసంయోగము ఆయాయింద్రియములకు అనుపశయము (రోగరూపమైన దుఃఖమును కల్గించునది) అగుటంజేసి వేరువేరుగనుండును కావున పంచవిధమగును. అట్టివైయైదును, అతియోగ-అయోగ-మిథ్యాయోగభేదములచే నొక్కొకటి మూడేసివిధములై పదునైదు విధములగును. సాత్మ్యము, ఉపశయము అనునవి రెండును సమానార్థకములు. (అనగా సుఖము కల్గించునది సాత్మ్యము. అదియే యుపశయమగునని యర్థము. దీనికి వ్యతిరేకముగ శరీరమునకు వ్యాధిరూపమైనకష్టమును గల్గించునది అసాత్మ్యము, అనుపశయమునని భావము.)

ఇచ్చట నీసంగ్రహము నెఱుంగునది:—పైగనబరచిన నలువదిమూడవసూత్రమున వివరించిన అసాత్మ్యేంద్రియార్థసంయోగము. అయ్యది యేకరూపమా? అనేకమా? అన్నచో దానివివరణము. "తత్రైకం—హ్యుపశయార్థః" అనుసూత్రముచే జెప్పబడినది. అందు ఇంద్రియములు వానివిషయముల వ్యాపించి గ్రహించునపుడు తొలుత స్పర్శనేంద్రియసంబంధములే వ్యాపించుట లేదు. ఎట్టులన—చేతనారూపమైన మనస్సుతోఁగూడిన స్పర్శనేంద్రియము చక్షురింద్రియమున కాశ్రయమున వ్యాపించి దానియర్థమగురూపమునకును చక్షురింద్రియాశ్రయమునకును స్పర్శమునుకల్గించును. పిమ్మట అట్టిస్పర్శముతోఁ గూడినచక్షురింద్రియము తనకువిషయమైన రూపమును గ్రహించును. వాయువుయొక్క తరంగములు చెవిలోనుండు శ్రవణేంద్రియాధిష్ఠానమును స్పృశించినపిదప శ్రవణేంద్రియశబ్దమును గ్రహించును. వాసనఘ్రాణేంద్రియాధిష్ఠానమును స్పృశించినప్పుడు ఘ్రాణేంద్రియము గంధమును గ్రహించును. మధురాదిరసయుక్తమైనపదార్థములకు రసనేంద్రియాధిష్ఠానమైననాలుకతోఁ స్పర్శము కల్గినపుడు రసనేంద్రియము మధురాదిరసముల గ్రహింపనోపును. కావున స్పర్శనేంద్రియవ్యాప్తి లేక చక్షురాదీంద్రియములు తమతమవిషయముల గ్రహించుటలేదు. కావున స్పర్శనేంద్రియము తక్కినయింద్రియములకు వ్యాపకము. మనస్సంబంధములేక జడమైనస్పర్శేంద్రియము వ్యాపింపనోపదు కావున సర్వేంద్రియవ్యాపకము మనస్సు. అట్టిమనస్సుతోఁగూడి ఇంద్రియవ్యాపకమైన స్పర్శేంద్రియముచే గ్రహింపబడుటంజేసి అసాత్మ్యేంద్రియార్థసంయోగము ఏకరూపముగ చెప్పబడును.

చక్షురాదీంద్రియములకు సంబంధించి అతిభాస్వరాదిరూపమైన యసాత్మ్యేంద్రియార్థములతోఁ సంయోగము కల్గినపుడు ఆయాయింద్రియములకు ఉపఘాతము కల్గునని నియమము తేలుచున్నది. కావున ఆయాయింద్రియమునకు కల్గిన అసాత్మ్యేంద్రియార్థసంయోగము ఆయాయింద్రియమున కుపఘాతకముకావున, అసాత్మ్యేంద్రియార్థసంయోగము త్వక్చక్షుశ్శ్రోత్రజిహ్వాఘ్రాణములకుసంబంధించి యైదువిధములనుండును. అందు

చక్షురింద్రియమునకు సంబంధించిన భాస్వరాదిరూపసంయోగము చక్షురసాత్మ్యేంద్రియార్థసంయోగము. శ్రోత్రేంద్రియమునకల్గిన అతిమాత్రస్తనితాదిసంయోగము శ్రవణాసాత్మ్యేంద్రియార్థసంయోగము. ఘ్రాణేంద్రియమునకు కల్గిన అతితీక్ష్ణాదిగంధసంయోగము ఘ్రాణాసాత్మ్యేంద్రియార్థసంయోగము. రసనేంద్రియమునకు మధురాదిరసాతియోగము రసనాసాత్మ్యేంద్రియార్థసంయోగము. స్పర్శనేంద్రియమునకు అతిశీతోష్ణాదిసంయోగము స్పర్శనాసాత్మ్యేంద్రియార్థసంయోగము నని అసాత్మ్యేంద్రియార్థసంయోగము ఐదువిధములుగ నుండును.

ఒకేవిధమని యంగీకరించునెడ చక్షురింద్రియమునకు అసాత్మ్యేంద్రియార్థసంయోగము కల్గిననాడు తక్కినయింద్రియములకును హాని సంభవించవలసియుండును. అట్లు కల్గుటలేదు; కావున ఇంద్రియములైదిటికిని అసాత్మ్యేంద్రియార్థసంయోగము నియతముగ వేరువేరుగ నుండును. ఆయాయింద్రియమునకు సంబంధించినది ఆయాయింద్రియమునకు హానికర మగునని భావము.

పైజెప్పినరీతిగ నైదువిధములైన యసాత్మ్యేంద్రియార్థసంయోగము అతియోగము, అయోగము, మిథ్యాయోగము అనుభేదములచే నొక్కొకటి మూడేసిభేదములు కల్గి, అన్నియుం కలిసి (ఒక్కొకటి మూడేసివంతున) పదునైదువిధములగును.

ఆరోగ్యరూపమై ఆరోగ్యరూపమైన సుఖమునుకల్గించునది ఉపశయము. దీనికే సాత్మ్యమనియుం సంజ్ఞ. దీనికి వ్యతిరేకముగ రోగరూపమైన దుఃఖమును కల్గించునది అనుపశయము. దీనికే అసాత్మ్యమనియుం సంజ్ఞ. అట్టి అనుపశయమైన (అసాత్మ్యమైన) ఇంద్రియార్థసంయోగము. అసాత్మ్యేంద్రియార్థసంయోగము. అని ఫలితార్థము. ఈ యర్థము 'సాత్మ్యార్థో హ్యుపశయార్థః' అని చెప్పబడినది. పైజెప్పబడినరీతిగ పంచేంద్రియములకును ఆయాయింద్రియమునకు సంబంధించిన అయోగము, అతియోగము, మిథ్యాయోగమును దుఃఖరూపమైనరోగమును కల్గించునవికాన ఉపశయమనియుం అసాత్మ్యేంద్రియార్థసంయోగమనియుం చెప్పబడును. ఇంద్రియార్థముల సమ్యగ్యోగము సుఖకరమగుటంజేసి ఉపశయమనియుం, సాత్మ్యేంద్రియార్థసంయోగమనియుం చెప్పబడునని నిష్కృష్టము. ఈయర్థమునే "...ఉపయోగం సుఖావహం, విద్యాదుపశయం వ్యాధేః సహి సాత్మ్యమితి స్మృతః, విపరీతోఽనుపశయవ్యాధ్యసాత్మ్యాభిసంజ్ఞితః" అని తంత్రాంతరమున జెప్పిరి.

### కర్మస్వరూపము, దాని అయోగ-అతియోగ-మిథ్యాయోగములు.

మూ. కర్మ వాఙ్మనశ్శరీరప్రవృత్తిః తత్ర వాఙ్మనశ్శరీరాతిప్రవృత్తిరతియోగః; సర్వశోఽప్రవృత్తిరయోగః; వేగధారణోదీరణ

విషమస్ఖలనపతనాఙ్గప్రణిధానాఙ్గప్రదూషణప్రహారమర్దనప్రాణో
పరోధసంక్లేశనాదిః, శారీరో మిథ్యాయోగః. సూచకానృతా
కాలకలహాప్రియాబద్ధానుపచారపరుషవచనాదిః వాఙ్మిథ్యా
యోగః. భయశోకక్రోధలోభమోహమానేర్ష్యా మిథ్యా
దర్శనాదిః మానసో మిథ్యాయోగః. ౪౨

వ్యా. వాక్కునకును మనస్సునకును శరీరమునకును సంబంధించినవ్యాపారము కర్మ యనబడును. అందు వాఙ్మనశ్శరీరములకు సంబంధించినవ్యాపారముల నధికముగ జేసినచో నతియోగము. (వాగ్వ్యాపార మధికమైనచో వాక్కునకుసంబంధించిన అతియోగము. మనస్సునకు సంబంధించినది మానసాతియోగము. శరీరమునకు సంబంధించినది శారీరకర్మాతియోగము). వాఙ్మనశ్శరీరవ్యాపారముల బొత్తుగ మానియుండుట వాక్కునకును మనస్సునకును శరీరమునకును సంబంధించినకర్మాయోగము. మరియు మలమూత్రాదివేగముల నిరోధించుట, అవసరములేనప్పుడు మలమూత్రాదుల బలాత్కారముగ వెడలించుట, మిట్టపల్లములుగ నుండుస్థలముల తడబడుట, ఎత్తుప్రదేశమునుండి క్రిందపడుట, శరీరమును మిట్టపల్లములుగ నుండుచోట నునిచి పరుండుట, శరీరము నధికముగ గీరుట, రుద్దుట, శరీరముపై దెబ్బతగులుట, పిసికించుకొనుట, శ్వాసమును బిగబట్టుట, మద్యపానము చేయుట, ఎండలోనుండుట, నీళ్లలోనీదుట మున్నగుపనులచే శరీరమును కష్టపెట్టుట ఇవి మున్నగు కార్యములు శరీరమునకు సంబంధించిన కర్మలయొక్క మిథ్యాయోగము.

కొండెముల జెప్పుట, దబ్బరలాడుట, అకాలమున మాటలాడుట, కలహమాడుట, అప్రియములబల్కుట, నియమములేక మాటలాడుట, ఎదటివానిని మర్యాదలేకమాటలాడుట, కఠినముగ మాట్లాడుట ఇవి మున్నగువ్యాపారము వాక్కునకు సంబంధించినకర్మ యొక్క మిథ్యాయోగము.

భయము, దుఃఖము, క్రోధము, లోభము, మోహము, అభిమానము, ఈర్ష్య, వాస్తవ్యవిషయమును వదలి వ్యతిరేకవిషయముల నాలోచించుట ఇవిమున్నగు మానసిక కృత్యములు మనస్సునకు సంబంధించిన మిథ్యాయోగమని యర్థము.

ఇచ్చట అనృతవచనాదిరూపమిథ్యాయోగము అధర్మకరణము, దానిమూలమున రోగములు సంభవించునని యాస్తికసిద్ధాంతము. కావున నవి యిచ్చట వివరింపబడియె. (కర్మాయోగమునను అతియోగమునను జెప్పినది. శాస్త్రవిహితములై గర్హితములుకాని కర్మల నధికముగ జేసిన అతియోగమనియు, వానినే బొత్తుగ చేయకున్న నయోగమనియు నెరుంగునది. శాస్త్రగర్హితముల నాచరించినచో నది మిథ్యాయోగమున చేరును.)

## అనుక్తమిథ్యాయోగకర్మసంగ్రహము.

మూ. సఙ్గ్రహేణ చ అతియోగాఽయోగవర్జం కర్మ వాఙ్మనశ్శరీరజం అహితం అనుపదిష్టం యత్, తచ్చ మిథ్యాయోగం విద్యాత్.

వ్యా. అతియోగమునకును అయోగమునకును సంబంధించి చెప్పిన కర్మలను వదలి తక్కినవాఙ్మనశ్శరీరములకు సంబంధించినకర్మలును, ఈజన్మమునకు హితములు కానికర్మలును, పరలోకమునకు ప్రతికూలములై యధర్మరూపమైన పరదారగమనాదికర్మలును మిథ్యాయోగములని (శరీరవాఙ్మనస్సులకు మిథ్యాయోగములని) సంగ్రహముగ నెఱుంగునది.

## త్రివిధకర్మమునకు ప్రజ్ఞాపరాధసంజ్ఞ.

మూ. ఇతి త్రివిధవికల్పం త్రివిధమేవ కర్మ ప్రజ్ఞాపరాధ ఇతి వ్యవస్యేత్. ౪౭

వ్యా. పైజెప్పినరీతిగ వాచికమానసికకాయికభేదములచే మూడువిధములైనవ్యాపకరూపకర్మము, అతియోగాయోగమిథ్యాయోగము లనుభేదములచే మూడువిధములైనదియు ప్రజ్ఞాపరాధమని చెప్పబడును. ప్రజ్ఞాపరాధమన జ్ఞానముయొక్క పొరబాటు. కర్మలయొక్క అయోగము అతియోగము మిథ్యాయోగములనుమూడును జ్ఞానముయొక్క పొరబాటుచే గల్గును కావున, అట్టిప్రజ్ఞాపరాధమున గల్గినకర్మల అయోగాదులు ప్రజ్ఞాపరాధమనియే చెప్పబడునని భావము.

## కాలాతియోగ-అయోగ-మిథ్యాయోగములు (పరిణామము).

మూ. శీతోష్ణవర్షలక్షణాః పునర్హేమన్తగ్రీష్మవర్షాః—సంవత్సరః, స చ కాలః, తత్రాతిమాత్రస్వలక్షణః కాలః కాలాతియోగః, హీనస్వలక్షణః కాలః కాలాఽయోగః, యథాస్వలక్షణవిపరీతలక్షణస్తు కాలః కాలమిథ్యాయోగః. కాలః పునః పరిణామ ఉచ్యతే. ౪౮

వ్యా. చలి, ఉష్ణము, వర్షము ఈమూడులక్షణములు కలవి క్రమముగ హేమంత-గ్రీష్మ-వర్షఋతువులు సంవత్సరాంతకమైనకాలము. (అందు హేమంతమున శీతంబును, గ్రీష్మమున ఉష్ణంబును, వర్షఋతువున వర్షంబును స్వభావముగ నుండును.) అందు ఆయాఋతువులకు నియతమైన శీతోష్ణవర్షములు ఆయాఋతువుల అధికముగ నున్నచో నది కాలాతియోగమని చెప్పబడును. (ఆయాఋతువునకు స్వాభావికమైన

ధర్మము అధికముగనుండుట అతియోగమని భావము). అట్టికాలమున వానికి స్వాభావికమైన శీతోష్ణవర్షములు సమస్థితినుండక తగ్గియున్నచో కాలాయోగమనబడును. అటుగాక శీతకాలమున నుష్ణంబును, ఉష్ణకాలమున శీతంబును, వర్షాకాలమున ఉష్ణంబును లేక శీతంబునున్నచో నయ్యది కాలమిథ్యాయోగమని చెప్పబడును. అట్టికాలము పరిణామమనియుం చెప్పబడును.

## త్రివిధరోగహేతూపసంహారము.

మూ. ఇత్యసాత్మ్యేన్ద్రియార్థసంయోగః, ప్రజ్ఞాపరాధః, పరిణామ
శ్చేతి త్రయః త్రివిధవికల్పాః హేతవో వికారాణాం, సమ
యోగయుక్తాస్తు ప్రకృతిహేతవో భవన్తి. ౪౯

వ్యా. ఇత్తెరంగున పైజెప్పినరీతిగ నసాత్మ్యేంద్రియార్థసంయోగము, ప్రజ్ఞాపరాధము, పరిణామమనుమూడును అతియోగము, అయోగము, మిథ్యాయోగము అను భేదములతో గూడి రోగములకు కారణములగును. అటు కాక ఇంద్రియార్థములును, కాలంబును, త్రివిధకర్మమును అతియోగాదులులేక సమయోగముకల్గియున్నచో రోగము లేక ఆరోగ్యమునునుంచి యారోగ్యమునకు కారణములగును. (ఇచ్చట సమయోగమన సమ్యగ్యోగమని యెరుంగునది) పైజెప్పినవివరణముచేత సూత్రస్థానమున సూచించిన "కాలబుద్ధీంద్రియా—హేతుసంగ్రహః" విషయము వివరింపబడెనని యెరుంగునది.

ఈవిషయమునే వాగ్భటాచార్యులు సూక్ష్మముగ నిట్లుపదేశించిరి:—"కాలార్థకర్మణాం యోగో హీనమిథ్యాతిమాత్రకః, సమ్యగ్యోగశ్చ విజ్ఞేయో రోగారోగ్యైకకారణమ్."

## సమ్యగ్యోగాయోగాదులకు లోకదృష్టాంతము.

మూ. సర్వేషామేవ భావానాం భావాఽభావౌ నాన్తరేణ యోగాఽ
యోగాతియోగ మిథ్యాయోగాన్ సముపలభ్యేతే, యథా
స్వయుక్త్యపేక్షిణౌ హి భావాఽభావౌ. ౫౦

వ్యా. (ఇంతదనుక పైగ్రంథముచేత ధాతుసామ్యమునకు కాల-అర్థ-కర్మముల యొక్క సమ్యగ్యోగము కారణమనియు, ధాతువైషమ్యమునకు కాల-అర్థ-కర్మముల యొక్క అతి యోగాయోగమిథ్యాయోగములు కారణము లగుననియుం సవిస్తరముగ జెప్పబడినది. అట్టి సమ్యగ్యోగాయోగాదులు కేవలము ధాతుసామ్యవైషమ్యములకే గాక, లోకమునంగల వృక్షాది భావపదార్థములయొక్క భావాఽభావములకును కారణము లగునని సదృష్టాంతముగ 'సర్వేషామేవ' అను సూత్రముచే జెప్పబడును.)

భావమన సరియైన పద్ధతినుండుట, అభావమన తానుండవలసిన పరిస్థితికంటె హీనస్థితి నుండుట, లేక బొత్తుగ నాశమునొందుట యని అర్థము. లోకమున భావ రూపములైన (సద్రూపములు గనపడుచుండు) వృక్ష ఘటపటాది పదార్థము లన్నిటి యొక్క భావమును (సమ్యగవస్థానమును) అభావమును (హీనస్థితియం నాశమును) వాని వానికి (ఆయాపదార్థములకు) సంబంధించిన యుపకరణాదులయొక్క సమ్యగ్యోగం బును, వానియొక్క అతియోగ-అయోగ-మిథ్యాయోగంబులును లేక సంభవించుటలేదు. (వృక్షాది భావపదార్థములు చక్కగ నుండుటకు వానికి కారణములైన జలాది సంబంధము చక్కగ గల్గిన నాపదార్థములు చక్కనిస్థితి నుండును. కావున వృక్షాదులకు వాని వృద్ధికి కారణములైన జలాదుల సమ్యగము కారణమగును. అట్టి జలాదిసంబంధము న్యూనాధికములుగ కల్గినను బొత్తుగ లేకున్నను, ఎండ మున్నగువాని సంబంధము కల్గినను వృక్షాదులు వృద్ధినొంది చక్కనిస్థితి నుండక పోవును. లేక బొత్తుగ నశించును. కావున వృక్షాదులకును భావమునకు వానికారణముల సమ్యగ్యోగంబును, అభావమునకు అయోగ అతియోగ మిథ్యాయోగంబులును కారణములు అని భావము.) కావున లోకమునకల వృక్ష ఘట పటాది భావ పదార్థములకుంగూడ వాని వానికి సంబంధించిన జల సేకాది కారణముల యుక్తి నపేక్షించి భావాభావములు కల్గును అని యర్థము.

(వృక్షము దానికి మితమైనజలము యెండ గాలి మున్నగువాని సంబంధము కల్గిన నాడు చక్కగ వృద్ధినొంది సరియైన పరిస్థితి నుండును. అట్టి జలాదిసంబంధము అధికముగ కల్గినను బొత్తుగ లేకున్నను దానిపరిస్థితి చెడిపోవును లేక నాశమునొందును. దానికి ప్రతికూలమైన అశనిపాతము మున్నగు నపాయకారణములు తటస్థపడినప్పుడు స్వరూపనాశనము సంభవించును. కావున లోకముననుండు భావపదార్థముల కన్నిటికిని వానికారణముల సమ్యగ్యోగ-అతియోగ-అయోగ - మిథ్యాయోగములు భావాభావ ములకు హేతువులని మన కనుభవసిద్ధమని ఫలితార్థము.)

## త్రివిధరోగములు, వానియుత్పత్తికారణములు.

మూ. త్రయో రోగా ఇతి—నిజాగన్తుమానసాః. తత్ర నిజః శారీర దోషసముత్థః, ఆగన్తుః భూతవిషవాయ్వగ్నిసంప్రహారాది సముత్థః, మానసః పునరిష్టస్య అలాభాత్, లాభాచ్చానిష్టస్య ఉపజాయతే. ౫౧

వ్యా. నిజములు, ఆగంతువులు, మానసములు నని రోగములు మూడువిధములు. అందు శరీరమునకు సంబంధించిన వాతాదిదోషములచే కల్గినది నిజరోగము. భూతపిశాచాదులు, విషము, గాలి, నిప్పు, దెబ్బలు మున్నగు బాహ్యకారణములచే సంభవించినది

ఆగంతురోగము. తనకిష్టమైనవస్తువులు లభింపకుండుటచేతను, అనిష్టవిషయములు తటస్థించుటచేతను సంభవించిన కామక్రోధాదులు మానసికరోగములు.

ఇచ్చట 'ఇష్టస్య లాభాత్, లాభాచ్చానిష్టస్య' అని పాఠాంతరమును కనబడుచున్నది. అట్టియెడ ఇష్టవస్తులాభముచేత కామము, హర్షము మున్నగు మానసరోగములు కల్గుననియు, అనిష్టములగు పుత్రాదివియోగము కల్గుటచేత శోకాది మానసరోగములు కల్గుననియు అర్థము చేయనగును. అప్పుడు చకారమువలన ఇష్టాలాభము కూడ మానసరోగకారణమని చెప్పుట సమంజసము.

## మానసరోగప్రతీకారము.

మూ. తత్ర బుద్ధిమతా మానసవ్యాధిపరీతేనాపి సతా బుద్ధ్యా హితాహితమవేక్ష్యావేక్ష్య ధర్మార్థకామానామహితానాం అనుపసేవనే, హితానాం చోపసేవనే ప్రయతితవ్యమ్. న హ్యన్తరేణ లోకే త్రయమేతన్మానసం కిఞ్చిన్నిష్పద్యతే సుఖం వా దుఃఖం వా. తస్మాదేతచ్చానుష్ఠేయం—తద్విద్యవృద్ధానాం చోపసేవనే ప్రయతితవ్యమ్. ఆత్మదేశకాలబలశక్తిజ్ఞానే యథావచ్చేతి. ౪౨

వ్యా. పైజెప్పిన మూడువిధములైన వ్యాధులలో మానసరోగములచే బాధింపబడు మనుజుడు మంచి బుద్ధికౌశలము కలవాడై ధర్మార్థకామరూపములైన త్రివర్గములలో తన'కెద్ది హితము, ఎద్ది అహితము' అని పలుమారు చక్కగ గమనించి, అందు అహితములైనవానిని బొత్తుగ మాని హితములైనవానిని సేవించుటకు ముఖ్యముగ ప్రయత్నము చేయవలెను. లోకమున ధర్మార్థకామములను మూడును దప్ప ఇతరకారణములచేత మానవులకు మనస్సంబంధమైన సుఖమైనను దుఃఖమైనను సంభవించుటలేదు; (మానససుఖమునకును, దుఃఖమునకును త్రివర్గములే కారణములనుట) అహితములైన త్రివర్గముల నాచరించుటచే మానసమునకు సుఖరూపమైన యారోగ్యంబును, అహితముల నాచరించుటచేత దుఃఖంబును సంభవించునని భావము.) కావున నహితములగు వానిని వదలి హితములనే యాచరించుట ముఖ్యకర్తవ్యము.

మరియు అట్టి త్రివర్గముల జక్కగ నెరింగిన పెద్దల సేవించుటకు ప్రయత్నము చేయవలెను. ఆత్మజ్ఞానమునందును, దేశము, కాలము, బలము, శక్తి మున్నగువాని పరిజ్ఞానమునందును మిక్కిలి పూనికతో ప్రయత్నము చేయవలెను.

ఇచ్చట 'మానసవ్యాధిపరీతేనాపి' అను అపిశబ్దముచేత శరీరవ్యాధి కలవాడును త్రివర్గముల గమనించుటకు ముఖ్యముగ ప్రయత్నపడవలెనని యర్థము. (ఉద్దేశక్రమ

ములో "త్రయో రోగాః త్రయో రోగమార్గాః" అని చెప్పియున్నది కాని రోగ చికిత్స యుద్దేశింపబడలేదు. అయినను మానసరోగచికిత్స స్వల్పమగుటచేత నిచ్చట సూచనామాత్రముగ జెప్పబడెనని యెఱుంగునది.)

## మానసరోగచికిత్సానువాదసంగ్రహము.

మూ. భవతి చాత్ర:—

మానసం ప్రతి భైషజ్యం త్రివర్గస్యాన్వవేక్షణమ్,
తద్విద్యసేవా విజ్ఞానాం ఆత్మాదీనాం చ సర్వశః. ఇతి. ౫౩

వ్యా. త్రివర్గ (ధర్మార్థకామ)ముల జక్కగ గమనించుట, అట్టి త్రివర్గముల జక్కగ దెలిసినవారితో పరిచయముకల్గి యుక్తాయుక్తముల నరయుంట, ఆత్మ దేశ కాలాదుల జక్కగ నరయుంట ఇవి యన్నియు మానసరోగములకు దగిన చికిత్సయని యెఱుంగునది.

## మూడురోగమార్గములు వానివివరణము.

మూ త్రయో రోగమార్గా ఇతి—శాఖాః మర్మాస్థిసన్ధయః, కోష్ఠశ్చ. తత్ర శాఖాః రక్తాదయో ధాతవః త్వక్చ; స బాహ్యారోగ మార్గః, మర్మాణి పునః వస్తిహృదయమూర్ధాదీని, అస్థిసన్ధయః అస్థిసంయోగాః, తత్రోపనిబద్ధాశ్చ స్నాయుకణ్డరాః, స మధ్యమోరోగమార్గః, కోష్ఠః పునరుచ్యతే—మహాస్రోతః, శరీర మధ్యం, మహానిమ్నమామపక్వాశయశ్చేతి పర్యాయశబ్దైః తన్త్రే; స రోగమార్గ ఆభ్యన్తరః. ౫౪

వ్యా. శాఖలు, మర్మాస్థిసంధులు, కోష్ఠము అనునవి మూడును రోగములకు సంబంధించిన మూడు మార్గములని చెప్పబడును. అందు రక్తము మాంసము మేదస్సు అస్థి మజ్జ శుక్రము అను ధాతువులారును, త్వక్కును దాని నాశ్రయించిన రసధాతువును శాఖలనబడును. ఇవి రోగములకు బాహ్యమార్గము. (రక్తాదులు ఒకవృక్షమునకు కొమ్మలుబోలె బహిర్భూతములై యుండుటంజేసి శాఖాసదృశములని శాఖసంజ్ఞ చేయబడినది.)

వస్తి, హృదయము, శిరస్సు మున్నగునవి మర్మములు; అస్థులకు సంబంధించిన కీళ్లు అస్థిసంధులు, అట్టి యస్థుల నంటియుండు స్నాయువులు కండరములును అస్థిసంధులగును; అట్టి మర్మంబులును అస్థిసంధులును రోగములకు మధ్యమమార్గము.

కోష్ఠము మహాస్రోతస్సనియు, శరీరమధ్యంబనియు, మహానిమ్నమనియు, ఆమాశయంబనియు, పక్వాశయంబనియు, పర్యాయశబ్దములచే నీతంత్రమున జెప్పంబడును. ఇయ్యది రోగములకు అభ్యంతరమార్గము. (కోష్ఠమన శరీరములో నడమ పెద్దగుట్టవలె నుండు పెద్దప్రేగని యెరుంగునది.)

ఇచ్చట త్వక్కు అను శబ్దముచేత త్వక్కును ఆశ్రయించియుండు రసధాతువు గ్రహింపబడును. రసమని మాత్రము చెప్పినచో హృదయము నాశ్రయించిన రసమును గూడ చెప్పవలసివచ్చును. కావున అట్టి హృదయాశ్రిత రసమునకు శాఖాసంజ్ఞను నిరసించుటకై 'త్వక్చ'అని వేరుగ చెప్పబడినది. అట్టి హృదయాశ్రితమైన రసము మహాస్రోతస్సున జేరినది కావున కోష్ఠశబ్దముచే సంగ్రహింపబడును. ఈయుద్దేశము కోష్ఠమును వివరించునప్పుడు "స్థానాన్యామాగ్నిపక్వానాం మూత్రస్య రుధిరస్య చ, హృదుణ్డుకః పుఫుసశ్చ కోష్ఠ ఇత్యభిధీయతే"అని చెప్పబడినది. ఆమాశయము, పిత్తాశయము, పక్వాశయము, మూత్రాశయము, రక్తమున కాశ్రయమైన యకృత్ప్లీహములు, హృదయము, ఉండుకము, పుపుసము అనునవి యన్నియు కోష్ఠమని చెప్పబడునని యర్థము. (రోగముల సుఖసాధ్యత్వాది నిర్ణయమునకై బాహ్యము, మధ్యమము, అభ్యంతరము ననునరోగమార్గములు మూడువిధములుగ విభజింపబడినవని యెరుంగునది). రోగములు జనించుస్థానములు రోగమార్గమున జెప్పబడును.

## బహిర్మార్గజరోగములు.

మూ. తత్ర గణ్డపిడకాలజ్యపచీచర్మకీలాధిమాంసమషకకుష్ఠవ్యఙ్గాదయో వికారా, బహిర్మార్గజాశ్చ వీసర్పశ్వయథుగుల్మార్శోవిద్రధ్యాదయః శాఖానుసారిణో భవన్తి రోగాః. ౫౪

వ్యా. గలగండము, పిడక, అలజి, అపచి, చర్మకీలము, అధిమాంసము, మషకము, (శరీరముపైన ఉద్దిగింజవలెనుండు పుట్టుమచ్చ), కుష్ఠము, వ్యంగము (మంగు), ఇవి మున్నగురోగంబులును, బహిర్మార్గమున పుట్టినవిసర్పము, వాపు, గుల్మము, అర్శస్సు, విద్రధి మున్నగురోగంబులును పైజెప్పిన శాఖారూపమైన బహిర్మార్గము ననుసరించి పుట్టును. (ఇచ్చట 'బహిర్మార్గజాః' అనుపదము విసర్పాదుల కన్వయించుటచేత విసర్పాదులు బాహ్యమార్గము ననుసరించునవియే బాహ్యరోగములని చెప్పబడును. అయ్యవి అంతర్మార్గము నాశ్రయించి పుట్టునపుడు అంతర్మార్గజములని చెప్పబడునని యెరుంగునది.)

### మధ్యమమార్గజరోగములు.

మూ॥ పక్షవధగ్రహాఽపతానకార్దితశోష రాజయక్ష్మాస్థి సన్ధిశూల గుద
భ్రంశాదయః, శిరోహృద్వస్తిరోగాదయశ్చ మధ్యమమార్గాను
సారిణో భవన్తి రోగాః. ౪౮

వ్యా. పక్షవధము, పక్షగ్రహము, అపతానకము, అర్దితవాతము, ధాతుశోషము, రాజయక్ష్మము, అస్థిసంధుల (కీళ్ల)యందు పుట్టు పోటు, గుదభ్రంశము, మున్నగు రోగంబులును, శిరోరోగంబులును, హృదయరోగంబులును, వస్తిలో సంభవించు రోగంబులును, ఇవి మున్నగాగల రోగములన్నియుం మధ్యమమార్గమున సంభవించు రోగములు. (ఇచ్చట 'పక్షవధగ్రహ' అనుచోట పక్షశబ్దము వధగ్రహశబ్దములతో ప్రత్యేకముగ నన్వయించుటచే పక్షవధము, పక్షగ్రహము నని యర్థము సంగతమగును.)

### కోష్ఠజరోగములు.

మూ॥ జ్వరాతీసారచ్ఛర్ద్యల సకవిషూచికా కాస శ్వాస హిక్కా
నాహోదర ప్లీహాదయోఽన్తర్మార్గజాశ్చ వీసర్పశ్వయథు గుల్మా
ర్శోవిద్రధ్యాదయః కోష్ఠానుసారిణో భవన్తి రోగాః. ౪౯

వ్యా. జ్వరము, అతిసారము, ఛర్ది, అలసకము, విషూచి, కాసము, శ్వాసము, హిక్క, ఆనాహము, ఉదరము, ప్లీహము ఇవి మున్నగు రోగంబులును; అంతర్మార్గమున బుట్టిన విసర్పము, శ్వయథు (వాపు), గుల్మము, విద్రధి ఇవి మున్నగురోగములును కోష్ఠము ననుసరించి సంభవించును.

ఇచ్చట జ్వరము సర్వాంగవ్యాప్తమైనను "దోషాహ్యామాశయాశ్రయాః బహిర్నిరస్య కోష్ఠాగ్నిం జ్వరదా స్యుర్రసానుగాః" అను సంప్రాప్తియందు ఆమాశయమున పుట్టునని చెప్పినప్రకారము కోష్ఠజమని చెప్పబడినది. విసర్పాదిరోగములు త్వగాదుల నాశ్రయించినపుడు బాహ్యజములు. శరీరాంతర్మార్గమున జనించినవి కోష్ఠజము లన బడును. గుల్మము చర్మగతమైనపుడు బైట కనబడుచుండును. అంతర్భాగమున పుట్టినది కోష్ఠజము. అంతర్విద్రధి కోష్ఠమున పుట్టును. అర్శస్సు గుదస్థానమునందలి బాహ్యవళిలో బుట్టినది బాహ్యజము. లోపలివళిలలో బుట్టినది కోష్ఠజము.

### త్రివిధవైద్యులు.

మూ॥ త్రివిధా భిషజ ఇతి—
భిషక్ఛద్మచరాస్సన్తి సన్త్యేకే సిద్ధసాధితాః,
సన్తి వైద్యగుణైర్యుక్తాః త్రివిధాభిషజో భువి. ౫౦

వైద్యభాండౌషధైః పుస్తైః పల్లవైరవలోకనైః,
లభన్తే యే భిషక్ఛబ్ద మజ్ఞాస్తే ప్రతిరూపకాః. ౪౯
శ్రీయశోజ్ఞానసిద్ధానాం వ్యపదేశాదతద్విధాః
వైద్యశబ్దం లభన్తే యే జ్ఞేయాస్తే సిద్ధసాధితాః. ౫౦
ప్రయోగజ్ఞానవిజ్ఞానసిద్ధిసిద్ధాః సుఖప్రదాః,
జీవితాభిసరాస్తే స్యుః వైద్యత్వం తేష్వవస్థితమ్. ౫౧

వ్యా. వేషధారివైద్యుడు, సిద్ధసాధితవైద్యుడు, వైద్యగుణసంపన్నవైద్యుడు నని వైద్యులు మూడుతెరంగుల నుందురు. అందు వైద్యమునకు సంబంధించిన పాత్రములు, ఔషధములు, పుస్తకములు మొదలైన యుపకరణములమాత్రము బూని కడియములు మున్నగుబిరుదముల బెట్టికొని వైద్యునివలె నాడంబరముగ వేషధారులగు వైద్యులు జ్ఞానశూన్యులు. వీరు వైద్యులవలె దొంగవేషము బూనినవారు గాన వేషధారి యని చెప్పబడును.

కొందరువైద్యులు లోకమున సంపత్తును, కీర్తిని, జ్ఞానమును సంపాదించి ప్రశస్తి గాంచినవారితో తనకు సంబంధమును గల్పించుకొని వారిపేరును ఆధారముగ జేసికొని తానును వైద్యుడను పేరును సంపాదించి జీవించువాడు సిద్ధసాధితవైద్యుడని చెప్పబడును. అట్టివాడు వైద్యులపేరు చెప్పి జీవించుటంజేసి సిద్ధసాధితు డనబడును.

ఔషధముల ప్రయోగమునందును, జ్ఞానజనకమగు శాస్త్రాభ్యాసమునందును, చికిత్సాసిద్ధియందును పూర్ణమగుకౌశలమును సంపాదించి, రోగులకు రోగనివృత్తిరూప సుఖమును కల్గించుచు, ప్రాణముల కాపాడువైద్యులు కొందరు కలరు. అట్టివారికి వైద్యశబ్దము చెప్పదగియుండును. అట్టివాడు ప్రశస్తమైనవైద్యుడని చెప్పదగును.

### త్రివిధౌషధములు, వానివివరణము.

మూ. త్రివిధమౌషధమితి—దైవవ్యపాశ్రయం, యుక్తివ్యపాశ్రయం,
సత్వావజయశ్చ. తత్ర దైవవ్యపాశ్రయం—మన్త్రౌషధిమణి
మంగళబల్యుపహారహోమనియమప్రాయశ్చిత్తోపవాసస్వస్త్యయ
నప్రణిపాతగమనాది. యుక్తివ్యపాశ్రయం—పునరాహారౌ
షధద్రవ్యాణాం యోజనా. సత్వావజయః—పునః అహితేభ్యో
ఽర్థేభ్యః మనోనిగ్రహః. ౫౨

వ్యా. దైవవ్యపాశ్రయము, యుక్తివ్యపాశ్రయము, సత్వావజయము నని ఔషధము మూఁడువిధముల నుండును. (దేవతలప్రభావమునే ఆశ్రయించిన చికిత్స దైవవ్యపాశ్రయము, మంత్రజపము పూజావిధానాదులచేత దేవతల కనుగ్రహము కల్గి అట్టియనుగ్రహబలము నాశ్రయించి వ్యాధుల శమింపజేయుటకు బూనుట దైవవ్యపాశ్రయమని భావము. యుక్తియన నౌషధాదులను విధ్యుక్తముగ మార్చుట; దాని నాశ్రయించిన చికిత్స యుక్తివ్యపాశ్రయము. సత్వమనగ మనస్సు. అట్టిమనస్సును ఇంద్రియముల వెంట బోనీయక స్వవశమున నుండునట్లు జేసికొనుట సత్వావజయము.)

ఆమూటిలో మంత్రములు, సిద్ధక్రియారూపమైన యోషధులు, మణులు, మంగళకరములగు కృత్యములు, పూజావిధానములు, దేవతాప్రీతికరములగు నుపహారములు, హోమములు, వ్రతాదినియమములు, దోషశామకములగు ప్రాయశ్చిత్తములు, నిరశనవ్రతము, స్వస్తివాచనము, సూర్యనమస్కారములు మున్నగు విధానములు, దూరమున నుండు దేవతీర్థాదుల నుద్దేశించిన తీర్థయాత్రలు, ఇవి మున్నగునవి దేవతానుగ్రహసంపాదకములు కావున అట్టివిధానముల నాచరించుట దైవవ్యపాశ్రయరూపమైన చికిత్స యగును.

ఆహారమును, ఔషధములను, ఔషధద్రవ్యములను, ఆయా వ్యాధ్యనుసారముగ దోషదూష్యాదుల గమనించి, దేశకాలసత్వసాత్మ్యానుగుణముగ దనయూహాచే గల్పించి యుపయోగించుట యుక్తివ్యపాశ్రయౌషధ మగును. మనస్సును దానిచ్చవచ్చినవిధముగ పోనియ్యక స్వాయత్తము జేసికొని అహితములగు విషయముల నుండి యింద్రియాదుల మరలించుట సత్వావజయరూపమైన ఔషధము. ఇత్తెరంగున ఔషధము మూఁడు తెరంగుల సంగ్రహముగ జెప్పబడినది.

### ప్రకారాంతరమున త్రివిధ ఔషధములు.

మూ. శరీరదోషప్రకోపే ఖలు శరీరమే వాశ్రిత్య ప్రాయశస్త్రివిధ మౌషధమిచ్ఛన్తి.—అన్తఃపరిమార్జనం, బహిఃపరిమార్జనం, శస్త్రప్రణిధానం చేతి. తత్ర యదన్తఃపరిమార్జనం యదన్తశ్శరీరమనుప్రవిశ్య ఔషధమాహారజాతవ్యాధీన్ పరిమార్ష్టి. ౬౩

యత్పునః బహిస్స్పర్శమాశ్రిత్య అభ్యఙ్గస్వేదప్రదేహాపరిషేకోన్మర్దనాద్యైః ఆమయాన్ ప్రమార్ష్టి తద్బహిఃపరిమార్జనమ్.

శస్త్రప్రణిధానం పునః ఛేదనభేదనవ్యధనదారణలేఖనోత్పాటనప్రచ్ఛనసీవనైషణక్షారజలౌకసశ్చేతి. ౬౫

వ్యా. ప్రాయికముగ శరీరమునకు సంబంధించిన వాతాదిదోషములు శరీరము నాశ్రయించియే ప్రకోపించినపుడు, అన్తఃపరిమార్జనము, బహిఃపరిమార్జనము, శస్త్రప్రణిధానమునని మూడువిధములైన యౌషధములు ఇచ్ఛయింపబడును. అందు శరీరాంతర్భాగమున (లోపల) ప్రవేశించి ఆహార వ్యత్యయమున గల్గినవ్యాధులను శమింపజేసి పరిశుద్ధముగ జేయునౌషధము అన్తఃపరిమార్జన మనబడును. (శరీరాంతర్భాగమును రోగముల పోనడచి శుభ్రపరచునది అన్తఃపరిమార్జనమని భావము. ఈయర్థము "అన్తః పరిమార్ష్టి ఇతి అన్తః పరిమార్జనం" అను వ్యుత్పత్తిచేత యోగరూఢసంజ్ఞ యని యెరుంగునది. బహిఃపరిమార్జన మనునదికూడ నిట్టె వ్యుత్పత్తిచే సిద్ధము.)

శరీరమున పైభాగమున చర్మముపై స్పర్శముచేత రోగముల నివృత్తిచేసి శుభ్రపరచునది బహిఃపరిమార్జనము. అయ్యది అభ్యంగనము, స్వేదము (చెమట బుట్టించుట), ప్రదేహము (పట్టువేయుట), పరిషేకము (కషాయాదులచే దడపుట), ఉన్మర్దనము (శరీరమును పిసికించుట), ఇవి మున్నగు విధానములచే శరీరస్పర్శము కల్గించి దానంజేసి రోగనివృత్తిజేసి శుభ్రపరచునది బహిఃపరిమార్జనరూపచికిత్స యగును.

శస్త్రముల నుపయోగించి చేయుచికిత్స శస్త్రప్రణిధాన మనబడును. అయ్యది ఛేదనము, భేదనము, వ్యధనము, దారణము, లేఖనము, ఉత్పాటనము, ప్రచ్ఛనము, సీవనము, ఏషణము, క్షారము, జలౌకములు నని శస్త్రచికిత్సయందు సుప్రసిద్ధముగ జెప్పబడినది. (ఇది శస్త్రసాధ్యములగు వ్రణాదులయందు చేయదగినది కావున శస్త్రప్రణిధాన మనబరంగును.)

## ఉక్తానువాదము.

మూ. తత్ర శ్లోకాః—

ప్రాజ్ఞో రోగే సముత్పన్నే బాహ్యేనాభ్యన్తరేణ వా,
కర్మణా లభతే శర్మ శస్త్రోపక్రమణేన వా. ౬౬
బాలస్తు ఖలు మోహాద్వా ప్రమాదాద్వా న బుధ్యతే,
ఉత్పద్యమానం ప్రథమం రోగం శత్రుమివాఽబుధః. ౬౭
అణుర్హి ప్రథమం భూత్వా రోగః పశ్చాద్వివర్ధతే,

## రోగిభేదములు.

స జాతమూలో ముష్ణాతి బలమాయుశ్చ దుర్మతేః. ౬౮
న మూఢో లభతే సంజ్ఞాం తావద్యావన్న పీడ్యతే,
పీడితస్తు మతిం పశ్చాత్ కురుతే వ్యాధినిగ్రహే. ౬౯
అథ పుత్రాంశ్చ దారాంశ్చ జ్ఞాతీంశ్చాహూయ భాషతే,
సర్వస్వేనాపి మే కశ్చిద్భిషగానీయతామితి. ౭౦
తథావిధం చ కశ్శక్తో దుర్బలం వ్యాధిపీడితమ్,
కృశం క్షీణేన్ద్రియం దీనం పరిత్రాతుం గతాయుషమ్. ౭౧
స త్రాతారమనాసాద్య బాలస్త్యజతి జీవితమ్,
గోధా లాఙ్గూలబద్ధేవాఽఽకృష్యమాణా బలీయసా. ౭౨
తస్మాత్ప్రాగేవ రోగేభ్యో రోగేషు తరుణేషు వా,
భేషజైః ప్రతికుర్వీత య ఇచ్ఛేత్సుఖమాత్మనః. ౭౩

వ్యా. బుద్ధిమంతుడగురోగి తనకు రోగము సంభవించినక్షణముననే అంతఃపరిమార్జనము బహిఃపరిమార్జనము శస్త్రప్రణిధానము నని పైన మూడువిధములుగ జెప్పబడిన యుపాయముల నెద్దానినైన చేసికొనినచో రోగనివృత్తిరూపమైనసుఖమును పొందగలడు. అటుగాక తెలివిమాలినరోగి శత్రువుబోలె తనకు ప్రాణహానికరమైనరోగమును తెలివితక్కువచేతను పొరపాటుచేనైనను ప్రారంభదశయందే దెలిసికొనక యుపేక్షించినచో సూక్ష్మరూపముగ నున్నయారోగము నానాట సూక్ష్మాగ్నిబోలె వృద్ధినొంది దృఢముగ నేర్పడి అసాధ్యస్థితికి వచ్చును. అట్టిసమయమున వైద్యుడు కొంచెము తెలివి తెచ్చుకొని ఆవ్యాధిచేత మిక్కిలి బాధపడుచు ఆవ్యాధిని శమింపజేయ ప్రయత్నపడును. అట్టిసమయమున తనకొడుకులను, భార్యను, జ్ఞాతులను, బంధువులను మున్నగువారిని బిలిపించి తనసర్వస్వమునైన వ్యయపరచి చికిత్స జేసికొనవలెను. కావున నొకవైద్యుని బిలిపింపుడని వారితో చెప్పును. శరీరము కృశించి ఇంద్రియములు క్షీణించి బలహీనుడై దీనభావము నొందిన యారోగపీడితుని కాపాడుటకు యేవైద్యుడు వాని చెంతకు పోవును? ఒక్కడును వానిచెంత జేరడు. కావున తగినవైద్యునిసహాయము లేక ఆ తెలివిమాలినరోగి బలిష్ఠమైన వృషభముయొక్క తోకకు కట్టబడిన ఉడుమువలె దైవముచే లాగబడినవాడై తుట్టతుదకు ప్రాణముల గోలుపోవును. కావున రోగి మిక్కిలి జాగరూకుడై రోగము ప్రారంభించక మునుపైనను, ఒకవేళ పొరబాటుచే సంభవించినను నారోగముల ప్రారంభదశయందైనను తగిన వైద్యుని వెదకి వానిసహాయముచే

పైజెప్పిన మూడువిధములైన చికిత్సలమూలమున రోగములకు ప్రతీకార మొనర్చుటకు ప్రయత్నించవలయును. తనకు సుఖమును గోరువాడు పైజెప్పినక్రమమును గమనించి మిక్కిలి మెలకువతో మెలంగుట ముఖ్యకర్తవ్యము. అని ప్రకరణభావము.

## అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః—

విషణాస్సముపస్తంభాః బలం కారణ మామయాః,
త్రిస్త్రైషణీయే మార్గాశ్చ భిషజో భేషజాని చ. ౨౪
త్రిత్వేనాష్టౌ సముద్దిష్టాః కృష్ణాత్రేయేణ ధీమతా,
భావాః భావేష్వసక్తేన యేషు సర్వం ప్రతిష్ఠితమ్. ఇతి. ౨౫

వ్యా. ఈ తిస్త్రైషణాధ్యాయమునందు మూడువిధములయిన ఏషణములు, మూడు ఉపస్తంభములు, త్రివిధబలము, మూడువిధములయిన రోగకారణములు, మూడువిధములయిన రోగములు, మూడు రోగమార్గములు, త్రివిధవైద్యులు, త్రివిధౌషధములు అను నీయెనిమిదివిషయములును విషయాసక్తిలేని కృష్ణాత్రేయమహామునిచే నుపదేశింపబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
తిస్త్రైషణీయో నామ ఏకాదశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున అగ్నివేశకృతంబును చరకమహర్షిచే పరిష్కరింపబడినదియు నగు నాయుర్వేదతంత్రమునందు సూత్రస్థానము తిస్త్రైషణీయమనునది పదునొకండవ యధ్యాయము సమాప్తము.

## ద్వాదశాధ్యాయము.

అవతారిక:—పూర్వాధ్యాయమున త్రివిధరోగములును, వానిస్వరూపము, మార్గములు, బాహ్యరోగకారణములు, వాని యౌషధములును చెప్పబడినవి. అట్టిరోగములకు కారణములైన వాతాదుల జెప్పుట యావశ్యకమైనను త్రిదోషవిషయమై చెప్పవలసినయంశములు చాల విపులములగుటచే పూర్వాధ్యాయమున జెప్పక ప్రత్యేకముగ నీయధ్యాయమున చెప్పబడును.

మూ. అథాతో వాతకలాకలీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవా నాత్రేయః. ౨

వ్యా. తిస్రైషణీయాధ్యాయమును జెప్పినపిదప వాతముయొక్క గుణదోషముల దెలుపునట్టి వాతకలాకలీయ మనునధ్యాయమును త్రికాలజ్ఞానవేత్త యగునాత్రేయుం డుపదేశించిన యానుపూర్వికి న్యూనాతిరేకము కాకుండ వివరించెదనని యర్థము.

'షోడశకలం' ఇత్యాదిస్థలములందు కలాశబ్దమునకు గుణమని యర్థము కనబడు చున్నది కావున ప్రకృతమునను కలాశబ్దముచేత గుణమని యర్థము గ్రహింపబడును. కలకు (గుణమునకు) విరుద్ధమైనది అకల (దోషము) కలాశ్చ, అకలాశ్చ కలాఽకలాః, వాతస్య కలాఽకలాః—వాత కలాఽకలాః, తాః అధికృత్య కృతోఽధ్యాయః—వాత కలాఽకలీయః" అను విగ్రహము చేత వాతమునకు సంబంధించిన గుణములను దోషము లను అధికరించి చెప్పునట్టి యధ్యాయము. 'వాతకలాకలీయము' అని యధ్యాయమునకు సంజ్ఞ చెప్పబడినది. లేక కలాశబ్దమునకు సూక్ష్మాంశమని యర్థము. 'కలాశ్చ కాలాశ్చ కలాకలాః' అను విగ్రహము చేత వాతమునకు సంబంధించిన సూక్ష్మాంశములలో మిక్కిలి సూక్ష్మములైన యంశములను వివరించు నధ్యాయము వాతకలాకలీయమని యర్థమును చేయనగును. దోషములలో వాతము ప్రధానము కావున అట్టివాతమును ప్రధానముగ జేసి యధ్యాయసంజ్ఞ చెప్పబడినది; కాని పిత్తకఫముల గుణములను ఈయధ్యాయమున వివరింపబడునని యెరుంగునది.

### వాతగుణదోషములగురించి ఋషుల సంభాషణము.

మూ. వాతకలాకలాజ్ఞానమధికృత్య పరస్పరమతాని జిజ్ఞాసమానాః, సముపవిశ్య మహర్షయః పప్రచ్ఛురన్యోఽన్యమ్:—"కిం గుణో వాయుః? కిమస్య ప్రకోపనమ్? ఉపశమనానివాస్య కాని? కథం చైనమసంఘాతవన్తమనవస్థితమనాసాద్య, ప్రకోపనప్రశమనాని ప్రకోపయన్తి? ప్రశమయన్తి వా? కాని చాస్య కుపితాఽకుపి తస్య, శరీరాశరీరచరస్య శరీరేషు చరతః కర్మాణి? బహిశ్శరీరే భ్యో వా?" ఇతి. 3

వ్యా. కొందరుమహర్షులు ఒక్కచోట విశ్రాంతిగ సభచేరి వాతముయొక్క గుణ దోషములను నిర్ణయించుటకై యచ్చట జేరినఋషుల సిద్ధాంతమతముల నరయగోరి సుఖాసీనులై యొండొరుల నిట్లు ప్రశ్న జేసికొనిరి.—

వాత మెట్టిగుణములు కల్గినది? దానిని ప్రకోపింపజేయునది యేది? ప్రకోపము నొందినవాతమును శమింపజేయునవి యెవ్వి? వాతము పిత్తకఫములవలె అవయవవిశిష్ట

రూపము కల్గినదికాదు; రూపములేనిది. చంచలస్వభావము కల్గినది యగుటచే నొక్కచోట నిల్కడలేనిది. కావున అట్టిగుణములు కల్గినవాతముతో దాని ప్రకోపింపజేయు కారణములైన యాహారాదిపదార్థములకును, శమింపజేయుపదార్థములకును సంబంధము కల్గనేరదు. అట్టియెడ వాతముతో సంబంధము బొత్తిగ లేక ప్రకోపనము లెట్లు ప్రకోపింపజేయును? అట్టిసంబంధము లేకయే ప్రశమనము లెట్లు వాతము శమింప సమర్థము లగును? (వాతము శరీరమున సంచరించునది యొకటి, బాహ్యప్రదేశమున సంచరించునది యొకటి. ఈరెండుప్రదేశముల సంచరించు స్వభావము వాతమునకు కలదు) అందు శరీరమున సంచరించువాతము ప్రకోపించినచో నేమేమిపనుల జేయును? బాహ్యప్రదేశమున సంచరించువాతము ప్రకోపము నొందినచో నేమేమిపనుల జేయును? (అని యుత్తరంగున వాతముయొక్క గుణాదుల నరయగోరి ఋషులు పరస్పరము ప్రశ్నజేసికొనిరని యర్థము.)

ఇచ్చట ననేకఋషుల సంభాషణరూపముగ వాతవిషయమై చర్చించి చెప్పునది యనేక ఋషిసమ్మతమును దెలుపుటచే ప్రామాణికమని యెఱుంగునది.

### వాతమునకు స్వాభావికగుణములు.

మూ. అత్రోవాచ కుశస్సాంకృత్యాయనః—రూక్షలఘుశీతదారుణ ఖరవిశదాః షడిమే వాతగుణా భవన్తి. ౪

వ్యా. పై జెప్పిన ఋషిసమాజములో సాంకృతి యనుఋషికి పుత్త్రుడైన కుశుడను మునిపుంగవుడు వాతగుణముల నుద్దేశించి యిట్లు చెప్పెను:—రూక్షత్వము (జిడ్డు లేకుండుట), శీతత్వము (చల్లదనము), లఘుత్వము (తేలిక), దారుణత్వము (శోషింప జేయుస్వభావము), ఖరత్వము, విశదత్వము అను నీయాఱును వాతమునకు స్వభావసిద్ధము లగు గుణములు. (ఇచ్చట రూక్షాదిశబ్దములు భావప్రధానముగ నిర్దేశింపబడినవి.)

### వాతప్రకోపనములు.

మూ. తచ్ఛ్రుత్వా వాక్యం కుమారశిరా భరద్వాజ ఉవాచ:—ఏవ మేతద్యథా భగవానాహ:—ఏత ఏవ వాతగుణా భవన్తి; స తు ఏవంగుణైరేవం ద్రవ్యైరేవం ప్రభావైశ్చ కర్మభిః అభ్యస్యమానైః వాయుః ప్రకోపమాపద్యతే. సమానగుణాభ్యాసో హి ధాతూనాం వృద్ధికారణమితి. ౫

వ్యా. పైజెప్పిన వాక్యమును విని కుమారశిరయను నామాంతరముకల భరద్వాజుడిట్లు చెప్పెను:—నీవు జెప్పినవి యారేవాతమునకు జేరినగుణములు. ఈవిషయమున

సంశయములేదు. అట్టి రూక్షత్వాది గుణములు కలద్రవ్యములచేతను, అట్టి ప్రభావము కల కర్మలచేతను వాతము ప్రకోపించును. సమానములగు గుణములు కల ద్రవ్యాదులచే ధాతువులు వృద్ధినొందును కావున వాతమునకు సమానములైన రూక్షత్వాదులుకల ద్రవ్యములను అట్టిప్రభావము కలపనులను పలుమారు అభ్యాసము చేసినయెడల వాతము ప్రకోపించునని భావము.

"వృద్ధిస్సమానైస్సర్వేషాం" అనుప్రమాణము ననుసరించి సమానగుణసంబంధము చేత వాతము ప్రకోపించునని యెరుంగునది. ఇచ్చట "కుమారశిరా భరద్వాజ" అని చెప్పుటచేత నితడు ఆత్రేయునకు గురువైన భరద్వాజునకన్న నితరుడని యెరుంగునది.

### వాతప్రశమనములు.

మూ. తచ్ఛ్రుత్వా వాక్యం కాఙ్కాయనో బాహ్లీకభిషగువాచ:— ఏవమేతద్యథా భగవానాహ; ఏతాన్యేవవాతప్రకోపనాని భవన్తి. అతో విపరీతాని వాతస్య ప్రశమనాని భవన్తి. ప్రకోపన విపర్యయో హి ధాతూనాం ప్రశమనకారణ మితి. ౬

వ్యా. ఆవాక్యమును విని బాహ్లీకవైద్యుడైన కాంకాయనుడను మునివరుడు ఇట్లు సెప్పెను:—మీరు చెప్పినది నిజము. వాతము ప్రకోపించు కారణములు మీరు చెప్పినవియే యగును. వాతాది దోషములకు విపరీతగుణాదులచే శాంతి కల్గును కావున వాతమును జెప్పిన గుణములకన్న విపరీతములగు స్నిగ్ధత్వాదిగుణములు కలద్రవ్యముల చేతను, అట్టి ప్రభావముకల కర్మలచేత వాతము శాంతినొందును.

### వాతమునకు ప్రకోపప్రశమనములు కల్గుక్రమము.

మూ. తచ్ఛ్రుత్వా వాక్యం బడిశో ధామార్గవ ఉవాచ:—ఏవమేతద్యథా భగవానాహ; ఏతాన్యేవ వాతప్రకోపప్రశమనాని భవన్తి యథా హ్యేనమసఙ్ఘాతమనవస్థితమాసాద్య ప్రకోపన ప్రశమనాని ప్రకోపయన్తి ప్రశమయన్తి వా, తథానువ్యాఖ్యాస్యామః. వాతప్రకోపనాని ఖలు రూక్షలఘుశీతదారుణ ఖరవిశదసుషిరకరాణి శరీరాణామ్. తథావిధేషు శరీరేషు వాయురాశ్రయం గత్వా ఆప్యాయ్యమానః ప్రకోపనమాపద్యతే. వాతప్రశమనాని పునః స్నిగ్ధగురూష్ణశ్లక్ష్ణమృదుపిచ్ఛిల

ఘనకరాణి శరీరాణామ్, తథావిధేషు శరీరేషు వాయురాసజ్య
మానశ్చరన్ ప్రశాన్తి మాపద్యతే. ౭

వ్యా. ఆమాటల విని ధామార్గవుడను నామాంతరముకల బడిశుడు మునివరుడు ఇట్లు చెప్పెను:—మీరు చెప్పిన వాతప్రకోపమును శమింపజేయునవి కారణములు వాస్తవ్యములు, మీరు చెప్పినవిధముగనే ప్రకోపనములకు గలగుణములకన్న విరుద్ధగుణములు కల్గినవి యే వాతప్రశమనములగును. మరియు రూపము లేమింజేసి ఘనపదార్థము గాక చలనస్వభావము కలవాతముతో సంబంధము మనకుండినను ప్రకోపనములు ప్రకోపము నొందించు విధమును ప్రశమనములు శమింపజేయు విధమును వివరించెద. ఎట్టులన:—

వాతము పైజెప్పినరీతిగ రూక్షత్వాదిగుణములు కల్గియుండును కదా. అట్టివాతమునకు సహజములైన రూక్షత్వలాఘవశీతదారుణఖరవిశదసుషిరగుణములు కలద్రవ్యములు మున్నగువానిచే నానాట సంబంధము కల్గి వానిచే పోషింపబడిన శరీరావయవములతో సంబంధము కల్గినవాతము తనకు సంబంధించిన గుణములతో సంబంధము కల్గినవియగును. అట్టి సమానగుణసంబంధమునంజేసి వాతము ప్రకోపమునొందును. అట్లైరంగునసే వాతనిష్ఠగుణములకు విరుద్ధములై స్నిగ్ధగురు ఉష్ణశ్లక్ష్ణమృదుపిచ్ఛిల ఘనములను గుణములుకలవానిచే పోషింపబడిన అవయవములు అట్టి స్నిగ్ధాదిగుణములు కల్గియుండును. అట్టి విరుద్ధగుణములచే వృద్ధినొందిన అవయవముల నాశ్రయించి సంచరించువాతము విరుద్ధగుణసంబంధమునంజేసి తన ప్రకోపము నుడుగును. (కావున వాతమునకు సమానగుణసంబంధముచే ప్రకోపంబును, విరుద్ధగుణసంబంధముచే ప్రకోపశాంతియు శరీరసంబంధమూలకమని భావము.)

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—వాతము రూపవంతము కాదు కావున వాతవృద్ధికర ద్రవ్యములకైనను, వాతప్రశమనకర ద్రవ్యములకైనను వాతముతో నొకప్పుడు ప్రత్యక్షముగ సంబంధము (స్పర్శము) కల్గ నేరదు. అయినను అట్టి గుణములు కలద్రవ్యసంబంధముచే పోషింపబడిన శరీరమున సంస్కారవశమునంజేసి ద్రవ్యనిష్ఠ వాతవర్ధక గుణంబులైనను, వాతశామకగుణంబులైనను సంక్రమించును. అట్టిశరీరము నాశ్రయించి సంచరించు వాతమునకు శరీరసంబంధ మూలమున సమానగుణసంబంధము కల్గి వృద్ధినొంది ప్రకోపించును. సమానగుణములకు విరుద్ధములైన గుణసంబంధముచే శాంతి నొందును. అని ఫలితార్థము.

## సమస్థితినున్న శారీరవాతకృత్యములు.

మూ. తచ్ఛ్రుత్వా బడిశవచనం అవితథమృషిగణైరనుమతం ఉవాచ వార్యోవిదో రాజర్షిః.—ఏవమేతత్సర్వమనపవాదం యథా భగవానాహ; యాని ఖలు వాయోః కుపితాఽకుపితస్య శరీరాఽశరీరచరస్య చ శరీరేషు చరతః కర్మాణి, బహిశ్శరీరేభ్యో వా భవన్తి; తేషామవయవాన్ ప్రత్యక్షాఽనుమానోపమానైః సాధయిత్వా నమస్కృత్య వాయవే యథాశక్తి ప్రవక్ష్యామః.—

వాయుస్తన్త్రయన్త్రధరః, ప్రాణోదానసమానవ్యానాపానాత్మా, ప్రవర్తకః చేష్టానాముచ్చావచానాం, నియన్తా ప్రణేతా చ మనసః, సర్వేన్ద్రియాణా ముద్యోజకః, సర్వేన్ద్రియార్థానామభివోఢా, సర్వశరీరధాతువ్యూహకరః, సంధానకరశ్శరీరస్య, ప్రవర్తకో వాచః, ప్రకృతిః స్పర్శశబ్దయోః, శ్రోత్రస్పర్శనయోర్మూలమ్, హర్షోత్సాహయోః యోనిః, సమీరణోఽగ్నేః, దోషసంశోషణః, క్షేప్తా బహిర్మలానామ్, స్థూలాణుస్రోతసాం భేత్తా, కర్తా గర్భాకృతీనామ్, ఆయుషోఽనువృత్తిప్రత్యయభూతో భవత్యకుపితః.

వ్యా. పైజెప్పిన బడిశునివాక్యమును ఋషులందరును నిక్కమనిసమ్మతించినదానిని విని వార్యోవిదు డనురాజర్షి యిట్లు చెప్పదొడంగెను:—మహనీయా ! నీవు చెప్పిన వాక్యము అనపవాదము (పూర్వపక్షము) లేనిది. శరీరమునందలి కుపితమైనవాయువు యొక్క వ్యాపారములను, శరీరమున ప్రకోపమునొందక సమస్థితినుండు వాతముయొక్క కృత్యములను, బాహ్యవాతము ప్రకోపమునొంది చేయుకృత్యములను, ప్రకోపము నొందక సమస్థితినుండు బాహ్యవాతము చేయుకృత్యములను, ప్రత్యక్షానుమానోపమానములను ప్రమాణములచే సాధించి, వాయుదేవునకు నమస్కరించి, అట్టికృత్యముల నన్నిటిని చెప్ప వీలుకాకున్నను వానిలో కొన్నిటిని నాశక్తికొలది చెప్పెదను:—

వాయువు తంత్రాత్మకమగుశరీరమును యంత్రముబోలె ధరించును. ప్రాణము, ఉదానము, సమానము, వ్యానము, అపానము నని అవస్థాభేదములచే నామాంతరములు కల్గి పంచస్వరూపముతో నీశరీరమున సంచరించుచు ధరించుచుండును. పలుదెరంగులైన

యాంగికాదిచేష్టలను నడిపించును. మనస్సును తనకిచ్ఛవచ్చినట్లుపోనీయక నియమనము చేసి మనస్సుకు సంబంధించిన చింత్యాదివిషయములయందు ప్రవర్తింపజేయును. (మనసుకు ఇష్టముకానివిషయముల ప్రవర్తింపనీయక మరలించుటకును, ఇష్టవిషయములయందు ప్రవర్తింపజేయుటకును వాయువు ప్రేరణచేయునని భావము) జ్ఞానేంద్రియకర్మేంద్రియములనన్నిటిని వానివానికృత్యములయందు పురికొల్పును. ఇంద్రియార్థములనన్నిటిని యింద్రియమూలముగ మనస్సమీపమునకు గొనిపోవును. శరీరమునందలి రసరక్తాదిధాతువులనన్నిటిని ఒండొంటజేర్చును. శరీరావయవముల నొండొంట సంబంధము కల్గునట్లుచేయును. వాక్కును (మాటలను) వెడలింపజేయును. స్పర్శమునకును శబ్దమునకును మూలకారణము. స్పర్శనేంద్రియమునకును, శ్రవణేంద్రియమునకును మూలకారణము, సంతోషమునకును మానసికమైన యుత్సాహమునకును ఉత్పత్తికారణము. కాయాగ్నిని ప్రేరేపించి వృద్ధినొందించును. శరీరమునందలి ద్రవరూపమైనదోషమును శోషింపజేయును. పురీషాదిమలములను బైట వెడలించును. శరీరమునందలిస్థూలములును అణు(సూక్ష్మ)రూపములును నగురంధ్రములను భేదించును. గర్భముయొక్క ఆకృతిని చేయును. ఆయువు అనువర్తించియున్నది యనునమ్మకమును కల్గించును. (వాతసంబంధములేనినాడు ఆయువు లేదనియు వాయుసంబంధమున్నపుడు ఆయువున్నదనియు తెలియుచున్నదికావున దానికి అట్టినమ్మకమునకు కారణమగునని భావము) ఇట్టికృత్యములను శరీరమున సంచరించువాతము ప్రకోపమునొందక సమస్థితినున్నపుడుచేయును.

### ప్రకుపితశారీరవాతకృత్యములు.

మూ. కుపితస్తు ఖలు శరీరే శరీరం నానావిధై ర్వికారై రుపతపతి, బల
వర్ణసుఖాయుషా ముపఘాతాయ, మనో వ్యాహర్షయతి, సర్వే
న్ద్రియాణ్యుపహన్తి, వినిహన్తి గర్భాన్, వికృతిమాపాదయ
త్యతికాలం ధారయతి, భయశోకమోహదైన్యాతిప్రలాపాన్
జనయతి, ప్రాణాంశ్చోపరుణద్ధి.

వ్యా. పైజెప్పినరీతిగ స్వసమానగుణములచేవృద్ధినొంది శరీరమున ప్రకోపమునొందినవాతము శరీరమును పలుచెరంగులైనరోగములచే తపింపజేయును. దానంజేసి శరీరముయొక్క బలమును, వర్ణమును, సుఖమును, ఆయువును చెరచును. (ఈబలవర్ణాదుల చెరచుటకై యనేకరోగములచే శరీరమును తపింపజేయునని భావము). మనసును కలతనొందించును. చక్షురాదీంద్రియములనన్నిటిని వానివానికృత్యముల జేయనీయక బాధించును. గర్భములను చెరచును. లేక గర్భములకు వికారమును (రోగమును) కల్గించును. లేక

చాలకాలమువరకు (నియతకాలము నతిక్రమించి) యుండునట్లు చేయును. భయము, శోకము, మోహము, దీనత్వము మున్నగు మానసికరోగముల గల్గించును. ప్రలాపమును (సంబంధము లేక వదరుట) కల్గించును. ప్రాణముల బిగబట్టి వెడలించును.

సమష్టిలినుండు బాహ్యవాయుకృత్యములు.

మూ. ప్రకృతిభూతస్య ఖల్వస్య లోకే చరతః కర్మాణీమాని భవన్తి; తద్యథా:—ధరణీధారణం, జ్వలనోజ్జ్వాలనమ్, ఆదిత్యచన్ద్ర నక్షత్రగ్రహగణానాం సన్తానగతివిధానమ్, సృష్టిశ్చ మేఘానామ్, అపాం విసర్గః, ప్రవర్తనం స్రోతసామ్, పుష్పఫలానాం చాభినిర్వర్తనమ్, ఉద్భేదనం చౌద్భిదానామ్, ఋతూనాం ప్రవిభాగః, ప్రవిభాగో ధాతూనామ్, ధాతుమానసంస్థాన వ్యక్తిః, బీజాభిసంస్కారః, సస్యాభివర్ధనం అవిక్లేదోపశోషణే, అవైకారికవికారాశ్చేతి ౧౦

వ్యా. న్యూనాధిక్యము లేక సమష్టిలినుండు బాహ్యవాతము ఈక్రింద వివరింపబడు కృత్యములజేయును:—భూమిని ధరించును. అగ్నిని జ్వలింపజేయును. సూర్యుడు చంద్రుడు నక్షత్రములు నవగ్రహములు మున్నగువాని సమూహమునకు ఒకటితో నొకటి సంబంధమును కల్గించి వానిని సంచరింపజేయును. మేఘముల నుత్పత్తిజేయునది. మేఘములనుండి వర్షధారారూపమున జలమును వెడలించును. నదీనదములను ప్రవహింపజేయును. పువ్వులను కాయలను ఫలములను పుట్టించును. ఓషధులు మున్నగు నౌద్భిదములను మొలపించును. ఋతువులను గ్రీష్మాదిభేదములచే విభజించును. బంగారు మున్నగు ధాతువులను వేర్వేరుగ విభజించును. బంగారు, వెండి, కావిరాయి మున్నగు ధాతువుల యునికికిని పరిమాణమునకును ఆకారమునకును కారణమై యుండును. పలుతెరంగులైన విత్తనములను మొలచుటకు దగినసంస్కారము నొందించును. పైరులను వృద్ధినొందించును. వానిని కుళ్లనీయక ఎండనీయకచేయును. ఫలములు మున్నగువానిని అవి కుళ్లుటకు తగినద్రవమును శోషింపజేయును. లోకమునందుండు సకల పదార్థములను, కాలాది వైపరీత్యముచే కల్గువికారమును బెందనీయక కాపాడును.

ప్రకుపితబాహ్యవాయుకృత్యములు.

మూ. ప్రకుపితస్య ఖల్వస్య లోకేషు చరతః కర్మాణీమాని భవన్తి; తద్యథా:—శిఖరిశిఖరావమథనం, ఉన్మథనమనోకహానామ్,

ఉత్పీడనం సాగరాణామ్, ఉద్వర్తనం సరసామ్, ప్రతిసరణ
మాపగానామ్, ఆకంపనం చ భూమేః, ఆధమనమంబుదానామ్,
నీహారనిర్హ్రాదపాంసుసికతామత్స్యభేకోరగక్షారరుధిరాశ్మాశని
విసర్గః, వ్యాపాదనం చ షణ్ణామృతూనామ్, సస్యానామసంఘాతః,
భూతానాం చ ఉపసర్గః, భావానాం చ అభావకరణం, చతుర్యు
గాంతకరాణాం మేఘసూర్యానలానిలానామ్ విసర్గః. ౧౧

వ్యా. బాహ్యలోకమున సంచరించువాతము (గాలి) మిక్కిలి ప్రకోపము నొందినచో నీక్రింద చెప్పబడు పనులజేయును. ఎట్టులన:—పర్వతములయొక్క శిఖరములను పెకలించి పడద్రోయును. గొప్పవృక్షములను వ్రేళ్లతో పెకలించును. సముద్రములను అల్లకల్లోలము చేయును. సరస్సులను పొంగ పొరలించును. నదులను ఎదురుగ ప్రవహింపజేయును. భూమిని వడవడ వణకించును. మేఘముల నెగరగొట్టును. మంచు, మేఘగర్జనము, ధూళి, ఇసుక, మత్స్యములు, కప్పలు, సర్పములు, క్షారము, రక్తము, పిడుగులు, రాళ్లు వీనిని ఆకసమునుండి భూమిపై బడవైచును. ఆయాఋతువులకు స్వభావసిద్ధముగనుండు శీతోష్ణవర్ష గుణములను వ్యత్యాసముగ (ఒకఋతువు గుణమును ఇంకొకదానికి) జేయును. భావరూపములగు వస్తువులకన్నిటికిని అభావమును కల్పించును. నాల్గుయుగముల యంతకాలముల బుట్టుమేఘములను, సూర్యుని, అగ్నిని, గాలిని కల్గించి ప్రజలకు కష్టముల కల్గించును.

### వాయుసామాన్యకృత్యములు.

మూ. స హి భగవాన్ ప్రభవశ్చ అవ్యయశ్చ, భూతానాం భావా
భావకరః, సుఖాసుఖయోర్విధాతా, మృత్యుర్యమోనియంతా
ప్రజాపతిరదితిర్విశ్వకర్మా, విశ్వరూపః, సర్వగః, సర్వతన్త్రాణాం
విధాతా, భావానామణుర్విభుర్విష్ణుః, క్రాన్తా లోకానాం,
వాయురేవ భగవానితి. ౧౨

వ్యా. మఱియు నావాయువు సకల ప్రపంచమునకును ఉత్పత్తికారణమై నాశరహితముగ నుండును. లోకమున ఉత్పత్తిలయములకును, సుఖాసుఖములకును హేతువుగా నుండును. ఆవాయువే మృత్యువును, ఎముడును, లోకముల నియమించువాడును, సృష్టికర్తయు, దేవతలకు మాతయైన అదితియు, విశ్వకర్మయు, విశ్వరూపుండునై అంతట వ్యాపించి, సమస్తకర్మలను జేయుచు సమస్త భావపదార్థములలో అణు

రూపముగ వ్యాపించి సమస్తలోకములను ఆక్రమించియుండును. కావున అట్టివాయువు దైవస్వరూపమై ప్రపంచవ్యాపారములకన్నిటికి కారణభూతమై యుండును. ఇత్తెరంగున వార్యోవిదుడను మహర్షి వాయుకృత్యములను వేర్వేరుగ విభజించి చెప్పెనని భావము.

## వాతగుణపరిజ్ఞానవిషయకప్రశ్నము.

మూ. తచ్ఛ్రుత్వా వార్యోవిదవచో మారీచిరువాచ:—యద్యప్యేవ మేతత్; కిమర్థస్యాఽస్య వచనే విజ్ఞానే వా సామర్థ్యమస్తి భిషగ్విద్యాయాం? భిషగ్విద్యాం వాధికృత్య ఇయం కథా ప్రవృత్తేతి. ౧౩

వ్యా. పైజెప్పబడిన రాజర్షియగు వార్యోవిదునిమాట విని మరీచి పుత్రుడగు మారీచిమహర్షి యిట్లు పలికెను:—మీరు వాతము నుద్దేశించి చెప్పినవిషయములన్నియు నిశ్చయము. అయినను వైద్యవిద్యయగు నీయాయుర్వేదమున వాయువు నుద్దేశించి యీ విషయమును చెప్పిన నేమి ప్రయోజనము? ఈవిషయముల చక్కగ నెరుంగుటవలన నేమి ఫలము? వైద్యవిద్య నుద్దేశించి యీవాయువుకు సంబంధించినకథ యెందుకు ప్రస్తావము చేయబడినది? అని మారీచి యడిగెనని యర్థము.

(ఇచ్చట చికిత్సార్థమై యాయుర్వేదము ముఖ్యముగ ప్రవర్తించినది. "ధాతుసామ్య క్రియా చోక్తా తన్త్రస్యాస్య ప్రయోజనమ్" అనువాక్యముచేత నీయర్థమే సిద్ధాంతము చేయబడినది. అట్లుండ ప్రకృతమున వాతము నుద్దేశించి యాయుర్వేదమున వానికృత్యముల నేల జెప్పవలెను? వాని నెరింగిన వైద్యున కేమి లాభము? బాహ్యవాయుకృత్యముల ప్రస్తావము ఎందుకు కల్గినది? అని విషయనిర్ధారణమునకై ప్రశ్నలు చేయబడియెనని యెరుంగునది.)

## వాయుగుణపరిజ్ఞానావశ్యకత.

మూ. వార్యోవిద ఉవాచ:—భిషక్, పవనమతిబలమతిపరుషమతిశీఘ్రకారిణ మాత్యయికం చ నానునిశమ్య సహసా ప్రకుపితం అతిప్రయతః కథమగ్రేఽభిసంరక్షితుం అభిధాస్యతి ప్రాగేవైన మత్యయభయాత్ ఇతి; వాయోర్యథార్థస్తుతిరపి భవత్యారోగ్యాయ బలవర్ణవివృద్ధయే వర్చస్విత్వాయ ఉపచయాయ జ్ఞానోపపత్తయే పరమాయుఃప్రకర్షాయేతి. ౧౪

వ్యా. పైప్రశ్నలకు వారోక్కువిడ డిట్లుత్తరమొసంగెను:—వాయువు ప్రబలమైన బలము కల్గినదనియు, మిక్కిలి క్రూరమైనదనియు, అతిశీఘ్రముగ పని చేయునదియనియు, ఆపత్తును కల్గించునదియు నని వైద్యుడు తెలిసికొనక, అతిశీఘ్రముగ ప్రకోపమునొందు స్వభావముకలవాతము ప్రకోపించకమునుపే ప్రకోపింపనీయక కాపాడుటకును (అపుట కును) మిక్కిలిజాగరూకుడై వాతమునకల్గుబాధ కల్గుటకుమునుపే అట్టిబాధకు గోచరము కానీయక రోగికి రక్షించుటకును ఎట్లు సమర్థుడగును ? (వాతమును స్వభావసిద్ధములైన శీఘ్రకారిత్వాదిగుణముల జక్కగ నెరింగినపుడే వైద్యుడు వాతవర్ధకముల నివర్తింప బోధించి, వాతమును ప్రకోపింపనీయక సదుపాయముల సమర్థుడగును. అట్టిసదుపాయ ముల నెరింగి జాగ్రత్తతో మెలంగినగాని రోగిని వాతప్రకోపజనితబాధలనుండి తొలగింప సమర్థుడు కాజాలడు. కావున వైద్యునకు వాతముయొక్క స్వభావము పూర్తిగ దెలియు టకై యీయాయుర్వేదమున వాతకృత్యములు నిరూపింపబడినవనియు, వాతమున గల్గు బాధల గల్గనీయక కాపాడుటకై వానికృత్యములనరయుట వైద్యున కావశ్యకమనియు భావము). పైవివరణము చేత నాయుర్వేదమున వాతకృత్యముల నిరూపించుటకు కారణం బును, వైద్యుడు వాని నెరింగినందుకు ప్రయోజనంబును చెప్పబడినది.

మరియు వాతమునకు సామాన్యగుణముల స్తుతించుటయు ఆరోగ్యమును బలమును శరీరకాంతిని వృద్ధినొందించును. వర్చస్సు వృద్ధినొందును. శరీరము వృద్ధినొం దును. జ్ఞానముకల్గును. దానంజేసి పరమాయుష్యమువృద్ధినొంది యధికమగును. (వాయువు పైజెప్పినప్రకారము సర్వవ్యాపకమైన దేవతాస్వరూపమైనదని యాస్తికసిద్ధాంతము కావున, అట్టి దేవతారూపమైనవాయువునకు సామాన్యములైన గుణాదుల నుగ్గడించి స్తుతి చేసినను అదృష్టరూపమైన పుణ్యవిశేషము చేత బలవర్ణాదులువృద్ధినొంది యారోగ్యమును వడసి, దానిమూలమున పరమాయువునొందునని భావము.) దీనిచేత వాయువుయొక్క గుణముల సామాన్యకథనమునకు ప్రయోజనము నిరూపింపబడినది.

### వికృతావికృత-పిత్తకృత్యములు.

సూ. మారీచిరువాచః—అగ్నిరేవ శరీరే పిత్తాన్తర్గతః కుపితాఽకుపి
తః శుభాఽశుభాని కరోతి. తద్యథాః—పక్తిమపక్తిం, దర్శన
మదర్శనం, మాత్రామాత్రత్వమూష్మణః, ప్రకృతివికృతివర్ణౌ,
శౌర్యం భయం, క్రోధం హర్షం, మోహం ప్రసాదం, ఇత్యేవ
మాదీని చాపరాణి ద్వన్ద్వానీతి.　　౧౧

వ్యా. పైజెప్పిన వార్యోవిదునిమాట విని మారీచి యిట్లు చెప్పందొడంగె:—పిత్త మునకు సంబంధించిన యాపిరిరూపమైనయగ్ని కుపితంబైనపుడును, సమస్థితినుండునపుడును సుఖమును కష్టమును కల్గించును (సమస్థితినున్నపుడు సుఖమును, ప్రకుపితమైనపుడు కష్ట మును కల్గించుననిభావము) అదియెట్లులన:—అట్టియగ్ని సమస్థితినున్నపుడు ఆహారమును చక్కగ పచింపజేసి జీర్ణశక్తిని కల్గించును. ప్రకుపిత మైనయెడ ఆహారమును పచింపక యజీర్ణమునుకల్గించును. (ఇది పాచకాగ్నికృత్యము). సమస్థితి నున్నపుడు దృష్టికి చూచు శక్తిని కల్గించును. ప్రకుపితమైనయెడ చూచుశక్తిని పోగొట్టును. (ఇది నేత్రమునందు ఆలోకపిత్తకృత్యము). సమస్థితినున్నపుడు శరీరమున వేడిని మితముగనుంచును. ప్రకుపిత మైనచో అట్టివేడిని అధికముగనైనను తక్కువగనైన జేయును. శరీరమునకు సరియైనవర్ణ మును సమస్థితినున్నపుడు కల్గించును. ప్రకుపితమై అట్టిరూపమును వికృతముగ జేయును. (ఇది త్వగ్గతమైన భ్రాజకపిత్తకృత్యము). హృదయస్థానమున నుండు సాధకపిత్తము సమ స్థితినున్నపుడు శౌర్యమును, హర్షమును ప్రసన్నతనుకల్గించును. ప్రకుపితమైనచో భయ మును, క్రోధమును, అజ్ఞానమును కల్గించును. (ఇది సాధకపిత్తవికృతావికృతకృత్యములు) ఇత్తెరంగున పాచక-ఆలోచక-భ్రాజక-సాధకభేదములు కలపిత్తము వికృతాఽవికృతా వస్థలయందు చేయుకృత్యములు సామాన్యముగ జెప్పబడినవి. మరియు పిత్తను పైజెప్పిన కృత్యములనేకాక ఇతరములగు ననేకద్వంద్వకృత్యముల జేయును. కావున పిత్తమునకు జేరినయగ్నియే సామ్యప్రకోపావస్థలచే శరీరమునకు సుఖదుఃఖముల గల్గించునని మారీ చుడు చెప్పెను.

## సమప్రకుపితకఫకృత్యములు.

మూ. తచ్ఛ్రుత్వా మరీచివచః కాప్య ఉవాచః—సోమ ఏవ శరీరే శ్లేష్మాన్తర్గతః కుపితాఽకుపితః శుభాఽశుభాని కరోతి, తద్య థా:—దార్ఢ్యం, శైథిల్యం, ఉపచయం కార్శ్యం, ఉత్సాహ మాలస్యం, వృషతాం క్లీబతాం, జ్ఞానమజ్ఞానం, బుద్ధిం మోహం, ఏవమాదీని చాపరాణి ద్వన్ద్వానీతి. ౧౬

వ్యా. పైజెప్పినమాట విని కాప్యుడిట్లు చెప్పెను:—సౌమ్యరూపుడగుచంద్రుడు, (లేక జలాధిదేవత) శ్లేష్మమని చెప్పబడును. అయ్యది శరీరమున జేరి సమస్థితి నున్నపుడు సుఖమును, ప్రకుపితమైనపుడు కష్టమును కల్గించుచుండును:—అది యెట్లులన:—అట్టి కఫము సమస్థితి నున్నపుడు శరీరమునకు దృఢత్వము, వృద్ధిని, ఉత్సాహమును, సంభోగే చ్ఛను, జ్ఞానము, బుద్ధిని కల్గించును. ప్రకోపము నొందినపుడు అవయవశైథిల్యమును,

కృశతను, ఆలస్యమును, సంభోగమునందు వైముఖ్యమును, అజ్ఞానము, మూర్ఛను కల్గించును. ఇంతియేకాక యిట్టిద్వంద్వముల ననేకముల గల్గించును. (కావున శరీరమునకు జేరిన సుఖదుఃఖములకు శరీరమునందలి శ్లేష్మమే కారణమగునని కాప్యుడనుఋషిచెప్పెను). కాప్య అనుపదమునకు కాశ్యప అని పాఠాంతరమున్నది.

## ఆత్రేయమతసిద్ధాంతము.

మూ. తచ్ఛ్రుత్వా కాప్యవచః భగవాన్ పునర్వసురాత్రేయ ఉవాచః- సర్వ ఏవ భవన్తః సమ్యగాహుః అన్యత్రైకాన్తికవచనాత్, సర్వ ఏవ ఖలు వాతపిత్తశ్లేష్మాణః ప్రకృతిభూతాః పురుష మవ్యాపన్నేన్ద్రియం, బలవర్ణసుఖోపపన్నం, ఆయుషా మహతా ఉపపాదయన్తి, సమ్యగేవాఽఽచరితాః ధర్మార్థకామా ఇవ నిశ్శ్రేయసేన మహతాపురుషమిహ చాఽముష్మింశ్చ లోకే. వికృతాస్త్వేనం మహతావిపర్యయేణోపపాదయన్తి, ఋతవస్త్రయ ఇవ వికృతిమాపన్నాః, లోకమశుభేనోపఘాతకాలే ఇతి.

వ్యా. త్రికాలజ్ఞానవేదియు పునర్వసువను నామాంతరముకల యాత్రేయుడు అందరి మతముల పర్యాలోచనచేసి యిట్లు చెప్పెను:—మీరందరును చెప్పిన విషయము లన్నియు నిశ్చయము. (మీరు చెప్పినవిషయములలో 'అగ్నిరేవ' 'సోమఏవ' అని అగ్నియొక్కటియే. కఫమొక్కటియే శరీరమునకు సుఖాసుఖకారణమని నిర్ధారణము చేసి చెప్పుటమాత్రము పొరబాటు కాని ఆనిర్ధారణాంశమును వదలి తక్కిన యంశము లన్నియు మిక్కిలి సమంజసములుగనే యున్నవని యాత్రేయునిభావము.) వాతపిత్త కఫములన్నియు వానివాని ప్రకృతిస్థితి (వికృతి జెందక సమస్థితి) నున్నచో నవి యథోక్తముగ నాచరించబడిన ధర్మార్థకామములవలె శరీరమునకు చక్షురాదీంద్రియ ముల జెరుపక బలమును వర్ణమును సుఖమును కల్గించి అట్టి పురుషుని అధికమైన యాయుంవు కలవానిగ జేయును. (లోకమున పురుషులు ధర్మార్థకామములను పూరుషార్థ ముల చక్కగ నాచరించినయెడ నిహపరములయందు సుఖము నొందును. ఆరీతిగనే తాను జితేంద్రియుడై వాతాదుల ప్రకోపనముల నాచరించకున్నయెడ వికృతిజెందని యా త్రిదోషములును పురుషునకు శరీరబలవర్ణాదులను ఇంద్రియపాటవమునకు చక్కగ గల్గించి యాయువును వృద్ధినొందించునని భావము.)

మరియు నాదోషత్రయము మిథ్యాహారాదులచే వికృతినొందినచో, లోకాంత సమయమున శీతఉష్ణ వర్షరూపములగు ఋతువులు మూడును వికృతిజెంది లోకముల

పాడుచేయునట్లు పురుషుని నానావిధరోగములచే కష్టపెట్టి తుదకు చంపజూచును. కావున సమస్థితినున్న వాతపిత్తకఫములు మూడును శరీరమునకు ముఖ్యముగ నారోగ్యమునకు కారణములగును. అవియే వికృతినొంది బొత్తుగ హానిచేయునని యాత్రేయుండు తక్కినవారిమతములకు సమంజసముగ సిద్ధాంతమును చెప్పెను.

### ఆత్రేయసిద్ధాంతాభినందనము.

మూ. తదృషయస్సర్వ ఏవ అనుమేనిరే వచనమాత్రేయస్య భగవతోఽభినన్దుశ్చేతి. ౧౮

భవతి చాత్ర:—

తదాత్రేయవచశ్శ్రుత్వా సర్వ ఏవానుమేనిరే,
ఋషయోఽభినన్దుశ్చ యథేన్ద్రవచనం సురాః. ౧౯

వ్యా. పైజెప్పినరీతిగ భగవత్స్వరూపుడగు నాత్రేయమహర్షి చెప్పినసిద్ధాంతమును తక్కిన ఋషిపుంగవులందరును ఇంద్రునివచనమును దేవతలు కొనియాడి యంగీకరించువిధముగ నంగీకరించి గౌరవించిరి.

### అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః:—

గుణాష్షట్ ద్వివిధో హేతుః వివిధం కర్మ యత్పునః,
వాయోశ్చతుర్విధం కర్మ పృథక్చ కఫపిత్తయోః. ౨౦
మహర్షీణాం మతిర్యా యా పునర్వసుమతిశ్చ యా,
కలాకలీయే వాతస్య తత్సర్వం సంప్రకాశితమ్. ౨౧

వ్యా. ఈ వాతకలాకలీయాధ్యాయమునందు వాతమునకు సంబంధించిన రూక్షాది గుణములారును, వాతప్రకోపప్రశమనమును జేరిన రెండుహేతువులును, బాహ్యాంతరవాతముల ప్రకోపప్రశమనమున కల్గు వానికృత్యముల నాల్గుభేదములును, కఫపిత్తములకు జేరి ప్రకోపసమస్థితియందు అవిజేయు ప్రత్యేకకృత్యములు, ఇందుకు సంబంధించిన ఋషుయభిప్రాయంబులును, ఆత్రేయసిద్ధాంతంబును ఇవియన్నియు వివరింపబడినది.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
వాతకలాకలీయో నామ ద్వాదశోఽధ్యాయః.
ఇతి నిర్దేశచతుష్కస్సమాప్తః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును, చరకమహర్షిచే సంస్కరింపబడినదియు నగు నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమునందు వాతకలాకలీయ మనునది పదిరెండవ యధ్యాయము సమాప్తము.

నిర్దేశచతుష్కము సమాప్తము.

---

## (కల్పనాచతుష్కము.)

## త్రయోదశాధ్యాయము.

అవతారిక:—పై జెప్పబడిన నిర్దేశచతుష్కములో జేరిన వాతకలాకలీయాధ్యాయమున వాతాదిదోషములు నిర్దేశింపబడినవి; అట్టివాతాదులకు దగిన యౌషధముల గల్పించుటకు విధానమును దెల్పునట్టి ప్రకరణము కల్పనాచతుష్కము చెప్పబడును. ఔషధముల కల్పనమును దెల్పునట్టి ప్రకరణము కల్పనాచతుష్కము. అట్టికల్పనము దాని కాశ్రయమైనద్రవ్యమును జెప్పక విధానమును దెల్ప వలనుపడదు కావున ఆశ్రయములైన ద్రవ్యముల తొలుత జెప్పవలెను. అయ్యవి స్నేహము, స్వేదము, వమనము, విరేచనము నని నాల్గువిధములు. అట్టి నాల్గువిధములైన ఔషధముల కల్పనను దెల్పుట వలన కల్పనాచతుష్క మనబడును. ఈనాల్గుకల్పనములును ఈయధ్యాయము మొదలు నాల్గధ్యాయములచే చెప్పబడును. వస్తివిధానము విపులమగుటచే నిందు జెప్పబడదయ్యె. ఈ నాల్గిటిలో వమనాదులకు ముందు స్నేహవిధి జేయదగినది యగుటంజేసియు, మూడు దోషములలో ప్రధానమైనవాతమునకు ప్రధానౌషధమగుటవలనను తొలుత స్నేహ కల్పనాప్రతిపాదమైన స్నేహాధ్యాయము చెప్పబడును.

మూ. అథాతస్స్నేహాధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. వాతకలాకలీయమును జెప్పినపిదప స్నేహవిధానము దెలుపు స్నేహాధ్యాయమును త్రికాలజ్ఞానవేదియగు నాత్రేయుం డుపదేశించినదానికి న్యూనాతిరిక్తము కాకుండునట్లు వివరించెదనని యర్థము. (జిడ్డుకల్గినవై మున్నగునవి స్నేహములు, వానికి సంబంధించిన విధానము దెల్పునది స్నేహాధ్యాయము.)

మూ. సాఙ్ఖ్యైస్సఙ్ఖ్యాతసఙ్ఖ్యేయైః సహాసీనం పునర్వసుమ్,

జగద్ధితార్థం పప్రచ్ఛ వహ్నివేశః స్వసంశయమ్. 3

వ్యా. సంఖ్యయన మంచిజ్ఞానము. మంచిజ్ఞానముకలవారు సాంఖ్యులు. చక్కగ జ్ఞానగరిమచే దెలిసికొనదగిన పరమాత్మస్వరూపము తత్వదృష్టిచే నెరింగిన జ్ఞానవంతులగు ఋషిపుంగవులతో సద్గోష్ఠిగ కూర్చొనియుండు పునర్వసువును అగ్నివేశుడు తనకు గల్గిన సంశయమును వెల్లడించి లోకమునకు హితమును జేయదలంచి తనసంశయవిషయమును ఇత్తెరంగున నడిగెను.

## స్నేహవిధి నుద్దేశించి యగ్నివేశునిప్రశ్నములు.

మూ. కిం యోనయః? కతి స్నేహాః? కేచ స్నేహగుణాః పృథక్ ?
కాలాఽనుపానే కే? కస్య కతి కాశ్చ విచారణాః? ౪
కతి మాత్రాః? కథం మానా కాచ కేషూపదిశ్యతే?
కశ్చ కేభ్యో హితః స్నేహః? ప్రకర్షః స్నేహనేచ కః? ౫
స్నేహ్యాః కే? కే నచ? స్నిగ్ధాఽస్నిగ్ధాఽతిస్నిగ్ధలక్షణమ్,
కిమ్? పానాత్ప్రథమం, పీతే, జీర్ణే, కించ హితాఽహితమ్? ౬
కే మృదుక్రూరకోష్ఠాః? కా వ్యాపదః? సిద్ధయశ్చ కాః?
అచ్ఛే సంశోధనే చైవ స్నేహే కా వృత్తిరిష్యతే? ౭
విచారణాః కేషు యోజ్యాః? విధినా కేన తత్ప్రభో!
స్నేహస్యాఽమితవిజ్ఞాన జ్ఞానమిచ్ఛామి వేదితుమ్. ౮

వ్యా. స్నేహముల యుత్పత్తికారణమైనది యాశ్రయమేది? స్నేహములెన్ని? అట్టి స్నేహములయొక్క వేర్వేరుగుణము లెవ్వి? స్నేహము లుపయోగింపదగిన కాల మెద్ది? వానియనుపానము లెవ్వి? స్నేహవిచారణము లెవ్వి? అవియెన్ని? ఏయేస్నేహము కెన్నేసి విచారణములు? స్నేహమాత్రలెన్ని, దానిపరిమాణము ఎంత? ఎవరికి ఏస్నేహము యుక్తము? స్నేహద్రవ్యములలో నేది యెవరికి హితముగనుండును? స్నేహనమునకు ఏదిశ్రేష్ఠమైనది? స్నేహమున కర్హులెవరు? అనర్హు లెవరు? స్నిగ్ధ-అస్నిగ్ధ-అతిస్నిగ్ధలక్షణము లెవ్వి? స్నేహపానమునకు ముందును, స్నేహపానముజేసిన యుత్తరక్షణమునను, స్నేహపానము జేసినపిదప నయ్యది జీర్ణమైనప్పుడును చేయదగిన హితము లెవ్వి? అట్టిసమయముల హితములు కానివి యెవ్వి? మృదు-క్రూర-కోష్ఠములు కలవారెవరు? స్నేహవైపరీత్యమువలన కల్గువ్యాపత్తు లెవ్వి? అట్టివ్యాపత్తుల నివర్తించు నుపాయములెవ్వి? సంశమన స్నేహపానమునందును, సంశోధన స్నేహపానమునందును చేయదగిన యుపాయములెవ్వి? స్నేహవిచారణ యెవరికి యేవిధముగ నుపయోగించవలెను?

అపారవిజ్ఞానముకల యోదేవా! స్నేహవిషయమై పైజెప్పిన యంశములను చక్కఁగదెలియుటకై మిమ్ము వేడెదనని యాత్రేయుని అగ్నివేశు డడిగెను అని భావము.

### రెండువిధములైన స్నేహయోనులు.

మూ. అథ తత్సంశయచ్ఛేత్తా ప్రత్యువాచ పునర్వసుః,
స్నేహానాం ద్వివిధా చాసౌ యోనిః స్థావరజఙ్గమా. ౯

వ్యా. పిమ్మట నగ్నివేశుని సంశయముల నివర్తింపజేయ నిచ్ఛగొనిన పునర్వసువు అగ్నివేశున కిట్లు చెప్పెను:— స్నేహములకన్నిటికిని స్థావరమనియు జంగమమనియు నుత్పత్త్యాశ్రయములు రెండువిధములనుండు. (అందు నెయ్యి మున్నగునవి జంగమరూపములగు జంతువులవలన పుట్టును కావున వాని కాశ్రయము జంగమము. నూనె మున్నగువాని కాశ్రయములు నువ్వులు మున్నగునవి స్థావరములైన యాశ్రయమునని యెరుంగునది.)

### స్నేహాశ్రయముల వివరణము.

మూ. తిలః ప్రియాలాఽభిషుకౌ విభీతక
శ్చిత్రాభయైరణ్డమధూకసర్షపాః,
కుసుమ్భబిల్వారుకమూలకాఽతసీ
నికోటకాక్షోటకరఞ్జశిగ్రుకాః. ౧౦
స్నేహాశ్రయాః స్థావరసంజ్ఞితాః; తథా
స్యుర్జఙ్గమా మత్స్యమృగాస్సపక్షిణః,
తేషాం దధిక్షీరఘృతామిషం వసా
స్నేహేషు మజ్జా చ తథోపదిశ్యతే. ౧౧

వ్యా. నువ్వులు, చాలపప్పు, అభిషుకములు (లోకమున పిస్తాగింజలు అని చెప్పబడును.) తాండ్రగింజలు, ఎఱ్ఱని యాముదపుగింజలు, కరకగింజలు, ఆముదపు విత్తులు, ఇప్పగింజలు, ఆవాలు, కుసుమగింజలు, మారేడుగింజలు, ఆరుకము (ఇది హిమవత్ప్రాంతమున నుండు స్వనామప్రసిద్ధము. జీడిగింజలని కొన్నినిఘంటువుల నున్నది), ముల్లంగి గింజలు, అవిసెగింజలు, అళివిత్తులు, ఊడుగగింజలు, కానుగువిత్తులు, మునగవిత్తులు ఇవి స్నేహములకు(చమురులకు) స్థావరమైన యాశ్రయములు. (ఈగింజలనుండి చమురు తీయబడును కావున స్నేహమునకు ఉత్పత్తికారణమైన స్థావరాశ్రయమని భావము.)

మరియు మత్స్యములు, మృగములు, పక్షులు ఇవి జంగమము తైలజంతువులు కావున చమురుకు జంగమరూపమైన యాశ్రయములు. పైజెప్పిన జంతువులనుండి పెరుగు, పాలు, నెయ్యి, మాంసము, వస, మజ్జ (క్రొవ్వు) ఇవి స్నేహములుగ గ్రహింపబడును. (పెరుగు మున్నగువానినుండి చమురు తీయబడును. మరియు పెరుగు మున్నగునవి ఆయాజంతువులనుండి యథాసంభవముగ గ్రహింపబడును.)

## శ్రేష్ఠమైనతైలము.

మూ. సర్వేషాం తైలజాతానాం తిలతైలం విశిష్యతే,
బలార్థే స్నేహనే చాగ్ర్యం ఐరణ్డం తు విరేచనే. ౧౨

వ్యా. స్థావరములవలన బుట్టినతైలములలో నువ్వులనూనె మిగుల శ్రేష్ఠమైనది. బలమును కల్గించుటకును స్నిగ్ధముగ జేయుటకును ఆముదము మిక్కిలి శ్రేష్ఠమైనది. విరేచనమునకును ఆముదము శ్రేష్ఠమైనది.

ఇచ్చట 'తిలానాం ఇదం-తైలమ్' అను వ్యుత్పత్తిచేత నువ్వులనూనెనే తైలమని చెప్పుట యుక్తము; అయినను తైలశబ్దము తక్కిన స్థావరమున పుట్టుస్నేహము లన్నిటి యందును యోగరూఢముగ నుండును. భాషయందును ఏరండతైలము, కరంజతైలము, కుసుంభతైలము మున్నగుప్రయోగము వాడుకగ నున్నది. ఈవిషయమున సుశ్రుతాచార్యు లిట్లు చెప్పిరి:—"నిష్పత్తే స్తద్గుణత్వాచ్చ తైలత్వమితరేష్వపి" నువ్వులనుండి నూనె పుట్టునట్లే తక్కినగింజలనుండి నూనె పుట్టును. నువ్వులనూనె కుండుగుణములు సామాన్యముగ తక్కిననూనెలకును ఉండును కావున అన్నిజాతుల నూనెయుం తైలమని సామాన్యముగ జెప్పబడునని భావము.

## స్నేహములలో తారతమ్యము.

మూ. సర్పిస్తైలం వసా మజ్జా సర్వస్నేహోత్తమా మతాః,
ఏభ్యశ్చైవోత్తమం సర్పిః సంస్కారస్యానువర్తనాత్. ౧౩

వ్యా. పైజెప్పిన దధిక్షీరాది స్నేహములలోపల నెయ్యి, తైలము, వస, మజ్జ (క్రొవ్వు) అను నీనాల్గును మిక్కిలి యుత్తమములు. ఈనాల్గిటిలోను నెయ్యి దానిలో గూడ నితరద్రవ్యముల జేర్చి సిద్ధముచేయునప్పుడు, అట్టి ద్రవ్యాంతరముల గుణమును (తనగుణముల వదలకయే) అనుసరించి యుండును. కావున తైలాదులకన్న మిగుల శ్రేష్ఠమైనది. (నెయ్యి, తైలము, వస, మజ్జ యనునాల్గును తక్కిన దధిక్షీరాదులకన్న స్నిగ్ధత్వము (జిడ్డు) అధికముగనుండును కావున క్షీరాదులకన్న మిక్కిలి శ్రేష్ఠము-

అందున నెయ్యి ద్రవ్యాంతరములతో జేర్చి సంస్కరింపబడినపుడు తనయందలి మాధుర్య శైత్యాదిగుణముల విడువకయే తనతోజేర్చిన యితరపదార్థసంస్కారమున గల్గుగుణముల ననుసరించియుండును; కావున, తైలాదులు నాల్గిటిలో నెయ్యి మిగుల శ్రేష్ఠమని భావము.)

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—సంస్కారమనగ ద్రవ్యాంతరసంసర్గముచే గుణాంతరమును కల్పించుట సంస్కారము. నూనె మున్నగు స్నేహములయందు ఇతర ద్రవ్యములజేర్చి సంస్కరించినచో స్నేహము తనకు స్వభావసిద్ధములగు గుణముల మాని సంస్కారగుణముల ననుసరించియే పనిచేయును. నెయ్యి మాత్రము అటు కాక తనయందలి గుణములకు విరుద్ధములగు రూక్షాదిగుణములు కల చిత్రమూలము మున్నగు ద్రవ్యములతో జేర్చి సంస్కరించినను అట్టి రూక్షాదిగుణములచే స్నేహాదిగుణములకు హానిలేక సంస్కారగుణములతోగూడ కలిసి పనిచేయును. కావున నిదియే ఘృతమునకు సంస్కారగుణానువర్తనము. ఈవిషయమునే తంత్రాంతరమున నిట్లు చెప్పిరి:—"నాన్య స్స్నేహ స్తథా కశ్చిత్ సంస్కార మనువర్తతే, యథా సర్పి రతస్సర్పిః సర్వస్నేహోత్తమం విదుః" ఈవాక్యమునకు పైజెప్పినదియే భావము. మరియుం అనువర్తనమన— 'అను పశ్చాత్ వర్తనం' అను విగ్రహముచేత తొలుత నీగుణములకు సంబంధించినకృత్యముల జేయుంచు పిమ్మట సంస్కారవిశేషముచే గల్గిన గుణకృత్యముల జేయునని యర్థము. ఘృతము తనగుణములను, సంస్కారవిశేషమున గల్గిన గుణములను కల్గియుండునని ఫలితార్థము. మరియు "స్నేహాద్వాతం శమయతి పిత్తం మాధుర్యశైత్యతః, ఘృతం తుల్యగుణం దోషం సంస్కారాత్తు జయే త్కఫమ్" అను వచనాంతరము పైయర్థమునే బలపరచుచున్నది. ఘృతము స్నేహగుణముచే వాతమును, మాధుర్య శైత్యగుణములచే పిత్తమును శమింపజేయును. కఫము తనకు సమానగుణములు కల్గియున్నను సంస్కారవిశేషమునంజేసి కఫమును కూడ శమింపజేయునని యర్థము.

మరియుం 'మాధుర్యా దవిదాహిత్వా జ్జన్మాద్యావచ్చ శీలనాత్' అని తంత్రాంతరమున చెప్పబడినది. ఘృతము మధురముగ నుండుటవలనను, విదాహకరము కాకుండుటవలనను, పుట్టిననాట నుండియుం అలవాటుచే సాత్మ్యమై యుండుటవలనను మిగుల శ్రేష్ఠమని యర్థము. ఇట్టికారణములచే గూడ ఘృతము తక్కిన స్నేహములకన్న మిగుల శ్రేష్ఠమని తెలిసెడిని.

## ఘృతగుణములు.

మూ. ఘృతం పిత్తానిలహరం రసశుక్రౌజసాం హితమ్,
నిర్వాపణం మృదుకరం స్వరవర్ణప్రసాదనమ్. ౧౪

వ్యా. ఘృతము (నెయ్యి) పిత్తవాతముల హరించును. రసధాతువునకును, శుక్రమునకును, ఓజస్సునకును హితమైనది. మంటను పోగొట్టి వ్రణముల మాన్పును. కోష్ఠమును మృదువుగ జేయును. కంఠస్వరమును శరీరవర్ణమును శుభ్రపరిచి వృద్ధినొందించును.

## తైలగుణములు.

మూ. మారుతఘ్నం న చ శ్లేష్మవర్ధనం బలవర్ధనమ్,
త్వచ్యముష్ణం స్థిరకరం తైలం యోనివిశోధనమ్. ౧౫

వ్యా. తైలము వాతమును హరించును. కఫమును వృద్ధినొందించక సమస్థితినుంచును. శరీరబలమును వృద్ధినొందించును. చర్మమునకు హితకరము, ఉష్ణవీర్యమైనది. అవయవములను స్థిరముగనుంచును. యోనిని శుభ్రపరచును.

## వసాగుణములు.

మూ. విద్ధభగ్నాహతభ్రష్టయోనికర్ణశిరోరుజి,
పౌరుషోపచయే స్నేహే వ్యాయామే చేష్యతే వసా. ౧౬

వ్యా. గాయములకును, అవయవములు విరిగిన గాయములకును, దెబ్బలు తగిలినప్పుడును, యోనిభ్రంశమునకును, కర్ణరోగములయందును, శిరోరోగములయందును, వస యుపయోగింపదగును. పుంసత్వమును (శుక్రమును) వృద్ధినొందించును. శరీరమును కోష్ఠమును స్నిగ్ధముగ (మృదువుగ) జేయును. వ్యాయామము చేసినప్పుడు హితకరమైనది.

మూ. బలశుక్రరసశ్లేష్మమేదోమజ్జావివర్ధనః,
మజ్జా విశేషతోఽస్థ్నాం చ బలకృత్ స్నేహనే హితః. ౧౭

వ్యా. మజ్జ (క్రొవ్వు) బలమును, శుక్రమును, రసధాతువును, మేదస్సును, మజ్జను వృద్ధినొందించును. అస్థులకు విశేషముగ బలమును కల్గించును. శరీరమునకు స్నేహనమును చేయ హితముగనుండును.

## స్నేహపానకాలము.

మూ. సర్పిశ్శరది పాతవ్యం, వసా మజ్జా చ మాధవే,
తైలం ప్రావృషి, నాత్యుష్ణశీతే స్నేహం పిబేన్నరః. ౧౮

వ్యా. శరత్కాలమున ఘృతపానము చేయదగును. వైశాఖమున వసామజ్జలను పానము జేయదగును. ప్రావృట్కాలమైన ఆషాఢశ్రావణమాసములయందు తైలమును

పానముజేయనగును. మిక్కిలి యుష్ణమైన గ్రీష్మమునందును, మిక్కిలి శీతమైన హేమంత శిశిరములయందును స్నేహము పానము చేయంజనదు.

ఇచ్చట నీవిషయము సెరుంగునది:—'పిత్తం శరది కుప్యతి' అను వచనప్రకారము శరత్కాలమున పిత్తము ప్రకోపించియుండును కావున శైత్యాదిగుణములచే పిత్తహరమైన ఘృతమును పానముచేయుట యుక్తము; కాని తైలాదులు యుక్తము కాదు. వసా మజ్జలు రెండును సమశీతోష్ణములుగ నుండును. 'యథా సత్వంతు శైత్యోష్ణే వసామజ్జ్ఞే వినిర్దిశేత్' అనువచనము వసామజ్జలకు ఆయాజంతువుల గుణానుసారముగ (నేజంతువు ఎట్టి గుణము కల్గియుండునో అట్టి గుణము ఆజంతువుల వసామజ్జలకును) శీతోష్ణములు కల్గియుండును అని తెలుపుచున్నది. ఈవచనముచేత తైలమునకును ఘృతమునకును చెప్పినవిధముగ సామాన్యముగ నుష్ణశీతగుణములు చెప్పబడినది కాని ఉత్కర్షగుణమును చెప్పినదికాదు. మరియు ''తైలవసామజ్జసర్పిషాం తు యథాపూర్వం శ్రేష్ఠత్వం వాతవికారేషు భవతి, యథోత్తరం పిత్తవికారేషు'' అని తంత్రాంతరమున చెప్పియున్నది. తైలము, వస, మజ్జ, ఘృతము అను నాల్గు స్నేహములలో ముందు ముందు నొకదానికన్న నొకటి వాతవికారములయందు మిక్కిలి శ్రేష్ఠముగ నుండును. (ఘృతముకన్న మజ్జయుం, దానికన్న వసయుం, దానికన్న తైలంబును శ్రేష్ఠమని భావము.) పిత్తవికారములయందు పైజెప్పినవరుస వెనుక నొకదానికన్న నొకటి (తైలమునకన్నవసయుం, దానికన్నమజ్జయుం, దానికన్న ఘృతంబును) శ్రేష్ఠముగనుండుననియుం భావము. ఈవాక్యముచేత ఘృతము శైత్యగుణముచే పిత్తమునకు మిగుల శ్రేష్ఠమనియుం, తైలము ఉష్ణగుణముచేత వాతకఫముల హరించుననియుం, వసామజ్జలు రెండును సమశీతోష్ణంబులనియుం నేర్పడినది. అట్టి వసామజ్జలు సమశీతోష్ణంబును బలకరంబులును ధాతువృద్ధికరంబులును అగుటంజేసి, బలక్షయ ధాతుక్షయముల కాసన్నంబై సమశీతోష్ణంబగుటచే సాధారణంబైన వైశాఖమున పానమునకు ప్రశస్తములని చెప్పబడెను. చైత్రము ముఖ్యముగ సాధారణ గుణంబైనను అట్టికాలమున శ్లేష్మ మధికముగ నుండును కావున స్నేహపానమునకు అర్హ్మముకాదని అందు స్నేహపానమును విధింపలేదు.

ప్రావృట్కాలమున వాతము ప్రబలముగనుండును కావున వాత హరమైన తైలపానము విధింపబడినది. అత్యుష్ణమైన గ్రీష్మకాలమునందును, అతిశీతమైన హేమంత శిశిరములయందును, వర్షాధిక్యముచే మిక్కిలి శీతమైన వర్షాకాలమునందును స్నేహపానము నిషేధింపబడినది. మరియుం నిచ్చట చెప్పిన తైలాదిపానకాలనియమము అవసరమైనవ్యాధులు లేనిస్థితికి సంబంధించి చెప్పబడినదని యెరుంగునది. పైజెప్పిన కాలనియమము ననుసరించియే స్నేహపానకాలము నిటు వాగ్భటాచార్యులును చెప్పిరి.

"తైలం ప్రావృషి, వర్షాన్తే సర్పిః, అన్యేతు మాధవే" ఈవాక్యమునకును పైని వివరించిన దానికిని భేదము లేదు.

దోసుసారముగ స్నేహపాన కాలనియమము.

మూ. వాతపిత్తాధికో రాత్రౌ ఉష్ణే చాపి పిబేన్నరః,
శ్లేష్మాధికో దివా, శీతే పిబేచ్చామలభాస్కరే. ౧౯

వ్యా. వాతపిత్తములు అధికముగనుండు మానవుడు రాత్రి (సాయంకాలము) యందు స్నేహపానము చేయవలెను. గ్రీష్మకాలమునందును సాయంకాలముననే స్నేహపానము చేయవలెను. వాతకఫములైనను కేవల కఫమైనను అధికముగనుండు మానవుడును పగటియందు స్నేహపానము చేయవలెను. శీతాధికమైన హేమంత శిశిరములయందును పగటిపూట మధ్యాహ్నకాలమునందు మేఘావరణములేక ఆకసమున భాస్కరుడు వెలుంగుసమయమున స్నేహపానము చేయవలెను.

ఇచ్చట 'శ్లేష్మాధికః' అనుపదముచేత 'వాతశ్లేష్మాధికః' అని అర్థముచేయవలెను. వాతకఫంబులైనను, కేవల కఫంబైనను అధికమైన యపుడు అని యర్థము. ఈవిషయము సుశ్రుతాచార్యునిచే నిట్లు చెప్పబడెను.—'వాతపిత్తాధికో రాత్రౌ వాతశ్లేష్మాధికో దివా'

కాలవ్యత్యయముగ చేసిన స్నేహపానమున గల్గురోగములు.

మూ. అత్యుష్ణే వా దివా పీతః వాతపిత్తాధికేన వా,
మూర్ఛాం పిపాసామున్మాదం కామలాం వా సమీరయేత్. ౨౦
శీతే రాత్రౌ పిబన్ స్నేహం నరః శ్లేష్మాధికోఽపి వా,
ఆనాహమరుచిం శూలం పాణ్డుతాం వా సమృచ్ఛతి. ౨౧

వ్యా. పైజెప్పినకాలనియమమునకు వ్యతిరేకముగ ఉష్ణాధిక్యమైనకాలమున పగటియందు స్నేహపానముచేసినను, వాతపిత్తరోగముచే బాధింపబడువాడు పగటియందు స్నేహపానముచేసినను, మూర్ఛయు, దప్పియు, ఉన్మాదంబును, కామలయు సంభవించును. (ఇచ్చట నుష్ణాధికకాలమున కఫవ్యాధికలవాడైనను పగటిపూట స్నేహపానము జేసినను పైజెప్పిన మూర్ఛాదివ్యాధులు సంభవించునని యెరుంగునది.)

శీతకాలమున రాత్రిపూట స్నేహపానము జేసినను, కఫాధికరోగముకలవాడు రాత్రిపూట స్నేహపానము జేసినను ఆనాహము (కడుపుబ్బరము), అరుచి, శూల, పాండురోగము అనునీరోగములు సంభవించును. ఇచ్చటను (శీతకాలమున రాత్రిపూట వాతపిత్తవ్యాధికలవారు స్నేహపానముచేసినను పైజెప్పిన ఆనాహాదిరోగములు కల్గునని యెరుంగనగును).

ఇచ్చట నీనిర్ణయము నెరుఁగునది:—ఉష్ణకాలమునందు పగటిపూట కఫపీడితు లైనను స్నేహపానము చేసినయెడ ఉన్మాదాదులు సంభవించునుకావున ఉష్ణకాలమున పగలు స్నేహపానము నిషిద్ధము. వాతపిత్తవ్యాధిపీడితులు ఉష్ణశీతకాలమునందు పగటిపూట స్నేహపానము జేసినను పైజెప్పినవ్యాధులు సంభవించును. వాతకఫపీడితులు ఉష్ణకాలమున పగటిపూట స్నేహపానము చేసినచో పైజెప్పినయుపద్రవములు మిక్కుటముగ సంభవించును. రాత్రి స్నేహపానమునందును ఇత్తెరంగుననే యూహించునది.

### స్నేహానుపానములు.

మూ. జలముష్ణం ఘృతే పేయం యూషస్తైలేఽనుశస్యతే,
వసామజ్జ్ఞోస్తు మణ్డస్స్యాత్ సర్వేష్వుష్ణమథామ్బు వా. ౨౨

వ్యా. ఘృతమును పానముచేయునపుడు వేడినీళ్లను వెంటనే త్రాగవలయును. తైలమునకు యూషము (పెసలకట్టు) మున్నగునవి అనుపానమునకు మిక్కిలి ప్రశస్తము. వసకును, మజ్జకును మండము అనుపానముచేయుట చాలప్రశస్తము. లేక స్నేహముల కన్నిటికిని వేడినీళ్లు అనుపానయోగ్యమైయుండును. (అనుపానమనగా:—తైలాదులద్రాగినపిమ్మట వెంటనే పానముచేయబడునది యని యర్థము. అనుపానపరిమాణము పానముచేయబడినతైలాదులు వికారముజేయక జీర్ణమగుటకు దగినంతపరిమితి గల్పింపదగును. అయ్యది వృద్ధవైద్యానుభవమువలన తెలియందగు.)

### స్నేహవిచారణము, వాని భేదములు.

మూ. ఓదనశ్చ విలేపీ చ రసో మాంసం పయో దధి,
యవాగూః సూపశాకౌ చ యూషః కామ్బలికః ఖడః. ౨౩
సక్తవః తిలపిష్టం చ మద్యం లేహా స్తథైవ చ,
భక్ష్యమభ్యఞ్జనం వస్తిః తథాచోత్తరవస్తయః. ౨౪
గణ్డూషః కర్ణతైలం చ నస్యం కర్ణాక్షితర్పణం,
చతుర్వింశతిరిత్యేతాః స్నేహస్య ప్రవిచారణాః. ౨౫

వ్యా. అన్నము, గంజి (మిక్కిలిద్రవమైనగంజికి లేపి యనబడును). మాంసరసము, మాంసము, పాలు, పెరుగు, యవాగువు, సూపము (పప్పు), కూరలు, యూషము, కాంబలికము (పెరుగును, ఉప్పును, నువ్వులు మొదలగువానితో చేయబడి పుల్లగానుండు యూషము), ఖడయూషము, సత్తుపిండి, నువ్వులపిండి, మద్యము, లేహములు (చక్కెర మున్నగువానిచేత పాకముచేసి ఘనముగానుండునది.), భక్ష్యము, అభ్యంజనము, వస్తి,

ఉత్తరవస్తి, గండూషము, కర్ణతైలము, నాసాద్వారమునుండి ప్రయోగించబడు నస్యము, కర్ణపూర్ణము, అక్షితర్పణము, నేత్రముల అప్యాయనము చేయుట). అను నీయిరువది నాల్గును స్నేహప్రవిచారణములు.

ప్రవిచారణమనగా:—"ప్రవిచార్యతే (అవచార్యతే) అనుకల్పేనుపయుజ్యతే అనయా ఇతి ప్రవిచారణః" అనువ్యుత్పత్తిచేత స్నేహద్రవ్యములతో కూడ కల్పానానుసారము సహకారిగ చేర్చువిధానము ప్రవిచారణ మనబడును. అందుకుసాధనములయినవి పైనజెప్పబడిన ఓదనాదులు ఇరువదినాలు గైయుండునని భావము. అనుపానములతో జేర్చి స్నేహములనుపయోగించుట విచారణమని ఫలితార్థము. కావున అనుపానములేక కేవలము స్నేహమాత్రమున నుపయోగించినచో నయ్యది విచారణమనబడదు. అది అచ్ఛపేయమనబడును.

ఖడయూషకాంబలికముల నిట్లెరుంగునది:—'తక్రం కపిత్థచాఙ్గేరీ మరిచాజాజిచిత్రకైః, సుపక్వః ఖడయూషోఽయ మయం కామ్బలికో మతః, దధ్యమ్లో లవణస్నేహతిలమాషాన్వితః శృతః' మజ్జిగ, వెలగపండు, పులిచింతాకు, మిరియాలు, జీలకర, చిత్రమూలము వీనిని చేర్చి పక్వము చేయబడినగంజి ఖడయూషమనబడును. పుల్లని పెరుగు, ఉప్పు, చమురు, నువ్వులు, ఉద్దిపప్పు వీనిని చేర్చి పక్వము జేయబడినగంజి కాంబలికమనియు భావము.

అచ్ఛపేయము, దాని ప్రాశస్త్యము.

మూ. అచ్ఛపేయస్తు యస్స్నేహో న తామాహుర్విచారణామ్,
స్నేహస్య స భిషగ్దృష్టః కల్పః ప్రాథమకల్పితః. ౨౬

వ్యా. పైజెప్పినవిధముగ నన్నాదులతో జేర్పక కేవలము స్నేహమును మాత్రము పానము జేసిన నయ్యది విచారణ యనదగదు. ద్రవ్యాన్తరమున జేర్పక కేవలము స్నేహమును మాత్రము పానము జేయుపక్షము ముఖ్యమైనదని వైద్యవరులచే నంగీకరింపబడినది. (ఇతరద్రవ్యముతో జేర్పని స్నేహము మిక్కిలి వీర్యవంతముగ నుండునుకావున స్నేహమునకు ఉత్తమమైన సాంప్రదాయకవైద్యసిద్ధాంతమని భావము.)

రసభేదముచే ప్రకారాంతరముగ విచారణాభేదములు.

మూ. రసైశ్చోపహితస్స్నేహః సమాసవ్యాసయోగిభిః,
షడ్భిస్త్రిషష్టిధా సంఖ్యాం ప్రాప్నోత్యేకశ్చ కేవలః. ౨౭
ఏవమేషా చతుష్షష్టిః స్నేహానాం ప్రవిచారణా.
ఓకర్తువ్యాధిపురుషాన్ ప్రయోజ్యా జానతా భవేత్. ౨౮

వ్యా. మధురాదిషడ్రసములును ఒకదానితో నొకటి సంసర్గము కల్గియుండును. అట్టిసంసర్గము భేదములు ఆత్రేయభద్రకాప్యేయ మనునధ్యాయమున జెప్పబడును.) అట్టిసంసర్గ భేదములు కలరసములచేతను, అట్టిసంసర్గము లైన మధురాదిరసములయారిటి చేతను వేరువేరుగ సంబంధించిన పైజెప్పిన యన్నాదియనుపానములతో జేయబడిన స్నేహపానరూపమైన విచారణము అరువదిమూడువిధములగును. (పరస్పరసంసర్గముకల రసభేదములతో వేరువేర సంబంధముకలయన్నాదుల ననుపానముగ జేయుంట చేతను, సంసర్గములేని మధురాదిరసములతోఁగూడిన యనుపానములచేతను స్నేహవిచారణము అరువదిమూడువిధములగునని భావము.)

అనుపానములేక చేయబడు అభ్యంజనాదిరూపమైన కేవల స్నేహవిచారణమొకటియుంకలిసి స్నేహవిచారణము లరువదినాల్గువిధములగును. అట్టి యరువదినాల్గువిధము లైన స్నేహవిచారణములలో పురుషజన్మస్థానమును, శీతోష్ణవర్ష భేదము కలఋతువులను, ఆయావ్యాధిభేదములను, పురుషునియొక్కబలమును వయసును మున్నగువానిని చక్కగ గమనించి యేది యెవరికి అనుకూలముగ నుండునో అట్టివిచారణము నుపయోగింపదగునని భావము.

స్నేహముయొక్క ఉత్తమ-మధ్యమ-హ్రస్వమాత్రలు.

మూ. అహోరాత్రమహః కృత్స్నం అర్ధాహం చ ప్రతీక్ష్యతే,
ప్రధానా మధ్యమా హ్రస్వా స్నేహమాత్రా జరాం ప్రతీ. ౨౯
ఇతి తిస్రస్సముద్దిష్టా మాత్రాః, స్నేహస్య మానతః,

వ్యా. ఏస్నేహమాత్ర ఒకయహోరాత్రమునకు జీర్ణమగునో అయ్యది యుత్తమ మాత్రయగును. ఏమాత్ర పగలు నాల్గుజాములకు జీర్ణమగునో అయ్యది మధ్యమమాత్ర యగును. ఏమాత్ర పగలుసగమునకు (రెండుజాములకు) జీర్ణమగునో అయ్యది హ్రస్వ మాత్ర యనబడును. ఇత్తెరంగున స్నేహమాత్రలు జీర్ణదశనుబట్టి ఉత్తమ-మధ్యమ-హ్రస్వ భేదములచే మూడువిధములనుండును.

పైజెప్పిన యుత్తమమధ్యమాధమమాత్రలనుకూడ దోష-దేశ-కాలాదులను గమనించి తత్తదనుకూలముగ స్వల్పమాత్రను నిర్ణయించి ఉపయోగించవలయును. ఏలననగా జాఠరాగ్ని భేదముచే మనుజులకోష్ఠము క్రూరమధ్యాది భేదములచే మారును. అట్టికోష్ఠమును, అగ్నిబలమును అనుసరించక స్నేహమాత్రను కల్పించినచో మిక్కిలి హాని కల్గును. ఈవిషయమునే అష్టాంగసంగ్రహమున "అజ్ఞాతకోష్ఠే బహుః కుర్యాజ్జీవిత సంశయం" అని యుంపదేశించియున్నారు. కాని వైద్యవరుడు తొలుత దోషము, ఔష

ధము, దేశము, కాలము, బలము, ఆహారము, సత్వము, సాత్మ్యము, ప్రకృతి మొదలగు వానిని బాగుగ నాలోచించి కోష్ఠముయొక్క స్వభావమును గుర్తెరుంగుటకై పైజెప్పిన యుత్తమాదిమాత్రలలో నత్యంతము హ్రస్వమైనమాత్రను ఉపయోగించుచు క్రమక్రమముగ కోష్ఠమును గుర్తెరిగి యుక్తమైనచో పిమ్మట నుత్తమాదిమాత్రలను యథాయోగ్యముగ నుపయోగించవలయును. ఈవిషయమునే వాగ్భటాచార్యులు ఇట్లుపదేశించిరి:—

"ద్వాభ్యాం చతుర్భిరష్టాభిః యామైర్జీర్యన్తి యాః క్రమాత్, హ్రస్వమధ్యోత్తమామాత్రాః తాః తాభ్యశ్చ హ్రసీయసీమ్, కల్పయేద్వీక్ష్య దోషాదీన్ ప్రాగేవైతత్ హ్రసీయసీమ్."

కొందరు రెండుపలములు హ్రస్వమాత్రయనియు, నాల్గుపలములు మధ్యమమాత్రయనియు, ఆరుపలము లుత్తమమాత్రయనియు వచించిరి; కాని జాఠరాగ్నియొక్క శక్తిని గమనింపక అట్టిమాత్ర నుపయోగించినచో ఆపత్తు సంభవించును కావున జీర్ణశక్తిననుసరించి మాత్రను నిర్ణయించుపద్ధతి ఇచ్చట చెప్పబడినది. ఇదియే వాగ్భటాచార్యులును చెప్పిరి కావున పైజెప్పినవిధముగ స్నేహమాత్రను కల్పించుటయే సమంజసముగ నుండును.

### ఉత్తమస్నేహమాత్రార్హులు, దానిగుణములు.

మూ. తాంస్త్రీన్ ప్రయోగాన్ వక్ష్యామి పురుషం పురుషం ప్రతి. ౩౦
ప్రభూతస్నేహనిత్యా యే క్షుత్పిపాసాసహా నరాః,
పావకశ్చోత్తమబలో యేషాం యే చోత్తమా బలే. ౩౧
గుల్మినః సర్పదష్టాశ్చ విసర్పోపహతాశ్చ యే,
ఉన్మత్తాః కృచ్ఛ్రమూత్రాశ్చ గాఢవర్చస ఏవ చ. ౩౨
పిబేయురుత్తమాం మాత్రాం, తస్యాః పానే గుణాన్ శృణు,
వికారాన్ శమయత్యేషా శీఘ్రం సమ్యక్ప్రయోజితా. ౩౩
దోషానుకర్షిణీ మాత్రా సర్వమార్గానుసారిణీ,
బల్యా పునర్నవకరీ శరీరేన్ద్రియచేతసామ్ ౩౪

వ్యా. వాడుకగా స్నేహము నధికముగ నుపయోగించి సాత్మ్యమైనవారును, ఆకలిదప్పులను ఓర్వలేనివారును, జఠరాగ్ని ప్రబలముగ నుండువారును, శరీరబలము అధికముగనుండువారును, గుల్మరోగపీడితులును, పాముకరచినవారును, విసర్పవ్యాధిపీడితులును, ఉన్మత్తులును, మూత్రకృచ్ఛ్రముకలవారును, గట్టిబడిన మలముగలవారును, వీరందరును పైజెప్పిన యుత్తమస్నేహమాత్రను పానముచేయదగును. అట్టి యుత్తమ

స్నేహమును పైజెప్పినరీతిగ దేశకాలాదులననుసరించి యథోక్తముగ నుపయోగించినచో పైజెప్పిన గుల్మాదిరోగములను అతిశీఘ్రముగ శమింపజేయును. అట్టిమాత్ర ఆయాదోషముల ననుసరించి కోష్ఠము, సంధి, మర్మములు, శాఖలు అనుమార్గముల ననుసరించి దోషముల శమింపజేయుటయకాక శరీరమునకును, ఇంద్రియములకును, మనస్సుకును, చక్కని బలమును కల్గించి శరీరమును క్రొత్తగజేయును. (ఇచ్చట "సమ్యక్ప్రయోజితా" అని చెప్పుటచేత ఈయుత్తమమాత్ర కొంచెమైనను వ్యత్యస్తమయినప్పుడు ప్రబలముగ హానిని గల్గించుననియు, దానంజేసి మిక్కిలి జాగ్రత్తతో నుపయోగించవలెననియు తెలియుచున్నది.) (ఎనిమిదిజాములకు జీర్ణమగునంత పరిమితికల్గినది యుత్తమమాత్ర.)

### మధ్యమమాత్రస్నేహార్హులు, దాన గల్గుగుణములు.

మూ. అరుష్కస్ఫోటపిడకాకండుపామాభిరర్దితాః,
కుష్ఠినశ్చ ప్రమీఢాశ్చ వాతశోణితకాశ్చ యే. 3౫
నాతిబహ్వాశినశ్చైవ మృదుకోష్ఠాస్తథైవ చ,
పిబేయుర్మధ్యమాం మాత్రాం మధ్యమాశ్చాపి యే బలే. 3౬
మాత్రైషా మన్దవిభ్రంశా న చాతిబలహారిణీ,
సుఖేన చ స్నేహయతి శోధనార్థే చ యుజ్యతే. 3౭

వ్యా. అరూంషిక, స్ఫోటకములు, పిటకలు, దురద, గజ్జి అనుసీవ్యాధులచే పీడింపబడినవారును, కుష్ఠరోగముకలవారును, ప్రమేహరోగపీడితులును, వాతరక్తవ్యాధిబాధితులును, మితముగ నాహారముచేయువారును, మృదుకోష్ఠముకలవారును, మధ్యమమైన బలముకలవారును పైజెప్పిన మధ్య (నాల్గుయామముల కాలమునకు జీర్ణమగు) మాత్ర ననుసరించి స్నేహమును పానముజేయవలెను. మధ్యమమాత్రచే నుపయోగించబడిన యీస్నేహపానము అధికముగ సంకటమును కల్గించదు. చాల బలహీనము చేయక బలమును మితముగ నుంచును. శరీరమున కెట్టిబాధల కల్గించక సుఖముగ స్నిగ్ధత్వమును కల్గించి కోష్ఠమును మృదువుగజేయును. శోధనమునకు ముందు అంగముగ స్నేహనము చేయుట విధిగనున్నది కావున అట్టిశోధనచికిత్సకు అంగముగ నుపయోగింపబడు స్నేహము మధ్యమమాత్ర నుపయోగింపవలెనని భావము. (ఇచ్చట మధ్యమమాత్ర శోధనాంగముగ నుపయోగ్యమనుటచేత ఉత్తమమాత్ర శమనమున కుపయోగింపదగినదని యేర్పడుచున్నది.)

ఱ హ్రస్వమాత్రగా స్నేహపానము చేయదగినవారు, దాని గుణములు. ఱ

మూ. యే తు వృద్ధాశ్చ బాలాశ్చ సుకుమారాస్సుఖోచితాః,
రిక్తకోష్ఠత్వమహితం యేషాం మన్దాగ్నయశ్చ యే. ౩౮
జ్వరాఽతీసారకాసాశ్చ యేషాం చిరసముత్థితాః,
స్నేహమాత్రాం పిబేయుస్తే హ్రస్వాం యేచాఽవరాబలే. ౩౯
పరిహారే సుఖా చైషా మాత్రా స్నేహనబృంహణీ,
వృష్యా బల్యా నిరాబాధా చిరం చాప్యనువర్తతే. ౪౦

వ్యా. వయస్సుచే వృద్ధులు (ముసలివారు)ను, బాలురును, సుకుమారముగ నుండువారును, సుఖము ననుభవింపదగిన (రాజులు మున్నగు)వారును, విరేచనాతియోగముచే రిక్తమైన కోష్ఠముకలవారును, అగ్ని మందగించినవారును, జ్వరము, అతిసారము, కాసము అనురోగములు చాలకాలముగ ననుసరించి వానిచే బాధపడువారును, చాల తక్కువయైన బలముకలవారును, పైజెప్పిన హ్రస్వ (రెండుజాములకు జీర్ణమగు)మాత్ర ననుసరించి స్నేహపానము జేయనగును. ఈస్వల్పమాత్ర పరిహారవిషయమై సుఖముగనుండును. (స్నేహపానమున గల్గుబాధలు ఇది యల్పమాత్ర యగుటవలన సుఖముగ పరిహారము జేయదగియుండునని భావము.) శరీరమును స్నిగ్ధముగ జేసి పుష్టిని కల్గించును. ఇంద్రియము (శుక్రము)ను బలపరుచును. శరీరమునకు బలమును కల్గించును. ఏవిధమైనబాధను కల్గింపదు. స్నేహగుణమును చాలకాలమువరకును శరీరమునం దనువర్తింపజేయును.

ఱ ఘృతమును పానముచేయదగినవారు. ఱ

మూ. వాతపిత్తప్రకృతయో వాతపిత్తవికారిణః,
చక్షుష్కామాః క్షతాః క్షీణాః వృద్ధాః బాలాస్తథాఽబలాః.
ఆయుః ప్రకర్షకామాశ్చ బలవర్ణస్వరార్థినః,
పుష్టికామాః ప్రజాకామాః సౌకుమార్యార్థినశ్చ యే. ౪౨
దీప్త్యోజస్స్మృతిమేధాగ్నిబుద్ధీన్ద్రియబలార్థినః,
పిబేయుస్సర్పిరార్తాశ్చ దాహశస్త్రవిషాగ్నిభిః. ౪౩

వ్యా. వాతపిత్తప్రకృతికలవారును, వాతపిత్తరోగములచే పీడింపబడినవారును, దృష్టిబలమును కోరువారును, ఉరఃక్షతరోగపీడితులును, ధాతువులు క్షీణించినవారును, వృద్ధులును, బాలురును, హీనబలముకలవారును, ఆయువు నధికముగ కోరువారును, బలమును శరీరకాంతిని కంఠస్వరమును కోరువారును, శరీరధాతువులపుష్టిని కోరువారును,

పుత్రసంతానమును కోరువారును, సౌకుమార్యము శరీరకాంతి, ఓజస్సు, స్మృతి (జ్ఞాపకశక్తి), మేధ, జఠరాగ్ని, బుద్ధిచతురాదీంద్రియములు అను వీనికన్నిటికిని బలాధిక్యమును కోరువారును, ఎండతాకుడుచేతను, ఆయుధములచేతను, విషముచేతను, అగ్నిచేతను బాధనొందినవారును ఘృతమును త్రాగవలెను.

## తైలపానము చేయదగినవారు.

మూ. ప్రవృద్ధశ్లేష్మమేదస్కాః చలస్థూలగళోదరాః,
వాతవ్యాధిభిరావిష్టాః వాతప్రకృతయశ్చ యే. ౪౪
బలం తనుత్వం లఘుతాం దృఢతాం స్థిరగాత్రతామ్,
స్నిగ్ధశ్లక్ష్ణతనుత్వక్తాం యే చ కాంక్షన్తి దేహినః ౪౫
క్రిమికోష్ఠాః క్రూరకోష్ఠాః తథా నాడీభిరర్దితాః,
పిబేయుశ్శీతలే కాలే తైలం తైలోచితాశ్చ యే. ౪౬

వ్యా. కఫంబును మేదస్సును వృద్ధినొందినవారును, కంఠంబును ఉదరంబును మిక్కిలి స్థూలమై కదలుచుండువారును, వాతవ్యాధులచే బాధింపబడువారును, వాతప్రకృతికలవారును తైలమును పానముచేయనగును. మరియు బలమును, శరీరకృశత్వమును, శరీరలాఘువమును, శరీరదార్ఢ్యమును, సంధిబంధాదులస్థిరత్వమును కోరువారును, చర్మమునకు స్నిగ్ధత్వమును శ్లక్ష్ణత్వము(నునుపు)ను, తనుత్వము(పలుచన)ను కోరువారును, కోష్ఠమున క్రిములుకలవారును, క్రూరకోష్ఠముకలవారును, నాడీవ్రణములచే పీడింపబడినవారును తైలమును త్రాగనగును. మరియు శీతకాలమునందును తైలపానము ప్రశస్తము. తైలపానముచేయు నలవాటుకలవారును తైలపానమున కర్హులు. (తైలము ఉష్ణవీర్యమగుటంజేసి శీతకాలమున సామాన్యముగ తైలపానము చెప్పబడినది.)

## వసాపానము చేయదగినవారు.

మూ. వాతాతపసహా యే చ రూక్షా భారాధ్వకర్శితాః,
సంశుష్కరేతోరుధిరాః నిష్పీతకఫమేదసః. ౪౭
అస్థిసంధిసిరాస్నాయుమర్మకోష్ఠమహారుజః,
బలవాన్ మారుతో యేషాం ఖాని చావృత్య తిష్ఠతి. ౪౮
మహచ్చాగ్నిబలం యేషాం వసాసాత్మ్యాశ్చ యే నరాః,
తేషాం స్నేహయితవ్యానాం వసాపానం విధీయతే. ౪౯

వ్యా. ఎండను గాలిని నోర్చువారును, రూక్షమైన శరీరముకలవారును, బరువును మోయుటచేతను, త్రోవనడచుటచేతను కృశించినవారును, రేతస్సు (శుక్రము) రక్తము కఫము మేదస్సు ఇవియొకటియైన శుష్కించినవారును, అస్థులు కీళ్లు సిరలు (సన్నని నరములు) స్నాయువులు (పెద్దనరములు) మర్మములు కోష్ఠము వీనిలో నెద్దానియందైన గొప్పబాధకలవారును, బలిష్ఠమైన వాతముచే నావరింప (అడ్డగింప) బడిన స్రోతస్సులు కలవారును, ప్రబలమైన జాఠరాగ్ని కలవారును, అధికమైన బలముకలవారును, వసను అలవాటుచేసి సాత్మ్యముగ నుండువారును, ఇట్టివారికి స్నేహమునకు వస నుపయోగింపవలెను. (వసాపానముచే స్నిగ్ధత్వము కల్గించవలెనని భావము.)

## మజ్జాస్నేహోపయోగార్హులు.

దీప్తాగ్నయః క్లేశసహాః ఘస్మరాః స్నేహసేవినః,
వాతార్తాః క్రూరకోష్ఠాశ్చ స్నేహ్యా మజ్జానమాప్నుయుః. ౫౦

వ్యా. మిక్కిలి తీవ్రమైన జాఠరాగ్నికలవారును, కష్టములకోర్చు స్వభావము కలవారును, అధికముగ (మితిమీరి) భుజించువారును, స్నేహపదార్థములను విశేషముగ సేవించు అలవాటుకలవారును, వాతవ్యాధిచే పీడితులును, క్రూరమైన కోష్ఠము కలవారును, వీరికి స్నేహన మవసరమైనపుడు మజ్జ (క్రొవ్వు)చే స్నేహనము చేయ నగును.

## స్నేహప్రకర్షకాలనిర్ణయము.

మూ. యేభ్యో యేభ్యో హితో యో యః స్నేహస్స పరికీర్తితః,
స్నేహనస్య ప్రకర్షౌ తు సప్తరాత్రత్రిరాత్రకౌ. ౫౧

వ్యా. ఇత్తెరంగున నెవరెవరికి ఏయేస్నేహములు హితముగ నుండునో అయ్యవి వేరువేరుగ వివరింపబడినవి. మరియు స్నేహనముయొక్క ప్రకర్షము (స్నిగ్ధతయధికమగుట) ఏడురాత్రులను మూడురాత్రులను ఆశ్రయించియుండును. (అనగా శరీరమున స్నిగ్ధత్వమును కల్గించుట ప్రకర్షము, అయ్యది మిక్కిలి యధికముగ చేయవలసినచో నేడురాత్రులవరకు స్నేహపానము జేయించవలెను. స్వల్పముగ స్నిగ్ధత్వము కల్గింపవలసిననాడు మూడురాత్రులు స్నేహపానము జేయనగునది. అంతకన్న నధిక కాలము స్నేహపానము చేయదగదని భావము.)

ఈవిషయము తంత్రాంతరమున నిట్లున్నది:—"త్ర్యహావరం సప్తదినం పరస్తు స్నిగ్ధో నరః స్వేదయితవ్య ఇష్టః, నాతః పరం స్నేహనమాదిశన్తి సాత్మీభవేత్సప్తదినాత్

పరస్తు" స్నేహపానమునకు మూడుదినములైనను ఏడుదినములైనను పరిమితకాలము. కావున మూడుదినములు స్నేహపానముచేసి స్నిగ్ధుడైనవాడైనను, ఏడుదినములు స్నేహపానముచేసి స్నిగ్ధుడైనవాడైనను స్వేదనమున కర్హుడగును. ఏడుదినములకు పైని స్నేహనము చేసినచో స్నేహము సాత్మ్యమగును; కావున నేడుదినములకు పైనిస్నేహనము ప్రయోగింపం జనదని భావము. ఈచెప్పిన స్నేహనకాలనియమము సద్యస్స్నేహనముల కన్న నితరవిషయమున కని యెరుంగునది. లేక మూడుదినములకన్న తక్కువ కాలమున స్నిగ్ధత కల్గదు. సద్యస్స్నేహనములని చెప్పినది స్నిగ్ధత్వాతిశయమును దెలియ జేయుటకై స్తుతిరూపముగ జెప్పినది. కావున మూడుదినములు స్నేహనమునకు ప్రథమ కల్పము.

## సామాన్యముగ స్నేహపానార్హులు.

మూ. స్వేద్యాశ్శోధయితవ్యాశ్చ రూక్షా వాతవికారిణః,
వ్యాయామమద్యస్త్రీనిత్యాః స్నేహ్యాస్స్యుర్యేచ చిన్తకాః. ౫౨

వ్యా. స్వతంత్రముగ స్వేదము (చెమటబుట్టించుట) చేతనే సాధ్యములగు వాతవ్యాధి మున్నగువ్యాధులచే పీడింపబడినవారును, వమనవిరేచనాది శోధన చికిత్సజేయ వలసినవారును, రూక్షశరీరులును, వాతవ్యాధిపీడితులును, వ్యాయామము మద్యపానము స్త్రీసంభోగము వీనిని నిత్యము సేవించువారును, మనస్సుచే నెప్పుడు యోచించుచుండు వారును స్నేహమున కర్హులు. (ఇచ్చట శోధనచికిత్సకు స్నేహస్వేదములు అంగములు గాన శోధనమునకు ముందు స్నేహనము అవశ్యము చేయవలెను. కావున 'స్వేద్యాః' అను పదముచేత శోధనాంగముగాక స్వతంత్రస్వేదసాధ్యములైన వాతవ్యాధిపీడితులకు స్నేహవిధి నియమింపబడినది. శోధనాంగస్వేదము 'శోధయితవ్యాః' అనుపదముచేతనే సంగ్రహింపబడునని యెరుంగునది.)

## స్నేహపాననిషిద్ధులు.

మూ. సంశోధనాదృతే యేషాం రూక్షణం సంప్రచక్షతే,
న తేషాం స్నేహనం శస్తం ఉత్సన్నకఫమేదసామ్. ౫౩
అభిష్యన్దాననగుదా నిత్యమన్దాగ్నయశ్చ యే,
తృష్ణామూర్ఛాపరీతాశ్చ గర్భిణ్యస్తాలుశోషిణః. ౫౪
అన్నద్విషశ్ఛర్దయన్తో జఠరామగరార్దితాః,
దుర్బలాశ్చ ప్రతాన్తాశ్చ స్నేహగ్లానా మదాతురాః. ౫౫

న స్నేహ్యాః వర్తమానేషు న నస్తో వస్తికర్మసు,
స్నేహపానాత్ ప్రజాయన్తే తేషాం రోగాస్సుదారుణాః. ౫౮

వ్యా. ఎవరికి శోధనము లేకయే కేవలము రూక్షణము మాత్రము విహితమైనదో అట్టివారలకు స్నేహనము జేయుట ప్రశస్తముకాదు. (లంఘనబృంహణీయాధ్యాయమున "అభిష్యన్దా మహాదోషాః మర్మస్థా వ్యాధయశ్చ యే, ఊరుస్తమ్భప్రభృతయః రూక్షణీయా నిదర్శితాః" అనుశ్లోకముచేత అభిష్యన్దములు, మహారోగములు, మర్మస్థానమున జనించువ్యాధులు, ఊరుస్తంభము మున్నగువ్యాధులు ఇవియన్నియు రూక్షణము జేయదగినవి యని రూక్షణము విధింపబడినది. ఈవ్యాధులయందు శోధనము చేయక కేవలము రూక్షణముచేయునెడ స్నేహనము కూడదు. శోధనముచేసి రూక్షణము చేయునప్పుడు శోధనాంగముగ స్నేహనము విధిప్రాప్తము కావున అచ్చట స్నేహనము శోధనాంగముగ చేయవలసియే యుండును, కావున నిషేధము లేదని భావము.)

మరియు కఫంబును మేదస్సును వృద్ధినొంది యున్నవారును, ముఖమునందును గుదమునందును స్రవించుచుండువారును, ఎల్లప్పుడును మందగించిన జఠరాగ్నికలవారును, దప్పిచేతను, మూర్ఛవ్యాధిచేతను పీడింపబడినవారును, గర్భిణీస్త్రీలును, తాలువులు (దవుడలు) శుష్కించియున్నవారును, అన్నద్వేషముకలవారును, వమనము లగుచున్నవారును, ఉదరవ్యాధిపీడితులును, అజీర్ణరోగముకలవారును, కృత్రిమవిషముచే పీడింపబడినవారును, బలహీనులును, మిక్కిలి క్షీణించిన ద్రవధాతువుకలవారును, స్నేహనముచే బడలునట్టివారును, మద్యపానాదులచే మత్తిల్లినవారును వీరందరును స్నేహపానమునకు అర్హులు కారు. మరియు నస్యకర్మ జేయునప్పుడును, వస్తికర్మ జేయునప్పుడును, స్నేహపానము జేయజనదు. పైని నిషేధింపబడినవారు స్నేహపానమును నిషేధము నుల్లంఘించి చేసినచో వారికి దానంజేసి మిక్కిలి క్రూరములైనవ్యాధులు సంభవించును. కావున స్నేహపానము కూడదనుట.

### అస్నిగ్ధలక్షణము.

మూ. పురీషం గ్రథితం రూక్షం వాయురప్రగుణో మృదుః,
పక్తా ఖరత్వం రౌక్ష్యం చ గాత్రస్యాస్నిగ్ధలక్షణమ్. ౫౭

వ్యా. పైజెప్పినపద్ధతుల నతిక్రమించక యథోక్తముగ స్నేహపానముచేసినప్పుడు శరీరము స్నిగ్ధము కావలెను. అటు స్నిగ్ధము కానియప్పుడు పురీషము గట్టిపడి జిడ్డులేక యుండలుగ నగును. వాతము ప్రతిలోమముగ సంచరించును. పాచకాగ్ని మందగించును. శరీరము జిడ్డులేక గరగరలాడుచుండును. ఇవి చక్కగ స్నిగ్ధముకానందుకు లక్షణము.

### సుస్నిగ్ధలక్షణము.

మూ. వాతానులోమ్యం దీప్తోఽగ్నిః వర్చస్స్నిగ్ధమసంహతమ్,
మార్దవం స్నిగ్ధతా చాఙ్గే స్నిగ్ధానా ముపజాయతే. ౫౮

వ్యా. స్నేహపానముచే చక్కగ స్నిగ్ధముకానివారికి వాతము అనులోమముగ సంచరించును. జఠరాగ్ని మిక్కిలి తీవ్రముగ జ్వలించి యాకలిపుట్టును. మలము జిడ్డు కల్గి (స్నిగ్ధమై) ద్రవయుక్తముగ నగును. శరీరమున మృదుత్వంబును, స్నిగ్ధత్వంబును (జిడ్డు కల్గియుండుట) కల్గును. ఇది చక్కగ స్నిగ్ధులైనలక్షణము.

### అతిస్నిగ్ధలక్షణము.

మూ. పాణ్డుతా గౌరవం జాడ్యం పురీషస్య విపక్వతా,
తన్ద్రీరరుచిరుత్క్లేశః స్యాదతిస్నిగ్ధలక్షణమ్. ౫౯

వ్యా. స్నేహపానము నధికముగ జేసినప్పుడు పాండువ్యాధి సంభవించును. శరీరమంతయుం బరువుగనుండును. తడిగుడ్డ గప్పినవిధముగ జడముగ నుండును. పురీషమున చక్కగ పక్వముకానిమలము కనుబడును. కునికిపాటు కల్గును. అరోచకము కల్గును. ఓకళింతలు కల్గును. ఇవియన్నియుం నతి స్నిగ్ధలక్షణములు.

### స్నేహపానమునకు ముందుదినమున పథ్యసేవనక్రమము.

మూ. ద్రవోష్ణమనభిష్యన్ది భోజ్యమన్నం ప్రమాణతః,
నాఽతిస్నిగ్ధమసంకీర్ణం శ్వస్స్నేహం పాతుమిచ్ఛతా. ౬౦

వ్యా. స్నేహపానము చేయదలచిన దినమునకు ముందుదినమున ద్రవముగను, వేడిగను, స్రోతస్సుల ద్రవమును గల్గింపనిదిగను, మిక్కిలి స్నిగ్ధముగాక కొంచెముగ స్నిగ్ధంబును, పరస్పరవిరుద్ధములగు (క్షీరమత్స్యాదులు) ద్రవ్యములతో కూడకయుండునదియుం నగు నాహారమును (తనకు నియమితమైన భోజనకాలమున నాకలిగొనియున్నపుడు) మితమైనప్రమాణముగ భుజింపవలెను.

### సంశమన-శోధన-స్నేహపానసామాన్యకాలము.

మూ. పిబేత్సంశమనం స్నేహం అన్నకాలే ప్రకాంక్షితః,
శుద్ధ్యర్థం పునరాహారే నైశే జీర్ణే పిబేన్నరః. ౬౧

వ్యా. దోషములు శమించుటకై పానము చేయబడు స్నేహము సంశమనమనంబడు; అట్టి సంశమానార్థము స్నేహపానముచేయునెడ తాను అన్నమును భుజించుటకు నియుతమైనకాలమున చక్కగ నాకలికొనియున్నపుడు సంశమనస్నేహమును త్రాగవలెను.

మరియు దోషముల బైట వెడలించుటకై స్నేహపానము జేయవలసినచో తాను రాత్రి భుజించినయాహారము జీర్ణమైనవెంటనే ఉదయకాలముననే శోధన స్నేహమును త్రాగవలెను.

శమన స్నేహమును జీర్ణకాలమైన యుదయకాలముననే త్రాగిన జీర్ణమగు నాహార లేపముతో గూడి దానిని రేపెట్టును గాని దోషశమనముల శమింపజేయనేరదు కావున తాను భోజనమునకు నియతమైన మధ్యాహ్నాదికాలమున శమన స్నేహమును త్రాగవలెను. అప్పుడు ఆకలిగొనియున్నప్పుడే త్రాగవలెను కాని కారణాంతరముచే నాకలిలేనప్పుడు త్రాగజనదు. ఈవిషయమును 'అన్న కాలే ప్రకాంక్షితః' అనువిశేషణముచే దెలిపెను. శోధన స్నేహమును ఉదయకాలముననే త్రాగినచో జీర్ణమగు నాహారలేపమును రేపెట్టి వెడలింపజూచును. శోధనమునకు అది అనుకూలము కావున 'నైశే జీర్ణే' అని చెప్పబడి నది. (ఈకాలనియమము శోధనశమనములకు సామాన్యముగ జెప్పబడినది కావున 'వాతపిత్తాధికో రాత్రౌ' అను నపవాదవిధికి విరోధము లేదని యెరుంగునది.)

## స్నేహము పానము జేసినప్పుడు, జీర్ణమైనపుడు చేయవలసినయుపచారములు.

మూ. ఉష్ణోదకోపచారీ స్యాత్ బ్రహ్మచారీ క్షపాశయః,
శకృన్మూత్రానిలోద్గారాన్ ఉదీర్ణాంశ్చ న ధారయేత్. ౬౨
వ్యాయామముచ్చైర్వచనం క్రోధశోకౌ హిమాతపౌ,
వర్జయేదప్రవాతం చ సేవేత శయనాసనమ్. ౬౩
స్నేహం పీత్వా నరస్స్నేహం ప్రతిభుఞ్జాన ఏవ చ,
స్నేహమిథ్యోపచారాద్ధి జాయన్తే దారుణా గదాః. ౬౪

వ్యా. మనుజుడు స్నేహమును పానముచేసినపిదప పానప్రక్షాళనాదులకు వేడి నీళ్లచేతనే యుపచారముల జేసికొనవలెను. స్త్రీసంభోగము మాని బ్రహ్మచారిగ నుండ వలెను. రాత్రులయందుమాత్రము పరుండి నిదురించవలెగాని పగలు నిదురించకూడదు. మలము, మూత్రము, అపానవాతము, త్రేనుపులు ఇవి వెడలనున్నపుడు వానివేగమును నిరోధించి ఆపకూడదు. వ్యాయామము, బిగ్గరగమాటలాడుట, క్రోధము, శోకము, చలి, శీతోపచారములు, ఎండ వీనినన్నిటిని వర్జించవలెను. విశేషముగ గాలిలేనిప్రదేశమున పరుండవలెను. అట్టిప్రదేశముననే వసించవలెను. మరియు స్నేహపానము చేసినపిదప అయ్యది జీర్ణమైనసమయమున తాను పానముజేసిన స్నేహమునకు విరుద్ధములగు గుణ వీర్యాదులతోగూడిన స్నేహమును ఆహారమున జేర్చికొని యథాయుక్తముగ భోజనము

సేయనగును. స్నేహపానము జేసినపుడు అపథ్యములగు నుపచారముల జేసికొనినయెడ మిక్కిలి క్రూరములైనరోగములు సంభవించును; కావున పైజెప్పిన నియమముల నతిక్రమింపక నడుచుకొనవలెనని భావము. (ఇచ్చట 'స్నేహే పీతే, జీర్ణే చ కిం హితాఽహితమ్' అను ప్రశ్నలరెంటికిని బదులు చెప్పబడినదని యెరుంగునది.)

మృదుక్రూరకోష్ఠలక్షణములు.

మూ. మృదుకోష్ఠస్త్రిరాత్రేణ స్నిహ్యత్యచ్ఛోపసేవయా,
స్నిహ్యతి క్రూరకోష్ఠస్తు సప్తరాత్రేణ మానవః. ౬౫
గుడమిక్షురసం మస్తు క్షీరముల్లోడితం దధి,
పాయసం కృసరం సర్పిః కాశ్మర్యత్రిఫలారసమ్. ౬౬
ద్రాక్షారసం పీలురసం జలముష్ణమథాపి వా,
మద్యం వా తరుణం పీత్వా మృదుకోష్ఠో విరిచ్యతే. ౬౭
విరేచయన్తి నైతాని క్రూరకోష్ఠం కదాచన,

వ్యా. మృదువైనకోష్ఠము స్నేహనార్థము అచ్ఛపేయస్నేహమును మూడు రాత్రులు పానము చేసినచో స్నిగ్ధముగ నగును. (స్నేహపానము మూడుదినములు చేసినంతట కోష్ఠము స్నిగ్ధమగునేని అయ్యది మృదుకోష్ఠమని భావము.) ఏడుదినములు స్నేహపానము చేసినంతట స్నిగ్ధమగునేని అయ్యది క్రూరకోష్ఠమని యెరుంగునది.

మరియు బెల్లము, చెఱకురసము, పెరుగుమీగడ, పాలు, చిలికినపెరుగు, పాయసము, కృసరము (నువ్వులను, బియ్యమును, ఉద్దిపప్పును జేర్చి చేయబడిన యవాగువు (గంజి), నెయ్యి, నేలగుమ్మడిరసము, త్రిఫలముల కషాయము, ద్రాక్షపండ్లరసము, గోగాకు రసము, వేడినీళ్లు, క్రొత్తగదింపబడిన మద్యము ఈ చెప్పబడినవానిలో దేని నుపయోగించినను మృదుకోష్ఠముకల మనుజునకు విరేచనమగును. (పైజెప్పిన బెల్లము మున్నగువానిని త్రాగించినచో విరేచనమగునెడ నయ్యది మృదుకోష్ఠమని మృదుకోష్ఠలక్షణము చూపబడినది.) మరియు పైజెప్పిన బెల్లము, చెఱకురసము మున్నగువాని యుపయోగమువలన క్రూరకోష్ఠముకలవానికి విరేచనములు కానేరవు. (కృసరలక్షణము 'తిలతణ్డులమాషైస్తు కృసరా త్రిసరా మతా' అని తంత్రాంతరమున జెప్పబడినది.)

క్రూరమృదుకోష్ఠముల స్వరూపము.

మూ. భవతి క్రూరకోష్ఠస్య గ్రహణ్యత్యుల్బణానిలా. ౬౮
ఉదీర్ణపిత్తాఽల్పకఫా గ్రహణీమన్దమారుతా,
మృదుకోష్ఠస్య తస్మాత్స సువిరేచ్యో నరః స్మృతః. ౬౯

వ్యా. (గ్రహణి యన జఠరాగ్నికి అధిష్ఠానమై యన్నమును గ్రహించునట్టి పెద్ద ప్రేగు (గొట్టమువలె నుండునది) గ్రహణి యనబడును.) అట్టిగ్రహణి క్రూరకోష్ఠముకల వారికి మిక్కిలి యుత్కటమైనవాతముతో కూడియుండును; కావున పై జెప్పిన బెల్లము మున్నగువానిచే మలబద్ధము కల్గును కాని విరేచనముల నవి కల్గింపనేరవు. మృదుకోష్ఠము కలవారికి గ్రహణి మిక్కిలి యుత్కటమైనపిత్తము కల్గి స్వల్పమైనకఫమును కల్గియుండును. కావున అట్టిమనుజులు సులభోపాయముచేగూడ విరేచనము జేయింపనగును.

(క్రూరకోష్ఠముకలవారికి గ్రహణియందు వాతము మిక్కిలి ప్రబలియుండును కావున నయ్యది గుడాదులకు (బెల్లము మున్నగువానికి)గల సరత్వమును నిరోధించును కావున క్రూరకోష్ఠముకలవారికి బెల్లము మున్నగునవి విరేచనముల గల్గింపనేరవు. మృదు కోష్ఠముకలవారికి గ్రహణికి విరోధమును కల్గించువాతము గ్రహణియందు లేదు. స్తంభింపజేయుస్వభావముకల శ్లేష్మము స్వల్పముగ నుండును. ప్రబలమైన సరత్వగుణము కల పిత్తము బలిష్ఠముగనుండును కావున బెల్లము మున్నగువానిచే గూడ మృదుకోష్ఠులకు విరేచనము లగును.)

స్నేహపానమున గల్గువ్యాపత్తులు, వానియుపచారములు.

మూ. ఉదీర్ణపిత్తా గ్రహణీ యస్య చాగ్నిబలం మహత్,
భస్మీభవతి తస్యాశు స్నేహః పీతోఽగ్నితేజసా. ౭౦
స జగ్ధ్వా స్నేహమాత్రాం తాం ఓజః ప్రక్షారయన్ బలీ,
స్నేహాగ్నిరుత్తమాం తృష్ణాం సోపసర్గాముదీరయేత్. ౭౧
నాలం స్నేహసమృద్ధస్య శమాయాన్నం సుగుర్వపి,
సా చేత్సుశీతం సలిలం నాసాదయతి దహ్యతే. ౭౨
యథైవాశీవిషః కక్షమధ్యగః స్వవిషాగ్నినా,
అజీర్ణే యది తు స్నేహే తృష్ణా స్యాత్ చ్ఛర్దయేద్భిషక్. ౭౩
శీతోదకం పునః పీత్వా భుక్త్వా రూక్షాన్నముల్లిఖేత్,

వ్యా. ఎవనికి గ్రహణి మిక్కిలి యుత్కటమైన పిత్తముకల్గి జఠరాగ్ని మిక్కిలి ప్రబలమైయుండునో, వాడు స్నేహపానము చేసినప్పుడు అట్టిస్నేహము బలిష్ఠమైన జాఠరాగ్నిదీప్తిచేత నతిశీఘ్రముగ భస్మమగును. స్నేహసంబంధముచే మిక్కిలి బలిష్ఠమైన యాజాఠరాగ్ని యుత్తమమైన (ఎనిమిదిజాములకు జీర్ణించ నంత పరిమితికల) యా స్నేహమాత్రను కూడ పూర్తిగ భుజించి (జీర్ణింపజేసి) యంతట తనివి

దీరక సర్వధాతు సారభూతమై హృదయము నాశ్రయించియుండు ఓజస్సును ద్రవింప జేసి దానిస్థానమునుండి స్రవింపజేసి నశింపజేయుచు, అనేకోపద్రవములతో కూడిన ప్రబలమైన దప్పినికల్గించును. అట్టియెడ స్నేహపానముచే (ఆజ్యాహుతిచే వృద్ధినొందిన బాహ్యాగ్నినిబోలె) వృద్ధినొందిన యాజాఠరాగ్నిని శమింపజేయు మిక్కిలి గురుత్వము గల యన్నము కూడ సమర్థము కానోపదు. అట్టిసమయమున మిక్కిలి చల్లనైన జలమును పానముజేయనిచో, ఎండినచిదుగుల నడుమజేరిన సర్పము తనవిషాగ్నిచేత దహించువిధముగ, శరీరమును తపింపజేయును. కావున అట్టిసమయమున చల్లనినీళ్లను త్రాగుటయు, ఆనీళ్లచేతనే యుపచారముల జేసికొనుటయు ముఖ్యకర్తవ్యమనుట. (లోకమున నిప్పు రగిలి దహించునప్పుడు నీళ్లబోసినగాని చల్లారదుకదా; అట్లేరంగుననే స్నేహసంబంధముచే లబ్ధబలమైన జాఠరాగ్ని శరీరమును కోష్ఠమును తపింపజేసి దప్పిని తీవ్రముగ గల్గించునప్పుడు శీతజలమును త్రాగినగాని శమించదని భావము.)

మరియు త్రాగబడిన యాస్నేహము జీర్ణము కాకున్న సమయమున తీవ్రమైన దప్పికల్గును; అట్టియెడ దప్పికి కారణమైన స్నేహమును తొలుత వమనముచేయించి పిమ్మట చల్లనినీళ్లను త్రాగించవలెను. అంతట స్నేహమంతయు వెడలకున్నచో రూక్షమైన యన్నమును భుజించవలెను. పిదప మరల స్నేహమును వమనము చేయించవలెను.

## పిత్తామావస్థయందు ఘృతపాననిషేధము, దాన గల్గువ్యాపత్తులు.

మూ. న సర్పిః కేవలం పిత్తే పేయం సామే విశేషతః । ౭౪
సర్వం హ్యనురజేత్ దేహం హత్వా సంజ్ఞాం చ మారయేత్.

వ్యా. పిత్తము ఆమముతో గూడియున్నపుడు సంస్కారములేని శుద్ధఘృతమును త్రాగకూడదు. (పిత్తము సామముగ నున్నపుడు ఒకవేళ పాచకములగు తిక్తకాదుల సంమేళముచే సంస్కరింపబడిన పంచతిక్తకాది ఘృతమును పానముచేసినను చేయవచ్చునుగాని, అట్టిసంస్కారము చేయని శుద్ధఘృతమును మాత్రము సర్వథా త్రాగకూడదని భావము.) అటుకాక పొరబడి పిత్తము సామముగ నున్నపుడు కేవలఘృతమును త్రాగినయెడ శరీరమును పిత్తమునకు సమానమైనవర్ణము కల్గునట్లు చేయును. వ్యాధి స్వభావముచే స్మృతిని చెడగొట్టి చంపును. (కావున పిత్తము పక్వముకాక సామావస్థయం దున్నపుడు సంస్కారరహితమైన ఘృతమును బొత్తుగ త్రాగజనదని భావము.)

ఇచ్చట నీపక్షాంతరముల నెరుంగునది:—పిత్తము ఆమావస్థ నున్నపుడు పాచనగుణముకల తిక్తకాదులచేర్చి పక్వముచేసిన ఘృతము నొకవేళ యుపయోగించవచ్చును

గాని అట్టిసంస్కారము చేయబడని కేవలఘృతమును మాత్రము ఒకప్పుడును పానము చేయదగదు. ఈయర్థము "సామే పిత్తే సర్పిః న పేయం, కేవలం (సంస్కారరహితం) ఘృతం తు విశేషతః న పేయం" అను అన్వయముచే లభించును. ఈయర్థమే పైన గన పరుపబడినది.

లేక—సంస్కరింపబడని ఘృతము సామముగ నున్నను నిరామముగ నున్నను (పిత్తసామాన్యముగ) నుపయోగింపజనదు. పిత్తము సామముగనున్నచో బొత్తుగకూడదు. అని యర్థము. ఇట్లు చెప్పుటచేత పిత్తసామాన్యముగ అసంస్కృతఘృతపానము నిషిద్ధము. పిత్తము ఆమావస్థలేక పక్వావస్థనున్నచో నొకసమయమున ఘృతపాన మావశ్యకమైనపుడు తిక్తకాది సంస్కృతఘృతమునే పానము చేయవలెనుకాని శుద్ధఘృతమును పానముచేయదగదని భావము. మరియుం పిత్తము ఆమావస్థ నున్నప్పుడు కేవల ఘృతపానము సర్వథా నిషిద్ధము. ఇట్టినియమము ననుసరించియే "అత ఊర్ధ్వం కఫే మన్దే వాతపిత్తోత్తరే జ్వరే, పరిపక్వేషు దోషేషు సర్పిః పానం యథామృతమ్" అని విధించినచోట కూడ దోషములు పక్వములైయున్నను సంస్కరింపబడిన ఘృతమునే పానము చేయవలెనని చెప్పనగును. కాని కేవల ఘృతపానము చేయదగదు. ఈయర్థము— "కేవలం (అసంస్కృతం) సర్పిః పిత్తే (పిత్తసామాన్యే, సామే నిరామే వా) న పేయమ్; సామేతు పిత్తే విశేషతః న పేయమ్" అని యన్వయించుటచే లభించును.

లేక—పిత్తే సామే కేవలం, సర్పిః విశేషతో న పేయం, (కింతు) పిత్తేతరయోః వాతకఫయోః సామయోః తైలాదీన్యపి అపేయం" అని యొకవిధమైన యన్వయము. ఈపక్షమున 'పిత్తే పేయం' అనుచోట అకారమును ప్రశ్లేషముచేసి 'అపేయం' అని పదవిభాగము చేయనగును. పిత్తముమాత్రము ఆమావస్థ నున్నపుడు ఘృతపాన మొక్కటియే నిషిద్ధము కాదు. వాతకఫములు ఆమావస్థ నున్నపుడు వానికి విహితములగు తైలాదులును పానార్హములుకావు. అని యర్థము. పిత్తము ఆమావస్థనున్నపుడు ఘృతపానము ఎట్లు చేయదగదో అత్తెరంగుననే వాతమైనను కఫమైనను ఆమావస్థను నున్నపుడు వానికి సామాన్యముగ జెప్పియుండు తైలవసామజ్జలును పానము జేయందగవని భావము. (ఈయర్థముచేత పిత్తము ఆమావస్థనున్నపుడు ఘృతపానంబును, వాతము ఆమావస్థనున్నపుడు తైలపానంబును, కఫము ఆమావస్థ నున్నపుడు వసామజ్జపానంబును నిషిద్ధములని ఫలితార్థము.)

### స్నేహవ్యాపత్తులు, వానిచికిత్స.

మూ. తన్ద్రా సోత్క్లేశమానాహః జ్వర స్తమ్భో విసంజ్ఞతా. ౭౫
కుష్ఠాని కణ్డూః పాణ్డుత్వం శోఫోఽర్శాంస్యరుచి స్తృషా,

జఠరం గ్రహణీదోషః స్తైమిత్యం వాక్యనిగ్రహః. ౭౬
శూలమామప్రదోషాశ్చ జాయన్తే స్నేహవిభ్రమాత్,
తత్రాప్యుల్లేఖనం శస్తం స్వేదః కాలప్రతీక్షణమ్. ౭౭
ప్రతి ప్రతి వ్యాధిబలం బుద్ధ్వా స్రంసన మేవ చ,
తక్రారిష్టప్రయోగశ్చ రూక్షపానాన్న సేవనమ్. ౭౮
మూత్రాణాం త్రిఫలాయాశ్చ స్నేహవ్యాపత్తిభేషజమ్,

వ్యా. పైజెప్పిన స్నేహములను యథోక్తవిధికి వ్యత్యస్తముగ సేవించినచో నీక్రింద చెప్పబడువ్యాధులు సంభవించును:—కునికిపాటు, వమనములు, ఆనాహము (కడుపుబ్బరము), జ్వరము, స్తంభము (శరీరము స్తంభించి యుండుట), స్మృతితప్పుట, కుష్ఠము, దురద, పాండురోగము, వాపు, అర్శోరోగము (మూలవ్యాధి, అరోచకము, దప్పి, మహోదరము, గ్రహణీరోగము, స్తైమిత్యము (శరీరముపై తడిగుడ్డ గప్పినవిధముగ చర్మము మొద్దుబారుట), నోట మాటవెడలక నిలచియుండుట, శూలము, అజీర్ణము చే గల్గువ్యాధులు ఇవియన్నియు స్నేహవ్యత్యాసమున గల్గువ్యాపత్తులు.

పైజెప్పిన స్నేహవ్యాపత్తులయందు అన్నిటియందును వమనముచేయించుట చాల ప్రశస్తము. మరియు చెమటబుట్టించుటయు, స్నేహము జీర్ణమగునంతవరకు ఆహారము భుజించక యూరకయుండుటయు, చాలమంచిది. మరియు నాయావ్యాధిస్వభావము బలాబలమును చక్కగ గమనించి తత్తదనుగుణముగ వమనవిరేచనములచే దోషముల వెడలింపనగును. పుల్లని మజ్జిగనైనను చికిత్సావిధానమున జెప్పబడు అరిష్టములనైనను పానాదిరూపముగ ప్రయోగింపనగును. రూక్షములుగ (జిడ్డు పదార్థములులేని) నుండు అన్నపానముల నుపయోగింపనగును. మూత్రవర్గమున జెప్పిన మూత్రములను, త్రిఫలములను సేవించుటయు స్నేహమున గల్గిన వ్యాపత్తులయందు చికిత్సయగును.

### స్నేహవ్యాపత్తికారణములు.

మూ. అకాలే చాఽహితశ్చైవ మాత్రయా న చ యోజితః. ౭౯
స్నేహో మిథ్యోపచారాచ్చ వ్యాపద్యేతాఽతిసేవితః,

వ్యా. స్నేహపానమునకు విధించినకాలమునకు వ్యత్యయముగనుండుకాలమున స్నేహపానము జేసినను, తనకు హితముకాని స్నేహమును త్రాగినను, స్నేహమునకు నియమించినమాత్రను (పరిమాణమును) అనుసరించక వ్యత్యస్తముగ స్నేహపానముచేసినను,

రముకలవారు చక్కెరపాకమును, అల్లపురసమును, నువ్వులనూనెను, మద్యమున కలిపి త్రాగినచో శరీరము స్నిగ్ధమగును. వేచబడినమాంసముతో గూడ నన్నమును జీర్ణమైన పిదప భుజింపవలెను. (పైజెప్పిన ఫాణితాదియుక్తమద్యమును త్రాగి అది జీర్ణమైనపిదప వేయించబడినమాంసముతో గూర్చి యన్నమును భుజింపవలెను. అట్లుచేసినయెడ రూక్షశరీరము స్నిగ్ధమగునని భావము.)

### మఱికొన్ని స్నేహానయోగములు.

మూ. తైలం సురాయా మణ్డేన వసాం మజ్జానమేవ వా. ౮౭
పిబేత్సఫాణితం క్షీరం నరస్స్నిహ్యాతి వాతికః,
ధారోష్ణం స్నేహసంయుక్తం పీత్వా సశర్కరం పయః. ౮౮
నరస్స్నిహ్యాతి పీత్వా వా సరం దధ్నస్సఫాణితమ్,
పాఞ్చప్రసృతికీ పేయా పాయసో మాషమిశ్రకః. ౮౯
క్షీరసిద్ధో బహుస్నేహః స్నేహయేదచిరాన్నరమ్,
సర్పిస్తైలవసామజ్జా తణ్డులప్రసృతైశ్శృతాః. ౯౦
పాఞ్చప్రసృతికీ పేయా పేయా స్నేహానమిచ్ఛతా,

వ్యా. మనుజునకు వాతము ప్రకోపించినపుడు నువ్వులనూనెనైనను, వసనైనను, మజ్జనైనను సురామండముతోజేర్చి త్రాగినను, చక్కెరపాకముతో పాలనుకలిపిత్రాగినను శరీరము స్నిగ్ధమగును. మరియు ధారోష్ణమైన (అప్పుడు పిండి నురుగుతోగూడి వేడిగ నుండునదియైన) యావుపాలను స్నేహద్రవ్యముతోగూర్చిత్రాగినను, పాలతో చక్కెర కలిపి త్రాగినను, పెరుగుమీదిమీగడతో చక్కెరపాకముకలిపి త్రాగినను, మనుజుడు స్నిగ్ధశరీరుడగును. క్రిందచెప్పబడు పాంచప్రసృతకమనుగంజిని పానముజేసినను, మినుపపప్పును క్షీరమునజేర్చి మిక్కిలి చమురుకల్గునట్లు కాచబడినపాయసమును త్రాగినను అతి శీఘ్రముగ శరీరము స్నిగ్ధమగును. మరియు నెయ్యి, నూనె, వస, మజ్జ, బియ్యము ఈ యైదిటిని ఒక్కొకప్రసృతమువంతునజేర్చి కాచబడినగంజి పాంచప్రసృతికి (ఐదుప్రసృతముల పరిమాణముకల) యవాగువనబడును. స్నేహానమును కోరుమానవుడు ఈపాంచప్రసృతికి పేయమనుపానముజేసినయెడ చక్కగ శరీరము స్నిగ్ధమగును అని భావము.

### కొన్నిరోగములయందు కొన్నిస్నేహములనిషేధము.

మూ. గ్రామ్యానూపౌదకం మాంసం గుడం దధి పయస్తిలాన్,
కుష్ఠీ శోథీ ప్రమేహీ చ స్నేహనే న ప్రయోజయేత్. ౯౧

వ్యా. కుష్ఠరోగముకలవారును, వాపుకలవారును, ప్రమేహరోగముకలవారును, స్నేహపానము చేసికొనవలసినప్పుడు గ్రామములయందు జంతువులమాంసమును, జలప్రాంతమున నుండు జంతువులమాంసమును, జలముననుండు మత్స్యాదిజంతువులమాంసమును, బెల్లమును, పెరుగును, పాలను, నువ్వులను వీని నుపయోగింపఁజనదు. (కుష్ఠాదిరోగపీడితులు స్నేహపానమునకై గ్రామ్యాదిజంతువులమాంసమును, బెల్లము మున్నగు ద్రవ్యములను ఉపయోగింపఁజనదని భావము.)

—కుష్ఠశోఫప్రమేహములయందు స్నేహపానవిధి.—

మూ. స్నేహైర్యథాస్వం తాన్ సిద్ధైః స్నేహయేదవికారిభిః,
పిప్పలీభిః హరీతక్యా సిద్ధైస్త్రిఫలయాపి వా. ౯౨
ద్రాక్షామలకయూషాభ్యాం దధ్నా చామ్లేన సాధయేత్,
వ్యోషగర్భం భిషక్ స్నేహం పీత్వా స్నిహ్యతి తన్నరః. ౯౩

వ్యా. పైజెప్పిన కుష్ఠము, శోఫ, ప్రమేహము అను నీరోగములయందును పిప్పళ్లు కరకకాయలు, త్రికటుకములు అనునీమూటిని వేరువేరుగ జేర్చి ఆయారోగమునకు శరీరతత్వాదులకు అనుగుణములైనఘృతము మున్నగు స్నేహములను పక్వముచేసి స్నేహపానము చేయనగును. (ఇచ్చట యథాసంఖ్యము నవలంబించి కుష్ఠరోగమున పిప్పళ్లనుజేర్చి పక్వముచేయబడిన స్నేహముచేతను, శోఫరోగమున కరకకాయలచేర్చి పక్వమైన స్నేహముచేతను, ప్రమేహమునందు త్రికటుకములజేర్చి పక్వముచేయబడిన స్నేహముచేతను స్నేహపానముచేయనగునని యర్థముజెప్పెదరు. ఇది వ్యాధిదోషాదుల గమనించి యథోచితముగ నాచరింపదగు.)

మరియు ద్రాక్షాకషాయము, ఉసిరికకాయలకషాయము, పులిసినపెరుగు, ఈమూడు ద్రవములను నెయ్యి మున్నగు స్నేహద్రవ్యమున జేర్చి అందు త్రిఫలముల కల్కమును కలిపి స్నేహపాకవిధిగ వైద్యుడు పక్వముచేసి త్రాగించినయెడ సులభముగ స్నిగ్ధమగును.

—స్నేహనయోగ్యఘృతము.—

మూ. యవకోలకులుత్థానాం రసాః క్షీరం సురా దధి,
క్షీరః సర్పిశ్చ తత్సిద్ధం స్నేహనీయం ఘృతోత్తమమ్. ౯౪

వ్యా. యవలు, రేగుపండ్లు, ఉలవలు ఈమూటిరసములు; పాలు, మద్యము, పెరుగు అను నీయారుద్రవములను ఘృతమునకు సమభాగముగజేర్చి అందు యవక్షార

మును కల్కముగఁ జేర్చి ఘృతపాకవిధి ననుసరించి పక్వము జేయవలెను. ఈఘృతము స్నేహమునకు మిక్కిలి యుత్తమ మైయుండును. (ఇచ్చట ఘృతపాకపరిభాషానుసారముగ పక్వము చేయునది.)

యోనిశుక్రదోషముల కుపయోగ్యస్నేహము.

మూ. తైలమజ్జవసాసర్పిః బదరత్రిఫలారసైః,
యోనిశుక్రప్రదోషేషు సాధయిత్వా ప్రయోజయేత్. ౯౫

వ్యా. తైలము, మజ్జ, వస, ఘృతము అను నీనాల్గుస్నేహములను రేగుపండ్లరసమును త్రిఫలాకషాయమును కలిపి సిద్ధముచేసి యోనిరోగములయందును, శుక్రరోగములయందును స్నేహనమునకై ఉపయోగింపనగును (ఇచ్చట తైలాదుల నాల్గిటియందును బదరత్రిఫలారసముల కలిపి కల్కములేకయే పక్వముచేయవలెనని యెరుంగునది).

స్నేహము శరీరమున వ్యాపించుటకు దృష్టాంతము.

మూ. గృహ్ణాత్యమ్బు యథావస్త్రం ప్రస్రవత్యధికం యథా,
యథాగ్నిర్జీర్యతి స్నేహ స్తథాస్రవతి చాధికః. ౯౬
యథా చాక్లేద్య మృత్పిణ్డం ఆసిక్తం త్వరయా జలమ్,
స్రవతి స్రంసతే స్నేహః తథా త్వరితసేవితః. ౯౭

వ్యా. లోకమున నొకగుడ్డను మితమైననీళ్లచేత తడిపినయెడ ఆనీళ్లను గుడ్డ పీల్చి తనయందు నిమిడించికొనును; ఆవిధముగనే అది బలమునననుసరించి తదనుగుణముగ మాత్రను కల్పించి స్నేహమును త్రాగినచో నయ్యది శరీరమున జాఠరాగ్నిచే జీర్ణమై చక్కఁగ స్నిగ్ధముగఁ జేయును. మరియు ఒకగుడ్డను మిక్కిలి యధికమైన నీళ్లలోముంచి యెత్తినచో నీళ్లు గుడ్డకు మిక్కుటమై వృథాగా కారిపోవును కదా; ఆరీతిగనే అగ్నిబలమును గమనించక మాత్రాధికముగ స్నేహమును త్రాగినయెడ నయ్యది మిక్కుటమగుటచే జాఠరాగ్నిచే జీర్ణముకాక గుదమునుండి బైటవెడలును. (దానంజేసి యనేక వ్యాపత్తులు కల్గును. కావున యథాయోగముగ జాఠరాగ్నికి దగిన ప్రమాణముగ మాత్రను కల్పించి యుపయోగించిన యథోక్తగుణముల గల్గించునని భావము.)

మరియు ఒకమట్టిపెళ్లపై నతిత్వరితముగ నీళ్లుపోసినయెడ నాజలము మట్టిపెళ్లను కొంచెముగనే తడిపి క్రిందికిజారిపోవును; ఆవిధముగ నొకటేదినమున స్నేహమును త్వరితముగ నధికముగ త్రాగిన నయ్యది ధాతువులతో కలియకయే శీఘ్రముగ బైటవెడలును. దానంజేసి స్నిగ్ధత కల్గనేరదు. (కావున నొకదినమునందే త్వరపడి యధికముగ స్నేహ

మును త్రాగక, పైజెప్పిన త్రిరాత్రసప్తరాత్రకాలనియమము ననుసరించి యథోక్తముగ స్నేహపానము జేసినయెడ నయ్యది సుఖముగ జాఠరాగ్నిసంబంధముచే జీర్ణమై స్నిగ్ధత్వ మును నిరపాయముగ గల్గించునని భావము.) ఈవిషయము శిష్యప్రశ్నలో లేకున్నను శిష్యబోధార్థముగ జెప్పబడినదని యెరుంగునది.

లవణయుక్తస్నేహము శీఘ్రముగ స్నేహనమునుట.

మూ. లవణోపహితాః స్నేహాః స్నేహయన్త్యచిరాన్నరమ్,
తద్ధ్యభిష్యన్ద్యరూక్షం చ సూక్ష్మముష్ణం వ్యవాయి చ. ౯౮

వ్యా. ఏ స్నేహమునందైనను లవణమునుకూడ చేర్చి యుపయోగించినచో నతి శీఘ్రముగ మనుజుని స్నిగ్ధముగజేయును. లవణము ద్రవమును కల్గించి స్రవింపజేయునది (యగుటచే శరీరమున ద్రవమును పుట్టించును.) రూక్షగుణములేనిది (కావున స్నేహ మునకు సహాయకారి యగును). సూక్ష్మగుణముకల్గినది (కావున శరీరమున శీఘ్రముగ వ్యాపించుటకు సహకారి యగును.) ఉష్ణవీర్యము కల్గినది. వ్యవాయిగుణము కల్గినది (తొలుత శరీరమున వ్యాపించి పిమ్మట జీర్ణమగునది కావున తొలుత శరీరమున వ్యాపింప జేసి జీర్ణము నొందించును.) (ఇట్టిగుణములు కల్గినది యగుటచే స్నేహద్రవ్యమును శరీరమున వ్యాపింపజేసి శీఘ్రముగ స్నేహనమును కల్గించునని భావము.)

స్నేహ-స్వేద-సంశోధనములకు పౌర్వాపర్యక్రమము.

మూ. స్నేహమగ్రే ప్రయుంజీత తతస్స్వేదం అనన్తరమ్,
స్నేహస్వేదోపపన్నస్య సంశోధనమథేతరత్. ఇతి. ౯౯

వ్యా. మనుజునకు తొలుత స్నేహము నుపయోగించి స్నిగ్ధత కల్గినపిదప స్వేదము (చెమటను) విధ్యుక్తముగ వెడలింపనగును. స్నేహ స్వేదవిధుల యథోక్తముగజేసిన పిదప (శరీరము స్నిగ్ధమై స్వేదము చక్కగ వెడలినపిమ్మట) వమనవిరేచనరూపమైన సంశోధనమును ప్రయోగించవలెను. (ఇచ్చట స్నేహ స్వేదములు శోధనమునకు పూర్వాం గములగుటచేత స్నేహ-స్వేద - ఉపకల్పనీ యాధ్యాయములకు పౌర్వాపర్యసంబంధము సూచింపబడినది యని యెరుంగునది.)

అధ్యాయవిషయసంగ్రహము.

మూ. స్నేహాః స్నేహవిధిః కృత్స్నో వ్యాపత్సిద్ధిః సభేషజా,
యథాప్రశ్నం భగవతా వ్యాహృతం చాన్ద్రభాగినా.. ౧౦౦

వ్యా. ఈ స్నేహాధ్యాయమునందు స్నేహంబులును, స్నేహవిధానంబును, పలు దెరంగులైన స్నేహవ్యాపత్తులును, వానికి దగిన యౌషధంబును ఇవి యన్నియు తాను ప్రశ్న జేసిన క్రమము ననుసరించి యగ్నివేశునిచే వివరింపబడియె. (ఇచ్చట చాంద్రభాగి యనగ చంద్రభాగనదీసమీపముననుండు అగ్నివేశుడని యర్థము.)

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
స్నేహాధ్యాయో నామ త్రయోదశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకమహర్షిచే సంస్కరింపబడినదియు నగు నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమునందు స్నేహాధ్యాయమనునది పదుమూడవ యధ్యాయము సమాప్తము.

## చతుర్దశాధ్యాయము.

అవతారిక:—పైయధ్యాయాంతమున 'స్నేహస్వేదోపపన్నస్య సంశోధనం' అని చెప్పినప్రకారము క్రమానుసారముగ నీయధ్యాయమున స్వేదవిధి చెప్పబడును:—

మూ. అథాతః స్వేదాధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. స్నేహాధ్యాయమును చెప్పినపిదప స్వేదవిధిని దెల్పునట్టి స్వేదాధ్యాయమును త్రికాలజ్ఞానవేదియగు నాత్రేయుడు చెప్పినదానికి న్యూనాతిరేకము కానట్లు వివరించెదనని యర్థము. (స్వేదమన ఉష్ణమైన (వేడియైన) ద్రవ్యముచే నొత్తడము మున్నగుదానివలన శరీరముపై చెమటపుట్టించుట స్వేదమనబడును.

### స్వేదమున శమించుదోషములు.

మూ. అతస్స్వేదాః ప్రవక్ష్యన్తే యైర్యథావత్ప్రయోజితైః,
స్వేదసాధ్యాః ప్రశామ్యన్తి గదా వాతకఫాత్మకాః. ౩

వ్యా. విధ్యుక్తప్రకారము ప్రయోగింపబడిన యేస్వేదములచేత స్వేదసాధ్యములగు వాతవ్యాధులును కఫవ్యాధులును శాంతినొందునో, అట్టిస్వేదములు చెప్పబడును.

'స్వేదసాధ్యాః' అని చెప్పుటచేత స్వేదసాధ్యములైన వాతవ్యాధులును, కఫవ్యాధులును శమింపజేయునవి స్వేదములని యర్థము. ఇట్లు చెప్పుటచేత మహోదరము మున్నగు వ్యాధులు వాతకఫములచే జనించినను స్వేదముచే సాధ్యములు కావు. కావున నవి స్వేదవిధానముచే శాంతినొందవని భావము. 'వాతకఫాత్మకాః' అనుచోట సంసర్గము

లేక ప్రత్యేకముగ వాతముచేనైనను, కఫముచేనైనను జనించినవ్యాధులను స్వేదము శమింపజేయునని యెరుంగునది.

### స్వేదప్రయోజనము.

మూ. స్నేహపూర్వం ప్రయుక్తేన స్వేదేనావర్జితేఽనిలే,
పురీషమూత్రరేతాంసి న సజ్జన్తి కథంచన. ౪
శుష్కాణ్యపి హి కాష్ఠాని స్నేహస్వేదోపపాదనైః,
నమయన్తి యథాన్యాయం కిం పునర్జీవతో నరాః. ౫

వ్యా. పై స్నేహాధ్యాయమునజెప్పిన విధిప్రకారము తొలుత స్నేహపానముజేసి శరీరము స్నిగ్ధమైనపిదప స్వేదమును (చెమట బుట్టించు విధానమును) ప్రయోగించినచో వాతము ప్రకోపము తగ్గి యనులోమముగ నగును. వాతము ప్రకోప ముడిగినప్పుడు పురీషంబును మూత్రంబును శుక్రంబును కోష్ఠమున నడ్డగింపబడక యుండును. ద్రవము లేక యెండిన కట్టెలును వానికి చమురు పూసి నిప్పుసెగలో కాచినచో స్వభావసిద్ధముగనే వంగును. నిర్జీవములగు కాష్ఠములే స్నేహస్వేదములచే వంగుచుండ ఇంక సజీవులైన మనుజులు స్నేహస్వేదములచే మార్దవమునొందక యుందురా? (కావున స్నేహస్వేదవిధుల నుపయోగించుటచే వాతము శమించును. కోష్ఠము మెత్తపడును).

### యుక్తస్వేదస్వరూపము.

మూ. రోగర్తువ్యాధితాపేక్షో నాత్యుష్ణోఽతిమృదుర్న చ,
ద్రవ్యవాన్ కల్పితో దేశే స్వేదః కార్యకరో మతః. ౬

వ్యా. రోగములు శీతవర్షాదిఋతువులు రోగపీడితులు వీని బలాబలములను గమనించి తత్తదనుగుణముగను, మిక్కిలి తీవ్రమైన తాపంబును మిక్కిలి మృదువును గాక సమస్థితి నుండునదిగను, స్నిగ్ధరూక్షాది గుణయుక్తమైన ద్రవ్యములతో గూడినదిగను కల్పింపబడిన స్వేదము నుపయోగించినచో నామాశయము మున్నగు ప్రదేశమునందు చక్కగ పనిచేయును. (రోగముయొక్కయు శీతోష్ణాది కాలముయొక్కయు బలాబలము నెరింగి ఆమాశయాది స్థానానుగుణముగ మిక్కిలి తీవ్రంబును మిక్కిలి మృదువునుగాక సమోష్ణముగ నుండునట్లు యథోచితముగ స్నేహద్రవ్యమునైనను రూక్షద్రవ్యమునైనను గూర్చి కల్పింపబడిన స్వేదము ఆమాశయాది స్థితదోషమును చక్కగ మృదువుగజేసి యథోక్తకార్యమును జేయునని భావము.)

### తీవ్రమృదుమధ్యస్వేదోపయోగ్యములు.

మూ. వ్యాధౌ శీతే శరీరే చ మహాన్ స్వేదో మహాబలే,
దుర్బలే దుర్బలస్స్వేదః మధ్యమే మధ్యమో హితః. ౭

వ్యా. వ్యాధియైనను, కాలకృతమైన శీతంబైనను, రోగి శరీరంబైనను మిక్కిలి బలిష్ఠముగ నున్నపుడు మిక్కిలి వేడిగ నుండునట్లు స్వేదమును చేయనగును. అటుగాక పైజెప్పిన వ్యాధిశీతశరీరములు మిక్కిలి బలహీనములై యున్నపుడు మృదువైన స్వేదము నుపయోగింపవలెను. లేక వ్యాధి శీతము శరీరము మధ్యబలములుగ నున్నపుడు మధ్యమముగ(మిక్కిలి తాపంబును మిక్కిలి మృదువునుగాక)నుండు స్వేదము నుపయోగించుట చాల హితకరము. (ఇది బలానుసారముగ స్వేదకల్పననిర్ణయము.)

### అయాదోషానుసారముగ స్వేదకల్పనము.

మూ. వాతశ్లేష్మణి వాతే వా కఫే వా స్వేద ఇష్యతే,
స్నిగ్ధరూక్షః తథా స్నిగ్ధో రూక్షశ్చాప్యుపకల్పితః. ౮

వ్యా. వాతకఫములు రెండును ప్రకోపించియున్నపుడు స్నిగ్ధంబును రూక్షంబునైన ద్రవ్యాదులజేర్చి కల్పింపబడిన స్వేదమును, కేవల వాతమున స్నిగ్ధద్రవ్యముతో కల్పింపబడిన స్వేదమును, కేవల కఫమున రూక్షగుణముకల ద్రవ్యముల గూర్చి కల్పింపబడినస్వేదము నుపయోగింపదగును. (ఇది ద్రవ్యాపేక్షముగ స్వేదకల్పనము.)

### ఆమాశయాది దేశానుసారముగ స్వేదకల్పనము.

మూ. ఆమాశయగతే వాతే కఫే పక్వాశయాశ్రితే,
రూక్షపూర్వో హితస్స్వేదః స్నేహపూర్వస్తథైవ చ. ౯

వ్యా. వాతము (కఫస్థానమైన) ఆమాశయమున జేరినపుడు తొలుత కఫస్థానమునకు అనుకూలమైన రూక్షస్వేదమునుజేసి, పిమ్మట వాతమున కనుకూలమైన స్నేహద్రవ్యముతో గల్పింపబడిన స్వేదము నుపయోగించుట హితకరము. మరియు కఫము వాతస్థానమైన పక్వాశయమున జేరినపుడు తొలుత వాతమున కనుకూలమైన స్నిగ్ధస్వేదము నుపయోగించి, పిమ్మట కఫమునకు అనుకూలమైన రూక్షస్వేదము నుపయోగించునది.

ఇచ్చుట వాతము కఫస్థానమున జేరినపుడును, కఫము వాతస్థానమున జేరినపుడును తొలుత నట్టిస్థానము నాశ్రయించి దోషమునకు దగిన స్వేదమును జేసి, పిమ్మట నాస్థానమునకు వచ్చియుండు దోషమున కనుకూలమైన స్వేదమును చేయవలెను.

ఈవిషయము "స్థానం జయేద్ధి పూర్వం తు స్థానస్థస్యాఽవిరుద్ధతః" అని చెప్పబడినది. కావున తొలుత స్థానమునకు దగిన చికిత్సజేసి పిదప ఆస్థానమున జేరినదోషమును శమింపజేయుట యుచితము. ఇది (దేశాపేక్షముగ స్వేదకల్పన విధానము.)

### అవయవభేదమునుబట్టి స్వేదకల్పనము.

మూ. వృషణౌ హృదయం దృష్టీ స్వేదయేన్మృదునైవ వా,
మధ్యమం వఙ్క్షణౌ శేషమఙ్గావయవమిష్టతః. ౧౦

వ్యా. మరియు అండకోశము, హృదయము, కన్నులు, ఈస్థలములయందు కేవలము స్వేదముచేతనే సాధింపవలసిన వ్యాధులు సంభవించినప్పుడు మృదుస్వేదమును గల్పించి యుపయోగింపనగును. అట్టిస్థలములయందలి వ్యాధులు మృదుస్వేదనముగాక నుపాయాంతరములచే సాధింపదగిన యవస్థనున్నపుడు మృదుస్వేదమును గూడ మానుట చాలమంచిది. గెజ్జలయందు స్వేదసాధ్యవ్యాధులు కల్గినపుడు మధ్యమస్వేదము నుపయోగింపదగును. పైజెప్పిన స్థలములు దక్క తక్కిన యవయవములయందు తనకిచ్చవచ్చినట్లు స్వేదనము చేయవచ్చును.

### నేత్ర-హృదయములయందు స్వేదనముచేయునపుడు చేయదగిన యుపచారములు.

మూ. సుశుద్ధైర్నక్తకైః పిణ్డ్యా గోధూమానామథాపి వా,
పద్మోత్పలపలాశైర్వా స్వేద్యః సంవృత్య చక్షుషీ. ౧౧
ముక్తావలీభిః శీతాభిః శీతలైర్భాజనైరపి,
జలార్ద్రైర్జలజైర్హస్తైః స్విన్నస్య హృదయం స్పృశేత్. ౧౨

వ్యా. కన్నుల కావిరిపట్టి స్వేదనము చేయునపుడు పరిశుద్ధములై తెల్లగనుండు గుడ్డలచేనైనను, గోధుమపిండిచేనైనను, తామరాకులచేనైనను, కలువలచేనైనను కన్నుల గప్పి మూసి యావిరి పట్టవలెను. హృదయమునకు ఆవిరిచే స్వేదనము చేయునెడ చల్లనైయుండు ముత్యములచేనైనను, చల్లగనుండు పాత్రలచేనైనను, నీళ్లచేతడిసియుండు తామరపువ్వులచేనైనను, కలువలచేనైనను హృదయమును పలుమారు స్పృశించుచుండవలెను. (కన్నులును హృదయంబును వేడికి యోరువజాలదు కావున ఆవిరిచేనైన వేడిచే వానికి బాధకల్గనీయక పైజెప్పిన యుపచారముల జేయవలెనని భావము. గెజ్జలయందును ఆవిరిపట్టునపుడు తగినయుపచారముల జేయవలెనని యెరుంగునది.)

### స్వేదసమ్యగ్యోగఅయోగలక్షణములు.

మూ. శీతశూలవ్యుపరమే స్తబ్ధగౌరవనిగ్రహే,
సంజాతే మార్దవే స్వేదే స్వేదనాద్విరతిర్మతా. ౧౩

వ్యా. స్వేదనము (ఆవిరిచే చెమటబుట్టించుట) చేయుంనపుడు ఆవిరి బట్టినచోట చల్లదనముపోయి వేడిగనుండి నొప్పి మున్నగుబాధ నివర్తించుట, స్తంభించియుండుట, భారంబును నివర్తించుట, అవయవములు మృదువైయుండుట ఈలక్షణములు కన్పట్టు నపుడు చక్కగ చెమట వెడలినదని యెరింగి స్వేదనకృత్యమునుండి విరమించవలెను. (పైజెప్పిన లక్షణములు కనబడినప్పుడు స్వేదనము చక్కగ జేయబడినదని యెరుంగునది. పైజెప్పినది సుస్విన్నలక్షణములు. మరియు పైజెప్పిన లక్షణములకు వ్యతిరేకముగ చల్లదనంబును, బాధయు, స్తంభగౌరవంబులును నివర్తించకయుండునెడ స్వేదనము చక్కగ పని చేయలేదని యెరుంగునది. ఇదియే అయోగలక్షణము. అట్టియెడ మరల స్వేదనము చేయవలెనని భావము. ఈశ్లోకమునందు స్వేదసమ్యగ్యోగఅయోగలక్షణములు రెండును చెప్పబడినవని యెరుంగునది.)

### స్వేదాతియోగలక్షణములు, అందుపచారములు.

మూ. పిత్తప్రకోపో మూర్ఛా చ శరీరసదనం తృషా,
దాహస్స్వేదాఙ్గదౌర్బల్యం అతిస్విన్నస్య లక్షణమ్. ౧౪
ఉక్తస్తస్యాశితీయే యో గ్రైష్మికస్సర్వశో విధిః,
సోఽతిస్విన్నస్య కర్తవ్యో మధురః స్నిగ్ధశీతలః. ౧౫

వ్యా. అధికముగ స్వేదనముచే చెమట బుట్టించినయెడ పిత్తము ప్రకోపించును. మూర్ఛగ్రమ్మును. శరీరము కృశించును. దప్పి కల్గును. మంటబుట్టును. చెమట యధికముగ వెడలును. శరీరము మిక్కిలి దుర్బలమగును. ఇవియన్నియు అతి స్విన్నలక్షణములు. అట్టి స్వేదాతియోగము గల్గినప్పుడు తస్యాశితీయమను నారవయధ్యాయమున జెప్పిన గ్రీష్మఋతు విధానమంతయు చేయదగును. మరియు మధురంబును స్నిగ్ధంబును శీతలంబు లైన యన్నపానాదుల సేవింపనగును.

ఇచ్చట 'గ్రైష్మికః' అని చెప్పుటచేతనే మధుర స్నిగ్ధశీతలాదుల సేవింపవలెనని యర్థమగుచున్నను, "మద్యమమ్లం నవా పేయం" అని పక్షాంతరముగ విధింపబడిన మద్య పానమును నిషేధించుటకును, మధురస్నిగ్ధ శీతాద్యాహారమును విశేషముగ విధించుటకును మరల 'మధురః స్నిగ్ధశీతలః' అని చెప్పబడినది.

### స్వేదనము చేయదగనివారు.

మూ. కషాయమద్యనిత్యానాం గర్భిణ్యా రక్తపిత్తినామ్,
పిత్తినాం సాతిసారాణాం రూక్షాణాం మధుమేహినామ్. ౧౬
విదగ్ధభ్రష్టబ్రధ్నానాం విషమద్యవికారిణామ్,
శ్రాన్తానాం నష్టసంజ్ఞానాం స్థూలానాం పిత్తమేహినామ్. ౧౭
తృష్యతాం క్షుధితానాం చ శుద్ధానాం శోచతామపి,
కామల్యుదరిణాం చైవ క్షతానామాఢ్యరోగిణామ్. ౧౮
దుర్బలాతివిశుష్కాణాం అపక్షీణౌజసాం తథా,
భిషక్తైమిరికాణాం చ న స్వేద మవతారయేత్. ౧౯

వ్యా. మధురరసముదక్క తక్కిన రసములచే సిద్ధమైనమద్యమును నియతముగ త్రాగు నలవాటుకలవారు, గర్భిణీస్త్రీలు, రక్తపిత్తవ్యాధికలవారు, పిత్తప్రకృతికలవారు, అతిసారవ్యాధిపీడితులు, రూక్షమైనశరీరముకలవారు, మధుమేహవ్యాధికలవారు, నిప్పుచే కాలిన వ్రణముకలవారు, గుదభ్రంశము (గుదము స్వస్థానమునుండి భ్రష్టమగురోగము)చే బాధితులు, విషముచే బాధితులు, మదాత్యయమున గల్గిన వాతకఫరోగములచే బాధింపబడినవారు, శరీరమున కాయాసమును కల్గించుపనుల జేయుటచే బడలినవారు, శరీరముపై ప్రజ్ఞదప్పినవారు, స్థూలశరీరముకలవారు, పిత్తమేహరోగముగలవారు, దప్పిగొన్నవారు, ఆకలిగొన్నవారు, కోపము జెందినవారు, దుఃఖపడువారు, కామలారోగపీడితులు, ఉదరరోగబాధితులు, ఉరఃక్షతరోగముకలవారు (లేక దెబ్బ గాయము తగిలినవారు), ఆఢ్యవాతమని చెప్పబడు వాతరక్తవ్యాధికలవారు, బలహీనులు, మిక్కిలి శుష్కించిన శరీరముకలవారు, సర్వధాతుసారరూపమైన యోజస్సు క్షీణించినవారు, తిమిరమను నేత్రరోగముకలవారును, వీరికందరకును వైద్యుడు స్వేదనవిధిని చేయదగదు.

ఇచ్చట కషాయశబ్దముచేత మధురరసమునకన్న నితరరసమని చెప్పబడును. మధురరసమునకన్న నితరరసములచే సిద్ధమైనమద్యమును త్రాగునలవాటు కలవారికి స్వేదనము చేయదగదని యర్థము. ఏలయన—కషాయరసము వాతవర్ధకము కావున కషాయరసమును నియతముగ నుపయోగించువారికి వాతము వృద్ధినొందియుండును. అట్టివారికి వాతహరమైన స్వేదనము హితకరమగును. కావున నిషేధము పొసగనేరదు. పై జెప్పినవిధముగ నర్థముచేసినయెడ సమంజసముగ నుండును. లేక కషాయరసము రూక్షము స్తంభనమును చేయును. అట్టికషాయరసమును నిత్యముగ నుపయోగించువారిశరీరము రూక్షముగ నుండును. అట్టివారికి స్వేదనముచేసినయెడ శరీరము పగులును. కావున కషాయరసమును

నిత్యముగ నలవాటుపడి భుజించువారికిని, మద్యపాననిరతులకును కూడ స్వేదననిషేధము సమంజసమగును. ఈపక్షమున 'కషాయమద్యనిత్యానాం' అనుచోట 'కషాయనిత్యానాం మద్యనిత్యానాం' అని విగ్రహముచేత కషాయనిత్యులకును, మద్యనిత్యులకును స్వేదనము తగదని యర్థము.

రక్తపిత్తవ్యాధికలవారికి ప్రతిశ్యాయాదిస్వేదనార్హవ్యాధులలో పరిగణనము లేకుండుటచేతనో స్వేదనము నిషిద్ధమైనను, అట్టి రక్తపిత్తవ్యాధిపీడితులకు స్వేదసాధ్యము లగు వాత-కఫాత్మకములైన యితరరోగములు సంభవించినను వారికి స్వేదము చేయదగ దని నిషేధించుటకై మరల 'రక్తపిత్తినాం' అని ప్రత్యేకముగ నిషేధింపబడినది. ఈ నిషేధముచేత రక్తపిత్తముకలవారికి విహితములగు వమనవిరేచనముల చేయునపుడును వానికి పూర్వాంగముగ చేయవలసిన స్వేదనమును కూడ చేయకూడదని నిషేధము ఏర్ప డును. రక్తపిత్తమున నేయవస్థయందును స్వేదనము నిషిద్ధమని ఫలితార్థము. ఇత్తెరంగు ననే పిత్తమేహకామలారోగములయందును స్వేదనిషేధమునకు ప్రయోజనము నెరుంగు నది. 'పిత్తినాం' అనగా పిత్తప్రకృతికలవారని యర్థము.

మధుమేహశబ్దము మేహసామాన్యముగ వాచకమగునని కియన్తశ్శిరసీ యాధ్యా యమున చెప్పబడును కావున నిచ్చటను ప్రమేహసామాన్యవాచకము. అన్నిప్రమేహముల యందును శరీరము చాల శిథిలమగును. అట్టి శరీరశైథిల్యకారకములగు ప్రమేహముల యందు స్వేదనము చేసినయెడ శైథిల్య మెక్కుడగును కావున ప్రమేహసామాన్యముగ స్వేదనము నిషిద్ధము. ఈయర్థముచేతనే పిత్తమేహమునను స్వేదనిషేధము సిద్ధించిన నిషేధప్రాబల్యమును సూచించుటకై 'పిత్తమేహినాం' ప్రత్యేకముగ నిషేధింపబడినది. ఇట్లు చెప్పుటచేత పిత్తమేహమున స్వేదసాధ్యరోగములు తటస్థించినపుడును స్వేదనము చేయకూడదని యెరుంగునది.

మరియు నీనిషేధమున నొకవిశేషము—స్వేదనిషేధవిషయములలో పైజెప్పిన రీతిగ రక్తపిత్తగుల్మాదులయందు తప్ప తక్కినరోగములలో కేవలము స్వేదసాధ్యములైన సన్న్యాసము, అపస్మారము మున్నగు ప్రబలమైనవ్యాధులు సంభవించినయెడ నీనిషేధమును కూడ సరకుసేయక స్వేదనమును అవశ్యముగ చేయవలెను. అట్లు చేయనినాడు ప్రబ లములైన వ్యాధులచే నాపత్తు కల్గును. అట్టిసమయమున స్వల్పవిరోధమున్నకై యుపే క్షించిన గొప్పహాని రాజూచును గాన స్వల్పవిరోధమును గమనింపనక్కరలేదు. ఈవిష యమునే "యద్భూయసో విరోధే స్వల్పమన్యాయ్యమ్" అని న్యాయము చెప్పుచున్నది కావున గమనింపనగును.

## స్వేదనము చేయదగినవ్యాధులు.

మూ. ప్రతిశ్యాయే చ కాసే చ హిక్కాశ్వాసేష్వలాఘవే,
కర్ణమన్యాశిరశ్శూలే స్వరభేదే గళగ్రహే. ౨౦
అర్దితైకాఙ్గసర్వాఙ్గపక్షాఘాతే వినామకే,
కోష్ఠానాహవిబంధేషు శుక్రాఘాతే విజృమ్భకే. ౨౧
పార్శ్వపృష్ఠకటీకుక్షిసఙ్గ్రహే గృధ్రసీషు చ,
మూత్రకృచ్ఛ్రే మహత్త్వే చ ముష్కయోరఙ్గమర్దకే. ౨౨
పాదజానూరుజఙ్ఘార్తిసఙ్గ్రహే శ్వయథావపి,
ఖల్లీష్వామేషు శీతే చ వేపథౌ వాతకణ్టకే. ౨౩
సఙ్కోచాయామశూలేషు స్తమ్భగౌరవసుప్తిషు,
సర్వాఙ్గేషు వికారేషు స్వేదనం హితముచ్యతే. ౨౪

వ్యా. పడిసెము, దగ్గు, ఎక్కిళ్లు, శ్వాసము, శరీరము కొంచెము బరువుగనుండుట, చెవిపోటు, మెడకు వెనుకప్రక్కనుండు నరములనొప్పి, తలనొప్పి, కంఠస్వరము మారియుండుట, కుత్తుక మూసికొనియుండుట, అర్దితవాతము, ఏకాంగవాతము, సర్వాంగవాతము, పక్షాఘాతవాతము, వినామక (శరీరమును వంచునట్టి) వాతవ్యాధి, కోష్ఠగతరోగము, ఆనాహము (కడుపుబ్బరము), మలమూత్రములబంధము, శుక్రము వెడలక బంధించియుండును. విజృంభవాతము (బహిరాయామము, లేక అధికముగ గల్గిన యావలింతలు), ప్రక్కలయందును, వీపునందును, నడుమునందును, కుక్షియందును బిగబట్టినట్లు బాధకల్గుట, గృధ్రసీవాతము, మూత్రకృచ్ఛ్రము, అండవృద్ధి, శరీరమునందెల్ల నొప్పులు, పాదములయందును, మోకాళ్లయందును, తొడలయందును, పిక్కలయందును పోటు, పాదములు మున్నగువానియందు పట్టుకొన్నవిధముగ బాధ, శరీరమున వాపు, ఖల్లీవాతము (కాళ్లవ్రేళ్లు మున్నగు నవయవములు ముడుచుకొను వాతవిశేషము), ఆమవాతము, చలి, వణకు, చీలమండయందు పుట్టు వాతకంటకమను వాతరోగము, అవయవములు ముడుచుకొను వాతరోగము, అవయవములవంచునట్టి వాతవిశేషము, శూలవాతము, కీళ్లయందు పట్టినట్లు గల్గువాతవిశేషము, శరీరము మిక్కిలి బరువుగనుండుట, సుప్తివాతము (శరీరముపై స్పర్శము దెలియక మొద్దువలెనుండుట), ఈ చెప్పబడిన వ్యాధులయందును, సర్వాంగములవ్యాపించు నానావిధవాతరోగములయందును స్వేదనముచేయుట మిక్కిలి ప్రశస్తము.

### స్వేదోపయోగ్యద్రవ్యములు.

మూ. తిలమాషకులుత్థామ్లఘృతతైలామిషౌదనైః,
పాయసైః కృసరైర్మాంసైః పిణ్డస్వేదం ప్రయోజయేత్. ౨౫
గోఖరోష్ట్రవరాహాశ్వశకృద్భిస్సతుషైర్యవైః,
సికతాపాంసుపాషాణకరీషాయసపూటకైః. ౨౬
శ్లైష్మికాన్ స్వేదయేత్ పూర్వైః వాతికాన్ సముపాచరేత్,
ద్రవ్యాణ్యేతాని శస్యన్తే యథాస్వం ప్రస్తరేష్వపి. ౨౭

వ్యా. నువ్వులు, ఉద్దులు, ఉలవలు వీనిని పుల్లనిగంజియందైనను, నేతియందైనను, తైలమునందైనను, మాంసమునందైనను, అన్నమునందైనను, పాయసమునందైనను, కృసరము (నువ్వులను, ఉద్దులను, బియ్యమును చేర్చి కాచబడిన గంజి)యందైనను, మాంసమునందైనను కలిపి పిండస్వేదమును ప్రయోగింపనగును. (అనగ పైజెప్పిన నువ్వులు మున్నగువానిని ద్రవముతో గూర్చి ముద్దజేసి జేయబడు స్వేదనము పిండస్వేదము.)

మరియు ఆవులయొక్కయు, గాడిదెలయొక్కయు, ఒంటెలయొక్కయు, పందులయొక్కయు, గుఱ్ఱములయొక్కయు పేడచేతను, పొట్టుతోగూడిన యవలచేతను, ఇసుక, దుమ్ము, రాళ్లు, పిడకలు, ఇనుపగుండ్లు వీని పుటపాకముచేసి పొట్లముగట్టి వానిచేత కఫరోగములయందు స్వేదనము చేయవలెను. ఇందు తొలుత జెప్పిన నువ్వులు మున్నగువాటిచే వాతరోగములయందును, పిమ్మట చెప్పిన గోమయాదులచే కఫరోగములయందును స్వేదనము చేయవలెనని యర్థము. మరియు పైజెప్పిన తిలమాషాది ద్రవ్యములన్నియు ప్రస్తరస్వేదమునకై ఆయాదోషానుసారముగ (నువ్వులు మున్నగువానిని వాతరోగములకును, గోమయాదిద్రవ్యములు కఫరోగములకును) నుపయోగింపజనును.

### స్వేదనయోగ్యస్థలములు.

మూ. భూగృహేషు చ జేన్తాకేషూష్ణగర్భగృహేషు చ,
విధూమాఙ్గారతప్తేష్వభ్యక్తః స్విద్యతి నా సుఖమ్. ౨౮

వ్యా. మనుజుడు తైలముచే శరీరమునకు చక్కగ నభ్యంగనము జేసికొని, పొగలేక గనగనమని యుండునిప్పుచే వేడియైన భూస్వేదమునకై యేర్పరుపబడిన భూగృహములయందును, జేంతాకములయందును, వేడియైన గర్భగృహములయందును సుఖముగ చెమటవెడలించగలడు.

నాడీస్వేదము, అందు వాతహరనాడీస్వేదకల్పనము.

మూ. గ్రామ్యానూపౌదకం మాంసం పయో బస్తశిర స్తథా,
వరాహమధ్యపిత్తాసృక్స్నేహవత్తిలతణ్డులాన్. ౨౯
ఇత్యేతాని సముత్క్వాథ్య నాడీస్వేదం ప్రయోజయేత్,
దేశకాలవిభాగజ్ఞో యుక్త్యపేక్షో భిషక్తమః ౩౦

వ్యా. గ్రామముల నివసించు జంతువులమాంసము, జలప్రాంతముననుండు జంతువుల మాంసము, ఉదకముననుండు మత్స్యాదులమాంసము, పాలు, పొట్టేలితల, పందిమధ్య భాగముననుండుమాంసము, దానిపిత్తము, దానిరక్తము, స్నేహముతోఁగూడిన నువ్వులు బియ్యము వానిని చక్కఁగ నుడకపెట్టి వానిచే నాడీస్వేదమును ప్రయోగింపనగును. అట్టి స్వేదముల జేయునపుడు వైద్యుడు దేశకాలాదులవిభాగమును చక్కఁగ నెరింగి ఔషధ సంయోగరూపమైనయుక్తిని అనుసరించి తత్తదనుగుణముగ పైజెప్పినవిధానముప్రకారము స్వేదనము చేయందగును. (ఇది వాతహరనాడీస్వేదము.)

కఫహరనాడీస్వేదము.

మూ. వారుణామృతకైరణ్డశిగ్రుమూలకసర్షపైః,
వాసావంశకరంజార్కపత్త్రైరశ్మన్తకస్య చ. ౩౧
శోభాఞ్జనకశైరేయమాలతీసురసార్జకైః,
పత్త్రైరుత్క్వాథ్య సలిలం నాడీస్వేదం ప్రయోజయేత్. ౩౨

వ్యా. ఉలిమిరి, తిప్పతీగె, ఆముదపుచెట్టు, మునగ, ముల్లంగి, ఆవ, అడ్డసరము, వెదురు, కానుగు, జిల్లేడు, పాషాణభేది, ఎఱ్ఱమునగ, నీలిచెట్టు, జాజిచెట్టు, తులసి, రుద్రజడ ఈచెట్లయొక్క ఆకులను నీళ్ళలోఁచేర్చి కషాయముకాచి యాకషాయముచే నాడీస్వేదమును జేయదగును. (ఇయ్యది కఫహరస్వేదము).

వాతకఫహరనాడీస్వేదము, అవగాహస్వేదపరికల్పనము.

మూ. భూతీకపఞ్చమూలాభ్యాం సురయా దధిమస్తునా,
మూత్రైరమ్లైశ్చ సస్నేహైః నాడీస్వేదం ప్రయోజయేత్. ౩౩
ఏత ఏవ చ నిర్యూహాః ప్రయోజ్యా జలకోష్ఠకే,
స్వేదనార్థం ఘృతక్షీరతైలకోష్ఠాంశ్చ కారయేత్. ౩౪

వ్యా. కామంచిగడ్డి, పంచమూలము, మద్యము, పెరుగుమీదిమీగడ, ఎనిమిది విధములైన మూత్రములు, పులిసినగంజి మున్నగునవి. స్నేహద్రవ్యములు అనుపీడవం

ములచేత నాడీస్వేదమును చేయదగును. ఇయ్యది వాతకఫహరనాడీస్వేదము. మరియు పైజెప్పిన వాతహరాదికషాయములను పెద్దతొట్టిలోబోసి స్వేదనమునకై యుపయోగించు నది. (పైజెప్పినకషాయములను ఆమాదోషమునకు చెప్పినప్రకారము సిద్ధపరచి తొట్టిలోబోసి యవగాహనము చేయునది. (ఇది యవగాహనస్వేదము). మరియు తొట్టిలో నెయ్యిని బోసిన నయ్యది ఘృతకోష్ఠమనియు, పాలు పోసిన నయ్యది క్షీరకోష్ఠమనియు, తైలముతోనింపిన నయ్యది తైలకోష్ఠమనియు చెప్పబడును. స్వేదనమునకై యట్టి ఘృత క్షీరతైలకోష్ఠములను కూడ కషాయకోష్ఠమువలెనే చేయునది.

## ఉపనాహస్వేదకల్పనము.

మూ॥ గోధూమశకలైశ్చూర్ణైః యవానామమ్లసంయుతైః,
సస్నేహకిణ్వలవణైః ఉపనాహః ప్రశస్యతే. 34
గన్ధైస్సురాయాః కిణ్వేన జీవన్త్యా శతపుష్పయా,
ఉమయా కుష్ఠతైలాభ్యాం యుక్తయాచోపనాహయేత్. 36
చర్మభిశ్చోపనద్ధవ్యః సలోమభిరపూతిభిః,
ఉష్ణవీర్యైరలాభే తు కౌశేయావికశాటకైః. 38

వ్యా. గోధుమపిండి, యవలపిండి వీనిని పులిగంజి మున్నగుద్రవములతోగూర్చి అందు స్నేహమును కిణ్వము (సురాబీజము)ను సైంధవాదిలవణములను గూర్చి యుప నాహస్వేదము చేయదగును. మరియు సుగంధద్రవ్యములు, సురాబీజము, పాలకూర, సదాప, అవిసిఆకు, చెంగల్వకోష్టు, తైలములు వీనినిగూర్చి యుపనాహముచేయునది.

(ఉపనాహమనగ—"ఉపనహ్యతే (బధ్యతే) చర్మపట్టాదినా ఇత్యుపనాహః" అనువ్యుత్పత్తిచేత గోధుమాదిపిష్టమును వ్యాధి సంభవించిన అవయవమున దట్టముగ నునిచి చర్మము మున్నగువానిచే బిగియకట్టుటయని యెరుంగునది.) ఇది యగ్నిసంబంధములేని యుపనాహస్వేదము.)

పైజెప్పిన ద్రవ్యములను సిద్ధపరిచి వ్యాధికల్గిన ప్రదేశమున బెట్టి రోమములతో గూడి కంపులేక శుభ్రముగనుండు ఉష్ణవీర్యములైన జంతువుల చర్మముచే బిగియగట్ట నగును. అట్టిచర్మము దొరకనియెడల పట్టుగుడ్డ (పట్టుపురుగునారచే సిద్ధముచేయబడిన గుడ్డచేనైనను, కొండగొఱ్ఱెరోమములతో చేయబడిన కంబళిగుడ్డచేనైనను కట్టు గట్ట వలెను. ఈయుపనాహస్వేదమును అష్టాంగసంగ్రహమున "సుఖోష్ణః స్పష్టలవణః సాల్వణః పరికీర్తితః" అనువాక్యముచే సాల్వణమని చెప్పిరి. కావున సాల్వణమను నామాంతర మును ఉపనాహస్వేదమునకు కలదని యెరుంగునది.

### ఉపనాహమున కట్టువిడచుటకు వాలపరిమితి.

మూ. రాత్రౌ బద్ధం దివా ముఞ్చేత్ ముఞ్చేద్రాత్రౌ దివాకృతమ్,
విదాహపరిహారార్థం స్యాత్ప్రకర్షస్తు శీతలే. ౩౮

వ్యా. పైజెప్పినరీతిగ కట్టు కట్టినపుడు రాత్రి కట్టినదానిని పగలును, పగలు కట్టినదానిని రాత్రియు విడువవలయును. అట్టి కట్టుచేత రక్తము మున్నగునవి మిక్కిలి దహింపబడును కావున నది నివర్తించుటకై పైజెప్పినరీతిగ కట్టును విడచి మరల వేరే యౌషధము నునిచి కట్టవలెనని భావము. మరియు మిక్కిలి శీతలముగ నున్నకాలమున పైజెప్పిన కాలమునకన్న నధికముగ కట్టు నుంచనగును.

### పదిమూడు స్వేదముల వివరము.

మూ సఙ్కరః ప్రస్తరో నాడీ పరిషేకోఽవగాహనమ్,
జేన్తాకోఽశ్మఘనః కర్షః కుటీ భూః కుమ్భికైవ చ. ౩౯
కూపో హోలాక ఇత్యేతే స్వేదయన్తి త్రయోదశ,
తాన్ యథావత్ప్రవక్ష్యామి సర్వానేవానుపూర్వశః. ౪౦

వ్యా. సంకరము, ప్రస్తరము, నాడీ, పరిషేకము, అవగాహనము, జేంతాకము, అశ్మఘనము, కర్షు, కుటి, భూస్వేదము, కుంభిక, కూపము, హోలాకము అను నీపదుమూడును స్వేదమునుకల్గించును. పైజెప్పబడిన పదిమూడుస్వేదములును వరుసగ నీక్రింద విధ్యుక్తముగ వివరింపబడును.

పైజెప్పబడిన సంకరాదిస్వేదములు ఆయుర్వేదపరంపరగ వాడుకలో నుండునవి. వీనిలో కొన్ని పేరులకు మాత్రము అవయవార్థము కలదు. జేంతాకస్వేదము, హోలాక స్వేదము మున్నగునవి కొన్ని కేవలము సంజ్ఞామాత్రముగ నుండునుకాని యన్వర్థత కనబడదు.

### 1. సంకరస్వేదము.

మూ తత్ర వస్త్రాన్తరితైరవస్త్రాన్తరితైర్వాపిణ్డైర్యథోక్తైః ఉపస్వేదనం
సఙ్కరస్వేద ఇతి విద్యాత్. ౪౧

వ్యా. పైజెప్పబడిన పదుమూడు స్వేదములలో సంకరస్వేదము—'తిలమాష' 'గోఖర' అను నిరువదియైదు ఇరువదియారు శ్లోకములలో జెప్పినప్రకారము ఔషధమును ముద్దజేసి వస్త్రముచే మూసియైనను మూయకయైనను విధ్యుక్తప్రకారము కాపడము బెట్టి చెమటబుట్టించునది సంకరస్వేదమని చెప్పబడును.

## 2. ప్రస్తరస్వేదము.

మూ. శూకశమీధాన్యపులాకానాం వేసవారాయసకృసరోత్కారికాదీనాం వా ప్రస్తరే, కౌశేయావికోత్తరప్రచ్ఛదే, పఞ్చాఙ్గులోరుబూకార్కపత్రప్రచ్ఛదే వా, స్వభ్యక్తసర్వగాత్రస్య శయానస్యోపరిస్వేదనం ప్రస్తరస్వేద ఇతి విద్యాత్. ౪౨

వ్యా. నెమలి వరిధాన్యమునైనను శమీ (కాయ) ధాన్యమునైన పండి యూయన్నమునైనను, వానిచే సిద్ధముచేయబడిన వేసవారము కృసరము ఉత్కారిక (ఉండ్రాళ్లు కుడుములు) మున్నగువానినైనను పురుషప్రమాణముకల పడకపైన పరచి, దానిపైని పట్టుబట్టలనైనను, కంబళులనైనను, ఆముదపాకులనైనను, కొండాముదపాకులనైనను, జిల్లేడాకులనైనను గప్పి, రోగికి శరీరమునందంతటను చమురు బూసి పైజెప్పిన పడకపై పరుండబెట్టి చెమట బుట్టించునది. ఇది ప్రస్తరస్వేద మనబడును.

(ప్రస్తరమన—'ప్రస్తీర్యతే ఇతి ప్రస్తరః' అను వ్యుత్పత్తిచేత పైజెప్పిన ద్రవ్యములచే నాచ్ఛాదనముచేసిన పడకమూలమున చేయబడుస్వేదము ప్రస్తరస్వేదమని చెప్పబడును.) ఇది సర్వాంగగతవాతమున నుపయోగింపదగును.

## 3. నాడీస్వేదము.

మూ. స్వేదద్రవ్యాణాం పునః మూలఫలపత్రశుఙ్గాదీనాం, మృగశకునపిశితశిరః పదాదీనాం ఉష్ణస్వభావానాం వా, యథార్హ మమ్లలవణస్నేహోపసంహితానాం మూత్రక్షీరాదీనాం వా, కుమ్భ్యాం బాష్పమనుద్వమన్త్యాం ఉత్క్వథితానాం, నాడ్యా శరేషీకావంశదళకరఞ్జార్కపత్రాన్యతమకృతయా, గజాగ్రహస్తసంస్థానయా, వ్యామదీర్ఘయా వ్యామార్ధదీర్ఘయా వా, వ్యామచతుర్భాగాష్టభాగమూలాగ్రపరిణాహస్రోతసా, సర్వతో వాతహరపత్రసంవృతచ్ఛిద్రయా, ద్విస్త్రిర్వా వినామితయా, వాతహరసిద్ధస్నేహాభ్యక్తగాత్రః బాష్పముపహరేత్. బాష్పో హ్యనూర్ధ్వగామీ విహతచణ్డవేగః త్వచమవిదహన్ సుఖం స్వేదయతీతి నాడీస్వేదః ౪౩

వ్యా. (స్వేదనమున కుద్దేశించి షడ్విరేచనశతాశ్రితీయాధ్యాయమున 'శోభాఞ్జనకైరణ్డ—దశేమాని స్వేదోపగమాని భవన్తి' అనువాక్యముచే పదిద్రవ్యములు చెప్పబడినవి. ఈయధ్యాయమున "గ్రామ్యానూపౌ—నాడీస్వేదం ప్రయోజయేత్" అను వైద్యశ్లోకములచేత నాడీస్వేదమునకు ఆవశ్యకములైన క్వాథద్రవ్యము నిర్దేశింపబడినవి.)

అట్టి స్వేదనోద్దిష్టద్రవ్యములలో వేరు, కాయలు, ఆకులు, ఊడలు మున్నగు నంగములను, మృగములయొక్కయు పక్షులయొక్కయు మాంసము, శిరస్సు, పాదములు మున్నగువానిని, ఇంకను ఉష్ణగుణాదులుకల యితరద్రవ్యములను సమకూర్చికొని, అందు పులుపుగల ద్రవములను లవణములను తైలాది స్నేహములనైనను, మూత్రగణమున జెప్పినమూత్రములు క్షీరములు మున్నగు ద్రవములనైనను కఫవాతహరములగను నించి యథాయోగముగ గూర్చి, అన్నింటి నొకమంటికుండలో జేర్చి పొయిమీదనునిచి యావిరి బైటవెడలి పోకుండునట్లు ఆభాండముమూతిని సందు లేకుండునట్లు మూతమూసి, క్రింద మంటబెట్టి పక్వముగ క్వాథమును సిద్ధముచేయునది.

పిమ్మట కాకివెదురు బద్దలచేనైనను, వెదరు బద్దలచేనైనను, కానుక యాకులచేనైనను, జిల్లేడాకులచే నైనను ఒకగొట్టమును చేయవలెను; ఆగొట్టము అగ్రభాగము ఏనుగుతొండము కొనవంటి యాకారముకల్గి యొకబారెడులేక అరబారెడు పొడవై యుండవలెను. ఆగొట్టముయొక్క మొదటిభాగమున నొకమూరెడు చుట్టుకొలతకల రంధ్రంబును, జేనెడు చుట్టుకొలతకల రంధ్రము గొట్టముయొక్క కొనయందును ఉండవలెను. మరియు నాగొట్టముయొక్క ద్వారమందు వాతహరములగు ఆకులచే నిండింపవలెను. అయ్యది మూడు మెలికలైనను రెండుమెలికలైనను తిరిగి చుట్టుకొనియుండునట్లు రంధ్రములు లేకుండునట్లు నేర్పుగా చేయవలెను. (ఇది గొట్టమును చేయువిధము. ఇదియే నాడి, నాడిక యనబడును.)

పిమ్మట చెమటవెడలించవలసిన రోగికి వాతహర ద్రవ్యముల జేర్చి పక్వముచేయబడిన తైలాదులచే శరీరమునంతెల్ల పూసి పైజెప్పిన కషాయస్వేదౌషధముచే నిండియున్న కుండలో నీగొట్టమునునిచి దానిద్వారమునుండి వెడలుచున్న యావిరిచే శరీరమునందు చెమట బుట్టించవలెను. పైజెప్పినగొట్టము రెండుమూడుచుట్లు మెలికలై తిరిగియుండుటవలన అందుండివెడలు ఆవిరి వేగముడిగి సమోష్ణమై చర్మమున వేడియు మంటయు కల్గనీయక సుఖముగ రోగికిశరీరమున చెమటపుట్టించును. ఇది నాడి (గొట్టము)చే చేయబడుస్వేదనము కావున నాడీస్వేదమని చెప్పబడును.

## ❧ 4. పరిషేకస్వేదము. ☙

మూ. వాతికోత్తరవాతికానాం పునః మూలాదీనాముత్క్వాథైః సుఖోష్ణైః కుమ్భీర్వర్షులికాః ప్రనాడీర్వా పూరయిత్వా, యథార్హాసిద్ధస్నేహాభ్యక్తగాత్రం వస్త్రావచ్ఛన్నం పరిషేచయేత్; ఇతి పరిషేకః. ౪౪

వ్యా. కేవల వాతహారంబులును, వాతమును ప్రధానముగాకల కఫమును హరించునవియుం నగు ద్రవ్యములయొక్క మూలఫలాదులను యథోక్తవిధి ననుసరించి క్వాథముచేసి యయ్యది సుఖోష్ణముగ నుండునపుడు ఒక చిన్నమట్టికుండలో బోసి యైనను, అనేకరంధ్రములుకల ఛిద్రకలశమునందైనను లేక వెదురుగొట్టము మున్నగు వానియందైనను పోసి, వాతహరద్రవ్యములచే సిద్ధమైన తైలమును రోగిశరీరమున బూసి వస్త్రగప్పి పై స్వేదనకషాయముచే వ్యాధికలచోట ధారగ స్రవింపజేయనగును. ఇది పరిషేకస్వేద మనబడును.

'పరితః సించత్యనేనేతి—పరిషేకః' అను వ్యుత్పత్తిచేత శరీరమునం దెల్ల చల్లి చెమటబుట్టించునది పరిషేకస్వేదమని యర్థము. వార్షలిక యనగ అనేక రంధ్రములుకల మట్టిపాత్రయని యర్థము. అట్టిపాత్రను రోగిశరీరమునకు పైన ఎత్తుగ నునిచి యందు స్వేదక్వాథమును బోసినచో సన్నని రంధ్రములనుండి శరీరమంతట వ్యాపించి చెమట బుట్టును.

## 5. అవగాహస్వేదము.

సూ. వాతహారోత్క్వాథక్షీరతైలఘృతపిశితరసోష్ణసలిలకోష్ఠకావగాహస్తు యథోక్త ఏవావగాహః. ౪౫

వ్యా. వాతమును హరించునట్టి స్వభావముకల ద్రవ్యములను వలసినంత దీసికొని ఒకపాత్రలోబోసి కషాయముకాచి అందు క్షీరమును తైలమును ఘృతమును వాతహరమాంసరసమును యథోచితముగ కలిపి, యాయౌషధమును ఒక గొప్పతొట్టిలో పోసి సుఖోష్ణముగ నుండునపుడు వేడినీళ్లనుకూడ పోసి యందు రోగికి మునిగి స్నానము చేయించవలెను. ఇది యవగాహ స్వేదము. (ఇచ్చట క్వాథము, క్షీరము, తైలము, ఘృతము, మాంసరసము, వేడినీళ్లు అను ద్రవద్రవ్యములలో నాయావ్యాధిస్వభావానుసారముగ వలసినవానిని జేర్చుకొననగును.) అవగాహమన స్నానము. అట్టిస్నానముచే చెమటబుట్టించునది యవగాహ స్వేదము.

## 6. జేంతాకస్వేదకూటాగారనిర్మాణవిధి.

సూ. అథ జేన్తాకం చికీర్షుః భూమిం పరీక్షేత:—తత్ర పూర్వస్యాం దిశి ఉత్తరస్యాం వా, గుణవతి ప్రశస్తే భూమిభాగే, కృష్ణమృత్తికే, సువర్ణమృత్తికే వా, పరీవాపపుష్కరిణ్యాదీనాం జలాశయానాం అన్యతమస్య కూలే దక్షిణే పశ్చిమే వా, సూపతీర్థే, సమసువిభక్తభూమిభాగే; సప్తాష్టౌ వా రత్నీరుపక్రమ్యోదకాత్,

ప్రాఙ్ముఖముదఙ్ముఖం వా, అభిముఖతీర్థం, కూటాగారం కార
యేత్, ఉత్సేధవిస్తారతః పరమరత్నిషోడశ, సమన్తాత్ సువృ
త్తం, మృత్కర్మసమ్పన్నం, అనేకవాతాయనం, అస్య కూటా
గారస్యాన్తః సమన్తతోభిత్తి మరత్నివిస్తారోత్సేధాం పిణ్డికాం
కారయేత్ ఆకపాటాత్. ౪౬

మధ్యే చాస్య కూటాగారస్య చతుష్కిష్కుమాత్రం పురుష
ప్రమాణం, మృణ్మయం, కుమ్భ (కన్దుక) సంస్థానం, బహుసూక్ష్మ
చ్ఛిద్రం, అఙ్గారకోష్ఠకస్తమ్భం సపిధానం కారయేత్. ౪౭

తం చ ఖాదిరాణా మశ్వకర్ణాదీనాం వా కాష్ఠానాం పూర
యిత్వా ప్రదీపయేత్. స యదా జానీయాః (యాత్) సాధుదగ్ధాని
కాష్ఠాని విగతధూమాని, అవతప్తంచ కేవల మగ్నినా తదగ్ని
గృహం, స్వేదయోగ్యేన చోష్మణా యుక్తమితి; తత్రైనం పురు
షం వాతహరాభ్యక్తగాత్రం, వస్త్రావచ్ఛన్నం ప్రవేశయేత్.

వ్యా. జేంతాకస్వేదమును జేయదలచినవాడు అట్టిస్వేదమునకు కావలసినయింటిని నిర్మించుటకై తొలుత భూమిని పరీక్షించవలెను:—గ్రామమునకు తూర్పుదిక్కునందైనను ఉత్తరపుదిక్కునందైనను (చెట్లుచేమల చక్కగ పైరగు) మంచిగుణములు కలదియు, పొట్టుబొగ్గులుబూడిదె మున్నగు నశుభములైన వస్తువులు లేక ప్రశస్తమైనదియు, నల్లని మృత్తికయైనను బంగరురంగుకల మట్టియైనను కల్గినదియు, బావి గుంట మున్నగుజలాధారముకల్గినదియు, మిట్టపల్లములు లేక చదరముగనుండునదియునైన భూమిభాగమున, గుంట మున్నగుజలాశయమునకు దక్షిణపుగట్టునందైనను, పడమటిగట్టునందైనను నొక గుండ్రమైనయింటిని కట్టవలెను. ఆయిల్లు జలాశయమునకు పడమటిగట్టుననుండు నెడ తూర్పుముఖమైనద్వారంబును, దక్షిణపుగట్టుననుండు నెడ నుత్తరముఖమైనద్వారంబును కల్గియుండవలెను. (అట్లైనచో) ఆద్వారము జలాశయమున కెదుటనుండును. మరియు నాగృహము జలాశయముననుండు జలమునకు ఏడుఎనిమిదిమూరలదూరమున నుండ వలెను. పదునారుమూరలయెత్తును పదునారుమూరయే విస్తారంబును (చుట్టుకొలతయు) కల్గి, వంకరటింకరలేక గుండ్రముగను, శుద్ధముగ మట్టిబూసినదియు, అనేకములైన గవాక్షులుకల్గినదియు నైయుండవలెను. అట్టి చుట్టుయింటిని గట్టి దానికి లోభాగమున గోడకు చేరియుండునట్లు మూరెడుపొడవును మూరెడు వెడల్పునుకల యొకతిన్నెను కట్టవలెను.

ఆతిన్నె యింటిగోడకు లోభాగమున చుట్టును ఆయింటితలుపు(ద్వారమున)కు సరిగ వ్యాపించి చుట్టియుండవలెను.

అట్టియింటికి మధ్యభాగమున నాల్గుమూరలవిస్తారంబును, పురుషప్రమాణము పొడవును, చెండువలె గుండ్రనైనయాకారంబును, అనేక సూక్ష్మరంధ్రములునుకల యొక అగ్నికుండమును మట్టితో కట్టవలెను. ఆకుండము బొగ్గులుండుటకు నడమ అవకాశము (బోలు)కల్గి పొగ వెడలుటకు సన్ననిరంధ్రములతో గూడి (పొడవైనగొట్టముబోలె) స్తంభమువలె నుండవలెను. ఆయగ్నికుండమునకుపైన యావిరి పోకుండునట్లు మూసి యుండవలెను.

ఇత్తెరంగున నమర్పబడిన యగ్నికుండమున చండ్రకొయ్యలతుండ్లనైనను, ఏవి కొయ్యలతుండ్లనైనను నిండించి, నిప్పునంటించి మంటవేయవలెను. అందలి కట్టెలన్నియు చక్కగకాలి, పొగయంతయునణగి, నిప్పునెగ చేత నాగృహమంతయు వేడెక్కియుండు నపుడు, స్వేదనమునకు దగినంత వేడిగల్గియుండుసమయమును గుర్తెరింగి, స్వేదనము చేయ దగినరోగికి శరీరమునందెల్ల వాతహరద్రవ్యముల జేర్చి పక్వము జేయబడిన స్నేహద్రవ్య ముచే నభ్యంజనము చేయించి, నిర్మలమైనగుడ్డ గప్పి, పైజెప్పినస్వేదయోగ్యగృహమున బ్రవేశింపజేయవలెను.

## జేంతాకస్వేదవిధానము.

మూ. ప్రవేశయంశ్చైనమనుశిష్యాత్:—"సౌమ్య! ప్రవిశ కల్యాణాయాఽఽరోగ్యాయేతి. ప్రవిశ్య చైనాం పిణ్డికామధిరుహ్య, పార్శ్వాఽపరపార్శ్వాభ్యాం యథాసుఖం శయీథాః. న చ త్వయా స్వేదమూర్ఛాపరీతేనాపి సతా పిణ్డికైషా విమోక్తవ్యా, ఆప్రాణోచ్ఛ్వాసాత్. భ్రశ్యమానో హ్యతః పిణ్డికావకాశాత్, ద్వారమనధిగచ్ఛన్, స్వేదమూర్ఛాపరీతతయా సద్యః ప్రాణాన్ జహ్యాః; తస్మాత్ పిణ్డికామేనాం న కథఞ్చన ముఞ్చేథాః. త్వం యదా జానీయాః—విగతాభిష్యన్దమాత్మానం, సమ్యక్ప్రస్రుతస్వేదపిచ్ఛం, సర్వస్రోతోవిముక్తం, లఘుభూతం, అపగతవిబన్ధస్తమ్భసుప్తివేదనమితి; తతస్తాం పిణ్డికాం అనుసరన్ ద్వారం ప్రపద్యేథాః, నిష్క్రమ్య చ న సహసా చక్షుషోః పరిపాలనార్థం శీతోదకముపస్పృశేథాః. అప

గతసన్తాపక్లమస్తు ముహూర్తాత్ సుఖోష్ణేన వారిణా యథా న్యాయం పరిషిక్తః అశ్నీయాః" ఇతి జేన్తాకస్వేదః. ౪౫

వ్యా. పైజెప్పినరీతిగ సిద్ధమైనస్వేదనగృహమునందు రోగినిప్రవేశపెట్టి వానికిట్లు బోధించవలెను.—"ఓసౌమ్యుఁడా! నీకు సుఖముకొఱకును ఆరోగ్యముకొఱకును ఈస్వేదన గృహమున ప్రవేశించుము. నీవు ఈయింటిలో బ్రవేశించి లోపల గోడచేరువననుండు చుట్టుతిన్నెపైనెక్కి రెండుపార్శ్వముల (శరీరమునందలి యిరుప్రక్కల)ను మార్చు కొనుచు సుఖముగ తిన్నెపైని పరుండుము. నీకొకవేళ స్వేదమువలన మూర్ఛ గల్గునట్లు న్నను, నీయూపిరియుండునంతవరకును నీవుపరుండినతిన్నెనుమాత్రము విడువవలదు. ఒక వేళ యేమఱియైన తిన్నెను విడచి క్రిందికి దిగితివేని చెమటవెడలుటవలన కల్గినమతిభ్రమ చేత గృహద్వారమును గమనించి రాలేకపోదువు. దానంజేసి ప్రాణముల గోలుపోదువు. కావున నెన్నివిధములనైన తిన్నెనుమాత్రము విడువవలదు.

అట్లు తిన్నెపై నీవు పరుండినపుడు నీశరీరమున చెమటబట్టి దానిమూలమున నీ శరీరములోని చెడ్డమలములన్నియుం బైటవెడలి స్రవించినట్లును, అధికముగ చెమట వెడలినట్లును, శరీరము భారమువదలి తేలికయై స్తంభములేక సుప్తిబాధ మున్నగునవి యన్నియుం బొత్తుగ నివర్తించినట్లును ఎపుడు తెలిసికొందువో, ఆసమయమున నీవు పరుండియున్నతిన్నెను విడువక దానిమీదుగనే మెలమెల్లగ ద్వారసమీపమును జేరవల యును. పిమ్మట నాద్వారమునుండి బైటవెడలి తొందరపడి శీఘ్రముగ చల్లనినీళ్లను తాక వలదు. అటుగాక వెంటనే శీతజలమున స్నానముచేసినయెడ స్వేదనమునంజేసి తాపము నొందిన శరీరమునందలి వేడి (ఉష్ణము) కన్నులకు వ్యాపించి చెడగొట్టును; కావున కన్ను లకు బాధ కల్గనీయక కాపాడుకొనుటకై వెంటనే చల్లనినీళ్లలో స్నానపానాదుల జేయ దగదని భావము.

పిమ్మట స్వేదనమున సంభవించినసంతాపము బొత్తుగ నివర్తించినపిమ్మట ముహూర్త కాలము నిరీక్షించి సుఖోష్ణముగనుండు వేడినీళ్లతో సుఖముగ స్నానముచేసి యథా న్యాయముగ విధ్యుక్తప్రకారము హితముగ భుజించవలెను." ఇత్తెఱంగున స్వేదనము చేసికొనురోగికి బోధించవలెనని సముదితార్థము. ఇదియే జేంతాకస్వేద మనబడును.

ఇచ్చట నీజేంతాకస్వేదమునకై భూమిపరీక్షయుఁ, జలసామీప్యంబును రోగికి మంగళార్థముగ విధింపబడినది. మరియుం ఎట్టయెదుట నీళ్లుండుటవలన ఆనీళ్లను చూచుట చేత కన్నుల కపాయములేకుండును. ఒకవేళ స్వేదాతియోగమునంజేసి యుపద్రవములు సంభవించినయెడ అందుకు ప్రతిక్రియను శీఘ్రముగజేయ సౌకర్యముగ నుండుటకై

జలసామీప్యము చెప్పబడినది. పైజెప్పిన యుపదేశములననుసరించి స్వేదనమును యథో క్తముగ నాచరించినరోగికి పైజెప్పినగుణములన్నియు కల్గి యారోగ్యమునొందును. అవియే జెంతాక స్వేదమునకు సమ్యగ్యోగలక్షణములు. ఆలక్షణములబట్టియే అతియోగ-అయోగలక్షణముల నూహించునది.

### 7. అశ్మఘనస్వేదము.

మూ. శయానస్య ప్రమాణేన ఘనామశ్మమయీం శిలామ్,
తాపయిత్వా మారుతఘ్నైః దారుభిస్సంప్రదీపితైః. ౫౦
వ్యపోహ్య సర్వానఙ్గారాన్ ప్రోక్ష్య చైవోష్ణవారిణా,
తాం శిలామథ కుర్వీత కౌశేయాఽవికసంస్తరామ్. ౫౧
తస్యాం స్వభ్యక్తసర్వాఙ్గః స్వపన్ స్విద్యతి నా సుఖమ్,
కౌ (రౌ) రవాఽజినకౌశేయప్రావారాద్యైస్సుసంవృతః ౫౨
ఇత్యుక్తోఽశ్మఘనస్వేదః

వ్యా. ఒకమనుజుడు పరుండుటకు దగినంతపరిమాణముకల్గి ఘనముగనుండు నొక పెద్దబండమీద వాతహరములగు చెట్లయొక్క కట్టెలను పరచి మంటవేసి యాబండ వేడి యైనపిదప దానిపైనున్న నిప్పుకణములనెల్ల దూరంబుచ్చి, వేడినీళ్ళచేప్రోక్షించి, యా బండపైని పట్టుగుడ్డనైనను కంబళినైనను కప్పునది. పిమ్మట వాతహరతైలాదులచే రోగికి శరీరమునందెల్ల నభ్యంజనము చేయించి, పైనమర్చబడిన వేడి బండపైని పరుండబెట్టి నూలుగుడ్డనైనను, పట్టుగుడ్డనైనను జింకచర్మమునైనను కంబళినైనను గప్పినయెడ రోగికి సుఖముగ చెమటబట్టి బాధలెల్ల నివర్తించును. ఇదియే అశ్మఘనస్వేదమని చెప్పబడును. (ఘనమైన రాతిపైనుండి చేయబడుస్వేదనము అశ్మఘనస్వేదమని యన్వర్థముగ జెప్ప బడినది.)

### 8. కర్షూస్వేదము.

మూ. కర్షూస్వేదః ప్రవక్ష్యతే,
ఖానయేచ్ఛయనస్యాఽధః కర్షూం స్థానవిభాగవిత్. ౫౩
దీప్తైర్విధూమైరఙ్గారైః తాం కర్షూం పూరయేత్తతః,
తస్యాముపరి శయ్యాయాం స్వపన్ స్విద్యతి నా సుఖం. ౫౪

వ్యా. ఇక కర్షూస్వేదము చెప్పబడును.—(మూతి సన్నగనుండి లోపల విశాల ముగనుండు గుంటకు కర్షు అనిపేరు.) ఒకమనుజుడు పరుండుటకు వసతియైన ప్రదేశ

మున నొకకర్షువను గుంటత్రవ్వి యాగుంటను గనగనమని పొగలేక జ్వలించుచున్న నిప్పుకణములచే నిండించి దానిపైన నొక (నులిక) మంచము నునిచి, స్వేదనము చేయ వలసిన రోగి వాతహరతైలాభ్యంగనము చేయించి యాశయ్యపై పరుండబెట్టి గుడ్డ మున్నగువానిచే గప్పిన సుఖముగ శరీరముపై చెమటబట్టును.

## 9. కుటీస్వేదము.

మూ. అనత్యుత్సేధవిస్తారాం వృత్తాకారామలోచనామ్,
ఘనభిత్తిం కుటీం కృత్వా కుష్ఠాద్యైస్సమ్ప్రలేపయేత్. ౫౫
కుటీమధ్యే భిషక్ శయ్యాం స్వాస్తీర్ణాం చోపకల్పయేత్,
ప్రావారాఽజినకౌశేయ కుథకమ్బళగోళకైః. ౫౬
హసన్తికాభిరఙ్గారపూర్ణాభిస్తాం చ సర్వశః,
పరివార్యాఽన్తరారోహేత్ అభ్యక్తస్స్విద్యతే సుఖమ్. ౫౭

వ్యా. మిక్కిలి యెత్తును విస్తారములైన మితమై, ఘనమై (లావై)న గోడకల్గి గుండ్రముగ నుండునట్లు లొక చుట్టుగుడిసెను గవాక్షములు మొదలగు సందులు లేకుండునట్లు కట్టి, యాగుడిసె గోడకు చెంగల్వకోష్ఠు సుగంధద్రవ్యములు మున్నగువానిని నూరి పూసి యుంచునది. పిమ్మట నాగుడిసెనడుమ దుప్పటి, చర్మము, పట్టుబట్టలు, రత్నకంబళులు, కంబళులు వీనిచే చక్కగ బరిచి యొకశయ్యను కల్పించి యాశయ్యకు చుట్టు ప్రక్కల పొగలేక చక్కగ జ్వలించుచుండు నిప్పుకణములచే నిండియుండు కుంపట్లు నునిచియుంచునది. పిమ్మట స్వేదనము చేయదలచిన రోగికి శరీరమున వాతహరతైలమును బూసి యాగుడిసెనడుమ నమర్పబడిన శయ్యపై పరుండబెట్టిన మిక్కిలి సుఖముగ చెమటపట్టును. ఇయ్యది గుడిసెమూలమున జేయబడు స్వేదము కావున కుటీస్వేదమని యన్వర్థముగ జెప్పబడును.

## 10. భూస్వేదము.

మూ. య ఏవాశ్మఘనస్వేదవిధిః భూమౌ స ఏవ తు,
ప్రశస్తాయాం నివాతాయాం సమాయాముపదిశ్యతే. ౫౮

వ్యా. రాళ్లు చిల్లపెంకులు మున్నగునవి లేక ప్రశస్తమై గాలిలేక మిట్టపల్లములు గాక చదరమైయుండు భూమిపైని, అశ్మఘనస్వేదనమునకు జెప్పినవిధముగ వేడిని కల్గించి శయనించినచో నదేవిధముగ చెమటబట్టును. (ఇయ్యది భూమిపైజేయబడు స్వేదము కావున భూస్వేదమని యన్వర్థముగ చెప్పబడును.)

## 11. కుంభీస్వేదము.

మూ. కుమ్భీం వాతహరక్వాథపూర్ణాం భూమౌ నిఖానయేత్,
అర్ధభాగం త్రిభాగం వా శయనం తత్ర చోపరి. ౫౯
స్థాపయేదాసనం వాపి నాతిసాన్ద్రపరిచ్ఛదమ్,
అథ కుమ్భ్యాం సుసన్తప్తాన్ ప్రక్షిపేదయసో గుడాన్. ౬౦
పాషాణాంశ్చోష్మణా తేన తత్స్థస్స్విద్యతి నా సుఖమ్,
సుసంవృతాఙ్గః స్వభ్యక్తః స్నేహైరనిలనాశనైః. ౬౧

వ్యా. వాతహరద్రవ్యముల జేర్చి కషాయము సిద్ధముచేసి యాకషాయమును ఒక (సన్నమూతికల) కుండలో నిండుకు పోసి, దానిని భూమిలో నొకచోట నాకుండ సగభాగమైనను ముప్పాతిక భాగమైనను భూమిలో నిమిడియుండునట్లు పాతి, దానిపై బరుండుటకు తగినట్లు మంచమునైనను కూర్చొనియుండుటకు తగినట్లు బల్లపలకనైన నమర్చి, దానిపై పలుచగ నుండునట్లు గుడ్డ మొదలగువానిచే పరిచి, వాతహర ద్రవ్యములచే సిద్ధమైనతైలమును రోగికి శరీరముపై బూసి వానిని పైజెప్పిన శయ్యపై పరుండ నియమించి, ఆవిరి బైటపోకుండునట్లు గుడ్డను వానిపై గప్పియుంచునది. పిమ్మట ఇనుప గుండ్లనైనను రాళ్లనైనను ఎఱ్ఱగకాల్చి శయ్యక్రింద భూమిలో పాతియున్న క్వాథ పాత్రమున వైచినయెడ నందుండి యావిరి వెడలి రోగిశరీరముపై వ్యాపించి సుఖముగ చెమటబట్టును. (ఇది కుంభియను పాత్రమూలమున చేయబడునది కావున కుంభీస్వేద మని యన్వర్థముగ జెప్పబడును.)

## 12. కూపస్వేదము.

మూ. కూపం శయనవిస్తారం ద్విగుణం చాపి వేధతః,
దేశే నివాతే శస్తేచ కుర్యాదన్తస్సుమార్జనమ్. ౬౨
హస్త్యశ్వగోఖరోష్ట్రాణాం కరీషైర్దగ్ధపూరితే,
స్వవచ్ఛన్నస్సుసంస్తీర్ణేఽభ్యక్తస్స్విద్యతి నా సుఖమ్. ౬౩

వ్యా. గాలిలేక ప్రశస్తమైన ప్రదేశమున మంచమంత విస్తారంబును, అంతకు రెట్టింత పరిమాణము లోతును కల్గునట్టు లొకబావివలె (చౌకముగ) నొకగుంత త్రవ్వి, యాగుంతలో శుభ్రముగ నుండునట్లు శుభ్రముచేసి, యాగోతిలో ఏనుగలయొక్కయు గుఱ్ఱములయొక్కయు ఆవులయొక్కయు గాడిదలయొక్కయు ఒంటెలయొక్కయు పేడచే చేయబడిన పిడకలను నిప్పువలె కాల్చి నిండించి, యాగోతిపైన శయ్యనమర్చి

మంచిగుడ్డలచే పరిచి సిద్ధము చేయుందది. స్వేదనము చేయవలసిన రోగిశరీరమున వాత హర ద్రవ్యములచే సిద్ధమైన తైలమును బూసి యాశయ్యపై పరుండబెట్టి గుడ్డ గప్పియుంచునది. ఇటు చేసినయెడ మనుజునకు సుఖముగ చెమటబట్టును. ఇది బావివలెనుండు గోతి మూలముగ జేయబడు స్వేదము కావున కూపస్వేద మనబడును. (ఇచ్చట 'వేధతః' అనునది సార్వవిభక్తిక తసిల్ ప్రత్యయాంతము. 'వేధనేన' అని తృతీయాంతము. త్రవ్వుటచేత శయ్యాప్రమాణమునకన్న రెట్టింతలోతు కల్గియుండవలెనని యర్థము.)

## 13. హోలాకస్వేదము.

మూ. ధీతికాం తు కరీషాణాం యథోక్తానాం ప్రదీపయేత్,
శయనాన్తఃప్రమాణేన శయ్యాముపరి తత్ర చ. ౬౪
సుదగ్ధాయాం విధూమాయాం యథోక్తాముపకల్పయేత్,
స్వవచ్ఛన్నః స్వపం స్తత్రాఽభ్యక్తః స్విద్యతి నా సుఖమ్. ౬౫
హోలాకస్వేద ఇత్యేషః సుఖః ప్రోక్తో మహర్షిణా,

వ్యా. పైని చెప్పబడిన యేనుగు గుఱ్ఱము మొదలగు జంతువుల పేడచే చేయబడిన పిడకలను ఒకప్రదేశమున శయ్యాపరిమాణమునకు లోపలనే యిమిడియుండునట్లులు మూటుగ పేర్చి నిప్పు రగిలించి చక్కగ నిప్పువలె పిడకలు కాలి పొగ నిలిచినపిదప దానిపై నొకమంచము నునిచి గుడ్డచే పరిచి, తైలముచే రోగిశరీరమున కభ్యంగనము చేయించి వానిని ఆశయ్యపై పరుండబెట్టి గుడ్డ గప్పియుంచిన సుఖముగ చెమటబట్టును. ఇది హోలాకస్వేదమని మహర్షులచే చెప్పబడినది.

## ప్రకరణోపసంహారము.

మూ. ఇతి త్రయోదశవిధః స్వేదోఽగ్నిగుణసంశ్రయః. ౬౬

వ్యా. ఇత్తెరంగున సంకరాది నామభేదములచే పదుమూడు విధములైన స్వేదములు వివరింపబడినవి. ఇవి యన్నియు నగ్నిగుణములు ప్రధానముగగల్గి యగ్నిసంబంధముచే చేయబడునవి.

వాగ్భటాచార్యులు "స్వేదస్తాపోపనాహోష్మద్రవభేదాచ్చతుర్విధః" అను శ్లోకముచేత తాపము, ఉపనాహము, ఊష్మము, ద్రవము నను నాల్గు స్వేదముల మాత్రము చెప్పిరి. అవియు నీపదుమూడు స్వేదములలోనే యంతర్భూతము లగును.

## అగ్నిగుణసంబంధములేని స్వేదములు.

మూ. వ్యాయామముష్ణసదనం గురుప్రావరణం క్షుధా,

బహుపానం భయక్రోధావుపనాహాహవాతపాః. ౬
స్వేదయన్తి దశైతాని నరమగ్నిగుణాదృతే,

వ్యా. వ్యాయామము (దేహపరిశ్రమము), లావైనగోడకల్గి గవాక్షములు లే యుండుటచేత ఆవిరివలన నుష్ణమైనయిల్లు, దట్టమైన కంబళాదుల గప్పికొనుట, ఆకఁ అధికముగ మద్యమును పానముచేయుట, భయము, క్రోధము, ఉపనాహము (కట్టి గట్టుట), ఎండ, మల్లయుద్ధము అను నీపదియును అగ్నిసంబంధము లేకయే చెమ బుట్టించును.

'అగ్నిగుణాదృతే' అనుచోట ప్రత్యక్షముగ నగ్నిసంబంధమువలన కల్గినవేడి లే యితరసంబంధమున కల్గిన యుష్ణగుణముచేత పై జెప్పిన వ్యాయామము మున్నగు ఉ యుపాయములును స్వేదము కల్గించునవి కావున నివి యనగ్ని స్వేదము అని చెః బడును. ఎండ వేడికల్గినది యైనను అయ్యది అగ్నిసంబంధములేక సూర్యునియాపమ గల్గినది కావున ననగ్ని స్వేదమే యగును. ఉపనాహస్వేదము సాగ్ని-నిరగ్నియు న రెండువిధములు. అందు ఆరగ్వధీయాధ్యాయమున "కోలం కులుత్థాస్సురదారురాస్నా అని యుపక్రమించి చెప్పబడినద్రవ్యముల చేర్చి పట్టుబెట్టిచేయునది ఉపనాహస్వేదవ అగ్నిసంబంధములేనిది. ఇయ్యది యుష్ణవీర్యము లగుటంజేసి శరీరమునందలి వేడిని నిర ధించి అగ్నిసంబంధము లేకయే స్వేదమును పుట్టించును. అగ్నిసంబంధము కల్గిన యు నాహస్వేదము సంకరస్వేదమున జెప్పినరీతిగ నగ్నితప్తమైన పిండి మున్నగువానిని క గట్టిచేయునది యని యెరుంగునది.

## షడ్విధ స్వేదములు.

మూ ఇత్యుక్తో ద్వివిధస్స్వేదః సంయుక్తోఽగ్నిగుణైర్న చ. ౬
ఏకాఙ్గసర్వాఙ్గగతః స్నిగ్ధో రూక్షస్తథైవ చ,
ఇత్యేతద్ద్వివిధం ద్వన్ద్వ స్వేదముద్దిశ్య కీర్తితమ్. ౬

వ్యా. పై జెప్పబడిన స్వేదములన్నియు అగ్నిసంబంధము కల్గినది సాగ్ని మనియు, అగ్నిసంబంధము లేనిది నిరగ్నికమనియు రెండువిధములుగ విభాగము నొ యుండును. (అందు సంకరాదిస్వేదములు పదుమూడును అగ్నిసంబంధము కల్గిః వ్యాయామాదులు పదియును అగ్నిసంబంధము లేనివి.)

మరియు అవయవైకదేశమున నుపయోగింపదగినవి సంకరనాడీస్వేదాదులు కాంగగతమనియు, శరీరమునందంతట నుపయోగింపదగిన ప్రస్తరజేంతాకాది స్వేదమ

సర్వాంగగతమనియుం జెప్పబడును. మరియుం వాతహరమైన స్నిగ్ధస్వేదంబును, కఫహారమైన రూక్షస్వేదంబును, వాతకఫముల సంసృష్టవ్యాధిహరమైన స్నిగ్ధరూక్షస్వేదంబును చెప్పబడినవి. ఇత్తెరంగు పైప్రకరణము స్వేదమునకు పరస్పరవిరుద్ధస్వభావముచే భిన్నములైన సాగ్నినిరగ్నికాది ద్వంద్వభేదములచే వివరింపబడినది.

### స్నేహాది సేవనక్రమము.

మూ. స్నిగ్ధః స్వేదైరుపక్రమ్యః, స్విన్నః పథ్యాశనో భవేత్,
తదహః స్విన్నగాత్రస్తు వ్యాయామం వర్జయేన్నరః. ఇతి. ౭౦

వ్యా. మనుజుడు తొలుత స్నేహములచే స్నిగ్ధశరీరముకలవాడే స్వేదనముల జేసికొన నుపక్రమించవలెను. స్వేదనవిధిచేత శరీరమున చెమట బుట్టినపిదప పథ్యములైన యాహారముల భుజింపదగును. స్వేదవిధిని ఆచరించినమనుజుడు ఆదినమున (బలము తగ్గియుండును కావున) శరీరవ్యాయామమును విడువవలెను.

### అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః—

స్వేదో యథా కార్యకరో హితో యేభ్యశ్చ యద్విధః,
యత్ర దేశే యథా యోగ్యః దేశే రక్ష్యశ్చ యో యథా.
స్విన్నాతిస్విన్నరూపాణి తథాతిస్విన్నభేషజమ్,
అస్వేద్యాః స్వేదయోగ్యాశ్చ స్వేదద్రవ్యాణి కల్పనా. ౭౧
త్రయోదశవిధస్స్వేదః వినా దశవిధోఽగ్నినా,
సఙ్గ్రహేణ చ షట్, స్వేదాః స్వేదాధ్యాయే నిదర్శితాః ౭౩
స్వేదాధికారే యద్వాక్యం ఉక్తమేతన్మహర్షిణా,
శిష్యైస్తు ప్రతిపత్తవ్యం ఉపదేష్టా పునర్వసుః. ఇతి. ౭౪

వ్యా. స్వేదనమువలన గల్గుప్రయోజనము, ఎవరికి యేవిధమైన స్నేహము హితమైనదియుం, ఆమాశయాదిప్రదేశము ననుసరించి స్వేదము నుపయోగించువిధము, అయా ప్రదేశమును స్వేదవిధిచే కాపాడవలసినవిధము, స్విన్న-అతిస్విన్నలక్షణములు, స్వేదాతియోగచికిత్సితము, స్వేదనానర్హులు, స్వేదయోగ్యులు, స్వేదద్రవ్యములు, స్వేదకల్పనములు, పదుమూడువిధములైన సాగ్నిగుణస్వేదములు, పదివిధములైన రగ్నిగుణస్వేదములు, అగ్నిగుణ, నిరగ్నిగుణ, ఏకాంగగత సర్వాంగగత, స్నిగ్ధరూక్షభేదములచే స్వేదషడ్విధసంగ్రహము అను నీవిషయములన్నియుం నీస్వేదాధ్యాయమున వివరింపబడినవి.

ఇత్తెరంగున స్వేదాధికారమున పునర్వసుచే చెప్పబడిన విషయములెల్ల శిష్యులు గమనించె దరుగాక !

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
స్వేదాధ్యాయో నామ చతుర్దశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకమహర్షిచే సంస్కరింపబడినదియు నగు చరకసంహిత యను నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమునందు స్వేదాధ్యాయ మనునది పదునాల్గవ యధ్యాయము సమాప్తము.

---

## పంచదశాధ్యాయము.

అవతరణిక:—'స్నేహస్వేదోపపన్నస్య సంశోధనమతః పరమ్' అని చెప్పిన ప్రకారము, పై యధ్యాయముల రెంటిచే స్నేహస్వేదముల కల్పనముల చెప్పి, క్రమ ప్రాప్తమైన వమనవిరేచనరూపసంశోధనకల్పనము ఈయధ్యాయమున చెప్పబడును.

మూ. అథాత ఉపకల్పనీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః.

వ్యా. (ఉపకల్పవమనక్రమప్రాప్తమైన సంశోధనకల్పనము) స్వేదాధ్యాయమును జెప్పినపిదప సంశోధనముయొక్క కల్పనమును దెల్పునట్టి యుపకల్పనీయాధ్యాయమును ఆత్రేయుం డుపదేశించినదానికన్న న్యూనాతిరేకము లేకుండునట్లు వివరించెదనని యర్థము. (లేక ఉపకల్పనమన చికిత్సకు కావలసిన యుపకరణములు సేకరించి యుంచుకొనుట యనియుం జెప్పనగును.)

సంభారముల జేర్చికొనుట యావశ్యకమనుట.

మూ. ఇహ ఖలు రాజానం రాజమాత్రమన్యం వా విపులద్రవ్యం సమ్భృతసమ్భారం వమనం విరేచనం వా పాయయితుకామేన భిషజా ప్రాగేవౌషధపానాత్ సమ్భారా ఉపకల్పనీయాః భవ న్తి. సమ్యక్చైవ హి గచ్ఛత్యౌషధే పరిభోగార్థాః, వ్యాపన్నే చౌషధే వ్యాపదః పరిసఙ్ఖ్యాయ ప్రతీకారార్థాః. న హి సన్ని కృష్టేకాలే ప్రాదుర్భూతాయామాపది సత్యపి క్రయాఽఽ క్రయే సుకరమాశు సమ్భరణమౌషధానాం యథావత్. 3

వ్యా. ముఖ్యముగ కావలసిన వస్తువులనన్నిటిని సేకరింప సమర్థుడైన రాజు కైనను, రాజుతో సమానమైన ద్రవ్యవంతునకైనను వమనవిరేచనౌషధములలో నొక దానిని త్రాగింపదలచినపుడు వైద్యుడు అట్టియౌషధమును త్రాగించుటకు ముందుగనే కొన్నిసంభారములను సిద్ధముగ సేకరించియుంచవలెను. అయ్యవి త్రాగబడినయౌషధము ఏవిధమైన వ్యత్యయము లేక చక్కగ పనిచేసినయెడ తాను కొన్నివిషయములయం దుప యోగించుటకును, అట్టియౌషధము దేశకాలాదివ్యత్యయమునంజేసి, వ్యాపత్తును కల్గించు నేని అట్టియుపద్రవముల గమనించి వానిని శీఘ్రముగ నివర్తింపజేయుటకును నుపయో గించును. (కాని వ్యర్థములు కానేరవు.) పై జెప్పిన యౌషధమును సేవించినపుడు తటా లున వ్యాపత్తు సంభవించినచో, తాను ధనవంతుడై యుండి వస్తువులు కొనదగియున్నను శీఘ్రముగ నాసంభారముల వెదకి సేకరింప వలనుపడదు. కొంచెము కాల మతిక్రమించి నచో వృత్తు లధికములై హాని కల్గింపచూచును. (కాబట్టి యౌషధమును సేవించుటకు ముందుగనే యావశ్యకములైన సంభారములను సేకరించి సిద్ధముగ నుంచుకొనవలెనని భావము.)

## అగ్నివేశుడు ప్రశ్న చేయుట.

మూ. ఇత్యేవం వాదినం భగవన్తమాత్రేయం అగ్నివేశః ఉవాచః—
నను భగవన్! ఆదావేవ జ్ఞానవతా తథా ప్రతివిధాతవ్యం యథా ప్రతివిహితే సిధ్యే దేవౌషధమేకాన్తేన. సమ్యక్ప్రయోగనిమిత్తా హి సర్వకర్మణాం సిద్ధిరిష్టా. వ్యాపచ్చాఽ సమ్యక్ప్రయోగనిమిత్తా. అథ సమ్యగసమ్యక్ప్ర సమారబ్ధం కర్మ సిధ్యతి, వ్యాపద్యతే వా అనియమేన. తుల్యం భవతి జ్ఞాన మజ్ఞానేనేతి. ४

వ్యా. పై జెప్పినరీతిగ భగవంతుడైనయాత్రేయుడు వల్కుటయు నగ్నివేశు డిట్లడిగెను:—బుద్ధిమంతు డగువైద్యుడు తొలుతనే దేశకాలాదుల జక్కగ గమనించి, వ్యాధ్యాదిబలానుగుణముగనే యౌషధము నుపయోగించినచో నయోగాతియోగమిథ్యా యోగములు లేక యారోగ్యమును గల్గింపనోపునో, అట్టియౌషధము నిర్ణయించి యుప యోగించినచో నవశ్యముగ రోగనివృత్తి కల్గును. ఔషధముల యథోక్తముగ నుపయో గించుటయే కార్యసిద్ధికి కారణమగును. ఔషధముల విధినియమము లేక యుపయోగిం చుట వ్యాపత్తికి కారణమగును. (కావున నౌషధమును విధ్యుక్తప్రకార ముపయోగించిన

తప్పక చక్కఁగ పనిచేయును. అన్యథా ప్రయోగించిన వ్యాపత్తు తప్పక కల్గును.) నిర్ణయము లేక చక్కఁగనో, లేక వ్యత్యస్తముగనో ప్రయోగింపబడినయెడ నియమములేక యొకవేళ సిద్ధించును, ఒకవేళ వ్యత్యస్తమగును. కాబట్టి జ్ఞానము అజ్ఞానముతో సమానమగును.

యుక్తాయుక్తపరిజ్ఞానపూర్వకముగ నౌషధము నుపయోగించినచో వ్యాపత్తులు కల్గనేరవు కావున జ్ఞానవంతు డగువైద్యుడు తొలుతనే యథావిధిగ నౌషధము నుపయోగించునెడ సంభారముల నేల జేర్పవలెనని ప్రశ్నము.

## ఆత్రేయప్రతివచనము.

మూ. తమువాచ భగవానాత్రేయః—శక్యం తథా ప్రతివిధాతు మస్మాభిః, అస్మద్విధైర్వాప్యగ్నివేశ! యథా ప్రతివిహితే సిద్ధ్యే దేవౌషధ మేకాన్తేన, తచ్చ ప్రయోగసౌష్ఠవ ముపదేష్టుం యథావత్. న హి కశ్చిదస్తి య ఏతదేవముపదిష్ట ముపధారయితు ముత్సహేత, ఉపధార్య వా తథా ప్రతిపత్తుం ప్రయోక్తుం వా సూక్ష్మాణి హి దోష-భేషజ-దేశ-కాల-బల-శరీర-ఆహార-సాత్మ్య-సత్త్వ-ప్రకృతి-వయసా మవస్థాన్తరాణి; యాన్యనుచిన్త్యమానాని విమలవిపులబుద్ధేరపి బుద్ధిమాకులీకుర్యుః. కిం పునరల్పబుద్ధేః. తస్మాదుభయ మేతత్ యథావదుపదేక్ష్యామః — సమ్యక్ప్రయోగం చౌషధానాం, వ్యాపన్నానాం చ వ్యాపత్సాధనాని సిద్ధిషూత్తరకాలం. ४

వ్యా. పైజెప్పినరీతిగ ప్రశ్నజేసిన యగ్నివేశు నిర్దేశించి యాత్రేయుం డిట్లు బదులు సెప్పెను.—చికిత్స చేయవలసిన యొకవ్యాధికి ఎట్టి యౌషధము నుపయోగించినయెడ నయోగాతియోగ మిథ్యాయోగాదులు లేక యథోదితకార్యమును జేసి గుణకరమగునో, అట్టి యౌషధమును నిర్ణయించి చికిత్సచేయుటకు మనకును, మనవంటి జ్ఞానగరిమ కల యితరులకు సామర్థ్యము కలదు. అట్టిప్రయోగసౌష్ఠవము నుపదేశించుటకును మనవంటివారికిని, మనకును సామర్థ్యము కలదు. అట్టియుపదేశమును (గ్రంథరూపమైన దానిని) ఉపస్థితముగ నుంచుకొనుటకును, ఒకవేళ నుపస్థితముగ నున్నను దానియర్థమును సమంజసముగ గ్రహించి, దానికి పొరబాటుబడక విధ్యుక్తముగ నాచరించుటకును సమర్థు డొకడైన నుండడు. వాతపిత్తకఫములను త్రిదోషములు, ఔషధములు, జాంగ

లాదిదేశము, రోగిశరీరమునందలి రోగాధిష్ఠానప్రదేశము, వసంతాదికాలము, బలము, శరీరము, ఆహారము, దేశాదిసాత్మ్యము, మనస్సు, వాతాదిప్రకృతి, బాల్యాదివయస్సు వీనియన్నింటియొక్క అవస్థాభేదములు మిక్కిలి సూక్ష్మసూక్ష్మములై యుండును. కావున నయ్యవి మలంబును, మిక్కిలి వ్యాపకంబును నగు బుద్ధికౌశలముకల మహనీయులచే పలుమారు సయుక్తికముగ నేకాగ్రతతో యోజింపబడినను బుద్ధిని వ్యాకులముగ భ్రమింపజేయును గాని ఇదమిత్థమని నిశ్చయముగ నిర్ణయింప సాధ్యముకాదు. కావున పైజెప్పిన నిర్ణయము అల్పబుద్ధులగు సామాన్యులకు సాధ్యముకానిది. కావున దోషదేశాద్యనుసారముగ నౌషధముల జక్కగ నుపయోగించుపద్ధతియు, దాన సంభవించు వ్యాపత్తులకు దగిన చికిత్సలును కల్పసిద్ధిస్థానమున వివరముగ నుపదేశింపబడును.

## ఔషధాలయనిర్మాణము.

మూ. ఇదానీం తావత్ సమ్భారాన్ వివిధానపి సమాసేనోపదేక్ష్యామః. తద్యథా:—దృఢం నివాతం ప్రవాతైకదేశం సుఖప్రవిచారం అనుపత్యకం ధూమాతపజలరజసామనభిగమనీయం అనిష్టానాఞ్చ శబ్దస్పర్శరసరూపగన్ధానాం సోదపానోలూఖలముసలవర్చస్స్నానభూమిమహానసోపేతం వాస్తువిద్యాకుశలః ప్రశస్తం గృహమేవ తావత్ పూర్వముపకల్పయేత్. ౬

వ్యా. ఇప్పుడు చికిత్సకు కావలసిన పలుదెరంగులైన సంభారములను సంగ్రహముగ నీక్రింద జెప్పెద:—శిథిలముగాక దృఢంబును, గాలి విశేషముగ లేక మితమైనదియు, ఒకప్రదేశమున విశేషముగ గాలి కల్గినదియు, సుఖముగ సంచరింప యుక్తమైనదియు గాలి వెల్తురు మున్నగువాని నడ్డగించు కట్టడములు సమీపమున లేనిదియు, పొగ ఎండ ఉదకము ధూళి మున్నగునవి చొరకుండునదియు, ఓరువ శక్యముకాశబ్దము స్పర్శము రూపము రసము గంధము అనునవి లేక, సుఖకరములుగ నుండు శబ్దస్పర్శాదులు కల్గినదియు, జలమును త్రాగుటకు దగిన పాత్రములు, రోలు రోకలి అనునుపకరణములతో కూడినదియు నగు నొకయింటిని వాస్తుశాస్త్రమును చక్కగ నెరింగిన శిల్పి నిర్మించవలెను. ఆయింటియందు మలమూత్రవిసర్జనమున కనువగు స్థలంబును, స్నానయోగ్యప్రదేశంబును, వంటశాలయు తగినప్రదేశమున నేర్పరింపవలెను. మరియు నా చికిత్సాలయమును ప్రశస్తమైన భూభాగమున నిర్మింపనగును. ఇదియే ప్రధానమైనది కావున నట్టి చికిత్సాలయమునే తొలుత నిర్మింపవలెను. (ఇచ్చట 'ద్వివిధానపి' అని

పాఠాంతరమున భోగార్థములైన సంభారములును, వ్యాపత్సాధనార్థమైన సంభారములును ఇచ్చట సంగ్రహముగ జెప్పబడునని భావము.)

చికిత్సాలయమున సంభారసంభరణము.

మూ. తతశ్శీలశౌచాచారానురాగదాక్ష్య ప్రాదక్షిణ్యోపపన్నాన్, ఉపచారకుశలాన్, సర్వకర్మసు పర్యవదాతాన్, సూపౌదన పాచకస్నాపకసంవాహకోత్థాపకసంవేశకౌషధపేషకాంశ్చ పరిచారకాన్, సర్వకర్మస్వప్రతికూలాన్; తథా గీతవాదిత్రోల్లాపకశ్లోకగాథాఖ్యాయికేతిహాసపురాణకుశలాన్, అభిప్రాయజ్ఞానానుమతాంశ్చ, దేశకాలవిదః పారిషద్యాంశ్చ; తథా లావకపిఞ్జలశశహరిణైణకాలపుచ్ఛకమృగమాతృకోరభ్రాన్, గాం దోగ్ధ్రీం శీలవతీమనాతురాం జీవద్వత్సాం సుప్రతివిహితతృణశరణపానీయాం; పాత్ర్యాచమనీయోదకోష్ఠమణికఘటపిఠరపర్యోగకుమ్భీకుమ్భకుణ్డశరావదర్వీకటోదఞ్చనపరిపచనమన్థానచర్మచేలసూత్రకార్పాసోర్ణాదీని చ; శయనాసనాదీని చోపన్యస్తభృఙ్గారప్రతిగ్రహాణి, సుప్రయుక్తాస్తరణోత్తరప్రచ్ఛదోపధానాని, స్వాపాశ్రయాణి, సంవేశనోపవేశనస్నేహస్వేదాభ్యఙ్గప్రదేహపరిషేకానులేపనవమనవిరేచనాస్థాపనానువాసనశిరోవిరేచనమూత్రోచ్చారకర్మణాముపచారసుఖాని, సుప్రక్షాలితోపధానాశ్చ సుశ్లక్ష్ణఖరమధ్యమాః దృషదః, శస్త్రాణి చోపకరణార్థాని. ధూమనేత్రం చ, వస్తినేత్రం చ, ఉత్తరవస్తికం చ, కుశహస్తం చ, తులాం చ, మానభాణ్డం చ, ఘృతతైలవసామజ్జక్షౌద్రఫాణితలవణేన్ధనోదకమధుశీధుసురాసౌవీరకతుషోదకమైరేయమేదకదధిమణ్డోదశ్విద్ధాన్యామ్లమూత్రాణి చ తథా శాలిషష్టికముద్గమాషయవతిలకులుత్థబదరమృద్వీకాకాశ్మర్యపరూషకాభయామలకవిభీతకాని, నానావిధాని చ స్నేహస్వేదోపకరణాని ద్రవ్యాణి, తథైవోర్ధ్వహరానులోమికోభయభాఞ్జి, సఙ్గ్రహణీయదీపనీయపాచనీయోపశమనీయవాత

హారాణి సమాఖ్యాతాని చౌషధాని; యచ్చాన్యదపి కిఞ్చి
ద్వ్యాపదః పరిసఙ్ఖ్యాయోపకరణం విద్యాత్, యచ్చ ప్రతి
భోగార్థం తత్తదుపకల్పయేత్. ౭

వ్యా. పైజెప్పినరీతిగ ఆలయమును నిర్మించి అందు ఈక్రింద జెప్పబడు సంభారములనన్నిటిని సిద్ధపరచియుంచవలయును. ఎట్లనగ:—మంచినడవడికయు, పరిశుద్ధతయు, రోగులవిషయమై ప్రీతియు, అభిమానంబును, అనుకూల్యంబును కలవారును, ఉపచారములజేయుటకు నేర్పరులును, అన్నిపనులయందును సామర్థ్యముకలవారును పప్పు, అన్నము మొదలగు నాహారపదార్థముల జేయ సమర్థులును, స్నానము ఒడలుపిసుకుట లేవదీయుట పరుండబెట్టుట మున్నగుపరిచర్యలజేయ సమర్థులును, ఔషధముల నూరుట యందు సమర్థులును నగుపరిచారకులను వారివారిపనులనుజేయుటకు ప్రతికూలముగాక శ్రద్ధతో చేయువారిని చూచి ఏర్పాటుచేసి యుంచవలెను.

మఱియు గాత్రజంత్రములతో చక్కగ సంగీతము పాడువారిని, వాద్యగాండ్రను, స్తోత్రముచేయువారిని, శ్లోకములజెప్పి అర్థములవివరించువారిని, మనస్సు కుల్లాసముగ సంభాషించువారిని, అనేకములగు పురాణ ఇతిహాసముల జక్కగ వినిపింపుజారాణికులను, రోగియొక్క ఇంగితము నెరింగి వానికి వలయుదానిని సమకూర్చువారిని, దేశకాలముల జక్కగ దెలిసినవారిని వైద్యునిచెంత సభ్యులుగనుండునట్లు నియమించవలెను.

మరియు నావైద్యశాలయందు లకుముకిపిట్టలు, కపింజలములు, కుందేళ్లు, జింకలు, లేళ్లు, నల్లనితోకకల జింకలు, మృగమాతృకలు (పెద్దకడుపుకల యొకవిధమైనజింకలు) పొట్టేళ్లు అను నీమృగపక్ష్యాదిజంతువులను వానివాని కనుకూలముగ నుండునట్టిస్థలముల నుంచవలెను. సమృద్ధిగ పాలిచ్చునదియు, సాధువైనదియు, రోగములేనిదియు, దానికి కల్గినదూడలన్నియు బ్రతికియుండునట్టిదియు, నిర్దుష్టమైన నీళ్లచేతను గడ్డిమున్నగు నాహారముచేతను చక్కగ పోషింపబడినదియు నైన మంచియావును ఆగృహమునందు మరుగుస్థలమున గట్టియుంచవలెను.

మరియు నీళ్లు త్రాగుటకు దగినపాత్రలు, చేతులను ముఖమును కడిగికొనుటకు వెడల్పైనపాత్రలు, నీళ్లు పోసియుంచుటకు దగిన గంగాళములు, మణికములు (మూతి సన్ననై నీళ్లలోముంచినపుడు ధ్వనించు ఊజిబిందె), కుండలు, స్థాలీచెంబులు, పర్యోగములు (పెద్దబానలు), సన్ననిమూతికల కడవలు, సామాన్యములగు వాడుకకుండలు, కుండలు అను భేదముకల కొన్నిపాత్రలు, ఇనుముచేతను కొయ్యచేతను చేయబడినగరిటెలు, చాపలు, మూసియుంచదగినమూకుళ్లు, బాణండ్లు, కవ్వము, చర్మము, గుడ్డలు,

దారములు, ప్రత్తి, గోట్టె మున్నగువాని వెంద్రుకలు ఇవి మున్నగు నుపకరణముల నుంచునది.

మరియు మంచము మున్నగుశయనములు, కూర్చొనుట కనుకూలములైనబల్లలు, భృంగారములు (కూజాలు), రోగియొక్కమూత్రము ఉమ్మినీరు మున్నగువానిని ఆయా సమయములయందు పట్టికొనుటకు దగిన కొన్నిపాత్రలు, (ఇవి మంచమునకు సమీపమున నుంచదగినవి.) రోగి సుఖముగ నిదురించవలసియున్నపు డుపయోగించునట్లు మంచముమీద మెత్తలచే బరిచి, దానిపై తెల్లనిదుప్పట్లు మున్నగువానిచే గప్పి, దిండ్లు వేసి యుంచవలెను. పరుండుటకును కూర్చొనియుండుటకును మరికొన్ని పరుపులును రత్నకంబళ్లను సిద్ధముగ నుంచవలెను. స్నేహము, స్వేదము, అభ్యంగనము, ప్రదేహము (పట్టువేయుట), పరిషేకము, అనులేపనము, వమనము, విరేచనము, ఆస్థాపనవస్తి, అనువాసనవస్తి, శిరోవిరేచనము (నశ్యకర్మ), మూత్రమును వెడలించుట అను నీచికిత్సావిధానముల జేయునప్పుడు ఆయాకృత్యములకు దగినయుపచారముల జేయుటకై కావలసిన యుపకరణముల నన్నిటిని సిద్ధపరిచి యుంచునది. ఔషధముల నూరుట కుపయోగించునట్లు కొన్ని నునుపుకల్గియు కొన్ని కరకరమనియు, కొన్ని కరకుబారియు నుండునట్లు సన్నికలురాళ్లను, దానిపైనూరుట కనువైనగుండ్లను సిద్ధపరిచి, నీళ్లచే శుభ్రముగ కడిగి యుంచవలెను. శస్త్రచికిత్సకు సాధనములైన శస్త్రములను సిద్ధముగ నుంచవలెను. ధూమనేత్రము (పొగ పీల్చుటకైన గొట్టము), వస్తినేత్రము (వస్తికర్మచేయుటకు దగినగొట్టము), ఉత్తరవస్తి కుపయోగింపదగినగొట్టము, చీపురుకట్ట, త్రాసు, తూనికెగుండ్లు, కొలతమానికెలు, తూములు మున్నగునవి, ఘృతము, తైలము, వస, మజ్జ, తేనె, బెల్లము, జీరా (చక్కెరపాకము), లవణము, కట్టెలు, నీళ్లు, మద్యము, శీధువనుమద్యము, సారాయి, సౌవీరకమను కాంజికము, తుషోదకము, ఆసవము, మేదకము, పెరుగు, పెరుగుమీదిమీగడ, ఉదకముతోకూడినమజ్జిగ, పులిగంజి, గోమూత్రము మున్నగుమూత్రములు వీనినన్నిటిని సిద్ధముజేసి యుంచవలెను.

మరియు రాజనములు, అరువదినాళ్లసంబావులు, పెసలు, ఉద్దులు, యవలు, నువ్వులు, ఉలవలు, రేగుపండ్లు, ద్రాక్షపండ్లు, నేలగుమ్మడు, చిట్టీతపండ్లు, కరకకాయలు, ఉసిరికకాయలు, తాండ్రకాయలు వీనినన్నింటెని సిద్ధముగనుంచునది. ఇతరములగు నానావిధములైన స్నేహస్వేదములకు కావలసిన యుపకరణద్రవ్యముల నన్నింటెని సిద్ధముగ నుంచవలెను. మరియు శరీరమునం దూర్ధ్వభాగమునందలి దోషముల హరించునవియు, వాతము ననులోమముగను ప్రతిలోమముగను రెండువిధములుగను సంచరింపజేయునవియు, మలమూత్రాదుల నిల్పునవియు, ఆకలిబుట్టించునవియు, ఆహారమును

జీర్ణింపజేయునవియు, దోషముల శమింపజేయునవియు, వాతహరంబులును నగు నానా విధౌషధములను సేకరించి యథోపయోగ్యముగ సిద్ధపరిచి వానివానికి తగుమైనగుర్తుల పెట్టి తత్తదుచితస్థలముల నుంచియుండవలెను. మరియు చికిత్సావ్యత్యయమునంజేసి సంభవించెడు వ్యాపత్తుల నివర్తింపదగినవిగా తనకు నేయేయుపకరణములును ఔషధములును గోచరములగునో వానినన్నింటిని, రోగికి సుఖమునుకల్గించు నితరములైన భోగ్య పదార్థములసుంగూడ సిద్ధపరిచి యుంచవలెను. (ఇత్తెరంగున పైజెప్పిన యుపకరణములను, ఔషధములను, సాధనములను అన్నింటిని యథార్థముగ సిద్ధముచేసి ఆయావస్తువును అవసరమైనపుడు తటాలున నెత్తికొనుటకు వీలగునట్లు తగినచిహ్నముల నేర్పరిచి యుక్త స్థలమున సిద్ధముగ నౌషధాలయమున నుంచవలెనని ప్రకరణార్థము).

### వమనౌషధప్రయోగపూర్వకృత్యము.

మూ. తతస్తం పురుషం యథోక్తాభ్యాం స్నేహస్వేదాభ్యాం యథా
ర్హముపపాదయేత్. తం చేదస్మిన్నన్తరే మానసః శారీరో వా
వ్యాధిః కశ్చిత్ తీవ్రతరః సహసాఽభ్యాగచ్ఛేత్, తమేవ
తావదస్యోపావర్తయితుం యతేత. తతస్తముపావర్త్య తావన్త
మేవైనం కాలం తథావిధేనైవ కర్మణా ఉపాచరేత్. ౭

వ్యా. పైజెప్పినరీతిగ సంభారముల సిద్ధముగ జేసికొనినపిమ్మట శోధనచికిత్స జేయ దలచినరోగిని స్నేహస్వేదములచే విధ్యుక్తప్రకార ముపచరించవలెను. వానికి స్నేహస్వేదవిధుల నిర్వర్తించుసమయమున నేదైన నొకమానసరోగమైనను శారీరరోగమైనను మిక్కిలితీవ్రముగ తటాలున సంభవించినయెడ, అట్టివేళ స్నేహస్వేదవిధులను శీఘ్రముగ మానుటకై ప్రయత్నముచేయవలెను. పిమ్మట రోగికి నాకస్మికముగ తత్కాలమున సంభవించినరోగమునకు దగినచికిత్సను ఆరోగము శమించువరకును జేయునగును.

### వమనౌషధపానవిధము.

మూ. తతస్తం పురుషం, స్నేహస్వేదోపపన్నం, అనుపహతమానసం
అభిసమీక్ష్య; సుఖోషితం సుప్రజీర్ణభక్తం, శిరస్స్నాతమను
లిప్తగాత్రం, స్రగ్విణమనుపహతవస్త్రసంవీతం, దేవతాగ్ని
ద్విజగురువృద్ధవైద్యానర్చితవన్తం, ఇష్టే నక్షత్రతిథికరణ
ముహూర్తే కారయిత్వా బ్రాహ్మణాన్ స్వస్తివాచనం, ప్రయు
క్తాభిరాశీర్భిరభిమన్త్రితాం, మధుమధురసైన్ధవఫాణితోపహి
తాం, మదనఫలకషాయమాత్రాం పాయయేత్. ౮

వ్యా. పైజెప్పినరీతిగ చికిత్సచేసి యారోగికి నాకస్మికముగ సంభవించిన యుపద్రవము శాంతినొందినపిదప స్నేహస్వేదములచే సమ్యగ్యోగలక్షణములు కలవానిగ నెరింగి, వాడు సంతోషమానసుడుగ నుండుసమయమును చక్కగ గమనించి, సుఖముగనుండు వానిగను, వాడు ముందుదినమున భుజించినయాహారము చక్కగజీర్ణించియుండువానిగను దోచినప్పుడు, వానికి శిరస్స్నానము జేయించి, చందనాదులను సుగంధముల శరీరమునకు బూసి, పుష్పమాలికలచే నలంకరించి, పరిశుద్ధమై నిర్మలములైన బట్టల గట్టించి, బ్రాహ్మాది దేవతలకును, అగ్నికిని, బ్రాహ్మణులకును, గురువులకును, జ్ఞానవయోవృద్ధులకును, వైద్యాచార్యులకును పూజావిధుల నొనరింపజేసి, జ్యోతిశ్శాస్త్రవిహితమైన తిథివారనక్షత్రయోగకరణయుక్తసుముహూర్తమున బ్రాహ్మణులచే స్వస్తివాచనము జేయించి, అట్టి బ్రాహ్మణులచేనొసగబడిన యాశీర్వచనములచే నభిమంత్రింపబడినదియు, తేనె మధురరస ద్రవ్యములు, సైంధవలవణము, చక్కెరపాకము (జీరా) అను నీద్రవ్యములతో యథాయోగముగ గూర్చబడినదియు నగు మ్రంగకాయలకషాయమును మాత్రాప్రమాణానుసారముగ రోగికి (వమనమునకై) త్రాగింపనగును.

### సంశోధనౌషధమాత్రానిర్ణయము.

మూ. మదనఫలకషాయమాత్రాప్రమాణం తు ఖలు సర్వసంశోధన
మాత్రాప్రమాణాని చ ప్రతిపురుషమపేక్షితవ్యాని భవన్తి.
యావద్ధి యస్య సంశోధనం పీతం వైకారికదోషహరణాయోప
పద్యతే, న చాఽతియోగాఽయోగాయ, తావదస్య మాత్రా
ప్రమాణం వేదితవ్యం భవతి. ౧౦

వ్యా. పైజెప్పిన మ్రంగకాయకషాయమాత్రాప్రమాణంబును, తక్కిన సంశోధనౌషధముల మాత్రాపరిమాణంబులును ప్రతిమనుజుని బలాదుల నపేక్షించియుండును (కాని నియతముగ నాయాౌషధములకు పరిమాణమొకటి నిర్ణయముగనుండదు.) ఏపురుషుడు ఎంతమాత్రము శోధనౌషధమును త్రాగినచో అయోగాతియోగాది జనితోపద్రవముల గల్గింపక, తత్కాలమున రోగికి దోషవైపరీత్యముచే సంభవించిన రోగమును మాత్రము నివర్తింప సమర్థముగనుండునో, అట్టిప్రమాణము ఆపురుషునకు మాత్రగా దెలిసికొనునది. (రోగి శోధనౌషధమును సేవించినపుడు దానివలన వానికి అయోగాతియోగములు లేక సుఖముగ రోగము మాత్రము శమించినచో నయ్యది వానికి దగినప్రమాణమగునని భావము.) అట్టిపరిమాణము పురుషునిబలాబలముల ననుసరించి

యుండును కావున పలుమారు క్రమక్రమముగ నుపయోగించి మాత్రానిర్ణయము చేయ వలెను).

— వమనమునందోలచలనాదిలక్షణములు. —

మూ. పీతవన్తం తు ఖల్వేనం ముహూర్త మనుకాంక్షేత్. తస్య యదా జానీయాత్ స్వేదప్రాదుర్భావేన దోషప్రవిలయన మాపద్యమానం, లోమహర్షేణ స్థానేభ్యః ప్రచలితం, కుక్షి సమాధ్మాపనేన చ కుక్షిమనుగతం, హృల్లాసాస్య స్రవణాభ్యా మపి చోర్ధ్వముఖీభూతం, అథాస్మై జానుసమమసంబాధం, సుప్ర యుక్తా స్తరణోత్తరప్రచ్ఛదోపధానం స్వాపాశ్రయమాసనం ఉపవేష్టుం ప్రయచ్ఛేత్. ౧౧

వ్యా. పైజెప్పినరీతిగ వమనౌషధకషాయమును రోగి త్రాగినపిదప నొక ముహూర్త (రెండుగడియల) కాలము నిర్వ్యాపారముగ నుండవలెను. పిమ్మట వాని కెప్పుడు చెమటబోడమునో అప్పుడు దోషములు సడలుచున్నవనియు, లోమహర్షము కల్గినయెడ దోషము స్వస్థానమునుండి వెడలుచున్నదనియు, కడుపులో గడబిడమనుశబ్దము కల్గి యుబ్బినప్పుడు దోషము కుక్షిలో ననుసరించి యున్నదనియు, గుండ్రించి యొక రింతలుకల్గి నోట నీరువెడలుచున్నయెడ దోషము ఊర్ధ్వముఖమై పైకి వ్యాపించుచున్న దనియు వరుసగ నెరుంగునది. పైజెప్పినలక్షణములు వరుసగ కానబడినప్పుడు మోకాలి పొడవైన మంచమునైనను బల్లపలకనైనను మెత్తగనుండునట్లు దానిపై బరిచి యానుకొను టకు దిండ్లువేసి, దానిపై వానిని సుఖముగ కూర్చొనియుండ నియమించవలెను. వాని చెంత మిక్కిలి సందడి లేకుండునట్లు చేయవలెను. (స్వాపాశ్రయమన సుఖముగ పరుండి నిద్రబోవుటకు వసతిగనుండు మంచము ఈజిచేరు మున్నగునవియని యెరుంగునది).

— ఉపచారములు. —

మూ. ప్రతిగ్రహాంశ్చోపచారయేత్.—లలాటప్రతిగ్రహే, పార్శ్వో పగ్రహణే, నాభిప్రపీడనే, పృష్ఠోన్మర్దనే, అనపత్రపనీయాః సుహృదోఽనుమతాః ప్రయతేరన్. ౧౨

వ్యా. ('ప్రతిగృహ్ణాన్తీతి ప్రతిగ్రహాః' అను వ్యుత్పత్తిచేత లలాటము మున్నగు నవయవముల పట్టి చేయబడిన మర్దనాద్యుపచారములు ప్రతిగ్రహము లనబడును).

పైజెప్పినరీతిగ రోగికి దోషము ఊర్ధ్వముఖముగ నున్నపుడు తగినస్వాపాశ్రయముగ సుఖముగనుంచి వానికి క్రిందచెప్పబడురీతిగ ప్రతిగ్రహముల (మర్దనాద్యుపచారముల) జేయించవలెను:—వానికి సిగ్గును కల్గింపనివారును మంచిమనస్సు కల్గినవారును ఇష్టులు నగు పరిచారకులు నుదుట పట్టికొనుట, ఇరుపార్శ్వముల గట్టిగపట్టి చేతులచే చరుముట, బొడ్డుసమీపమున పిసుకుట, వీపున మర్దనముచేయుట అను నీయుపచారముల యథోచితముగ చేయవలెను.

### వమనౌషధమును పానముచేసి వేగప్రవర్తనోపాయములు.

మూ. అథైనమనుశిష్యాత్—వివృతోష్ఠతాలుకణ్ఠో నాతిమహతా వ్యాయామేన వేగానుదీర్ణానుదీరయన్, కిఞ్చిదవనమ్య గ్రీవాం, ఊర్ధ్వశరీరముపవేగం అప్రవృత్తాన్ ప్రవర్తయన్, సుపరిలిఖిత నఖాభ్యాం ఉత్పలకుముదసౌగన్ధికనాళైర్వా కంఠమనుస్పృశన్ ముఖం ప్రవర్తయస్వేతి. ౧౩

వ్యా. పిమ్మట రోగి కిత్తెరంగున నాజ్ఞాపింపవలెను:—వమనములు వేగముగ వెడలనున్నపుడు పెదవులను దవుడలను కంఠమును బిగబట్టక బాగుగ దెరిచి యధికమైన బలవంతమగు ప్రయత్నముచేయక మితమైనప్రయత్నముతో వమనముల వెడలింపవలెను. అప్పుడు కంఠమును కొంచెముగ వంచియుంచుకొనవలెను. మరియు శరీరమున పైభాగమునకు కొంచెముగ వ్యాపించి వమనము రాక యడచికొని యున్నపుడు మెడను కొంచెముగవంచి గోళ్లనూడదీసిన రెండువ్రేళ్లచేనైనను, కలువకాడలచేనైనను, అల్లికాడలచేనైనను, తామరకాడలచేనైనను నోట (కుత్తుకలో) కలియబెట్టి, వెడలనుద్యమించు వమనములను పెకలించి వెడలింపవలెను. (ఇచ్చట 'ఉపవేగం ప్రవర్తస్వ' అనుదానికి వెడలక యది యూర్ధ్వభాగమున నున్నపుడు దానిని పైజెప్పినయుపాయములచే పెల్లగించి ధారాళముగ వెడలించవలెనని యర్థము. ఇట్లు చెప్పుటచేత వమనవేగము బొత్తుగ లేనపుడు బలాత్కారముగ పెల్లగింపదగదని భావము.) ఇత్తెరంగున వమన ఔషధమును త్రాగినరోగికి నుపదేశించవలెనని యర్థము.

### వమనవేగపరీక్ష, దానిప్రయోజనము.

మూ. స తథావిధం కుర్యాత్. తతోఽస్య వేగాన్ ప్రతిగ్రహగతా నవేక్షేత అవహితః. వేగవిశేషదర్శనాద్ధి కుశలో యోగాతియోగవిశేషాన్ ఉపలక్షేత. వేగవిశేషదర్శీ పునః కృత్యంయథార్హమవబుధ్యేత లక్షణేన. తస్మాత్ వేగానవేక్షేతావహితః. ౧౪

వ్యా. వైద్యుఁ డిట్లీరంగున నాజ్ఞనొసంగ రోగియుఁ నట్లనే యాచరించవలెను. పిమ్మట వైద్యుఁడు పాత్రతో గ్రహింపబడిన వమనమలములను మిక్కిలి గమనముతో పరిశీలించవలెను. అట్టిమలములయందలి విశేషముల చక్కఁగ గమనించినగాని దానగల్గ బోవు అయోగాతియోగలక్షణముల దెలిసికొనజాలఁడు. కావున వమనవేగముల విశేష లక్షణములను మిక్కిలి గమనముతో పలుమారు పరీక్షించవలెను. అట్లు గమనించుటచేత దానికి ఆవశ్యకమగుకృత్యము జేయుటకును వైద్యుఁడు సమర్థుఁడగునని భావము.

మరియుఁ వేగములనుబట్టి శరీరము చక్కఁగ శుద్ధమైనది లేనిది గమనించవలెను. ఈవేగనిర్ణయము వేరొకచోట నిట్లు చెప్పబడినది.—"జఘన్యమధ్యప్రవరేతు వేగాః చత్వార ఇష్టా వమనే షడష్టౌ" (నాల్గుమార్లు వమనము లైనయెడ మధ్యమవేగమనియుఁ, ఆరుసార్లు అయిన మధ్యమవేగమనియుఁ, ఎనిమిదిమార్లు అయినచో నుత్తమవేగమనియుఁ గమనింపనగును) కావున పైజెప్పినరీతిగ వైద్యుఁడు వమనవేగముల గమనింపవలెనని భావము. (ఇచ్చట ప్రతిగ్రహమనగ వమనాదిమలముల గ్రహించుటకై యుంచబడిన పళ్లెము మున్నగుపాత్రవిశేషమని యెఱుంగునది).

### వమనాయోగలక్షణములు.

మూ. తత్రామాన్యయోగయోగాతియోగవిశేషజ్ఞానాని భవన్తి: తద్యథా:—అప్రవృత్తిః, కుతశ్చిత్ కేవలస్యవా ప్యౌషధస్య విభ్రంశో, విబన్ధో, వేగానామయోగలక్షణాని భవన్తి. ౧౫

వ్యా. వమనౌషధముచేగల్గిన అయోగ-సమ్యగ్యోగ-అతియోగలక్షణము లీక్రింద వివరింపబడును:—వమనౌషధము చక్కఁగ పనిచేయనియెడల వమనవేగము బొత్తిగ కల్గకయే యుండును. లేక ముఖ్యముగ వెడలవలసిన దోషముమాత్రము వెడలకుండును. లేక ఔషధము ప్రతికూలముగ (వమనౌషధము విరేచనమార్గముగను, విరేచనౌషధము వమనమార్గమునను) వెడలును. అట్టియౌషధము కూడ వెడలక బద్ధమగును. ఇవియన్నియుఁ వమనాయోగలక్షణములు.

ఈయయోగలక్షణములు సిద్ధిస్థానమున నిట్లు చెప్పబడినవి.—"అయోగః ప్రాతిలోమ్యేన నవాల్పంవా ప్రవర్తనమ్" ఇవియే పైన వివరింపబడినవి.

### వమనసమ్యగ్యోగలక్షణములు.

మూ. కాలే ప్రవృత్తిః, అనతిమహతీవ్యథా, యథాక్రమం దోష హరణం, స్వయం చావస్థానమ్, ఇతి యోగలక్షణాని భవన్తి.

యోగేన తు దోషప్రమాణవిశేషేణ తీక్ష్ణ-మృదు-మధ్యవిభాగో ద్రష్టవ్యః. ౧౬

వ్యా. వమనౌషధము చక్కగ పనిచేసినయెడ సకాలమున వమనములు చక్కగ వెడలును. వమనౌషధముచేత కడుపులో సంకటము మున్నగుబాధలు స్వల్పముగ కల్గును. (వమనౌషధమును సేవించినపుడు తొలుత కఫంబును, పిదప పిత్తంబును, పిమ్మట వాతంబును వరుసగ వెడలవలెను) అట్టినియమము ననుసరించి కఫపిత్తవాతములు వరుసగ వెడలును. అట్టిదోషములు వరుసగ వెడలి పిమ్మట తనంతటనే వేగములు నిలచును. ఇవి వమనౌషధసమ్యగ్యోగలక్షణములు. మరియు నట్టిసమ్యగ్యోగమునను కఫరూపమైనదోషము విశేషముగ వెడలినచో తీక్ష్ణయోగమనియు, మితముగ నున్నచో మృదుయోగమనియు, మధ్యముగ నున్నచో మధ్యమయోగమనియు కఫప్రమాణభేదమునుబట్టి నిర్ణయించునది. సమ్యగ్యోగమున నిట్టి తీక్ష్ణమృదుమధ్యభేదములు పేయాదిక్రమము ననుసరించుటకై చెప్పబడినది. ఈనియమము సిద్ధస్థానమున విశేషముగ జెప్పబడును. మరియు దోషము వెడలుక్రమము సిద్ధిస్థానమున నిట్లు చెప్పబడినది:—"క్రమాత్కఫః పిత్తమథానిలశ్చ యస్యైతి సమ్యగ్వమితస్స ఇష్టః."

### వమనాతియోగలక్షణములు.

మూ. యోగాధిక్యేన తు ఫేనిలరక్తచన్ద్రికోపగమనం ఇత్యతియోగలక్షణాని భవన్తి. ౧౭

వ్యా. వమనాతియోగమువలన నురుగుతోడను రక్తముతోడను నెమలికన్నువంటి చిత్రమైన రంగుగలద్రవ్యముతోడను గూడిన వమనములగును. ఇది వమనాతియోగలక్షణములు.

### వమనాయోగ-అతియోగముల గల్గునుపద్రవములు.

మూ. తత్రాతియోగాఽయోగనిమిత్తానిమానుపద్రవాన్ విద్యాత్—ఆధ్మానం పరికర్తికా పరిస్రావో హృదయోపసరణం అఙ్గగ్రహో జీవాదానం విభ్రంశః స్తమ్భః క్లమః ఉపద్రవఇతి. ౧౮

వ్యా. మరియు వమనాతియోగ-అయోగములవలన నీయుపద్రవములు సంభవించును:—కడుపుబ్బరము, ఆశయమున కత్తిరించినవిధమున పోట్లు, నోట ద్రవము కారుచుండుట, రొమ్ముపట్టినట్లు అదవు, ఒడలినొప్పులు, ప్రాణమున కాధారమైన

రక్తము వెడలుట, ప్రజ్ఞతప్పుట, శరీరము స్తంభించుట, బడలిక అను నీయుపద్రవములు వమనాతియోగ అయోగములవలన సంభవించును. మరియు సిద్ధిస్థానమున 'బహుదోషస్య రూక్షస్య' అని యుపక్రమించి అయోగాదులచే గల్గునుపద్రవములు వివరింపబడును. కావున నవికూడ గమనింపనగును.

ఇచ్చట "హృదయోపశరణం, హృదయోపసరణం, హృదయోపరోధనం" అని మూడువిధములుగ పాఠభేదములు గానవచ్చుచున్నవి. అందు "హృదయోపశరణం, హృదయోపరోధనం" అనునవి రెండును సమానార్థకములు. "హృదయోపసరణమన," వమనాతియోగముచే దోషములు ప్రకుపితములై హృదయస్థానమునజేరుటయనియర్థము. ఈవిషయమునే తంత్రకారుడు "కుపితా హృదయం గత్వా దోషాః కుర్వన్తి హృద్గ్రహమ్" అని స్థలాంతరమున జెప్పిరి. దోషములు ప్రకుపితములై హృదయస్థానమునజేరి హృదయమును అడచునని యర్థము. ఈమూడుపాఠములయందును విశేషభేదము కన్పట్టదు. "జీవాదానం" అనగా జీవనమునకు హేతువైన ధాతురూపరక్తము వెడలునని యర్థము. ఈవిషయము "అతియోగాచ్చ భైషజ్యం జీవం హరతి శోణితమ్, తజ్జీవాదాన మిత్యుక్తం ఆదత్తే జీవితం యతః" అని స్థలాంతరమున జీవాదాననిర్వచనము చెప్పబడినది.

### యథోక్తముగ వాంతియైనవానికి ధూమపానవిధి.

**మూ.** యోగేన తు ఖల్వేనం ఛర్దితవన్తమభిసమీక్ష్య సుప్రక్షాళిత పాణిపాదాస్యం ముహూర్తమాశ్వాస్య, స్నైహికవైరేచని కోపశమనీయానాం ధూమానామన్యతమం సామర్థ్యతః పాయయిత్వా, పునరేవోదకముపస్పర్శయేత్. ౧౮

వ్యా. పైజెప్పినవిధముగ వమనములు యథోక్తముగ వెడలి సమ్యగ్యోగలక్షణములు గానవచ్చి యుపద్రవములు లేకుండునపుడు వాని కాళ్లుచేతులను ముఖమును నీళ్లతో చక్కగ కడిగికొన నియమించి రెండుగడియలకాలము సేదదీర్చికొననిచ్చి, స్నైహిక-వైరేచనిక-ఉపశమనీయక ధూమద్రవ్యములలో నెయ్యది యెవనికి హితకరముగనుండునో, వానికి అట్టిద్రవ్యములచేసైన ధూమమును పానముచేయించి, మరల పైజెప్పినరీతిగ హస్తపాదముఖముల నుదకముచే గడిగికొని యుండజేయవలెను. ఇచ్చట "సామర్థ్యతః పాయయిత్వా" అని చెప్పుటచేత రోగియొక్క పరిస్థితిని చక్కగ పరిశీలించి యుచితమైన ధూమపానము జేయించవలెనని భావము.

### వమితునకు హితములైన యాహారవిహారములు.

**మూ.** ఉపస్పృష్టోదకం చైనం నివాతమాగారమనుప్రవేశ్య, సంవేశ్య చానుశిష్యాత్:—ఉచ్చైర్భాష్యం, అత్యాశనం, అతిస్థానం,

అతిచఙ్క్రమణం, క్రోధశోకహిమాతపావశ్యాయాఽతిప్ర వాతాన్, యానయానం, గ్రామ్యధర్మం, అస్వపనంనిశి, దివా స్వప్నం, విరుద్ధాఽజీర్ణాఽసాత్మ్యాఽకాలప్రమితాతిహీనగురు విషమభోజనవేగసన్ధారణోదీరణమితి భావానేతాన్ మనసా ప్యసేవమానః సర్వమాహారమద్యాదితి; స తథా కుర్యాత్. ౨౦

వ్యా. పైజెప్పినరీతిగ నాచరించినరోగిని గాలిచొరని యొకగదిలో ప్రవేశిం జేసి యచ్చట వానికి సుఖముగ నుండునట్లు మంచము మున్నగు తగునాసనముపై సు ముగ పరుండమని వైద్యుడు వానికిట్లుపదేశింపవలెను:—మిక్కిలి బిగ్గరగ మాటలా కూడదు. అధికముగ భుజింపదగదు. అధికముగ సంచరింపదగదు. సోమరిబోతువలె నొ చోట చాలకాలము స్థిరముగ కూర్చొని యుండకూడదు. కోపమునకును శోకమునకు అవకాశ మొసంగదగదు. చలియందును ఎండయందును మంచునందును మిక్కిలి గా వీచు ప్రదేశమునందును ఉండకూడదు. గుఱ్ఱము మొదలగువానినెక్కి సవారిచేయదగద స్త్రీసంభోగమును రాత్రి నిదురమేల్కాంచుటయు పవలు నిదురించుటయు విడు దగును. పరస్పరసంయోగ విరుద్ధములైన క్షీరమత్స్యాదుల నొకటిగజేర్చి భుజింపదగ సులభముగ జీర్ణముకాని చేమదుంపలు మున్నగువానిని, ప్రకృతికి సరిపడక యసాత్మ్య ములైన పదార్థముల భుజింపదగదు. అకాలమున భుజింపదగదు. ఒకటేరసమును భుజి కూడదు సత్తువలేని పదార్థములను స్వభావముచే గురుత్వమునుకల్గించు లడ్డు అటుకు మున్నగుపదార్థములను తినకూడదు. పత్థ్యములను అపత్థ్యములను జేర్చి భుజింపదగ మలమూత్రాదివేగముల నాపుటయు అవి వేగములేనప్పుడు బలాత్కారముగ వెడలి బూనుటయుం దగదు. పైజెప్పిన నిషిద్ధవిషయములను మనస్సునందైన స్మరింపక విధ్యు మైన యాహారమును భుజింపవలెనని రోగికి వైద్యు డుపదేశింపవలెను. రోగియుం అం కొంచెమైన జవదాటక యథోక్తముగ నాచరింపవలెను.

పమితునకు పేయాదిక్రమాహారనియమము.

మూ. అథైనం సాయాహ్నే అపరేఽహ్ని సుఖోదకపరిషిక్తం పు ణానాం లోహితశాలితణ్డులానాం స్వవక్లిన్నానాం మణ్డపూర సుఖోష్ణాం యవాగూం పాయయేత్ అగ్నిబలమభిసమీక్ష్య ఏవం ద్వితీయే, తృతీయేవాఽన్నకాలే.

చతుర్థే త్వన్నకాలే తథావిధానామేవ శాలితణ్డులానాం ఉత్స్విన్నానాం విలేపీం ఉష్ణోదకద్వితీయాం అస్నేహలవణాం అల్పస్నేహలవణాం వా భోజయేత్, ఏవం పఞ్చమే షష్ఠే చాన్నకాలే. ౨౨

సప్తమే త్వన్నకాలే తథావిధానామేవ శాలీనాం ద్విప్రసృతం సుస్విన్నమోదనముష్ణోదకానుపానం తనునా తనుస్నేహలవణోపపన్నేన ముద్గయూషేణ భోజయేత్, ఏవమష్టమే నవమే చాన్నకాలే. ౨౩

దశమే త్వన్నకాలే లావకపిఞ్జలాదీనాం అన్యతమస్య మాంసరసేనౌదకలావణికేనాపి సారవతా భోజయేత్. ఉష్ణోదకానుపానమ్. ఏవమేకాదశే ద్వాదశే చాన్నకాలే. అత ఊర్ధ్వమన్నగుణాన్ క్రమేణోపభుఞ్జానః సప్తరాత్రేణ ప్రకృతిభోజనమాగచ్ఛేత్. ౨౪

వ్యా. పిదప పైజెప్పినరీతిగ వమనరూపశోధనముచే శుద్ధమైనవాడు నాటిదినము సాయంకాలమునందైనను మరుసటిదినము ఉదయకాలమునందైనను తొలుత వేడినీళ్లతో శుభ్రముగ స్నానముచేసి ప్రాతవియగు ఎఱ్ఱవరి రాజనములబియ్యముచే బాగుగ పక్వముజేయబడినదియు, మండముతో గూడినదియు, వేడిగనుండునదియు నగు యవాగువును జాఠరాగ్ని చక్కగ గమనించి పానము చేయవలెను. ఇత్తెరంగుననే రెండవ యన్నకాలమునందును, మూడవ యన్నకాలమునందును పైజెప్పిన యవాగువును త్రాగవలెను. (ఇచ్చట కాయాగ్ని చక్కగనుండి యాకలి బాగుగనున్నయెడ నాటి సాయంకాలమునందును, ఆకలి చక్కగలేనియెడ మరుసటిదినము ప్రాతఃకాలమునను పైజెప్పినరీతిగ యవాగును త్రాగవలెనని తెలుపుటకై "సాయాహ్నే, అపరేఽహ్ని వా" అని పక్షద్వయము చెప్పబడినది. ఈవిషయముసే సిద్ధిస్థానమున నిట్లు చెప్పియున్నది. "వమితం లఙ్ఘయేత్సమ్యక్ జీర్ణలిఙ్గాన్యపేక్షయన్, తాని దృష్ట్వా తు పేయాది క్రమం కుర్యాన్న లఙ్ఘయేత్" వమనముచే శుద్ధమైనవానికిని ఆకలి చక్కగ కల్గునంతవరకు లంకణము చేయవలెననియు, ఆకలి లక్షణములు పూర్తి గనపడినప్పుడు పేయాది క్రమము ననుసరించి యాహారమును పెట్టవలెనుకాని లంకణము పెట్టతగదనియు భావము).

నాల్గవ యన్నకాలమున ప్రాతవియగు ఎఱ్ఱనిరాజనములబియ్యముచే బాగుగ పక్వముచేయబడినదియు, ఉష్ణోదకముతో కూడినదియునగు విలేపియనుగంజిని ఉప్పుతోను నెయ్యితోను జేర్పకయైనను, కొంచెముగ జేర్చియైనను భుజింపవలెను. ఇత్తెరంగున నే ఐదు ఆరు అన్నకాలములయందును భుజింపనగును.

ఏడవ యన్నకాలమునందును ప్రాత ఎఱ్ఱవరిరాజనములబియ్యమును పాఁబుగ రెండుమార్లు వండి గంజివార్చి యాయన్నమును లేటనై కొంచెముగ స్నేహలవణములతో గూడిన ముద్గయూషము (పెసలకట్టు)తో గూర్చి యుష్ణోదకానుపానముగ భుజింపవలెను. ఇటులనే యెనిమిది తొమ్మిది యన్నకాలములయందుసు భుజింపనగును.

పదియవ యన్నకాలమున మిగుల సారవంతమైన లకుముకిపిట్ట కపింజలము మొదలగుపక్షులలో నొకదానిమాంసముతోడ నెఱ్ఱరాజనములయన్నమును ఉష్ణోదకానుపానముగ భుజింపవలెను. ఇటులనే పదునొకండు పండ్రెండవ అన్నకాలములయందును భుజించునది. అందుపై నేడవదినము మొదలుజేసి క్రమక్రమముగ మధురాదిరసములతోడను మృదుకఠినాది గుణములతోడను గూడినయాహారమును మామూలుగ భుజింపనగును. (ఇత్తెరంగున సమ్యగ్యోగవమితునకు నాహారక్రమము చేయింపందగుననిభావము.)

అట్టి యాహారక్రమము ననుసరించుటకు ప్రయోజనమును వాగ్భటాచార్యులిట్లుపదేశించిరి:—"యథాణురగ్ని స్తృణగోమయాద్యైః సన్ధుక్షమాణో భవతిక్రమేణ, మహాన్ స్థిరస్సర్వపచ స్తథైవ శుద్ధస్య పేయాదిభిరన్తరగ్నిః" చాల స్వల్పముగనుండు అగ్ని లోకమున గడ్డిపోచలు పిడకలు చిదుగులు మున్నగువానిచే క్రమక్రమముగ రగిలి వృద్ధినొంది యన్నిటినిదహింప సమర్థమగువిధముగ, వమనాదిశోధనముచే సన్నగిలియుండు జాఠరాగ్ని పేయాదిక్రమాహారముచే నానాట వృద్ధినొంది యెట్టి గురుపదార్థములనైనను జీర్ణింప సమర్థమగునని భావము.

## విరేచనౌషధసేవనక్రమము.

మూ. అథైనం పునరేవ స్నేహస్వేదాభ్యాముపపాద్య, అనుపహతమానసమభిసమీక్ష్య, సుఖోషితం, సుప్రజీర్ణభక్తం, కృతహోమబలిమఙ్గళజప్యప్రాయశ్చిత్తం, ఇష్టే తిథినక్షత్రకరణముహూర్తే బ్రాహ్మణాన్ స్వస్తివాచయిత్వా త్రివృత్కల్కం అక్షమాత్రాం యథార్హాలోడనప్రతివినీతాం పాయయేత్; ప్రసమీక్ష్యదోష

భేషజదేశకాలబలశరీరాహారసాత్మ్యసత్వప్రకృతివయసాం అవస్థాన్తరాణి వికారాంశ్చ. ౨౫

వ్యా. పైజెప్పినరీతిగ వమనముజేసి శుద్ధుడై యథోక్తాహారమును సేవించిన వానికి మరల స్నేహస్వేదముల యథోక్తముగ జేసి సుఖముగ నుల్లాసముతో నున్నవానిని గమనించి యాహారము చక్కగ జీర్ణించియుండుసమయమున వానిచేత హోమము పూజావిధానము మంగళకృత్యములు, జపము ప్రాయశ్చిత్తము మున్నగు కృత్యముల వాని కర్మానుగుణముగ జేయించి, శ్రేష్ఠమైన తిథివారనక్షత్రయోగకరణయుక్తమైన సుముహూర్తమున బ్రాహ్మణుల రావించి స్వస్తివాచనముజేయించి, యథార్హములైన వస్తువులగలిపి సిద్ధముచేయబడిన తెగడకల్కమును అక్షప్రమాణమాత్రమును విరేచనములకై యారోగికి త్రాగింపవలెను. ఆయౌషధమును త్రాగించునపుడు వాతాది దోషపరిస్థితిని, ఔషధము దేశము కాలము శరీరము ఆహారము సాత్మ్యము వాతాది ప్రకృతి రోగియొక్క వయస్సు వీని యవస్థాభేదములను, కుష్ఠాదిరోగముల పరిస్థితిని చక్కగ తొలుత గమనించి తత్తదనుగుణముగ పైజెప్పిన తెగడకల్కమును త్రాగింపవలెను.

### సమ్యగ్విరిక్తానంతరకృత్యములు.

మూ. సమ్యగ్విరిక్తం చైనం వమనాన్తరలక్షణోక్తేన ధూమవర్జేన విధినోపపాదయేత్, ఆబలవర్ణప్రకృతిలాభాత్, బలవర్ణోపపన్నం చైనం అనుపహతమనసం, అభిసమీక్ష్య; సుఖోషితమ్, సుప్రజీర్ణభక్తం, శిరస్స్నాతం, అనులిప్తగాత్రం, స్రగ్విణమనుపహతవస్త్రసంవీతం, అనురూపాలఙ్కారాలఙ్కృతం, సుహృదాం దర్శయిత్వా జ్ఞాతీనాం దర్శయేత్. అథైనం కామేష్వవసృజేత్. ౨౬

వ్యా. పైజెప్పినరీతిగ నౌషధసేవంజేసి వానికి చక్కని విరేచనములైన లక్షణములు గానవచ్చినప్పుడు వానికి వమనాంతరమున జేయదగినవిగ విధించిన విధులలో ధూమపాన మొక్కటిని మాత్రము విడచి తక్కిన విధులనన్నిటిని యాచరింపవలెను. శరీరమునకు బలంబును శరీరకాంతియు ప్రకృతియు మామూలుపద్ధతిగ వానికికల్గునందాక పైజెప్పిన వమనానంతరకృత్యములనే యాచరింపదగును. పిమ్మట బలవర్ణా

దులతోఁగూడి నిశ్చలమై నిర్మలమైన మనస్సుకలవానిని సుఖముగ నిద్రపట్టి ఆహారము జీర్ణించుచున్నవానిగ గమనించి, శిరోభ్యంగస్నానమును నలుగుపెట్టిచేయించి, చందనాదుల నలంది, పుష్పమాలికలచేతను నిర్మల వస్త్రములచేతను తగిన భూషణాదులచేతను అలంకరించి, వానిస్నేహితులకును బంధుగులకును జూపవలెను పిమ్మట వాని యిష్టానుసారముగ యథోచితాహార విహారాదుల నలుప నడ్డులేక వదలిపెట్టవలెను.

### ఉపపత్తిలేనివారు సంశోధనము నాచరించవలసినవిధము.

మూ. భవన్తి చాత్ర శ్లోకాః—

అనేన విధినా రాజా రాజమాత్రోఽథ వా పునః,
యస్య వా విపులం ద్రవ్యం స సంశోధనమర్హతి. ౨౭
దరిద్రస్త్వాపదం ప్రాప్య ప్రాప్తకాలం విరేచనమ్,
పిబేత్కామమసమ్భృత్య సమ్భారానపి దుర్లభాన్. ౨౮
న హి సర్వమనుష్యాణాం సన్తి సర్వపరిచ్ఛదాః,
న చ రోగా న బాధన్తే దరిద్రానపి దారుణాః, ౨౯
యద్యచ్ఛక్యం మనుష్యేణ కర్తుమౌషధమాపది,
తత్తత్సేవ్యం యథాశక్తి వసనాన్యశనాని చ. ౩౦

వ్యా. పైజెప్పబడిన విధులప్రకారము సంశోధనమును జేసికొనుటకు ప్రభువులకైనను, రాజుతోసమానముగ ద్రవ్యము పుష్కలముగ కలవానికైనను సాధ్యమగును. కాని సామాన్యులకు వలనుపడదు. దరిద్రుడు తనకు అట్టిసంశోధన సాధ్యములగు రోగములు సంభవించినపుడు తనకలవికాని సంభారముల జేర్పలేకున్నను తనకు సాధ్యములగు వానినిమాత్రము తగుమాత్రముగ జేర్చికొని విరేచనౌషధముల సేవించి యాపద తొలగు మార్గము నరయవలెను.

లోకముల మనుజులకందరకును ముఖ్యముగ కావలసిన వస్తువులన్నియుం కల్గియుండవు. అట్టి దరిద్రులను మాత్రము రోగములు బాధింపకపోవు (వారిని కూడ బాధించునని యర్థము). కావున వానివానికి సాధ్యమైనయౌషధమును యథాశక్తి సంవిధానముతో సేవించి బాధించుచున్న రోగములనేపించి, వారివారి శక్త్యనుసారముగ నశనవసనాదులనుంచుకొని యెట్టకేలకు రోగనిర్ముక్తులై సుఖింతురుగాత!

## సంశోధనమున గల్గుగుణములు.

మూ. మలాపహం రోగహరం బలవర్ణప్రసాదనమ్,
పీత్వా సంశోధనం సమ్యక్ ఆయుషా యుజ్యతే చిరమ్. ౩౧

వ్యా. పైజెప్పిన విధిప్రకారము వమన విరేచనరూపమైన సంశోధనమును చేసి కొనినచో శరీరములోని మలముల హరించును. అన్నిరోగములను హరించును. శరీరమునకు బలంబును కాంతియుం సౌకుమార్యంబును కల్గి చిరకాలమువరకును సుఖముగ నాయుంవు వృద్ధినొందియుందురు.

## అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః—
ఈశ్వరాణాం వసుమతాం వమనం సవిరేచనమ్,
సమ్భారా యే యదర్థం చ సమానీయ ప్రయోజయేత్. ౩౨
యథా ప్రయోజ్యా మాత్రా యా యదయోగస్య లక్షణమ్,
యోగాతియోగయోర్యచ్చ దోషా యే చాప్యుపద్రవాః
యదసేవ్యం విశుద్ధేన యశ్చ సంసర్జనక్రమః,
తత్సర్వం కల్పనాధ్యాయే వ్యాజహార పునర్వసుః. ౩౪

వ్యా. ప్రభువులుగ నుండువారికిని తత్సమానులకును వమనవిరేచనముల జేయించవలసినవిధము, అట్టిచికిత్సలకు కావలసిన సంభారములు, సంభారముల సేకరించుటకు ప్రయోజనము, శోధనౌషధ మాత్రాపరికల్పనము, వమనవిరేచనముల అయోగాతియోగ సమ్యగ్యోగలక్షణములు, వానివలన గల్గుదోషములు, వానియుపద్రవములు, శోధనానంతరము సేవింపక విసర్జింపవలసినవి, పేయాద్యాహారక్రమసేవనము, ఈవిషయములన్నియు నీయుపకల్పనీయాధ్యాయమున పునర్వసువుచే విపులముగ విస్తరించి చెప్పబడినవి.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే
ఉపకల్పనీయో నామ పఞ్చదశోఽధ్యాయః.

వ్యా. ఇత్తెరంగున నగ్నివేశకృతంబును చరకమహర్షిచే సంస్కరింపబడినదియు నగు చరకసంహితయను నాయుర్వేదతంత్రమున సూత్రస్థానమున నుపకల్పనీయాధ్యాయమనునది పంచదశాధ్యాయము సమాప్తము.

## షోడశాధ్యాయము.

అవ:—పైయధ్యాయమున వమనవిరేచనవిధానములు చెప్పబడినవి. అట్టి వమన విరేచనములకు సంబంధించిన సమ్యగ్యోగ-అయోగాదిలక్షణములు మున్నగువానిని విపులముగ దెల్పునట్టి చికిత్సాప్రాభృతీయ మనునీయధ్యాయము చెప్పబడును:—

మూ. అథాతశ్చికిత్సాప్రాభృతీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧
ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. ప్రాభృతమన ప్రభువులును మున్నగువారికి కాకగా నియ్యదగినది. ప్రాభృతము. రాజుల కుపహారముగ నియ్యదగిన (రాజార్హమైన)దియు రోగికి సుఖకరంబు నగుచికిత్సను బోధించునధ్యాయము చికిత్సాప్రాభృతీయము. (అనగా రోగి కత్యంతోపయుక్తమై నిర్బాధకముగనుండి సుఖమునుకల్గించు చికిత్సావిధానమును బోధించునధ్యాయ మనుట). అట్టి యధ్యాయమును త్రికాలజ్ఞానసంపన్నుడగు నాత్రేయమహర్షి చెప్పినదానికన్న న్యూనాతిరేకము గాకుండునట్లు వివరించెదనని భావము.

### సద్వైద్య-అసద్వైద్య చికిత్సాగుణదోషములు.

మూ. చికిత్సాప్రాభృతో విద్వాన్ శాస్త్రవాన్ కర్మతత్పరః,
నరం విరేచయతి యం స యోగాత్సుఖమశ్నుతే. 3
యం వైద్యమానీ త్వబుధో విరేచయతి మానవమ్,
సోఽతియోగాదయోగాచ్చ మానవో దుఃఖమశ్నుతే. ౪

వ్యా. రాజోపయోగ్యంబును రోగికి సుఖకరంబు నగుచికిత్సజేయ సమర్థుడును, విద్వాంసుడును, శాస్త్రముల జక్కగ చదివినవాడును, చికిత్సాసంబంధములైన కృత్యములయందు మిక్కిలి యలవాటుకలవాడును నగు వైద్యవరుండు రోగికి వమన విరేచనౌషధముల నుపయోగించినచో నట్టిరోగికి సమ్యగ్యోగమునంజేసి సుఖముగ వమనములైనను విరేచనములైనను వెడలి దానంజేసి యారోగ్యరూపమైన సుఖము కల్గును.

అటుగాక తనకు వైద్యము తెలియకున్నను తెలిసినవానివలె నభిమానము కల్గినవాడును పండితుడుకానివాడు నగువైద్యుడు రోగికి వమనవిరేచనౌషధముల నుపయోగించినచో నతియోగ-అయోగములంజేసి రోగి రోగముల పాలగును.

ఇచ్చట 'వికారో దుఃఖమేవ చ' అను ప్రమాణము ననుసరించి ఆరోగ్యము సుఖమనియుం, రోగము దుఃఖమనియుం నెఱుంగునది. 'విరేచయతి' అనుశబ్దము చేత 'వామయతి' అనియుం నర్థము చేయవలెను. 'రిచ్' అనుధాతువునకు స్రవించునది యని యర్థము కావున దోషస్రావరూపమైన వమనవిరేచనములు రెండును ప్రకరణానుసారముగ నిచ్చట గ్రహింపబడును.

మరియుం నేవస్తు వెంతమాత్ర ముపయోగించినచో నుచితముగ నుండునో అయ్యది సమ్యగ్యోగము. అట్టిప్రమాణమునకు తక్కువగ నుపయోగించినను బొత్తుగ జేర్పకున్నను అయోగ మనబడును. అధికసంబంధముచే కల్గినది అతియోగము. ఇది రోగముల గల్గించును. ఔషధద్రవ్యమునకు అనుచితసంబంధము కల్గిన నయ్యది మిథ్యాయోగ మనబడును. ఎట్టులన; కఫము ఉద్రిక్తముగ నున్నపుడు వమనము చేయించవలసియుండగ విరేచనము చేయించుట అనుచితము కావున నయ్యది మిథ్యాయోగముగ నేర్పడును. ప్రకృతమున మిథ్యాయోగము కూడ నయోగముచేతనే గ్రహింపబడును కావున 'సోఽతియోగాదయోగాచ్చ' అని చెప్పబడినది. ఈవిషయమునే అయోగలక్షణమున నిట్లు చెప్పిరి:—"ప్రాతిలోమ్యేన హరణం హరణాత్తే హ్యకృత్స్నశః, అయోగసంజ్ఞే కృచ్ఛ్రేణ యదా గచ్ఛతి చాల్పశః" దోషమును ప్రతికూలముగ వెడలించుట (వమన మవసరమైనపుడు విరేచనంబును, విరేచన మవసరమైనపుడు వమనంబును చేయించుటయుం, దోషమును పూర్తిగ వెడలించక యుండుటయుం, మిక్కిలి కష్టముచే స్వల్పముగ దోషముల వెడలించుటయుం అయోగమని యర్థము. సమర్థుడగు వైద్యునిచే ప్రయోగింపబడిన వమనవివేచనౌషధములు సమ్యగ్యోగమునం జేసి రోగికి సుఖమును (ఆరోగ్యమును) కల్గించుననియుం, వైద్యము తెలియని వైద్యాభిమానిచే నుపయోగింపబడిన వమనవిరేచనౌషధములు అయోగ-అతియోగ-మిథ్యాయోగములం జేసి యనేకరోగముల గల్గించుననియుం ఫలితార్థము.

### విరేకసమ్యగ్యోగలక్షణములు.

మూ. దౌర్బల్యం లాఘవం గ్లానిః వ్యాధీనామణుతా రుచిః,
హృద్వర్ణశుద్ధిః క్షుత్తృష్ణా కాలే వేగప్రవర్తనమ్. ౫
బుద్ధీన్ద్రియమనశ్శుద్ధిః మారుతస్యానులోమతా,
సమ్యగ్విరిక్తలింగాని కాయాగ్నేశ్చానువర్తనమ్. ౬

వ్యా. బలహీనము, శరీరము బరువులేక చులకనైయుండుట, బడలిక గల్గుట, వ్యాధియొక్క యుద్రేకము తగ్గి స్వల్పముగ నుండుట, ఆహారమునందు రుచిపుట్టుట,

గాంచుట, శరీరబలంబును కాంతియుం నశించుట, బృంహణౌషధములు సేవించినను శరీర బలంబును వర్ణంబును నశించుట ఇవియన్నియుం అనేకదోషములుకలవానికి కల్గులక్షణములు కావున అట్టివానికి ఆయాదోషమును అనుసరించి వమనరూపముగనైనను, విరేచనరూపముగనైనను, శరీరమునం దూర్ధ్వాధోమార్గములనుండి దోషముల వెడలించి బలానుసారముగ సంశోధనము చేయుట ముఖ్యకర్తవ్యము.

## సంశోధనగుణము.

మూ. ఏవం విశుద్ధకోష్ఠస్య కాయాగ్నిరభివర్ధతే,
వ్యాధయశ్చోపశామ్యంతి ప్రకృతిశ్చానువర్తతే. ౧౭
ఇన్ద్రియాణి మనోబుద్ధిః వర్ణశ్చాస్య ప్రసీదతి,
బలం పుష్టిరపత్యం చ వృషతా చాస్య జాయతే. ౧౮
జరాం కృచ్ఛ్రేణ లభతే చిరంజీవత్యనామయః,
తస్మాత్సంశోధనం కాలే యుక్తియుక్తం పిబేన్నరః. ౧౯

వ్యా. పైజెప్పినరీతిగ విధ్యుక్తప్రకారము సంశోధనముచే శుద్ధముగ చేయబడిన కోష్ఠముకలవానికి జఠరాగ్ని వృద్ధినొందును. వ్యాధులన్నియుం శాంతినొందును. శరీరము రోగములు లేక స్వస్థత నుండును. చక్షురాదీంద్రియములును మనస్సును బుద్ధియుం శరీరవర్ణంబును నిర్మలముగ నుండును. శరీరబలంబును పుష్టియు సంభోగశక్తియుం వృద్ధినొంది సంతానము కల్గును. సాధారణముగ ముసలితనము రాబోదు. చాలకాలముపరకును రోగవిముక్తుడై జీవించును. కావున యుక్తమైన కాలమునందు యుక్తియుక్తముగ సంశోధనౌషధమును పానము జేయవలెను.

## సంశోధనప్రాశస్త్యము.

మూ. దోషాః కదాచిత్కుప్యన్తి జితా లఙ్ఘనపాచనైః,
జితాస్సంశోధనైర్యే తు న తేషాం పునరుద్భవః. ౨౦
దోషాణాం చ ద్రుమాణాం చ మూలేఽనుపహతే సతి,
రోగాణాం ప్రసవానాం చ గతానామగతిర్ధ్రువా. ౨౧

వ్యా. లంఘనపాచనరూపచికిత్స చేయునప్పుడు రోగములు శాంతినొందినను మరల కాలాంతరమున స్వల్పకారణముచే గూడ నారోగములు రానుండును. వమనవిరేచనరూపమైన సంశోధనముచేత హరింపబడినదోషములు దోషమునకు బలవత్తర

కారణము గాక స్వల్పకారణము తటస్థించినను మరల పొడసూపవు. (లంఘనపాచన రూపములగు చికిత్సలును దోషములను శమింపజేయును కాని అట్టిచికిత్సలు తాత్కాలిక దోషప్రకోపమును మాత్రము శమింపజేయునుకాని అట్టివ్యాధి కల్గించుకారణమును సమూలముగ శమింపజేయ నేరవు; కావున స్వల్పముగ నైన దోషవర్ధక కారణము తటస్థించినప్పుడు మరల నారోగములు అంకురించును. సంశోధనచికిత్స జేసినప్పుడు రోగములకు మూలకారణము మొదలంట వెడలునుకావున స్వల్పకారణముచేత మరల నంకురింపవని భావము.)

ఎట్టులనః—లోకమున చెట్లు వేళ్లతో పెకలింపక పైపైన ఛేదించినపుడు మరల కాలాంతరమున జలము మున్నగువృద్ధికారణములు స్వల్పముగ తటస్థించినను చిగిరించి నానాట వృద్ధినొందును. అత్తెరంగుననే లంఘనపాచనములచే తాత్కాలిక ప్రకోపము మాత్రము శమించిన రోగములు మూలకారణము సశేషముగ నుండుట చేత కాలాంతరమున స్వల్పకారణముచే గూడ మరల పొడసూపును. చెట్లను వేళ్లతో గూడ నడుగంట నిశ్శేషముగ పెకలించినచో జలాదివృద్ధికారణములు తటస్థించినను మరల నెన్నటికిని చిగిరింపజాలవు కదా? అత్తెరంగున సంశోధనచికిత్స జేసినపుడు దోషము (రోగము) లడుగంట హరించును. కావున స్వల్పకారణములచే మరల నంకురింప జాలవు అని భావము. (ఈవిషయమునే వాగ్భటాచార్యు లిట్లు సంగ్రహముగ నుడివిరి:—"యే తు సంశోధనైశ్శుద్ధాః న తేషాం పునరుద్భవః")

### శోధనముచే గల్గిన బలహీనమునకు బృంహణోపచారములు.

మూ. భేషజక్షపితే పథ్యమాహారై రేవ బృంహణమ్,
ఘృతమాంసరసక్షీరహృద్యయూషోపసంహితైః. ౨౨
అభ్యఙ్గోత్సాదనైస్స్నానై ర్నిరూహైస్సానువాసనైః,
తథా స లభతే శర్మ యుజ్యతే చాయుషా చిరమ్. ౨౩

వ్యా. శోధనౌషధముల సేవించినప్పుడు ఉత్కటములుగ నున్నదోషములు క్షయించును. అప్పుడు ఒకసమయమున రక్తాదిధాతువులును క్షీణించి బలహీనమగును; అట్టియెడ బృంహణములగు నాహారములయందు నెయ్యి, మాంసరసము, పాలు, హృదయమునకు హితకరమైనయూషమును గంజి, అనుసీద్రవముల కూడ జేర్చి భుజించుట చేతను, అభ్యంగనము నలుగుపెట్టికొనుట, స్నానము, నిరూహవస్తి, అనువాసనవస్తి మున్నగు విధులచేతను బృంహణమును జేసికొనుట మిక్కిలి హితకరముగ నుండును. అట్టిపథ్యము నాచరించినచో మిక్కిలి సుఖము కల్గి చిరకాలముపరకును ఆయువు వృద్ధినొందును.

ఇచ్చట 'ఆహారై రేవ' అని యవధారణార్థకమైన ఏవకారముచేత కేవలము ఆహారోపచారములమాత్రముచేతనే బృంహణమును జేసికొనవలెనుగాని, బృంహణరూపమైనయౌషధము ప్రబలవీర్యముగ నుండుటంజేసి యోర్చుటకు కష్టముగ నుండును కావున నుపయోగింప దగదని భావము.

### శోధనాతియోగచికిత్స.

మూ. అతియోగానుబద్ధానాం సర్పిః పానం ప్రశస్యతే,
తైలం మధురకైస్సిద్ధం అథవాప్యనువాసనమ్. ౨౪

వ్యా. శోధనాతియోగమునంజేసి యుపద్రవములు కల్గినప్పుడు నెయ్యిని త్రాగుట మిక్కిలి ప్రశస్తము. మరియు మధురములగు జీవనీయగణద్రవ్యముల గూర్చి సిద్ధము చేయబడిన తైలంబును, లేక యనువాసనవస్తియు మిగుల ప్రశస్తము.

### శోధనాయోగచికిత్స.

మూ. యస్య త్వయోగ స్తం స్నిగ్ధం పునః సంశోధయేన్నరః,
మాత్రాకాలబలాపేక్షీ స్మరన్ పూర్వమనుక్రమమ్. ౨౫
స్నేహనే స్వేదనే శుద్ధౌ రోగాస్సంసర్జనే చ యే,
జాయన్తేఽమార్గవిహితే తేషాం సిద్ధిషు సాధనమ్. ౨౬

వ్యా. సంశోధనాతియోగమున స్నేహస్వేదముల జేసి మరల సంశోధనమును జేయవలెను. అట్టిసంశోధనము సేవించునపుడు వైద్యుడు మాత్రను కాలమును బలమును మొదలగువానిని చక్కగ గమనించి, అందు దేనివ్యత్యయమున అయోగము సంభవించెనో అట్టికారణమును జ్ఞప్తికి దెచ్చుకొని దానిని సరిచేసికొనును. మాత్రాకాలాద్యనుగుణముగ మరల సంశోధనము సేవించనగును. పేయాదిక్రమమును మునుపటివలెనే యాచరింపనగును. మరియు స్నేహనము స్వేదనము సంసర్జనము ఇవి విధానమునకు వ్యతిరేకముగ జేయుటవలన సంభవించు రోగములకు తగినప్రతీకారము సిద్ధిస్థానమున విపులముగ జెప్పబడును.

### ధాతువైషమ్యసామ్యస్థితికారణములు.

మూ. జాయన్తే హేతువైషమ్యాత్ విషమా దేహధాతవః,
హేతుసామ్యాత్సమాస్తేషాం స్వభావోపరమస్సదా. ౨౭

వ్యా. శరీరమునందలి రసాదిధాతువులకు ఆహారవిహారాదులు కారణములు. అట్టికారణములైన యాహారవిహారాదులు విషమములుగ నున్నపుడు శరీరధాతువులును తదను

సారముగ విషమస్థితి నుండును. అట్టియాహారాదికారణములు విషమములు కాక సమస్థితి నుండునెడ ధాతువులును సమములుగనే యుండును. అట్టికారణములచేత విషమములుగను సమములుగను ఉండునట్టి రసాదిధాతువులు కారణాంతరము నపేక్షింపకయే తమంతట తామే నశించును. (ధాతువులు విషమములుగ జనించుటకు ఆహారవిహారాదుల వైషమ్యము కారణముగ నుండును. సమస్థితి జనించుటకు ఆహారాదిసమస్థితి కారణమగును. కాని యవి బొత్తుగ నశించుటకు మాత్రము వేరుకారణము నపేక్షింపకయే తమంతట తామే నశించును. ఎప్పుడు ధాతువులు పుట్టినవో అప్పుడే వానికి నాశము స్వతస్సిద్ధముగనే సిద్ధముగ కాలాంతరమున నెప్పటికైనను రానుండును; కావున వాని యుత్పత్తికి మాత్రము కారణాపేక్ష యుండునుకాని నాశమునకు మాత్రము కారణాపేక్షలేదని భావము.)

### భావపదార్థముల ప్రవృత్తినివృత్తికారణములు.

**మూ॥ ప్రవృత్తిహేతుర్భావానాం న నిరోధేఽస్తి కారణమ్,**
**కేచిత్త్వత్రాపి మన్యన్తే హేతుం హేతోరవర్తనమ్. ౨౮**

వ్యా. భావపదార్థముల కన్నిటికిని ఉత్పత్తికారణము (అవి జనించుటకు తగిన కారణము) అవశ్యముగ నుండును. అవి నశించుటకు మాత్రము కారణము లేదు. (లోకమునందలి భావరూపములగుపదార్థముల కన్నిటికిని యుత్పత్తికారణము (దీపము జనించుటకు వత్తి తైలము అగ్ని వీనిసంయోగమువలె) అవశ్య ముండితీరును. ఉత్పత్తి నొందినవానికి నాశము ఎన్నటికైన కల్గక మానదు. కాన నాశము స్వతస్సిద్ధము. కావున భావపదార్థములనాశమునకు కారణాంతరాపేక్ష యనవసరము. (లోహమయమైనఖడ్గము జనించినప్పుడు ఆఖడ్గమునకు లోహమయత్వము పుట్టుకతోనే సిద్ధమైనది. కావున లోహమయత్వనిర్ణయమునకు కారణాంతరాపేక్ష యనవసరము కదా. అత్తెరంగుననే యుత్పత్తినొందినపదార్థమునకు నాశము కూడ స్వభావసిద్ధము) కావున వాని నాశమునకు కారణాంతరాపేక్ష యనవసరమని భావము) ఈన్యాయము ననుసరించి రసాదిధాతువులయుత్పత్తికిని యాహారవిహారాదులు కారణమగును కాని వానినాశము మాత్రము స్వభావసిద్ధ మగుటంజేసి కారణాంతర మపేక్షింపదని తాత్పర్యము.

మరియుం——భావరూపము లగుపదార్థముల యుత్పత్తిస్థితుల కేది కారణముగ నుండునో అట్టికారణము లేకుండుటయే వానినాశమునకు కారణమగునని కొందరు శాస్త్రజ్ఞులు చెప్పెదరు. (దీపముయొక్క యుత్పత్తికిని స్థితికిని వత్తితైలమునున్నగునవి కారణములగును. అట్టికారణములు లేనినాడు దీపము నశించునుకాన, ఉత్పత్తికారణము లేకుండుటయే వినాశమునకు కారణమగునని కొందరు తలంచెదరని భావము.)

ఇచ్చట నీవిషయము నెరుంగునది:—లోకమున ప్రతిభావమునకు కారణము అవసరము. ఈవిషయము పైని వివరింపబడినది. ఒకవస్తువు మరియొకవిధముగ రూపాంతరము నొందుటకు కారణాంతర మవసరము. తెల్లనివస్త్రము ఎఱ్ఱనిరంగుతో మారుటకు వేరొకకారణము అవసరము. ఇత్తెరంగున ప్రతికార్యమునకును కారణము నియతముగ నుండును. ఈప్రణాళిక ననుసరించి వస్త్వభావమునకు దానికారణము లేకుండుటయే కారణమగును. ఇచ్చట వస్తునాశమునకు దానియుత్పత్తికారణాభావమే కారణమగును. ఇది కూడ వస్త్వభావోత్పత్తికి వస్తుజనకకారణాభావము కారణమగును కావున అభావోత్పత్తికి కారణ మైనదికాని వస్తునాశమునకు వేరుగ కారణ మొండు లేదు. ఈపద్ధతి ప్రకారము ధాతువైషమ్యమునకు ఆహారాదివైషమ్యము కారణము. ధాతుసామ్యమునకు ఆహారాదిసామ్యము కారణమగును. కావున రోగోత్పత్తికి కారణము మిథ్యాహారవిహారాదులు. రోగములు జనించకుండుటకు మిథ్యాహారవిహారాదుల నాచరింపకుండుట కారణమగును. అట్టికారణమును విసర్జించుటకు దగినవ్యాపారమే చికిత్స యగును. ఇంతియకాక వ్యాధినాశమునకై చికిత్సయనునది వేరొండుకారణము లేదని ముఖ్యభావము. ఈవిషయమునే "సంక్షేపతః క్రియాయోగో నిదానపరివర్జనమ్" అని తంత్రాంతరమున స్పష్టముగ జెప్పబడినది.

### చికిత్సావిషయమై శిష్యప్రశ్నములు.

మూ. ఏవముక్తార్థమాచార్యమగ్నివేశోఽభ్యభాషత,
స్వభావోపరమే కర్మ చికిత్సాప్రాభృతస్య కిమ్? ॥
భేషజైర్విషమాన్ ధాతూన్ కాన్ సమీకురుతే భిషక్?
కా వా చికిత్సా? భగవన్! కిమర్థం వా ప్రయుజ్యతే? 30

వ్యా. పైజెప్పినరీతిగ తనకు గురువైన యాత్రేయుండు చెప్పినవాక్యమును విని యగ్నివేశు డిట్లు తనకు గల్గినసంశయముల నడిగెను:—భగవత్స్వరూపుడైన యోగురువర్యా! పైజెప్పినరీతిగ కారణము నపేక్షింపక స్వభావముచేతనే భావపదార్థముల కన్నిటికిని నాశము కల్గునెడ మిథ్యాహారాదులచే సంభవించినరోగములును తమంతటనే (నివర్తకకారణము నపేక్షింపక) నశించుచుండును; కావున చికిత్సానిపుణుడుగ నున్నవైద్యుడు సాధింపదగినవిషయ మెద్ది? (వైద్యునిచే క్రొత్తగ సాధింపదగినది లేదు అని యర్థము). ఆహారాదివైషమ్యముచే ధాతువులు విషమస్థితి నొందినపుడు పైజెప్పిన రీతిగ విషమస్థితినాశము తమంతటనే కల్గునెడ వైద్యుడు ఔషధములచే విషమస్థితినున్న యేధాతువులను సమస్థితికి దేవలెను? (ధాతువైషమ్యము స్థిరముకాక తమంతటనే నివ

ర్తించునెడ వైద్యుడు తనయౌషధముల ప్రయోగించి ధాతువుల సమస్థితికి దేవలసిన యవసరములేదు కదా? యని ప్రశ్నము). చికిత్స యనునది యెద్ది? (రోగప్రశమనోపాయము చికిత్స. అట్టిచికిత్స పైజెప్పినప్రకారము చికిత్సానివృత్తికి కారణము కానినాడు చికిత్సయనునదియే లేదు కదా. చికిత్స యనగనేమి? యని ప్రశ్నము). చికిత్స దేని కుపయోగింపబడును? (ధాతువైషమ్యమును నివర్తింపజేసి సమస్థితి నొందించుటకు చికిత్సప్రయోగింపబడును "ధాతుసామ్యక్రియా చోక్తా తంత్రస్యాస్య ప్రయోజనమ్" అనువాక్యముచే నీయర్థమే నిర్ణయింపబడినది. అట్టి ధాతువైషమ్యము కారణము నపేక్షింపక తమంతటనే నివృత్తియగుచుండ చికిత్సాప్రయోజనమేమి? యని ప్రశ్నము.)

శిష్యప్రశ్నముల కుత్తరము.

మూ. తచ్ఛిష్యవచనం శ్రుత్వా వ్యాజహార పునర్వసుః,
శ్రూయతామత్ర యా సౌమ్య! యుక్తిర్దృష్టా మహర్షిభిః. ౩౧
న నాశకారణాభావాత్ భావానాం నాశకారణమ్,
జ్ఞాయతే నిత్యగస్యేవ కాలస్యాత్యయకారణమ్. ౩౨
శీఘ్రగత్వాద్యథాభూతః తథా భావో విపద్యతే,
నిరోధే కారణం తస్య నాస్తి నైవాన్యథా క్రియా. ౩౩

వ్యా. పైజెప్పినరీతిగ శిష్యుడు ప్రశ్నలసేయ పునర్వసువు (ఆత్రేయుండు) విని యోశాంతుడా! నీవడిగిన ప్రశ్నల విషయమున మహర్షులచే గన్గొనబడిన యుక్తిని చెప్పెద వినుమని యిట్లు జెప్పందొడంగెను.—సకలమైన భావపదార్థములకును నాశమునకై నియతముగ నొకకారణము తెలియబడదు. కావున భావపదార్థముల కన్నిటికిని అభావమునకై కారణము నిర్ణయముగ నుండదు. ఎట్టులన—భావపదార్థములన్నియుం కాలమువలె నిత్యములు. నిత్యమైన కాలమునకు నాశకారణ మొకటి లేదు కదా? ఆరీతిగనే భావరూపమైన పదార్థమునకు అభావమే లేదు కావున కాలమునకు నాశకారణము లేనట్లు భావపదార్థములకును నాశకారణము లేదు. (ఒక భావపదార్థమునకు నాశకారణ మొకటి యున్నచో నయ్యది నిత్యము కానేరదు. ఒకకార్యము కారణాంతరము నపేక్షించునెడ నయ్యది నియతముగ సంభవించునది కాదు. ఒకబట్టకు రంగు కారణము నపేక్షించియే యుండును. అట్టిరంగు నిత్యము కానేరదు కదా? అత్తెరంగున క్షణికాదికాలము మారుటకు కారణాంతరము నపేక్షించుటలేదు. అవిధముగనే ఒక భావపదార్థనాశమునకై వేరొండుకారణము నపేక్షించుట లేదు. క్షణికాది

కాలము ఉత్తరక్షణాదిరూపముగ నెట్లు మారునో అరీతిగనే, భావపదార్థములును ఎట్లు పుట్టునో ఆలాగుననే విపత్తునొందును. కాని నాశమునకై కారణాంతరము నియతముగ నపేక్షించుటలేదు. అని భావము.) కావున నాశమునకు కారణ మొందులేదు. అట్టి నాశమును వేరువిధముగ మార్చుటకును వీలుండదు. అని భావము.

చికిత్సాస్వరూపము, వైద్యునికృత్యము.

మూ. యాభిః క్రియాభిర్జాయన్తే శరీరే ధాతవస్సమాః,
సా చికిత్సా వికారాణాం కర్మ తద్భిషజాం స్మృతమ్. 34

వ్యా. శరీరమునందలి ధాతువులు (త్రిదోషములు) ఏక్రియలచే సమస్థితి నుండునో అట్టి సామ్యస్థితి సంపాదకమగు క్రియాకలాపము రోగములకు చికిత్సయని చెప్పబడును. అట్టి చికిత్సాకరణమే (చికిత్సను చేయుటయే) వైద్యునిపని. (దీనిచేత ప్రశ్నానుగుణముగ చికిత్సయు, నిపుణుడగువైద్యుడు చేయవలసినపనియు చెప్పబడును.)

చికిత్సాప్రయోజనము.

మూ. కథం శరీరే ధాతూనాం వైషమ్యం న భవేదితి,
సమానాం చానుబన్ధస్స్యాత్ ఇత్యర్థం క్రియతే క్రియా. 35
త్యాగాద్విషమహేతూనాం సమానాం చోపసేవనాత్,
విషమా నానుబధ్నన్తి జాయన్తే ధాతవస్సమాః. 36

వ్యా. శరీరమునందుండుధాతువులకు విషమస్థితి కల్గక, స్వతస్సిద్ధమై యవిచ్ఛిన్నముగ నుండు సమత్వముతో గూడి యెట్లులనువర్తించియుండగల్గునో అట్టిస్థితికై చికిత్సారూపమైన క్రియ చేయబడును. ధాతువైషమ్యమునకు సంబంధించిన కారణములను దూరంబుచ్చి, ధాతుసామ్యమును కాపాడువానిని మాత్రము సేవించినయెడ విషమములైన ధాతువులు సంబంధించక సమధాతువులు మాత్రమే యెల్లప్పుడు అనువర్తించి యుండును. (పైగ్రంథము రెండుశ్లోకములచేత 'కిమర్థం వా ప్రయుజ్యతే' అను ప్రశ్నమున కుత్తరము చెప్పబడినది.)

ఈవిషయ మిచ్చట నెరుంగునది:—ధాతుసామ్యము, స్వాభావికము, ధాతువైషమ్యము నశించు స్వభావము కల్గినది. అయినను అట్టి ధాతువైషమ్యము విషమమైన ధాతువునే యారంభించును. అయ్యది వేరొండు విషమము నారంభించును. ఇత్తెరంగున ధాతువైషమ్యపరంపర యేర్పడును. అట్టిధాతువైషమ్య సంతాననివృత్తి ధాతుసామ్యమునుకల్గించు కారణములేక నివర్తింపనోపదు. ధాతుసామ్యమును కల్గించుక్రియ నుపయోగించినయెడ ధానంజేసి ధాతువైషమ్యసంతతి నివర్తించి అయ్యది యహితమైనను

ధాతుసామ్యజనక హేతువగును. (ముద్గర ప్రహారముచే పరమాణుసంతానరూపమైన మృద్ఘటము మరల కపాలరూపమై ఘటరూపకార్యము నారంభింపనోపును కదా? అత్తెరంగుననే ధాతుసామ్యకారణత సంసేవనమున, విషమస్థితి నుండు ధాతుసంతానము తాను విషమస్థితిని మానుచు ధాతుసామ్యమును కల్గింప సమర్థమగునని భావము.)

ఇచ్చట విషమస్థితిని నశింపజేయుటకు కారణములేదు. విషమకారణపరిత్యాగ పూర్వక ధాతుసామ్యక్రియల నాచరించుట ధాతుసామ్యమునకు మాత్రము కారణ మగును. ధాతువైషమ్యము కారణము నపేక్షింపకయే తనంతట నశించును. కావున "నిరోధే కారణం తస్య నాస్తి నైవాన్యథా క్రియా" అని చెప్పబడినది సంగతమని యెరుంగునది. "ప్రవృత్తిహేతుర్భావానాం న నిరోధేఽస్తి కారణమ్" అని చెప్పినదియుం నీయుద్దేశము చేతనే యని తెలియునది.

### శాస్త్రీయవైద్యునిచే గల్గునుపకారము.

మూ. సమైస్తు హేతుభిర్యస్మాత్ ధాతూన్ సంజనయేత్సమాన్,
చికిత్సాప్రాభృతస్తస్మాత్ దాతా దేహసుఖాయుషామ్. ౩౭
ధర్మస్యార్థస్య కామస్య నృలోకస్యో(స్యా)భయస్య చ,
దాతా సంపద్యతే వైద్యో దానాద్దేహసుఖాయుషామ్ ౩౮

వ్యా. చికిత్సయందు నైపుణ్యముకల వైద్యుడు ధాతువులకు గుణాదులచే సమము లైన హేతువులచే (ఔషధాహారవిహారాదులచే) మనుజుల రసాదిధాతువులను వాతాది దోషములను సమస్థితినుండునట్లు చేయుటంజేసి దేహమున కారోగ్యరూపమైన సుఖ మును ఆయుర్వృద్ధిని, దానిమూలమున ధర్మ-అర్థ-కామరూపములైన త్రివర్గములను కల్గించువా డగును. కావున చికిత్సానిపుణుడగు వైద్యుడు మనుజులకు నిహాపరలోకముల రెంటియందును పరమ సుఖమును ఇచ్చుదాత యగునని భావము.

### అధ్యాయవిషయసంగ్రహము.

మూ. తత్ర శ్లోకాః—
చికిత్సాప్రాభృతగుణో దోషో యశ్చేతరాశ్రయః,
యోగాయోగాతియోగానాం లక్షణం శుద్ధిసంశ్రయః. ౩౯
బహుదోషస్య లిఙ్గాని సంశోధనగుణాశ్చ యే,
చికిత్సాసూత్రమాత్రం చ సిద్ధివ్యాపత్తిసంశ్రయమ్. ౪౦
యా చ యుక్తిశ్చికిత్సాయాః యం చార్థం కురుతే భిషక్,
చికిత్సాప్రాభృతేఽధ్యాయే తత్సర్వ మవదన్మునిః. ౪౧

వ్యా. చికిత్సానిపుణుడగు వైద్యునిగుణములు చికిత్స దెలియని మూఢవైద్యుని యందలి దోషములు, వమన విరేచనాది సంశోధనములకు సంబంధించిన సమ్యగ్యోగ - అయోగ-అతియోగముల లక్షణములు, బహుదోషలింగములు, సంశోధనమున గల్గుగుణములు, శోధనాది వ్యాపత్తులకు సంబంధించిన చికిత్సాసంగ్రహము, చికిత్సా యుక్తి స్వరూపము, దేని నుద్దేశించి వైద్యుడు చికిత్స జేయునో అట్టి ప్రయోజనము నను నీవిషయము లన్నియు చికిత్సాప్రాభృతీయమను నీయధ్యాయమున నగ్నివేశమహర్షి చే విశదముగ చెప్పబడినవని యర్థము.

ఇత్యగ్నివేశకృతే తన్త్రే చరకప్రతిసంస్కృతే సూత్రస్థానే చికిత్సాప్రాభృతీయో నామ షోడశోఽధ్యాయః.

ఇతి కల్పనాచతుష్కస్సమాప్తః.

వ్యా. అగ్నివేశకృతంబును చరకునిచే సంస్కరింపబడినదియు నగు చరకసంహిత యను నాయుర్వేదతంత్రమునందలి సూత్రస్థానమున చికిత్సాప్రాభృతీయమనునది పదునారవ యధ్యాయము సమాప్తము.

ఇది కల్పనాచతుష్కము.

## (రోగచతుష్కము.)

## సప్తదశాధ్యాయము.

అవతారిక:—పైజెప్పబడిన భేషజచతుష్కము, స్వస్థచతుష్కము, నిర్దేశచతుష్కము, కల్పనాచతుష్కము అనునాల్గుచతుష్కములయందు చికిత్సయు దానికి సంబంధించిన విషయంబులును సామాన్యముగ నిరూపింపఁబడినవి. పిమ్మట అట్టి యౌషధమునకు (చికిత్సకు) విషయమైన రోగముల వివరించుటకై రోగచతుష్కము చెప్పబడుచున్నది. రోగముల విషయమై చికిత్స ప్రధానమగుటంజేసి తొలుత జెప్పి పిమ్మట రోగముల నిరూపించు రోగచతుష్కము జెప్పుట సమంజసము. అందును శరీరావయవములయందు శిరస్సును మర్మములయందు హృదయంబును ప్రధానమగుటంజేసి శిరోహృదయముల నాశ్రయించిన రోగముల దెల్పునట్టి కియంతశ్శిరసీయమను నధ్యాయము చెప్పబడును.

మూ. అథాతః కియన్తశ్శిరసీయమధ్యాయం వ్యాఖ్యాస్యామః. ౧

ఇతి హ స్మాహ భగవానాత్రేయః. ౨

వ్యా. 'కియన్తశ్శిరసి' యను ప్రశ్నమును ప్రారంభమునగల యధ్యాయమును త్రికాలజ్ఞానసంపన్నుడగు నాత్రేయమహర్షి యుపదేశించినదానికి న్యూనాతిరేకము కాకుండునట్లు వివరించెదనని భావము.

రోగములవిషయమై యగ్నివేశుని ప్రశ్నము.

మూ. కియన్తశ్శిరసి ప్రోక్తాః రోగా హృది చ దేహినామ్,
కతి చాప్యనిలాదీనాం రోగా మానవికల్పజాః. 3
క్షయాః కతి సమాఖ్యాతాః పిడకాః కతి చానఘ,
గతిః కతివిధా చోక్తా దోషాణాం దోషసూదన. ౪
హుతాశవేశ(ప)స్య వచః తచ్ఛ్రుత్వా గురురబ్రవీత్,
పృష్టవానసి యత్సౌమ్య తన్మే శ్రుణు సవిస్తరమ్. ౫

వ్యా. మనుజునియొక్క శిరస్సునందు జనించురోగములు ఎన్ని? హృదయమున జనించురోగములు ఎన్ని? వాతపిత్త కఫలములయొక్క ప్రమాణవికల్పముచే కల్గురోగము లెన్ని? క్షయరోగము లెన్నివిధములు? పిటికరోగము లెన్నివిధములు? వాతపిత్తశ్లేష్మములయొక్క గతి ఎన్నివిధములు? అని ఇత్తెరంగున ప్రశ్నచేసిన యగ్నివేశునివాక్యము విని గురువైన యాత్రేయుండు ఇట్లు చెప్పందొడంగెను.

ఓ సౌమ్యుడా! నీవడిగినప్రశ్నలకు సవిస్తరముగ నుత్తరములు చెప్పెదను వినుము. ('మానవవికల్పజాః' అనుచోట మానమన క్షయము, స్థానము, వృద్ధియౌనని వాతాదిదోషములకు జెప్పిన ప్రమాణము. అట్టి మానముయొక్క వికల్పము దోషాంతర సంబంధకృతభేదము, దాన జనించురోగము లెన్నియని ప్రశ్నము.)

పైప్రశ్నానుసారముగ రోగసంఖ్యావిభాగము.

మూ. దృష్టాః పఞ్చ శిరోరోగాః పఞ్చైవ హృదయామయాః,
వ్యాధీనాం ద్వ్యధికా షష్టిః దోషమానవికల్పజా. ౬
దశాఽష్టౌ చ క్షయాః సప్త పిడకా మధుమేహికాః,
దోషాణాం త్రివిధా చోక్తా గతిర్విస్తరతః శ్రుణు. ౭

వ్యా. శిరస్సున జనించురోగము లైదు. హృదయమున జనించునవియు నైదు. వాతపిత్తకఫముల మానవికల్పముచే గల్గురోగములు అరువదిరెండు. క్షయములు పదునెనిమిది విధములు. మధుమేహముచే జనించుపిడకలు (రాచపుండ్లు) దోషములగతి మూడువిధములు. ఇత్తెరంగున సంగ్రహముగ జెప్పబడినది. అయ్యవి విస్తరముగ నీక్రింద వివరింపబడును వినుము!

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—"వినా ప్రమేహమప్యేతా జాయన్తే దుష్టమేదసః" అనువాక్యముచేత ప్రమేహము లేకున్నను మేదస్సు దుష్టమైనవానికి పిడకలు (రాచకురుపులు) జనించునని ప్రమేహసామాన్యము లేకున్నను జనించునని చెప్పబడినది. కావున 'మధుమేహికాః' అనుపదమునకు ప్రమేహసామాన్యమున జనించునవి యని యర్థము చెప్పనగును. అటుగాక కేవలము మధుమేహపిడకలని యర్థము చెప్పునెడ 'వినా ప్రమేహమప్యేతాః' అనుచోట 'వినా మధుమేహం' అని మూలకారుడు చెప్పియుండును. అటు విశేషవిధిగ చెప్పకుండుటచేత ప్రమేహసామాన్యముగ పిడకలు జనించునని తంత్రకారునియాశయము. ఈయభిప్రాయముచేతనే చికిత్సయందును "ప్రమేహిణో యాః పిడకాః యథోక్తాః రోగాధికారే పృథగేవ సప్త" అని ప్రమేహసామాన్యముగ జనించుపిడకలు సప్తవిధములని నిర్దేశింపబడినది. మరియు కేవలము మధుమేహముచేతనే పిడకలు జనించునెడ మధుమేహ మసాధ్యము కావున దాన సంభవించినపిడకలును అసాధ్యములుగనే యుండి తీరవలెను. అట్టియెడ ప్రమేహపిడకల నుద్దేశించి చికిత్స జెప్పుటయే యసంగతమగును. కావున ప్రకృతమున 'మధుమేహికాః' అనుచోట ప్రమేహసామాన్యమున జనించినపిడకలు ఏడువిధము లనియె యర్థము సమరసముగ నుండును.

మరియు "గుల్మీ చ మధుమేహీ చ రాజయక్ష్మీ చ యో నరః, అచికిత్స్యా భవన్త్యేతే బలమాంసపరిక్షయే" అనువాక్యముచేత మధుమేహముకలవానికి శరీరబలంబును శరీరమునందలి మాంసంబును క్షీణించినయెడ నసాధ్యమగును కావున చికిత్స జేయంజనదని చెప్పబడినది. మధుమేహము స్వభావముచేతనే యసాధ్య మైయుండ బలమాంసములు క్షీణించినపుడు అసాధ్యమని విశేషవిధిగ జెప్పనవసరములేదు. కావున నచ్చట కూడ మధుమేహశబ్దముచే ప్రమేహసామాన్యము గ్రహింపబడును. సుశ్రుతమునందును "తద్వచ్చ వసామేదోభ్యామభిపన్నస్య శరీరస్య దోషైశ్చానుగతధాతోః ప్రమేహిణః పిడకా జాయన్తే" అనువాక్యముచేత ప్రమేహసామాన్యముగ పిడకలు సంభవించునని చెప్పబడినది. మరియు ప్రమేహము లన్నియు శరీరమున తీపికల్గుటవలన సంభవించును. కావున ప్రమేహము లన్నియు సామాన్యముగ మధుమేహము లనియే చెప్పబడును. ఈవిషయమును వాగ్భటాచార్యు లిట్లుపదేశించిరి:—"మధురం యచ్చ సర్వేషు ప్రాయో మధ్వివ మేహతి, సర్వే హి మధుమేహాఖ్యాః మాధుర్యాచ్చ తనోరతః" శరీరమున తీపెక్కినపుడు ప్రమేహము లన్నియు మధుమేహము లగునని భావము. పైజెప్పిన వివరణముచేత ప్రమేహసామాన్యముగ మధుమేహశబ్దము చెప్పబడునని యేర్పడును.

### శిరోరోగసామాన్యకారణములు, సంప్రాప్తి.

మూ. సన్ధారణాద్దివాస్వప్నాత్ రాత్రౌ జాగరణాన్మదాత్,
ఉచ్చైర్భాష్యాదవశ్యాయాత్ ప్రాగ్వాతాదతిమైథునాత్. ౮
గన్ధాదసాత్మ్యాదాఘ్రాతాత్ రజోధూమహిమాతపాత్,
గుర్వమ్లహరితాదానాత్ అతిశీతామ్బుసేవనాత్. ౯
శిరోఽభిఘాతాద్దుష్టామాత్ రోదనాద్బాష్పనిగ్రహాత్,
మేఘాగమాన్మనస్తాపాత్ దేశకాలవిపర్యయాత్. ౧౦
వాతాదయః ప్రకుప్యన్తి శిరస్యస్రం ప్రదుష్యతి,
తతశ్శిరసి జాయన్తే రోగా వివిధలక్షణాః. ౧౧

వ్యా. మలమూత్రాదివేగముల నిరోధించుట, పగలు నిదురించుట, రాత్రుల యందు నిదురమేల్కాంచుట, మద్యాదులచే మత్తుగొని యుండుట, మిక్కిలి బిగ్గరగ మాట్లాడుట, మంచుతో నివసించుట, తూర్పుగాలిని సేవించుట, అధికముగ సంభోగముచేయుట, తనకలవాటున లేనిగంధము నాఘ్రాణించుట, ధూళియు పొగయు మంచును ఎండయు శరీరమునకు సోకుట, గురుపదార్థములనైనను అమ్లపదార్థముల నైనను అల్లము మొదలగు నాకుకూరలనైనను తినుట, మిక్కిలి చల్లనైనజలమును అధికముగ స్నానపానాదుల కుపయోగించుట శిరస్సునం దభిఘాతము కల్గుట శరీరమునం దామరసము చెడుట, ఏడ్చుట కన్నీళ్లు వెడలనున్నపుడు వెడలనీయక నిరోధించుట, ఆకసముల మేఘము లావరించియుండుట, మనస్సున సంతాపము కల్గుట, దేశంబును కాలంబును తమకు నైజమైన శీతోష్ణస్థితులు మారియుండుట, ఈకారణముల చేత వాతపిత్తకఫములు ప్రకోపమునొంది శిరమునందలి రక్తమును చెరచును; దానంజేసి శిరస్సునందు పలుదెరంగులైన రోగములు సంభవించును.

ఇచ్చట 'దుష్టామాత్' అనుచోట 'ఉష్ణామాత్' అని పాఠాంతర మున్నది. అట్టియెడ ఉష్ణముచేతను ఆమ (అజీర్ణము)ము చేతను వాతాదులు ప్రకోపించి శిరోరోగము గల్గించునని యర్థము. 'అస్రం ప్రదుష్యతి' అనుటచేత శిరోరోగములయందు రక్తము చెడుట ముఖ్యమని యెరుంగునది.

### అంగములలో శిరస్సుకు ప్రాధాన్యము.

మూ. ప్రాణాః ప్రాణభృతాం యత్ర శ్రితాస్సర్వేన్ద్రియాణి చ,
యదుత్తమాఙ్గమఙ్గానాం శిరస్తదభిధీయతే. ౧౨

వ్యా. ప్రాణులయొక్క ప్రాణంబులును, చక్షురాదీంద్రియములన్నియు నేయంగమును ఆశ్రయించియుండునో కరచరణాద్యవయవముల కన్నిటికిని ఎయ్యది యున్నత స్థలమున నుండునో అయ్యది శిరస్సని చెప్పబడును.

సకలప్రాణులకును జీవధారణమునకు ప్రధానములగు ప్రాణములకును ఇంద్రియములకు ముఖ్యాధారమై యుండుటంజేసి శిరస్సు ఉత్తమమైన యంగము కావున నుత్తమాంగమని చెప్పబడును. ఈయర్థము 'ఉత్తమం చ తదఙ్గం చ' అను విగ్రహముచే లభించును. మరియు 'ఉపరిష్టాదఙ్గం ఉత్తమాంగం' అనువ్యుత్పత్తిచేత అంగములన్నింటికిని పైభాగమున నుండునది యనియు నర్థము. ఇచ్చట ప్రస్తావవశమున శిరస్సుకు ప్రాధాన్యమును దెలుపుటకై యానుషంగికముగ నీసూత్రము చెప్పబడినదిగాన ఉత్సూత్రము (ప్రధానసూత్రము) కానేరదు.

### సామాన్యశిరోరోగములు.

మూ. అర్ధావభేదకో వా స్యాత్ సర్వం వా రుజ్యతే శిరః,
ప్రతిశ్యాముఖనాసాక్షికర్ణరోగాశ్శిరోభ్రమః. ౧౩
అర్దితం శిరసః కమ్పః గళమన్యాహనుగ్రహాః,
వివిధాశ్చాపరే రోగాః వాతాదిక్రిమిసంభవాః. ౧౪

వా. అర్ధావభేదకము, (శిరమునం దొకప్రక్క సగభాగమున నొప్పి), తలయందంతట నొప్పి, పీనసము (పడిసెము), ముఖము (నోరు) ముక్కు కన్నులు చెవులు అను అంగముల గల్గురోగములు, శిరోభ్రమణము (తల దిరుగుట), అర్దితవాతము (ముఖమునందు పక్షగతమైనచచ్చు), తలవణకు, గళగ్రహము మన్యాస్తంభము, హనుగ్రహము, ఈరోగంబులును, త్రిదోషములచేతను క్రిములచేతను సంభవించు నితరరోగంబులును శిరస్సున కల్గును.

### పంచవిధశిరోరోగనిర్దేశమునకు వివరణము.

మూ. పృథగ్దృష్టాస్తు యే పఞ్చ సఙ్గ్రహే పరమర్షిభిః,
శిరోగదాంస్తాన్ శ్రుణు మే యథాస్వైర్హేతులక్షణైః. ౧౫

వ్యా. రోగసంగ్రహనిర్దేశరూపమైన యష్టోదరీయమను పందొమ్మిదవ యధ్యాయమున 'పంచ శిరోరోగాః' అని నిర్దేశించి ఋషులచే గన్గొనబడి చెప్పబడిన శిరోరోగముల నైదిటిని వానివాని హేతువులను లక్షణములను వేరువేరుగ వివరించెద వినుము.

ఇచ్చట పైజెప్పినరీతిగ కర్ణనాసాదిరోగములును శిరస్సంబంధమున కల్గువ్యాధులును వానిని విడచి శిరస్సునందు ప్రధానములుగ శూలాదిబాధల గల్గించు పంచవిధ శిరోరోగములును నీక్రింద వివరింపబడినవి. శిరోరోగమన శిరశ్శూలరూపమైన వ్యాధియందు ప్రధానముగ వర్తించునని భావము.

### పంచవిధశిరోరోగములు, అందు వాతికశిరోరోగనిదానము, సంప్రాప్తి.

సూ. ఉచ్చైర్భాష్యాతిభాష్యాభ్యాః తీక్ష్ణపానాత్ప్రజాగరాత్,
శీతమారుతసంస్పర్శాత్ వ్యవాయాద్వేగనిగ్రహాత్. ౧౬
ఉపవాసాదభీఘాతాత్ విరేకాద్వమనాదపి,
బాష్పశోకభయత్రాసాత్ భారమార్గాతికర్షణాత్. ౧౭
శిరోగతాస్సిరావృద్ధో వాయురావిశ్య కుప్యతి,
(శిరోగతా వై ధమనీర్వాయురావిశ్య కుప్యతి)
తతశ్శూలం మహత్తస్య వాతాత్సముపజాయతే. ౧౮

వ్యా. బిగ్గరగ మాటలాడుట, అధికముగ వదరి మాట్లాడుట, మిక్కిలి తీక్ష్ణమైన మద్యమును త్రాగుట, రాత్రులయం దధికముగ నిదురమేల్కాంచుట, మిక్కిలి చల్లనైనగాలిని స్పృశించుట, అధికముగ సంభోగముచేయుట, మలమూత్రాదివేగముల నిరోధించుట, ఉపవాసముచేయుట, శిరముపై నభిఘాతము కల్గుట, విరేచనములును వమనములు నగుట, కన్నీరు గార్చుట, దుఃఖించుట, భయముచే మనస్సు కలత నొందుట, శిరస్సుచే భారమును మోచుట, అధికముగ దారినడచుట, మిక్కిలి కృశింప జేయు నాహారాదుల సేవించుట (లేక దేనినైన విశేషముగ లాగుట), ఈకారణములచేత వాతము ప్రకోపించి శిరస్సునందలి ధమనులలో జేరి ప్రబలమైన శూలను (నొప్పిపోటు మున్నగుబాధలను) కల్గించును. ఇది వాతప్రకోపమున కల్గినశిరశ్శూలము. (శూలముతో బొడిచినట్లు కల్గుబాధ శూలమని చెప్పబడును). ఇచ్చట "శిరోగతా వై ధమనీర్వాయురావిశ్య కుప్యతి" అనుపాఠాంతరమునను అర్థభేదము కానరాదు.

### వాతికశిరోరోగలక్షణములు.

సూ. నిస్తుద్యేతే భృశం శంఖౌ ఘాటా సంభిద్యతే తథా,
సభ్రూమధ్యం లలాటం చ తపతీ వాతివేదనమ్. ౧౯
వధ్యేతే స్వనతః శ్రోత్రే నిష్కృష్యేతే ఇవాక్షిణీ,
ఘూర్ణతీవ శిరస్సర్వం సన్ధిభ్య ఇవ ముచ్యతే. ౨౦

స్ఫురత్యతిసిరాజాలం స్తభ్యతే చ శిరోధరా,
స్నిగ్ధోష్ణముపశేతే చ శిరోరోగేఽనిలాత్మకే. ౨౧

వ్యా. పైజెప్పిన వాతికశిరశ్శూలమునందు కణతలయందు సూదుల బొడిచినట్టులు పోటు పుట్టును. మెడవెనుకటిభాగమున పగులదీయుచున్నట్లు నొప్పి కల్గును. కనుబొమల మధ్యభాగంబును నుదుటియందును నిప్పున కాలినట్టులు బాధ కల్గును. చెవులయందు పోటును శబ్దంబును కల్గును. కన్నులు లాగునట్లు నొప్పి యెత్తును. తలయంతటను గిరగిర తిరుగునట్లుండును. శిరస్సుకు సంబంధించిన సంధులన్నియు నూడునట్లు సడలియుండును. తలలోని నరములన్నియు నదరుచుండును. మెడ యిటునటు తిరుగక స్తంభించి యుండును. ఇట్టిలక్షణములు కల్గినది వాతమున జనించిన శిరోరోగమని యెరుంగునది. మరియు నట్టిరోగమునందు స్నిగ్ధపదార్థంబులును, ఉష్ణవీర్యములగుపదార్థంబులును హితముగ నుండును. (స్నిగ్ధోష్ణసేవనము వాతికశిరోరోగమునం దుపశయముగ నుండునని భావము.)

### పైత్తికశిరోరోగనిదానము, లక్షణములు.

మూ. కట్వమ్లలవణక్షారమద్యక్రోధాతపానలైః,
పిత్తం శిరసి సందుష్టం శిరోరోగాయ కల్పతే. ౨౨
దహ్యతే రుజ్యతే తేన శిరశ్శీతం సుఖాయతే,
దహ్యేతే చక్షుషీ తృష్ణా భ్రమస్స్వేదశ్చ జాయతే. ౨౩

వ్యా. కారము, పులుపు, ఉప్పు, క్షారము, మద్యము వీనిని విశేషముగ సేవించుట, క్రోధము, ఎండ, నిప్పుసెగ అనునీకారణములచేత పిత్తము ప్రకోపమునొంది శిరస్సునందలి శిరలయందు చేరి శిరోరోగమును కల్గించును. ఈశిరోరోగమున తలయందు మంటయు, నొప్పియు కల్గును. శిరస్సునకు శీతోపచారముల జేసికొనుట కిచ్ఛ బొడమును. కండ్ల మంటపుట్టును. దప్పి కల్గును. తల తిరుగునట్లుండును. చెమట విశేషముగ బట్టును (ఈలక్షణములబట్టి పిత్తజశిరోరోగమని యెరుంగునది).

### శ్లైష్మికశిరోరోగనిదానము, లక్షణములు.

మూ. ఆస్యాసుఖైస్స్వప్నసుఖైః గురుస్నిగ్ధాతిభోజనైః,
శ్లేష్మా శిరసి సన్దుష్టః శిరోరోగాయ కల్పతే. ౨౪
శిరో మన్దరుజం తేన సుప్తస్తిమితభారికమ్,
భవత్యుత్పద్యతే తన్ద్రా తథాలస్యమరోచకమ్. ౨౫

వ్యా. చాలకాలము కూర్చొనియుండుట, నిదురింపకూడనికాలమున (పగటి యందు) విశేషముగ నిదురించుట, గురుపదార్థములను స్నిగ్ధపదార్థములను అధికముగ భుజించుట, పరిమితిగ భుజించుట, ఈకారణములచేత కఫము ప్రకోపమునొంది శిరస్సు నందలి సిరలయందు జేరి శిరోరోగమును కల్గించును. అట్టిశిరోరోగమునందు తలయందు మందముగ నొప్పి పుట్టును. శిరస్సున స్పర్శము దెలియక మొద్దుబారి బరువుగ నుండును. కునికిపాటు కల్గును. పనులయం దలసత కల్గును. అరోచకము కల్గును. (ఈలక్షణముల చేత కఫజశిరోరోగమని యెరుంగునది.)

సాన్నిపాతికశిరోరోగలక్షణములు.

మూ. వాతాచ్ఛూలం భ్రమః కమ్పః పిత్తాద్దాహో మద_స్తృషా,
కఫాద్గురుత్వం తన్ద్రా చ శిరోరోగే త్రిదోషజే. ౨౬

వ్యా. త్రిదోషములప్రకోపముచేత (సన్నిపాతముచేత) కల్గిన శిరోరోగమునందు వాతమువలన శూలంబును, భ్రమంబును, కంపంబును, పిత్తమువలన మంటయు, మదం బును, దప్పియు, కఫమువలన గురుత్వంబును, కునికిపాటును గల్గును.

క్రిమిజశిరోరోగనిదాన, సంప్రాప్తి లక్షణములు.

మూ. తిలక్షీరగుడాజీర్ణపూతిసఙ్కీర్ణభోజనాత్,
క్లేదోఽసృక్కఫమాంసానాం దోషలస్యోపజాయతే. ౨౭
తతశ్శిరసి సఙ్క్లేదాత్ క్రిమయః పాపకర్మణః,
జనయ_న్తి శిరోరోగం జాతా బీభత్సలక్షణమ్. ౨౮
వ్యథచ్ఛేదరుజాకణ్డుశోఫదౌర్గత్యదుఃఖితమ్,
(ఛేదవ్యథనరుక్కణ్డుశోకదౌర్గన్ధ్యదుఃఖితమ్)
క్రిమిరోగాతురం విద్యాత్ క్రిమీణాం దర్శనేన చ. ౨౯

వ్యా. నువ్వులు, పాలు, బెల్లము, అజీర్ణమును కల్గించుపదార్థములు కుళ్లి కంపె త్తిన కూరగాయలు, పండ్లు మున్నగునవి వీనిని విశేషముగ తినుటచేతను, పరస్పరసంసర్గ విరుద్ధములగు పాలు చేపలు పాలుమాంసము మున్నగువాని కలిపి తినుటచేతను, వాతాది దోషములు ప్రకోపమునొందియుండువానికి రక్తము, మాంసము, కఫంబును చెడి దాని వలన శిరమునందు ద్రవము పుట్టును. అట్టిద్రవమువలనను తాను జన్మాంతరమున జేసిన పాపకర్మచేతను శిరస్సునందు క్రిములు (పురుగులు) పుట్టును. అట్టిక్రిములు శిరోరోగ మును కల్గించును. ఇయ్యది క్రిమిజశిరోరోగము. ఈరోగమునందు ముక్కు మున్నగు

రంధ్రములనుండి చీము మున్నగునవి యసహ్యాకరముగ జనించి స్రవించును. ఈరోగమునందు తెగగొట్టినవిధముగను, సూదులతో బొడిచినవిధముగను నొప్పియుం, దురదయుం, శోఫంబును, దుర్గంధంబును కల్గును. అట్టిబాధలచేత రోగి చాల కష్టపడును. ఒకసమయమున క్రిములును నాసాదిరంధ్రములనుండి వెడలును. ఈలక్షణములబట్టి క్రిమిజశిరోరోగంబని యెరుంగునది. (ఇత్తెరంగున "కియన్తశ్శిరసి ప్రోక్తాః" అను ప్రశ్నమునకు "దృష్టాః పఞ్చ శిరోరోగాః" అని చెప్పబడిన యుత్తరము ననుసరించి శిరోరోగములైదును వివరింపబడినవి.)

### పంచవిధహృదయరోగములు, అందు వాతికహృద్రోగనిదాన-సంప్రాప్తి లక్షణములు.

మూ. శోకోపవాసవ్యాయామరూక్షశుష్కాల్పభోజనైః,
వాయురావిశ్య హృదయం జనయత్యుత్తమాం రుజమ్. ౩౦
వేపథుర్వేష్టసంస్తమ్భః ప్రమోహశ్శూన్యతాదరః (శ్రమః),
హృది వాతాతపే రూపం జీర్ణే చాత్యర్థవేదనా. ౩౧

వ్యా. దుఃఖము, ఉపవాసము, దేహపరిశ్రమము, రూక్షములగు (జిడ్డులేని) పదార్థములనైనను, ద్రవము లేక యెండినపదార్థముల నైనను భుజించుట, మిక్కిలి కొంచెముగ భుజించుట, ఈకారణములచేత వాతము ప్రకోపమునొంది హృదయమున జేరి యందధికమైననొప్పిని కల్గించును. అట్టిహృద్రోగమునందు కంపంబును వడదీయునట్లు బాధయు, స్తబ్ధత్వంబును కల్గును. మూర్ఛ గ్రమ్మును. హృదయస్థానమున శూన్యముగ నేమియుం దోచక యుండును. శ్రమము కల్గును. (లేక దడ, అదరుపాటు కల్గును.) భుజింపబడిన యాహారము జీర్ణమైనప్పుడు మిక్కిలి బాధ కల్గును. ఇవి యన్నియుం వాతప్రకోపమున కల్గిన హృద్రోగలక్షణములు.

### పైత్తికహృద్రోగనిదాన - సంప్రాప్తి లక్షణములు.

మూ. ఉష్ణామ్లలవణక్షారకటుకాఽజీర్ణభోజనైః,
మద్యక్రోధాతపైశ్చాశు హృది పిత్తం ప్రకుప్యతి. ౩౨
హృద్దాహస్తిక్తతా వక్త్రే తిక్తామ్లోద్గిరణం క్లమః,
తృష్ణా మూర్ఛా భ్రమస్స్వేదః పిత్తహృద్రోగలక్షణమ్. ౩౩

వ్యా. ఉష్ణవీర్యములగు పదార్థములనైనను పులుపు, ఉప్పు, క్షారము, కటువు అను రసములు కలపదార్థములనైనను భుజించుట, జీర్ణముకాని పదార్థముల భుజించుట, (లేక

జీర్ణము కాకుండునప్పుడు మరల భుజించుట), మద్యమును పానముచేయుట, కోపపడుట, ఎండలో సంచరించుట ఈకారణములచేత పిత్తము ప్రకోపమునొంది హృదయమున జేరి హృదయరోగమును కల్గించును. ఈరోగమునందు హృదయమున మంట పుట్టును. నోరు చేదుగనుండును. చేదుగనైనను, పుల్లగనైనను త్రేపులు వెడలును. బడలిక కల్గును. దప్పి పుట్టును. మూర్ఛ గ్రమ్మును. ఒడలు తిరుగును. శరీరముపై చెమట పుట్టును. ఇవియన్నియు పిత్తప్రకోపమున గల్గిన హృద్రోగలక్షణములు.

### శ్లైష్మికహృద్రోగనిదాన లక్షణములు.

మూ. అత్యాదానం గురు స్నిగ్ధం అచిన్తనమచేష్టనమ్,
నిద్రాసుఖం చాభ్యధికం కఫహృద్రోగకారణమ్. 3౪
హృదయం కఫహృద్రోగే సుప్తస్తిమితభారికమ్,
(స్తమ్భస్తిమితభారికం)
తంద్రారుచిపరీతస్య భవత్యశ్మావృతం యథా. 3౫

వ్యా. మిక్కుటముగ భుజించుట, గురుపదార్థములను, స్నిగ్ధపదార్థములను విశేషముగ తినుట, చింతనారూపమైన మనోవ్యాపారమును అంగికాదిచేష్టారూపమైన శరీరవ్యాపారమును మానియుండుట, అధికముగ నిద్రించుట, ఈకారణములచేత కఫము ప్రకోపించి హృదయమున జేరి బాధ కల్గించును. ఈరోగమునందు హృదయమున స్పర్శజ్ఞానము లేక తడిగుడ్డచే గప్పబడినట్లును, భారముగను నుండును. కునికిపాటు కల్గును. అరోచకము కల్గును. హృదయమున రాతినడచినవిధముగ బాధ కల్గును. ఈలక్షణములబట్టి కఫజహృద్రోగమని యెరుంగునది.

### సాన్నిపాతికహృద్రోగనిదానలక్షణములు.

మూ. హేతులక్షణసంసర్గాదుచ్యతే సాన్నిపాతికః,

వ్యా. వాతాదిదోషముల నుద్దేశించి వేరువేరుగ జెప్పబడినకారణములచే కల్గి, వానికి ప్రత్యేకముగ జెప్పినలక్షణము లన్నియు మిశ్రముగ కల్గినచో సన్నిపాతమున జనించిన హృద్రోగమని యెరుంగునది.

### క్రిమిజహృద్రోగనిదాన - సంప్రాప్తి లక్షణములు.

మూ. త్రిదోషజే తు హృద్రోగే యో దురాత్మా నిషేవతే. 3౬
తిలక్షీరగుడాదీని గ్రన్థిస్తస్యోపజాయతే,
సంక్లేదాత్క్రిమయశ్చాస్య భవన్త్యుపహతాత్మనః. 3౭

మర్మైకదేశే సంజాతాః సర్పన్తో భక్షయన్తి చ,
తుద్యమానం సహృదయం సూచీభిరివ మన్యతే. ౩౮
ఛిద్యమానం యథా శస్త్రైః జాతకణ్డూ మహారుజమ్,
హృద్రోగం క్రిమిజన్త్వేతైః లిఙ్గైర్బుద్ధ్వా సుదారుణమ్. ౩౯
త్వరేత జేతుం తం విద్వాన్ వికారం శీఘ్రకారిణమ్,

వ్యా. పైజెప్పిన త్రిదోషసన్నిపాతమున గల్గిన హృద్రోగమునందు ఇంద్రియముల నిగ్రహింపక నువ్వులు, పాడుబెల్లము మున్నగువానిని తినినచో నట్టివానికి గ్రంథి కల్గును. అట్టిగ్రంథియొక్క ద్రవమువలన క్రిములు సంభవించును. అట్టిక్రిములు ముఖ్యమగు మర్మస్థానమైన హృదయమునందు జేరి వ్యాపించుచు హృదయమును తినను మొదలిడును. అట్టియెడ హృదయమున సూదుల గ్రుచ్చినవిధముగను, శస్త్రములచే ఛేదించు విధముగను బాధయు, జిలయు, అధికమైన నొప్పియు కల్గును. అట్టిలక్షణములబట్టి యయ్యది క్రూరమైన క్రిమిజహృద్రోగమని తెలిసికొని దానిని శమింపజేయుటకు అతి శీఘ్రముగ ప్రయత్నము చేయనగును. ఆహృద్రోగము తగినచికిత్స శీఘ్రముగ జేయనిచో మిక్కిలి క్రూరమై యతిశీఘ్రముగ నపాయమును గల్గించును; కావున వెంటనే చికిత్స నరయవలెనని భావము.

("రోగా హృది చ దేహినాం కతి" అనుప్రశ్నమున కుత్తరముగ నైదు హృద్రోగములు వివరింపబడినవి.)

వృద్ధిక్షయాది భేదములచే వాతాదిదోషములకు గల్గు నరువదిరెండు భేదములు.

మూ. ద్వ్యుల్బణైకోల్బణైష్షట్ స్యుః హీనమధ్యాధికైశ్చ షట్. ౪౦
సమైశ్చైకో వికారాస్తే సన్నిపాతాస్త్రయోదశ,
సంసర్గే నవ షట్ తేభ్యః ఏకవృద్ధ్యా సమైస్త్రయః ౪౧
పృథక్త్రయస్స్యుః తైర్వృద్ధైః వ్యాధయః పఞ్చవింశతిః,
యథా వృద్ధైస్తథా క్షీణైః దోషైస్స్యుః పఞ్చవింశతిః. ౪౨
వృద్ధిక్షయకృతశ్చాన్యో వికల్ప ఉపదేక్ష్యతే,
వృద్ధిరేకస్య సమతా చైకస్యైకస్య సంక్షయః. ౪౩
ద్వన్ద్వవృద్ధిః క్షయశ్చైకస్యైకవృద్ధిః ద్వయోః క్షయః,

వ్యా. "కతి చాప్యనిలాదీనాం రోగాః మానవికల్పజాః" అని శిష్యుడు ప్రశ్నింప "వ్యాధీనాం ద్వ్యధికా షష్టిః దోషమానవికల్పజా" అని పైప్రశ్నమునకు నుత్తర మొసంగబడియె. ఇచ్చట దోషములయొక్క సమస్థితి, వృద్ధి, క్షయము అనునవస్థల ననుసరించి దోషముల పరస్పరసంసర్గసన్నిపాతములచే రోగము లెన్నివిధములగును? అని ప్రశ్నము. దానికి అట్టి భేదముచేత నరువదిరెండువిధములుగ రోగములుండునని రోగభేదముల నిర్దేశించి సమాధానము చెప్పబడినది. అట్టివాతపిత్తసంసర్గములతారతమ్యము ననుసరించి కల్గు అరువదిరెండుభేదంబులును "ద్వ్యుల్బణైకోల్బణైః... ఏకస్య సంక్షయః" అనుగ్రంథముచేత వివరింపబడును.

వాతపిత్తకఫములలో రెండేసిదోషములు అధికముగ వృద్ధినొందుటచే నారువిధంబులును, హీన-మధ్య-అధికములుగ (తారతమ్య భేదముచే) వృద్ధినొందుటచే నారువిధంబులును, వాతపిత్తకఫములు సమములుగ వృద్ధినొందియుండుటచే నొకవిధంబును నై యివి యన్నియుం కలిసి సన్నిపాతములు పదుమూడువిధములుగ నుండును.

(పైజెప్పిన పదుమూఁటివివరణము:—వాతపిత్తము వృద్ధినొంది కఫము సమముగ నుండునది యొకటి, వాతకఫములు వృద్ధినొంది పిత్తము సమముగ నుండునది రెండవది, పిత్తకఫములు వృద్ధినొంది వాతము సమస్థితి నుండునది మూడవది, (ఈమూడును ద్వ్యుల్బణభేదములు); వాతము వృద్ధినొంది పిత్తకఫములు సమస్థితి నుండునది నాల్గవది, పిత్తము వృద్ధినొంది వాతకఫములు సమములుగ నుండునది యైదవది, కఫము వృద్ధినొంది వాతపిత్తములు సమస్థితి నుండునది యారవది (ఇవి యేకోల్బణభేదములు); వాతము వృద్ధినొంది అంతకన్న నధికముగ పిత్తము (వృద్ధతరము) వృద్ధినొంది కఫము అంతకన్న నధికముగ (వృద్ధతమమై) వృద్ధినొందినది యేడవది, పిత్తము వృద్ధినొంది, వాతము వృద్ధతరంబును, కఫము వృద్ధతమంబు నైనది యెనిమిదవది, కఫము వృద్ధినొంది వాతము వృద్ధతరంబును, పిత్తము వృద్ధతమంబు నైనది తొమ్మిదవది, వాతము వృద్ధినొంది పిత్తకఫములు వృద్ధతరములుగ నుండునది పదియవది. పిత్తము వృద్ధినొంది వాతకఫములు వృద్ధతరములుగ నుండునది పదునొకండవది, కఫము వృద్ధినొంది వాతపిత్తములు వృద్ధతరములుగ నుండునది పండ్రెండవది. (ఈయారును హీనమధ్యాధికభేదములు.) వాతపిత్తకఫములు మూడును సమముగ ప్రకోపించినది యొకటియుం జేరి సన్నిపాతభేదము పదుమూడు విధము లగునని భావము.)

మరియుం రెండేసి దోషములు స్వప్రమాణమునకన్న నధికముగ వృద్ధినొంది యొండొంట గలిసిన సంసర్గభేదములు తొమ్మిది. ఎట్లులన:—స్వప్రమాణమునకన్న నధికముగ వృద్ధినొందిన దోషముల రెంటిలో నొకటికన్న నొకటి యధికముగ వృద్ధినొందు

టచే గల్గినసంసర్గ భేదము లారు. రెండుదోషములును సమములుగ వృద్ధినొందిన సంసర్గ భేదములు మూడు. ఇవి చేరి తొమ్మిది సంసర్గ భేదములు. ఇవిగాక యొక్కొకదోషము వేరువేరుగ ప్రకోపించుటచే గల్గిన భేదములు మూడు. ఇత్తెరంగున నివి యన్నియుం కలిసి యిరువదియైదువిధము లగును.

(దీనివివరణము:—స్వప్రమాణమునకన్న నధికముగ వృద్ధినొందు రెండేసి దోషము లొకటిగ జేరి వ్యాధిని గల్గించిన నయ్యది సంసర్గము. అందు వాతము అధికముగ వృద్ధినొంది, అంతకన్న పిత్త మధికముగ వృద్ధినొందిన సంసర్గ మొకటి, పిత్త మధికముగ నుండి అంతకన్న కఫ మధికముగ నుండునది యొకటి, కఫ మధికమై అంతకన్న వాత మధికముగ నుండునది యింకొకటి, పిత్త మధికమై వాత మంతకన్న నధికమగునది యొకటి, వాత మధికమై అంతకన్న కఫ మధికమగునది యొకటి, కఫ మధికమై అంతకన్న పిత్త మధికమగునది యొకటి, (ఇవి యేకవృద్ధిసంసర్గ భేదములు). మరియుం వాతపిత్తములును, వాతకఫములును, పిత్తకఫములును, రెండేసియుం సమానములుగ వృద్ధినొందుటచే గల్గుసంసర్గములు మూడు, ఇవి యన్నియుం జేసి సంసర్గ భేదములు తొమ్మిది. మరియుం వాతపిత్తకఫములు మూడు వేరువేరుగ నొక్కొకటి ప్రకోపించుటచే గల్గు భేదములు మూడు. పైజెప్పినసన్నిపాత భేదములు పదమూడును, సంసర్గ భేదములు తొమ్మిదియుం ఏకదోష భేదములు మూడును గలిసి దానగల్గు రోగ భేదములు ఇరువదియైదువిధములుగ నుండునని భావము.

మరియుం పైజెప్పిన వృద్ధిక్రమము ననుసరించి క్షీణించినదోష భేదములు ఇరువదియైదువిధము లగును. (క్షీణదోషద్వయఏకదోష భేదము లారును, హీన-మధ్య-అధికరూప తారతమ్యముచే క్షీణించినదోష భేదము లారును, మూడుదోషములును సమములుగ క్షీణించుభేద మొకటియుం జేరి పదుమూడు. ఇవిగాక దోషద్వయసంసర్గమున ఒక్కొక దోషము క్షీణించి కల్గిన సంసర్గ భేదములారును, రెండేసి దోషములు సమములుగ క్షీణించి కల్గిన సంసర్గ భేదములు మూడును చేరి సంసర్గ భేదములు తొమ్మిదియును, ఒక్కొక దోషము మాత్రము ప్రత్యేకముగ క్షీణించుటచే కల్గిన ఏకదోష భేదములు మూడును, ఇవియన్నియుం కలిసి స్వప్రమాణమునకన్న క్షీణించినదోష భేదములచే గల్గు వ్యాధులు ఇరువదియైదువిధము లగునని భావము. పైజెప్పినదోషవృద్ధి భేదములు ఇరువదియైదును, క్షీణదోష భేదములు ఇరువదియైదును కలిసి యేబది యగును.

ఇవిగాక మూడుదోషములలో నొకటి వృద్ధినొంది యొకటి సమమై వేరొకటి క్షీణించుటచే గల్గుభేదము లారును, రెండేసిదోషములు వృద్ధినొంది యొక్కొకదోషము

క్షీణించుటచే గల్గుభేదములు మూడును, రెండేసిదోషములు క్షీణించి యొక్కొకదోషము వృద్ధినొందుటచే గల్గుభేదములు మూడును కలిసి యివి పండ్రెండగును. పైజెప్పినది యేబదియుం నివి పండ్రెండును కలిసి యరువదిరెండు భేదములగును.

(దీనివివరణము:—వాతము వృద్ధినొంది, పిత్తము సమమై, కఫము క్షీణించినది యొకటి. వాతము వృద్ధినొంది, కఫము సమమై, పిత్తము క్షీణించినది రెండవది. పిత్తము వృద్ధినొంది, కఫము సమమై, వాతము క్షీణించినది మూడవది. పిత్తము వృద్ధినొంది, వాతము సమమై, కఫము క్షీణించినది నాల్గవది. కఫము వృద్ధినొంది, వాతము సమమై, పిత్తము క్షీణించినది యైదవది. కఫము వృద్ధినొంది, పిత్తము సమమై, వాతము క్షీణించినది యారవది. (ఇవి ఏకైకవృద్ధిసమక్షీణభేదములు.) వాతపిత్తములు వృద్ధినొంది, కఫము క్షీణించినది యేడవది. వాతకఫములు వృద్ధినొంది పిత్తము క్షీణించినది యెనిమిదవది. పిత్తకఫములు వృద్ధినొంది వాతము క్షీణించినది తొమ్మిదవది. (ఈమూడును రెండుదోషములు వృద్ధినొంది యొకటి క్షీణించినదోషభేదములు.) వాతము వృద్ధినొంది పిత్తకఫములు క్షీణించినది పదియవది. పిత్తము వృద్ధినొంది కఫవాతములు క్షీణించినది పదునొకండవది. కఫము వృద్ధినొంది వాతపిత్తములు క్షీణించినది పండ్రెండవది. (పైజెప్పిన యేబదియుం, ఈపండ్రెండును కలిసి యరువదిరెండుభేదములగును.) ఇవి దోషసంసర్గమున మానతారతమ్యాదిభేదములచే గల్గు రోగభేదములు.

ఈపద్ధతినే యవలంబించి వాగ్భటాచార్యులు నిట్లు చెప్పెను.—"వక్ష్యన్తేతః పరం దోషా వృద్ధిక్షయవిభేదతః, పృథక్ త్రీన్ వృద్ధిసంసర్గస్త్రిధా తత్ర తు తాన్నవ, త్రీనేవ సమయా వృద్ధ్యా షడేకస్యాతిశాయనే, త్రయోదశ సమస్తేషు షట్ ద్వ్యేకాతిశయేన తు, ఏకం తుల్యాధికైః షట్చ తారతమ్యవికల్పనాత్, పఞ్చవింశతిరిత్యేవం వృద్ధైః క్షీణైశ్చ తావతః, ఏకైకవృద్ధిసమతా క్షయైష్షట్ తే పునశ్చ షట్, ఏకక్షయ ద్వన్ద్వవృద్ధ్యా సవిపర్యయయాపి తే, భేదాః ద్విషష్టి ర్నిర్దిష్టాః త్రిషష్టి స్స్వాస్థ్యకారణమ్" ఈవాక్యమునకును, ప్రకృతగ్రంథమునకును ఆనుపూర్వీమాత్రము భేదముకాని విషయభేదము కానరాదు. మరియుం దోషములు స్వప్రమాణమున (న్యూనాతిరేకములేక)నుండునవస్థ యరువదిమూడవదియనియు, అయ్యది సమస్థితి నుండి శరీరమును సమస్థితినుంచుటంజేసి యారోగ్యకారణ మగునదియు వాగ్భటమున "త్రిషష్టిస్స్వాస్థ్యకారణ" మని ప్రత్యేకముగ చెప్పబడినది. ప్రకృతగ్రంథమున "రోగా మానవికల్పజాః" అను ప్రశ్నము ననుసరించి రోగకారణములైన యరువదిరెండుభేదములు మాత్రము నిరూపింపబడినవి.

వృద్ధిక్షయములచే (62) అరువదిరెండువిధములుగ నైన వాతాదిదోషముల సులభముగ దెల్పుపట్టిక. అందు వృద్ధిభేదములు. 25.

| సంఖ్య. | వాతము. | పిత్తము. | కఫము. | వివరణము. |
|---|---|---|---|---|
| 1 | వృద్ధము | వృద్ధము | సమము | ఈమూడును ద్వ్యుల్బణ సన్నిపాత భేదములు. |
| 2 | వృద్ధము | సమము | వృద్ధము | |
| 3 | సమము | వృద్ధము | వృద్ధము | |
| 4 | వృద్ధము | సమము | సమము | ఈమూడును ఏకోల్బణములు. |
| 5 | సమము | వృద్ధము | సమము | |
| 6 | సమము | సమము | వృద్ధము | |
| 7 | వృద్ధము | వృద్ధతరము | వృద్ధతమము | ఈయారును హీన, మధ్య, అధికదోష భేదములు. |
| 8 | వృద్ధతరము | వృద్ధము | వృద్ధతమము | |
| 9 | వృద్ధతరము | వృద్ధతమము | వృద్ధము | |
| 10 | వృద్ధము | వృద్ధతరము | వృద్ధతరము | |
| 11 | వృద్ధతరము | వృద్ధము | వృద్ధతరము | |
| 12 | వృద్ధతరము | వృద్ధతరము | వృద్ధము | |
| 13 | సమవృద్ధము | సమవృద్ధము | సమవృద్ధము | సమముగ వృద్ధిజెందిన సన్నిపాతము. ఇవియన్నియు చేరి సన్నిపాతభేదములు. (13) పదమూడు. |
| 14 | వృద్ధము | వృద్ధతరము | సమము | ఈతొమ్మిదియు ద్విదోష సంసర్గ భేదములు. |
| 15 | సమము | వృద్ధము | వృద్ధతరము | |
| 16 | వృద్ధతరము | సమము | వృద్ధము | |
| 17 | వృద్ధతరము | వృద్ధము | సమము | |
| 18 | వృద్ధము | సమము | వృద్ధతరము | |
| 19 | సమము | వృద్ధతరము | వృద్ధము | |
| 20 | వృద్ధము | వృద్ధము | సమము | |
| 21 | వృద్ధము | సమము | వృద్ధము | |
| 22 | సమము | వృద్ధము | వృద్ధము | |
| 23 | వృద్ధము | సమము | సమము | ఈమూడును ఏకదోష వృద్ధి భేదములు. |
| 24 | సమము | వృద్ధము | సమము | |
| 25 | సమము | సమము | వృద్ధము | |

ఈయిరువదియైదును దోషవృద్ధిచే గల్గు భేదములు. ఈ మొత్తము (25) ఇరువదిఐదు.

## క్షీణభేదములు. 25.

| సంఖ్య. | వాతము. | పిత్తము. | కఫము. | వివరణము. |
|---|---|---|---|---|
| 26 | క్షీణము | క్షీణము | సమము | ఈయిరువదియైదింటికి దోషవృద్ధి వలెనే యోగాంతరభేదములు గలుగును. |
| 27 | క్షీణము | సమము | క్షీణము | |
| 28 | సమము | క్షీణము | క్షీణము | |
| 29 | క్షీణము | సమము | సమము | |
| 30 | సమము | క్షీణము | సమము | |
| 31 | సమము | సమము | క్షీణము | |
| 32 | క్షీణము | క్షీణతరము | క్షీణతమము | |
| 33 | క్షీణతరము | క్షీణము | క్షీణతమము | |
| 34 | క్షీణతరము | క్షీణతమము | క్షీణము | |
| 35 | క్షీణము | క్షీణతరము | క్షీణతరము | |
| 36 | క్షీణతరము | క్షీణము | క్షీణతరము | |
| 37 | క్షీణతరము | క్షీణతరము | క్షీణము | |
| 38 | క్షీణము | క్షీణము | క్షీణము | |
| 39 | క్షీణము | క్షీణతరము | సమము | |
| 40 | సమము | క్షీణము | క్షీణతరము | |
| 41 | క్షీణతరము | సమము | క్షీణము | |
| 42 | క్షీణతరము | క్షీణము | సమము | |
| 43 | క్షీణము | సమము | క్షీణతరము | |
| 44 | సమము | క్షీణతరము | క్షీణము | |
| 45 | క్షీణము | క్షీణము | సమము | |
| 46 | క్షీణము | సమము | క్షీణము | |
| 47 | సమము | క్షీణము | క్షీణము | |
| 48 | క్షీణము | సమము | సమము | |
| 49 | సమము | క్షీణము | సమము | |
| 50 | సమము | సమము | క్షీణము | |

ఈ 25 ను క్షీణదోష భేదములు.

## వృద్ధక్షీణమిశ్రభేదములు.

| సంఖ్య. | వాతము. | పిత్తము. | కఫము. | వివరణము. |
|---|---|---|---|---|
| 51 | వృద్ధము | సమము | క్షీణము | |
| 52 | వృద్ధము | క్షీణము | సమము | |
| 53 | క్షీణము | వృద్ధము | సమము | ఈయారును వృద్ధసమక్షీణమిశ్రభేదములు. |
| 54 | సమము | వృద్ధము | క్షీణము | |
| 55 | సమము | క్షీణము | వృద్ధము | |
| 56 | క్షీణము | సమము | వృద్ధము | |
| 57 | వృద్ధము | వృద్ధము | క్షీణము | |
| 58 | వృద్ధము | క్షీణము | వృద్ధము | ద్వివృద్ధి ఏకక్షీణభేదములు. |
| 59 | క్షీణము | వృద్ధము | వృద్ధము | |
| 60 | వృద్ధము | క్షీణము | క్షీణము | |
| 61 | క్షీణము | వృద్ధము | క్షీణము | ఏకైకక్షీణభేదములు. |
| 62 | క్షీణము | క్షీణము | వృద్ధము | |
| 63 | సమము | సమము | సమము | త్రిదోషసమత్వము ఇయ్యదియారోగ్యహేతువు. |

ఇవి యన్నియుం కలిసి అరువదిరెండు దోషభేదములు వృద్ధిక్షయభేదములును, రోగకారణము లగును. అరువదిమూడవది సమస్థితి నుండుదోషభేదము. ఇది యారోగ్యకారణము. ఇయ్యది వాగ్భటసూచితము.

ఏకవృద్ధి ఏకసమ ఏకక్షయమున గల్గు దోషభేదము లారిటి కుదాహరణము.

మూ (౧) ప్రకృతిస్థం యదా పిత్తం మారుతః శ్లేష్మణః క్షయే. ౪౪
స్థానాదాదాయ గాత్రేషు యత్ర యత్ర విసర్పతి,
తదా భేదశ్చ దాహశ్చ తత్ర తత్రాఽనవస్థితః. ౪౫
గాత్రదేశే భవత్యస్య శ్రమో దౌర్బల్యమేవ చ,
(౨) సామ్యే స్థితం కఫం వాయుః క్షీణే పిత్తే తదా బలీ. ౪౬
కర్షేత్కుర్యాత్తదా శూలం సశైత్యస్తమ్భగౌరవమ్,
(3) యదానిలం ప్రకృతిగం పిత్తం కఫపరిక్షయే. ౪౭
సంరుణద్ధి తదా దాహః శూలం చాస్యోపజాయతే,

(౪) శ్లేష్మాణం హి సమం పిత్తం యదా వాతపరిక్షయే. ౪౮
నిపీడయేత్తదా కుర్యాత్ సతన్ద్రాగౌరవం జ్వరమ్,
(౫) ప్రవృద్ధో హి యదా శ్లేష్మా పిత్తే క్షీణే సమీరణమ్. ౪౯
రుద్ధ్వాత్తదా ప్రకుర్వీత శీతకం గౌరవం రుజమ్,
(౬) సమీరణే పరిక్షీణే కఫః పిత్తం సమత్వగమ్. ౫౦
కుర్వీత సన్నిరుద్ధానో మృద్వగ్నిత్వం శిరోగ్రహమ్,
(ప్రకృతిస్థం యదా పిత్తం శ్లేష్మా మారుతసంక్షయే,
సన్నిరుద్ధ్యాత్తదా కుర్యాన్మృద్వగ్నిం చ శిరోగ్రహమ్)
నిద్రాం తన్ద్రాం ప్రలాపం చ హృద్రోగం గాత్రగౌరవమ్.
నఖాదీనాఞ్చ పీతత్వం ష్ఠీవనం కఫపిత్తయోః,

వ్యా. ఇచ్చట "ప్రకృతిస్థం యదా పిత్తం... కఫపిత్తయోః" అను గ్రంథముచేత "వృద్ధిరేకస్య సమతా చైకస్యైకస్య సంక్షయః" అని యర్ధశ్లోకమున జెప్పినయారుదోష భేదములకును వేర్వేరుగ నుదాహరణము చెప్పబడును:—

(౧) పిత్తము స్వభావస్థితినుండి, వాతము వృద్ధినొంది, కఫము క్షీణించియున్నపుడు, వృద్ధినొందినవాతము స్వభావస్థితి నుండుపిత్తమును దానిస్థానమునుండి లాగికొని దానితో గూడ కలిసికొని శరీరమునం దెచ్చటెచ్చట వ్యాపించునో ఆయాస్థలములయం దెల్ల పగులదీయునట్లు నొప్పియు, మంటయు, బడలికయు, బలహీనతయు నిలుకడ లేక కల్గుచుండును. (ఇది పిత్తము సమస్థితినుండి, వాతము వృద్ధినొంది, కఫము క్షీణించి యుండు దోషలక్షణమున కుదాహరణము).

(౨) కఫము సమస్థితినుండి, వాతము వృద్ధినొంది, పిత్తము క్షీణించి యున్నపుడు ప్రబలమైనవాతము సమస్థితి నుండుకఫమును దానిచోటినుండి లాగికొని దానితో గూడి శరీరమున వ్యాపించును. అట్టియెడ వాతమువ్యాపించిన స్థలములయం దెల్ల శూలనొప్పియు, చల్లదనంబును, భారంబును కల్గును. (ఇది కఫము సమస్థితినుండి, వాతము వృద్ధినొంది, పిత్తము క్షీణించియుండు దోషమున కుదాహరణము).

(౩) వాతము సమస్థితినుండి, పిత్తము వృద్ధినొంది, కఫము క్షీణించి యున్నపుడు ప్రకోపమునొందినపిత్తము సమస్థితినుండువాతమును నిరోధించును. అట్టియెడ మంటయు శూలనొప్పియు కల్గును. (ఇది వాతము సమస్థితినుండి, పిత్తము వృద్ధినొంది, కఫము క్షీణించియుండు దోషమున కుదాహరణము).

(౪) కఫము సమస్థితినుండి పిత్తము వృద్ధినొంది, వాతము క్షీణించినపుడు వృద్ధినొందిన పిత్తము సమస్థితి నుండుకఫమును నిరోధించును. అట్టియెడ కునికిపాటును శరీరభారంబును జ్వరంబును సంభావించును. (ఇది కఫము సమస్థితినుండి, పిత్తము వృద్ధినొంది, కఫము క్షీణించినదోషమున కుదాహరణము).

(౫) కఫము వృద్ధినొంది, పిత్తము క్షీణించి, వాతము సమస్థితి నుండినయెడ వృద్ధినొందినకఫము సమస్థితి నున్నవాతమును నిరోధించును. అప్పుడు శరీరము బరువై జ్వరంబును చలియు నొప్పియు కల్గును. (ఇది కఫము వృద్ధినొంది, పిత్తము క్షీణించి, వాతము సమస్థితినుండు దోషమున కుదాహరణము).

(౬) వాతము క్షీణించి, పిత్తము సమస్థితినుండి, కఫము ప్రకోపించినపుడు, ప్రవృద్ధకఫము సమస్థితినుండుపిత్తమును నిరోధించి జఠరాగ్నిని మందగింపజేయును. తలనొప్పిని కల్గించును. నిదురయు కునికిపాటును కల్గును. ప్రలాపము, హృదయరోగము, శరీరభారము ఇవి కల్గును. గోళ్లమున్నగునవి పచ్చనగును. నోట కఫంబును పిత్తమునను వెడలును. (ఇది వాతము క్షీణించి, పిత్తము సమస్థితినుండి, కఫము వృద్ధినొందినదోషమున కుదాహరణము).

{ ద్వంద్వవృద్ధిఏకక్షయదోషభేదములు మూడు. అందు వాతము క్షీణించి పిత్తకఫములు వృద్ధినొందిన దోషలక్షణములు. }

మూ. హీనవాతస్య తు కఫః పిత్తేన సహితశ్చరన్. ౫౨
కరోత్యరోచకాపాకౌ సదనం గౌరవం తథా,
హృల్లాసమాస్యస్రవణం దూయనం పాణ్డుతాం మదమ్. ౫౩
విరేకస్య హి వైషమ్యం వైషమ్య మనలస్య చ,

వ్యా. వాతము క్షీణస్థితినుండి, పిత్తకఫములు రెండును వృద్ధినొంది యున్నపుడు కఫము పిత్తముతో గూడి శరీరమునందు సంచరించుచు అరోచకమును అజీర్ణమును కల్గించును. ఒడలినొప్పులు పుట్టును. శరీరము బరువుగనుండును. ఓకళింతలు కల్గి నోట నీరువెడలును. శరీరమున వేదన పుట్టును. శరీరము తెల్లబారును. తిక్కయెత్తినట్లుండును. మలప్రవృత్తి యొకప్పుడు కల్గుట మరియొకప్పుడు వెడలకుండుటయు సంభవించును. జఠరాగ్ని యొకప్పుడు మందగించియు మరియొకప్పుడు తీవ్రమయ్యు నుండును. (ఇది వాతము క్షీణించి పిత్తకఫములు రెండును ప్రకోపమునొందిన దోషమున కుదాహరణము).

—అందు పిత్తము క్షీణించి వాతకఫములు ప్రకోపించినదోషలక్షణములు.—

మూ. క్షీణపిత్తస్య తు శ్లేష్మా మారుతేనోపసంహితః ౫౪
స్తమ్భం శైత్యం చ మోదం చ జనయత్యనవస్థితమ్,
గౌరవం మృదుతామగ్నేః భక్తాశ్రద్ధాం ప్రలేపనమ్. ౫౫
నఖాదీనాం చ శుక్లత్వం గాత్రపారుష్యమేవ చ,

వ్యా. పిత్తము క్షీణించి వాతకఫములు ప్రకోపించి (వృద్ధినొంది) యున్నపుడు కఫము వాతముతో గూడి శరీరమున వ్యాపించును. అట్టిశరీరము స్తంభించియుండుట, చల్లనై యుండుట, సూదుల బొడిచినవిధముగ పోటు ఇవి వ్యవస్థలేక కల్గుచుండును. శరీరభారము, అగ్నిమాంద్యము, ఆహారమునం దిచ్ఛలేకుండుట, కంపము, గోళ్లు కన్నులు మొన్నగునవి నల్లబడుట, శరీరము పరుషముగనుండుట ఈలక్షణములు కల్గును. (ఇది పిత్తము క్షీణించి, వాతకఫములు రెండును వృద్ధినొందియున్న దోషమున కుదాహరణము).

—కఫము క్షీణించి వాతపిత్తములువృద్ధినొందిన దోషలక్షణములు.—

మూ. హీనే కఫే మారుతస్తు పిత్తం తు కుపితం ద్వయమ్. ౫౬
కరోతి యాని లిఙ్గాని శృణు తాని సమాసతః,
భ్రమముద్వేష్టనం తోదం దాహం స్ఫోటనముత్తమమ్. ౫౭
అఙ్గమర్దం పరీశోషం దూయనం ధూపనం తథా,

వ్యా. కఫము క్షీణించి వాతపిత్తములు రెండును ప్రకోపించియున్నపుడు గల్గు లక్షణములు సంగ్రహముగ నిట్లెరుంగునది:—అట్టియెడ చక్రముపై నున్నవానివలె నొడలు తిరుగును. అవయవముల నూడదీయునట్లు బాధకల్గును. సూదుల గ్రుచ్చిన విధముగ పోటుపుట్టును. మంటకల్గును. శరీరము పగులును. అవయవములయం దెల్ల నొప్పి పుట్టును. శరీరము శుష్కించును. రొమ్ములో వేదనకల్గి పొగవెడలునట్లుండును. (పై జెప్పిన విమూడును ఒకదోషము క్షీణించి రెండుదోషములు ప్రకోపించిన భేదములమూటికి నుదాహరణము.)

—{ ఏకవృద్ధి ద్వంద్వక్షయదోషములు మూడు. అందు కఫము వృద్ధినొంది వాతపిత్తములు క్షీణించిన దోషలక్షణములు. }—

మూ. వాతపిత్తక్షయే శ్లేష్మా స్రోతాంస్యపి దధచ్ఛ్రశమ్. ౫౮
చేష్టా ప్రణాశం మూర్ఛాంచ వాక్సఙ్గం చ కరోతి హి,

వ్యా వాతపిత్తములు రెండును క్షీణించి కఫము మాత్రము వృద్ధినొందినప్పుడు అట్టికఫము శరీరమునందలి రంధ్రములనన్నిటిని యడ్డగించును. దానంజేసి అవయవముల

చలనాది వ్యాపారములన్నియు నుడుగును. మూర్ఛగ్రమ్మును. నోరు బిగబట్టి మాటలాడుటకును కష్టముగ నుండును.

### పిత్తము వృద్ధినొంది కఫవాతములు క్షీణించిన దోషలక్షణము.

మూ. శ్లేష్మవాతక్షయే పిత్తం దేహౌజః స్రంసయేచ్చరత్. శ్లో
గ్లానిమిన్ద్రియదౌర్బల్యం తృష్ణాం మూర్ఛాం క్రియాక్షయమ్,

వ్యా. కఫవాతములు రెండును క్షీణించి పిత్తము మాత్రము ప్రకోపించినపుడు అట్టిపిత్తము శరీరమునందలి యోజస్సును కరిగించి వెడలించుచు శరీరమునందెల్ల సంచరించును. దానివలన బడలికయు, చక్షురాదీంద్రియముల బలహీనతయు, దప్పియు, మూర్ఛయు, పనుల జేయుటయందు సామర్థ్యములేకపోవుటయు కల్గును.

### వాతము వృద్ధినొందిన, కఫపిత్తములు క్షీణించినదోషలక్షణము.

మూ. పిత్తశ్లేష్మక్షయే వాయుః మర్మాణ్యతి నిపీడయన్. ౬౦
ప్రణాశయతి సంజ్ఞాం చ వేపయత్యథవా నరమ్,

వ్యా. పిత్తకఫములు రెండును క్షీణించి వాతము మాత్రము ప్రకోపించినపుడు అట్టివాతము మర్మములనన్నిటిని బిగదీసి శరీరమును ప్రజ్ఞదప్పించును. వడకించును. (ఇవి మూడును ఒకదోషము మాత్రము ప్రకోపించి తక్కినవిరెండును క్షీణించిన దోషముల కుదాహరణములు )

ఇత్తెరంగున ఒకదోషము వృద్ధినొంది మరియొకటి సమస్థితినుండి యింకొకటి క్షీణించునట్టి దోషభేదము లారును, ఒకదోషము క్షీణించి తక్కినవిరెండును క్షీణించిన దోషభేదములు మూడును, ఒకదోషము వృద్ధినొంది తక్కినవి రెండును క్షీణించిన దోషభేదములు మూడును జేరిన మొత్తము పండ్రెండుదోషభేదములకు వేరువేరుగ నుదాహరణములు "ప్రకృతిస్థం యదా పిత్తం" అని యుపక్రమించిన గ్రంథముచేత నుదాహరణ రూపముగ జెప్పబడినది. తక్కినదోషభేదముల కన్నిటికిని ఉదాహరణముల నాయా స్థలములయం దూహించునది.

తక్కినదోషభేదముల కన్నిటికిని ఉదాహరణముల జెప్పవలసియున్నను దోషముల సంసర్గమున వృద్ధిక్షయములచే గల్గుభేదములు గమనించుటకు కష్టముగా నుండునని యెంచి తక్కినవానిని వదలి వృద్ధిక్షయభేదముల పండ్రెండింటికి మాత్రము గ్రంథకర్త ప్రధానముగ నుదాహరణముల చూపెను. అని కొందరియాశయము.

వాతాదిదోషముల వృద్ధి-క్షయ-సామ్యావస్థల ప్రత్యేకలక్షణములు.

**మూ.** దోషాః ప్రవృద్ధాః స్వం లిఙ్గం దర్శయన్తి యథాబలమ్. ౬౧
క్షీణా జహాతి లిఙ్గం స్వం, సమాస్స్వం కర్మ కుర్వతే,

వ్యా. వాతపిత్తకఫములు మూడును స్వప్రమాణములకన్న నధికముగ వృద్ధినొందినపుడు ఆయాదోషములకు వేరువేర జెప్పబడినలక్షణముల వానివానిబలానుసారముగ జూపును. (దోషములవృద్ధి సమ-మధ్య-అధిక భేదములచే మూడువిధముల నుండును. అట్టియెడ సామాన్యముగ వృద్ధినొందిన దోషములు సామాన్యముగ తమలక్షణముల జూపుననియు, మధ్యముగ వృద్ధినొందినదోషము తనలక్షణములను మధ్యమముగ జూపుననియు, మిక్కిలి యధికముగ వృద్ధినొందినదోషము స్వలక్షణముల మిక్కుటముగ జూపుననియు నెఱుంగుటకై 'యథాబలమ్' అని చెప్పబడినది.)

మరియు దోషములు స్వప్రమాణమునకన్న క్షీణించినయెడ తమతమవ్యాపారములను విడచును. అటుగాక దోషములు మూడును వానివానికి నియతమైన (వృద్ధిక్షయములు లేక) సమస్థితియం దున్నయెడ వానివానికి నిర్ణయింపబడిన కృత్యముల నిరాటంకముగ జేయుచుండును. (అందు వృద్ధినైనను క్షయమునైనను నొందినదోషములు రోగముల గల్గించుననియు, సమస్థితి నుండునెడ తమతమకృత్యముల నిరపాయముగ జేయుచు నారోగ్యమును కల్గించి స్వస్థతను కాపాడుననియు నెఱుంగునది.)

ఇచ్చట "క్షీణా జహాతి స్వం లిఙ్గం" అనువాక్యమునకు స్వప్రమాణమునకు తక్కువగ క్షీణించిన వాతపిత్తకఫములు తమతమకు నియతములైన లక్షణములను వదలి వానివానికృత్యముల జక్కగ నెరవేర్పకయుండునుగాన రోగములమాత్రము కల్గించు సామర్థ్యము వానికి లేదని భావము. స్వప్రమాణమునకన్న నధికముగ వృద్ధినొందినవి బలవంతములై యుండును కావున నవి దూష్యములగు రసాదిధాతువులను వ్యాపించి వాని చెరిచి జ్వరాదిరోగముల గల్గించును. క్షీణించినవిమాత్రము బలహీనములగుటచే రోగములగల్గింప శక్తిలేకుండునని భావము. (దోషములక్షయమనగ స్వప్రమాణమునకన్న తగ్గియుండుట యని యర్థము. పూర్తిగ క్షయమగునెడ శరీరమున కపాయమే యగును కావున స్వప్రమాణమునకన్న తగ్గుట క్షయమని చెప్పుటయే సమంజసము. రసాదిధాతుక్షయమునందును ఇత్తెఱంగుననే యర్థమును గ్రహించునది.)

పదునెనిమిదిక్షయములవివరణము.

**మూ.** వాతాదీనాం రసాదీనాం మలానామోజసస్తథా. ౬౨
క్షయాస్తత్రానిలాదీనాం ఉక్తం సంక్షీణలక్షణమ్,

వ్యా. మరియు వాతపిత్తకఫముల మూడిటియొక్కయు, రస-రక్త-మాంస-మేదః-అస్థి-మజ్జా-శుక్రములను నట్టిధాతువులయొక్కయు, ఓజస్సుయొక్కయు, పురీషమూత్రములు పంచేంద్రియములయొక్కయు క్షయములలక్షణములు వేరువేరుగ నుండును. (ఇవియే పదునెనిమిదిక్షయము లనబడును)ఇందు వాతపిత్తకఫములలక్షణములు పైనచెప్పబడినవి. (తక్కిన రసరక్తాదులక్షయలక్షణము లీక్రింద చెప్పబడునని భావము).

రసధాతుక్షయలక్షణములు.

మూ॥ ఘట్టతే సహతే శబ్దం నోచ్చైర్ద్రవతి శూల్యతే. ౬౩
హృదయం తామ్యతి స్వల్పచేష్టస్యాపి రసక్షయే,

వ్యా. శరీరమునందలి రసధాతువు క్షీణించినప్పుడు హృదయమున దడ పుట్టును. బిగ్గరగ కల్గినశబ్దమును విన సహింపదు. హృదయమున ధుక్-ధుక్ అనుధ్వని వినబడును. శూలమున గ్రుచ్చినవిధముగ బాధ కల్గును. కొంచెమైనను పనిచేసినచో హృదయమున బడలికకల్గి శరీరము సొక్కును.

రక్తమాంసములక్షయలక్షణములు.

మూ. పరుషా స్ఫుటితా మ్లానా త్వగ్రూక్షా రక్తసంక్షయే. ౬౪
మాంసక్షయే విశేషేణ స్ఫిగ్గ్రీవోదరశుష్కతా,

వ్యా. రక్తము క్షీణించినపుడు చర్మము పరుషమై గరగరలాడుచు పగుళ్లు బాయును. చర్మము కోమలముగాక వాడి జిడ్డులేక రూక్షముగ నుండును. మాంసము క్షీణించినపుడు రక్తక్షయలక్షణములు కల్గుటయకాక పిరుదులును మెడయు పొట్టయు కృశించియుండును.

మేదోధాతుక్షయలక్షణములు.

మూ. సన్ధీనాం స్ఫుటనం గ్లానిః అక్ష్ణో రాయాస ఏవ చ. ౬౫
లక్షణం మేదసి క్షీణే తనుత్వం చోదరస్య చ,

వ్యా. శరీరమునందలి మేదోధాతువు క్షీణించినప్పుడు కీళ్లూడినట్లుండును. శరీరమున బడలిక కల్గును. కన్నులకు శ్రమముగ నుండును. పొట్ట కృశించి సన్నగిలును.

అస్థిక్షయలక్షణము.

మూ. కేశలోమనఖశ్మశ్రుద్విజప్రపతనం శ్రమః. ౬౬
జ్ఞేయమస్థిక్షయే రూపం సన్ధిశైథిల్యమేవ చ,

వ్యా. శరీరమునందలి యస్థులు క్షీణించినపుడు వెండ్రుకలును, రోమంబులును, గోళ్లును, గడ్డము మీసములును, పండ్లును ఊడును. శరీరమున కారణములేకయే శ్రమము కల్గును. శరీరమునందలి సంధిబంధములు సడలి శిథిలములగును.

మజ్జధాతుక్షయలక్షణములు.

మూ. శీర్యన్త ఇవ చాస్థీని దుర్బలాని లఘూని చ. ౬౭
ప్రతతం వాతరోగాశ్చ క్షీణే మజ్జని దేహినామ్,

వ్యా. శరీరమునందలి యస్థులలోని క్రొవ్వు (మజ్జ) క్షీణించినపుడు అస్థులు బల హీనములై కృశించి పగులునట్లు శిథిలములగును. అధికముగ వాతరోగములు సంభ వించును.

శుక్రధాతుక్షయలక్షణము.

మూ. దౌర్బల్యం ముఖశోషశ్చ పాణ్డుత్వం సదనం శ్రమః. ౬౮
క్లైబ్యం శుక్రావిసర్గశ్చ క్షీణశుక్రస్య లక్షణమ్,

వ్యా. శరీరమునందలి శుక్రమను ప్రధానధాతువు క్షీణించినయెడ చాలబలహీ నము కల్గును. నోట ద్రవములేక యెండును. శరీరము తెల్లబారును. అవయవములయం దెల్ల నొప్పిపుట్టును. బడలిక యధికముగ కల్గును. పుంస్త్వము (సంభోగశక్తి) చెడును. శుక్రము (సంభోగకాలమున) బైటికి వెడలదు.

పురీషక్షయలక్షణము.

మూ. క్షీణే శకృతి చాన్త్రాణి పీడయన్నివ మారుతః. ౬౯
రూక్షస్యోన్నమయన్ కుక్షిం తిర్యగూర్ధ్వం చ గచ్ఛతి,

వ్యా. శరీరము రూక్షమైనవానికి పురీషము స్వప్రమాణమునకన్న తక్కువయై క్షీణించును. అట్టియెడ వానిశరీరమునందలి వాతము పొట్టలోని ప్రేవులను బాధించుచు కుక్షిని పైకిలాగిపట్టి కుక్షిలో నడ్డముగను ఊర్ధ్వముగను వ్యాపించి సంచరించును.

మూత్రక్షయలక్షణము.

మూ. మూత్రక్షయే మూత్రకృచ్ఛ్రం మూత్రవైవర్ణ్యమేవ చ. ౭౦
పిపాసా బాధతే చాస్య ముఖం చ పరిశుష్యతి,

వ్యా. మూత్రము స్వప్రమాణమునకన్న తక్కువగ క్షీణించినయెడ మూత్ర కృచ్ఛ్రము కల్గును. (మూత్రము కష్టముచే వెడలునని యర్థము). మూత్రము స్వాభావిక

మైనవర్ణము మారి (ఎఱుపు మున్నగు వర్ణాంతరము కల్గి) యుండును. దప్పి యధికముగ బాధించును. నోట ద్రవము లేక యెండును.

## పంచేంద్రియములక్షయలక్షణసంగ్రహము.

మూ. మలాయనాని చాన్యాని శూన్యాని చ లఘూని చ. ౭౧
విశుష్కాణి చ లక్ష్యన్తే యథా స్వం మలసంక్షయే,

వ్యా. (పైజెప్పినపురీషములు దక్క తక్కినపంచేంద్రియములకును అధిష్ఠానములగు ముఖము (నోరు), నాసారంధ్రములు, కర్ణరంధ్రములు, నేత్రములు; త్వగింద్రియమున కధిష్ఠానములగు రోమరంధ్రములు. ఇవి మలాయనములు) అట్టి మలస్థానముల నాశ్రయించిన ఆయామలములు తమతమప్రమాణమునకన్న తక్కువగ క్షీణించినపుడు, ఆ యామలస్థానములు ద్రవములేక ఆయామలములు లేక తేలికగ నుండును. అట్టిలక్షణములబట్టి యాయామలక్షయము నూహించునది.

మిక్కిలి సూక్ష్మములగు చెమట మున్నగుమలముల క్షయమును గమనించుట చాల కష్టము, కావున అట్టిమలముల కాధారములగు కర్ణనాసాదిరంధ్రములయందు శుష్కత్వము, పోటు మున్నగుబాధ, లాఘవము మున్నగులక్షణములనుబట్టియే వానిక్షయము నూహింపవలెను. ఈవిషయమునే వాగ్భటాచార్యు లిట్లుపదేశించిరి—"మలానా మతిసూక్ష్మాణాం దుర్లక్ష్యం లక్షయేత్ స్వయం, స్వమలాయనసంశోషతోదశూన్యత్వ లాఘవైః"

మరియు నష్టాదశక్షయములలక్షణములును జతూకర్ణతంత్రమున సంగ్రహముగ నిట్లు చెప్పబడినవి:—"దోషాణాం, ధాతూనాం, ఓజోమూత్ర శకృదింద్రియమలాయనానాం, అష్టాదశక్షయాః, తే లక్ష్యాః స్వగుణక్రియానాశాత్" త్రిదోషములయొక్కయు, సప్తధాతువులయొక్కయు, ఓజస్సు మూత్రము పురీషము పంచేంద్రియములు అనువానియొక్కయు క్షయములు పదునెనిమిది యగును. అట్టిక్షీణములను దానిదానికి సంబంధించినగుణములును క్రియలును నశించినప్పుడు వానివానిక్షయముల గమనింపవలెనని యర్థము.

## ఓజోధాతుక్షయలక్షణములు.

మూ. బిభేతి దుర్బలోఽభీక్ష్ణం ధ్యాయతి వ్యథితేన్ద్రియః. ౭౨
దుశ్ఛాయో దుర్మనాః రూక్షః క్షామశ్చైవౌజసః క్షయే,

వ్యా. మనుజునియొక్క యోజోధాతువు క్షీణించినయెడ మనుజునకు చాల బలహీనము కల్గును. భయపడును. మనస్సు కలతనొంది దేనినైన చింతింపుచుండును. శరీర

కాంతి చెడును. మనస్సు చాల చెడిపోవును. శరీరము రూక్షమగును. కృశించును. కొంచెము ప్రయాసకల్గినను శరీరమునం దాయాస మెక్కుడగును. (పైలక్షణములు అర్ధాంజలిపరిమితమై యప్రధానమగు నోజస్సు స్వప్రమాణమునకన్న తక్కువయైనప్పుడు కల్గును.)

## ఓజస్స్వరూపము.

మూ. హృది తిష్ఠతి యచ్ఛుద్ధం రక్తమీషత్సపీతకమ్. ౭౩
ఓజశ్శరీరే సంఖ్యాతం తన్నాశాన్నా వినశ్యతి (నాశమృచ్ఛతి),
ప్రథమే జాయతే హ్యోజః శరీరేఽస్మిన్ శరీరిణామ్. ౭౪
(సర్పిర్వర్ణం మధురసం లాజగన్ధి ప్రజాయతే,
భ్రమరైః ఫలపుష్పేభ్యో యథా సంభ్రియతే మధు
తద్వదోజస్స్వకర్మభ్యో(శ్శరీరేభ్యో) గుణైస్సంభ్రియతే సదా)

వ్యా. కొంచెము పసుపురంగును, కొంచెము ఎరుపురంగును కలిసి శుక్లవర్ణమై హృదయస్థానమున జేరియుండు (ఎనిమిదిబిందువులపరిమాణముకల)పదార్థము ఓజస్సనబడును. అట్టి యోజస్సు స్వప్రమాణమునకన్న లేశమాత్రమైన నశించినచో మనుజుడు ఆక్షణముననే మృతినొందును. (ఇచ్చట 'ఈషత్' అనుపదమును ప్రత్యేకముగ నోజస్సునకన్వయించుటచేత కొంచెముగ పీతరక్తవర్ణములు కలిసి శుక్లవర్ణమై కొంచెముగ పరిమాణముకల్గి హృదయము నాశ్రయించియుండునది యోజస్సు అని యర్థముచేయుటచేత అష్టబింద్వాత్మకమైన యోజస్సని యర్థ మేర్పడును.)

మరియు మనుజులశరీరమున నేతివంటివర్ణంబును తీపియుఁ కల్గినయోజస్సు తొలుదొల్త కల్గును. అయ్యది పేలాలవంటిగంధము కల్గియుండును.

తుమ్మెదలు ఫలములనుండియుఁ పలువెరంగులైన పుష్పములనుండియుఁ తేనెను సంగ్రహించి యొక్కచోట చేర్చువిధముగ మనుజులశరీరమున నుండురసాదిధాతువుల నుండి వానిసారమును గుణములు సంగ్రహించి నానాట హృదయస్థానమున జేర్చుచుండును. అయ్యది ధాతుసారాత్మకమైన యోజస్సని చెప్పబడును. (ఇయ్యది యెనిమిది బిందువుల పరిమాణముకల్గి ప్రాణములకు ముఖ్యాధారమై హృదయస్థానమున జేరియుండును.) ఈవిషయమే తంత్రాంతరమున "ప్రాణాశ్రయస్యౌజసోఽష్టౌబిన్దవో హృదయాశ్రయాః" అని చెప్పబడినది.

ఇచ్చట నీవివరణము నెరుంగునది:—ఓజస్సు ప్రధానంబనియుం, అప్రధానంబనియుం రెండువిధములు. అందు సర్వధాతుసారభూతమై హృదయమున జేరి ప్రాణము

లకు ముఖ్యాధారమునై యెనిమిదిబిందువుల పరిమాణముకల్గినది ప్రధానమైన యోజస్సు. ఈయోజస్సునందు లేశమాత్రమైన నశించినయెడ క్షణకాలమైన మనుజునిశరీరమున ప్రాణములు నిలువనేరవు. కావుననే యియ్యది ప్రధానమైన ఓజస్సని చెప్పబడినది. ఈ యోజస్సులక్షణమే ప్రకృతగ్రంథమున "హృది తిష్ఠతి వినశ్యతి" అని చెప్పబడినది. ఈ వివరణముగనే "ప్రథమే జాయతే...ప్రజాయతే" అనుశ్లోకమును మూలమున జెప్పబడినది. గాని కొన్ని ప్రాచీనముద్రితప్రతులయందు ఈశ్లోకము కానరాదు. వ్యాఖ్యాకారుడును "ప్రథమే జాయతే ఇత్యాది పాఠస్తు నాతిప్రసిద్ధః" అని యుపేక్షనే సూచించెను.

మరియు "భ్రమరైః ఫల...యతే సదా" అనుశ్లోకముగూడ పైయర్థమునే స్ఫుటముగ వివరించుచున్నదిగాని, అయ్యది తంత్రాంతరమునుండి సంగ్రహింపబడినదిగాని యీ మూలగ్రంథమునందలియది యని తోచదు. సర్వధాతుసారాత్మకమైన యోజస్సు ప్రధానమైనది యనుటకు సుశ్రుతమునందలి "రసాదీనాం శుక్రాంతానాం తత్పరం తేజః, తత్ఖల్వోజః" అనువాక్యము ప్రమాణముగ నున్నది. ఇచ్చట 'తత్పరం ఓజః' అనువానికి ప్రధానమైన యోజస్సని యర్థము. ఇట్లు చెప్పుటచేత అప్రధానమైనయోజస్సు వేరొండున్నదని తెలుపబడినది. ఈవిషయమే అర్థేదశమహామూలీయ మనుముప్పదియవ యధ్యాయమున నిట్లు విస్తరముగ జెప్పబడినది:—"యేనౌజసా వర్తయన్తి ప్రీణితాస్సర్వజన్తవః, యదృతే సర్వభూతానాం జీవితం నావతిష్ఠతే. యత్సారమాదౌ గర్భస్య యత్తద్గర్భరసాద్రసః, సంవర్తమానం హృదయం సమావిశతి యత్పురా. యస్య నాశాత్తు నాశోఽస్తి ధారి తద్ధృదయాశ్రితం, యచ్ఛరీరరసస్నేహః ప్రాణా యత్ర ప్రతిష్ఠితాః" సూ. ౩౦. అ. ౮-౧౦ శ్లో.) పైగ్రంథముచేత ఓజస్సు ప్రాణాధారమై సర్వధాతుసారరూపమై హృదయము నాశ్రయించియుండునని యేర్పడును. మరియు హృదయస్వరూపమును వివరించునపుడు "తత్పరస్యౌజసః స్థానం తత్ర చైతన్యసఙ్గ్రహః, హృదయం" అనియు పైజెప్పిన ముప్పదియవయధ్యాయమున జెప్పబడినది. ఇచ్చట 'పరస్య ఓజసః స్థానం' అని చెప్పుటచేత పర-అపరభేదములచే రెండువిధములైన యోజస్సుకలదని తెలియుచున్నది. అట్టి హృదయాశ్రితమైన ప్రధానోజస్సున లేశమైన నశించిననాడు ప్రాణములు నిలువనోపవు.

రెండవది అప్రధానమైన యోజస్సు. ఇది యర్థాంజలిపరిమితమై హృదయము నాశ్రయించిన ధమనులతో జేరియుండును. దీని పరిమాణము శారీరస్థానమున నేడవ యధ్యాయమున నిట్లు చెప్పబడినది.—

"మస్తిష్కస్య అర్ధాఞ్జలిః, శుక్రస్య తావదేవ ప్రమాణం, తావదేవ శ్లేష్మణ శ్చౌజసః" ఈవాక్యముచే మనుజులకు వారివారియంజలితో నర్ధాంజలిప్రమాణము (చేరెడు) కల్గియుండునని తెలిసెడి. ప్రకృతమున "బిభేతి-ఓజసఃక్షయే" అని చెప్పబడిన యోజఃక్షయలక్షణములు అర్ధాంజలిపరిమితమై ధమనుల నాశ్రయించియుండు ఓజస్సు స్వప్రమాణమునకన్న తక్కువగ క్షీణించినప్పుడు గల్గునని యెరుంగునది. ఈవిషయమై విస్తరమంతయు నర్ధేదశమహామూలీయమున జెప్పబడును.

### క్షయసామాన్యకారణములు.

మూ. వ్యాయామోఽనశనం చిన్తా రూక్షోఽల్పప్రమితాశనమ్,
వాతాతపౌ భయం శోకః రూక్షపానం ప్రజాగరః. ౨౫
కఫశోణితశుక్రాణాం మలానాం చాతివర్తనమ్,
కాలో భూతోపఘాతశ్చ జ్ఞాతవ్యాః క్షయహేతవః. ౨౬

వ్యా. దేహపరిశ్రమముజేయుట, ఆహారములేక యుపవాసముండుట, చింతించుట, రూక్షమైన యాహారమును భుజించుట, స్వల్పముగనైనను ఒక్కటేరసమునైనను భుజించుట, గాలియందును ఎండయందును నివసించుట, భయపడుట, శోకము, రూక్షగుణముగల మద్యాదులను త్రాగుట,రాత్రులయందు నిదురమేల్కాంచియుండుట, కఫంబును రక్తంబును శుక్రంబును శరీరమునందలి మలంబులు అధికముగ శరీరమునుండి బైట వెడలుట, ఆదానరూపకాలము, వార్ధక్యరూపమైన వయస్సు,పిశాచాదులవలన బాధకల్గుట ఇవియన్నియు పైజెప్పిన క్షయములకు యథాసంభవముగ కారణములగును. (ఇత్తెరంగున 'క్షయాః కతి ?' అనుప్రశ్నమున కుత్తరముగ 'దశాష్టౌ చ క్షయాః' అని నిర్దేశింపబడిన పదునెనిమిది క్షయములును వివరింపబడియె.)

### ప్రమేహనిదానము, సంప్రాప్తి.

మూ. గురుస్నిగ్ధామ్లలవణం భజతామతిమాత్రశః,
నవమన్నం చ పానం చ నిద్రామాస్యాసుఖాని చ. ౨౭
త్యక్తవ్యాయామచిన్తానాం సంశోధనమకుర్వతామ్,
శ్లేష్మా పిత్తం చ మేదశ్చ మాంసం చాతిప్రవర్ధతే. ౨౮
తైరావృతగతిర్వాయుః ఓజ ఆదాయ గచ్ఛతి,
యదా వస్తిం తదా కృచ్ఛ్రో మధుమేహః ప్రవర్తతే. ౨౯
సమారుతస్య పిత్తస్య కఫస్య చ ముహుర్ముహుః,
దర్శయత్యాకృతిం గత్వా క్షయమాప్యాయతే పునః. ౩౦

వ్యా. "సప్తపిడకామధుమేహికాః" అని నిర్ధేశింపబడిన యేడువిధములైన ప్రమేహపిడకల వివరించుటకై వానికి హేతువులగు ప్రమేహముల నిదానసంప్రాప్తిస్వరూపములు చెప్పబడుచున్నవి. గురుపదార్థములనైనను, స్నిగ్ధపదార్థములనైనను, అమ్ల లవణరసములు కల పదార్థములనైనను విశేషముగ భుజించుట, క్రొత్తధాన్యముల యన్నమును అధికముగ తినుట, క్రొత్తమద్యమును త్రాగుట, అధికముగ నిద్రసేవించుట, అధికముగ కూర్చొని యుండుట, దేహపరిశ్రమమును చింతనమును (మానసికవ్యాపారమును) బొత్తుగ మానుట, వమనవిరేచనాది శోధనముల సేవించకుండుట, ఈకారణములచేత శరీరమునందలి శ్లేష్మంబును పిత్తంబును మేదోధాతువును మాంసంబును అధికముగ (స్వప్రమాణమునకన్న నధికముగ) వృద్ధినొంది వాతసంచారమార్గమును అడ్డగించును. దానంజేసి వాతము ప్రకోపించి శరీరమునందలి యోజస్సును కూడ దీసికొని వస్తి (మూత్రపుసంచి) యందు చేరినపుడు మిక్కిలి కష్టసాధ్యమైన మధుమేహము సంభవించును. అట్టి మధుమేహమున వాతపిత్త కఫములయొక్క లక్షణములు మాటిమాటికిని కనబడును. అట్టియెడ మూత్రము పలుమారు వెడలుచున్నను మాటిమాటికి అప్పుడప్పుడును వృద్ధియగుచుండును. అట్టిక్రూరమగు ప్రమేహము తనంతనే యొక సమయమున శాంతినొందియుండును.

## ప్రమేహపిటికానిదానము, సంప్రాప్తి.

మూ. ఉపేక్షయాస్య జాయన్తే పిడకాః సప్త దారుణాః,
మాంసలేష్వవకాశేషు మర్మస్వపి చ సన్ధిషు. ౮౧
శరావికా కచ్ఛపికా జాలినీ సర్షపీ తథా,
అలజీ వినతాఖ్యా చ విద్రధీ చేతి సప్తమీ. ౮౨

వ్యా. పైజెప్పిన ప్రమేహములయందు వానికిదగిన చికిత్సజేయక యుపేక్షించిన యెడ శరీరమునందలి మిక్కిలి బలిసియుండు ప్రదేశములయందును, మర్మస్థానముల యందును, కీళ్లయందును ఏడువిధములైన పిటికలు కల్గును. అయ్యవి శరావిక, కచ్ఛపిక, జాలిని, సర్షపిక, అలజి, వినత, విద్రధి అను నామములచే నేడువిధముల నుండును. ఇవి మిక్కిలి క్రూరములై యుండును. (ఇవి యేడును రాచపుండు అని లోకమున వ్యవహరింపబడును. (ఆంగలవైద్యులు కార్బంకల్ అనియుం చెప్పెదరు.)

## శరావికలక్షణము. (౧)

మూ. అన్తోన్నతా మధ్యనిమ్నా శ్యావా క్లేదరుజాన్వితా,
శరావికా స్యాత్పిడకా శరావాకృతిసంస్థితా. ౮3

వ్యా. అంచులయం దున్నతంబును నడుమ పల్లముగను శ్యామవర్ణంబును కల్గి చీము మున్నగుద్రవమును స్రవించుచు నొప్పి మున్నగుబాధకల్గి శరావము(మూకుడు)ను బోలియుండునది శరావిక యను పిడకయని యెరుంగునది. (ఇయ్యది మూకుడువలె నుండుటంజేసి శరావిక యని యన్వర్థముగ చెప్పబడును.)

కచ్ఛపికాలక్షణము. (౨)

మూ. అవగాఢార్తినిస్తోదా మహావాస్తుపరిగ్రహా,
శ్లక్ష్ణా కచ్ఛపపృష్ఠాభా పిడకా కచ్ఛపీ మతా　౮౪

వ్యా. మిక్కిలి లోతున నొప్పియు సూదుల బొడిచినవిధముగ పోటును కల్గి శరీరమున విశాలమై బలిసియుండు వీపు మున్నగు ప్రదేశమున తాబేటి వీపువలె నున్నసై యున్నతమైన యాకారముకల్గి జనించినది కచ్ఛపికయను పిడకయని యెరుంగునది. (ఇయ్యది తాబేటివలె నున్నతంబును నునుపు కల్గియు నుండుటంజేసి కచ్ఛపికయని యన్వర్థముగ చెప్పబడును.)

జాలినీలక్షణము. (3)

మూ. స్తబ్ధా సిరాజాలవతీ స్నిగ్ధస్రావా మహాశయా,
రుజానిస్తోదబహులా సూక్ష్మచ్ఛిద్రా చ జాలినీ.　౮౫

వ్యా. హెచ్చుకయుం తగ్గకయు స్తంభించి యనేకములగు సిరలతోఁగూడి విశాలమైన స్థలమున జనించి మిక్కిలి యధికమైన నొప్పియు మంటయుం కల్గి జల్లెడవలె మిక్కిలి సన్నని రంధ్రము లనేకములు కల్గియుండునది జాలినియను పిడక యనబడును. (జాలిని యన జల్లెడ. అట్టి యాకారము కల్గినది యగుటంజేసి జాలిని యని యన్వర్థముగ జెప్పబడును.)

సర్షపికాలక్షణము. (౪)

మూ. పిడకా నాతిమహతీ క్షిప్రపాకా మహారుజా,
సర్షపీ సర్షపాభాభిః పిడకాభిశ్చితా భవేత్.　౮౬

వ్యా. మిక్కిలి గొప్పదిగాక అతిశీఘ్రముగ పక్వమై మిక్కిలి బాధకల్గి ఆవాల వంటి సన్ననిబొబ్బలతోఁ గూడియుండునది సర్షపిక యనబడును. (ఇయ్యది యావాల వంటి బొబ్బలు గల్గియుండుటవలన సర్షపికయని యన్వర్థముగ జెప్పబడును.)

అలజీలక్షణము. (౫)

మూ. దహతి త్వచముత్థానే తృష్ణామోహజ్వరప్రదా,
విసర్పత్యనిశం దుఃఖాత్ దహత్యగ్నిరివాలజీ.　౮౭

వ్యా. అలజి యను పిడక పుట్టునప్పుడు చర్మమునందు మిక్కుటముగ నిప్పున గాల్చినవిధముగ మంట బుట్టును. దప్పియు, మూర్ఛయుం, జ్వరంబును ఉపద్రవములుగ నుండును. అయ్యది తన కిచ్చవచ్చినట్లు పలుపోకల వ్యాపించుచు నిప్పున కాల్చినవిధముగ మంటపుట్టించును. (అలజి యనునది రూఢిసంజ్ఞయని యెరుంగునది.)

వినతాలక్షణము. (౬)

మూ. అవగాఢరుజాక్లేదా పృష్ఠే వాప్యుదరేఽపి వా,
మహతీ వినతా నీలా పిడకా వినతా మతా. ౮౮

వ్యా. మిక్కిలి లోతున నొప్పియు చీము మొదలగు ద్రవంబును కల్గి వీపునందైనను పొట్టపైనైనను మిక్కిలి విశాలమై నల్లనిరంగుకల్గిన వ్రణము పుట్టును. ఇయ్యది వంగినయాకారముకల్గినది కావున వినత యని చెప్పబడును.

విద్రధి ద్వివిధభేదములు. (౭)

మూ. విద్రధిం ద్వివిధా మాహుః బాహ్యమాభ్యన్తరీం తథా,
బాహ్యాత్వక్ స్నాయుమాంసోత్థా కణ్డ(కడా)రాభా మహారుజా.

వ్యా. బాహ్యమనియుం అభ్యంతరమనియు విద్రధి రెండువిధములు. అందు బాహ్యవిద్రధి త్వక్కును స్నాయువు (సన్ననినరము)లను మాంసము నాశ్రయించి కండరము (స్థూలమైన స్నాయువు) రంగుకల్గి జనించును. విద్రధి సామాన్యముగ మిక్కిలి తీవ్రమైన బాధ కల్గియుండును. (ఇచ్చట 'కడారాభా' అను పాఠమున కపిలవర్ణము కల్గినది యని యర్థము. విద్రధి ద్వివిధమైనను జాతి యొకటి యగుటంజేసి యేకరూపముగ పరిగణనము చేసి "విద్రధీ చేతి సప్తమీ" యని యేడవదిగ పరిగణనము చేయబడినది.)

అన్తర్విద్రధినిదానము, సంప్రాప్తి.

మూ. శీతకాన్న విదాహ్యుష్ణరూక్షశుష్కాతిభోజనాత్,
విరుద్ధాజీర్ణసంక్లిష్టవిషమాసాత్మ్యభోజనాత్. ౯౦
వ్యాపన్నబహుమద్యత్వాత్ వేగసన్ధారణాత్ శ్రమాత్,
జిహ్మవ్యాయామశయనాత్ అతిభారాధ్వమైథునాత్. ౯౧
అన్తశ్శరీరే మాంసాసృగావిశన్తి యదా మలాః,
తదా సంజాయతే గ్రన్థిః గమ్భీరస్థస్సుదారుణః. ౯౨
హృదయే క్లోమ్ని యకృతి ప్లీహ్ని కుక్షౌ చ వృక్కయోః,
నాభ్యాం వంక్షణయోర్వాపి వస్తౌ వా తీవ్రవేదనః. ౯౩

వ్యా. చల్లని యన్నమును మంటబుట్టించు నాహారమును మిక్కిలి యుష్ణమైన వీర్యము కల యాహారమును జిడ్డులేక రూక్షమైన యాహారమును ఎండిన పదార్థములను భుజించినను, పరిమితికన్న నధికముగ భుజించినను, పరస్పర విరుద్ధములగు క్షీరమత్స్యాదులను అజీర్ణకరపదార్థములను, దోషముల వృద్ధినొందించు పదార్థములను భుజించినను అకాలమున భుజించినను అసాత్మ్యముల భుజించినను, చెడిన మద్యమును త్రాగినను, మితిమీరి మద్యపానము జేసినను, మలమూత్రాది వేగముల నిరోధించినను, శరీరమునకు మిక్కిలి శ్రమపుట్టించు పనుల జేసినను, వంకరటింకరగ దేహపరిశ్రమము జేసినను, వంకరగ పరుండినను, అధికముగ భారమును మోసినను, అధికముగ సంభోగము జేసినను, లేక త్రోవ నడచినను, ఈకారణములచేత వాతాదిదోషములు ప్రకోపించి శరీరము నందలి లోభాగముననుండు రక్తమాంసముల బ్రవేశించినపుడు శరీరమున మిక్కిలి లోతున క్రూరమైన గ్రంథి కల్గును. అయ్యది హృదయము, క్లోమము, యకృత్తు (నల్లదబ్బ) ప్లీహ, కుక్షి, వృక్కములు, బొడ్డు, గెజ్జలు, వస్తి (పొత్తికడుపు) ఈస్థలములలో నెచ్చటనైనను మిక్కిలి తీవ్రమైన వేదనతో కూడి పుట్టును.

### విద్రధి యనుటకు అన్వర్థసంజ్ఞ.

మూ. దుష్టరక్తాతిమాత్రత్వాత్ సవై శీఘ్రం విదహ్యతే,
తతశ్శీఘ్రవిదాహిత్వాత్ విద్రధీత్యభిధీయతే. ౯౮

వ్యా. పైజెప్పినరీతిగ గల్గిన గ్రంథి రక్తమాంసములు మిక్కిలి చెడుటవలన సంభవించును; కావున నయ్యది యతిశీఘ్రముగ పక్వమగును. అయ్యది శీఘ్రముగ పక్వమగుస్వభావము కల్గినది యగుటంజేసి విద్రధి యని యన్వర్థముగ జెప్పబడును.

### వాత-పిత్త-కఫవిద్రధుల ప్రత్యేకలక్షణములు.

మూ. వ్యథచ్ఛేదభ్రమానాహశబ్దస్ఫురణసర్పణైః,
వాతికీం పైత్తికీం తృష్ణాదాహమోహమదజ్వరైః. ౯౯
జృమ్భోత్క్లేశారుచిస్తమ్భశీతకైః శ్లైష్మికీం విదుః,

వ్యా. పైజెప్పిన గ్రంథియందు సూదుల గ్రుచ్చినవిధముగను శస్త్రముచే చ్ఛేదించిన విధముగను బాధకల్గి మూర్ఛగ్రమ్ముచు గ్రంథి యుబ్బి శబ్దముతో గూడి అదరుచు వ్యాపించును. ఇట్టిలక్షణములు కల్గినది వాతముచే గల్గినవిద్రధి. పిత్తమున కల్గిన విద్రధియందు దప్పిపుట్టును. మూర్ఛగ్రమ్మును. తిక్కయెత్తినవిధముగ నుండును. జ్వరమువచ్చును. కఫమున జనించిన విద్రధియందు ఒడలి విరుపు లధికముగ కల్గును. ఓకరింతలు కల్గును. అరుచి పుట్టును. శరీరము స్తంభించును. చలి పుట్టును. (ఈలక్షణముల బట్టి వాత-పిత్త-కఫజవిద్రధుల నెరుంగనగునని భావము.)